# వచన రచనా పరిచయం

ఖండాలు : 5 – 6

BRAOU

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
CM0307

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాదు.

1995-96

# ఐచ్ఛికాంశాలు : తెలుగు (రెండవ పాఠ్యాంశం)

CM-0307
31-3-97

రచయితల బృందం

కేతు విశ్వనాథరెడ్డి (సంపాదకుడు)
కాత్యాయనీ విద్మహే
పోరంకి దక్షిణామూర్తి
కె.కె. రంగనాథాచార్యులు
పి. సంజీవమ్మ

సహాయ సంపాదకులు

డా. రావికంటి వసునందన్
డా. కె. యస్. రమణ

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. CM-0307
Date 31-3-97
Call No. 894.827

ముఖచిత్రం
చంద్ర

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాదు
ప్రథమ ప్రచురణ 1984
కాపీరైటు 1984 డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగం అయినా ఉపయోగించుకోదలచుకుంటె, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి.
ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.
పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.
ఇతర వివరాలకు : డైరెక్టరు, డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జూబ్లిహిల్స్, హైదరాబాదు-33

ముద్రణ : పద్మశ్రీ గ్రాఫిక్స్, 1-1-770/5, గాంధీనగర్, హైదరాబాదు -500 380. ఫోన్ : 7612283

| | | | |
|---|---|---|---|
| ఖండం | 5 | నాటకం | ● |
| ఖండం | 6 | నవల | ● |

BRAOU

**ఖండం 5 నాటకం** 1 – 63

భాగం 1 కన్యాశుల్కం (5వ అంకం, 4, 5 స్థలాలు) 1
భాగం 2 వరవిక్రయం (నవమాంకం) 30
భాగం 3 ఎవరు దొంగ (ఏకాంకిక) 45

**ఖండం 6 నవల – స్వయంవరణం** 64 – 216

భాగం 1 'స్వయంవరణం' నవలా రచయిత – సామాజిక నేపథ్యం 64
భాగం 2 స్వయంవరణం – నవలాశిల్పం 70

BRAOU

# ఖండం 5 నాటకం

"తెలుగు మౌలిక అంశాలు"లో ఆధునిక తెలుగు సాహిత్య పరిచయం చేశాము. 18వ భాగం నాటక పరిచయం, ఆ భాగంలో నాటకం, నాటిక స్వరూప స్వభావాలు, నాటకాల్లో, నాటికల్లో భేదాలు అనే రెండు పాఠాలు మీరు చదివారు. స్థూలంగానైనా నాటకం, నాటిక లక్షణాలనూ, వాటి రకాలనూ మీరు తెలుసుకున్నారు.

నాటకంతో, నాటికతో మీకున్న పరిచయాన్ని పురస్కరించుకొని తెలుగు ఐచ్ఛికాంశాలు పాఠ్య ప్రణాళికలో రెండు ప్రఖ్యాత తెలుగు నాటకాలలోని భాగాలనూ, ఒక ఏకాంకికనూ మీకు పాఠ్యాలుగా సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్ణయించింది.

"ఆధునిక కావ్యాల్లో అనన్యం, అనితర సాధ్యం అని కచ్చితంగా చెప్పదగిన వాటిలో కన్యాశుల్కమే ప్రపథమం. జీవ చైతన్యం తొణికిసలాడే ఈ నాటకం తెలుగు సాహిత్యంలో ఏకమేవా అద్వితీయం అని చాటకుండా చాటుతోంది" అని గురజాడ కన్యాశుల్క నాటకాన్ని గురించి ఆరుద్ర అంటారు. 1897లోనే ఒక సజీవమైన సామాజిక సమస్యమీద వాడుకభాషలో వచ్చిన ఆ మహానాటకంలోని ఐదవ అంకంలోని 4, 5 స్థలాలను మీరు ఈ భాగంలో పాఠ్యంగా చదువుతారు. కన్యాశుల్క స్థానంలో వచ్చిన వరశుల్కంపై వెలువడిన నాటకం వరవిక్రయం (1922). ఆ నాటకంలో 9వ అంకం మీరు చదువుతారు. రెండు నాటకాల్లో చాలా తక్కువ భాగాలనే పాఠ్యాలుగా పెట్టినా, వాటిని సంపాదించి సంపూర్ణంగా చదివి నాటక సాహిత్యం మీద ఒక అభిరుచినీ, ఒక అవగాహననూ ఏర్పరచుకోవాలని విశ్వవిద్యాలయం ఆశిస్తున్నది. ఈ పాఠ్యాలను పరిచయాలను, వ్యాఖ్యానాలను పాఠ్య రచయితలు సమకూర్చినపుడు పాఠ్యాలమీద ఒక అవగాహనను ఏర్పరచడానికి ప్రయత్నించారు.

ఈ ఖండంలో ఆత్రేయ ఏకాంకిక "ఎవరు దొంగ" మరొక భాగం, ఈ ఖండంలోని మూడు పాఠ్యాలనూ, వాటి మీద సమకూర్చిన పాఠాలనూ తులనాత్మకంగా పరిశీలించండి.

ప్రాచీన నాటక నిర్మాణానికీ, ఆధునిక నాటక నిర్మాణానికీ తేడా ఉంది. ఈ తేడా ఇతివృత్తంలో, పాత్ర చిత్రణలో, సంభాషణల్లో, అంకవిభజనలో, దృశ్య విభజనలో, నాటక రచనా సంప్రదాయాలలో కన్పిస్తుంది. నాటక రంగస్థలంలో వచ్చిన మార్పులు కూడా ఈ తేడాలకు ఒక కారణం. చదవదగిన పుస్తకాలు పట్టికలోని పుస్తకాలు పరిశీలనగా చదవడం ద్వారా భారతీయ నాటక చరిత్రా, ఆ చరిత్రలో భాగమైన ఆధునిక నాటక స్వభావమూ మీకు అవగతమౌతాయి.

BRAOU

## భాగం 1 కన్యాశుల్కం (5వ అంకం, 4, 5 స్థలాలు)

### విషయక్రమం

1.0 ఉద్దేశం
1.1 ప్రవేశిక
1.2 పాఠ్యం
**అభ్యాసం – 1**
1.3 పాఠ్య వివరణ
 1.3.1 అర్థవివరణ
 1.3.2 కన్యాశుల్కనాటక కథ
 1.3.3 పాఠ్య విషయం
 1.3.4 వ్యాఖ్యానం
**అభ్యాసం – 2**
**అభ్యాసం – 3**
1.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
1.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
1.7 ఆకళింపు ప్రశ్నలు
 అభ్యాసాలకు జవాబులు

## 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు.

1. గురజాడ కన్యాశుల్కంలో ప్రధాన సాంఘిక సమస్యలతోబాటు అధోలోకజీవుల చిత్తవృత్తం చిత్రీకరణ
2. గురజాడ నాటక శిల్పం, సాహిత్య ప్రయోజనం, మాండలిక భాషాశైలుల ప్రయోగం.

## 1.1 ప్రవేశిక

కన్యాశుల్కం నాటకాన్ని గురజాడ అప్పారావు (1862 - 1975) కిందటి శతాబ్దంలో రాశారు. నాటకం "1892 లోనే, జూలై నెలలో మొదలుపెట్టి పూర్తి చేశారేమో" నని ఆరుద్ర భావించారు. (వివరాలకు చూడండి. మొట్టమొదటి కన్యాశుల్కము. 1897 సం॥ నాటి తొలి ముద్రణ ప్రతిని సేకరించి విపులమైన వ్యాఖ్యాన వివరణంతో ప్రచురించినవారు బం.గో.రె. మూర్తి 1969, నెల్లూరు). అంటే ఈ నాటకం 95 ఏళ్ల కిందటిది అన్నమాట. మీరు పాఠ్యంగా చదువుతున్నది తొలిముద్రణలోని భాగం కాదు. ఈనాడు లభించే మలి ముద్రణలోని భాగం, అంటే 1909 నాటి ముద్రణలోని భాగమన్నమాట. ఈ మలిముద్రణ అంటే రెండవ పరిష్కృత ముద్రణ అన్నమాట. అదే తర్వాత అనేకసార్లు ముద్రించబడింది.

తెలుగు పాఠకులకు గురజాడ అంటూనే కన్యాశుల్క నాటకం, కన్యాశుల్కం అంటూనే గురజాడ గుర్తు వస్తారు. ఈ నాటకం అంత ప్రసిద్ధమై, గురజాడకు గొప్ప కీర్తి తెచ్చిపెట్టింది. తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగకర్తలు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుగార్లు. వీరికి తోడు వ్యావహారిక భాషా ఉద్యమం నడిపిన గిడుగు రామమూర్తిగారిని ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి.

తెలుగు సాహిత్యంలో గొప్ప సాంఘిక నాటకం కన్యాశుల్కం. తెలుగులోనే కాదు ప్రపంచభాషల్లోనే ప్రసిద్ధమైన ఆధునిక నాటకాల వరుసలో కన్యాశుల్కం చేరుతుంది. ఈ నాటకం 19వ శతాబ్దినాటికే తెలుగులో వెలువడిన మొట్టమొదటి సాంఘిక నాటకం - స్వతంత్ర నాటకం - అని మీకు తెలుసు. సమకాలీన సమాజ జీవితాన్ని విమర్శనాత్మకంగా చిత్రించిన మొదటి నాటకం, ఆ నాటికే వాడుకభాషలో వెలువడిన మొదటి గొప్ప ఆధునిక నాటకం కన్యాశుల్కం. ఇప్పటికీ తెలుగులో ఇలాంటి నాటకం మరొకటిరాలేదనే విమర్శకుల అభిప్రాయం.

తెలుగు సాహిత్యంలో ఎన్నో ప్రత్యేకతల్ని సంతరించుకున్న ఈ నాటక రచయిత గురజాడ అప్పారావు ఆధునిక భావాలుగలవాడు, ప్రగతిశీలి. ఆంగ్లభాషను అభ్యసించడంవల్ల, ఆ భాషలోని ఆధునిక సాహిత్యమూ, షేక్స్‌పియర్‌లాంటి మహానాటకకర్తల ప్రపంచ ప్రసిద్ధ నాటకాలనూ, నాటక సాహిత్య విమర్శనూ లోతుగా అధ్యయనం చేసి ఉండటంవల్ల ఆ సాహిత్య జ్ఞానమూ, ఆ సాహిత్యంలోని ఆధునిక భావాలూ గురజాడకు అబ్బినాయి. సమాజ జీవితాన్ని దాని వాస్తవికతను విమర్శనాత్మకంగా దర్శించి గ్రహించగలిగే శక్తీ, జ్ఞానమూ ఆయనకు అబ్బినాయి. అందువల్ల గురజాడ తన సమకాలీనులు ఎందరికంటేనో చాల ఎత్తు ఎదిగిన రచయిత అయ్యాడు. సమకాలీన సమాజంపట్ల, జీవితంపట్ల సానుభూతి కలిగి, దాని లోటుపాట్లనూ, బలహీనతలనూ, దుర్లక్షణాలనూ పరిహాసపూర్వకంగా విమర్శిస్తూ సంస్కరించాలని ప్రయత్నించిన మానవతావాది, సంస్కర్త అయ్యాడు.

"మానవ సమాజంపట్ల నాకొక మహత్తరమైన బాధ్యత వుంది" అని గుర్తించిన కళాకారుడు గురజాడ. ఇతని ఈ సామాజిక చైతన్యం కన్యాశుల్క నాటకాన్ని ఒక గొప్ప ప్రయోజనవంతమైన నాటకంగా దిద్ది తీర్చడానికి ప్రేరణ ఇచ్చింది. రాచరిక వ్యవస్థ క్షీణిస్తూన్నదశలో సంఘం సర్వవిధాలా దుస్థితిపాలైన కాలంలో - ఆ వాస్తవికతకు అద్దంపడుతూ సాగిన రచన కన్యాశుల్కం. ఆ సాంఘిక జీవిత విమర్శ నాటకంలో ఒక ప్రధానమైన అంశం. ఈ విమర్శ ఆ జీవితంపట్ల సానుభూతి కలిగి పరిహాసంచేస్తూ, పాఠకుల్ని, ప్రేక్షకుల్ని నవ్విస్తూనే ఆలోచింపచేసేది.

ఈ నాటకంలో ప్రస్తావనకురాని ఆనాటి సాంఘిక దురాచారాలు, రుగ్మతలు లేవు. ఆనాడు కుల మత భావాల వెర్రి ముదిరింది. ఛాందసం మితిమీరింది. బ్రాహ్మణ్యం దిగజారింది. బాల్య వివాహాలు ఎక్కువ. బాల



BRAOU

వితంతువులు చెప్పరాని అగచాట్లు పడేవారు; ముక్కుపచ్చలారని ఆడపిల్లల్ని తలిదండ్రులు కాసులకోసం ఆశ పడి కాటికి కాళ్ళు చాచుకున్న ముసలివాళ్ళకు అమ్మకొనేవాళ్ళు. వాళ్ళు త్వరలోనే విధవలై పుట్టింటికి మరింత ఆస్తికూడా తెచ్చి, బండెడు బండచాకిరీచేస్తూ బతుకంతా బండలు చేసుకోవలసి వచ్చేది. పొరపాటున కాలుజారితే (జార్చడానికి బోలెడు మంది తుంటరులు సిద్ధంగా ఉండేవారు) మరీ కనాకష్టంగా బతకవలసి వచ్చేది. ఈ పరిస్థితిని విధి, కర్మ, ప్రారబ్ధం అంటూ తండ్రులు తమ స్వార్థాన్నీ, ధనాశనూ కప్పిపుచ్చుకుంటూ సమర్థించుకొనేవారు. మరోవైపు తామూ, తమ కొడుకులూ పెళ్ళాలతో, కులుకుతూ, వేశ్యలతో సరసాలు సాగిస్తూ తమ ఆడపిల్లలకి మాత్రం గుండు గొరిగించి ఒంటిపూట కూడుబెట్టి, వెట్టిచాకిరీ చేయించుకునేవాళ్ళు. ఇదీ ఆనాటి 'బ్రాహ్మణాచారం'. వీటికితోడు వేశ్యా సమస్య ఒకటి ప్రబలంగా ఉండేది ఆనాడు. ఇంట్లో 'పతివ్రతలైన భార్యల్ని తయారుచేసి, బయట వేశ్యాకులాన్ని ఒకదాన్ని పెంచి పోషించారు. ఈ వేశ్యలే సమాజాన్నంతటినీ, పాడుచేస్తున్నారనీ వాళ్ళే ఏడ్చారు. బాల్య వివాహం, కన్యాశుల్కం, బాల వైధవ్యం, నిర్బంధ వైధవ్యం, వేశ్యా సమస్య, వితంతు వివాహ సమస్యవంటి దురాచారాలన్నీ స్త్రీల బ్రతుకుల్నే కాల్చుకుతిన్నట్టివే. సంఘంలో ఆనాడు రాజ్యంచేసిన అవిద్య, అజ్ఞానం, అంధవిశ్వాసం, మోసం, దంభం, భేషజం, లంచగొండితనం అమాయకులైన ప్రజలను బాధించాయి.

ఇన్ని విధాలా పతనదశకు చేరుకున్న ఆ భూస్వామ్య క్షీణవ్యవస్థలో సంఘసంస్కరణ దృష్టి కృషి ప్రారంభమైంది. అది ఒక సాంఘిక ఉద్యమరూపం ధరించక తప్పలేదు. ఎందరో మార్గదర్శకుల తరువాత, కందుకూరి ఆ ఉద్యమ సంచాలకుడయ్యాడు. స్వయంగ ఎంతో పట్టుదలతో, నిజాయితీ కృషి సల్పిన ధీరుడు ఆయన. గురజాడలాంటి సృజనాత్మక రచయిత రచనలు వీరి కృషికి తోడైనాయి. కన్యాశుల్క నాటకంలో కన్యాశుల్క దురాచారాన్ని ఎత్తిచూపి దానివల్ల స్త్రీల బ్రతుకులు ఎలా నాశనమవుతున్నాయో స్పష్టం చేయడంతోపాటు, సందర్భానుగుణంగా మరెన్నో దురాచారాలనూ, మూఢనమ్మకాలనూ గురజాడ బట్ట బయలు చేశాడు.

గురజాడ అంటూనే కన్యాశుల్క మహానాటకకర్త అని మాత్రమే కాదు తెలుగు పాఠకులకు గుర్తుండేది. ఆ నాటకంలో వాడుకభాషను ప్రయోగించి తెలుగు సాహిత్యంలోనే అలాంటి ప్రయోగాన్ని మొట్టమొదటిగా చేపట్టి ఎంతో విజయవంతంగా నిర్వహించి, ఆ భాష సాహిత్యరచనకు ఎంత అవసరమో ఎంత ఉపయోగకరమో నిరూపించినవాడు అనే విషయమూ గుర్తుంటుంది. "జీవమూ జవమూ కలిగిన వాడుకభాష ఒక్కటే ఆధునిక నాటక భాషగ యోగ్యత కలిగినదని" అప్పారావు నమ్మకం. అందువల్ల చాల సహజంగానే ఆయన ఆ భాషను తన సాహిత్య భాషగా స్వంతం చేసుకున్నాడు. ఆ సాహిత్య భాషకు ప్రాణం పోశాడు. ఆ జీవద్భాష ద్వారా తన సాహిత్యానికీ మరింత జీవకళను నింపుకున్నాడు. అయితే ఆయన తరువాత చాల కాలం వరకు చాల మంది రచయితలు కావ్యభాషలోనే రచనలు సాగించారు. ఇది వాళ్ళ వెనుకబాటుతనాన్నీ, గురజాడ ముందు చూపునూ ఆధునికతనూ తెలుపుతుంది. ఆనాడు సాహిత్య భాషా విషయంగా ఛాందస పండితులకూ, ముందు చూపు కలిగిన కొద్ది గురజాడ, గిడుగులాంటి వారికీ యుద్ధమే జరిగింది. గిడుగు వాడుకభాషా ఉద్యమాన్ని చాల కాలం కొనసాగించి వాళ్ళతో పోరాడాడు. ఆనాటికి పెద్ద ఫలితం లేకపోయినా ఈనాడు వాడుకభాష మాత్రమే సాహిత్యభాష అయివుండటం మనం గమనించాలి.

కన్యాశుల్కంలోని వాడుకభాష విశాఖ విజయనగర ప్రాంతాలయాసతో కూడిన మాండలిక భాష. వివిధ వ్యక్తుల యాసలో కూడా తేడాలు గమనించిన అప్పారావు ఆయా పాత్రల సాంఘిక స్థితిగతుల్నిబట్టి అంత సూక్ష్మంగానూ యాస తేడాల్ని జాగ్రత్తగా వేరుచేసి ప్రయోగించారు. వేదం వెంకటరాయశాస్త్రిగారు తమ 'ప్రతాపరుద్రీయ' చారిత్రక నాటకంలో పాత్రోచితభాష పేరుతో 'నీచ' పాత్రలకు వాడుకభాష ప్రయోగిస్తూ దాన్ని గ్రామ్యభాష అన్నారు. అయితే దీనికి గురజాడ పద్ధతికీ సంబంధమే లేదు. గురజాడ వాడుకభాషను సాహిత్యభాషగా గుర్తించి ప్రయోగించి గౌరవించినవాడు.

ఆధునిక తెలుగు సాహిత్యానికి అడుగుజాడ వెలుగజాడ కూడ గురజాడదే అయింది. అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఆయనే జాడ. ఆయన కథలూ, గేయాలూ, నాటకాలూ వ్యాసాలూ అన్నీ సమకాలీన సంఘ సంస్కరణ భావాల్ని దాటుకొని అభ్యుదయపరమైన ఆలోచనల్ని చేసేంతవరకూ ఎదిగిపోయినాయి. అందుకే అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి ఆయనే జాడ ఏర్పరచాడనేది. తన కాలంనాటికి భావాలు, భాష, వస్తువు మొదలైన సర్వ విషయాల్లో ముందుచూపు కలిగినవాడు ఆయన. తెలుగు సాహిత్యంలో ఆధునిక ... 3

BRAOU

యుగోదయానికి అన్ని అందాలా వైతాళికుడు ఆయన. "తెలుగు జాతి కొక కొత్త చూపూ తెలుగు సాహిత్యాని కొక కొత్తరూపూ యిచ్చిన మహనీయుడు గురజాడ" అన్నారు ప్రఖ్యాత విమర్శకులు రాచమల్లు రామచంద్రా రెడ్డిగారు. ['సారస్వత వివేచన' పుట 149]

'కొండు భట్టీయం' 'బిల్హణీయం' ఈయన మరిరెండు నాటకాలు. ఇవి అసంపూర్ణంగా నిలిచిపోయాయి. 'నీలగిరి పాటలు' 'ముత్యాల సరాలు' (కవితా సంకలనాలు), ఆణిముత్యాలు (కథాసంకలనం). వాడుకభాషను సమర్థిస్తూ ఆయన సమర్పించిన 'డిసెంట్ పత్రం' చాల విలువైంది. కొన్ని వ్యాసాలు రాశాడు. దేశభక్తి గేయం "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్..." సుప్రసిద్ధం.

కన్యాశుల్క నాటకం కన్నడ తమిళ భాషల్లోని అనువాదం అయింది. ఇంగ్లీషు, రష్యన్ భాషల్లోకి కూడా అనువాదం అయింది.

ఆనాటి సమాజంలో కన్యాశుల్క దురాచారం చాల ఘోరమైన పరిస్థితికి చేరింది. (ఈనాటి వరశుల్కం వరకట్నంలాగ), ఆడపిల్లల బతుకుల్లో నిప్పులు పోసేదిగా తయారయింది. విశేషమేమంటే ఆనాటి కన్యా శుల్కంగాని, ఈనాటి వరశుల్కంగాని ఆడపిల్లల బతుకుల్నే కాల్చుకు తినేవిగా పరిణమించటం, అప్పారావు ఈ నాటకాన్ని రాయడానికి ముందు విజయనగరం మహారాజు ఆనందగజపతి కొన్ని సంవత్సరాలుగా జరిగిన కన్యాశుల్క వివాహాల లెక్కలను, ఆ భోగట్టాను సేకరించిపెట్టారు. ఆ సమాచారం చూస్తే ఎవరికైనా మనసు కుంగిపోయేదే. సంవత్సరానికి సరాసరి మూడు నాలుగువందల సంఖ్యలో ఈ వివాహాలు జరిగేవనీ, అయిదారు సంవత్సరాలలోపు వయసు ముక్కుపచ్చలారని బాలికలకు జరిగినవేననీ తేలింది. ఆనాటి బ్రాహ్మణ వివాహాల్లో తల్లిదండ్రులు ఈ విధంగ ఆడపిల్లల్ని అమ్ముకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఈ దురాచారాన్ని నిర్మూలించే ప్రేరణతో 1892లోనే అప్పారావు ఈ నాటక రచనకు పూనుకున్నారు. ఆ సంవత్సరంలోనే నాటకం రంగస్థలం మీద ప్రదర్శింపబడి చాల ప్రశంసల్ని అందుకుంది కూడ. 1897లో ముద్రణ పొందింది. 1909లో మరల అప్పారావు నాటకాన్ని మరికొంత పెంచి పాత్రచిత్రణలో కొన్ని మార్పులు చేసి మెరుగులుదిద్ది తిరగ రాసి ముద్రించాడు. రెండవ కూర్పు నాటకమే ఈనాడు ప్రసిద్ధంగ వున్నది, మనం చదువుతున్నది.

ఈ నాటకంలోని గిరీశం, మధురవాణి పాత్రలు తెలుగు సాహిత్య ప్రపంచంలో చిరస్థాయిగ నిలిచిపోయిన పాత్రలు. ఇవి తెలుగు పాఠకులకు మరుపురాని పాత్రలు. గిరీశంపాత్ర 'గిరీశం లెక్చర్లు' అన్న తన ప్రత్యేకతరహా లెక్చర్ల ద్వారా పాఠక లోకం మధ్య మరీ సజీవంగా ఉండిపోయింది. ప్రపంచంలో ఎక్కడలేని విషయాలూ తనకే తెలుసునన్న సర్వజ్ఞుడిలా ఫోజుకొడుతూ లెక్చర్లు దంచేవాన్ని చూచి "వీడు గిరీశం" రా అని ఎగతాళి చేయడం కద్దు. "గిరీశం లెక్చర్లు" అన్న పేరు మీద కొందరు రచయితలు పలు విషయాల మీద హాస్యభరితంగా అప్పారావు శైలిని అనుకరిస్తూ రాశారు కూడ. "డామిట్! కథ అడ్డం తిరిగింది" అన్న గిరీశం ఊత వాక్యం కూడా చాలమంది చదువరుల నాలుకల మీద ఆడుతూ ఉంటుంది. అయితే గిరీశం తెలివైన తుంటరి. అందువల్ల మరీ ప్రమాదకర వ్యక్తి. ఆనాటి సంఘంలోని చీడపురుగు సంఘసంస్కరణం పేరుతో కన్యాశుల్కాన్ని నిరసించేవాడిలాగ, వితంతు వివాహం చేసుకునేవాడిలాగ ఫోజుపెట్టి అమాయకులైన వితంతు బాలికల్ని మోసగించి ఉపయోగించుకోటానికి సిద్ధపడిన బాపతు. మధురవాణి వేశ్య అయినప్పటికీ ఒక నీతి కలిగిన వేశ్య. "వేశ్యలకూ నీతి ఉంటుంది" అనే కోవలోనిది. అందంతోపాటు తెలివి, మంచితనం, సంస్కారం, పరోపకార బుద్ధి కలిగిన వేశ్య. ఎందరినో మంచిదారిలో పెట్టటానికి ప్రయత్నించిన వ్యక్తి. అయితే ఆఖరికి వృత్తి వదిలివేసి భగవద్గీత చేతబట్టింది.

విధినీ, ప్రారబ్ధాన్నీ, అడ్డంపెట్టుకొని ఆడపిల్లల్ని ముసలివాళ్ళకు అమ్ముకొని సొమ్ము చేసుకోవటాన్ని సమర్థించుకోజూచే స్వార్థపరులకు నమూనా అగ్నిహోత్రావధాన్లు. కాటికి కాళ్ళు చాచుకొని కూడా మరొక పెళ్ళి చేసుకుంటే సంపద సమకూడుతుందనే జాతకాల మూఢనమ్మకాలతో దురాశతో పసిపిల్లల మెళ్ళో ఉరి తాళ్ళు బిగింపచూచే లుబ్ధులకు ప్రతినిధి లుబ్ధావధాన్లు. ఊరి మందిమీదపడి జగడాలుపెట్టి కోర్టులకు తిప్పే వృత్తి చేపట్టి దొరికిన విధవపిల్లల్ని చాటుమాటుగ ఉపయోగించుకుంటూ పబ్లిక్‌గా వేశ్యనుంచుకున్న 'దర్జా' ప్రదర్శిస్తూ 'పెద్దమనిషి' చలామణి కాజూచే పరోభాగ్యోపజీవులకు ప్రతినిధి రామప్పంతులు. సౌజన్యం మూర్తీభవించి నిజమైన పరోపకారిగ, సంస్కర్తగ దర్శనమిచ్చే వ్యక్తి సౌజన్యారావు. దగాపడిన ఆడపిల్లలు కన్యాశుల్క దురాచారానికి బలైన బుచ్చమ్మ, మీనాక్షిలాంటివాళ్ళు. వీళ్ళంతా నాటకంలో కేవలం పాత్రలు కాదు, సజీవులైన మానవులు, ఆనాడు నిత్యం సంఘంలో దర్శనమిస్తూండిన మానవులే.



BRAOU

## అభ్యాసం – 1

కింది ఖాళీలో జవాబులు రాయండి. భాగంచివర ఇచ్చిన జవాబుతో సరిపోల్చుకోండి.

కన్యాశుల్కం నాటకం ప్రత్యేకతలను మూడింటిని పేర్కొనండి? (50 పదాలలో రాయండి)

____________________________________________________

____________________________________________________

____________________________________________________

____________________________________________________

____________________________________________________

## 1.2 పాఠ్యం కన్యాశుల్కం (5వ అంకం)

ఈ పాఠ్యంలో కన్యాశుల్కం నాటకంలోని 5వ అంకంలో 4, 5 స్థలాలు మాత్రమే ఉన్నాయి. మొదట పాఠ్యం చదవండి.

౪-వ స్థలము : రామచంద్రాపురం అగ్రహారంలో సారాయి దుకాణం వెనుకతోట.

[ఆ తోటలో కాళీమందిరం యెదటి మండపం, మంటపంలో కాళీ విగ్రహానికి యెదురుగుండా ఒక పెద్ద పీటమీద మూడుసీసాలలో సారాయి. చుట్టూ గళాసులు, తులసిదండా పువ్వులదండలు, మంటపంలో వకవైపు పులి చర్మంమీద యోగదండమును ఆనుకొని సమాధిలో వున్న ఒక బైరాగి. యోగిని వొకతె సారాయి అందరికీ అందిచ్చును. గ్రామ మునసబు సోమినాయుడు చిలుం పీల్చుచుండును. సాతాని మనవాళ్ళయ్య, జంగం వీరేశ దుకాణదారు రామందాసు చేరి కూర్చుందురు.]

BRAOU

మున : ఆకాశం ముందు పుట్టిందా? బూవి ముందు పుట్టిందా?

మనవా : సుత్తి ముందా, కారు ముందా?

మున : పంగనామాలు ముందా, పట్టెవొర్దనాలు ముందా? నామాలోడా, నా సవాలేటి? నీ జవాబేటి? ఆకాశానికి మట్టా బూవి? బూవికి కప్పా ఆకాశం? సదువుకున్నోడెవడో సెప్పండొప్పి ...

మనవా : ఆకాశంబు శూన్యంబు, అనగా యేమి లేదన్నమాట?

మున : యేటీలేదా? గుడ్డోళ్ళకి యేటీలేదు. తెల్లోడు యెర్రోడా? పట్టణంలో గొట్టవెట్టి అదే సూస్తాడే ఆకాశం కేసి ?

మన : శాస్త్రంబులలోని రహస్యంబులు మ్లేచ్ఛుల కెట్లు తెలియును ?

మున : అల్లాండం, బెల్లాండం, శక్కరపొంగలి తినడవనుకున్నావా, నామాలోడా? తెల్లోడి మహిమ నీకేటి తెలుసును! తెల్లోడి సారాయికి, తెనుగోడి సారాయికి యెంత భేదం వుందో, తెల్లోడికీ నీకూ అంత భేదం వుంది.

మన : గణితశాస్త్రంబునం దాకాశంబన సున్న – సున్న యన శూన్యంబు – యేమీ లేదన్నమాట.

వీరే : చాత్రంలో మన్ను, మిన్ను అని అన్నాడు కాదా? మన్ను లేదా? మన్నుంటే మిన్నుండదా?

మున : యీరేశ మా మేలయిన పలుకు పలికినాడు.

వీరే : “ఆకాశం బొక్కడ్డది!” అంటారుగదా, ఆకాశం లేకపోతే బొక్కడ్డవెలాగ?

మున : శబాసు యీరేచ! నామాలోడు పలకడేం? నోరు కట్టడ్డది.

వీరే : [శంఖం పూరించును].

హెడ్డు : [దుకాణాదారునితో] యేవిటి అల్లరి భాయి?

మున : యీరేవం గెల్సుకున్నాడు గదా, చంకం వోగించడా?

దుకాణ : గురోజీగారి సమాదికి బంగం వొస్తే శపించి పోతారే?

బైరా : [కళ్ళు తెరిచి] శివబ్రహ్మం! శివబ్రహ్మం! శివోహం! ...

వీరే : చూచావు నేస్తం, శివబ్రహ్మం అన్నారు.

బైరా : రామబ్రహ్మం! రామబ్రహ్మం! రామోహం!

మన : మొదటి మాటను రెండవమాట రద్దు చేయును. రామానుజ! రామానుజ!

వీరే : చివచివా, చివచివా!

దుకా : యెందుకు కాట్లాడతారు? నీ శివుడూ నిజవే. అడుగో, ఆ శీసాలో యెలుగుతున్నాడు. నీ రాముడూ నిజమే. అడుగో ఆ శీసాలో యెలుగుతున్నాడు. వినలేదా తత్తం?

> గాజు కుప్పెలోను గడగుచు దీపంబు
> యెట్టులుండు గ్యాన మట్టులుండు !
> తెలిశినట్టివారి దేహంబులందును !
> యిశ్వదాభిరామ యినరవేమా !!

బైరా : సత్యం, సత్యం.

దుకా : గురోజీ! తమకి అంతా [illegible]! దేహం గాజుకుప్పె. దేహంలో వుండేది పరమాత్మ! గాజు కుప్పెలో ఉండేది అన్నసారం. ఈ అన్నసారం దేహంలో పడితేగాని పరమాత్మ పెజ్జలించదు. యేం శలవు?

బైరా : ఈ పరమ రహస్యం నీకు ఎలా తెలిసింది తమ్ముడా?

దుకా : తమవంటివారి దయవల్ల గురూ! [నలుగురివైపూ చూసి] చూశారా బాయీ, నేను యెప్పుడూ యీ మాటే గదా చెబుతూ వుంటాను? అఖడాకి వొస్తే పరబ్రహ్మం పట్టుపడ్డం యెలాగు?

బైరా : అమృతమనేది యేమిటి? సారాయే! నాడు యిదేగదా తాగడానికి దేవాసురులు తన్నుకు చచ్చారు.

వీరే : చివచివా! చివచివా!

మన : రామానుజ! రామానుజ!

మున : కాట్లాటమాని ఘానం యినం డొప్పి, యెర్రి గొల్లోళ్ళు.

హెడ్డు : గురూ! మరివొక రసలింగం చేయించి, శిష్యుడికి దయ చెయ్యాలి.

బైరా : అలాగే.

మున : గురూ! బంగారం సేస్తారు గదా. అదెట్టి హరిద్వారంలో మటం కట్టించక మాలాటోళ్ళని డబ్బెందు కడుగుతారు?

బైరా : మేం చేశే స్వర్ణం మేవేఁ వాడుకచేస్తే తల పగిలిపోతుంది?

హెడ్ : అవి వేరే రహస్యాలు. ఊరుకోండి మావాఁ! గురోజీ! హరిద్వారంలో చలిలావు గాబోలు?

బైరా : నరుల ... క్కద్దు. మా బోటి సిద్ధులకు చలీ, వేడి, సుఖం, దుఃఖం ఎక్కడివి?

హెడ్ : ఆహా! అదృష్టమంటే సిద్ధుల్దే ఆదృష్టం.

మున : గురూ, హరిద్ధోరంనించి యెప్పుడు బైలెళ్ళేరు?

బైరా : రెండు రోజులయింది. మొన్న పుదయం ప్రయాగ, నిన్న పుదయం జగన్నాధం శేవించాం. ఖేచరీ గమనమ్మీద ఆకాశమార్గాన్న పోతూవుండగా మీ పూరి అమ్మవారు వనం దగ్గర గమనం నిలిచి పోయింది. యేమిచెప్మా అని యోగదృష్టిని చూచేసరికి అమ్మవారి విగ్రహముకింద ఆరు నిలువుల లోతున, మహాయంత్రం వొకటి స్థాపితమై కనపడ్డది. అంతట భూమికిదిగి, అమ్మవారిని శేవించు కొని ప్రచ్ఛనంగా పోదావఁటూంటే యీ భక్తుడు మమ్మల్ని పోల్చి నిలిపేశాడు.

దుకా : చూడగానే, నేను సిద్ధుల్ని పోలుస్తాను గురూ! ...

మున : సుక్కేసేవోళ్ళని మాబాగా పోలుస్తావు! మా పూరమ్మోరు జగజ్జనని! మా చల్లనితల్లి.

బైరా : బ్రహ్మోహం! బ్రహ్మోహం!

హెడ్ : ఆహా! యోగమహత్యం! స్తానాల్చేసి, ముక్కు బిగించే బ్రాహ్మలకి లేవుగదా యీ సిద్ధులూ?

బైరా : వేషానికీ – జ్ఞానానికీ దూరంకాదా తమ్ముడా? మా తాతగారు చెప్పలేదా? ఆత్మశుద్ధిలేని యాచార మదియేల' అని?

హెడ్ : వేమన్న తమ తాతా, గురూ?

బైరా : అవును – వారు పరంపదించి ఆరువొందల సంవత్సరాలు కావొచ్చింది.

హెడ్ : తమ వయస్సెంత? గురూ?

బైరా : ఆదీ అంతూ లేనిదానికి లెఖ్ఖేవిఁటి తమ్ముడా? పరమాత్మ కెన్నేళ్ళో అన్నేళ్ళు.

మున : ఏం యిల్లైనమాట లింటున్నాం!

[వీరేశ శంఖం పూరించును]

హెడ్ : [శంఖం లాక్కొని పక్కను వుంచి] ఆట్టే పట్టెయ్యకండి భాయి!

దుకా : ఆట్టే యక్కడ భాయీ! పరవశ్వైందాకా తాక్కుంటే తాగడవేఁటి! వేమన్న చెప్పలేదా?

తాగి, తాగి, తాగి ధరణిపై బడుదాక
తాగెనేని తన్ను తాను తెలియు;
తాగలేనివాడె తాగబో తరయంగ
యిశ్వదాభిరామ యినర వేమ!!

బైరా : కాశీలో రెండు వందల యాభై సంవత్సరముల క్రిందట ఆలంగీర్ పాదుషావారి హయాంలో, ఒక శేటు మాబోటి సిద్ధుల నందరిని కూటానికి పిలిచాడు. గంగ నడివిని పడవమీద పీపాలలో సారాయి భరాయించి, బంగారపు గిన్నెలతో అందించాడు. రెండు ఝాముల రాత్రి అయ్యేసరికి పీపాలు కాలీ అయిపోయినాయి. అంతా పడిపోయినారు.

హెడ్ : ఏమి ఆశ్చర్యం!

BRAOU

భైరా : మేమూ, ఒక్క నేపాళపు బ్రాహ్మడూ మిగిలాం. "తే! తే!" అన్నాడు ఆ బ్రాహ్మడు. "తెస్తావా, శపించేదా?" అన్నాడు. శెట్టి యెక్కడ తెస్తాడూ? వాడు మా కాళ్ళు పట్టుకునేటప్పటికి పర్వాలేదు నిలవమని చెప్పి, ఒక పుణికి మంత్రించి, గంగ భరాయించిన కొద్దీ ఆ గంగ సారా అయిపోయింది. ఆ బ్రాహ్మడు సహస్ర పుణికలు తాగి జిర్రున తేన్చాడు. బ్రాహ్మల్లో కూడ మహాత్ములుంటారు. కనుక్కోగలిగిన జ్ఞానికి గంగానది అంతా సారాయి కాదా?

మున : రామందాసాహడు, గంగా బరాయించడానికి గురువు; ఒక దరావుకి పద్ద రావులు పేరుస్తాడు.

(హవల్దారు అచ్చన్న ప్రవేశించును).

దుకా : గురూ! వీరు హవల్దార్ అచ్చన్నగారు. మంచి గ్యాని, మునసబుగారికి మేనల్లుడు.

హవ : రామ్! రామ్!

భైరా : రామ్! రామ్!

హవ : (యోగినితో) పిల్లా, హుక్కా లావ్. (హెడ్‌తో) బాయీ, గుంటూరు శాస్తుల్లుగారి పత్తాయేమైనా తెలిసిందా?

హెడ్ : లేదు భాయి!

దుకా : రామప్పంతులంటాడు .... పెళ్ళికూతురు రెండో పెళ్ళిపిల్ల. దాన్ని అమ్మి డబ్బు చెయి చిక్కించుకని ...

హెడ్ : ఆ మాటలు మనకెందుకు భాయి?

మున : పోలీసోళ్ళకి అక్కర్లేక, బాపనోళ్ళకి అక్కర్లేక, యెదవముండని బాపనాడు పెళ్ళిజేసుకుంటే లోకం అంతా వూరుకోవడవేఁనా?

హెడ్ : డబ్బు యిచ్చినవాడికీ, పెళ్ళి ఆడినవాడికి లేని చింత మనకేల మావాఁ? కాక, యీ రోజుల్లో బ్రాహ్మణ్యం యెక్కడుంది? యెక్కడ చూసినా పిల్లల్ని ముసలాళ్ళకి అమ్ముకోడాలు - రండా గర్భాలే కదా?

హవ : కలికలాం గదా భాయీ? యెంత చెడ్డా బ్రాహ్మలు మనకి పూజ్యులు.

హవ : అన్నా, యవరంతవారు వారు. జ్ఞానం, నీతి ప్రధానంగాని, జాతిలో యేవుంది? వేమన్న యేవఁన్నాడు?

మున : ఏవఁన్నాడా? నీతికి పోలీసోణ్ణి - ఘూనానికి సాతానోణ్ణి అడగమన్నాడు.

హెడ్ : మావాఁ! వెక్కిరించండిగాని, నేను యెన్ని తాలుకాల్లో నౌఖరీ చేశానో అన్ని తాలుకాల్లోనూ రండా గర్భాలు యెన్నని చెప్పను? నన్నడిగితే వెధవలు పెళ్ళి చేసికోవడవేఁ ఉత్తమం అంటాను. మా సూపరెంటు పిల్లలతో వున్న రెండో పెళ్ళి దొరసాన్ని పెళ్ళాడి సుఖంగా వుండలేదా!

మున : మావఁగారి అబిప్పరాయం, పెయ్యతో టొచ్చిన ఆవు మేలు కాదా అని? అందుకనే, ముసలి బాపనోడు యెధవగుంటని పెళ్లాడితే, నీ నేస్తం కరణపోణ్ణి, ఆ ముసలాడి యెధవ కూతుర్ని పెళ్ళాడమని బోధ సెయ్యరాదా!

హవ : మనకేల మావాఁ? గవునర్‌మెంటూ, దేవుళ్ళూ, బ్రాహ్మలూ వారి నేరాలు వారివి. వాటితో మనకి పనిలేదు. మన భక్తి మనకుండాలి. [హెడ్‌తో] భాయీ? తెల్లా నల్లా వొకటా? - తెల్లవాడికి క్రీస్తు ఒక పద్ధతి పెట్టాడు. ముసల్‌మాన్‌కి పైగంబరు వొక పద్ధతి పెట్టాడు. నల్లవాడికి రాముడు ఒక పద్ధతి పెట్టాడు. భగవంతుడు తెల్లవాడితో యేవఁన్నాడూ? వెధవని పెళ్ళాడు అన్నాడు. రాముడు తెలుగువాడితో యేవఁన్నాడూ? వెధవని పెళ్ళాడొద్దన్నాడు. చెప్పన్న దేశాలూ చూశాను భాయీ! పరిపరివిధాల ఆచారాలు, వ్యవహారాలు ఉన్నాయిగాని, నీతి వకటే, భగవంతుడొకడూ అంతటా వొక్కటే.



BRAOU

మున : రాముడు యెధవ మండల్ని కానిపనులు సెయ్యమన్నాడూ? మన్లో మారు మనువులఉండేవి కావా?

హవ : పిల్లా! చిలుం భరాయించి, తే.

మున : నామాలోడు మూలకి తీసికెళ్ళి పిల్లని ముద్దెట్టుకుంటున్నాడు.

యోగిని : [చెయ్యి విడిపించుకొని సిగ్గుతో] ఏకాంత ఉపదేశం చేస్తున్నారు.

మున : యేదో ఆ ఉప్పుదేశం? తనెంట వాయువేగంగా రమ్మనా?

దుకా : యేవిటి భాయీ? అనరాని మాట్లు అంటున్నారు. మన యోగిని పరమ భక్తురాలు.

మున : లెంప లోయించుకుంటాను. పిల్లా! ఆ నామాలోడు సెప్పిన ఉప్పుదేశవేఁటో నా చెవులో కొంచెం సెప్పరాదా?

[యోగిని సారాగళాసు హవల్దార్ యెదట వుంచును].

మున : నామాలోడి ఉప్పుదేశంతో పిల్లకి మతోయింది.

బైరా : హవల్దారుగారు అమృతం సేవించరా?

హవ : [చిరునవ్వు నవ్వి] తాక్క సోజరువాడు చెడ్డాడు. తాగి సిపాయివాడు చెడ్డాడు. జ్ఞానికి జ్ఞానపత్రి, తాగుబోతుకు సారాయి.

మున : ఫించను పుచ్చుకుంటివి గదా, యింకా సిపాయీనా సెయ్యాల్సుందా అల్లుడోడా?

హవ : కుంపిణీ నమ్మక్ తిన్న తరవాత, ప్రాణం వున్నంతకాలం కుంపిణీ బావుటాకి కొలువు చెయ్యాలి. రేపు రుషియాతో యుద్ధం వస్తే ఫించను ఫిరకా యావత్తూ బుజాన్ని తుపాకీ వెయ్యవా?

మున : రుస్సోవోడి వోడ నీట్లో మునిగి నడుస్తాది గదా, నువ్వు తుపాకుతో యి[illegible]ణ్ణి కొడతావు?

హవ : మొన్నగాక యింగిరిజ్ రుషియా దేశానికి దండెత్తిపో[illegible] [illegible]షియాని తన్ని తగలలేదా? అప్పుడేవైందో యిప్పుడూ అదే అవుతుంది. మా రాణి [illegible] వుండాలి.

దుకా : సీవరాణీ ఆ కాళీమాయి అవుతారం కాదా?

హవ : కాళీ, గీళీ జాంతేనై, ఆ రాముడి అవతార[illegible]

దుకా : గురూ హవల్దారుగారు తత్తకీర్తనలు మా యింపుగా పాడతారు. [యోగినితో] తల్లీ, నా తంబూరా తెచ్చి భాయిగారికి ఇయ్యి.

మున : యీతూరి యీరేచ ఉప్పుదేశం చేస్తున్నాడు.

దుకా : గొప్పవారున్నప్పుడు ఆస్యాలేటి భాయీ?

మున : వున్న మాటాడితే ఆస్సోలా, నా కెవడూ సెయడేం ఉప్పుదేశం? యీరేచ ఉప్పుదేశం గట్టిగా బిగిసింది; మరి సెయ్యిదల్డు.

[యోగిని కష్టం మీద చెయ్యి వొదిలించుకొని తంబూరా తెచ్చి యిచ్చును].

దుకా : అవన్నీ గ్యానరహాశ్శాలు బ్రమ్మానందవంటే యేటి? కడుపునిండా సారా! ముక్కు నిండా పొగ, సక్కని పడుచుపిల్లా కదా!

మున : ఘూ'నం వినండొస్సి –

హవ : పామరం! పామరం! రాముడు పతం కాళీ నెత్తిమీద పెట్టకపోతే కుంపిణీ సిపాయన్నవాడు యిక్కడికి వొచ్చునా?

హెడ్ : భాయి! ఒక కీర్తన శలవియ్యండి!



BRAOU

హవ : (పాడును) పింజర్మె రహకర్ చుప్ నై రహ్నా
క్యారే బుల్బుల్ కహెూ ముల్కి సునా ॥క్యారె॥
యెక్కడికి వెళతావు? యేమి చెప్పవు బోలో పింజర్మె!

[వీరేశం శంఖం మనవాళ్ళయ్య తీసి పూరించును].

హవ : [పాటమాని, తంబూరా క్రిందబెట్టి] గద్దా!

హెడ్ : [శంఖం లాక్కొని] శంఖం అగ్గిలో పడేస్తాను. యెందుకు తానిస్తావు భాయి?

దుకా : వొద్దంటే వినడు.

హెడ్ : వినకపోతే దుకాణానికి రానియ్యకండి. అల్లరైతే మాకు మాట కదా?

దుకా : పది శంకాలు దాచేశాను; మళ్ళీ తెస్తాడు. యేం జెయ్యను బేరంగదా భాయీ?

మున : దిట్టంగా పట్టెయి, తత్తఘ్నానం తలకెక్కాలి?

దుకా : [తంబూరా తీసి పాడును]

నాగా దిగరా – నా తండ్రి దిగరా

దిగుదిగు నాగన్న – దివ్యసుందర నాగ

ముదముతో రేపల్లె – ముద్దుల నాగ

ఊరికి ఉత్తరాన – ఊడలమ్మరికింద

పుట్టలోని కోడినాగన్నా –

[పాడుచుండగా రామప్పంతులు ప్రవేశించి యెడంగా నిలచి యోగినికి సౌజ్ఞ చేయును. యోగిని రామప్పంతులతో మాటలాడి వచ్చి [illegible] చెప్పును]

మున : పిల్ల హెడ్‌గారికి వుప్పదేశం చేస్తాండు ముసలోణ్ణనా –

యోగిని : [మునసబు చెవిదగ్గర నోరుపెట్టి చెవి గిల్లును]

మున : పిల్లా; సార్లోజులైంది మునసబు నాయుడికి యీపాటి వుప్పదేశం తగిలి –

[హెడ్ కనిష్టేబు రామప్పంతులు దగ్గరకు వెళ్ళి యడంగా యిద్దరూ మాటాడుదురు]

హెడ్ : కొత్తవారు యెవరూ లేరే? బావాజీగారు వుంటే మీకు భయవేఁవిటి?

రామ : కొత్తా, పాతా ఆలోచించుకోలేదు. కొంప మునిగింది. మీ సాయం కావాలి.

హెడ్ : డబ్బేవైనా పేల్తుందా?

రామ : మీ చ్చాతైతే, పేల్తుంది.

హెడ్ : యేమిటొచ్చిందో చెప్పు.

రామ : లుబ్ధావుధాన్లు పెళ్ళాడిన గుంట మధురవాణి తాలూకు కంటె తీసుకొని యెక్కడికో పారిపోయింది.

హెడ్ : ఎందుకు పారిపోయిందో?

రామ : మీనాక్షి చావగొడితే పారిపోయింది. యెక్కడ వెదికినా కనపడలేదు. ముందు మీ జవాన్లని దౌడాయించండి.

హెడ్ : యీ రాత్రివేళ మా జవాన్లు మాత్రం పట్టుకోగల్రా? పోలీసు జవానంటే పది కళ్ళూ, పది కాళ్ళూ వుంటాయనుకున్నావా యేవిఁటి?

రామ : దాని సిగ్గోసిరి! దాన్ని పట్టుకోవడం నా కెందుకు? కంటె నా కిప్పించెయ్యండి!



BRAOU

హెడ్ : యేవిటి నీ మాటలూ! ఆ కంటె పట్టుకు ఆ పిల్ల పరారీ అయిందని చెపితివి, నేను కంటె యెలా యిప్పిస్తాను?

రామ : ముసలాణ్ణి అడిగితే, అది పట్టుకుపోయిందంటాడుగాని, నిజంగా వాడు పెట్టెలో దాచేసి యివ్వకుండా వున్నాడు.

హెడ్ : నన్నేం చెయ్యమంటావు?

రామ : కూనీ కేసని ముసలాణ్ణి బెదిరిస్తే, నా కంటె నా కిచ్చేస్తాడు; మీ చెయ్యి కూడా తడౌతుంది.

హెడ్ : అలాగనా – గాని నువ్వన్నట్టు ఆ పిల్లగానీ కంటె పట్టుకు పరారి అయి పోయి వుంటే –

రామ : పోనీండి – దాని ఖరీదు యిప్పించెయ్యండి.

హెడ్ : వాడిస్తాడా?

రామ : మరి మీ సాయం యెందుకు కోరా'సు ?

హెడ్ : యిస్తాడని నాకు నమ్మకంలేదు. ఐనా చూస్తాను. కేసని యెత్తు యెత్తడానకి యిద్దరు ముగ్గురు సాక్షులుండాలి.

రామ : మందిరంలో ఉన్నవాళ్ళో?

హెడ్ : వీరేశం, మనవాళ్ళయ్యా మూడోకాలంలో వున్నారు. హవల్దారు అబద్ధం ఆడమంటే తంతాడు. మునసబు నాయుడు యింత రాత్రివేళ అంతదూరం నడిచిరాలేడు. యిహ ఆడనూ పాడనూ రామందాసు వొక్కడేగదా?

రామ : ఆ బైరాగాడు సాక్ష్యం పలకడేం?

హెడ్ : వేషం వేసుకు ముష్టెత్తుకునే బైరాగా డనుకున్నావా యేవిటి? ఆయన గొప్ప సిద్ధుడు. నిలువెత్తు ధనం పోసే అబద్ధవాడ్డు.

రామ : సాక్ష్యం పలకావొద్దు, ఏమీవొద్దు. దగ్గిర నిలబడితే చాలును. పిల్చుకు రండి.

(కనిష్టీబు వెళ్ళి దుకాణదారునూ, బైరాగిని తీసుకువచ్చును)

బైరా : సాక్ష్యం అంటే మావంటి వాళ్ళే చెప్పాలి. యోగ దృష్టివల్ల చూశావంటే యెక్కడ జరిగినదీ, యెప్పుడు జరిగినదీ కళ్లకి కట్టినట్టు అప్పుడు కనపడుతుంది. గనక మేం కూడా వస్తాం. యేమైనా దొరికితే హరిద్వారంలో మఠానికి పనికొస్తుంది.

రామ : జరిగినదాని ముండా మోశిరి. కొంచం కల్పనుంటే గాని కథ నడవదు. అంచేత హెడ్డుగారు ముసలాడితో చెప్పేమాటలు నిజం అని శలవివ్వాలి.

బైరా : వెర్రి? వెర్రి? నిజవేవిటి. అబద్ధవేనిటి? మేం సిద్ధులం, అబద్ధం నిజ'ం చేస్తాం. నిజ'ం అబద్ధం చేస్తాం. లోకవే పెద్ద అబద్ధం, పదండి –

[నిష్క్రమింతురు]

## ౫. స్థలము : దేవాలయం గుమ్మం దగ్గిర

(హెడ్డు కనిష్టీబు, రామప్పంతులూ మాట్లాడుతుందురు. మరివక కనిష్టీబు, బైరాగి, దుకాణదారు కొంత యడముగా నిలుచుందురు)

హెడ్ : నా నౌఖరీ పోగొట్టుకుంటానా భాయీ?

రామ : కొంచం బెదిరిస్తే నౌఖరీ పోతుందా అన్నా? పోలీసు డూటీ అంటే బెదరింపే గదా? మీరు అలా తప్పించు కుంటే నేనేం అనుకోను?

హెడ్ : [చేతిలో నలుపుతున్న కాగితపు ముక్కలు విసిరేసి] భాయీ, ఉబ్బావుధాన్లు చంటిపిల్లాడా, దుక్కిముచ్చా బెదిరించడానికి? కూనీ కేసని నాకేమైనా ఆశవుంటే పోలీసువాణ్ణి నేను వూరు



BRAOU

కుంటానా? పట్టుకుంటే నాకుయెంత కొరక్కు కాదు? ఈ జనాన్ని ఈ చీకటి రాత్రిలో నూతిల దింపానుకానా? కూనీగీని అంటే యవరైనా నవ్వుతారు. మీనాక్షి చేతికి వెరచి, ఆ పిల్ల యిరుగింట్లోనో – పొరుగింట్లోనో పడుంది. మీ యింట్లోనే వుందేమో – ముసలాడు అన్నట్టు?

రామ : దేవుడుతోడు! మాయింటికిరాలేదు. యిరుగింటో పొరుగింటో అని మీరు వూరుకుంటే, యలాగ? మీ ధైర్యమేమిటో నాకు బోధ పడదు. వెతికించవయ్యా అంటే, వెతికించారూ కారు. ఆ యిరుగింటి వాళ్ళూ పొరుగింటి వాళ్ళూ పిల్ల నిద్దరపోతూవుండగా కంటె చెపాయిస్తే నా గతేమిటి? కంటె యింటికి పట్టుకువెళ్ళకపోతే మధురవాణి గుమ్మంలోంచి గెంటుతుంది. అనగా, గెంటుతుందని కాదు – యేడుస్తుంది. ప్రాణం తినేస్తుంది. విన్నారా?

హెడ్ : అయితే, నా సలహా విన్నారా?

రామ : ఏదో చెప్పండి మరి

హెడ్ : ఆ కంటె యిచ్చిందాకా, కదలకుండా లుబ్ధావుధాన్లు యింటిమీద కూర్చోండి.

రామ : యిదా సలహా! పీక మీద కూచున్న దాకా నాకేం పట్టింది? యింటికెళ్ళి సుఖంగా పడుకుంటాను.

హెడ్ : మధురవాణి బాధ పెడుతుందని కదూ?

రామ : అని మీకు కనికారం కాబోలు? రేపుగానీ వాడు కంటె యివ్వకపోతే, అవుధాన్లు మీద సివిల్ దావా పడేస్తాను. మీ దగ్గర కంటెమాట వొప్పుకున్నాడు గదా, మిమ్మల్ని సాక్ష్యం వేస్తాను.

హెడ్ : ఓహో యిదా వేషం? పోలీసు ఆఫీసర్ని నేను. సాక్ష్యాలకీ, సంపన్నాలకి తిరిగితే నా నౌఖరీ నిలుస్తుందా? కావలిస్తే లుబ్ధావధాన్లు కంటె హరించాడని నా దగ్గిర ఫిరియాద్ చెయ్యండి. కేసుచేసి నా తమాషా చూపిస్తాను.

రామ : కంటె మాట మీ దగ్గిర అతడు వొప్పుకున్న తరువాత. మీరు బోనెక్కి యలా అబద్ధం అనగల్లో చేస్తానుగదా!

హెడ్ : పంతులూ, అక్కరమాలిన తొక్క్యాలు వెయ్యకు. వాడు కంటె మాట తనకేమీ తెలియదన్నాడు. కావలిస్తే ఆ మాట సాక్ష్యం పలుకుతాను.

రామ : యిదా మీరు చేసిన సాయం?

హెడ్ : యెందుకు అక్కరమాలిన ఆందోళన పడతావయ్యా? రేపు నీ కంటె నీ యింట్లో వుండకపోతే నన్ను అను.

రామ : మధురవాణితో యిప్పుడు యేం జెప్పను?

హెడ్ : అయితే నన్నేం జేయమంటారు?

రామ : మళ్ళీ లుబ్ధావధాన్లు యింటికి రండి. యీ మాటు మన విద్దరం వెళ్ళి పీడిద్దాం.

హెడ్ : రెడ్డొచ్చాడు, మొదలాడు అన్నాట్ట-నిరర్థకంగా రాత్రంతా నిద్దరోకుండా చంపావు-మరి నేను రాజా అను. నువ్వెళ్ళి వాడి యింటిమీద కూచోవయ్యా అనిచెప్పానుకదా? నామాట విని అలా చెయ్యండి. అదే సలహా. పేసిరిగొట్టు ముండాకొడుకు –మా నలుగురికీ నాలుగు మూళ్ళు పజ్యాడు రాళ్ళు పారేశాడు. ఇవి పెగిలేప్పటికి నాతల ప్రాణంతోకకి వొచ్చింది. నావొంతు మూడు మీ కిచ్చేస్తాను.

రామ : కంటె పోయి యేడుస్తూవుంటే, యీ వెధవ మూడు రూపాయలూ నా కెందుకూ?

హెడ్ : మీకు అక్కర్లేకపోతే పోనియ్యండి, గురోజీగారికి యిద్దాం.

రామ : కొంచం చిల్లర ఖర్చుంది. ఏం జెయ్యను? యిలా పారెయ్యండి. [పుచ్చుకొనును].

హెడ్ : గురోజీ, తమకో తులసిదళం.

బైరా : తృణం, కణం యేవొచ్చినా మఠానికే అర్పణం.

హెడ్ : [దుకాణదారుతోనూ, కనిస్టీబుతోనూ] మీకో మూడు, నీకో మూడూ - [చేతులు దులిపి] సాఫ్‌ఝాడా - నాకు తిప్పలే మిగిలింది.

దుకా : [బైరాగిని పక్కకి పిలిచి] యీవేళే చెన్నాపట్నంనుంచి ఫస్టురకం బ్రాందీ వొచ్చింది. చిత్తగించి మరీ కాశీ వెళుదురుగాని.

హెడ్ : గురోజీ, రాం! రాం! పంతులూ, ముసలాణ్ణి వెళ్ళి పట్టుకోండి. భాయీ, స్టేషనుకి పోవాలి. [జవానుతో] రావోయి కావఁయ్యా!

[హెడ్డూ, జవానూ ఒక వైపున్నూ, దుకాణదారూ బైరాగీ మరి ఒక వైపున్నూ వెళ్ళుదురు]

రామ : కంటె పోయిందంటే మూడు రూపాయలా చేతులోబెడతాడు! [నీరసంగా నవ్వును]. వీడి తాళం పడతాను. [హెడ్ పారేసిన కాగితపు ముక్కలు యేరి] యినస్ పెకటరుకి వొకటి, తాసిల్దారుకి వొకటి ఆకాశరామన్న అర్జీలు పంపుతాను. వెధవ, మధురవాణి దగ్గిరకి వెడతాడేమో? నేను ఇంటికి పోతే అరుగుమీద పడుకోవాలి గాని ఆ తిక్కలంజ తలుపు తియ్యదు. లుబ్ధావధాన్లు ఇంటికి వెళ్ళితే వాడు క్రరుచ్చుకుంటాడు. ఈ దేవాలయంలో పరుందునా? - పురుగూ బ్రుటా కరిస్తే - ఛీ! ఈ సానిముండని వొదిలేస్తాను. ఆ గుంట యావైవనట్టు? నా అదృష్టంవల్ల యవళ్ళింటోనైనా దాగి రేపుగాని కళ్ళబడితే? కంటె పోకూడదు. ఒకవేళ చస్తే? చచ్చుండదు - నూతులో పడలేదు. గవరయ్యా, కావయ్యా కూడా గాలించారు. ఒక వేళ అది రెండో పెళ్లి పిల్ల అయి, దాని ఆ తండ్రి కానికీగా వొచ్చి బండీ ఎక్కించుకు దౌడాయించాడేమో? అలాయితే కంటె కూడా వుడాయించడా? - మీనాక్షిని పట్టుకుంటే కొంత ఆచోకీ తెలుస్తుంది. అది కనపడ్డవేలాగ? - తలుపు తట్టితే ముసలాడే వొస్తాడేమో? - (రోడ్డు దాటి లుబ్ధావధాన్లు ఇంటిగుమ్మం యదట నిలుచుని) ఆకలి దహించేస్తుంది - మీనాక్షి దొరికితే యేవైనా ఫలహారం యిచ్చును - యవడు చెప్మా, రావిచెట్టు కింద చుట్ట కాలుస్తున్నాడూ? (నాలుగు అడుగులు ముందుకు వెళ్ళి) అసిరీ, నువ్వా?

అసి : నాను బాబు (చుట్ట పారవైచును)

రామ : నిమ్మళంగా వున్నావురా?

అసి : ఏటి నిమ్మళం బాబూ. సాన మ్మొచ్చింది - ఈ ముమ్మకాసి సూడ్డం మానేసినారు, డబ్బిచ్చే దాతేడీ బాబూ?

రామ : అసిరి, అడక్కపోతే, అమ్మైనా పెడుతుందిరా?

అసి : ఆ సానమ్మ మా పెద్ద మనిషి బాబూ!

రామ : యేవిటి? యేవిటి? చెప్పేరే. చాలారోజులైంది నీకు డబ్బిచ్చి-యిందా యీ రూపాయి పుచ్చుకో

అసి : నూరు దండాలు బాబూ!

రామ : మధురవాణి మాట యేవిటో చెప్పబోయినావు?

అసి : మా పెద్ద మనిషి బాబూ!

రామ : యెవడెళ్తాడ్రా దాందగ్గరకి? అసిరి - యెవడెళ్తాడ్రా?

అసి : యవడెళ్నా, యీపు పెట్టగొడతాది బాబూ!

రామ : పెద్దమనిషన్నావు?

అసి : కాదా? మొన్న హెడ్డుగారెళ్తే, ఏపికూన్ని ఉసు గలిపింది కాదా?

రామ : నిజం చెప్పావు. నీ మీద యెప్పుడైనా కోప్పడ్డదిట్రా?

అసి : మాలోటోళ్ళ మీద యెందుక్కోప్పడతాదీ? బాపనాళ్ళొస్తే తిడతది.

రామ : నువ్వు యెప్పుడూ నిజమే చెబుతావురా అసిరిగా!

BRAOU

అసి : సీ ! అబద్ధవాఁడితే బగవంతుడు ఒల్లకుంటాడా బాబూ?

రామ : మీ బుగత యేం జేస్తున్నాఁడ్రా?

అసి : తొఁంగున్నాడు బాబూ!

రామ : నీకు మరో రూపాయి యిస్తాను – మీనాక్షిని సావిట్లోకి పిలుస్తావురా?

అసి : నా శక్యవాఁ బాబూ? ఆ యమ్మ అయ్య గదులో పక్కేసుకు తొఁంగున్నారు.

రామ : నువ్వు చిటికేస్తే, యక్కడున్నా లేచొస్తుంది, నే నెరగనట్రా!

అసి : లెండి బాబూ, చూస్తాను.

(రామప్పంతులు రాపాయి యిచ్చును. ఉభయులూ యింట్లో ప్రవేశింతురు)

ఒవ స్థలము : లుబ్ధావధాన్లు యింటి నడవ తలుపు జారవేసి వుండును

(మీనాక్షి ప్రమిదతో దీపం తెచ్చి గూటిలో వుంచును. రామప్పంతులు వొత్తి తగ్గించి, మీనాక్షిని ముద్దు పెట్టుకొనును).

మీనా : తోవ తప్పొచ్చారో?

రామ : బుద్ధి తక్కువచేత, గడ్డి తిని యిన్నాళ్ళు తోవ మరిచాను.

మీనా : మధురవాణి యలా రానిచ్చింది?

రామ : మధురవాణి సిగ్గోసిరి! దాన్ని వొదిలేస్తాను. ఆకలి దహించుకుపోతూంది. ఫలహారం యేవైనా వుందీ?

మీనా : యేవుఁంది! వొడపప్పూ, కొబ్బరి ముక్కా కావాలా?

రామ : ఏదో ఒహటి తెస్తూ

(మీనాక్షి మూకుడులో వడపప్పూ, కొబ్బర ముక్కలూ తెచ్చును. రామప్పంతులు తినుచుండును)

మీనా : మధురవాణ్ణి వొదిలేస్తారా?

రామ : వొదిలేయడం నిశ్చయమైపోయింది

మీనా : కనిష్టీబు మాట తెలిసిందా?

రామ : తెలిసింది.

మీనా : యవరు చెప్పారు?

రామ : అసిరిగాడు.

మీనా : మా అసిరిగాడా?

రామ : మీ అసిరిగాడే.

[అసిరిగాడు వీధి తలుపు కొంచెం తీసి తొంగిచూసును]

అసి : దెయ్యాని కెట్టింది తింతున్నావయ్యా?

రామ : దెయ్యానికా పెట్టారు?

మీనా : (అసిరిగాడితో) వూరుకో వెధవా!

రామ : నీకు న్యాయవేనా, దిగదుడుపు కూడు పెట్టడం? (వీధిలోకి వెళ్ళి వమనము చేసికొనుటకు ప్రయత్నము చేసి తిరిగి ప్రవేశించి) వమన వైంది కాదు. యేం సాధనం?

మీనా : దిగదుడుపు కాదంటే నమ్మరుకదా?

రామ : మూకుళ్లో తగలేశావు!



BRAOU

Dr. BRAOU
LIBRARY
Acc. No: CM – 0307
Class No:

మీనా : దెయ్యం తిని సచ్చిందా యేమిటి?

రామ : ఆడవాళ్ళు దారుణం మనుషులు!

మీనా : అసిరిగాడేం చెప్పా'డు మధురవాణి మాట?

అసి : (తిరిగి తొంగి చూసి) ఆ పారేసిం దట్టుకు పోదునా బాబూ?

రామ : పట్టుకుపో.

[అసిరిగాడు పట్టుకుపోవును]

మీనా : వాడికి మీకంటె ధైర్యం ఉంది.

రామ : అపవిత్రం ముండాకొడుకు యేమైనా తింటాడు. బ్రాహ్మలం, పవిత్రమైన వాళ్ళం గదా?

మీనా : పవిత్రం అంటే, మీదీ నాదే!

రామ : అదేం అలా అంటున్నావు?

మీనా : నేను వెధవముండనీ, మీరుసరసులున్నూ, మనకంటే, మరి పవిత్రం అయినవారు యవరుంటారు?

రామ : ఆ కళంకం తీసెయ్యడానికే యీ వేళొచ్చాను!

మీనా : యలా తీసేస్తారు?

రామ: మన యిద్దరం పెళ్ళా'డితే మరి అపవిత్రత యెక్కడుంటుంది?

మీనా : యేవిటీ!

రామ : మనం పెళ్ళాడదాం.

మీనా : నిజంగాను!

రామ : యేం వొట్టు వేసుకోమన్నావు?

మీనా : ఆ దీపం ఆర్పెయ్యండి!

రామ : యీ కాగితం ముక్కలు చదివి మరీ ఆర్పేస్తాను (కాగితం ముక్కలు జేబులోంచి తీసి చదివి) గాడిద'కొడుకు, తన బాకీ తాలూకు నమ్మలికే, నన్ను దగా చేశాడు; వీడి తాళం పడతాను.

మీనా : యవడు?

రామ : అది వేరే కథ.

మీనా : అసిరిగాడు కనిష్టీబు మాట యేం జెప్పాడు?

రామ : మధురవాణి పెడ్డ మీద కుక్కని వుసిగొలిపిందని జెప్పా'డు.

మీనా : యెందుకూ?

రామ : నేను లేనప్పుడు వాడు యింట్లో చొరబడబోతేను.

మీనా : అయ్యో వెలివా? అసిరిగా!

అసి : (ప్రవేశించి) యేటమ్మా?

మీనా : వెధవా, నిజం చెప్పూ, పంతులు యింట్లో లేనప్పుడల్లా కనిష్టీబు మధురవాణితో వుంటాడని నువ్వు నాతోచెప్పలేదూ? ...

అసి : (బుర్ర గోకుకుంటూ) సెప్పినాను

రామ : దొంగవెధవా? కుక్కని వుసిగొలిపిందన్నావు?

అసి : బాబు నౌఖరోడు నోరు మూసుకోవద్దా బాబు? సానమ్మనడిగతే, మీ మాట సెప్పుతాన బాబు?

మీనా : వెధవా, నువు చెబితేనాకు భయవనుకున్నావా యేవిటి?

రామ : ఓరి అబద్ధపు వెధవా! యెవరితోనూ మా మాట మాత్రం చెప్పకు. రూపాయి యిచ్చాను కానూ?

మీనా : యందుకిచ్చారు రూపాయి?

అసిరి : పిల్లలోణ్ణిగందా? (పైకి వెళ్ళును).

రామ : దొంగముండ, ద్రోహం చేస్తూందేం?

మీనా : తెలుసునన్నారు?

రామ : యింతని యెరగను!

మీనా : ఆడది నీతి తప్పిన తరువాత అంతేవిటి, యింతేవిటి? తెగించిన దానికి సగుడు మోకాలుబంటి. అందులో సొంది ఖాయిదాగా ఉండాలనుకోవడం మీదీ బుద్ధి తక్కువ.

రామ : బుద్ధి తక్కువంటే బుద్ధి తక్కువా! ముండని బుర్ర చితక పొడిచెయ్యాలని ఉంది. దీని కింద యెంత సొమ్ము తగలెట్టానూ!

మీనా : యెప్పుడు తోలేస్తారు?

రామ : యెప్పుడోనా? రేపే. లంజ, యంత పతివ్రత వేషం వేసిందీ!

మీనా : మనవెప్పుడు వెళ్ళిపోవడం?

రామ : యెక్కడికి?

మీనా : మతిపోతుందా యేవిటి? రాజమేంద్రం!

రామ : అవును. రేపు దాన్ని తోలేస్తానా? యెల్లుండి మనం వుడాయిద్దాం. గాని నీ సరుకులు తెచ్చుకుంటావా, ముసలాడికి వొదిలేస్తావా?

మీనా : నాకున్నదల్లా నా సరుకులే. యెలా వొదిలేస్తాను? నా సరకుల పెట్టె తాళం మా నాన్న దగ్గిరుంది గదా యేవిగతి.

రామ : నా ప్రయోజకత్వం నీకు తెలుసును? ఇదుగో, ఈ రింగున వున్న ఇనుప ములికితో నీ చిత్త వొచ్చిన పెట్టెతాళం తీసేస్తాను. గాని నా కంటె యక్కడుంది?

మీనా : గుంటకి పెట్టిందా? రాత్రివేళ నా బట్టల పెట్లో పెట్టేది.

రామ : నీ పుణ్యముంటుంది. ఆ బట్టల పెట్టె వోమాటు తీసిచూడూ. రేపు దానికంటె మధురవాణి కిచ్చి, ముండని తగిలేస్తాను.

మీనా : ఆ గుంట బట్టల పెట్టె తాళం పారేసింది.

రామ : ములికితో తీసేస్తాను.

మీనా : నా సరుకుల పెట్టె తాళం కూడా తీసేసి పెడతారూ?

రామ : అద్దే!

మీనా : నన్ను పెళ్ళాడతానని ప్రమాణం చేశారుకారే?

రామ : దీపం ఆర్పేస్తే పెట్టె తీయడం యలాగ?

మీనా : అగ్గిపుల్ల వుంది.

రామ : ఐతే యిదిగో, నిన్ను తప్పకుండా పెళ్ళాడతానని యీ దీపం ఆర్పేస్తున్నాను. [దీపం ఆర్పి మీనాక్షిని కౌగలించుకొని యెత్తును]. యిలా యెత్తుకు తీసుకపోతాను రాజమహేంద్రవరం. [లుబ్ధావధాన్లు చీకటిలో వచ్చి కర్రతో రామప్పంతులు కాళ్ళమీద కొట్టును. మీనాక్షి క్రిందపడును].

లుబ్ధా : బందిపోటు గాడిదెకొడుకా!



BRAOU

రామ : సచ్చాన్రా! [వీధిలోకి కుంటుకుంటూ పోవును]

లుబ్ధా : పో ముండా, నువు కూడా నా యింట్లోంచి. [మీనాక్షిని పైకి తోసి తలుపు గడియవేయును].

రామ : అసిరిగా! చంపేశాడ్రా – కాలెవిక విరిగిపోయిందిరా!

అసి : [నిమ్మళంగా] దెయ్యాని కెట్టింది తింతే యేటౌతది బాబూ? [గట్టిగా] ఆనేళ యిల్లు జొరబడితే బుగత తన్నడా?

రామ : (మీనాక్షితో) నువ్వు యింట్లోకి వెళ్లిపో.

మీనా : మరి యింట్లో అడుగుపెట్టను. నా సరుకులు లేకపోతే పాయను. రండి, రాజమేండ్రం పోదాం.

రామ : తలిచినప్పుడేనా తాతకి పెళ్లి?

మీనా : మీ యిష్ట వొచ్చినప్పుడు పెళ్ళాడుదురుగాని, యింట్లోంచి లేవదీసుకొచ్చారుగదా? యిహ నేను మీతో ఉండవలసినదాన్నే; పదండి.

రామ : వెర్రి కుదిరింది రోకలి తలకి చుట్టకొమ్మనన్నాట్ట! బతిమాలుకుంటాను యిప్పటికి యింట్లోకి వెళ్ళిపో.

మీనా : మరి యీ జన్మంలో యీ యింట్లో అడుగుపెట్టను.

రామ : అసిరిగా! మీనాక్షి వొక్కర్తా వుంటుంది. కాపాడి, బుగత తలుపు తియ్యగానే లోపలికి తీసికెళ్ళు – [పరిగెత్తును. మీనాక్షి వెంటపడును].

[రామప్పంతులు యింటి యెదట]

రామ : [తలుపు తట్టి] వేగిరం, వేగిరం తియ్యి.

మధు : [తలుపు అవతలనించి] యేవిటీ తొందర?

రామ : ఆకుచిట్టెడ వెంట తరుముతూంది.

మధు : చిట్టెడ కనపడగానే తలుపు తీస్తాను.

రామ : తలుపేసుకు కూచుంటే నీ క్కనపడ్డం యెల[?] నువ్వు తలుపు తీసేలోగా నన్ను కాటేస్తుంది.

మధు : నా కంటేదీ?

రామ : కంటె, కంటె అని తపిస్తున్నావేవిటి? నిలబడ్డ పాటున నూరు కంటెలు కురిపిస్తాను.

మధు : మీ నూరు కంటెలూ మీరు వుంచుకుని, నా వొక్క కంటె నా కిచ్చి మరీ యింట్లో అడుగుబెట్టండి.

రామ : రేపు పొగలుగాని కంటె యివ్వనన్నాడు లుబ్ధావధాన్లు.

మధు : రేపే యింట్లో కొత్తురుగాని, మించిపోయిందేవీ లేదు.

రామ : యింతట్లో చిట్టెడ మీదపడితే?

మధు : సకేశా? అకేశా?

రామ : పిల్లికి చెలగాటం, యెలక్కి ప్రాణపోకటా!
[మీనాక్షి ప్రవేశించి రామప్పంతులు రెక్క పట్టుకొనును]

మీనా : దీపం ఆర్పి ప్రమాణం చేశావు – తప్పితే తల పగిలిపోతుంది.

రామ : పో ముండా!

మీనా : మీ కాగల పెళ్ళాన్ని గదా, యెక్కడికి పోతాను?

మధు : కాగల పెళ్ళావేవిటి?



BRAOU

మీనా : నిన ్ను వొదిలేసి, నన్ను రాజమేంద్రం తీసుకుపోయి పెళ్ళాడతానన్నాడు. దీపవార్పి ప్రమాణం చేశాడు – మరెలా తప్పుతాడు?

మధు : యీవిడెనా ఆకుచిట్టడ?

రామ : ముండా! నా చెయ్యొదిలెయ్ – నిన్ను నే పెళ్ళాడతానన్నానే? కలగన్నావా యేవిఁటి? [మీనాక్షి విడపించుకొనగా, మీనాక్షి కిందపడును]

మధు : ఆడదాని మీదా చెయి జేసుకుంటారు? ఏమి పౌరుషం! అబద్ధమాడక అన్నమాట నిలబెట్టుకోండి. ఏం? కులం తక్కువా, రూపం తక్కువా? ఆమె బతుకు భ్రష్టు చెయ్యనే చేశారు; పెళ్లాడి తప్పుదిద్దుకోండి– ఆవిడ్ని పెళ్ళాడి వొస్తేనే నేను తలుపు తీస్తాను.

మీనా : పంతులు నన్ను కౌగలించుకొని యెత్తుకుంటే మా నాన్నచూసి, తన్ని, యిద్దర్నీ యింట్లోంచి తగిలేశాడు. నువ్వు పెడ్డ కనిష్టీబుతో పోతున్నావు. నిన్నొదిలేసి నన్ను పెళ్ళాడతానని వొట్టేసుకున్నాడు. నన్ను లేవదీసుకొచ్చి, నన్ను పెళ్ళాడక తప్పుతుందా యేమిటి?

మధు : అవశ్యం పెళ్ళాడవలసిందే – పెళ్ళాడకతపోతే నువ్వు మాత్రం వూరు కుంటావూ? దావా వేస్తావు. పంతులుగారికి దావాలంటే సరదానే!

రామ : మధురవాణీ! నీకు మతిపోయింది –నా యింటికి నువ్వా యజమానివి? తలుపు తియ్యి.

మధు : నిలబడండి. కర్పూరంవెలిగించి మంగళహారతిపళ్ళెం తెస్తాను. [తలుపు దగ్గరనుంచి లోనికివెళ్ళును]

రామ : [తలుపు సందులోనుంచి చూసి, తరవాత మీనాక్షిని ముద్దెట్టుకుని] యెంత పనిచేశావూ? దాంతో చెప్పేశావు! రహస్యంగా లేచిపోయి పెళ్ళి చేసుకోవాలిగాని, అల్లరి చేసుకంటే యలాగ?

మీనా : యెప్పుడైనా అందరికీ తెలిసేదే గదా?

రామ : నా మాటవిని యిప్పుడు యింటికి వెళ్లిపో.

మీనా : యిహ మా యింటికి వెళ్లను. యిదే మా యిల్లు; మధురవాణి తలుపు తీస్తుంది. లోపలికి వెళదాం.

రామ : అయితే యిక్కడ వుండు. యిప్పుడే వొస్తాను [కొన్ని అడుగులు వీధంట నడచి, నిలచి] నిజంగా మంగళహార్తి తెస్తుంది [illegible] పెంకెలంజ? అది తలుపు తియ్యక పోయెనా? మీనాక్షి నన్ను వెతకడానికి బయల్దేరుతుంది. తెల్లవారవచ్చింది. చెరువేపు వెళ్లి కాల కృత్యాలు తీర్చుకుని ఆలోచిద్దాం. రెండ్రోజులు పైకి వుడాయించానంటే మళ్లీ వొచ్చేసరికి కొంత అల్లరి సర్దుకుంటుంది. తలుపు తీసినట్లు కానరాదు. యవడిల్లు? యవర్తె యిది నన్ను అడ్డడానికి? ఆశ్చర్యం!

[కొంత దూరంగా వీధిలో నిలబడి, దాసరి వేషంతో శిష్యుడు చితారుమీటి పాడును]

శిష్య : చరణం ॥ "యిల్లు యిల్లనియేవు! యిల్లు నాదనియేవు!
నీ యిల్లు యెక్కడే చిలకా?"

రామ : యిది నాయిల్లు కాదా?

శిష్య : "ఊరికి ఉత్తరాన! సమాధిపురములో!
కట్టె యిల్లున్నదే చిలుకా!"

రామ : వొల్లకాట్లోనా?

శిష్య : పల్లవి ॥ "యెన్నాళ్ళు బ్రతికినా
యేమి సామ్రాజ్యమే?
కొన్నాళ్ళకో రామచిలుకా!"
అను పల్లవి॥ "మూణ్ణాళ్ళ బతుకునకు
మురిసేవు త్రుళ్ళేవు!
ముందుగతి కానవే చిలుకా!"



BRAOU

రాము : ఏవిఁటీ అపశగునం పాట!

శిష్యు : "కఱ్ఱలే చుట్టాలు! కట్టెలే బంధువులు!
కన్నత ల్లెవరే చిలుకా?"

రాము : చుట్టాలా? వొక్క అప్ప వుంది. అది యెప్పుడూ నా గుమ్మంలో అడుగు బెట్టలేదు. యిప్పుడు యింటి యజమాని యెవరూ? తలుపవతల సానిలంజా, తలుపివతల ఁసారి వెధవ లంజానూ! ఇద్దరూ కలిసి ఇల్లు చేరకుండా నమున్న తగుల్తున్నారు.

శిష్యు : "నిన్ను మోసేరు నలుగురు!
వెంబడిని పదిమంది!"

రాము : వెఱ్ఱి ముండాపాటా! పోదాం [గబగబ కొంతదూరము నడచి, నిలుచుని] యీ తోవనే వొస్తున్నాడు కాబోలు - అదిగో, పాట వినబడుతూంది.

శిష్యు : పాట !! "నువ్వు కాలిపోయేదాక!
కావ లుందురు గాని !
కడకు తొలగొత్తురు!
వెంట నెవరూ రారు చిలుకా!!

రాము : వెఱ్ఱిముండా పాటా!

శిష్యు : పంతులుగారూ! యక్కడున్నారు?

రాము ! పరుగుచ్చుకోకపోతే పట్టుగుంటుంది. [పరుగెత్తును].

## 1.3 పాఠ్య వివరణ

ఈ పాఠ్యంలో ఉన్న 4,5 స్థలాలలో చిత్రించబడిన పాత్రలు అటడుగు ప్రపంచానికి చెందినవి. వాళ్ళు మాట్లాడే భాషలోని మాండలిక యాస కూడా సహజంగా సంభాషణల్లో చోటు చేసుకుంది. ముందుగా కొన్ని పదాలకు అర్థం తెలుసుకుందాం. తరవాత ఈ పాఠ్య పరిధిలో ప్రస్తావించబడిన అంశాల్ని మొత్తం నాటక కథా సారాంశం నేపథ్యంలో పరిశీలిద్దాం.

BRAOU

### 1.3.1 అర్థ వివరణ

వాడుకభాషలోని యాస ఉచ్చారణను సరిగ్గా ఉన్నదున్నట్లు సూచించటానికి లిపిలో అక్షరాలు లేవు. **కనుక** ఈ నాటక రచయిత కొన్ని పద్ధతులు ప్రయత్నించాడు. వకారం పక్కన అనునాసిక ధ్వని వినిపించే చోట అరసున్నను గుర్తుగా వాడాడు.

ఉదా : మేవేఁ, బావిఁ, యేవిఁటీ ...

అలాగే మరెన్నో ఉచ్చారణలో ఉన్న ధ్వనులకు లిపిలో అక్షరాలు లేవు. కనుక అలాంటి వాటిని సూచించటానికి ప్రత్యేకమైన గుర్తులు వాడాననీ చెప్పాడు. (నాటకం 'Preface' చూడండి) (') గుర్తును. ఉదా : పెట్టా'రు, చెప్పా'డు, పెళ్ళా'డితే, తా'నిస్తావులాంటి చోట్ల వాడాడు.

| | | |
|---|---|---|
| అఖాడాకి | = | అ + ఖాడ (కాడ)కు + వస్తే అనే మాటలు కలిసిన రూపం అయి ఉండవచ్చు. |
| అబిప్పెరాయం | = | అభిప్రాయం |
| అల్లాండం బెల్లాండం | = | అండపిండ బ్రహ్మాండం |
| ఆస్సాలు | = | హాస్యాలు |
| కాసి | = | వైపు (అమ్మకాసి = అమ్మవైపు) |
| గ్యానం | = | జ్ఞానం |
| తత్తఘ్యా'నం | = | తత్వజ్ఞానం [మున్సబునాయుడు ఉచ్చారణ] |

| | | |
|---|---|---|
| చంకం | = | శంఖం |
| చాత్రం | = | శాస్త్రం |
| చివచివా | = | శివశివా |
| చెప్పన్నదేశాలు | = | ఛప్పన్నదేశాలు (56 దేశాలు; హిందీలో ఛప్పన్ అంటే 56) |
| ద్రేహం, ద్రయ | = | దేహం, దయ [ఈ పదాల్ని రకారంతో కలిపి ఉచ్చరించడం చూస్తే - బహుశః పండితులు వేదాంతులు నోరు తిరగని సంస్కృత పదాలు సమాసాలు ఉచ్చరించడాన్ని అనుకరించడం అనిపిస్తుంది] |
| పరబ్రెమ్మం | = | పరబ్రహ్మం |
| పరమాత్వం | = | పరమాత్మ |
| పెజ్జలించు | = | ప్రజ్వలించు |
| బంగం | = | భంగం |
| బూవిం | = | భూమి |
| యీరేచ | = | వీరేశ |
| వుప్పదేశం | = | ఉపదేశం |
| వోగించడం | = | మోగించడం |
| శక్కవాం | = | శక్యమా |
| సుక్క | = | చుక్క (సారాయి చుక్క) |
| హరిద్దోరం | = | హరిద్వారం |

ఇలాంటి యాస మాటలు పాఠంలో మరెన్నో ఉన్నాయి. గుర్తించి ఒక పట్టిక తయారు చేసుకోండి. మీ ప్రాంతంలో ఈ మాటలను ఎట్లా అంటారో గుర్తించండి. కొన్ని మాటలకు పర్యాయ పదాలుంటే వాటిని గుర్తు పెట్టుకోండి.

**ఇంగ్లీషు పదాలు**

| | | |
|---|---|---|
| కుంపిణీ | = | Company |
| కనిష్టీబు | = | Constable |
| ఇంగిరీజు | = | English |
| పించను | = | Pension |
| గవునర్మెంటు | = | Government |
| రుషియా | = | Russia |
| సోజరు | = | Soldier |
| కారక్టరు కావడం | = | ఉద్యోగ నిర్వహణలో మంచి పనిచేశాడని సర్టిఫికేట్ లాంటిది రావడం - Character Certificate |

**హిందుస్తానీ పదాలు**

| | | |
|---|---|---|
| దౌడాయించడం | = | పరిగెత్తించడం |
| బనాయించడం | = | లేనిది ఉన్నట్లు - దొంగకేసు పెట్టడం |
| బరాయించడం | = | నింపడం |
| ఉడాయించడం | = | ఎత్తుకుపోవడం, ఎగిరి పోవడం |

[ఇతర భాషాపదాలకు 'ఇంచుక్' చేర్చి క్రియాపదాలుగా వాడటం - సంస్కృత పదాలను ఉపయోగించి నట్లుగా - భుజ్ - భుజించు, రక్ష - రక్షించు, వహ - వహించు మొదలైన విధంగా]

| | | |
|---|---|---|
| సిపాయానా | = | సిపాయి వృత్తి |
| సాఫ్‌రూడా | = | శుభ్రంగా దులుపుకున్నా |



BRAOU

| | | |
|---|---|---|
| నమ్మక్ = నమక్ | = | ఉప్పు |
| బాయి = భాయి | = | సోదరుడు |
| పత్తా = పతా | = | అడ్రసు |

**తెలుగు పదబంధాలు, సామెతలు**

| | | |
|---|---|---|
| క్రుమ్ముకోవడం | = | కొట్టడం |
| కానికీగరావడం | = | కనిపించకుండ రావడం |
| చెపాయించడం | = | దొంగిలించడం |
| చేయి తడికావడం, | | |
| డబ్బు పేలడం | = | లంచం లభించడం |
| తాళం పట్టడం | = | పని పడతాను, సంగతి చూస్తాను అని |
| మూడోకాలంలో వుండటం | = | తప్పతాగి పడిపోయి కలలు గనడం |
| రెడ్డొచ్చాడు మొదలాడు | | |
| తలప్రాణం తోకకి రావడం | | |
| సిగగోయడం (సిగ్గోసిరి) | | |

### 1.3.2 కన్యాశుల్కం నాటక కథ

అగ్నిహోత్రావధాన్లు కూతురు బుచ్చమ్మ బాలవితంతువు. కన్యాశుల్కం ఆశతో ఆ తండ్రి కాటికి కాళ్ళు చాచిన వానికిచ్చి పెళ్ళి చేస్తే, మర్నాడే విధవ అయి తండ్రికి మరింత ఆస్తి తీసుకొని పుట్టిల్లోచేరింది. అతని కొడుకు వెంటేశానికి చదువుచెప్పే మిషతో గిరీశం వాళ్ళింటచేరి, బుచ్చమ్మ మీద కన్ను వేస్తాడు. రెండోకూతుర్ని కూడ మరో ముసలి లుబ్ధావధాన్లుకు బోలెడుశుల్కానికి అగ్నిహోత్రావధాన్లు అమ్మజూపాడు. పెళ్ళి కుదురింది. ఈ పెళ్ళి తప్పించి పిల్లను కాపాడ్డానికి తల్లి వెంకమ్మ వేడుకోలుమీద ఆమె అన్న కరటక శాస్త్రి ప్లానువేసి తన శిష్యునికి ఆడవేషం వేసి తక్కువ శుల్కానికి ముహూర్తానికి ముందుగానే ఆ ఊరుచేరి పెళ్ళి జరిపించాడు. మహూర్తంనాటికి అగ్నిహోత్రావధాన్లు పెళ్ళికి తరలివస్తుండగా దారిలో బుచ్చమ్మను మోసగించి వితంతువివాహం చేసుకుంటానని గిరీశం లేవదీసుకుపోయాడు. పెళ్ళి వ్యవహారం ఏమో అలా అయి పోయింది. ఈ గొడవల్తో అగ్నిహోత్రావధాన్లు కోర్టుకు వెళ్ళాడు. లుబ్ధావధాన్లు తనకేదో మోసం జరిగిందని గ్రహించు కొన్నాడు. ఈ పెళ్ళిపెద్దగా మధ్యవర్తి వ్యవహారం నడిపిన రామప్పంతులు తన సాని మధురవాణి కంటె దొంగ పెళ్ళి కూతురుకు పెట్టించాడు. అదికాస్త ఆ పెళ్ళికూతురూ, కరటకశాస్త్రి మాయమవటంతో పోయిందను కున్నాడు. లుబ్ధావధాన్లు ఇచ్చిన కన్యాశుల్కం డబ్బుపోయింది. దాంతో అతడూ రామప్పంతులూ, తగాదా పడతారు. మధురవాణి కంటె తెచ్చి పెట్టలేని రామప్పంతులూ, మోసం పెళ్ళి జరిగింది, శుల్కం డబ్బూ పోయిందని లుబ్ధావదాన్లూ ఏడుస్తారు. పెళ్ళికూతురు కనిపించటం లేదు కనుక ఖూనీ జరిగిందని రామప్పంతులు పోలీసు సాయంతో లుబ్ధావధాన్ల మీద దొంగకేసు బనాయించి కోర్టుకు లాగాడు.

ఈ అందరూ విశాఖప్నటం కోర్టుచుట్టూ తిరుగుతూకలుస్తారు. అక్కడ సౌజన్యరావు అనే సంస్కర్త వకీలు సాయంతో, మధురవాణి మంచితనం తెలివితేటల సాయంతో కేసుల చిక్కులన్నీ ముడివీడిపోతాయి. గిరీశం కూడ దొరికిపోతాడు. వాని చేతిలో బుచ్చమ్మ నలిగిపోకముందే తప్పించి పూనా 'విడోస్‌హోమ్'కు పంపి సౌజన్యరావు చదువుకునే ఏర్పాటు చేశాడు. చదువుకొని జ్ఞానం లభ్బిన తరువాత ఆమె తనకిష్టమైన వాన్ని పెళ్ళి చేసుకోవచ్చు లేకపోతే లేదు అనేది అతని అభిప్రాయం. గిరీశాన్ని చివాట్లేసి బుద్ధిగ చదువుకుంటే ఖర్చు భరిస్తానన్నాడు. కానీ వానిలో మార్పు వచ్చినట్లు కనిపించదు.

ఈ గిరీశం ద్వారా రచయిత కుహనా సంస్కర్తల్ని బయటికి లాగాడు. వితంతు వివాహం అంటే పెవడో ఒకడు పెళ్లికి ఒప్పుకున్న వాన్ని, వాడు ఒప్పుకోవటమే చాలునని చేసుకొని జీవితమంతా కష్టాలుపడుతూ వానికి ఊడిగం చేస్తూ బతకటం కాదనీ, యోగ్యుడైనవాడు లభించినప్పుడే చేసుకోవటం నిజమైన సంస్కరణ అవుతుందనే భావాన్ని ఈనాటకం ద్వారా రచయిత కలిగించాడు. ఆనాడు సంస్కర్త వీరేశలింగం పంతులుగారు స్త్రీల కోసం పాటు పడుతూ వితంతు వివాహాలు జరిపిస్తూ ఉండినాడనే విషయం కూడ నాటకంలో ప్రస్తావనకు వచ్చింది. వీటితోబాటు వేశ్యావృత్తి నిర్మూలన విషయం కూడా రచయిత ప్రస్తావించాడు. సమకాలీన సమాజాన్ని విమర్శిస్తూ మరెన్నో జీవిత సత్యాలను రచయిత నాటకంలో ప్రదర్శించాడు.



BRAOU

### 1.3.3 పాత్ర వివరణ

కాళీమంటపంలో సారాయి సేవిస్తూ చిలుం పీలుస్తూ 'మహాజ్ఞానులందరూ' వేదాంతం ముచ్చటించు కుంటున్నారు. బైరాగి, మున్సబునాయుడు, వీరేశం, మనవాళ్ళయ్య వీళ్లకు తోడు సారాయి దుకాణాదారు రామందాసు. అందరూ తాగినమైకంలో తత్వాలు పాడుకుంటూ తత్వజ్ఞాన విచారణలో పడ్డారు. ఆత్మ, ఆత్మజ్ఞానం, పరమాత్మ, పరబ్రహ్మం గురించి వాదాలు సాగిస్తున్నారు. పూర్తి తాగితే గాని పరబ్రహ్మం పట్టుబడదనీ, అమృతంఅంటేఏమిటి? సారాయే, దానికోసమే ఆనాడు దేవాసురులు తన్నుకుచచ్చారనీ బైరాగి అభిప్రాయం. తత్వజ్ఞానం అందరికీ తలకెక్కింది. తాగి తాగి కింద పడేదాకా తాగితేనే నరుడు తన్ను తాను తెలుసుకుంటా డట. ఈ చర్యల మధ్య బైరాగి మరొకిన్ని తమ మహిమలంటూ అభూత కల్పనలు అల్లి ప్రసంగిస్తాడు. వాటిని మున్సబునాయుడు చాల తెలివైన ప్రశ్నలతో వ్యంగ్యంగా ఎగతాళి చేస్తాడు. ఇంతలో పోలీసు హెడ్ వస్తాడు. బైరాగీ, హెడ్డూ తోడుదొంగలు. బైరాగి గుట్టుమట్టు కాపాడ్డానికి హెడ్డు, హెడ్డుకు దొంగ సాక్ష్యాలు సిద్ధం చేయడానికి బైరాగీ సాయం చేసుకుంటారు. వీళ్ళ మాటల్లోనే హవల్దారు కూడా అక్కడికి వస్తాడు. ఆయన అసలు విషయం ప్రస్తావనకు తెస్తాడు. లుబ్ధావధాన్లకు రెండో పెళ్లి పిల్లనిచ్చి శుల్కం డబ్బు పట్టుకొని మాయమైన పోయిన గుంటూరు శాస్త్రుల్లు (కరటకశాస్త్రి) పత్తా ఏమైనా తెలిసిందా అని అడుగుతాడు హెడ్డును. ఆ సంగతి మనకెందుకు భాయీ అంటాడు పోలీసు. లాభంలేని కేసు ముట్టని మనిషి అతడు. వాళ్ళ సంభాషణలు బ్రాహ్మణ్యం, నీతి, ఆచారాలు, రాజకీయాలు, రాజభక్తి మొదలైన వాటి మీద సాగుతాయి.

అంతలో అక్కడికి రామప్పంతులు వచ్చి మోసం జరిగిందంటూ మొత్తుకుంటాడు. లుబ్ధావధాన్లు పెళ్ళాడిన పిల్ల మధురవాణి కంటె పట్టుకు పారిపోయింది, అది ఇప్పించడనీ లేకుంటే మధురవాణి ఇంట్లో అడుగుపెట్టనివ్వదనీ గోలపెడతాడు. ఆ పిల్ల పట్టుకుపోయిన కంటె ఎలా తెప్పించగలం అని హెడ్ గొణిగితే, అవధాన్ల మీద కూనీ కేసు బనాయిస్తే కంటె సొమ్ము ఇస్తాడు, నీకు చెయ్యి తడీ అవుతుందని ఉపాయం కూడ రామప్పంతులే చెప్పేస్తాడు. ఈ యెత్తుపారడానికి సాక్షులంటే, అక్కడే మందిరంలో ఉన్న మహానుభావులు తాగిన వాళ్ళు తాగి పడిపోగా మిగిలిన బైరాగి, రామందాసు అందుకు తయారవుతారు.

BRAOU

అందరూ కలిసి లుబ్ధావధాన్ల ఇంటికి వెళ్ళి అతన్ని పట్టుపట్టి తిరిగివచ్చి గుడిగుమ్మం దగ్గర మాట్లాడుతున్నారు. పాపం వాళ్ళ ప్లాను లుబ్ధుని దగ్గర పెద్దగ పనిచేయలేదు. బెదిరిస్తే పన్నెండు రూపాయలు మాత్రం రాలినాయి, నలుగురికీ తలిసి కంటె సంగతి నాకు తలీదు మొర్రో, నేనే మోసపోయానని లుబ్ధావధాన్లు ఏడుపు. ఈ సందున [illegible] లుబ్ధుని దగ్గర తన బాకీ తాలూకు నోటు ఒకటి ఉపరాగా లాగేశాడు.

రామప్పంతులు తన సంగతేమిటని ఏడుస్తూంటే హెడ్ నేనేం చేయలేనంటూ తన భాగం మూడు రూపాయల లంచం పట్టుకెళ్ళమంటాడు. మిగిలిన భాగాలు రామందాసు, బైరాగి, కనిష్టేబు తీసుకుంటారు. తనకూ ఆ మూడు రూపాయలేనా గతి అంటూ గొణుగుతూనే రామప్పంతులు వాటిని పోగొట్టుకోలేక ఏదో 'చిల్లర ఖర్చు'కైనా పనికొస్తుందని తీసుకువెళ్తాడు. కంటె పోయిందంటె ఈ హెడ్డు పట్టించుకోడేమిటని వాని మీద పై అధికారులకు ఆకాశరామన్న అర్జీలు పంపుదామని ఆలోచిస్తాడు.

ఆ సమయంలో మరల లుబ్ధావధాన్ల ఇంటికేవెళ్ళి ఆయన విధవకూతురూ తన 'పాతనేస్తమూ' అయిన మీనాక్షిని కూపీ లాగితే కంటె సంగతి ఏమైనా బయట పడుతుందేమోనని రామప్పంతులు చూస్తాడు. ఇంటిబయట వాళ్ల పనివాడు అసిరిగాడు కనడితేవాన్ని పట్టుకొని సంభాషణ మొదలెడతాడు. సానెమ్మ వచ్చిందగ్గర్నుంచీ ఈయమ్మ సంగతి మరచి ఇటు వైపే రావటం లేదని అసిరిగాడు పంతుల్ని మురిపిస్తూ మాట్లాడ తాడు. తన 'మామూలు' కోసం వాడు ఎత్తువేస్తాడు. 'సానెమ్మతో చెడ్డమనిషండీ' అంటాడు. అంటే పరాయి మగవాళ్ళ నెవరినీ రానివ్వదంటూ మాట మార్చి పంతులు దగ్గర రూపాయ బహుమతిని కొట్టేస్తాడు. మీనాక్షికి వెళ్ళి కబురందిస్తే మరోరూపాయ ఇస్తానంటాడు పంతులు. ప్రయత్నిస్తా నివ్వండంటూ ఆ రూపాయా కొట్టేస్తాడు వాడు. రామప్పంతులు 'చిల్లర ఖర్చు'కని హెడ్డు దగ్గర పుచ్చుకున రూపాయలు నిజంగా 'చిల్లర ఖర్చుకే' పెట్టేస్తాడు. ఆ డబ్బు హెడ్డు లుబ్ధుని దగ్గర నుంచి లంచంగా లాగిందే. నియోగి లౌక్యుడు రామప్ప ఆ లుబ్ధుని విధవకూతురు మీనాక్షిని చేరటానికే లంచంగా ఉపయోగించి (అసిరిగానికిచ్చి) అచ్చంగా "తిన్నయింటి వాసాలు లెక్కపెట్టిన" బాపతుగా తయారయ్యాడు.

### 1.3.4 వ్యాఖ్యానం

సారాయి దుకాణం స్థలంలో, గుడి గుమ్మందగ్గరా ప్రవేశించే పాత్రలు నాటక కథా గమనానికి అవసరమైన పాత్రలు కావు. ఒక్క పోలీసు హెడ్డు, రామప్పంతులు మాత్రం అవసరమైన పాత్రలు. ఇక్కడ ఇతర పాత్రల సంభాషల్లో కథాంశం ముందుకు పోయేదీ కాదు. హెడ్డు దగ్గరకు రామప్పంతులు వచ్చి కంటె పోయిందనీ, లుబ్ధావధాన్ల మీద కేసు పెట్టి కాని, బెదరించికాని కంటె తెచ్చి యిచ్చే మార్గం చూడవలసిందని చెప్పే వరకూ కథ ముందుకు నడవదు. అంతవరకు జరిగిన ఇతర పాత్రల సంభాషణలన్నీ కథా గమనానికి ఆటంకమే. అయితే వీళ్ళ సంభాషణల ద్వారా పాఠకులకు తెలిసేదేమిటి మరి?

ఆయా వ్యక్తుల అజ్ఞానం, మూఢనమ్మకం, మోసం, కపటం, అబద్ధాలు, మాయ మాటలు, వాళ్ళ తాగుబోతుతనం, సోమరితనం, పొట్టకూటి వేషాలు, దొంగ వేదాంతం, వాళ్ళు జీవితాన్ని, సమాజాన్నిచూచే తీరు, వ్యాఖ్యానించే ధోరణి, పోలీసులు దొంగకేసులు బనాయించడం, వాళ్ళ అవినీతి మరెన్నో సవాలక్ష విషయాలు – పూర్తి పతన దశకు చేరుకున్న ఆనాటి సమాజం యొక్క సహస్రసముఖాలు – వాళ్ళ మాటల్లో దర్శనమిస్తాయి. పాఠకుల్ని ఆలోచింప చేస్తాయి. ఈ సంభాషణలన్నీ ఈ నాటకానికి సహజమైన వ్యంగ్య పరిహాస శైలిలో నడుస్తూ పాఠకులను నవ్విస్తుంటాయి. సంఘజీవితంలోని ఈ అవకతవకలన్నీ, అనాచారాలన్నీ అవగుణాలన్నీ, అవలక్షణాలన్నీ నశించి సంఘం సంస్కరింపబడాలన్న దృష్టిని పాఠకులకు కలగజేస్తాయి.

నాటకంలో ఈ స్థలాలే చిత్రంచబడక పోయినట్లయితే అది అసమగ్రం. సమాజం లోని ఈ అట్టడుగు జీవుల్ని – అహో జగత్ సహోదరుల్ని – చిత్రంచినప్పుడే సమాజ దర్శనం పూర్తి చేయించగలనని అప్పారావు భావించాడు. ఈ పాత్రల పరిచయమే లేకపోతే సమాజ జీవితాన్ని పట్టి ఇచ్చే కీలకమైన అంశాలు బయటికి రాకుండా పోయేవి. అందువల్ల ఈ దృష్టితో ఈ పాత్రలకు, వాళ్ళ సంభాషణలకు నాటకంలో ప్రత్యేకమైన స్థానం వుంది.

వేమన్న కాలానికి ముందునుండీ కూడా సంఘంలో బైరాగులు, స్వాములు, గురువులు, వేదాంతులు మొదలైన రకరకాల పేర్లతో మోసగాండ్రు, పొట్టకూటి వేషగాండ్రు సామాన్య జనం యొక్క అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని మాయమాటలతో ఆకట్టుకుంటూ మహిమలున్నాయంటూ, అద్భుతాలు చేస్తామంటూ, బంగారం చేసే విద్య వున్నదంటూ, గురుబోధ చేసే వాళ్ళమంటూ నమ్మిస్తూ పొట్టపోసుకొనే వారు. తాగుబోతులుగా, తిరుగుబోతులుగా ఎటు జూచిన దర్శనమిచ్చే వాళ్ళు. "వేదాంతం పేరుతో మన దేశంలో యెంత వంచన యెంత మూర్ఖత్వం సాగుతున్నదో! అందువల్లే 'వేదాంతి వస్తున్నాడు, చెంబూ ముంతా జాగ్రత్తరోయ్' అనేది సామెతగ రూపొందింది' అన్నాడు గురజాడ. ("గురజాడ" వి. ఆర్. నార్ల. పుట. 98) సరిగ్గా ఈ అవగుణాలన్నిటికి ప్రతినిధే ఈ స్థలంలోని బైరాగి పాత్ర. పోలీసుల అవినీతికి, దొంగ సాక్ష్యాలకీ ఇలాంటి వాళ్ళ తోడ్పాటు ఉంటేది. మహిమల పేరుతో జనాన్ని మోసగించి ఏ తప్పుడు పనులు చేయడానికైనా సిద్ధపడే 'సిద్ధులు' వీళ్ళు. ఆనాటి బైరాగులు, సిద్ధులు, వేదాంతుల స్థానంలో ఈ వైజ్ఞానిక యుగంలో కూడా బాబాలు, అమ్మలు వెలసి ఉండటం గమనించగలం.

సారాదుకాణం రామందాసు వ్యాపార లౌక్యం బాగా తెలిసినవాడు. తాగుబోతు స్వాములు, బైరాగులు ఎక్కడున్నా పసికట్టి ఆకర్షించి వ్యాపారం జోరుగా సాగించుకోగలిగిన దిట్ట. వాళ్ళతో పాటు దొంగ సాక్ష్యాలకూ వెళ్ళి సంపాదించుకోగలిగిన బాపతు. ఆనాటి (బ్రిటిష్ హయాంలోని) పోలీసుల తత్వం, వాళ్ళ అవినీతి, లంచగొండితనం, అదరింపు బెదరింపు ప్రవర్తనకు చక్కని నిదర్శనం పోలీసు హెడ్ పాత్రం. ఇక హవల్దారు ఒకడు, సైన్యంలో ఉండి పించను పుచ్చుకున్నవాడు. అచ్చమైన రాజభక్తుడు.

మున్సబునాయుడు దండిగా బతుకు చూచినవాడు, లోకం ఎరిగినవాడు. ఇతడు వేసే చిక్కు ప్రశ్నలు ముడి విప్పే సూటి జవాబులు 'తత్వజ్ఞానాన్ని' మించిపోయి ఉంటాయి. జీవితానుభవం నుండి చాల సత్యాల్ని గ్రహించుకున్నవాడు. ఇతని సంభాషణలన్నీ 'జ్ఞాన సూత్రా'ల్లాగ ఉంటాయి. వీరేశం, మనవాళ్ళయ్యలు ఇద్దరూ శైవ వైష్ణవ మత పిచ్చి ముదిరి వెర్రిగా మారి దిగజారిన కాలంలో ఆ మతాల పేరున సోమరులుగ, తాగుబోతులుగా, తిరుగుబోతులుగా తయారైన మనుషుల నీడలు.

ఈ పాత్రలన్నీ సమకాలీన సమాజంలో కళ్ళెదుట పొరాడుతూ ఉండిన వాళ్ళే. నాటకంలో ప్రవేశించి తమ పాత్రలన్నీ అమోఘంగా నిర్వహించినవాళ్ళు. ఈ నాటకం, ఈ దృశ్యాలు రాసే కాలంలో అప్పారావు



BRAOU

రాత్రిపూట కాస్త వేషం మార్చుకొని సారాయి దుకాణం దగ్గరకు వెళ్ళి ఎవరూ చూడకుండ కాస్త దూరంగ కూర్చొని అక్కడ సాగే తంతునూ, సంభాషణలన్నూ గమనించి వినివచ్చేవాడని అంటారు. [శ్రీరంగం నారాయణ బాబు చెప్పిన ఒక కథాంశం ద్వారా ఈ సంగతి తెలుస్తుంది]. బహుశః ఇందువల్ల కూడ ఈ పాత్రలన్నీ ఇంత సహజంగా, సజీవంగా రూపు దిద్దుకున్నాయనిపిస్తూంది. ఈ పాత్రలు ఈ దృశ్యాలతో నాటకం సమకాలీన సమాజాన్ని ఇలా అద్దం పట్టినట్టు చూపడంలో ప్రాచీన సంస్కృత నాటకం-ఒకే ఒక గొప్ప సాంఘిక నాటకం శూద్రకుని 'మృచ్ఛకటికం' గుర్తు వస్తుంది.

ఈ రెండు స్థలాల్లో పాత్రలు పాఠకులకు ఎన్నో విషయాల మీద అభిప్రాయాలు తెలుపుతాయి, వ్యాఖ్యానాలు చేస్తాయి, దురాచారాల్ని ఖండిస్తాయి, మూఢనమ్మకాల్ని ఎగతాళిచేస్తాయి. ఆచారాల్లో ఎలాంటి మార్పులు వస్తే బాగుంటుందో కూడ వివరిస్తాయి. బైరాగుల సిద్ధుల 'వేదాంతాన్ని మహిమల్ని' తూర్పారబడతాయి. వ్యంగ్యంగా ఎగతాళి చేస్తూ నవ్విస్తాయి. పోలీసుల అవినీతిని రచ్చకీడుస్తాయి.

మనశాస్త్రాలు, పురాణాలు, మతం వాటిని అంటిపెట్టుకొని ఉండే మూఢనమ్మకాలు. వాటి మీద విమర్శ మున్సబునాయుడు ప్రశ్నలూ జవాబుల్లో వ్యక్తమౌతున్నాయి. ఆకాశం ముందు పుట్టిందా? భూమి ముందు పుట్టిందా? అనేది పూర్వం ఎప్పటినుండో చాల కుతూహలమైన ప్రశ్న. శాస్త్రజ్ఞానం వృద్ధి చెందక మునుపు. మనకది అందుబాటులో రాక పూర్వం 'చెట్టుముందా విత్తుముందా' అన్న ధోరణిలో రకరకాల చర్చలు సాగేవి. మన వాళ్ళు 'ఆకాశం గగనం శూన్యం' అన్నారు. "మన శాస్త్రంబులలోని రహస్యంబులు మ్లేచ్ఛులకెట్లు తెలియును?" అనేటువంటి మన అజ్ఞానపు గర్వాన్ని, ఛాందస గర్వాన్ని మున్సబునాయుడు తన సారాయి భాష లోనే దెబ్బగొడుతున్నాడు - "ఆకాశంలో ఏమీ లేకపోతే మరి తెల్లోడు పట్టణంలో గొట్టాం పెట్టుకొని ఒకటే చూస్తుంటాడే ఆకాశంవెపు. తెల్లోడి మహిమ నీకేటి తెలుసు. తెల్లోడి సారాయికి తెనుగోడి సారాయికి ఎంత భేదం వుందో, తెల్లోడికీ నీకూ అంత భేదం వుంది" అంటున్నాడు.

ఒకప్పటి శైవ వైష్ణవ మతాల వ్యర్థమైన కొట్లాటను గుర్తుచేసే పాత్రలు వీరేశం మనవాళ్లయ్యా, ఆ మత పిచ్చి ఆఖరకు ఆనాటి తాగుబోతుతనం కింద, [illegible] చేష్ట కింద దిగజారింది. దొంగ బైరాగి వీళ్ళిద్దరికీ వంతపాడేవాడు-శివబ్రహ్మం అంటాడు, రామ బ్రహ్మం అనీ అంటాడు. వీళ్ళ కొట్లాటను తీరుస్తూ రామందాసు వేమన్నతత్వం బోధిస్తాడు. శివుడూ రాముడూ అంటూ కొట్లాడటం ఎందుకు, ఇద్దరూ నిజమే ఇద్దరి స్వరూపమూ జ్ఞానస్వరూపం, జ్ఞానం నిర్మలంగ గాజుకుప్పెలో వెలిగే దివ్వెలాంటిది, దేహం గాజుకుప్పె లాంటిది "యీఅన్నసారం దేహంలో పడితేగాని పరమాత్మ పెజ్జలించదు..." అంటాడు. ఈ రామందాసు వ్యాఖ్యానంలో భౌతికవాద ఛాయలు కన్పిస్తాయి. పంచభూతాత్మకమయిందే ఆత్మ, ఆత్మ అనేది దేహాన్ని విడిచి వేరే ఏమీ లేదు తిండీ తిప్పలూ లేకుంటే ఈ ఆత్మ ప్రజ్వలించదు అంటూ అనుభవ రూపంలోని భౌతిక తత్వాన్ని బయట పెడుతున్నాడు. ఆత్మఅంటే ఏదో అగోచరమైన పదార్థం అనే భావవాదంతోపాటు, పంచభూతాత్మకమైందే ఆత్మ అనే భౌతిక వాదానికి భారతీయ తత్వశాస్త్రంలో ప్రాతిపదిక ఉందనే విషయం మరువకూడదు.

ఇక్కడ వీళ్ళ భాషలో కడుపులో చుక్కపడితేనే పరబ్రహ్మ పట్టుబడేది. పరమాత్మ ప్రజ్వలించేదీను. మతం పేరునా, భక్తిపేరునా, వేదాంతంపేరునా దిగజారిన వ్యవస్థ స్వరూపాన్నీ, పరిస్థితిని ఇది ప్రతిబింబిస్తూంది. ఆఖరికి బైరాగి అమృతమేది సారాయేనని తేల్చేస్తాడు - "నాడు యిదేగదా తాగడానికి దేవాసురులు తన్నుకుచచ్చారు". "బ్రహ్మానందవంటే యేటి? కడుపునిండా సారా, ముక్కునిండా పొగ, సక్కని పడుచుపిల్లాకదా?" అనేది రామందాసు వ్యాఖ్యానం. ఈ వ్యాఖ్యానాన్ని "పూనం యినండాస్సి" అంటూ మున్సబునాయుడు ఎగతాళి చేస్తాడు.

దొంగ బైరాగిని ఆ బాపతువాళ్ళు గుట్టును మెల్లగా నాయుడు బయటికి లాగుతున్నాడు: "గురూ బంగారం సేస్తారుగదా-ఆదెట్టి హరిద్వారంలో మటం గట్టించక మాలాటోళ్ళని డబ్బెందుకడుగుతారు?" బైరాగులకు సిద్ధులకు ఏవో మహిమలుంటాయని, బంగారం చేసే విద్య వాళ్ళకు తెలుసుననీ ఆనాటి అమాయక జనం నమ్మకం. ఆ మూఢనమ్మకాన్ని ఒకే దెబ్బతో మునసబు బద్దలు చేశాడు. మహిమలు పేరుతో మీరు వర్ణించే అభూత కల్పనలు అన్నీయిన్నీ కావు. ఖేచరీగమనమ్మీద ఆకాశమార్గంలో ఒకనాడు ప్రయాగ రెండో వాడు జగన్నాథం సేవిస్తూ ఆ వూర్లో అమ్మవార్ని సేవించడానికి దిగారట; భక్తుడు సారాయి దుకాణాదారు రామందాసు ఆ సిద్ధున్ని కాస్త పోల్చి నిలిపేశాడు! తాగుబోతుల్ని వాళ్ళ గమనాన్ని రామందాసు చక్కగా



BRAOU

పోల్చాడు. ఈ సిద్ధునికి ఆరువొందల సంవత్సరాల క్రితం పరమపదించిన వేమన్న తాతగారట. మరి ఈయన వయస్సేమిటి అంటే ఆదీ అంతూలేనిదానికి లెక్కేమిటి, పరమాత్మకెన్నాళ్ళో అన్నేళ్ళు అంటాడు. "ఏం యిలవైన మాట లింటున్నాం" అంటూ నాయుడు వీరి వాగుడును ఎద్దేవా చేస్తాడు. ఇలాంటిదే కాశీ ఉదంతం ఒకటి – నేరుగ గంగనే మంత్రించి సారాయిచేసి పారేసిన అద్భుతకథ చెబుతాడు బైరాగి – "కనుక్కోగలిగిన జ్ఞానికి గంగానది అంతా సారాయి కాదా?" అనేది ఈ 'జ్ఞాని' బోధ. ఈ సంభాషణల్లో అంతటా వ్యగ్యం, హాస్యం నింపి ఈ వేషధారుల మోసాల్ని రచయిత బట్టబయలు చేస్తున్నాడు.

హవల్‌దార్ అచ్చన్న రంగప్రవేశంచేశాక వాళ్ళసంభాషణలు వేరేవిషయాల మీదికి మళ్ళాయి. గుంటూరు శాస్తుర్ల పత్తా గురించి మొదలై బ్రాహ్మలు పిల్లల్ని ముసలాళ్ళకు అమ్ముకోడాలమీదికి, రండాగర్భాల మీదికి, బ్రాహ్మణ్యం దురాచారాలమీదికి వెళ్ళాయి. "ఈ రోజుల్లో బ్రాహ్మణ్యం యెక్కడుంది? యెక్కడ చూచినా పిల్లల్ని ముసలాళ్ళకి అమ్ముకోడాలు రండాగర్భాలే కదా? ... నేను యెన్ని తాలుకాల్లో నౌఖరీ చేశానో అన్ని తాలూకాల్లోనూ రండా గర్భాలు యెన్నని చెప్పను? నన్నడిగితే వెధవలు పెళ్ళి చేసుకోవడవే ఉత్తమం అంటాను ...." అనేది పోలీసు హెడ్డు అభిప్రాయం. అనుభవం మీద నిగ్గుదేలిన అభిప్రాయం. ఇంగ్లీషు వాళ్ళు పిల్లలున్న ఆడవాళ్ళనిగూడ రెండో పెళ్ళి చేసుకుంటున్నారు, సుఖంగా ఉంటున్నారు. మనవాళ్ళు మాత్రం వాళ్ళలాగ మారు మనువులు ఎందుకు చేసుకోకూడదు? బాల విధవల అగచాట్లు, అవినీతి పనలూ ఉండవు కదా అనే ఆలోచనలు కూడా చేస్తారు వీళ్ళు. హవల్‌దారు మాత్రం రాజభక్తి, దైవభక్తి, బ్రాహ్మణభక్తి దండిగా ఉన్నావాడు. యథాస్థితివాదికి ప్రతినిధి. ఆచారాలూ వ్యవహారాలూ ఎలాఉంటే అలా పోవాలి. ఎవర్నీ విమర్శించ కూడదు, దేవుడు చెప్పిన నీతి పాటించాలంటాడు. సైన్యంలో పనిచేసినవాడు కాబట్టి ఇలాంటి అభిప్రాయాలు ఉండటంలో ఆశ్చర్యంలేదు. పైవాళ్ళ ఆజ్ఞల్ని నోరెత్తకుండా శిరసావహించడమే సైన్యంలో పద్ధతి. ఆ అలవాటుకొద్దీ హవల్‌దారు లాంటివాళ్ళు ఇలాగే మాట్లాడగలరు. అయితే మున్సబునాయుడు అతని వాదాన్ని చీల్చిపెడుతున్నాడు, "రాముడు ఎధవముండల్ని కానిపనులు సెయమన్నాడూ? మన్లో మారుమనువులుండేవా కావా?" అంటూ. దేవుడు చెప్పిందే నీతి అంటే అదంతా పాటిస్తున్నారా? పూర్వం మనలో మాత్రం మారు మనువులు లేకుండా పోలేదే. మధ్యలో వచ్చిన ఈ దురాచారాలు ఇలాగే ఉండాలనుకోవటంలో అర్థమేమిటి? ఇదీ మున్సబు వాదనలో భావం. ఆనాడు వీరేశలింగం పంతులుగారి సంస్కరణ ఉద్యమానికీ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు అనుకూలంగా ఆయన చేపట్టిన కార్యక్రమాలకూ ఈ భావాలు బాసట.

"కుంపిణీ నమ్మక్ తిన్న తరువాత ప్రాణం వున్నంతకాలం కుంపిణీ బావుటాకి కొలువు చెయ్యాలి ... "సీవరాణీ కాళీ అవతారం కూడ కాదట! నేరుగ ఆ రాముడి అవతారమే అనేది రాజభక్త హవల్‌దార్ దృఢమైన అభిప్రాయం.

పోలీసు 'నీతి'నీ, వాళ్ళకూ బైరాగులకూ బాబాజీలకూ ఉండే సంబంధాన్ని అప్పారావు రచ్చకీడ్చాడు. "జ్ఞానం నీతి ప్రధానం. వేమన్న యేమన్నాడు ..." అంటూన్న పోలీసు హెడ్డును మున్సబు నాయుడు మధ్య లోనే ఎదుర్కొంటాడు : "ఏమన్నాడా? నీతికి పోలీసోణ్ణి – ఘోనానికి సాతానోణ్ణి అడగమన్నాడు" అంటూ. 'పోలీసునీతి' మీద ఇంతకంటె తీవ్రమైన వ్యంగ్యం ఏముంటుంది? కొంపమునిగింది, మీ సాయం కావాలని రామప్పంతులు పరిగెత్తుకొస్తే ఈ హెడ్డు వేసిన మొదటి ప్రశ్న, "డబ్బేవైనా పేల్తుందా?" అని. డబ్బొచ్చే మార్గం కనబడకపోతే పోలీసులకు కాళ్ళూ చేతులూ ఆడవు. బెదిరించడం, నేరాలు బనాయించడం, కొస్త ఆశ ఉంటే కూనీకైనా తయారుచేయడం వీళ్ళ 'డ్యూటీ'. "పోలీసు డూటీ అంటే బెదినింపే గదా అన్నా": ఇది అనుభవజ్ఞుడైన రామప్పంతుల నిర్వచనం.

బైరాగిని పోలీసు హెడ్డు అందరిముందూ చాల మర్యాద చేస్తాడు. 'గురోజిగారు' అని సంబోధిస్తాడు. ఆయన బంగారంచేసే విద్యావ్యవహారం గురించి మున్సబునాయుడు రచ్చకీడ్వబోతే ఈ హెడ్డు మధ్యలోనే అడ్డుపడి "అవి వేరే రహస్యాలు. వూరుకోండి మావా!" అంటూ రక్షించి మాట మార్చేస్తాడు. "మరివొక రసలింగం తయారు చేసి ఈ శిష్యుని ప్రసాదించండి గురూ" అంటాడు. ఈయన మహిమల్ని యోగ మహత్యాన్ని ఒకటే మెచ్చుకుంటాడు. ఆయన చెప్పే అద్భుత కథల్ని ఆశ్చర్యంగా వింటాడు. హెడ్డు ఈ విధంగ బైరాగిని గౌరవించడం, నమస్కారాలు చేయడం చూస్తే నిజమైన భక్తి శ్రద్ధలే ఉన్నాయేమో అని పాఠకులు భ్రమపడే అవకాశం ఉంది. కాని తరువాత తెలుస్తుంది – హెడ్డు ఈ పాట్లన్నీ ఒక పథకం ప్రకారమే పడుతున్నాడన్న సంగతి. పోలీసు స్వాములకు రెడీమేడ్ సాక్ష్యాల్ని సిద్ధం చేసే వాళ్ళు ఈ బైరాగి స్వాములూ,



BRAOU

బాబాజీలూ. అందువల్ల నలుగురి ముందూ ఈ బైరాగిని 'గొప్పవాన్ని' చేసేసి దొంగ సాక్ష్యం పలికేందుకు 'యోగ్యత' సంపాదించి పెడదామని చూస్తాడు. మూఢజనాన్ని మభ్యపెట్టాలన్న ప్రయత్నమే ఇదంతా. రామప్పంతులు "ఆ బైరాగాడుసాక్ష్యం పలకడే" అంటే "వేషం వేసుకు ముష్టెత్తుకునే బైరాగాడనుకున్నావా యేమిటి? ఆయన గొప్ప సిద్ధుడు. నిలువెత్తు ధనం పోస్తే అబద్ధవాడ్డు" అని అదిలిస్తాడు కూడా హెడ్డు. తమాషా ఏమిటంటే ఆ వెంటనే బైరాగిహెడ్డు వెంట దొంగ సాక్ష్యానికి వెళ్ళడం, దొరికిన లంచంలో బైరాగి భాగం మూడు రూపాయల్ని హెడ్డు "గురోజీ తమకో తులసిదళం" అంటూ సమర్పించడం జరిగిపోతాయి. తృణం, కణం ఏది దొరికినా హరిద్వారంలో మఠానికే సమర్పిస్తానంటూ ఆ స్వాములోరు అక్కడే కాశీమఠం పంచనే ఉన్న సారాయి దుకాణానికి సమర్పించడం కూడ జరుగుతుంది. ఈ స్వాములవారికి యోగ దృష్టితో ఎక్కడ ఏం జరిగేది అంతా కనిపిస్తుందట. అందువల్ల సాక్ష్యం ఉన్నదున్నట్లుచెబుతాడట. నిజాన్ని అబద్ధం, అబద్ధాన్ని నిజంచేయగల సమర్థులైన సాక్షులు. అసలు లోకమే అంతా ఒక పెద్ద అబద్ధం అట! ఇంకేం చింత! అబద్ధమాడినా నిజం చెప్పినా అంతా ఒక్కటే! ఇదే బైరాగుల సత్యదృష్టి. ఈ దృష్టి ప్రభుత్వ యంత్రాంగం లోని పోలీసుకేసులకు అవసరం. ఇద్దరూ తోడు దొంగలు.

గురజాడ అప్పారావు ఈ సారాయి దుకాణం స్థలం ద్వారా సమాజ వాస్తవాల్ని ఎన్నింటిని మన ముందుంచు తున్నాడో చూడండి. అజ్ఞానం, మోసం, దురాచారం నిష్క్రమించినప్పుడే దానికి ఆరోగ్యం చేకూరేది.

గురజాడ వస్తు నిర్వహణలో చూపించిన వాస్తవికత, ఆధునికత శిల్పంలోనూ కనిపిస్తుంది. భాష విషయంలో గురజాడది ఎంత ముందుచూపో అర్థమవుతుంది. గురజాడ నాటక భాషకు సాహిత్య గౌరవం కల్పించే 'సాహసాన్ని' ఆరోజుల్లో చేశాడు. కన్యాశుల్కంలో భాష విశాఖ, విజయనగర మాండలిక భాష. అర్థ వివరణ కింద కొన్ని పదాలను ఇచ్చాము. వాటిని జాగ్రత్తగా పరిశీలించండి. వర్గస్వభావాన్ని గుర్తులో ఉంచుకొని పాత్రోచితంగా గురజాడ భాషను ప్రయోగించడం మనం గుర్తించవచ్చు.

వివిధ సమస్యలతో, రకరకాల పాత్రలతో ఈ నాటకం ఏడు అంకాలుగా పెరిగింది. ఒక్కో అంకం మరి కొన్నిస్థలాలుగా విభాగం అయింది. ఆధునిక నాటకాలు సాధారణంగా 'రంగం' (Act), 'దృశ్యం' (Scene) అన్న పద్ధతిలో విభాగం అయి ఉంటాయి. స్థలం, కాలం మారినప్పుడు జరిగే ఈ విభజన 'స్థలం' అన్న పేరుతో సూచింపబడటం ఈ నాటకంలో సహజంగా ఉంది. ఈ నాటకాన్ని రంగస్థలం మీద ప్రదర్శించాలంటే సంక్షిప్తం చేసుకోవలసి ఉంటుంది; అలా కుదించి చేశారు కూడా.

"నాటకం మీద కంటె జీవితం మీద గురి యెక్కువ" కనుకనే నాటక శిల్పం, సంవిధానం, కథా గమనం మొదలైనవి చెడతాయెమోననే సందేహం లేకుండా రచయిత సారాయి దుకాణం లాంటి దృశ్యాల్ని కల్పించాడు; అన్ని రకాల పాత్రల్ని ప్రవేశపెట్టి వాళ్ళ సంభాషణల్లో సమకాలీన సమాజాన్ని తూర్పారబట్టాడు. సమకాలీన సాంఘిక విమర్శనూ, గురజాడ నాటక శిల్పాన్నీ స్థూలంగానైనా తెలుసుకోటానికి పాఠ్యం వుపయోగ పడుతుంది.

BRAOU

## అభ్యాసం – 2

పాఠ్యం ద్వారా మీరు గ్రహించిన ఆనాటి సమాజంలో మూఢనమ్మకాల గురించి, దురాచారాల గురించి రాయండి. (30 **పంక్తుల్లో రాయండి)**

## అభ్యాసం – 2

పాఠ్యంలోని నాటక భాగాలు నాటక ప్రయోజనానికి చేస్తున్న దోహదం ఏమిటో పేర్కొనండి. (30 పదాల్లో రాయండి)

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

________________________________________________

## 1.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- కన్యాశుల్క నాటక కర్త గురజాడ ఆధునికతకు శ్రీకారం చుట్టిన రచయిత.
- మొట్టమొదటిగా తెలుగులో సాంఘిక - స్వతంత్ర నాటకం, వాడుక భాషలో రాయబడిన నాటకం కన్యాశుల్కం.
- ఈ నాటకంలోకన్యాశుల్కం, వితంతు వివాహం, వేశ్యావృత్తి నిర్మూలన, కుహనా సంస్కర్తల గుట్టు బయలుతో బాటు మరెన్నో సమాజ జీవిత చీకటి కోణాల్లవైపు గురజాడ కాంతి ప్రసిరింపచేశాడు.
- పాఠ్యభాగం అయిన '4, 5 స్థలాలు' లో ప్రవేశపెట్టిన పాత్రలు అధోలోక జీవులు. సమాజంలోని ఈ వర్గాన్ని చిత్రించినపుడే సమాజ దర్శనం పూర్తి చేయించగలనని గురజాడ భావించాడు.
- గురజాడ వాడుకభాషలో విజయనగర, విశాఖ మాండలికాన్ని పాత్రోచితంగా వుపయోగించడం గమనార్హం.
- ఏడు అంకాలుగా విస్తరించిన ఈ నాటకంలో కథాగమనానికి అవసరమనిపించే పాఠ్యంలోని స్థలాలు నిజానికి గురజాడ వాస్తవిక జీవిత చిత్రీకరణ ప్రయోజనాన్ని నెరవేర్చేందుకు ఉద్దేశించినవి. ఆయనకు 'నాటకం మీద కంటె జీవితం మీద గురి ఎక్కువ'.

BRAOU

## 1.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబు రాయండి.

1. సారాయి దుకాణం స్థలంలో దర్శన మిచ్చే పరభాగ్యోప జీవుల మోహపు బతుకులేమిటో, సమకాలీన సమాజ క్షీణ సంస్కృతికి వాళ్ళు ఎలా నిదర్శనమో చర్చించండి.
2. పాఠ్యంలోని స్థలాలో పాత్రల సంభాషల్లో ప్రసక్తికి వచ్చిన ఆనాటి దురాచారాల్ని వివరించండి.

15 పంక్తులో రాయండి

1. మీపాఠ్యం ఆధారంగా గురజాడలోని సునిశిత పరిశీలనా శక్తినీ నాటక నిర్మాణ దక్షతనూ తెలపండి.
2. సంస్కరణ ఉద్యమ లక్ష్యమేమిటో ఈ పాఠాన్ని పరిశీలించి తెలపండి.
3. మీ పాఠ్యంలో కనిపించే మాండలికమేదో పేర్కొని ఉదాహరణలివ్వండి.
4. గురజాడను పరిచయం చెయ్యండి.

## 1.6 ఆకళింపు ప్రశ్నలు

1. కన్యాశుల్కం నాటకాన్ని పూర్తిగా చదవండి. అందులో 'వస్తువు'నూ పాత్రచిత్రీకరణనూ సంభాషణలనూ పరిశీలించండి. ఈ పాఠం బాగా అర్థం చేసుకోవడానికి ఆ పరిశీలన తోడ్పడుతుంది. అలాగే నాటకం మొత్తం మీద వాడుక భాషా ప్రయోగాన్ని గమనించండి.
2. మీ పాఠంలోని వాడుకభాషలో ప్రయోగింపబడిన ప్రత్యేక మాండలిక పదాలు ఎత్తి రాయండి.
3. యాసతోకూడిన పదాలకు ఆధునిక ప్రామాణిక పదరూపాలు రాయండి. పాఠంలో మాండలిక యాస మాత్రమే కాదు. ఒక్కొక్క పాత్ర ఉచ్చారణలో కూడా మరల తేడాలు (యాసలో) ఉన్నాయి పరిశీలించండి.
4. మొట్టమొదటి కన్యాశుల్కము (తొలిముద్రణ) 1896లో వెలువడింది. ఆ తొలి ముద్రణ ప్రతిని సేకరించి విపులమైన వ్యాఖ్యాన వివరణలతో బంగోరె 1969లో వెలువరించారు. ఆ ప్రచురణలో అప్పారావుగారి అంకితపత్రం, ప్రథమ ముద్రణకు పీఠిక, ద్వితీయ ముద్రణకు పీఠిక, బం.గో.రె. ముందు మాటలు. ఆరుద్ర అభిప్రాయము, మధురవాణి పాత్ర : ఒక పరిశీలన – ఒక పరిశోధననాటకం, అనుబంధంలో వివరణలు వ్యాఖ్యానాలు లభిస్తాయి. తొలిముద్రణను, ఇపుడు లభిస్తూ మీ అధ్యయన కేంద్రంలో ఉన్న ముద్రణను తులనాత్మకంగా పరిశీలిస్తూ చదవండి. ఒకరచయిత తన రచనను తిరగరాసినప్పుడు ఏం జరుగుతుందో తెలుసుకుంటారు.

### అభ్యాసాలకు జవాబులు

1. ఈ నాటకం 19వ శతాబ్ది మొదట్లోవచ్చిన తొలి తెలుగుస్వతంత్ర – సాంఘిక నాటకం. సమకాలీన సమాజ జీవితాన్ని విమర్శనాత్మకంగా చిత్రించిన మొదటి నాటకం. ఆనాటికే వాడుక భాషలోవెలువడిన మొట్టమొదటి ఆధునిక నాటకం.

2. కన్యాశుల్కం నాటక రచనాకాలం నాటికి ఈ దురాచారం దారుణంగా పరిణమించి ఉంది. అయిదారు సంవత్సరాలలోపు వయసు ఆడపిల్లల్ని తల్లిదండ్రులు ధనాశతో ముసలి వాళ్ళయిన పెళ్ళికొడుకులకు ఎక్కువ శుల్కానికి అమ్ముకొనే వాళ్ళు. ఆ పిల్లలు పెద్దవాళ్ళు కాకమునుపే ముసలి భర్తలుచచ్చిపోతే ఆ పిమ్మట అమ్మాయిలు జీవితాంతం నిర్బంధ వైధవ్యం అనుభవించవలసిందే. ఒంటిపూట తిండి. బండెడు ఇంటిచాకిరి వాళ్ళవంతు. అంతేకాదు తలలు గొరిగించేవారు అలంకారాలు చేసుకోవడాన్ని నిషేధించారు. ఏ శుభకార్యంలోకి రావటానికికానీ, నలుగురిలోకి వచ్చి ముఖం చూపించడానికి కానీ వీల్లేదు. 'వెధవముండ' అనేది ఆనాటి వాళ్ళ నిత్య వ్యవహారంలోనలిగిన తిట్టుమాట. వీళ్ళ ముఖం చూడటమే అశుభం పాపం అని భావించేవరకూ వెళ్ళింది. అది ఆనాటి వాళ్ళ ఛాందసత్వం, మూర్ఖత్వం, క్రూరత్వం. సంఘంలోఎటు చూచినా బాల విధవలే. వాళ్ళ పరిస్థితి చాల దయనీయంగా తయా రయింది. ఆనాడు విజయనగరం మహారాజు సేకరించిన లెక్కల ప్రకారం ఈ కన్యాశుల్క వివాహాలు, పసిపిల్లలకు సంవత్సరానికి మూడు నాలుగు వందల వరకూ జరిగేవని తెలుస్తూంది. ఒక్క ఆ ప్రాంతం తోనే ఈ పరిస్థితికి చలించిపోయే గురజాడ ఈ నాటక రచనకు పూనుకున్నది.

ఈ దురాచారాలు, మరెన్నో దురాచారాలతోపాటు ఆనాడు మూఢనమ్మకాలు కూడా సంఘంలో రాజ్యం చేశాయి. అవిద్య, అజ్ఞానం, దరిద్రం వీనికి ముఖ్యమైన కారణాలు. బాబాలు, బైరాగులు, సిద్ధులు, వేదాంతులు మొదలైన పేర్లతోపొట్టకూటి కోసం అమాయకులైన జనాన్ని తమకేవోమహిమలున్నా యంటూ మోసగించడం ఆనాడు సర్వసాధారణం. ఈ పాఠంలో దర్శనమిచ్చే బైరాగి అలాంటి వాళ్ళలో ఒకడు. ఆయనకు బంగారం చేసే విద్య తెలుసునంటాడు. 'అద్దెట్టి హరిద్వారంలోమఠం కట్టించక మాలాంటి వాళ్ళను చందాలడగడం దేనికి?' అని మున్సబునాయుడు ప్రశ్నిస్తాడు. తాము చేసిన బంగారం తామే వాడుక చేస్తే తల పగిలి పోతుందని మరో దొంగ విద్యా ప్రదర్శన చేస్తాడు. పోనీ ఇతరులకి ఇచ్చి వేయవచ్చు కదా అని మున్సబునాయుడు మరి ప్రశ్నించక ముందే పోలీసు హెడ్డు మధ్యలోనే అడ్డుపడి "అవన్నీ వేరే రహస్యాలులే మావాఁ ...' వూరుకొమ్మంటాడు. అదీ రహస్యం! ఈ బైరాగికి ఖేచరీ గమనం వుందట. ఒక రోజు హరిద్వారం మరుదినమే జగన్నాథంసేవించి అలా



BRAOU

ఆకాశంలో వస్తున్నాడట. ఆయన మంత్రిస్తే గంగాజలం సారాయి అయి పోయిందట. ఆరువందల సంవత్సరాల క్రితం పరం పదించిన వేమన్నగారు ఈయన తాతగారట. మరి ఈయన వయసేమిటి అనే సందేహం వస్తే తమ లాంటి మహాత్ముల వయసుకు ఆదీ అంతం లేదంటాడు బైరాగి. వీళ్ళ దివ్య దృష్టికి ఎక్కడ ఏంజరిగేది సర్వం తెలుసునట. కానీ వీళ్ళు పోలీసులకు సాయంగా దొంగసాక్ష్యం పలకడానికి వెళ్లగలరు. అక్కడ లంచంగా తృణమో కణమో దొరికితే కృష్ణార్పణ మంటూ సారాయి దుకాణంలో సమర్పిస్తారు. వీళ్ళ విద్యల మహిమల బండారం అంతా గురజాడ ఈ విధంగా బయట పడేశాడు. ఈ మూఢ నమ్మకాల్ని ఎగతాళి చేశాడు.

3. ఈ పాఠ్య భాగంలోని నాటక స్థలాలు, అందులో వచ్చే పాత్రలు నిజానికి నాటక కథా గమనానికి అవసరం కాదు. కాని ఈ స్థలాలే చిత్రించక పోయినట్లుయితే అది అసమగ్రం. ఈ పాత్రల పరిచయమే లేకపోతేసమాజ జీవితాన్ని పట్టి ఇచ్చే కీలకమైన అంశాలు బయటికి రాకుండా పోయేది. ఈ స్థలాలలో వచ్చే పాత్రలు, వాళ్ళ సంభాషణలు - సంఘ జీవితంలోని అవకతవకలన్నీ, అనాచారాలన్నీ, అవలక్షణాలన్నీ నశించి సంఘం సంస్కరింపబడాలన్న దృష్టిని పాఠకులకు కలగజేస్తాయి.

— పి. సంజీవమ్మ



BRAOU

# భాగం 2 వరవిక్రయం (నవమాంకం)

## విషయక్రమం


2.0 ఉద్దేశం
2.1 ప్రవేశిక
2.2 పాఠ్యం
2.3 పాఠ్య వివరణ
 2.3.1 అర్థవివరణ
 2.3.2 వరవిక్రయ నాటకకథ
 2.3.3 పాఠ్య విషయం
 2.3.4 వ్యాఖ్యానం
**అభ్యాసం – 1, 2, 3**
2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం
2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.6 ఆకళింపు ప్రశ్నలు
 అభ్యాసాలకు జవాబులు


## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు :

1. వరవిక్రయం నాటకం స్వరూపస్వభావాలు. అందులో వ్యక్తమయ్యే ప్రాచీన నాటక లక్షణాలు.
2. వరవిక్రయం లేదా వరశుల్కం అనే సామాజిక దురాచారం స్వభావం.
3. వరవిక్రయం నాటకంలో కనిపించే సంస్కరణ దృక్పథం.

BRAOU

## 2.1 ప్రవేశిక

కన్యాశుల్కం గురించి ఒక అవగాహన ఏర్పరచుకున్నారు. వరవిక్రయం; కన్యాశుల్కం తర్వాత 25 ఏళ్ళకు వెలువడింది. రెండింటి సమస్యలు వేరు. నాటక నిర్మాణాలు వేరు. భాష వేరు. రచయితల సృజనాత్మక ప్రతిభలు వేరు. ఈ భాగంలో వరవిక్రయం నాటకం మీకు పరిచయమవుతుంది. వరవిక్రయంలోని ఒక అంకం పాఠ్యంగా మీరు చదువుతారు.

'చింతామణి' 'వరవిక్రయము' నాటకరచనలద్వారా కాళ్లకూరి నారాయణరావుగారు ఆంధ్రప్రేక్షక లోకానికీ, ఆంధ్రసాహిత్య లోకానికీ సుపరిచితులయ్యారు. 'చింతామణి' నాటకం పలుమార్లు రంగస్థలంమీద ప్రదర్శితం అయింది. బహుళ జనాదరణ పొందింది. వరవిక్రయం కాకినాడలో చాలసార్లు ప్రదర్శింప బడింది. 1922 ప్రాంతంలో నారాయణరావుగారు ఈ నాటకాన్ని రచించారు. తరువాత నాలుగైదు సంవత్సరాల్లోనే ఆయన మరణించారు. 1935లో వరవిక్రయం సినిమాగా తీశారు. ఆ కాలంలో ఎక్కువ ఆదరణ పొందింది కూడా. చింతామణి నాటకంకూడా సినిమాగా తీయబడి ప్రేక్షకుల్ని విశేషంగా ఆకర్షించింది. నారాయణరావుగారి సోదరులు కాళ్ళకూరి సదాశివరావుగారు సినిమా దర్శకులుగా పేరుపొందినవారు.

నారాయణరావుగారు 'చిత్రాభ్యుదయము' 'పద్మవ్యూహము' అనే పౌరాణిక నాటకాలు కూడా రచించారు. కాని ఆయన సాంఘిక నాటకాలకే ఎక్కువ పేరు వచ్చింది.

ఈ రచయిత జీవించినకాలం, సంఘసంస్కరణ ఉద్యమమూ, స్వాతంత్ర్య ఉద్యమమూ సాగుతున్న కాలం. ఈ ఉద్యమాలచేత ఏదో విధంగా ప్రభావితం అయిన సాహిత్యమే ఆనాడు ఎక్కువగా వచ్చింది. నారాయణరావుగారి నాటకాలు కూడా ఆ విధంగా సంస్కరణ ఉద్యమం ప్రభావితం అయినట్టివే. సంఘంలోని

దురాచారాల్ని నిర్మూలించ ఎనేది ఆనాటి రచయితల రచనల ధ్యేయం. నారాయణరావుగారి చింతామణి నాటకం సమకాలీన సమాజంలోని వేశ్యా సమస్యను చిత్రించింది. వరవిక్రయం నాటకం ఆనాటి సమాజాన్ని పీడిస్తూ ఉన్న వరకట్న దురాచారాన్ని అదెంత ఘోరమైన దురాచారమో చిత్రించి, దాన్ని నిర్మూలించాలనే సంస్కరణ ఉద్యమానికి దోహదం చేసింది.

ఆ కాలంలో పౌరాణిక నాటకాలు దండిగా వచ్చాయి. ఎక్కువగా ప్రదర్శితం అయేవి. అందులో పద్యాలు ఎక్కువగ ఉండటం, వాటిని రంగస్థలం మీద దీర్ఘమైన రాగాలాపనతో పాడటం ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. ప్రేక్షకులు విపరీతంగా ఆ నాటకాల్ని చూచేవారు.

ఆ ప్రభావంతో సాంఘిక నాటకాల్లో కూడా పద్యరచన బాగా చోటు చేసుకుంది. సంస్కృత నాటకాల్ని తెలుగులో అనువాదం చేసేటప్పుడు శ్లోకాలకు అనువాదపరంగా పద్యాలు రాయడం కూడ ఒక పద్ధతి. బహుశః ఈ ప్రభావం కూడా ఆనాటి స్వతంత్ర సాంఘిక నాటకాల మీద ఉంది. వాటిలో పద్యరచనకు ప్రోత్సాహం కలిగించి ఉండవచ్చు. వరవిక్రయం నాటకంలో కూడా పద్యాలు చోటుచేసుకోవడం గమనార్హం. ప్రాచీన నాటక లక్షణాల్నికూడా వరవిక్రయం కలిగి ఉంది.

రాయప్రోలు సుబ్బారావుగారి 'స్నేహలతాదేవి' ఖండకావ్యం వరకట్న దురాచారం మీద వచ్చిన రచనల్లో ఒకటి. వరవిక్రయం నాటకంలో కాళింది ఈ దురాచారానికి బలియై బావిలోపడి ఆత్మహత్య చేసుకోగా, 'స్నేహలతాదేవి' కావ్యంలో స్నేహలత అగ్నికి ఆహుతి అయింది.

ఈ దురాచారం 1920 ప్రాంతం నాటికంటే, ఈనాడు మరింత ఘోరమైన వికృతమైన రూపం ధరించి సమాజంలో విలయతాండవం చేస్తూంది. ఈనాటి సామాజిక సమస్యల్లో ఇది చాల ఘోరమైన సమస్య. ఈ సామాజిక సమస్యకు మూలం సంఘ ఆర్థిక వ్యవస్థలో ఉంది. అందువల్ల ఇది కేవలం సంస్కరణ వల్లనో, సాహిత్య ప్రభావంవల్లనో, చట్టాలవల్లనో పరిష్కారం అయ్యే సమస్యకాదు. కాని దీని వికృత స్వరూపాన్ని ఎండగట్టడానికి, సంస్కరణభావవ్యాప్తికి సాహిత్యం దోహదం చేస్తుంది. ఈనాడు ఈ సమస్యమీదనే ఎన్నో నవలలూ, నాటకాలూ, కథలూ వస్తూ ఉన్నాయి.

BRAOU

గురజాడ కన్యాశుల్క దురాచారాన్ని దుయ్యబడుతూ నాటకం రాసిన పాతికేళ్ళకు వరశుల్క దురాచారాన్ని గూర్చి కాళ్ళకూరి నాటకం రాయవలసిరావటం మనం గమనించాలి. సంఘంలో పరిస్థితులనూ, ఆచార వ్యవహారాల్లో మార్పులనూ ఈ రెండు నాటకాలు ప్రతిబింబిస్తున్నాయి. కన్యాశుల్కం అంటే కన్యలను అమ్ముకోవటం. అందునా ముక్కుపచ్చలారని పిల్లల్ని ధనంకోసం ముసలివాళ్ళకు అమ్ముకోవటం. వాళ్ళు కాస్త గుటుక్కుమంటూనే ఆ పిల్లలు జీవితాంతం నిర్బంధ వైధవ్యం అనుభవిస్తూ బతుకులు బండలు చేసుకోవడం. ఈ విషయాలను కన్యాశుల్కం నాటకంలో గమనించాము. మరికొన్నేళ్ళకే దాని స్థానంలో సరిగ్గా దానికి వ్యతిరేకమైన దురాచారం వరశుల్కం చోటుచేసుకోవడం ప్రారంభమైంది. 'వరశుల్కం' అనే మాటనే 'వరకట్నం' 'వరదక్షిణ' అని కూడా అంటారు. కట్నం అంటే కానుకలు అని అర్థం. ఒకప్పుడు పెళ్ళికొడుక్కు పెళ్ళి సమయంలో అమ్మాయి తరుపువాళ్ళు అభిమానంతో కానుకలు సమర్పించడాన్ని వరకట్నం అనేమాట ఉపయోగించి చెప్పడం అలవాటు. కాళ్ళకూరి ఈ నాటకం రచించేనాటికే 'వరకట్నం' అనే సమస్య ఆడపిల్లల్ని, కన్నతలితండ్రుల్ని పీడించడం ప్రారంభం అయింది. అల్లుళ్ని (వరవిక్రయానికి) మడులు మాన్యాలు కొంపగోడూ అమ్ముకోవలసిన పరిస్థితి ఆనాటికే ఏర్పడినట్లు ఈ నాటకాన్నిబట్టి తెలుస్తూంది.

కన్యాశుల్కం, వరకట్నం అనే ఈ రెండు సాంఘిక దురాచారాలు కూడా ఆడపిల్లల జీవితాలతోనే చెలగాటమాడటం ఆలోచింపదగిన విషయం. స్నేహలత, కాళింది వంటి అభిమానవతులైన ఆడపిల్లలు తమ తల్లితండ్రులు 'కట్నం' రూపంలో దండిగా క్రయధనం చెల్లించి వరుల్ని కొనడానికి ఉన్న ఆస్తులు అమ్ముకొని బికారులైపోవడం ఇష్టంలేకా, 'వెలమగల'తో పుస్తె కట్టించుకొని కాపురం చేయడం ఇష్టంలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. 'వెలయాలు' కంటే ఈ 'వెలమగలు' ఏ విధంగా భిన్నమైనవారని ప్రధానపాత్ర కాళింది చెల్లెలు కమల ఈ నాటకంలో ప్రశ్నిస్తుంది. రచయిత 'వరవిక్రయం' అని ఈ నాటకానికి పేరు పెట్టడంలోనే ఈ దురాచారాన్ని తీవ్రంగా అసహ్యించుకోవడం, ఎగతాళి చేయడం తెలుస్తూంది. సంతలో వస్తువుల్ని, పశువుల్ని బేరంచేసికొన్నట్లు 'పెళ్ళిసంత'లో వరుల్ని కొనవలసి వస్తూందని కాళింది తండ్రి పురుషోత్తమరావు వాపోతాడు. కాళింది ఆత్మహత్య చేసుకున్నా ఆమె చెల్లెలు కమలమాత్రం తిరగబడి 'వెలమగల'కు, వారి తండ్రులకు, లోకానికి బుద్ధి చెప్పింది.

# వరవిక్రయము

## నవమాంకము

### ప్రదేశము ః న్యాయస్థానము

[ప్రదేశము – న్యాయపీఠమునఁ గూర్చుండి అభియోగ పత్రము చదువుకొనుచు న్యాయాధిపతి యెదుటఁ గుర్చీలో వెంగళప్ప, అతని వెనుక నిలుఁబడి లింగరాజుగారు, బసవరాజు, రెండవ వైపునఁ బురుషోత్తమరావుగారు, కమల]

పురు – [తనలో] నిజమే. కోర్టెక్కుటకంటెఁ గొఱతయెక్కుటే మేలు

చ. మనుజుని ముంగిట న్మొరడు | మాదిరిగా మనుజుడు నిల్చివే
ర్మనుజుఁడు బల్ల గ్రుద్దుచును | మాటి మాటికి నేమి ప్రశ్న వే
సినఁదలయొగ్గి యుత్తరము | చెప్పుచు, నూర్పులుపుచ్చుచుంట కం
టెను నవమాన మింకొకటి | నిక్కముగా మహిలో నున్నదే.

సీ. ధనలోభమో, పట్టు దలయొ, దురాశయో
వేధింప నిలువెల్ల | వెఱ్ఱి యెత్తి
కూటసాక్ష్యములను | గూరిచికొని, యిండ్లు
వాకిళ్ళు ముదుసళ్ళ | వశ మొనర్చి
బ్రోకరు సేయు దు | ర్బోధలు మది నమ్మి
ప్లీడర్లు కోరిన | ఫీజు లిచ్చి
పూఁటకూ ళ్ళిండ్ల నూ | డ్పులు నాకి, వారిపం
చల దాటియాకు; జా | పలఁ బ[illegible]ండి

కోర్టె దేవాలయంబుగాఁ | గోర్టు[illegible]
మట్టులుం గంగరావులై | ఘంట[illegible]ది
కములుగా, జడ్జి దైవంబు | [illegible]
రంబుఁ దిరుగుదు [illegible] | [illegible]ంబో ప్రజలు!

ఇంతకును –

సీ. కరణము తొలి [illegible] | కట్నాల క్రిందను
కూటసాక్షులు గొఱు | గడుల క్రింద
వెంటఁ దొడ్తెచ్చు నే | జెంటు కర్చుల క్రింద
ప్లీడర్లు లాగెడు | ఫీజు క్రింద
చల్లగా బెరిగిన | స్టాంపు డ్యూటీ క్రింద
తెమలని సాక్షి బ | త్తెముల క్రింద
కడలేనియట్టి న | కళ్ళ ముద్దుల క్రింద

రైళ్ళ క్రిందను కాఫీ హో | టేళ్ళ క్రింద
కొంపలుం గోడులను మాపు | కొనుచు, నోడు
వాఁడు బయటను, గెలిచిన | వాఁడు లోన
నేడ్చుటేగాక, లాభ మిం | తేని గలదె !

బస – (తనలో) పెంపుడు తండ్రి చివరకు నన్నెంత పేలవ పఱచెను?

గీ. పెండ్లి కాఁగానె చదువు మా | న్పించెఁ బ్రజలు
కేరడము సేయఁ గోర్టు కె | క్కించె నేఁడు!
ధనమె బ్రతుకైన పెంపుడు | తండ్రికంటె
సవతితల్లియె మేలు ని | శ్చయముగాను!

న్యాయా : (కాగితములు బల్లపై నుంచి) వెంగళప్పగారూ! ఈ వ్యవహారమింత వఱకు రావలసినది కాదండీ! ఉభయులకును రాజీచేయుట యుక్తమని నా యభిప్రాయము.

వెంగ : (లేచి) కోర్టువారల్లా సెలవిస్తే కొంప మునిగిపోతుంది? మా క్లయింటు వంటి మర్యాదస్తుడు మద్రాసులో కూడా లేడండి. ఆయన పెళ్ళికి అయిదువేల అయిదు వందల కరుకులు కట్నం యిచ్చారు.

లింగ : (వెనుకనుండి మెల్లగా) అయ్యయ్యో! ఆ సంగతి మన మొప్పుకొనగూడదు దయ్యా బాబూ! ఆయన తండ్రికని దిద్దుకోండి!

వెంగ : అన్నట్లు పొరపాటు మనవిచేశాను. ఆయనకు గాదు కట్నం ఆయన కొడుక్కు. కాదు, కాదు తండ్రికి? ఆయన తండ్రి లక్షాధికారండి. మూడు పెళ్ళిళ్ళయినాయి. ముప్పయివేలు కట్నాలు వచ్చాయి! మ్యునిసిపల్ మెంబరీ కోసం మూడుసార్లు స్టాండైనారు.

న్యాయా : (నవ్వి) ఆయన చరిత్ర యిప్పుడవసరము లేదుకాని, రాజీమాట రవంత యాలోచింపుడు!

వెంగ : ఈవిషయంలో యీశ్వరుడు చెప్పినా మా క్లయింటు వినడండి. దావా మా పక్షం కావడానికి పట్టెడు రికార్డుంది. బోలెడు సాక్ష్యం వుంది; అలహాబాదు ట్వంటీత్రీలో అత్తవారు పెట్టిన నగల హరించ కూడదని అయిదు పేజీలు వ్రాశాడు! కలకట్టా ట్వంటీఫోర్లో పిల్లను కాపరానికి పంపితీరాలని వుంది!

న్యాయా : మీ తీర్పులన్నియుఁ దీరిక సమయమునఁ జూసెదను! ఏమి లింగరాజుగారూ! మీ అబ్బాయిని మీరొప్పించలేరా?

లింగ : చిత్తము, చిత్తము. కోర్టువారి చిత్తమట్లున్నప్పుడు, కోటిరూపాయలు పోయిన బోవుగాక? మా నగలు మాకిచ్చి, మా ఖర్చులు మాకిచ్చి, వారికిని మాకును సంబంధము లేకుండఁ జేసికొనుట కును వారిష్టపడిన యెడల, మా అబ్బాయిని నేనొప్పించెద.

న్యాయా : (పక్కున నవ్వి) ఏమి, కోడలేల పనికిరాదు?

లింగ : ఆ పిల్ల మా యింట నణకువతోఁ గాపురము సేయదండి.

న్యాయా : ఏమి పురుషోత్తమరావుగారూ! అమ్మాయికి నచ్చచెప్పి అత్తవారి ఇష్టానుసారముగ నడుచు కొనునట్లు చేయలేరా?

పురు : అయ్యా! నే నసహాయవాదిని. అందుచేత మీ ప్రశ్నమున కుత్తర మొసంగుటకు నా కవకాశములేదు.

న్యాయా : న్యాయాధిపతిగాఁ గాక గృహస్థుడుగా నడుగుచున్నాను.

పురు : ఇది న్యాయస్థానము కాని తమ గృహము కాదు.

న్యాయా : అట్లయిన, నీ వ్యవహార మిఁక నిరుపక్షములకు అనుకూలముగా నిర్వర్తించుట కవకాశము లేదన్న మాటయే!

వెంగ : ఆ సంగతి నే నాదిలోనే మనవిచేశాను.

కమ : (తనలో)

మ. మనమా! జంకకు, ధైర్యమా చెడకుమీ, మానంబ! నీ మానసో
ధనకాలంబిదె దైవమా! యిపుడె చెంతంజేరి సాయంబుస
ల్పి నమందేల్పు ముహూర్త మిత్తఱిని దల్లీ! భారతీనాదు వా
క్కున నిల్వంబడు, మక్కరో కదిసి నా, కుం దోడుగానుండుమీ!

న్యాయా : అందుచేతనే మీరు వకీలును బెట్టుకొనలే దన్నమాట.

కమ : (కొంచెము ముందునకు వచ్చి) అయ్యా ! తామధిష్ఠించినది ధర్మపీఠము. తాము ధర్మదేవతకుఁ బ్రతినిధులు. తమ కాడుబిడ్డ యున్నయెడల నాబిడ్డయె యీ బిడ్డ యనుకొని తమ సన్నిధానమున ధర్మము విన్నవించుకొనుటకు నాకనుజ్ఞ దయచేయుడు.



BRAOU

వెంగ : (చివాలున లేచి) నో! నో! నో! ఆ చిన్నది మాట్లాడడము అశాస్త్రీయం! అందుకు లా యెంత మాత్రం వప్పదు. ఏదీ సివిల్ ప్రొసీజరు కోడెక్కడుంది. (అని బల్లమీద వెదకును).

న్యాయా : ఏమీ! ఏల మాటాడఁకూడదు?

వెంగ : ఆ పిల్లకు మైనార్టీ వెళ్ళలేదండి, మైనార్టీవెళ్ళని వాళ్ళు మాట్లాడగూడదని బోలెడు బొంబాయితీర్పు లున్నాయి.

కమ : అయ్యా ? చట్టము వేఱు, సందర్భము వేఱు. సందర్భములనుబట్టి చట్టములు మాఱునుగాని చట్టములనుబట్టి సందర్భములు మాఱవు. నా తండ్రిగారసహాయవాదులు, నాకు వకీలును బెట్టు కొనుట కవకాశములేదు, చట్టమునందుఁ జెప్పఁబడిన యీడు రాకపోయినను స్వవిషయమును సమర్థించు కొనుటకుంజాలిన జ్ఞానమును సర్వేశ్వరుండు నాకుఁ బ్రసాదించినాడు, ఇట్టిస్థితిలో, నా మాట వినకుండుట నా కన్యాయము చేయుటకాదా?

న్యాయా : చెప్పమ్మా చెప్పు? నీవు చెప్పినమాటలు రికార్డు చేయఁగూడ దనవచ్చునుగాని నన్ను వినగూడ దనుటకు వీరెవరు ?

కమ : చిత్తము చిత్తము, దావా సారాంశములు రెండు. మొదటిది నా తల్లిదండ్రులు నా నగలు హరింపఁ దలచినారని, రెండవది అందులకై వారు నన్నుఁ గాపురమునకుఁ బంపలేదని (నగలమూట తీసి) ఇవిగో వారిడిన వస్తువులు. వానిని వారు వివాహ కాలమున నాకు బహూకరించినారు. బహూకరించిన వస్తువులు దిరుగఁ సంగ్రహించుటకు దాతకు హక్కులేదు.

వెంగ : కావలసినంత హక్కుంది. కలకత్తా తీర్పులు లక్షచూపిస్తాను. ఏదీ నంబరుయైట్ వాల్యూము. (అని వెదకును).

న్యాయా : ఆగయ్యా నీ యల్లలాటకాల? అమ్మాయి, రెండవ సారాంశమును గూర్చి యేమి చెప్పెదవు?

కమ : ఇదియే తామించుక శ్రద్ధతో వినవలసిన విషయము. నా భర్త నాయింటికి వచ్చి నా యాజ్ఞను సారము నడచుకొనవలసియున్నదిగాని ఆయన యింటికి నన్ను రప్పించుకొనుట కాయన కావంతయు నధికారములేదు.

వెంగ : కావలసినంత అధికారముంది. కలకత్తా ట్వంటీసిక్సులో కాళ్ళుచేతులూ కట్టి తీసుకుపోవచ్చునని కూడా వుంది.

న్యాయా: అబ్బబ్బా ! నీవాఁగవయ్యా! ఎందుల కధికారము లేదమ్మా?

కమ : ఆయనను మేము వేలములో అయిదువేల యైదువందల రూపాయలకుఁ గొన్నాము.

న్యాయా: (ఆశ్చర్యముతో) అదెట్లు ?

కమ : నాకు గాళింది యను నక్కగారుండెడిది. ఆమెకై మాతండ్రిగారీ సంబంధము కొఱకు యత్నించు తఱి మున్నంగి వారుపోటీకి వచ్చినారు. అప్పుడు పెండ్లికొమరుని వేలము జరిగి ఆ వేలములో అయిదు వేల అయిదువందలకు మా సొత్తయినారు.

లింగ : అయ్యా ! వట్టిది వట్టిది ! అట్టి దేమియు జరగలేదు! (వెంగళప్పను చఱచి) **వీ** బొడ్డు పొక్క! నిజముకాదని చెప్పవేమయ్యా!

వెంగ : (ఉలిక్కిపడి లేచి) అయ్యా! అయ్యా! అంతా అబద్ధమండి. కావలిస్తే మా క్లయింటు గంగలోదిగి ప్రమాణంచేస్తాడు.

కమ : (రెండు కాగితములు తీసి) అయ్యా! యిదిగో ఇది మొదటి అగ్రిమెంటు. ఇది సొమ్ము ముట్టినప్పటి రసీదు (అని ఇచ్చును).

న్యాయా : (చదివి) ఏమయ్యా! యీ రసీదులు మీ రిచ్చినవేనా?

లింగ : (గొల్లున) కావు కావు! మహాప్రభో! కల్పించినారు.



BRAOU

వెంగ : నిశ్చయముగా ఫోర్జరీ! అండి, నిలువునా ఫోర్జరీ! ఇండియన్ పీనల్ కోడ్డు నాలుగువందల అరవయ్యేడో శెక్షను ప్రకారం ఆ పిల్ల మీద ప్రాసిక్యూషనుకు ఆర్డరు దయ చేయించకతప్పదు.

న్యాయా : అయితే, అమ్మాయి! అగ్రిమెంటు ప్రకారము ఆ సంబంధము మీ యక్కకేల జరుగలేదు.

కమ : కొని తెచ్చిన వరుని బెండ్లియాడుట గౌరవహీనమని మా యక్క ఉ విలోఁబడి మరణించినది. ఇదిగో యీ పత్రికఁ జిత్తగించినచో దమకీ యంశము విశదము కాగలదు (అని పత్రిక యిచ్చును)

న్యాయా : (చదివి)హరహరా! యెంతపని జరిగినది. ఆ కారణముచే ఆ చిన్నవానికి నిన్నుఁ జేసినారన్న మాట.

కమ : చేయక తప్పినదికాదు. చేజిక్కిన సొమ్ము మరలచేపుటకు వారు నిరాకరించి నందున ఆ క్రయము నా క్రింద మార్చ వలసి వచ్చింది.

లింగ : అయ్యా! వాదము నిమిత్తము, వారు సొమ్మునిచ్చినట్లె నిశ్చయింపుడు. అయిన నది కట్నమగును గాని క్రయధనమెట్లగును?

కమ : కట్నమునకును క్రయధనమునకు గాసింతయు భేదము లేదు. ఉన్నదన్నను కట్నములు వివాహ కాలమున నిచ్చుట కలదు. గాని వేలము, బజానా, అగ్రిమెంటు, ముందు చెల్లించుట ఇట్టి యాచార మెచ్చటనులేదు. అందువల్ల నిది క్రయధనమగుటకాక్షేప మేమియు లేదు. అదియటుండ నిండు. శుభ లేఖలలో సర్వత్ర "వారి కుమారునకు వీరి కొమార్తె నిచ్చి" అని కదా యుండును? వీనినిఁ జిత్తగింపుఁడు (అని రెండు శుభలేఖ లిచ్చును)

న్యాయా : (ఒక శుభలేక నెత్తి) "నా కొమార్తె చి॥సౌ॥ కమలకు బ్రహ్మశ్రీ సింగరాజు లింగరాజుగారి కుమారుడు బసవరాజు నిచ్చి" (అని పఠించి పక్కున నవ్వి) ఇది పరుషోత్తమరావుగారి శుభలేఖ. లింగరాజు గారి శుభలేఖలో నెట్లున్నదో? (అని రెండవదాని నెత్తి) "నా కుమారుడు చి॥ బసవరాజును బ్రహ్మశ్రీ పుణ్యమూర్తుల పురుషోత్తమరావు పంతులుగారి కొమార్తు చి॥సౌ॥ కమలకు ఇచ్చి" సరే యిక నేమి స్పష్టముగానే యున్నదే! ఏమి లింగరాజుగారూ! మీ కుమారుని మామకిచ్చివేసినట్లు మీరొప్పు కొనియే యున్నారే?

లింగ : అయ్యా! అన్యాయ మన్యాయము. మీ శుభలేఖలతో పాటు మరికొన్ని గూడ గొన్నియచ్చు వేయించి పెట్టుడని బుద్ధి గడ్డితిని పురుషోత్తమరావుగారిని కోరగా నీ ద్రోహమాయన చేసినారు.

వెంగ : ఇదో ఫోర్జరీ. ఇందుకోసం యీయన మీద ప్రాసిక్యూషనుకు ఆర్డరు దయచేయించాలి. ఇక వూరుకోవడానికి వీల్లేదు.

కమ : అయ్యా! ఆయనయేమియు నెఱుగరు. నాకుగల హక్కును బట్టియు, న్యాయమును బట్టియు నేనే యీ విధముగా మార్చినాను. అందులకు ఎవరప్పుడేమియు నభ్యంతరము చెప్పి యుండలేదు. తామీ సందర్భములన్నియు జక్కగా నాలోచించి, నాపై నా భర్తకే యధికారము కలదో, నా భర్తపై నాకే యధికారము కలదో! నిర్ణయింపుడు.

బస : (తనలో) నా యవజ్ఞత చేతనే యీ వ్యవహార మింతవఱకు వచ్చినది. ఇంకను నేనిట్లు మొరడునై యుండదగునా?

చ. పరువునశించెఁ! బండితులు । బామరులు న్విని యింటనింట నా
చరితమె చెప్పుకొంచు నెక । సక్కెములాడు నవస్థపట్టెప ము!
ష్కరమునఁ దండ్రికిప్పటికి । గల్గకపోయె నుదారబుద్ధి! యీ
తరుణమునందు మూర్ఖుని వి । ధంబుననుండుట నాకుఁబాడియే.

గీ. ఆమె చెప్పిన దెల్ల య । దార్థ మీతఁ
డాచరించిన దెల్ల నా । యాత్మ యెఱుగు;
నిట్టిచో న్యాయమున కేను । గట్టుపడక
యున్న దేవుఁడు నన్ను జూచి । యోర్చువాఁడె.

న్యాయా : ఏమి వెంగళప్పగారూ! మీరేమి చెప్పెదరు?

... 35

బస : అంతలో (ముందునకు వచ్చి) అయ్యా? యిప్పుడు మాటాడవలసినవాడను నేను గాని, ఆయన కాదు. ఈ దావాకు సంబంధించిన కాగితములపై నేను సంతకములు చేసినది, నా తండ్రి బల వంతముచే గాని, నా స్వబుద్ధిచే గాదు. అందువల్ల నా దావాను నేను రద్దు చేసికొనుచున్నాను. ఆ చిన్నది చెప్పిన మాటలలో నణువంతయు నసత్యములేదు నా తండ్రి మాటలలోనలుసంతు నిజము లేదు. ఈ వ్యవహారములో నా తండ్రి చేసిన దుస్తంత్రములన్నియు నిచ్చట వెల్లడించుట నా కిష్టము లేదు. పెక్కుమాటలేల?

ఉ. అమ్మేను నన్ను నాజనకుఁ । డాయన నన్గానెరొక్కమిచ్చి, యీ
కొమ్మకు నేను భృత్యుఁడను । గొంకక యేపని సేయుమన్న ని
క్కమ్ముగఁ జేయువాఁడ । కట్నములం గొనువారు రూఢిగా
నమ్ముడు కాండ్రెకాక, మగ । లంటకు నర్హులుకారు లేశమున్.

న్యాయా : సెబాసు! నాయనా సెబాసు! చెప్పవలసిన రీతిగాఁ జెప్పితివి? కాని జెప్పినది చెప్పినట్లు, చేయుట గూడజరిగెనేని లోకమునకొక శ్రేష్టమైన పాఠము నేర్పినవాఁడవగుదువు?

బస : అయ్యా! తమకా సందేహమేల? (అని కమలవంకకు నడుచును)

లింగ : (ఆవేదనతో) ఆఁ; ఆఁ; ఓరి నిర్భాగ్యుఁడా? నిర్భాగ్యుఁడా, నీ కేమివినాశ కాలమురా యిది అయ్యో! అయ్యో? ఇంకేమున్న దింకేమున్నది? (అని గుండె బాదుకొనును)

బస : (తిరిగి చూడకయె కమలను సమీపించి) ఓ సుగుణవతీ?

చం. ధనము గణించి నీయెడల । దారుణవృత్తిప మెలంగియుండె మ
జ్జనకుడు, దాని నించుకయు । స్వాంతము నందిడఁ బోక నన్నుదా
సునిగ గ్రహించి ఇష్టమగు । చొప్పున నానతులిమ్ము నీవుచె
ప్పిన పనిచేయు దెల్లపుడు । భృత్యుఁడనై పడియుండుదీకడన్

కమ : (మందహాసముతో) ఇదిగో నగల[illegible] యీకాగితముల కట్టయుఁ బట్టుకొని నా వెంట రండు. ఇరువురమును గలిసి ఈ వరవిక్రయ దురాచారమును రూపుమాపుటకై పాటుపడుదము (అని మూడయుఁగట్టయు నిచ్చును).

బస : (తీసుకొని, తలపై నిడుకొనును).

లింగ : ఓరి నీచుడా? చివరకింత నైచ్యమునకు సిద్ధపడితివిరా? ఇదిగో, నా యాస్తినుండి నీకు నలుసంత ముట్టనిచ్చితినా, నా మెడలోనిది యజ్ఞోపవీతము కాదు. (అని చనుచుండ తెరపడును).

ఇది నవమాంకము

## 2.3 పాఠ్య వివరణ

ఇంతకు ముందు పాఠంలో మీరు చదువుకొన్న 'కన్యాశుల్కం' లాగే 'వరవిక్రయం' కూడా సంస్కరణ దృక్పథంతో సామాజిక దురాచారం మీద ధ్వజమెత్తిన నాటకం. మొదట కొన్ని పదాలకు అర్థ వివరణ. తర్వాత వరవిక్రయం నాటక కథను పరిశీలిద్దాం. ఆ తరవాత కథక్లైమాక్స్ లేదా పరాకాష్ట అయిన నవమాంకం పాఠ్య భాగాన్ని పరామర్శిద్దాం.

### 2.3.1 అర్థ వివరణ

| | | |
|---|---|---|
| అవజ్ఞ | = | తెలివిలేకపోవటం |
| అసహాయవాది | = | సహాయనిరాకరణవాది. (ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా సాగుతూ ఉండిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగాల్ని, కోర్టులను, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్ని కూడా బహిష్కరించారు. అలాంటి వాళ్ళను సహాయనిరాకణవాదులు అన్నారు). |

కదియు = సమీపించి
కట్నాలు = కానుకలు
కూటసాక్ష్యము = దొంగసాక్ష్యం, అబద్ధపు సాక్ష్యం
కొమ్మ = స్త్రీ
కొఱత యెక్కుట = ఉరికొయ్య ఎక్కడం - ఉరిశిక్ష అనుభవించడం
కేరడము సేయు = ఎగతాళిచేయు
తరుణము = సమయము, సరియైన సమయము
దుస్తంత్రము = కుయుక్తి
భృత్యుడు = సేవకుడు
ముష్కరము = మూర్ఖము, కుటిలము
మొరడు = మ్రోడు, చైతన్యం చలనం లేకుండ పడిఉండేది.
సన్నిధానము = సమీపము
స్వాంతము = మనస్సు

**ఈ కింది పదబంధాలు, సామెతలు గమనించండి :**

తలయొగ్గు
నిలువెల్ల
పేలవపఱచు
బొడ్డు పొక్క! (ఇది తిట్టుమాటగ అయింది)
వెఱ్ఱియెత్తు

"కోర్టెక్కుటకంటే కొఱత యెక్కుటే మేలు" ఈ సామెత బ్రిటిష్ హయాంలో వారి న్యాయ విధానం న్యాయస్థానాలు ప్రవేశపెట్టిన తర్వాత పుట్టినటువంటిది.

**ఇంగ్లీషు పదాలు :**

ఇండియన్ పీనల్ కోడ్ (IPC) = భారతీయ శిక్షాస్మృతి
సివిల్ ప్రొసీజర్ కోడ్ (CPC) = పౌరన్యాయవిధాన పద్ధతి స్మృతి
అగ్రిమెంటు, ఏజెంటు, కోర్టు, లా, ప్లీడరు, హైకోర్టు, ఆర్డరు
ప్రాసిక్యూషన్ = చట్టరీత్యా చర్య తీసుకోవడం
ఫోర్జరీ = దొంగ సంతకము, అబద్ధపు రసీదు, అబద్ధపు ఉత్తరం మొదలైనవి.
బ్రోకర్లు = దలారీలు
క్లయింటు = కోర్టులో తనతరపున వాదించడానికి న్యాయవాదిని కుదుర్చుకున్నవాడు
మునిసిపల్ మెంబరీ (సభ్యత్వం)
స్టాండైనాడు = (ఎన్నికల్లో నిలబడినాడు.

**హిందుస్తానీ పదాలు :**

ఖర్చు, బజానా, దావా, నకలు, రాజీకావడం, వకీలు మొదలైనవి.

2.3.2 వరవిక్రయ నాటక కథ

పురుషోత్తమరావు దేశభక్తుడు, సంఘ సంస్కర్త. ఇతని భార్య భ్రమరాంబ. వీరికి కుమార్తెలు కాళింది, కమల. తండ్రి గుణాలు అబ్బిన తనయలు.

సింగరాజు లింగరాజు వడ్డీ వ్యాపారి, పిసినిగొట్టు. ఆయన మూడో భార్య సుభద్ర. వీరి దత్తపుత్రుడు బసవరాజు. లింగరాజుకు ఒక వంటవాడుంటాడు. పేరు ఘంటయ్య.

ఏదో విధంగా వివాహాలు కుదిరించి కమీషను సంపాదించుకొనే దలారి పెళ్ళిళ్ళ పేరయ్య. ఇలాంటివాడే మరో వివాహాలవీరయ్య. వెర్రి బుర్రల వెంగళప్ప ఒక న్యాయవాది. పేర్లకు తగ్గట్టుగా కోర్టులో అయోమయంగా

మాత్రమే వాదించగల దిట్ట. దుర్మార్గుడు, మోసకారి. ఎన్నికల్లో ఓట్లుకొని తాలూకా బోర్డు ప్రెసిడెంటు పదవి చేజిక్కించుకున్నాడు. అన్ని అవినీతి పనులూ లంచగొండితనమూ వెలిగిస్తున్నవాడు.

న్యాయాధిపతి పాత్ర మరొకటి. కోర్టు సీనులో మాత్రమే ప్రవేశిస్తాడు. పదవి మర్యాదను నిలుపుకున్న సజ్జనుడు.

పుణ్యమూర్తుల పురుషోత్తమరావు సంఘసంస్కరణకోసం, దేశస్వాతంత్ర్యంకోసం పాటుపడుతూన్న వాడు. రెవిన్యూ ఇన్స్పెక్టరు ఉద్యోగం వదలి పెట్టి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నవాడు. సంస్కర్త కాబట్టి కుమార్తెలకు కట్నంలేని వివాహాలుచేయాలనీ ఆదర్శం పెట్టుకున్నవాడు. కాని ఆచరణలో అది సాధ్యం కాలేదు. కట్నం తీసుకోనట్టి వరులు ఎంతవెదికినా కనిపించరు. పిల్లలకు వయసు మీరుతూందన్న బాధపడు తూన్న భార్యవల్లా, మరోవైపు సంఘంవల్లా ఆఖరికి కట్నంవివాహమేనిశ్చయం చేయవలసివచ్చింది. పెద్ద కూతురు కాళింది వివాహం కుదిరింది. కుమార్తెలిద్దరూ తండ్రి బుద్ధులు పుణికి పుచ్చుకున్నారు. దేశభక్తి, సంస్కరణ ఆదర్శాలు కలవారు. కాబట్టి తండ్రి చేసిన ఈ పని వాళ్ళకు నచ్చలేదు. కట్నం పెళ్ళికి వాళ్ళు విముఖులు.

సింగరాజు లింగరాజు పుత్రుడు బసవరాజుతో కాళిందికి పెళ్ళి నిశ్చయమైంది. లింగరాజు మహా లుబ్ధుడు, మోసకారి, వడ్డీవ్యాపారి. ఎన్ని రకాల మోసాలుచేసి అయినా సరే పైసా దగ్గర నుండి డబ్బు కూడ బెట్టడమే జీవిత ధ్యేయంగా ఉన్నవాడు. అలాగే బ్రతుకుతూన్నవాడు కూడా. మూడు పెళ్ళిళ్ళు చేసుకొని కట్నం డబ్బుతో ఆస్తి పెంచుకున్నాడు. కొడుకు బసవరాజు పెళ్ళి ద్వారా కూడ దండిగా కట్నం ఆర్జించా లన్న ఆలోచనలో ఉండి అందుకోసమేచదివిస్తున్నవాడు. పెళ్ళిళ్ళ పేరయ్యసాయంతో పెళ్ళి ఏర్పాటయింది.

ఇందులో మోసం జరిగింది. లింగరాజుకు కట్నం బాగా ముట్టాలి. పేరయ్యకు కమీషను ఆశ కూడ జాస్తి. దీంతో ఇద్దరూ కూడబలుక్కుని వివాహాల వీరయ్య సాయంతో మరోపార్టీ తరపున పోటీ పెట్టినట్లు నాటకమాడి కట్నం రేటు వేలం పాటలో వలె ఎక్కించి పురుషోత్తమరావు అయిదువేలా అయిదువందల వరకు పాడేట్లు పురెక్కిస్తారు. పురుషోత్తమరావు మోసపోతాడు. లింగరాజు కట్నం తాలూకు పది రూపాయలు అడ్వాన్సు కూడా అప్పుడే తీసుకొని రసీదు ఇచ్చి, కట్నం అగ్రిమెంటు కూడ తయారుచేస్తాడు. పురుషోత్తమ రావు కట్నం డబ్బుకోసం పిత్రార్జితమూ, స్వార్జితమూఐన భూమిని పేరయ్యకే తక్కువ ధరకు అమ్మవలసి వస్తుంది. పెళ్ళికి ముందుగానే కట్నం సొమ్ము వియ్యంకునికి చేరింది.

విషయం తెలిసి కాళింది చాలా కుంగిపోతుంది. ఆ పెళ్ళి ఆపమని తల్లిదండ్రుల్ని వేడుకుంటుంది. వాళ్ళు చిన్న పిల్ల మాటలాగా ఈ అమ్మాయి మాటను తోసివేశారు. అబిమానవతి కాళింది డబ్బిచ్చి భర్తను కొనుక్కోవడం ఇష్టంలేక ఏం చేయాలో తోచని బాధలో బావిలోపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం వార్తా పత్రికలకు ఎక్కింది. కాళింది తల్లిదండ్రులు ఈ దెబ్బతో మరి కోలుకోలేకపోతారు.

పెళ్ళిళ్ళపేరయ్య కొత్త ఆలోచనచేస్తాడు. ఏమైనప్పటికీ లింగరాజు కట్నం డబ్బు తిరిగి ఇవ్వడు కనుక, రెండో అమ్మాయి కమలను ఆ వునికే ముడిపెడితే బాగుంటుందని పురుషోత్తమరావుకు సలహా ఇస్తాడు. అతడు ససేమిరా అంగీకరించడు. కాని పేరయ్య ఈ విషయంలో కమలకే నచ్చచెప్పాలని ప్రయత్నిస్తాడు. కమల ఆలోచిస్తుంది. అక్కకు జరిగిన అన్యాయానికి మనసు రగులుతూంది. కాని ఆవేశపడకుండా పెళ్ళికి ఒప్పుకుంటుంది. అయితే తన ఇష్టానుసారమే తన షరతులకు ఒప్పుకుంటేనే ఆ పెళ్ళి చేసకుంటాననంటుంది. తల్లి దండ్రులు అంగీకరిస్తారు. కమల కొన్ని విషయాలు మనసులో ఉంచుకొని పథకం వేసుకొని అక్కకు జరిగిన అన్యాయానికి కసితీర్చుకొనేందుకే ఆ పెళ్ళి చేసుకుంటుంది. పెళ్ళిలో పురుషోత్తమరావు చేత దండిగా ఖర్చు పెట్టించి, ఆ కానుకలనీ ఇవనీ బోలెడు లాగి అతన్ని లింగరాజు లూటీ చేశాడు.

పెళ్ళయి మూడేళ్ళయింది. అమ్మాయి కాపురానికి పోలేదు. పెళ్ళిలో అమ్మాయికి పెట్టిన నాలుగైదు వేలు విలువజేసే నగలు అమ్మాయి దగ్గరే ఉన్నాయి. ఆమె కాపురానికి వస్తూనే ఆ నగలు ఊడలాగవచ్చునని భావించిన లింగరాజు యుక్తి పారలేదు. కమల కాపురానికి రాలేదు. అందువల్ల పురుషోత్తమరావు మీద నగలు అపహరింపదల చాడని అందువల్ల కూతురిని కాపురానికి పంపలేదని కొడుకుచేత కోర్టులోదావా వేయిస్తాడు. ఏదో విధంగా సొమ్ము ఖ లాగి వేసి అమ్మాయిని వదిలించుకొని, కొడుక్కు మరో పెళ్ళి చేసి మరో పెద్ద కట్నం సంపాదించాలని లింగరాజు ఉపాయం. కాని అది ఫలించలేదు.

కమల తన పథకం ప్రకారం తండ్రితో కోర్టుకు వచ్చింది. తండ్రి సహాయనిరాకరణవాది కనుక వకీలును పెట్టుకోలేదు. స్వయంగా కూడ ఏమీ మాట్లాడడు. అందువల్ల ఆ భారమంతా కమల తనమీదే వేసుకుంది. విచారణ ప్రారంభమైంది.

కమల పెళ్ళికి ముందు జరిగిన కథ అంతా న్యాయాధిపతికి వివరిస్తుంది. పెళ్ళికొడుకును కొన్నారనీ దాని రశీదును, కట్నం డబ్బును గురించిన అగ్రిమెంటునూ, తన అక్క కాళింది ఆత్మహత్య వార్త ప్రచురించబడిన వార్తాపత్రికనూ ఋజువులుగాచూపుతుంది. పెళ్ళి పత్రికలో తన వాదనకు తగినట్లుగా ఉన్న వాక్యాల్ని చూపుతుంది. ఇవన్నీచూస్తున్న బసవరాజు మేల్కొని తన అభియోగాన్ని ఉపసంహరించుకుంటున్నానీ, తాను అమ్ముడు పోయాననీ ఒప్పుకుంటాడు. కమల వెంట వెళ్ళిపోతాడు. చివరి అంకంలో అంగరాజు మనసు మార్చుకొని వరవిక్రయ వ్యతిరేక ఉద్యమానికి చేయూతనివ్వడానికి ముందుకు వస్తాడు. నాటకం ముగుస్తుంది.

### 2.3.3 వరవిక్రయం – పాఠ్యభాగం విషయం

నాటకంలో ఈ నవమాంకం ప్రధానమైన అంకం. న్యాయస్థానం రంగం. ఈ రంగంలోనే నాటక కథా వస్తువు పరాకాష్ఠకు చేరుతుంది. ఇక్కడే విషయం అటో ఇటో తేలవలసింది.

కోర్టులో అందరూ హాజరయ్యారు. కోర్టుకు రావడం కంటె కొరత వేయించుకోవడమే మేలని పురుషోత్తమరావు మనసులో బాధపడుతుంటాడు. లింగరాజు వకీలు వెర్రిబుర్రల వెంగళప్ప, దుష్టుడు. వాదించటం చేతకానివాడు. అయోమయంగా మాట్లాడతాడు. పురుషోత్తమరావు తరపున కమలే మాట్లాడుతుంది. అమ్మాయికి వయసు పదహారేళ్ళే కనుక మైనారిటీ తీరలేదు. కోర్టుల్లో మాట్లాడడానికి రూలు ఒప్పుకోదని వాదిస్తాడు వెంగళప్ప. కాని న్యాయాధిపతి సహృదయుడు. అమ్మాయి వాదాన్ని రికార్డు చేయక పోవచ్చు కాని వినటంలో తప్పులేదంటాడు. కమల చెప్పిన విషయాన్ని ఓపికగా వింటాడు.

సొమ్ములు అపహరించే ఉద్దేశంతో పురుషోత్తమరావు కూతురిని కాపురానికి పంపలేదనేది అభియోగం. కమల సొమ్ముల మూటను న్యాయాధిపతి ముందుంచి, అవి పెళ్ళిలో తనకు కానుకలుగా బహూకరింపబడినవి కాబట్టి వాటిని గురించి అడగటానికి లింగరాజునకుగాని, బసవరాజునకు గాని హక్కు లేదంటుంది. భర్త యింటికి కాపురానికి వెళ్ళే విషయం రెండోది. ఆ ప్రసక్తేరాదంటూ కమల అసలు విషయమంతా వివరిస్తుంది. ముందు తన అక్క కాళిందికి ఈ సంబంధం నిశ్చయమైనప్పుడే పెళ్ళికి ముందే కట్నం విషయంలో వేలం పాట జరిగిందనీ, అందులో తన తండ్రి పెండ్లికొడుకును అయిదువేల అయిదువందలకు కొన్నారనీ, అడ్వాన్సుగా పదిరూపాయలు తీసుకొని లింగరాజు ఇచ్చిన రసీదును, కట్నండబ్బును గురించిన అగ్రిమెంటునూ న్యాయాధిపతికి చూపించింది. కాళింది డబ్బుకు అమ్ముడుపోయిన వరున్ని పెళ్ళిచేసుకోవడం ఇష్టంలేక ఆత్మ హత్య చేసుకున్నదనీ, ఆ విషయం ప్రచురించిన వార్తా పత్రికను కూడ న్యాయాధిపతికి చూపింది. తరువాత కట్నం సొమ్ము తిరిగి రాబట్టడం వీలులేదు కనుక పెళ్ళి కూతురు స్థానంలోతాను ఉండవలసి వచ్చిందనీ చెబుతుంది. అంతా విన్న న్యాయాధిపతి చాలా బాధపడతాడు.

పెళ్ళి పత్రికలో కూడకట్నానికి అమ్ముడు పోయిన వానికి తగ్గట్టుగానే "ఫలానా ... కమలకు ... ఫలానా బసవరాజునుయిచ్చి" అనీ, 'ఫలానా ... బసవరాజును ... ఫలానా కమలకు యిచ్చి" వివాహము జరిపించు లాగున నిర్ణయమైందనీ అచ్చువేసిన పత్రికల్ని చూపింది. అవి చూసిన న్యాయమూర్తికి నవ్వు వచ్చింది. పత్రికలు అచ్చువేయడానికి పైసలు ఖర్చు అవుతాయనే ఉద్దేశంతో లింగరాజు తమ వైపునుండీ కూడ పత్రికలు పురుషోత్తరావుగారినే అచ్చువేయించవలసిందిగా కోరి ఉంటాడు. అందుకు కమల తగిన బుద్ధిచెప్పింది. కమల ఇష్టానుసారమే పురుషోత్తమరావు పత్రికలు ఆ విధంగ అచ్చువేయించారు. కాబట్టి ఇప్పుడు భార్యాభర్తల్లో ఎవరికి ఎవరి మీద అధికారం ఉంది? ఎవరింటికి ఎవరుకాపురానికి వెళ్ళవలసి ఉంది. ఇదీ కమలవాదన.

కమల ఈ వాదన సందర్భంలో బసవరాజు మేల్కొన్నాడు. ఇప్పుడైనా తాను మాట్లాడకపోతే ప్రయోజనం లేదనుకున్నాడు, తన వ్యక్తిత్వం నిలవదనుకున్నాడు. ఇంతకాలం తండ్రి చేసిన పనికిమాలిన పనులన్ని గుర్తు చేసుకున్నాడు. కమల వాదనలో వాస్తవం ఉందని గ్రహించాడు. అందువల్ల లేచినిలబడి న్యాయాధిపతి ముందు తన అభియోగాన్ని ఉపసంహరించుకొంటున్నాననీ, తన తండ్రి బలవంతం మీదనే ఆ దావా మీద సంతకం చేశాననీచెప్పాడు. ఇప్పుడు భార్య కమల పక్షం వహించాడు. తండ్రి మూర్ఖత్వం వల్ల

BRAOU

నిజంగా తాను అమ్ముడు పోయినవాడినే కాబట్టి కమల ఇంటికే వెళ్ళి ఆమెకు సేవ చేయవలసి వున్నదని చెప్పాడు. న్యాయాధిపతి ఈ యువకుని వాదన మెచ్చుకున్నాడు. దాన్ని ఆచరణలో చూపించి నలుగురికీ మార్గ దర్శకుడవు కమ్మని ఆశీర్వదించాడు.

కోర్టులో సర్వమూ తలకిందులైనందుకు లింగరాజు గుండెలు బాదుకున్నాడు. కాని ఏం చేయగలడు? కొడుకు ఏమో కోడలు వెంట వెళ్ళిపోయాడు.

దశమాంకంలో (నాటకం చివరి అంకం) లింగరాజు కూడ మనసు మార్చుకొని బుద్ధి తెచ్చుకొని కొడుకు కోడలు వియ్యంకులు పురుషోత్తమరావు భ్రమరాంబలు చేపట్టిన సంఘ సంస్కరణ కార్యానికీ - (వరకట్నం - అంటే 'వరవిక్రయాని'కి వ్యతిరేకంగా) ప్రచారం చేయడానికి తోడ్పడుతాడు. ఇలా మరెందరో కట్నం సంపాదించడం కోసమే ఎన్నెన్నోమోసాలుచేసిన వాళ్ళు కూడ తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడి ఈ సంస్కరణ కార్యంలో చేయూత నివ్వడానికి ముందుకు వస్తారు. ఆ విధంగా నాటకం ముగుస్తుంది.

**2.3.4.వ్యాఖ్యానం**

నాటక రచనాధ్యేయం వరకట్న దురాచార నిర్మూలనం. వరకట్నం అనేది 'వర విక్రయం' అని నిరసించి ఎగతాళి చేసి ఆ దురాచారం నిర్మూలింపబడాలనే సంస్కరణ ధ్యేయాన్ని నాటకంలో ఈ విధంగా నిర్వహించి రచయిత నెరవేర్చుకున్నారు.

న్యాయస్థానంలో అడుగుమోపగానే పురుషోత్తమరావు ఆనాటి కోర్టుల్లో వ్యాజ్యాలు వేసినవాళ్ళు వకీళ్ళ చుట్టూ కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆస్తిపాస్తులన్నీ పోగొట్టుకొని బికార్లుకావడం గురించి బాధపడతాడు. న్యాయవ్యవస్థలోని అన్యాయం, అవినీతి గురించి ఆలోచిస్తాడు. కోర్టులో వకీళ్ళు బల్లగుద్దుతూ, కూటవాదాలు చేస్తూ, కూటసాక్ష్యాలుప్రయోగిస్తూ ముద్దాయిల్ని ప్రశ్నలు వేసి వేధిస్తూంటే చలనం లేని మూర్ఖుల్లాగ తలవంచుకొని నిలబడవలసి రావటం చాల సిగ్గుచేటయిన సంగతి. ధనాశ, దురాశ, దురభిమానం ఏదో ఒకటి ముందుకులాగితే మనుషులు మూర్ఖులై కోర్టులకెక్కడం మానక అటునుండి కొంపాగోడూవదలివేసి కోర్టు చుట్టూ తిరుగుతూ, దొంగసాక్షులకూ, ప్లీడర్లకూ, బ్రోకర్లకూ, ఏజెంట్లకూ, ప్లీడరు గుమాస్తాలకూ, స్టాంపు డ్యూటీకనీ, నకళ్ళకనీ, హోటళ్ళకూరైలు బస్సు చార్జీలకూ ధనం గుమ్మరించడమే తప్ప మరొకటి లేదు కదా! కరణం దగ్గర నుండీ జడ్జీవరకూ తల గొరిగేవాళ్ళే తప్ప మరొకటి లేదే. ఓడినవాడు బయట ఏడిస్తే గెలిచినవాడు మనసులోపల ఏడ్వక తప్పదు కదా. అయినా మూర్ఖులవలెమనుషులుకోర్టుల కెక్కటం మానటం లేదే! కోర్టుల కెక్కి ఇన్ని అవమానాలు భరించడం కంటె ఉరికొయ్య ఎక్కి ఉరిశిక్ష అనుభవించడమే మేలు. ఇవి పురుషోత్తమరావు ఆలోచనలు.

బ్రిటిష్ పాలనలో పాదుకున్న పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో న్యాయం కుందేటి కొమ్ము అయింది.

ఇప్పుడు కోర్టులో విచారణ జరిగే వ్యాజ్యం బాధాకరమైన విషయానికి సంబంధించింది. భార్యాభర్తల జీవిత సమస్యకు సంబంధించింది. కమల జీవితం ఏమౌతుందో, పైగా వాదించడానికి వారికి వకీలును కూడ పెట్టుకునే అవకాశం లేకపోయిందని ప్రేక్షకులు చాలా ఉత్కంఠంతో ఉండటం సహజం. ఇలాంటి బాధతో కూడిన ఉత్కంఠనుండి ప్రేక్షకులు కాస్త వూపిరి సలుపుకోవటానికా అన్నట్లు వకీలు వెర్రిబుర్రల వెంగళప్ప పాత్ర ఒకటి ప్రవేశపెట్టబడింది. ఇతడు పేరుకు తగ్గవాడు. అయోమయంగానే వాదిస్తాడు. కాని వంకరబుద్ధి కూడ దండిగా వున్నవాడు. ఈయన న్యాయశాస్త్రంలోని సెక్షన్లు, రకరకాల తీర్పుల నంబర్లూ ఉటంకిస్తూ అయో మయంగా వాదిస్తూ వుంటే ప్రేక్షకులకు నవ్వు వస్తూంటుంది. పాపం పిసినిగొట్టు లింగరాజు కోర్టు ఖర్చులు పెట్టుకొని ఈ వెంగళప్పవకీలును పెట్టుకొని వ్యాజ్యం వేస్తేఅంతా తల్లకిందులైపోయింది. తమవైపే కేసు బలంగా ఉంది కాబట్టి గెలుస్తాము, కోడలి నగలన్నీ ఒలుచుకొని ఆ అమ్మాయి పీడ వదిలించుకొని (కట్నం ఎలాగూ దక్కింది), కోర్టు ఖర్చులతో సహా రాబట్టి కులకవచ్చునన్న ఆశతో ధైర్యంతోనే లింగరాజు కోర్టుకెక్కింది. కాని కమల చిన్నదైనా ఆ అమ్మాయి వాదించుకున్న తీరు, అందులో నైపుణ్యం మెచ్చుకోవలసిందే, వాదన గురించి ప్రేక్షకులు ఆలోచించవలసిందే.

మైనరు తీరని బాలిక అయినప్పటికి చాకచక్యంగా జడ్జీ దగ్గర మనసు కరిగేట్టుగ మాట్లాడి కోర్టులోతన పాయింట్లు, కేసుకు సంబంధించిన వివరాలు అన్నీ విన్నవించుకొనే అవకాశం కలిగించుకుంది కమల. మైనరు

BRAOU

బాలిక కాబట్టి కోర్టులో మాట్లాడేందుకు రూలు ఒప్పుకోదని వెంగళప్ప వాదించిన సందర్భంలో కమల చట్టాల్ని గురించి చేసిన వ్యాఖ్యానం చాలఅర్థవంతమైంది : "అయ్యా చట్టము వేఱు సందర్భము వేఱు, సందర్భములను బట్టి చట్టములు మాఱును గాని చట్టములను బట్టి సందర్భములు మాఱవు" అనేది. చట్టాల కోసమే చట్టాలు అన్నట్లు భావించే వారికి వాదించే వారికి ఇది చెంపపెట్టు. మనుషుల కోసం, మనుషుల మేలుకోసం, మనుషుల న్యాయం కోసం న్యాయచట్టాలు కాని, చట్టాల కోసమే చట్టాలు అన్నట్లు రూల్సు పట్టుకు వేళ్ళాడే శుష్క న్యాయవాదులు కళ్ళు తెరవాల్సిన మాటలివి.

ఒక కమల తాను మగని యింటికి కాపురానికి వెళ్ళడం అనే విషయం గురించి వాదిస్తూ చెప్పిన మాటలు కట్నాల రాయళ్ళ కళ్ళు తెరిపించేవి. పెళ్ళి సంతలో పెళ్ళికొడుకు వేలంపాటలో పురుషోత్తమరావు అయిదువేల అయిదువందలకు పాడినప్పుడే అతడు వాళ్ళ సొత్తయినాడు. కాబట్టి ఆమె భర్త అనే వాని యింటికి వెళ్ళే ప్రసక్తే తలయెత్తదని వాదిస్తుంది. కావాలంటే వేలం జరిగిన దానికి దాఖలాగా వేలం అవుతూనే కట్నం సొమ్ముకు అడ్వాన్సుగా పదిరూపాయలు తీసుకొని లింగరాజు ఇచ్చిన రసీదును. కట్నం విషయంగా తయారుచేసిన అగ్రిమెంటునుచూడండి అంటూ ఆ రెండూ జడ్జి ముందుంచుతుంది. ఆ విధంగా పెళ్ళికొడుకు వేలం క్రయం తనఅక్క కాళింది కోసం జరిగిందనీ, కొన్నవాన్ని కట్టుకోవడం హీనమని భావించిన ఆమె ఆత్మ హత్య చేసుకున్నందునా, ఆ చేజిక్కిన ధనం వాళ్ళు తిరిగి ఇవ్వనందునా 'ఆక్రయం నా క్రింద మార్చవలసి వచ్చింద'నీ వివరిస్తుంది. "కట్నమునకును గ్రయధనమునకును గాసింతయు భేదము లేదు. ఉన్నదన్నను కట్నములు వివాహకాలమున నిచ్చుట గలదు, గాని వేలము, బజానా, అగ్రిమెంటు, ముందు చెల్లించుట యిట్టి యాచారమెచ్చటను లేదు. అందువల్ల నిది క్రయ ధనమగుట కాక్షేపణ మేమియు లేదు" అనీ వాదించింది కమల. అంతే కాదు 'ఫలానావారి కుమారునికి, ఫలానా వారి కుమార్తె నిచ్చి'... అనికదా పెళ్లి పత్రికలలో అచ్చు వేస్తారు, కాని ఇక్కడ వ్యవహారం పూర్తిగ వేరు, వరున్ని అమ్మాయి కోసం కొన్నారు గనుకా "ఫలానావారి అమ్మాయికి ఫలానావారి అబ్బాయినిచ్చి" అనే విధంగా న్యాయంగానే అచ్చు వేయించడం జరిగింది (కమల ఈ విషయంలో పెళ్ళికి ముందే ఆలోచించి తన ఇష్టానుసారమే తండ్రిచేత ఆ పని చేయించింది). చూడండి! అంటూ ఆ పత్రికలు కూడ జడ్జికి చూపించి, ఆనాడు ఇలా చేసినందుకు లింగరాజుగారు అభ్యంతరం కూడా ఏమీ చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు మీరు న్యాయం చెప్పండి! నా మీద నా భర్తకు అధికారం ఉందా, నాకు నాభర్త మీద అధికారం ఉందా? అంటూ నిలదీస్తుంది కోర్టువారిని. 'భర్త' భార్యను భరించేవాడు అయినప్పుడు, 'భార్య' భర్తచేత భరింపబడేది అయినప్పుడు ఆ పదాలకు ఆ అర్థం ఉండేది. ఇప్పుడు ఎవరు ఎవరిని భరిస్తున్నారు? ఎవరికి ఎవరి మీద అధికారం?

ఈ సమయంలో మేల్కొన్నాడు కట్నం మగడు అయిన బసవరాజు. అంత వరకు శ్రోతగానే మిగిలి పోయి మనసులో మధనపడుతూన్నవాడు కాస్త లేచి నిలబడి జడ్జి ముందుకు వచ్చి తన మాటలు నాలుగూ విన వలసిందని విన్నవించుకున్నాడు. ముందుగా మామగారిమీద వేసిన దావా ఉపసంహరించుకొంటూ, అది తన తండ్రి బలవంతం మీద చేసిన పని కాబట్టి; ఆతర్వాత తనఆవేదన ఇలా వ్యక్తం చేశాడు. ఆమె చెప్పిన విషయా లన్ని వాస్తవం. నాతండ్రి నన్ను నిజంగాలమ్మాడు. పురుషోత్తమరావుగారు వేలంలో కొన్నారు. కాబట్టి నేను ఆమెకు సేవకుడనే! 'కట్నములం గొనువారు రూఢిగా నమ్ముడు కాండ్రెకాక, మగలంటకు నర్హులు కారు లేశమునో'. న్యాయాధిపతి ఆ యువకుని నిజాయితీని మెచ్చుకున్నాడు. పశ్చాత్తాపాన్ని గుర్తించాడు. లోకానికి పాఠం నేర్పినవాడవు కమ్మని దీవించాడు.

కమల మందహాసంతో బసవరాజును తోడ్కొని వరవిక్రయ దురాచారాన్ని రూపుమాపటంకోసం పాటు పడదామని వెళుతుంది.

"పూజ్యతరమైన మన పుణ్యభూమి యందు ఈ నరమాంసవిక్రయము తగునా?"అన్నది పురుషోత్తమ రావుగారి ఆవేదన. కట్నం పేరుతో భార్యకు అమ్ముడుపోయినవాడు జన్మదాస్యంచేయవలసిందే, లేకపోతే అత్తవారింటిలో కుక్కగా పుడతాడంటూవరవిక్రయం పట్లతన కసి వ్యక్తం చేశాడు బసవరాజు. ఆడుపుట్టుక పుట్టి సాటి ఆడవారిని అవమానపరిచే విధంగా కట్నాలుకోరే అత్తల్ని గురించి చీదరించుకుంది భ్రమరాంబ. వెల పుచ్చుకొని వచ్చే వెడగులచేత పుస్తెకట్టించుకొని వాళ్ళకు దాస్యం చేయజూచే కన్యలకు ఆత్మాభిమానం కలిగి బతకండని కమల బుద్ధిచెబుతూంది. "కట్నపు సొమ్ముకంటె కాలకూట విషము మేలు" అన్న పశ్చాత్తాపం చెందిన ఒక బ్రాహ్మణుని సూక్తి!

ఈనాటి పరిస్థితుల్లో మనం అరవై రెండేళ్ళ క్రితం రాయబడిన ఈ నాటకాన్ని మరలా అధ్యయనం చేయడం, సాహిత్యాధ్యయనంలో భాగంగా మాత్రమే కాదు, జీవిత విమర్శలో భాగంగా కూడా. ... 41

BRAOU

వరవిక్రయం నాటకంలో పద్యాలు దండిగా ఉన్నాయి. అందులోనూ పాత్రలు "తనలో" అనుకునే విషయాలకు కూడ పద్యాలు రాశారు. ఏ విషయం మీద అయినా భావాలు వివరించడానికీ, వర్ణనలు చేయడానికీ రచయితలు ఎక్కువగా పద్యాలనే ఆశ్రయించినారు. ఈ నాటి దృష్టితో ప్రదర్శనకుకాని, పఠనానికి కానీ పద్యాలు ఎక్కువగా ఉండటం ఆటంకమనే చెప్పాలి. ఈ నాటకంలోని భాష కావ్యభాషను పోలి ఉన్నప్పటికీ, సరళంగా వాడుకకు దగ్గరగా ఉంది. సాంఘిక నాటకం అయినందున కనీసం ఈ మాత్రపు సౌలభ్యం ఉంది. ఈనాటి పాఠకులకు ఇదొక మేలు. పెళ్ళిళ్ళ పేరయ్య, వకీలు వెర్రి బుర్రల వెంగళప్ప, వంట వాడు ఘంటయ్య మొదలైన పాత్రల సంభాషల్లో వారి వాడుక భాషనే ప్రయోగించి ఉండటం గమనించవచ్చు.

ఈ నాటకం కంటె పాతిక సంవత్సరాల మునుపే వచ్చినట్టిదైనా కన్యాశుల్క నాటకం పద్యాలు, కావ్య భాష, ప్రాచీన నాటక లక్షణాలు మొదలైనవాటిని లెక్క చేయకుండా అత్యంత ఆధునిక నాటకంగా రూపొంది ఉండటం గమనార్హం. అది చాల ప్రత్యేకత కలిగిన నాటకం అని గమనించాం. వరవిక్రయ నాటకం ప్రాచీన నాటక లక్షణాలైన 'నాంది' 'ప్రస్తావన' లక్షణాల్ని కూడా పాటించింది.

## అభ్యాసం – 1

కింది ఖాళీలో మీ జవాబులు రాయండి. భాగం చివర ఇచ్చిన మాదిరి జవాబుతో సరిపోల్చుకొండి.

1. 'వరవిక్రయం' నాటక ధ్యేయం ఏమిటి? (15 పదాలలో రాయండి)

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

2. కోర్టులో కమల తనకు భర్త మీద అధికారం ఉందని చెప్పటానికి ప్రదర్శించిన రుజువుల్లో ఒకదానిని పేర్కొనండి. (25 పదాలలో రాయండి)

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

3. మీపాఠ్యం ఆధారంగా వరకట్న సమస్య స్వరూపాన్ని చర్చించండి. (150 పదాల్లో రాయండి)

_______________________________________________

_______________________________________________

_______________________________________________

_______________________________________________

 _______________________________________________

BRAOU

## 2.4 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- వరవిక్రయం నాటకం 1922 ప్రాంతంలో కాళ్ళకూరు నారాయణరావు రచించారు. ఇది 1935లో చిత్రంగా కూడా రూపొందించబడింది.
- కాళ్ళకూరు నాటకాలు సంఘసంస్కరణ ఉద్యమం ప్రభావంతో రాయబడినవే.
- వరవిక్రయం నాటకం ఆ నాటి సమాజాన్ని పీడిస్తూ ఉన్న వరకట్న దురాచారాన్ని చిత్రించి దాన్ని నిర్మూలించాలనే సంస్కరణ దృక్పథాన్ని కలిగించే ప్రయత్నం చేసింది.
- వరవిక్రయం నాటకంలో పరాకాష్ట అయిన నవమాంకం పాఠ్య భాగంగా ఇచ్చారు.
- ఇందులో ప్రధాన పాత్ర కమల తన అక్క కాళింది ఆత్మహత్యచేసుకున్నా 'వెలమగలకు' బుద్ధి చెపుతుంది. కోర్టు తన వాదనకు తగిన సాక్ష్యాధారాలనుచూపించి తాను వెల ఇచ్చి కొనుకున్న బసవరాజును తనను వెన్నంటి వచ్చేట్లు చేస్తుంది. అత్యాశపరుడైన లింగరాజుకు తగిన గుణపాఠం నేర్పుతుంది.
- వరవిక్రయం నాటకం ప్రాచీన నాటక లక్షణాలైన 'నాంది' ప్రస్తావన లక్షణాల్ని కూడా పాటించింది. ఈ నాటకంలోని భాష కావ్య భాషను పోలిఉన్నప్పటికీ సరళంగా వాడుక భాషకు దగ్గరగా ఉంది.

## 2.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబు రాయండి

1. కోర్టులో కమల కట్నాల పెళ్ళికొడుకులకు ఎలా బుద్ధి చెప్పిందోవివరించండి.
2. కమల భర్త బసవరాజు పాత్రను గురించి రాయండి.

15 పంక్తుల్లో జవాబు రాయండి

1. పాఠ్య భాగం ఆధారంగా ఈనాటి కట్న సమస్యను చర్చించండి.
2. వరవిక్రయంలోని భాష స్వరూపాన్ని వివరించండి.
3. కోర్టు ఎక్కటం కంటె కొఱత యెక్కటం మేలు అన్న పురుషోత్తమరావు సామెతలో ఉన్న ఆవేదన, ఆ సామెత పుట్టటానికి కారణాలు ఊహించి రాయండి.
4. కాళ్ళకూరి నారాయణరావును పరిచయం చేయండి.

## 2.6 ఆకళింపు ప్రశ్నలు

1. వరవిక్రయము నాటకాన్ని పూర్తిగా చదవండి. కట్నం సమస్యకు సంబంధించిన ఎన్నో విషయాలు అర్థమవుతాయి. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రుల అవస్థ ఏమిటో ఆవేదన ఎంతటిదో గ్రహించుకోవచ్చు. ఆనాటి ఈ దురాచారం, సమస్య స్వరూపం ఈనాటి దానితో పోల్చి ఆలోచించండి. ఈనాటి పరిస్థితుల్ని అంచనా వేయండి.
2. కన్యాశుల్కంలోని భాషకూ, వరవిక్రయంలోని భాషకూ మధ్య ఉండే తేడా ఏమిటి? ఆ తేడాకు గల కారణాలేమిటి? చర్చించండి.
3. కన్యాశుల్కంలో పద్యాలున్నాయా? ఎందుకున్నాయి? వరవిక్రయంలోని పద్యాలు ఎందు కున్నట్లు? పరిశీలించండి.

### అభ్యాసాలకు జవాబులు

1. వరకట్నం అనేది 'వరవిక్రయం' అని నిరసించి ఎగతాళి చేసి ఆ దురాచారం నిర్మూలింపబడాలనే సంస్కరణ ధ్యేయంతో ఈ నాటక రచన సాగింది.
2. పెళ్ళికొడుకును తనతండ్రి కట్నం వేలంలో అయిదు వేల అయిదు వందలకు కొన్నారనీ, అడ్వాన్సుగా పదిరూపాయలు తీసుకుని లింగరాజు ఇచ్చిన రశీదును, కట్నం డబ్బును గురించిన అగ్రిమెంటునూ కమల ఒక ఋజువుగా చూపించింది.



BRAOU

3. కాళ్ళకూరి కాలం నాడు ఏ కొందరో అభిమానవతులైన ఆడపిల్లలు కట్నం పెళ్ళి కొడుకులతోపుస్తె కట్టించుకోవడం యిష్టంలేకా, తండ్రులుకట్నం కారణంగా బికారులుకావడం ఇష్టం లేకా ఆత్మహత్యలు చేసుకున్నారు.

వరవిక్రయం నాటక రచయిత 1920 ప్రాంతంలో సమాజంలోని వరకట్నం దురాచార పరిస్థితికి ఎంతో తల్లడిల్లిపోయి, అసహ్యించుకొని, ఎగతాళిచేస్తూ ఈ నాటకం రాశారు. ఈనాటి వికృత పరిస్థితిలో ఎటువంటి నాటకం రాయాలి అనే ఆలోచన మనకు కలుగుతుంది. ఈనాడు వరకట్న సమస్య చాల విషమించింది. బేరసారాలు నిర్లజ్జగా సాగుతున్నాయి. అంతేకాదు 'అధికధరల్ని' డిమాండు చేసే హక్కు తమకున్నట్లు వరులు వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఎన్నో వస్తువుల ధరలతోపాటే వరుల ధరలూపెరిగిపోతున్నాయి.

ఈనాడు చదువుకొని ఉద్యోగాలుచేస్తున్న ఆడవాళ్ళు కూడ మగవాళ్ళతో సమానంగానే సంపాదించే ఉద్యోగాలే చేస్తూన్న వాళ్ళుకూడ పెళ్ళికొడుకులైనా మగవాళ్ళకి కట్నం మాత్రం చెల్లించుకొనక తప్పడం లేదు. ఇది తక్కువేమీ కాదు. కట్నంలేని పెళ్ళిళ్ళు ఎక్కడైనా ఒకటో అరో జరిగితే అవి ఈనాడు చాలా పెద్ద ఆదర్శవంతమైన వివాహాలుగా పరిగణిస్తున్నాము. సహజంగా జరిగిపోవాల్సిన వాటినే ఆదర్శంగా భావించుకొనే వింత గతి పట్టింది. 'కట్నం హత్యలు' (ఆత్మహత్యలుసరేసరి) గురించి ప్రతిరోజూ వార్తా పత్రికల్లోచాలా మామూలు వార్తల్లాగ చదువుకునే పరిస్థితికి వచ్చింది.

**– పి. సంజీవమ్మ**

BRAOU

# భాగం 3 ఎవరు దొంగ (ఏకాంకిక)

## విషయక్రమం

3.0 ఉద్దేశం
3.1 ప్రవేశిక
3.2 పాఠ్యం
3.3 పాఠ్య వివరణ
3.3.1 పాఠం విషయం
3.3.2 వ్యాఖ్యానం
**అభ్యాసాలు – 1, 2, 3, 4**
3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు
3.6 ఆకలింపు ప్రశ్నలు
అభ్యాసాలకు జవాబులు

## 3.0 ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత ఈ కింది అంశాలను వివరించగలుగుతారు :

- నాటిక స్వరూప స్వభావాలు
- ఆత్రేయ ఎవరు దొంగ నాటికలో సమాజ వాస్తవ చిత్రీకరణ

## 3.1 ప్రవేశిక

ఈ ఏకాంకికను రాసినవారు ఆత్రేయ.

తెలుగులో ప్రఖ్యాత రచయితలలో ఆచార్య ఆత్రేయ ఒకరు ఆయన అసలు పేరు కిళాంబి నరసింహాచార్యులు. నెల్లూరుజిల్లాకు చెందినవారు.

ఆచార్య ఆత్రేయ కొన్ని వందల సినిమాలకు రచనలు చేశారు. సినిమారంగంలో చేరకముందునుండీ చాలా నాటకాలు, నాటికలు రాశారు. ఆత్రేయగారితో తెలుగు నాటకరంగంలో కొత్త యుగం ప్రారంభమౌతుంది. మొదట ఆత్రేయగారు కొండముది గోపాలరాయశర్మగారి "ఎదురీత" నాటక ప్రదర్శనకు ఆంధ్ర నాటక కళా పరిషత్తు వార్షికోత్సవాలలో ఉత్తమ ప్రయోక్తగా, ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. తరువాత స్వయంగా చాలా నాటకాలను, నాటికలను రచించారు. ఆయన నాటకాలలో సామాజిక వాస్తవికత ప్రధానంగా కన్పిస్తుంది. గౌతమబుద్ధ, పరివర్తన, ఛస్తేనేం, కళకోసం, భయం, కప్పలు, అంత్యార్పణ, ఓటునీకా, చావకూడదు, వరప్రసాదం, అశ్వఘోషుడు, అశోకసామ్రాట్ – ఆయన రచనలలో చెప్పుకోవలసినవి. 1950లో 'ప్రగతి', 195లో 'ఎవరు దొంగ', 1960లో 'చావకూడదు' ఆంధ్రనాటక కళాపరిషత్తులో బహుమతులు పొందాయి.

నాటక ప్రయోగంలోను, రచనలోను ఆత్రేయ చాలా క్రొత్త ప్రయోగాలు చేశారు. రంగస్థలాలంకరణ ఏమీ లేకుండా వేరు వేరు భావాలను చూపించటానికి వేరు వేరు రంగుల తెరలను ప్రతీకలుగా వాడటం ఆయన చేసిన క్రొత్త ప్రయోగం. 'చావకూడదు' అన్నీ స్త్రీ పాత్రలేగల రచన.

"ఎవరు దొంగ" నాటికలోకూడా కొత్తప్రయోగం కన్పిస్తుంది. ప్రేక్షకులనుండి పాత్రను ప్రవేశపెట్టడం ద్వారా ప్రేక్షకులలో ఉత్కంఠను కలిగించి నాటక ప్రదర్శనవైపు దృష్టిని మరలించటం ఇందులోని ప్రత్యేకత. కటువైన సామాజిక వాస్తవికతను ప్రదర్శించటంలో ఒక కొత్త తరహా శిల్పాన్ని రచయిత పాటించాడు.



BRAOU

## 3.2 పాఠ్యం ఎవరు దొంగ (ఏకాంకిక)

**పాత్రలు**

దొంగ, చౌదరి, కానిస్టేబుల్, సబ్ ఇన్స్పెక్టరు, వార్డెన్, డి.యస్.ఓ., మునసబు, డాక్టరు, పత్రికా విలేఖరి, ఇద్దరు ఖైదీలు, కుర్రవాడు.

[తెర ఎత్తకుండానే నాటకము మొదలవుతుంది. మొట్టమొదట నాటకము మొదలు పెడుతున్నారని ప్రేక్షకులకు తెలియడానికి మైక్‌లో ఫలానావారు – ఫలానావారు రచించిన "ఎవరుదొంగ" అన్న ఏకాంకిక ప్రదర్శిస్తారు, అని ప్రకటన చేయబడుతుంది. తరువాత బెల్ అయిన వెంటనే పోలీసు విజిల్స్ నాలుగైదు వరుసగా గోలగా వూదబడతాయి. నలుగురైదుగురు బూట్లకాళ్ళతో పరుగెత్తుతున్న ధ్వని. రాను రాను దగ్గరవు తుంది. కాసేపటిలో తెరముందు నుంచి ఒకతను వాయువేగముతో పరుగెత్తుకొచ్చి స్టేజీ దిగి కూర్చుంటాడు. ఆ తరువాత ఒకతను పరుగెత్తికువచ్చి ఆగి అటు ఇటు చూచి, స్టేజీ దిగి, ప్రేక్షకుల దగ్గరకొచ్చి ప్రేక్షకులనంత కలియచూచి, ముందు వరుసలో వున్నవాళ్ళను చూచి]

అతడు : అరె! ఇలా ఒకతను పరుగెత్తుకొచ్చాడు. చూచారండి మీరు? ఇప్పుడే వచ్చాడు. చూచారండీ మీరు? ఇప్పుడే వచ్చాడు. అరె! ఇంతలో ఎలా వెళ్ళాడు? దొంగ వెధవ. మీరెవరూ చూడలేదాండీ. మనమంతా ఇక్కడున్నామని తెలిసి ఎలా వచ్చాడో వచ్చాడు. హాస్టల్లోకి మెల్లగా అటు ఇటు చూచి స్టోర్సు తాళం పగులగొట్టి లోపల దూరాడు సార్. నేను కనపడేటప్పటికల్లా పరారయ్యాడు. కాస్త చూడండయ్యా చూడండి.

[ ప్రేక్షకులలోంచి ఒక కుర్రాడు లేచి ]

కుర్రాడు : అరె! హాస్టల్‌లో దొంగ దూరాడా! ఏం పట్టుకెళ్లాడో? ఇప్పుడే ఇలా ఎవరో పరుగెత్తుకొచ్చారోయ్.

2వ వాడు : (తమిళంలో) ఆమా; ఆమా; ఎవను పోతేన్ ఇప్పిదా వందాన్.

3వ వాడు : (ఇంగ్లీషులో) జస్టు నవ్ ఎ ఫెలో రన్నింగ్ దిస్ వే.

4వ వాడు : ఏరా, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్ కాదుగదా కొంపదీసి.

1వ వాడు : అయితే వార్డెన్‌తో చెప్పావా ?

అతను : వార్డెన్ ఎక్కడ ?

1వ వాడు : చూడు, బ్రదర్, చూడు. ఆ మేకప్‌రూంలో వుంటాడేమో పద,

[ ఒకటవవాడు, అతడు స్టేజీమీదకు పరుగెత్తుతారు. ఇంతలో వార్డెన్ వస్తూ ]

వార్డె : ఏసే, ఏమిటిగోల? నాటకం జరగనీకుండా, వాట్ ఈజ్ రాంగ్ విత్ యు.

అతను : హాస్టల్ స్టోర్స్‌లో దొంగ పడ్డాడండి.

వార్డె : దొంగ !

1వ వాడు : అవునటండీ.

వార్డెన్ : తాళం పగలగొట్టాడా ?

అతను : అవునండీ !

వార్డెన్ : మనిషిని చూసావా ?

అతను : ఎవడో బెగ్గర్ వెధవండీ, రేగ్స్ (చింకిపాతలు) లో ఉన్నాడు.

వార్డెన్ : వాచ్‌మెన్ అంతా ఏం చేస్తున్నారోయ్ ?



BRAOU

1వ వాడు : ఇక్కడ నాటకం చూడ్డానికొచ్చేశారండి.

వార్డెన్ : నాన్సెన్స్, ఆ వెధవలకూ వైజ్ఞానిక వారోత్సవాలు కావలసి వచ్చినాయ్? కమాన్ కమాన్, వెళ్ళి అక్కడ ఏంజరిగిందో చూద్దాంరండి. [పోబోతూ, వెనక్కుతిరిగి] మహాశయులారా! ఈ అవాంతరము కలిగినందుకు విచారిస్తున్నాము. తొందరలో ఇంజనీరింగు కాలేజీవారి నాటకం మొదలు పెడతాం. మీరు కాస్త ప్రశాంతంగా వుండాలి. ఇప్పుడే వస్తా [అని పోబోతుండగా ఎదురుగా పోలీస్ సబ్ ఇనస్పెక్టరూ, కాన్స్టేబుల్ వస్తారు.]

వార్డెన్ : పోలీస్ !!!

సబ్ఇనస్పెక్టరు : గుడ్ మార్నింగ్ సార్.

వార్డెన్ : గుడ్‌మార్నింగ్. ఏం కావాలండి?

స.ఇ. : ఏం లేదండి ? ఈ హాస్టల్ వార్డెన్ గారెవరండి ?

వార్డెన్ : నేనే ఎందుకండి ? దొంగ దొరికాడా ?

స. ఇ. : దొంగా ?

వార్డెన్ : ఆఁ దొంగండి, హాస్టల్ స్టోర్సులో తాళం పగలగొట్టి దూరాడు. మనిషి కనపడేటప్పటికల్లా పత్తాలేకుండా పోయాడు.

(ఇంతలో లోపల నుంచి ఒక కుర్రాడు పరుగెత్తుకొస్తూ)

కుర్ర : సార్ ! సార్ !

వార్డెన్ : ఏం ?

కుర్ర : మనం నాటకానికి తెచ్చిన డ్రస్‌ల మూటంతా కనపడ్డం లేదండి.

వార్డెన్ : వెదకండోయ్ ! ఎక్కడో వుంటుంది. అన్నీ ఇప్పుడే వస్తాయి మీకు.

కుర్ర : వెదికామండి ! ఎక్కడాలేదు. ఇప్పుడే తెచ్చి ఆ డ్రెస్సింగ్ రూమ్‌లో పెట్టాం. ఒక్క మినిట్ ! చూస్తే లేదు.

వార్డెన్ : చూచారండి, ఇదీ ఆ దొంగే కొట్టేసుంటాడు. సందేహంలేదు.

స. ఇ. : దొంగ ఎలా పారిపోయాడో ఎవరన్నా చూసారా ?

అతను : కాస్త దూరం నుంచి టార్చివేసి చూచానండి, మనిషి ముఖం కనపడలే ! ఒక ముష్టివాడిలా ఉంటాడు. చిరిగిన చొక్కా, చింపిరి తల, అయిదడుగుల రెండంగులాలు లేక మూడంగుళాలు ఉంటాడు.

స. ఇ. : లావుగా వుంటాడా ! బక్కగా వుంటాడా ?

అతను : మీడియం (మధ్యస్థం) గా ఉంటారండి.

స. ఇ. : (కానిస్టేబుల్‌తో) ఏయ్ ! ఈ గుంపులో ఎక్కడన్నా ఉన్నాడేమో వెతుకు. (కానిస్టేబుల్ స్టేజిదిగి ఆడియన్సులోంచి మెల్లగా జారుకుంటాడు).

స. ఇ. : వాడు వెతికి పట్టుకొస్తాడు లెండి; మీరు కాస్త దయచేసి స్టేషన్‌దాకా రావాలి.

వార్డెన్ : దొంగ దొరకందే !

స. ఇ. : దొంగ వాడే దొరుకుతాడు లెండి.

వార్డెన్ : రేపు మార్నింగు రాకుడదూ ? నాకో ఫంక్షనుంది.

స. ఇ. : లేదండి ! వెంటనే రావాలి.



BRAOU

వార్డె : కాస్త కూచోండి, వెళ్దాం ! ఇప్పుడు ఇంజనీరింగు కాలేజీవాళ్ళ నాటకం వుంది. చూచిపోదాం. లాస్ట్‌యియర్ (నిరుడు) ఫస్ట్‌ప్రయిజ్ వచ్చింది వీళ్ళకే. ఈసారి కూడా మంచి నాటకమే ఆడతారు. చూచి వెళ్దాం ఏమంటారు ?

స. ఇ. : నో, ఎక్స్‌క్యూజ్‌మీ; ప్లీజ్; క్షమించండి. మాకు నాటకాలు చూసే తీరిక లేదు.

వార్డెన్ : పోనీ రేపు మార్నింగ్ వచ్చి రిపోర్టు యివ్వకూడదాండీ ?

స. ఇ. : రిపోర్టు యిదివరకే యిచ్చేశారు. ఇక మీరు యివ్వాల్సింది సంజాయిషీనే !

వార్డెన్ : ఏమిటి ?

స. ఇ. : యు ఆర్ అండర్ అరెస్టు. (మిమ్మల్ని అరెస్టు చేశాం)

వార్డెన్ : అరెస్టు ! మై సెల్ఫ్ వాట్ ? నన్నా, ఏమిటి !

స. ఇ. : యు ఆర్ అండర్ అరెస్టు.

వార్డెన్ : ఓ..............

స. ఇ. : రాండి సార్, రండి !

[ ఇంతలో ఒక కానిస్టేబుల్ గబగబ వస్తాడు. సబ్ ఇన్స్పెక్టరుకి సెల్యూట్‌కొట్టి........... ]

కాని : సార్ !

స. ఇ. : ఏం రా ?

కాని : బాపూజీ రైస్ మిల్లుదాకా వెళ్ళి రావాలి సార్ !

స. ఇ. : ఎందుకూ ?

కాని : పెద్ద గొడవ జరుగుతూందండి అక్కడ !

స. ఇ. : ఏమిటా గొడవ ? బందిపోటా ?

కాని : కాదండి !

స. ఇ. : కమ్యూనిష్టుల శాబటేజా ?

కాని : కాదండి !

స. ఇ. : మరి ఏమిటి ? తగాయి !

కాని : వచ్చి చూడండి సార్ !

స. ఇ. : చెప్పవోయ్, ఏం ఫరవాలేదు.

కాని : నేనలా మిల్లు దగ్గర నిలబడి ఉన్నాను సార్! లైట్లున్నట్టనిపించింది. ఏమిటిరా, అర్ధరాత్రిలో లైట్లేమిటని కాస్త చెవిపెట్టి విన్నానుసార్! ఎవరో యిద్దరు మాట్లాడుతున్నారు. ఒక అతను "మూటకు అరపడి రాళ్ళు కలిపితే మీకెంత లాభం వస్తుందయ్యా. నువ్వు సుమారు 60 లక్షల మూటలు సప్లయి చేస్తున్నావు. అరవై లక్షల అర్ధ రూపాయలు 30 లక్షలు వొస్తుంటే, మాకు పదివేలివ్వడానికి ఏడుస్తావు? సరే నీ ఇష్టం" అంటున్నాడండి. ఇంకో అతను "మన సంబంధం యీ రోజుతో తీరేదాండి! యింకా వుందిగా! ప్రస్తుతం ఈ అయిదూ తీసుకోండి. మీ ముందున్న ఆఫీసరుగారు కూడా ఇంతే పుచ్చుకునేవారు" అంటున్నాడండి. ఏమిటో గొడవ!

స. ఇ. : ఊఁ. గొడవ ఏముందీ ! కరప్షన్ (అవినీతి), ఈలాంటి మనుషులుంటే ! దేశంలో తిండి ఎందుకుంటుంది ? తిండి లేకుండా చస్తారంటే ఎందుకు చావరూ? ఛీ... ఛీ... ఆల్‌రైట్. రాండి.

వార్డెన్ : జస్టు ఎ మినిట్ ప్లీజ్; మహాశయులారా ! ఈ నాటక కార్యక్రమం యధాప్రకారంగా సాగుతుంది. ఇంజనీరింగు కాలేజివారు నాటకం ఆడతారు. సెలవు (సైడ్ కర్టన్సు లోకి చూచి) కమాన్, కమాన్ ఆరంభించండి, తెరెత్తండి. తెరెత్తండి ఇప్పటికే చాలా ఆలస్యమైంది.

[ అని అందరూ వెడతారు : తెర లేస్తుంది ]

BRAOU

[ ఒక పోలీసు స్టేషన్ - సబ్ ఇన్స్పెక్టరు వచ్చి కూర్చుంటాడు ]

[ ఒక వైపులో ఉన్న రిమాండు సెల్లులో ఒక రిద్దరు ఖైదీలు ఉన్నారు. తెర లేచేటప్పటికి ]

2వ ఖైదీ : "దొంగలెవరో దొరలు ఎవరో" తెలుసుకొనవోయ్ బ్రహ్మయా !

1వ ఖైదీ : అన్నమైతే నేమిరా సున్నమైతే నేమిరా.

2వ ఖైదీ : అందుచేతను పాడుపొట్టకు అన్నమే వేతామురా !

( అని పాడుతుంటారు )

[ ఇంకొకవైపు బియ్యపు బస్తాలు ఉన్నాయి. కుడివైపు నుంచి బావిలో పెద్ద బరువయిందేదో వేసినట్లు రెండు మూడుసార్లు శబ్దం, తరువాత కెవ్వుమని ఒక ఆడదాని కేక. ఈ పాటికి సీటులోంచి లేచిన స. ఇ. గాభరాగా పరుగెత్తాడు. రిమాండులో ఉన్న ఖైదీలు ద్వారం దగ్గరకువచ్చి ఆత్రంగా చూస్తుంటారు. బయట ఏదో గోల. ఇంతలో కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చాడు. టేబుల్‌మీద ఉన్న టార్చిలైటు, మూలనున్న చేంతాడు తీసుకొని మళ్ళీ బయటకు పరుగెత్తాడు. ఒక క్షణము నిశ్శబ్దం. స. ఇ. తొందరగా వచ్చి టేబిల్ మీదనున్న టెలిఫోన్ పెట్టేస్తాడు. గాబరాగా అటూ ఇటూ తిరిగి, 'చూస్తూ నిల్చుంటారేమిటిరా ఇడియట్స్ ఫస్టు ఎయిడ్ ఇవ్వండిరా!' ఇంతలో ఇంకొక కానిస్టేబుల్ వస్తాడు.]

కాని : ముగ్గురు బిడ్డలు దొరికారండి.

స. ఇ. : ఓ మైగాడ్ ! ముగ్గురు బిడ్డలే ? అందరూ చచ్చిపోయారా ?

కాని : చచ్చి ఎప్పుడో పోయారండి.

స. ఇ. : ఛీ ఛీ ఛీ నేను చూస్తున్నా ! ఏమిటో ఈ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ఒకటే చావులు ! ఒకటే ఆత్మహత్యలు !

కాని : ఇంగ్లీషువారుండగా చావటానికి స్వాతంత్ర్యం లేదండి

స. ఇ. : అయితే ఇప్పుడు స్వాతంత్ర్యం చావటానికి వచ్చిందంటావా ?

కాని : ఆ రోజుల్లో మన కాంగ్రెసు వాళ్ళు ఉపవాసాల్తో బానిసలుగా బ్రతకడంకన్నా, స్వతంత్రులుగా చావటమే మేలనేవారండి !

స. ఇ. : కాదురా ఈడియట్ ! బానిసలుగా పాయసం తాగడం కన్నా స్వతంత్రులుగా గంజి తాగటం మేలని.

1వ ఖైదీ : ఇప్పుడు కాయకూరలు తింటమే మేలంటున్నారండి.

[ ఇంతలో డాక్టరు వచ్చాడు ]

స. ఇ. : హల్లో డాక్టర్ !

డాక్ట : ఏమిటండి గొడవ ?

స. ఇ. : ఆ ఆడమనిషి ముగ్గురు పిల్లల్ని బావిలోపడేసి తానూ పడిపోయిందండి. ఇంకో క్షణముంటే....!

డాక్ట : ఏ బావిలో?

స.ఇ : మన స్టేషన్ బావిలోనుండి.

డాక్ట : తప్పు చేసింది. ఏ ఎమ్.ఎల్.ఏ. ఇంటి వెనకాల బావిలోనే పడివుంటే, కొంత ఫలితముండేది.

స.ఇ : ఏముండేది? తీసేవాళ్ళయినా లేకుండా చచ్చేది.

డాక్ట : మరిప్పుడామెను బ్రతికించి గొప్ప ఘనకార్యము చేశామనుకుంటున్నారా?

స.ఇ. : కాదుమరీ! ఒక ప్రాణాన్ని కాపాడాం.



BRAOU

డాక్ట : ఎందుకూ? ఈ రామరాజ్యంలో ఇంకా కాలాలపాటు బ్రతుకమనా? రైట్ రైట్ (వెళ్ళూ చూచి ఆగి, బస్తాలో బియ్యం చూస్తూ) యస్.ఐ. గారూ! ఈ కేసుకు కారణం ఏమిటో చెప్పమన్నారా?

స.ఇ. : ఆ, ఏముంటుంది? ఏవో కొంపలో వెధవగొడవలు.

డాక్ట : [పిడికెడు బియ్యము తీసుకొచ్చి ఎస్.ఐ. చేతిలో పోసి] నా చిన్నతనంలో అందరూ అనేవాళ్ళు - అన్నం లేకుండా ఎవ్వరూ చావరు లేరా అని. కాని ఇప్పుడు నూటికి - యాభై చావులు అన్నంలేకనే. దేశం మారిపోయింది.

[డాక్టరు వెళ్ళిపోతాడు, ఎస్.ఐ. బియ్యాన్ని చేతిలో నుండి ఇంకొక చేతిలో పోసుకుంటూ, అలాగే చూస్తూ కుర్చీలో కూలబడ్డాడు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు ...]

ఒకడు : ఇదంతా చూస్తుంటే జెయిల్లో నుంచి విడుదల చేస్తారంటే - భయంగా ఉందిరా!

రెండ : ఆఁ. విడుదల చేసినా ఎంతసేపు. మరలా ఒక్క రోజులో తిరిగిరావచ్చు.

1వ : ఎట్టా?

2వ : నీకు తెలియదేం? సుళువైన ధోవ వుంది. ఎఱ్ఱ గుడ్డ పీలిక పట్టుకు బయలుదేరానంటే, కళ్ళు మూసి తెరిచే లోపల - మళ్ళీ కటకటాల వెనక ఉంటాము.

స.ఇ. : (తిరిగిచూచి) ఆ కాలం పోయింది. ఇప్పుడు తుపాకి పెట్టి కాల్చేస్తాం!

2వ : అది మరీ సుళువుకదయ్యా - ఒకేసారి చస్తాం.

స.ఇ. : చస్తాం, చస్తాం. ఏమిటీ దేశంలో అందరూ ఒకటే చస్తాం, చస్తాం అంటారు!

1వ : బతుకుతాం - బతుకుతాం - అనటానికి ధైర్యం లేదుగనుక,

స.ఇ. : ఎందుకు లేదోయ్! అనండి, ధైర్యంగా అనండి - బ్రతుకుతామని ...

2వ : మరీ ఉద్యోగానికి చాలా కష్టంగా లేదయ్యా?

స.ఇ. : ఏం?

2వ : పాతబడ్డ పోలీసోళ్ళందరూ, బతకమని అనలే!

[ఒక పత్రికా విలేఖరి ప్రవేశము]

ప.వి : నమస్కారమండి ...

స.ఇ. : నమస్కారం. రాండి కూచోండి. ఏమిటి విశేషాలు?

ప.వి : ఏమున్నాయ్, మీరే చెప్పాలి. మరి మన పోలీస్‌స్టేషన్ బావిలో -

స.ఇ. : అవునవును. ఒక తల్లీ ముగ్గురు పిల్లలూ పడి చచ్చారు.

ప.వి : చచ్చిపోయారా!

స.ఇ. : తల్లిని మాత్రం తీశాం. డాక్టరు వచ్చారు. బహుశా - బ్రతుకొచ్చు.

ప.వి : పేపరును న్యూస్ పంపించమంటారా?

స.ఇ. : పంపండి; ఏం? వన్నడగట మెందుకూ?

ప.వి : అలా కాదులెండి; ఈ మధ్య ఈలాంటి వార్తలు పూర్తిగా బహిష్కరిస్తున్నారుగా.

స.ఇ. : ఎవరు?

ప.వి : ఎవరేమిటి. ప్రభుత్వమే. ఇదిగో - చూడండి. ఈ రోజు పేపరులో ఏమంటున్నారో మన వాళ్ళు- "ఆహార పరిస్థితిని గురించి కొందరు విష ప్రచారము చేస్తున్నారు. గోరంతలు కొండంతలు చేస్తున్నారు. నిజంగా అంత తీవ్ర పరిస్థితులు లేవు. చిత్తూరుజిల్లా తదితర



BRAOU

ప్రాంతాలలో చావులకు కారణం - అన్నంలేక కాదు, ఇతర జబ్బులే. ఆహార పరిస్థితి సంతృప్తి కరంగా ఉందని గ్రామాలలో నుంచి బాధ్యతల వ్యక్తులు మాకు స్వయముగా తెలియ జేస్తున్నారు". విన్నారా?

స.ఇ.: నిజమే! నేనూ ఇన్నాళ్ళు అలాగే అనుకున్నా, కాని అదంతా అబద్ధమని ఈనాడు తెలుసుకున్నా!

ప.వి : ఏదంతా అబద్ధమని?

స.ఇ. : అన్నము లేనందువల్ల, ఆకలి బాధకి ఆగలేక, మనుష్యులు చస్తున్నమాట యదార్థం.

ప.వి : యస్.ఐ. గారూ!

స.ఇ. : ఎందుకలా తెల్లబోతారు?

ప.వి : మీరు గవర్నమెంటు ఉద్యోగులు!

స.ఇ. : అయితే నిజం మాట్లాడకూడదంటారా?

ప.వి : నిజం మాట్లాడటమే ఈ రోజుల్లో ఒక విధ్వంసక చర్యగా వుంది.

స.ఇ. : నేనిప్పుడు గవర్నమెంటును పడగొట్టాలని ప్రయత్నించడములేదు. నాకు మంత్రి పదవి మీద ఆశా, వున్నవారి మీద అసూయా - రెండూ లేవు. నేను కమ్యూనిస్టును కాను. కాని నా అభిప్రాయమేమంటే మనమే మనవాళ్ళని చంపుతున్నాం, మనలోనే వున్నారు దొంగలు! మనలో ఉన్న దొంగల్ని మనం పట్టుకోగలిగితే, గవర్నమెంటు దానంతటదే బాగుపడుతుంది.

ప.వి : అయితే మీరు ఆహార సమస్యమీద తీవ్రంగా పనిచేయదలచుకున్నారన్నమాట!

స.ఇ. : నా శక్తివంచన లేకుండా!

[డాక్టరు వస్తాడు]

స.ఇ. : డాక్టర్! ఆ పేషంట్ ఎలా వుంది?

డాక్ట : (తాపీగా) ఆవిడ్కి రేషన్‌కార్డు అవసరంలేదు.

స ఇ. : వాట్?

డాక్ట : వాట్‌లేదు, గీటూలేదు. ఆహార సమస్యను అతి సులభంగా పరిష్కరించుకొని వెళ్ళింది.

స.ఇ. : అయితే ఆకలితోనే - అన్నం లేనందువల్లనే చచ్చిందంటారా!

డాక్ట : సైన్సుకు తెలిసినంతవరకూ అలా చెప్తుతుంది. పత్రికల్లో స్టేట్‌మెంట్లా? ప్లాటుఫారం మీద ఉపన్యాసాలు ఎవరినన్నా మోసం చేయవచ్చునుగాని, మెడికల్ సైన్సును మోసం చేయటానికి వీల్లేదు.

ప.వి : డాక్టరుగారూ! మా పేపరుకు ఒక స్టేట్‌మెంటు యిస్తారా?

డాక్ట : నేనింకా కనీసం ఒక ఎం.ఎల్.ఏ నయినా కాందే.

ప.వి : ఈ విషయం బాగా తెలియటం అవసరం కదండీ?

డాక్ట : చస్తున్న వాళ్ళకు చస్తున్నామని తెలియడమేమిటి? ప్రజలకు కాదు తెలియాల్సింది, ప్రభుత్వానికి.

స.ఇ.: డాక్టరుగారూ! అయితే నిజంగా చచ్చిపోయిందంటారా?

డాక్ట : చచ్చిపోలేదు - కానీ, ప్రాణాలు పోయినాయి. (యస్.ఐ. మీదకు ఉరికి) నువ్వింకా ఆరౌన్సులు కాదు, బస్తా బియ్యం ఇచ్చినా ఆమె బ్రతకదు.

స.ఇ.: (కుర్చీలో కూలబడ్డాడు) ఒక తల్లీ, ముగ్గురు బిడ్డలూ. అబ్బ! ప్రాణాలంటే ఎంత చులకనై పోయింది.



BRAOU

డాక్ట : (యస్.ఐ. వీపుతట్టి) నువ్వు పోలీస్ ఉద్యోగంలో ఉండతగ్గవాడివి కావు. నీకేదో కాస్త హృదయం ఉన్నట్లుంది.

స.ఇ. : (లేచి పిచ్చిగా తిరుగుతూ) ఇదేనా నా దేశం? ఇన్ని పొలాలూ, ఇంత పంటా, ఇందరు జనముండీ, ఒక్క ఆడది అన్నం లేకుండా చచ్చిందంటే మన కెందుకు సిగ్గులేదు? మనమెలా తలెత్తుకు తిరుగుతాం?

డాక్ట : కాలేజీ నాటకాల్లో ఎప్పుడన్నా వేషాలు వేశావా?

స.ఇ. : డాక్టరుగారూ! పరిహాసానికి ఇదా సమయము?

డాక్ట : పరిహాసం కాదోయ్ పిచ్చివాడా! తొంభై మంచి గింజల్లో – ఒక్క పుచ్చు గింజ ఎంతో, తొంభై పుచ్చుల్లో ఒక్క 'మంచ'న్నా అంతే. నువ్వొక్కడివి ఏం చేయగలవు? లంచగొండితనమూ, బ్లాక్‌మార్కెట్ అధికారం చెలాయిస్తున్న రోజుల్లో, నీ ఆవేదనంతా నిరుపయోగం.

స.ఇ. : అయితే నేను ఈ ప్రవాహంలో కొట్టుకు పోవలసిందేనా? ఏం చేయలేనంటారా?

డాక్ట : చేయగలవు. కాని నీకు ప్రమోషన్లు రావు. నిన్ను ఏ ఎడారికో బదిలీ చేస్తారు. ఇంకా ఇలాంటి ఇబ్బందులెన్నో వస్తాయి.

స.ఇ. : ఎన్నొచ్చినాసరే, యీ నిండు ప్రాణాలు తిండిలేకుండా మాడిపోయే దౌర్భాగ్యాన్ని ఆపాలి.

డాక్ట : సరే! ప్రయత్నించు. విష్ యు సక్సెస్. (వెళ్ళిపోతాడు)

స.ఇ. : (కాస్సేపు ఆలోచించి కాలింగుబెల్ కొట్టాడు; కానిస్టేబుల్ వచ్చాడు) ఏయ్! ఆ వార్డెన్‌ని పిలుచుకురా!

[కానిస్టేబుల్ వెళ్ళాడు]

స.ఇ. : (విలేఖరితో) మీరా గదిలో ఉండండి. ఇక్కడ జరిగే ప్రతి విషయం – తు.చ. తప్పకుండా రేపు పత్రికకు పంపండి. (ప.వి. వెళ్తాడు. ఇంతలో వార్డెన్ వచ్చాడు). వార్డెన్‌గారూ! ఇప్పుడొక స్త్రీ – ముగ్గురు పిల్లల్ని కాలువలో పడేసి, తాను పడి చచ్చిపోవటానికి కారణం ఏమిటో తెలుసా?

వార్డె : ఓ! ఈజీట్

స.ఇ. : అవును; ఇలా తిండిలేక పోవటానికి కారణం ఎవరో తెలుసా?

వార్డె : అదేనండి! మీరు ఉండమంటే ఉన్నారు కారు; ఇంజనీరింగు కాలేజీవాళ్లు ఆహారసమస్య మీద మంచి నాటకం ఆడబోతున్నారు. చూచివుంటే తెలిసేది – తిండిలేకపోవటానికి కారణం ఎవరో?

స.ఇ. : నాన్సెన్స్! నాటకాలు! నాటకాలు! 'ఆహారసమస్య'ను నాటకాలటయ్యా పరిష్కారం చేసేదీ! మీ బోటి పెద్దమనుషులంతా ఇలా బస్తాలబియ్యం బ్లాకుమార్కెటులో కొని దాచేస్తుంటే, తిండెలా వుంటుంది? మనుషులెందుకు చావరు?

వార్డె : ఇదంతా మా స్టూడెంట్సుకోసం కొన్నామండీ! ఇచ్చే రేషన్ చాలటంలేదు. చూడండీ! స్టూడెంట్సు ఫ్యూచర్ సిటిజన్స్ (భావి పౌరులు) వాళ్ళకు మంచి నరిష్మెంట్ ఉండాలి.

స.ఇ. : మీ సమర్థనలన్నీ తర్వాత చెప్పుకుందు కానీ, ఎక్కడ కొన్నా రీ బియ్యాన్ని?

వార్డె : చెప్పాలంటారా?

స.ఇ. : చెప్పాలనే అడగటం!

వార్డె : చూడండి, ఇది ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్,

స.ఇ. : ఇదేనేమో మీరిచ్చే ఎడ్యుకేషన్! అడిగిందానికి జవాబు చెప్పండి.

 వార్డె : బాపూజీ రైస్ మిల్లులో కొన్నానండి.

BRAOU

2వ ఖైదీ : బాపూజీ రైస్ మిల్లే! బాపూజీ రైస్‌మిల్లే!

స.ఇ. : బాపూజీ రైస్‌మిల్! సరే, మీరు వెళ్ళి అక్కడ కూర్చోండి.

[వార్డెన్ వెళ్ళాడు]

స.ఇ. : (బెల్ కొట్టాడు. కానిస్టేబుల్ వచ్చాడు) సుబ్బయ్య చౌదరిని పట్టుకురా. (కానిస్టేబుల్ వెళ్ళాడు. ఒక పెద్ద పట్టాతీసి బియ్యం బస్తాలు కప్పేశాడు యస్.ఐ. ఇంతలో సుబ్బయ్య చౌదరి వచ్చాడు).

చౌదరి : నమస్కారమండీ.

స.ఇ. : నమస్కారం. రాండి, రాండి!

చౌదరి : ఏమిటో అంత తొందరగా కబురు పంపారు?

స.ఇ. : ఏంలేదు. మీ మిల్లు నుంచి ఎన్ని బస్తాలు రవాణా అవుతాయ్?

చౌదరి : సుమారు 60 లక్షలు.

స.ఇ. : ఊఁ! ఎన్ని బస్తాలు రాళ్ళు సరఫరా చేస్తారు?

చౌదరి : అబ్బే! రాళ్ళెక్కడివండీ?

స.ఇ. : పోనీ - మట్టి ముద్దలు?

చౌదరి : ఏదైనా పొరపాటు ఉంటే ఒకటి రెండూ వస్తే వస్తాయేమో గానీ -

స.ఇ. : డి.యస్.ఓ. కి ఎంత యిస్తారు?

చౌదరి : జీతమాండి?

స.ఇ. : కాదు. అర్ధరాత్రిలో లైటువేసుకొని బస్తాకి అరవడి రా[illegible] క[illegible]నికి ఆయన అనుమతి కోసం - మీరిస్తారే సంభావన?

చౌదరి : లంచమాండి?

స.ఇ. : ఛ, ఛ; పెద్దవాళ్ళు తీస్తే లంచమెందుకు [illegible]ండి?

చౌదరి : అట్లా మేము ఇంతవరకు [illegible]గవండి. రైస్‌మిల్లు బాపూజీ చనిపోయిన రోజున స్థాపించామండి.

స.ఇ. : బాపూజీ బ్రతికివున్నప్పుడు స్థాపిం[illegible] కట్టయిపోతు[illegible]ే, చచ్చిన తరువాత స్థాపించిన దాంట్లో తప్పులేదులెండి.

చౌదరి : మీరేదో కానివాళ్ళ మాటలు నమ్మి -

స.ఇ. : (చాలా సీరియస్‌గా లేచి) చౌదరిగారూ! (పెద్దగా అరిచాడు).

చౌదరి : (కాస్త కంగారుపడి - తెప్పరిల్లి కాస్త విసురుగా) ఏమిటండి మీ బెదిరింపులు?

స.ఇ. : (తాపీగా) బ్లాక్‌మార్కెట్ చేసినవాళ్ళను ఉరి తీస్తానని నెహ్రూ ఒకప్పుడు చెప్పాడు.

చౌదరి : ఆ! చెప్పాడు. ఒక్కడిని ఉరి తియ్యగా ఇప్పటికి చూడలా!

స.ఇ. : అదే పొరపాటు జరిగిపోయింది. తీసి వుంటే ఈ బస్తాలు ఇక్కడికి వచ్చేవి కావు (బస్తాలు తీసి చూపుతాడు) ఈ బస్తాలు ఇక్కడికిరాకుంటే, ముగ్గురు బిడ్డల తల్లి చచ్చేదికాదు. న్యాయశాస్త్రం లేదు కానీ, నువ్విప్పుడు నలుగురి ప్రాణాలను ఖూనీ చేసావు.

చౌదరి : ఏమండి! కాస్త మర్యాదగా మాట్లాడండి.



BRAOU

స.ఇ. : మనుష్యుల్ని తినేవాళ్ళకు మర్యాదా, గౌరవమూ, పదవులూ ఇవ్వబట్టి మనలోకం యిలా తయారైంది. నేను మీకలాంటి మర్యాదా యివ్వదలుచుకోలా. (రిమాండ్ సెల్‌వేపు చూచి) గవర్నమెంటు తరుపున మీకిక్కడ కావలసిన మర్యాదలు జరిపిస్తా. (బెల్లు కొట్టి) వార్డెన్‌గారూ! (వార్డెను వచ్చాడు) యీయన్ని మీరెరుగుదురా?

చౌదరి : తెలిస్తే?

స.ఇ. : ఏమీలేదు. కాస్సేపు కూర్చోండి (యస్.ఐ. బైటికి వెళ్ళాడు)

చౌదరి : (ఇటు అటు చూచి) చెప్పారా ఏం, కొంపతీసి?

వార్డె : మీరూ డి.యస్.ఓ. మాట్లాడుతుండగా విన్నొచ్చి కానిస్టేబుల్ చెప్పాడు.

చౌదరి : అయితే ఈ రాయి డి.యస్.ఓ. దాకా తగుల్తున్నదన్నమాట.

వార్డె : వీడెవడో కాలాంతకుడిలా ఉన్నాడు; గట్టి పట్టుపట్టాడు.

చౌదరి : ఏం ఫర్వాలేదు, డి.యస్.ఓ. బావగారు ఎం.ఎల్.ఏ. క్షణంలో కేసు కొట్టించేస్తాడు.

వార్డె : అయినా మనం చేసిందీ తప్పే.

చౌదరి : తప్పేమిటండీ, తప్పు! ఈ కాలంలో ఎవడికివాడు నాలుగు కాసులు చేసుకోవాలి.

వార్డె : గవర్నమెంటు ఇప్పుడు కాస్త తీవ్రంగా చర్య తీసుకుంటున్నట్లుంది.

చౌదరి : తీవ్రమూలేదు, చర్యాలేదు, బాపనయ్య దగ్గర రెండు మూడు వందల పుట్ల ధాన్యం మూలుగుతోంది. ఆయన గడపతొక్కి, 'పడి' ధాన్యం తెచ్చే ధైర్యం ఒక్క ఆఫీసరుకూ లేదు.

1వ ఖైదీ : అవున్నా, అఫీసర్ల ధైర్యమంతా మన బోటోళ్ళ మీదనే!

2వ ఖైదీ : అంతేకాదు! పెటునగాళ్ళు! గుడిసెలమీదపడి, రోజుకు పెట్టుకున్న ధాన్యాన్ని కూడా లాక్కుపోతున్నారు.

1వ ఖైదీ : మా వూళ్ళో "రిలీఫ్ అంగడి" పెట్టారు. ఊరి మునసబుకిచ్చారు; 20 బస్తాలొస్తాయి; అందులో వారానికి అదుఖ పక్కం 10 బస్తాలు ఆయన ఎనకేస్తాడు.

2వ ఖైదీ : ఎట్టా? లెక్క రాదా?

1వ ఖైదీ : ఎట్టా గేంటోయ్? చుట్టుపక్కలున్న గ్రామాల్లో అంతా కూలీనాలీ చేసుకునే జనం అధికం. వాళ్ళకొక్కక్క వారం మొత్త రషను కొనుక్కునేందుకు డబ్బులుండవు; అంతగా కూలీనాలీ చేసి డబ్బులు తెచ్చుకుంటే - వారం అయిపోయిందంటాడు; రేషనుకార్డులన్నీ ఆళ్ళ దగ్గరే వున్నాయ్. ఆళ్ళకి సదువా ఏంరాదా? ఇచ్చినట్లు గీట్లు గీస్తుంటాడు. అడిగే నాయాలెవడు?

2వ ఖైదీ : చెక్కింగు ఆఫీసర్లుంటారు గద్రటా?

1వ ఖైదీ : ఆఫీసర్లంటే ఆకాశాన్నుండూడి పడ్డారనా? ఆళ్ళూ మనుషులే! ఆశ చూపిస్తే అందరూ లొంగుతారు.

2వ ఖైదీ : అయితే యిదెట్టా తెగేదంటావు?

1వ ఖైదీ : మనకు తోసే దొంకటే, అందరూ జైల్లోకొచ్చి కూచుంటేసరి.

2వ ఖైదీ : మరి బువ్వో?

1వ ఖైదీ : ఆఁ, గవర్నమెంటు పెట్టటంలా! అట్టాగే అందరికి పెడతాది [చౌదరి, వార్డెన్ పెద్దగా నవ్వారు. ఖైదీలు జవాబుగా వెకిలిగా నవ్వుతారు. చౌదరీ, వార్డెన్ మొఖాలు చిన్న చేసుకుంటారు ...]

చౌదరి : (ఉన్నట్టుండి ఏదో జ్ఞాపకమొచ్చి) ఇక్కడ ఫోనుందా?

వార్డె : ఎందుకూ?



BRAOU

చౌదరి : పమంది.

వార్డె : ఇక్కడెక్కడో పబ్లికు ఫోనుండాలి.

చౌదరి : రైటో! అయిపోయింది. ఒక్క క్షణంలో తేల్చేస్తా. వీడెంత? వీడి సబ్ ఇన్స్పెక్టరు ఎంత? మహా మహా వాళ్ళనే చూచాను (వెళ్తాడు). [వార్డెన్ ఏమీ తోచక, అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంతలో మొట్టమొదట ఆడియన్సులోకి పరుగెత్తిన దొంగ గబా గబా పరుగెత్తుకుంటూ వచ్చాడు. వచ్చి అటూ ఇటూ చూచి, వార్డెన్‌తో .... ]

దొంగ : అయ్యా! అయ్యా!

వార్డె : ఏం?

దొంగ : ఇప్పుడే ఇక్కడ, ఈ బావిలో, ఓ ఆడమనిషి పడి చచ్చిపోయిందట, మీరు చూసారా బాబూ? నిజమేనా?

వార్డె : అవును, చచ్చిపోయిందట! అది చస్తే చచ్చింది, మా ప్రాణాలు తీస్తోంది. అది చావటానికి కారణం మేమట? ఎవరు దీనికి కారణం, ఎవరి కర్మ వాళ్ళదిగాని –

దొంగ : ఇంతకూ చచ్చిపోయిందా బాబూ?

వార్డె : చచ్చిందట!

దొంగ : మీరు మనిషిని చూశారా?

వార్డె : లేదు.

దొంగ : ఎట్టావుంది బాబూ మనిషి?

వార్డె : అరె! చూడలేదంటే – ఎట్లా వుందని అడుగుతావేం? ఆడమనిషిలాగే వుంటుంది.

BRAOU

దొంగ : పిల్లలా బాబూ? పిల్లలన్నా బ్రతికున్నారా బాబూ? మీరు చూశారా పిల్లల్ని?

వార్డె : పిల్లలూ తల్లీ, అంతా క్లోస్. చెప్పకుండా పోయారు – ప్రాణాలు.

దొంగ : ఎందరు పిల్లలు బాబూ?

వార్డె : నిన్ను చూస్తే వదిలేట్టులేవే! ఎందరు పిల్లలు? ఎవరికి పుట్టారు? ఇదంతా విచారించటమూ నా పని?

దొంగ : కాదు బాబు! మా యింట్లో వాళ్ళం వారం రోజులుగా పచ్చి మంచినీళ్ళు తాగుతున్నాం. పిల్లా జల్లా అంతా అట్లాగే బ్రతుకుతున్నాం మేం సరే – ఆ పిల్లలు – ఆళ్ళేం చేసారు? ఆళ్ళట్టా ఎండిపోతావుంటే చూడలేకపోయా! చివరికి ...

వార్డె : బావిలో తోసేశావా?

దొంగ : లేదు బాబూ, ఆ పని చెయ్యలేకనే బయల్దేరా – దొంగతనానికి.

వార్డె : దొంగతనానికి! నువ్వు దొంగవా? ఎక్కడికి వెళ్ళావు దొంగతనానికి?

దొంగ : ఆడ చదుకుంటారే – ఆ చోట్లో – ఆస్టలంట, అదీ –

వార్డె : ఓ నువ్వేనా ఆ మహానుభావుడివి! యస్.ఐ.గారూ... ఇన్స్పెక్టరుగారూ! .... (చాలా ఆత్రంగా ఎడుతూ పిలిచాడు; బెల్‌కొట్టాడు) దొంగ...! దొంగ...!

దొంగ : జైల్లో ఎయ్యటానికేనా బాబూ? మీరెయ్యక్కర్లా? నేనే వెళ్ళి కూసుంటా. నేనం లచ్చలూ, వేలూ దొంగతనం చెయ్యలా! పిడికెడు కూడు బాబూ! ఆకలితో చస్తున్న బిడ్డలకి అంత కూడు. అంతే బాబూ! ఎప్పుడూ దొంగతనం ఎరగను. మా వోళ్ళంతా చాల గొప్పగా మర్యాదగా బ్రతికినోళ్ళు, మర్యాదా, గౌరవం, గొప్పా – అన్నీ చచ్చాయ్ ఆకలితో ....

దొంగిలించా .... తీరా తీసుకుని యింటికిపోతే ఇల్లు ఖాళీ. ఇంతలో యీ చావు కబురు విన్నాను. నా అచ్చేమోనని పరుగెత్తుకొచ్చా. చెప్పండి బాబూ, ఏడుంది? చెప్పండి బాబూ!

వార్డె : లోపలుందట! పోలీసు నడుగు, చూపుతాడు.

దొంగ : ఆఁ! ఆఁ! బాబూ! బాబూ! (పరుగెత్తి)

వార్డె : ఏయ్! పోలీసు! దొంగ! దొంగ! జాగ్రత్తగా చూడు! వాడు పచ్చి దొంగ.

[ఇంతలో యస్.ఐ. వస్తాడు]

స.ఇ. : వాడు కాడు దొంగ. మీరూ, మనం, మనపైన ఉన్న వాళ్ళూ!

వార్డె : నిజంగా దొంగ వచ్చాడండీ!

స.ఇ. : కాని అసలు దొంగ తేలాలి!

వార్డె : యస్.ఐ.గారూ! నన్ను కాస్త తొందరగా పంపేయండి దయచేసి. ఇంజనీరింగు కాలేజీవాళ్ళ నాటకం! తప్పక చూడాలి.

స.ఇ. : ఈ జీవిత నాటకం చూడండి సార్, చాలు ... ఇదిగో, కొత్త పాత్రలు వస్తున్నాయి చూడండి. ఈ పాత్రలను నాటకంలోలా నేను డ్రమెటిక్‌గా ప్రవేశపెట్టి పరిచయంజేయలేను. అయినా ... ఈయనెవరో తెలుసునా? మన డి.యస్.ఓ. ఆయన వెనకాల ఉన్నవారు ఓ గ్రామ మునసబు. (ఇటూ అటూ చూచి) చౌదరిగారెక్కడ?

వార్డె : ఫోన్ చేయాలని వెళ్ళాడండి.

స.ఇ.: ఎవరికో?

వార్డె : ఏమోనండి!

స.ఇ. : బహుశా గవర్నమెంటు శాస్[illegible]ంటుంది. ఉండనీయండి. (డి.యస్.ఓ.తో) రాండిసార్! రాండి, కూర్చోండి.

[డి.యస్.ఓ. తలవంచుకొని కూర్చున్నాడు]

స.ఇ. : (సెల్లిలో వున్న ఖైదీలను చూపి) వీళ్ళెవరో తెలుసాండి?

[డి.యస్.ఓ. మౌనం]

స.ఇ. : వీళ్ళు దొంగలు.

వార్డె : ఏమండి, నాటకం ఈపాటికి సగం అయిపోయి వుంటుంది.

స.ఇ. : ఇదిగో. తొందరలో పంపిచేస్తా. మిమ్మల్ని ఎక్కడికి పంపాలా అనేదే ఆలోచిస్తున్నా. ఆర్డర్ల కోసం ఎదురుచూస్తున్నా. డి.యస్.ఓ. గారూ! ఈరోజు ఒక ఆడది ముగ్గురు బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకుంది.

డి.యస్.ఓ. : అబద్ధం!

స.ఇ. : ఇదిగో – డాక్టర్ సర్టిఫికేట్!

డి.యస్.ఓ : ఇదేదో నాటకం!

స.ఇ. : హు, మీకందరికీ నాటకం జబ్బు పట్టిందేం! ఇక్కడకాదు. పచ్చయప్ప కాలేజీలో జరుగుతోంది. యిది యదార్థం. కావాలంటే శవాన్ని చూసిరండి.

డి.యస్.ఓ : నేను చూడాల్సిన అవసరంలేదు.

స.ఇ. : అవును, 5వేలు చూచిన కళ్ళతో శవాన్నెలా చూస్తారు, పాపం!



BRAOU

డి.యస్.ఓ : ఓ, మీకు రుజువూ?

స.ఇ. : రుజువులన్నీ ఉన్నాయి. అవి కోర్టులో మాట్లాడాల్సిన మాటలు. కాని ఇక్కడ మిమ్మల్ని నే కోరేదొక్కటే. మీ గుండెలమీద చెయ్యివేసుకొని చూడండి, మీరు రోజుకెందరి ప్రాణాలు తీస్తున్నారో! మీ బిడ్డల్ని ఒక్కసారి బావిలో పారేస్తే .....

డి.ఎస్.ఓ : యస్.ఐ. గారూ!

స.ఇ. : మీభార్య బావిలో పడితే ...

వార్డె : మమ్మల్ని ఏడిపించాలనా ఇదంతా?

డి.ఎస్.ఓ : యస్.ఐ.గారూ! మీకు రుజువులుంటే కోర్టులో దాఖలు చేసుకోండి, మీ చేతనైనపని చేసుకోండి; అంతేగాని ఒక గవర్నమెంటు ఆఫీసరును బాధ్యతారహితంగా ...

స.ఇ. : మీరు బాధ్యత కలిగే ప్రవర్తిస్తున్నారా?

డి.ఎస్.ఓ : మాకు తెలిసినంతవరకు మేమెవరి ప్రాణాలూ తీయలేదు.

[డి.ఎస్.ఓ. పై మాటలు చెప్తూ మెల్లగా జేబులోంచి నోట్లకట్ట తీసి వేస్టుపేపరుబుట్టలో వేయబోతుంటాడు]

స.ఇ. : స్టాప్! నోట్లకట్ట బుట్టలో పడ్డదా – తల పేల్తుంది!

[డి.ఎస్.ఓ. ఆగిపోయాడు]

స.ఇ. : హాండ్సప్.

[డి.ఎస్.ఓ. చేతులెత్తాడు. ఇంతలో చౌదరి వచ్చి వెనక్కి తగ్గాడు]

స.ఇ. : రాండి! చౌదరిగారూ! (చౌదరి వెనకటడుగు వేశాడు) ఇంక ఒక్క అడుగు కదలకండి, ప్రమాదం (బెల్ కొట్టాడు; కానిస్టేబుల్ వచ్చాడు) చౌదరిగారి కోటుజేబులో ఒక ఉత్తరం ఉంది తియ్యరా? (కానిస్టేబుల్ చౌదరి జేబులోనుంచి ఉత్తరం తీశాడు) వార్డెన్‌గారూ! ఉత్తరం చదవండి.

వార్డె : (ఉత్తరం తీసుకొని చదువుతాడు) "చౌదరిగారికి, రేపు ప్రొద్దున్నే 60 లక్షల బస్తాలు పంపాలన్న విషయం జ్ఞాపకము ఉందనుకుంటా. ఇంతవరకు మన విషయం సెటిల్ చేయలేదు. నాకు కాస్త పైకం జరూరుగా ఉంది. రాత్రికి కలుస్తా"

స.ఇ. : ప్రసాద్ మీరేనాండి?

డి.ఎస్.ఓ : అవును.

స.ఇ. : ఈ ఉత్తరం మీరు వ్రాసిందే? అవునా?

(డి.ఎస్.ఓ. మౌనం)

స.ఇ. : గిద్దలూరు బాపనయ్య దగ్గర 200 పుట్ల ధాన్యం వుందని మీకు తెలీదా?

డి.యస్.ఓ : తెలీదు.

స.ఇ. : మీకు తెలిసినట్లు దాఖాలా చూపుతాను.

డి.ఎస్.ఓ : తెలిస్తే?

స.ఇ. : మీరెందుకు 'ప్రొక్యూర్' చేయలేదు?

డి.ఎస్.ఓ : ఆయనివ్వలేదు.

స.ఇ. : మళ్ళా అబద్దం!

1వ ఖైదీ : ఇవ్వనంటేనే ఊర్కున్నారా? మా ఇళ్ళల్లో దూరి కుండా బొచ్చా అంతా గాలించి లాక్కెళ్ళలా! అట్టా ఎందుకు చేయకూడదుట?



BRAOU

2వ ఖైదీ : ఎందుకంటే, ఆళ్ళు లావాంటాళ్ళురా?

1వ ఖైదీ : బాపనయ్య పెద్ద మంత్రులతో చెప్పి ఏడ ఉద్యోగం వూడబెరికిస్తాడో అని భయంరా!

స.ఇ. : (ఖైదీలతో) ష్షూ (డి.ఎస్.ఓ.తో) బాపనయ్య బ్లాక్ మార్కెటు వ్యాపారం చేయటం మీకు తెలీదూ?

డి.ఎస్.ఓ : తెలిస్తే?

స.ఇ. : మీరూ, బాపనయ్యా, చౌదరీ – మీరందరు ఈ వ్యాపారంలో భాగస్వాములు; మీరందరూ షరీకై ఇది సాగిస్తున్నారు.

డి.ఎస్.ఓ : లేదు; లేనేలేదు –

స.ఇ. : అయ్యా, గ్రామ మునసబుగారూ!

డి.ఎస్.ఓ : ఏమని బెదిరించారు మిమ్మల్ని?

[మునసబు చెప్పడానికి జంకుతాడు]

స.ఇ. : చెప్పు, ఫర్వాలేదు.

మున : మా ఊళ్ళో 200 ఇళ్ళున్నాయండి. 200 ఇళ్ళలో ఏ పదీ ఇర్వై మందికో సరిగా రెండు పూటలా భోజనం వుంటుంది. మిగతా అందరూ వారానికి మూడు రోజులు తింటే అధికం. ఈ విషయం నేనెన్నోసార్లు అయ్యగారితో మనవిచేసుకున్నాను. పండినపంటలు పండినట్టు లాక్కెళుతున్నారు. పెద్దవాళ్ళ దగ్గరనుంచి గింజయినా కదల్చడంలేదు. మహ బాగా పండినా, రైతుకు మూడు నెలల బత్తెంరాదు. అది కాస్తా లాక్కెడితే వాళ్ళేంకావాలి? ఈ విషయం పైకి రాయమని ఎన్నోసార్లు చెప్పానండి.

డి.ఎస్.ఓ : నేను రాశాను.

మున : రాశారేమోగానీ, పత్రికల్లో మాత్రం, మా ఊళ్ళో తిండి కరువేమాత్రం లేనట్లే వచ్చిందండి!

డి.ఎస్.ఓ : పత్రికల్లో వచ్చిందానికి ఏనా కారణం?

మున : కారణం ఎవర్కావాలిబాబూ, ఫలితం కావాలిగానీ, ఇది ఇట్టా వుండగా మొన్న అయ్యగారు మా ఊరొచ్చి మా ఊళ్ళో ఆహార పరిస్థితి బాగుందనీ, తిండి లేకుండా మనుషులు చావటం పట్టి అబద్ధమనీ రాసివ్వమన్నారు.

స.ఇ. : నేవ్వేమన్నావు?

మున : రాసివ్వనన్నానండి.

స.ఇ. : ఎందువల్ల?

మున : అదొట్టి అబద్ధం బాబూ!

స.ఇ. : తరువాత?

మున : అయ్యగారు నన్ను బెదిరించి, బలవంతాన రాయించుకుపోయారు బాబూ!

డి.ఎస్.ఓ : అబద్ధం! పచ్చి అబ్దం! యూ స్కౌండ్రల్!

[విసురుగా వెళ్ళ కొట్టబోయాడు]

స.ఇ. : (డి.ఎస్.ఓ. నాపి) ఆగు!

దొంగ : (పిచ్చివాడిలాగా వస్తూ) అబద్ధం, నా పెళ్ళాం చచ్చింది అబద్ధమా? నా పిల్లలను నూతిలో పడేసింది అబద్ధమా? నేను కడుపుమాడి చావలేక, తిండికోసం దొంగతనం చేయడ మబద్ధమా? మనకు సొతంత్రం వచ్చినమాట అబద్ధం. ఆవి పేదోళ్ళరాజ్యం అనటం అబద్ధం.

స.ఇ. : ఏయ్! ఎవరు నువ్వు?

వార్డె : వీడేనండి మా హాస్టల్లోపడ్డ దొంగ!

దొంగ : నువ్వు సెప్పక్కర్లా, నేనే చెప్తా; నేనే దొంగను. మీరందరూ పెద్ద మనుష్యులు. మీకు డబ్బుంది, అధికారముంది; తిండి ఉంది; మీ దొంగతనాలు పెద్ద తరహావి. (చంకలో ఉన్న అన్నంమూట తీసిచూపుతూ) ఇదిగో, మీ అన్నం. దీనికోసమే నేను దొంగనయ్యాను. దీనితో నా పెళ్ళాం బిడ్డల్ని ఒక రోజు బతికిద్దామనుకున్నాను. పిచ్చివాణ్ణి, దీంతో ఒక రోజు గడిచినా మళ్ళీ పస్తులే కదా అన్న విషయం మరిచిపోయాను. నా పెళ్లాం తెలివయింది. దానికి తెలుసు, ఈ బాధ ఎప్పటికీ తీరదని, బాగా ఆలోచించి చచ్చింది. నాకు దారి చూపింది. తీసుకోండి మీ అన్నం (విసిరికొట్టాడు వార్డెన్‌మీద. వెంటనే యస్.ఐ. చేతిలో ఉన్న పిస్టల్ తీసి పేల్చు కున్నాడు).

స.ఇ : ఆఁ ఆఁ!

దొంగ : (ఒరిగిపోతూ) ఇంకా నేను దొంగనేనా? చెప్పండి. మీ అన్నం మీకిచ్చేశాను. ఇంక నేను దొంగ నేనా?... దొంగనేనా?... దొంగ ... నే... నే... (పడిపోయాడు).

స.ఇ. : (ఒక క్షణం అల్లా ఉండి కన్నీళ్ళతో) నువ్వు కాదు తమ్ముడూ దొంగ... ఇదిగో వీళ్ళు... వీళ్ళందరూ దొంగలు ... తోడుదొంగలు. నీ ప్రాణాలు, నీ పెళ్ళాం బిడ్డల ప్రాణాలు తీసింది వీళ్ళు. పదండి, కదలండి, (విసురుగా డి.ఎస్.ఓ. దగ్గరకు వెళ్ళి మెడ పెట్టుకుని) మిమ్మల్ని ఉరితీసే అధికారం లేదు. కానీ, మీకు తిండిలేకుండా పోవడం అంటే ఏమిటో చూపిస్తా. (సెల్లులోకి గెంటుతాడు. వార్డెన్, చౌదరీల నుద్దేశించి) ఊఁ! కదలండి.

[మెల్లిగా వాళ్ళిద్దరూ సెల్లువైపు నడుస్తుంటారు. కానిస్టేబుల్ వచ్చాడు ... ]

కాని : సార్! (ఒక కవరు ఇచ్చాడు. యస్.ఐ. కవరు చించి చదివి, చౌదరివైపు - అందరివైపు చూచి)

స.ఇ. : చౌదరిగారూ! మీరే గెలిచారు. నేనే ఓడిపోయాను. అవినీతిని అరికట్టాలనేది వట్టి ఉపన్యాసాలని, ఇప్పుడు తెలుసుకున్నా. నన్ను ట్రాన్స్‌ఫర్ చేశారు. మీరు బ్రతికిపోయారు.

(చౌదరి అందరూ వికట్టహాసం చేశారు).

స.ఇ. : (బియ్యపు బస్తా క్రిందకు తోసి) తీసుకెళ్ళండి. తినండి, చచ్చేదాకా తినండి. దీన్ని ఎవరు కష్టించి పండిస్తున్నారో, వాళ్ళందరూ చస్తున్నారు. వాళ్ళకిది నిరాకరించబడింది. వాళ్ళందరూ పోయిన తరువాత మీరు బ్రతికుంటారా? బ్రతకండి.

(డి.ఎస్.ఓ. చౌదరి, వార్డెన్ వికట్టహాసం చేస్తూపోతారు).

స.ఇ. : (మెల్లిగా గ్రామ మునసము దగ్గరకెళ్ళి) మునసబుగారూ! నా చేతనైనది చేద్దామనుకున్నా. అవినీతిని అరికట్టాలనుకున్నా. కాని అంతా నా కెదురయింది. ఇక మీరు - గ్రామాలలోని ప్రజలు - పరిష్కరించుకోవాలీ తిండి సమస్యను, (ఒక పిడికెడు బియ్యము తీసుకొని దొంగ శవం దగ్గర కూర్చుని) ఇదిగో తమ్ముడూ! బ్రతికుండగా పిడికెడు బియ్యం ఇవ్వకపోయినా, ఇప్పుడైనా ఇస్తున్నా. (నోట్లో పోస్తాడు) యీ పిడికెడు బియ్యంతో - యీ దొంగల్ని - తిండి దొంగల్ని, మమ్మల్ని క్షమించు.

(తలపట్టుకొని విచారంగా ఉంటాడు. ఇంతలో పత్రికా విలేఖరి వచ్చి, రిపోర్టు తీసి విచారంగా చింపేస్తుంటాడు).

(తెర జాలిగా దిగుతుంది).

BRAOU

## 3.3 పాఠ్య వివరణ

ఎవరు దొంగ ఏకాంకిక కొత్త పంథాలో సామాజిక వాస్తవికతను చిత్రిస్తుంది. చిన్న సంఘటన. కొన్ని పాత్రలు. తక్కువ వ్యవధిలో పరిమిత పరిధిలోనే సమగ్ర సమాజ స్వరూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నం రచయిత చేస్తాడు. మొదట ఇందులో విషయం లేదా ఇతివృత్తం ఏమిటో పరిశీలిద్దాం.

### 3.3.1 పాఠ్య విషయం

సూక్ష్మంగా ఇందులో ఇతివృత్తం ఇది. తన భార్యా పిల్లల కడుపు నింపుకోవటానికి ఒక పేద హాస్టల్లో తిండి దొంగతనం చేస్తాడు. మరొకవైపు అధికారుల కుమ్మక్కుతో కొందరు బియ్యంలో రాళ్ళు కలిపి అమ్మటం, దొంగ రవాణా చేయటం జరుగుతుంది. పోలీస్‌స్టేషన్‌లో ఒక ఖైదీతో 'దొంగలెవరో దొరలు ఎవరో తెలుసుకొనవోయ్ బ్రహ్మయా!' అనిపించి కడుపు నింపుకోవటానికి తిండి దొంగతనం చేసినవాడు నిజమైన దొంగకాదనే. అవినీతితో లక్షలార్జించే వ్యాపారులు, అధికారులు, రాజకీయ నాయకులు నిజమైన దొంగలనీ అభిప్రాయాన్ని ప్రేక్షకులకు కలిగిస్తాడు. దొంగ భార్య తన ముగ్గురు పిల్లలతో ఆకలి భరించలేక పోలీసు స్టేషన్ వెనక బావిలోపడి ఆత్మహత్య చేసుకుంటుంది. కొత్తగా ఉద్యోగంలో చేరి ఆదర్శభావాలు గల సబ్ ఇన్స్పెక్టర్ నిజమైన దొంగలు చౌదరీ, డి.ఎస్.ఓ, వార్డెన్‌లను శిక్షించబోయి రాజకీయ నాయకులు కలిగించుకోవటం వల్ల విఫలప్రయత్నుడౌతాడు.

### 3.3.2 వ్యాఖ్యానం

'ఎవరు దొంగ' ఏకాంకిక. ఇంగ్లీషులో one act play అన్నపదానికి సమానార్థకంగా తెలుగులో ఏకాంకిక అన్న పదం వాడుకలో వచ్చింది. కొందరు దీన్ని నాటిక అనికూడా అంటున్నారు. ఏకాంకిక అంటే ఒకే అంకం కలిగింది అని అర్థం. సంక్షిప్తత, ఒకే రంగం, ఒకే అంశం, ఒకే విషయం కలిగి ఉండటం ఏకాంకిక లక్షణం. వస్తువు స్వయం సమగ్రంగా ఉండాలి. ఏకాంకికలో కాలపరిమితి చాలా తక్కువ. 30 నుండి 45 నిమిషాల వరకు ఉండవచ్చు. ఒక్కమాట వృథా కాకుండా రచయిత తాను చెప్పదలచినదాన్ని సూటిగా, క్లుప్తంగా చెప్పి ప్రేక్షకులపైన ముద్రవేయాలి. సంభాషణలు చిన్నవిగా ఉండటం, సన్నివేశాలను వేగంగా నడవటం, ప్రేక్షకుల మనోభావాలకు చేరువగా అంది ప్రదర్శన పూర్తి అయింతరువాత కూడా ఆలోచన కొనసాగేటట్టు భావాలను నెమరు వేసుకొనేటట్టు ఏకాంకిక రచన, ప్రదర్శన ఉండాలి. చిన్న జీవిత సంఘటన ద్వారా సమగ్ర జీవిత స్వరూపాన్ని అర్థం చేసుకొనేట్టు శక్తి ఏకాంకికకు ఉండాలి.

ఈ నాటిక 1951లో నాటక కళాపరిషత్తులో ప్రదర్శితమై బహుమానం పొందింది. స్వాతంత్ర్యం వచ్చిం తరువాత దేశంలోని స్థితిగతులను చిత్రిస్తుంది ఈ ఏకాంకిక. ఆకలి, దారిద్ర్యం, కల్తీ, బ్లాక్ మార్కెటింగ్, లంచగొండితనం, ఆకలిచావులు, అవినీతి, పత్రికలలో ప్రకటించపడే అబద్ధపు వార్తలు మొదలైన సమాజంలోని దుర్గుణాలను ఈ చిన్న ఏకాంకికలో అద్దం పట్టినట్టు చిత్రించారు రచయిత ఆత్రేయ. తెర ఎత్తకుండానే ఈ నాటకం మొదలవుతుంది. తెరముందు నుంచి ఒక వ్యక్తి దిగివచ్చి హడావిడిగా ప్రేక్షకులలో కూర్చోవటం, అతణ్ణి వెతుక్కుంటూ మరొకడు ప్రేక్షకులలోకి రావటం, తరువాత తెర ఎత్తకుండానే స్టేజీమీద కొన్ని పాత్రలు ప్రవేశించటం తెర తీసింతరువాత పోలీసు స్టేషన్ సీనుతో ఒకదానివెంట మరొక సన్నివేశం సూత్ర పరచినట్టు నాటకం చకచకా సాగిపోతుంది. నాటక రచనలో, ప్రదర్శనలో ఆ నాటికది కొత్త శిల్పం.

ఆకలి చల్లార్చుకోవటానికి చిన్న దొంగతనం చేసిన దొంగ, బియ్యంలో రాళ్ళు కలపటం, బ్లాక్ మార్కెట్, దొంగరవాణా చేసే చౌదరి, కొత్తగా ఉద్యోగంలో చేరి కొంత ఆదర్శభావాలు కలిగిన సబ్ ఇన్స్పెక్టరు, దొంగ రవాణాచేసే చౌదరితో కుమ్మక్కయిన హాస్టలు వార్డెన్, లంచగొండి డి.ఎస్.ఓ., గ్రామాల్లో ఆహార సరఫరా సరిగ్గా జరగడంలేదని బాధపడే మునసబు, డాక్టరు, కానిస్టేబుల్, పత్రికావిలేఖరి, ఖైదీలు ఇందులోని పాత్రలు. స్త్రీ పాత్ర ప్రసక్తి ఉందిగాని స్టేజీమీద కనిపించదు.

ఎవరు దొంగ ఏకాంకికలో సబ్ ఇన్స్పెక్టరు పాత్ర చాలా ముఖ్యమైనది. అతడు ఉద్యోగంలో కొత్తగా చేరినయువకుడు. ఆదర్శభావాలు కలవాడు. అవినీతిపరుల ఆటకట్టించాలని నడుముకడతాడు. ఆకలి చల్లార్చు కోవటానికి చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు నిజమైన దొంగలుకారని, ఆకలికి కారణమైనవారు, బ్లాక్

BRAOU

మార్కెటింగు చేసేవారు, కల్తీచేసేవారూ వారికి సహాయం చేసే అధికారులూ నిజమైన దొంగలని, పెద్ద దొంగలని ఆయన భావిస్తాడు.

హాస్టల్‌లో వైజ్ఞానిక వారోత్సవాలు జరుగుతుండగా బ్లాక్‌మార్కెట్‌లో బియ్యం కొనేందుకు హాస్టల్ వార్డెన్‌ని అరెస్టు చేయడానికి వెళ్ళి పోలీసు స్టేషనుకు తీసుకొని వెళ్తాడు. అవినీతిపరులు ఎంత గొప్ప పదవిలో ఉన్నవారైనా ఆయన లెక్కపెట్టడు. బ్లాక్‌మార్కెట్ చేసే బాపూజీ రైస్‌మిల్లర్ యజమాని చౌదరిని అతని దగ్గర లంచం తీసుకొన్న డి.ఎస్.ఓను కూడా పోలీసుస్టేషన్‌కు రప్పించి విచారణ జరిపిస్తాడు. ఆకలివల్ల ముగ్గురు బిడ్డలతోఆత్మహత్యచేసుకొన్న స్త్రీ విషయం వాళ్ళకు తెలియజేసి దీనికి కారణం మీరేనని చెప్తాడు. డబ్బు సర్దుబాటు చేయమని డి.ఎస్.ఓ. ప్రసాద్ మిల్లు యజమాని చౌదరికి రాసిన ఉత్తరాన్ని చూపిస్తాడు. దానిని సాక్ష్యంగా తీసుకొని వారిని ప్రాసిక్యూట్ చేద్దామనుకుంటాడు.

హాస్టల్ తిండిని దొంగలించిన దొంగ భార్యే ముగ్గురు పిల్లలతో ఆత్మహత్య చేసుకున్న స్త్రీ. అతణ్ణి చూసి సబ్ ఇన్స్‌పెక్టర్ కళ్ళలో నీళ్ళు నిండుతాయి. 'నువ్వుకాదు తమ్ముడూ దొంగ ... ఇదిగో వీళ్ళు ... వీళ్ళందరూ దొంగలు ... తోడు దొంగలు. నీ ప్రాణాలు, నీ పెళ్లాం బిడ్డల ప్రాణాలు తీసింది వీళ్ళు' అంటాడు దొంగతో. "మిమ్మల్ని ఉరితీసే అధికారం లేదు. కానీ - మీకు తిండిలేకుండా పోవడం అంటే ఏమిటో చూపిస్తా" అని డి.ఎస్.ఓ, వార్డెన్, చౌదరీలను సెల్లులోకి గెంటుతాడు.

సరిగ్గా ఈ సమయంలోనే కానిస్టేబుల్ ఒక ఉత్తరం తెచ్చి ఇస్తాడు. అది సబ్ ఇన్‌స్పెక్టర్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్. సబ్ ఇన్స్‌పెక్టరు పోలీసు స్టేషన్ బయటకు వెళ్ళినప్పుడు చౌదరి కూడా బయటికి వెళ్ళి పై రాజకీయ నాయకులకు చెప్పొవస్తాడు. దాని ఫలితమే ట్రాన్స్‌ఫర్. విచరంతో సబ్ ఇన్స్‌పెక్టర్ "చౌదరిగారూ మీరే గెలిచారు. నేనే ఓడిపోయాను. అవినీతిని అరికట్టాలనేది వట్టి ఉపన్యాసాలని, ఇప్పుడు తెలుసుకున్నా" అంటాడు. గ్రామం నుంచి వచ్చిన మునసబుతో, మునసబుగారూ "నా చేతనైనది చేద్దామనుకున్నా, అవినీతిని అరికట్టాలనుకున్నా కాని అదంతా నాకెదురయింది. ఇక మీరు - గ్రామంలోని ప్రజలు - పరిష్కరించుకోవాలి తిండిసమస్యను" అంటాడు. ఇది సబ్‌ఇన్స్‌పెక్టరు పాత్ర ద్వారా రచయిత ప్రజలకిచ్చిన సందేశం.

సంభాషణ రచనలో ఆత్రేయగారిది అందె వేసిన చెయ్యి. సంభాషణలు చిన్నవిగా ఉంటాయి. పాత్రలను, సన్నివేశాలను, సంభాషణలను ఒకదానికొకటి కూర్చటం ద్వారా ఈ చిన్న రచనలో మొత్తం సమాజాన్ని ఆత్రేయ చూపగలిగారు.

## అభ్యాసాలు

(కింది ఖాళీలో మీ జవాబు రాయండి. భాగం చివరి మాదిరి జవాబుతో సరిపోల్చుకోండి)

1. ఎవరు దొంగ ఏకాంకికలో చిత్రితమైన సమాజ దుర్గుణాలు ఏమిటి?(25 పదాలలో రాయండి).

__________________________________________________________________

__________________________________________________________________

__________________________________________________________________

__________________________________________________________________

__________________________________________________________________

2. ఎవరు దొంగ ఏకాంకిలో స్త్రీపాత్ర -

   1. ఉంది.
   2. లేదు.
   3. స్త్రీపాత్ర ప్రసక్తి ఉంది కాని స్టేజిమీద కనిపించదు.



BRAOU

3. ఏకాంకిక కాల పరిమితి ------------

4. 'ఎవరు దొంగ నాటకంలో ప్రయోగాత్మకమైంది' ఎందుకు? 50 పదాల్లో రాయండి).

## 3.4 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- 'ఎవరు దొంగ' నాటక రచయిత ఆచార్య ఆత్రేయ. నాటక ప్రయోగంలోనూ, రచనలోనూ ఆత్రేయ చాలా క్రొత్త ప్రయోగాలు చేశారు.
- ప్రేక్షకుల నుండి పాత్రను ప్రవేశపెట్టడం ద్వారా ప్రేక్షకులలో ఉత్కంఠను కలిగించి నాటక ప్రదర్శనవైపు దృష్టిని మరలించటం ఇందులోని ప్రత్యేకత.
- ఆకలి, దారిద్ర్యం, కల్తీ, బ్లాక్ మార్కెటింగ్ లంచగొండితనం, ఆకలిచావులు, అవినీతి పత్రికలలో ప్రకటించబడే అబద్ధపువార్తలు మొదలైన సమాజంలోని దుర్గుణాలను చిన్న ఏకాంకిలో చూపెట్టారు ఆత్రేయ.
- ఎవరు దొంగ ఏకాంకిక సంక్షిప్తత, ఒకే రంగం, ఒకే అంశం, ఒకే విషయం కలిగి ఉండటం ఏకాంకిక లక్షణం. వస్తువు స్వయం సమగ్రంగా ఉండి 35, 40 ని॥ వ్యవధిలో ముగిసేలా ఉంటుంది. చిన్న జీవిత సంఘటన ద్వారా సమగ్ర జీవిత స్వరూపాన్ని అర్థంచేసుకునేట్టు చేయగలశక్తి ఏకాంకికకు ఉంటుంది.
- సంభాషణల రచనలో ఆత్రేయ అందెవేసిన చెయ్యి. పాత్రలు, సన్నివేశాలు సంభాషణలు కూర్పులో ఒక సమన్వయాన్ని సాధించటం ద్వారా ఆత్రేయ నాటక ధ్యేయాన్ని సమర్థవంతంగా సాధించారు.

## 3.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబు రాయండి.

1. 'ఎవరు దొంగ' నాటికలో సబ్ ఇన్స్పెక్టరు పాత్ర గురించి రాయండి.
2. ఈ నాటిక ద్వారా రచయిత చెప్పదల్చుకున్న దేమిటి? దానిని ఏ విధంగా సాధించారు?

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. ఆత్రేయ ఈ నాటిక శిల్పంలో ప్రదర్శించిన కొత్తదనం ఏమిటి?
2. దొంగ పాత్రను గురించి రాయండి.
3. వార్డెన్ చేసిన నేరం ఏమిటి?
4. ఈ నాటికలో ఖైదీపాత్రల ద్వారా రచయిత సాధించిందేమిటి?

## 3.6 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ నాటిక ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన నాటికా పంచవింశతి సంకలనంలో ఉంది. ఆ సంకలనం అన్ని నాటికలనూ చదవండి. నాటికల లక్షణాలనూ, నాటికలలోని ఇతివృత్తాన్నీ తులనాత్మకంగా పరిశీలించండి.

2. ఈనాడు రంగస్థలం మీద ఆడడం కోసం ఉద్దేశించిన కొన్ని నాటికలను సంపాదించి వాటితో ఈ నాటికను పోల్చి చూడండి. ఇతివృత్తం, పాత్రచిత్రణ, సంభాషణలు, నాటకీయత, సామాజిక దృష్టి వీటి విషయంలో తేడాలు గమనించండి.

## అభ్యాసాలకు జవాబులు

1. స్వాతంత్ర్యానంతర దేశం స్థితిగతులూ, సమాజంలో దుర్గుణాలూ ఈ నాటిక చిత్రిస్తోంది. అవి : ఆకలి, దారిద్ర్యం, కల్తీ, బ్లాక్ మార్కెటింగ్, లంచగొండితనం ఆకలిచావులు, అవినీతి, పత్రికలలో పడే అబద్ధపు వార్తలు మొదలైనవి.

2. 3

3. 35 – 40 నిముషాలు

4. తెర ఎత్తకుండానే ఈ నాటకం మొదలవుతుంది. తెరముందునుంచి ఒక వ్యక్తి దిగివచ్చి హడావిడిగా ప్రేక్షకుల్లో కూర్చోవటం అతన్ని వెతుక్కుంటూ మరొకడు ప్రేక్షకులలోకి రావడం, తరవాత తెర ఎత్త కుండానే స్టేజిమీద కొన్ని పాత్రలు ప్రవేశించటం – తెరతీసిం తర్వాత ఒకదాని వెంట మరో సన్నివేశం చకచకాసాగిపోవడం జరుగుతంది. నాటకరచనలో, ప్రదర్శనలో ఆనాటికి కొత్త ప్రయోగం, శిల్పం.

**– కె.కె. రంగనాథాచార్యులు**

## చదవదగిన పుస్తకాలు


| | |
|---|---|
| ఆంధ్రనాటకరంగ చరిత్ర | మిక్కిలినేని, రేణుకా గ్రంథమాల, మద్రాసు – 24, ప్ర. ము. 1969 |
| ఆంధ్రనాటక దర్శిని | శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ –2. |
| ప్రాచీన పాశ్చాత్యనాటకరంగం | ప్ర.ము. 1963 – శ్రీనివాస చక్రవర్తి. |
| ఆంధ్రలో నాటకం – నాటకరంగం | డా. డి.వి.ఏ. ఆచార్య, ఆదర్శగ్రంథ మండలి, విజయవాడ. ప్ర.ము. 1965. |
| తెలుగు నాటకవికాసము | డా. పోరంగి శ్రీరామ అప్పారావు నాట్య మాల–3. హైదరాబాదు – 20, ప్ర.ము. 1967. |
| తెలుగు ఏకాంకికా వికాసం (1876 – 1985) | డా. మనం మధుసూదన్, శరత్ ప్రచురణలు 19/1095/1, శంభావిపేట, వరంగల్ – 605. ప్ర.ము. 1988. |


BRAOU

# ఖండం 6 నవల – స్వయంవరణం

ఈ ఖండంలో మహీధర రామమోహనరావు రాసిన 'స్వయంవరణం' అనే సాంఘిక నవలను మీరు పాఠ్యంగా చదువుతున్నారు. ఈ పాఠ్యానికి పరిచయాన్ని వ్యాఖ్యానాన్ని పాఠ రచయిత సమకూర్చారు. అదనపు సమాచారంలో ఇచ్చిన రెండు వ్యాసాలు స్వయంవరణంపై వెలువడిన విమర్శ వ్యాసాలు. మరొక వ్యాసం నవలను ఒక కల్పనా సాహిత్య రచనా ప్రక్రియగా, ఆధునిక మహేతిహాసంగా పరిచయం చేసేది. ప్రధానమైన నవల అంగాలను దృష్టిలో పెట్టుకొని చేసిన పరామర్శ ఈ పాఠంలో చూడవచ్చు. మీ పాఠంలో ప్రస్తావించిన లక్షణాలే కాక నవలకు మరికొన్ని లక్షణాలను విమర్శకులు చెబుతారు. ముందు ముందు వాటిని గురించి మీరు తెలుసుకుంటారు. చదవదగిన పుస్తకాలలో నవల లక్షణాలనూ, తెలుగు నవలా వికాసాన్నీ తెలియచేసే పుస్తకాలను చేర్చాము. వాటిని సంపాదించి చదవండి. నవలను ఒక సాహిత్య ప్రక్రియగా, ఒక కళా మాధ్యమంగా, ఒక చిత్త సంస్కార వర్ధక సాధనంగా, ఒక సామాజిక చైతన్య వేదికగా మీరు గ్రహించగలుగుతారు.

ఈ ఖండంలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగం నవలా రచయిత – సామాజిక నేపథ్యం. రెండవ భాగం స్వయంవరణం – నవలా శిల్పం.

## భాగం 1 'స్వయంవరణం' నవలా రచయిత–సామాజిక నేపథ్యం

### విషయక్రమం


1.0 ఉద్దేశం
1.1 ప్రవేశిక
1.2 మహీధర రామమోహనరావు నేపథ్యం
1.3 స్వయంవరణం నవల – రచనోద్దేశం
**అభ్యాసం – 1**
1.4 నవల సామాజిక నేపథ్యం
**అభ్యాసం – 2**
1.5 ముఖ్యవిషయాలను గుర్తుచేసుకుందాం
1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు
1.7 ఆకళింపు ప్రశ్నలు
అభ్యాసానికి జవాబు


BRAOU

### 1.0 ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు.

- మహీధర రామమోహనరావు – నేపథ్యం.
- నవలోద్దేశం, సామాజిక నేపథ్యం

### 1.1 ప్రవేశిక

మహీధర రామమోహనరావుకు సమకాలీన సాహితీరంగంలో ఒక విశిష్ట స్థానముంది. మార్క్సిస్టు దృక్పథంతో సమకాలీన రాజకీయ నేపథ్యాన్నిసవిమర్శకంగా చిత్రిస్తూ ఆయన రాసిన రాజకీయ నవలలు. ఆయన రచనలకు ప్రత్యేకతను సంతరించి పెట్టాయి. ఒక స్పష్టమైన దృక్పథంతో, స్థలకాలబద్ధమైన సామాజిక వాస్తవిక చిత్రణతో ఆయన రచనలు గురజాడ సవిమర్శక వాస్తవిక వాద ధోరణికి కొనసాగింపుగా కనిపిస్తాయి. స్త్రీ పురుష సంబంధాల గురించిన ఆయన ఆలోచనలు, ప్రేమ, వివాహం పట్ల ఆయన దృక్పథం

ఇప్పుడు పాఠ్యంగా మీరు చదవబోతున్న స్వయంవరణం నవలలో రూపు దిద్దుకున్నాయి. ఈ భాగంలో రచయిత, రచనల సామాజిక నేపథ్యం గురించిన పరిచయం ఉంది.

## 1.2 మహీధర రామమోహనరావు – నేపథ్యం

'స్వయం వరణం' నవల రాసింది మహీధర రామమోహన రావు. ఆయన 1909 (కార్తీక శుద్ధ అష్టమి) లో తూర్పుగోదావరి జిల్లా ముంగండ అగ్రహారంలో పుట్టారు. అక్షరాభ్యాసం అయిన దగ్గరనుండి చదువు ఇంట్లోనే సాగింది. బళ్ళో చేరి చదవటం మూడవ ఫారమ్‌తో ప్రారంభమై దానితోనే ముగిసింది. (థర్డ్ ఫారమ్ ఇప్పటి 8వ తరగతితో సమానం). జాతీయోద్యమంలో భాగంగా గాంధీజీ పాఠశాలలను, కళాశాలలను వదలి వెయ్యవలసిందిగా విద్యార్థులకు పిలుపు యిచ్చారు. దానిని అందుకొని మహీధర స్కూలు చదువు మానేశారు. ఇంట్లోనే సంస్కృతం చదువుకున్నారు. తెలుగు పరీక్షలు, హిందీ పరీక్షలు రాశారు. 1930 వరకూ కాంగ్రెసు రాజకీయాలలో పాల్గొన్నారు. కాకినాడ శాసనోల్లంఘన ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. క్రమంగా కాంగ్రెసు పంథా మీద ఆయనకు అసంతృప్తి కలిగింది. మార్క్సిజం వైపు ఆకర్షితులయ్యారు. 1934లో మార్క్సిస్టు సాహిత్యాన్ని విరివిగా చదవటం కోసం, మార్క్సిజాన్ని అర్థం చేసుకోవటం కోసం ఇంగ్లీషు నేర్చుకోవాలన్న పట్టుదల కలిగింది. సంస్కృతం, తెలుగు, హిందీ భాషలు నేర్చుకున్న అనుభవంతో, రాత్రింబవళ్ళు అదేపనిగా శ్రమించి స్వయంకృషితో ఇంగ్లీషు నేర్చుకొన్నారు. ఇంగ్లీషు పుస్తకాలను తెలుగులోకి అనువదించగలిగినంత గట్టిగా నేర్చుకొన్నారు. 1937లో కంభంపాటి సత్యనారాయణగారితో కలిసి 'వై సోషలిజం' (ఇంగ్లీషు మూలం : జయప్రకాశ్ నారాయణ్) అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్నో గ్రంథాలను అనువదించి తెలుగు వాళ్ళ జ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తున్నారు.

రామమోహనరావుగారు నవలా రచన ప్రారంభించింది 1948 జనవరి 20 నాటి రాత్రి 8 గంటలకు. ఆయన మొదటి నవల 'రథచక్రాలు' కమ్యూనిస్టు పార్టీ దిన పత్రికలు 'ప్రజాశక్తి' (1946–48) 'విశాలాంధ్ర' లలో పనిచేయటం, దేశంలోని రాజకీయ పరిణామాలను ముఖ్యంగా తెలంగాణాలో కమ్యూనిస్టు రాజకీయాల గురించి తెలుసుకోవటానికీ, అర్థచేసుకోవటానికి పనికివచ్చింది. ఆ అవగాహనతో మూడు నవలలు రాయాలని సంకల్పించి 1956, 57 సంవత్సరాలలో "ఓనమాలు, మృత్యునీడల్లో అనే నవలలు వరసగా రాశారు. అనుకొన్నట్లుగా ఈనాటి వరకూ అ వరుస మూడవ నవల రాయలేకపోయారు. 1967లో 'కొల్లాయి గట్టితేనేమి' అనే నవల రాశారు. భారత జాతీయోద్యమం ఈ నవలకు వస్తువు. 1971లో 'ఈదారి ఎక్కడికి?' 1984లో 'దేశం కోసం' అనే మరో రెండు నవలలు రాసి ప్రచురించారు. ఇవన్నీ దేశంలోని రాజకీయ పరిణామాలను చిత్రించేనవలలు. రాజకీయోద్యమాలవల్ల ప్రజాజీవితంలో వస్తున్న సంఘర్షణలనూ, మార్పులనూ చిత్రించటం ద్వారా సామాజికాభ్యుదయానికి అనుకూలంగా ప్రజలు తమ జీవితాలను మలచుకోవలసిన చారిత్రిక అవసరాన్ని మహీధర గుర్తు చేశారు. సాంఘిక వ్యవస్థలో వస్తున్న మార్పుల స్వభావాన్నీ, వాటికను కూలంగా ప్రజలు తమ అలవాట్లను మార్చుకోవలసిన అవసరాన్నీ అనేక కోణాల నుండి విశ్లేషిస్తూ, వివరిస్తూ 'కత్తుల వంతెన' లాంటి సాంఘిక నవలలు రాశారు. ఆయన రాసిన నవలలు మొత్తం 12.

BRAOU

హేతువాద దృష్టి, వైజ్ఞానిక దృక్పథం మహీధర రామమోహనరావుగారి వ్యక్తిత్వంతో ముడిపడి ఉన్న అంశాలు. ఈ విశిష్టవ్యక్తిత్వం ఆయన రచనలన్నింటిలోనూ కనబడుతుంది.

శాస్త్రవిజ్ఞాన ప్రచారంకోసం, శాస్త్రీయ దృష్టి వ్యాప్తి కోసం 'అవంతి' అనే పత్రికను ప్రస్తుతం నడుపుతున్నారు.

## 1.3 స్వయంవరణం నవల – రచనోద్దేశం

'స్వయం వరణం' నవల 1968 జనవరిలో అచ్చయింది. అప్పటికి చదువుల వల్ల ఉద్యోగాల వల్ల నిత్య సామాజిక సంబంధాలలో వస్తున్న స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, పెళ్ళిళ్ళకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. పాత విలువలలో ఆధునిక జీవన విధానాలలో బ్రతుకులు గడుపుతున్న మొదటి తరానికీ, ఆధునిక జీవనవిధానంలోనే పుట్టి పెరిగి అందుకనుకూలమైన విలువల నంగీకరిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్రతుకు విధానాలను మార్చుకోవటానికి సిద్ధపడ్డ రెండవతరానికి మధ్య సాగుతున్న భావ సంఘర్షణ ఆ అవకాశాలమీద ప్రభావాన్ని చూపుతున్నది. కులం, మతం, సంప్రదాయం, హోదా, డబ్బు మొదలైన విలువలు

ప్రముఖంగా ముందుకు వస్తున్నాయి. ఆ అవకాశాలను పురుషుడుతన కనుకూలంగా వాడుకొని స్త్రీని మోసం చెయ్యటానికి వీలు కల్పిస్తున్నాయి. అట్లా మోసగించబడ్డ సంఘటనలే ఉదాహరణలుగా చూపించి పెళ్ళిళ విషయంలో స్త్రీలు స్వయం నిర్ణయాలు తీసుకోవటానికి భయపడేట్లుచేసింది. ఈ కఠోర సామాజిక వాస్తవికత లనే సాహిత్యం కూడా ప్రతిఫలించింది. ప్రేమ వైఫల్యాలను, స్త్రీల కన్నీటి గాథలను చిత్రించింది. అంతేగానీ, ప్రేమకు అడ్డు వచ్చే సామాజిక వైరుధ్యాలను అతిక్రమించటమెట్లాగో చెప్పే ప్రయత్నం జరగటం లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రేమ విషయంలో, పెళ్ళి విషయంలో సమకాలీన సమాజంలో కొనసాగుతున్న ధోరణులను నిరసిస్తూ తల్లిదండ్రుల ప్రమేయం లేకపోతే ప్రేమ వివాహాలు సఫలమవుతాయన్న సిద్ధాంతాన్ని స్థాపిస్తూ స్వయంవరణం నవల రాశారు మహీధర.

## అభ్యాసం – 1

(కింది ఖాళీలో మీ సమాధానం రాయండి. భాగం చివర ఇచ్చిన జవాబుతో సరిపోల్చుకోండి)

మహీధర రామమోహనరావు నిరూపించదలచిన సిద్ధాంతాం ఏమిటి? (20 పదాలకు మించకుండా రాయండి)

## 1.4 నవల – సామాజిక నేపథ్యం

నవలలో ప్రధానమైంది కథ. కథ ఒకచోట జరుగుతుంది. ఒక కాలంలో జరుగుతుంది. దేశ కాలాలు నవలకు ఒక సామాజిక నేపథ్యాన్ని ఏర్పడతాయి. ఈ నేపథ్యం ఆ కథ ఆ రకంగా జరగటానికి గల మూల కారణాలను నిర్దేశిస్తుంది. కథకు మూలంగా ఉండే సామాజిక నేపథ్యాన్ని రెండు విధాలుగా చూపించవచ్చు. ఒకటి – ఆ కథ ప్రవర్తించే ప్రాంతాలను నిర్దేశించటం ద్వారా, రెండు – ఆ కథ ప్రవర్తించే కాలాన్ని నిర్దేశించటం ద్వారా. ఇట్లా కథను నిర్దిష్ట దేశ కాలాలలో నిబద్ధించి చూపటం వల్ల కథ కొక వాతావరణ సమకూడుతుంది.

'స్వయం వరణం' నవల కథ విజయవాడ రైల్వే స్టేషనులో ప్రారంభమై విశాఖపట్నంలోని యూనివర్సిటీ హాస్టల్ గదిలో ముగుస్తుంది. కథ నడిచే ప్రాంతాలు విజయవాడ, పోరంకి, కాకినాడ, విశాఖ పట్నం. రుక్మిణీ సుధలు పుట్టి పెరిగింది విజయవాడలో. వాళ్ళతల్లి దండ్రులుండేది కూడా అక్కడే. అందుకనే వాళ్ళిద్దరూ ప్రధాన పాత్రలుగా సాగే కథ విజయవాడలో ప్రారంభమవుతుంది. నవలలో ప్రధాన పాత్రలన్నీ అక్కడే పరిచయమవుతాయి. పోరంకిలో కుముద పెళ్ళి నిమిత్తంగా ముఖ్య పాత్రలన్నీ ఒక చోటికి చేరటం సుధ కామేశ్వరరావు ప్రేమించి పెళ్ళి చేసుకొందామనుకొంటుంటే రుక్మిణి పెళ్లి సంబంధం వచ్చి కథలో అది కొంత సంఘర్షణకు తావివ్వటం – జరుగుతుంది. ఆ తరువాత సుధనూ కామేశ్వరరావునూ చుట్టుకొని కొంత కథ కాకినాడలోనూ, రుక్మిణినీ, ప్రభాకరరావునూ చుట్టుకొని మరికొంత కథ విశాఖపట్నంలోనూ నడిచి ముగుస్తుంది.

అట్లాగే అంతర్గత సాక్ష్యాలను అనుసరించుకొంటూ పోతే నవలా కథ ఏ కాలంలో ప్రవర్తించిందోకూడా తెలుస్తుంది. బెజవాడలో రైలు దిగి రుక్మిణి ఇంటికి వెళ్ళేప్పటికి అక్కడ తండ్రి స్నేహితుడు రామచంద్రరావు వచ్చి వున్నాడు. ఆయన రుక్మిణిని ఏవో కుశల ప్రశ్నలడిగి 'పెద్ద దానివయ్యావు! అబ్బో ఎప్పటి మాట! నలభయ్యొనిమిదిలోనా, అంతకు పూర్వమేనా మూర్తీ, రుక్మిణిని చూసింది, సెకండు ఫారమో ఏదో చదువు



BRAOU

తూందని గుర్తు (పు. 33) అంటాడు. దాన్ని బట్టి రామచంద్రరావు రుక్మిణిని కాస్త అటూ ఇటుగా 1948లో చూశాడు. అప్పటి కామె సెకండ్ ఫారమ్. కథా కాలం నాటికి ఎమ్మెస్సీ అయి రీసర్చి చేస్తున్నది. సెకండ్ ఫారమ్ నుండి ఫిఫ్త్‌ఫారమ్ వరకూ 4 ఏళ్ళు ఎస్సెల్సీ ఒక సంవత్సరం. మొత్తం అయిదేళ్ళు. ఆ తరువాత ఇంటర్ రెండేళ్ళు. అంటే మొత్తం (5+2) ఏడేళ్ళు. బియస్సీ మరో రెండేళ్ళు అంటే (7 + 2) తొమ్మిదేళ్ళు, ఎమ్మెస్సీ మరోరెండేళ్ళు (9+2) అంటే పదకొండేళ్ళ చదువు పూర్తి చేసింది ఇప్పుడు రామచంద్రరావు రుక్మిణిని చూశారన్న కాలానికి 1948కి ఆమె చదువుకు పట్టిన కాలం (11 ఏళ్లు) కలిపి (1948+11 = 1959) 1959 వెళ్ళి 1960లోకి ప్రవేశించిన కాలం కథాకాలమవుతుంది. రుక్మిణిని 1948లో చూశానన్న రామచంద్రరావు మాటలను, ఆయన పదిపన్నెండేళ్ళ నుండి యిటురావటంలేదన్న సుందరమ్మ మాటలను అన్వయించుకొని చూసినా కథాకాలం (1948+12) 1960 అవుతుంది. మర్నాడు సుధ గురించి ప్రస్తావిస్తూ నరసింహమూర్తి 'ఆ అమ్మాయికి పాతికేళ్ళు వచ్చాయి. మన రుక్మిణి ఈడుదే' (పు. 52) అంటాడు. రుక్మిణీ సుధలు ఒక ఈడువాళ్ళే. 1960 నాటికి పాతికేళ్ళ వాళ్ళంటే వాళ్ళు పుట్టింది (1960–25 = 1935). 1935 అయివుంటుంది. పిల్లలకు అయిదేళ్లు నిండాక బళ్ళో వేస్తుంటారు. ఈ రకంగా రుక్మిణీ సుధ లిద్దరూ 1940లో చదువు ప్రారంభించి వుంటారు. హైస్కూలు చదువు పదకొండేళ్ళు, ఇంటరు రెండేళ్ళు, బియస్సీ రెండేళ్ళు, ఎమ్మెస్సీ రెండేళ్ళు చదివారు. అంటే మొత్తం 11+2+2+2=17 సంవత్సరాలు చదివారు. అంటే 1940+17=1957 నాటికి ఎమ్మెస్సీ చదువులు పూర్తి చేసుకొన్నారు. వెంటనే రుక్మిణి రీసర్చిలోనూ, సుధ ఉద్యోగంలోనూ చేరి పోయారు. రైలు ప్రయాణం రుక్మిణీ సుధ గురించి తనతో ప్రయాణం చేస్తున్న ఒక పెద్దమనిషి 'మూడేళ్ళనుండి కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తున్నద'ని చెప్పింది. 1957లో చదువు పూర్తయిన సుధ మూడేళ్ళ నుండి ఉద్యోగం చేస్తున్నదంటే కథాకాలం తప్పకుండా 1960 అవుతుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 సంవత్సరాలకు ఆంధ్రదేశపు వాతావరణంలో ఈ నవలా కథంతా ప్రవర్తిస్తుందన్న మాట.

కథ స్థూలంగా 1960లో ప్రవర్తిస్తుంది. సరే, సూక్ష్మంగా పరిశీలిస్తే కథ ఏరోజు ప్రారంభమై ఏ రోజు ముగిసిందో – మొత్తం మీద ఎంత కాలం కథ నడుస్తుందో కూడా తెలుస్తుంది. ఒకానొక నాటి రాత్రి 9, 10 గంటలప్పుడు ఈ నవలా కథ ప్రారంభమవుతుంది. మర్నాడు రాత్రి సముద్రం వెళ్ళి; మూడవ నాడు రుక్మిణి తండ్రి కామేశ్వరరావు గురించి ఆమె అభిప్రాయం రాబట్టే ప్రయత్నం చేస్తాడు. సుధకు రామచంద్రారావు కొడుక్కు పెళ్లి కుదిర్చే ప్రయత్నం చేస్తాడు. నాల్గవ నాడు సుధ కాకినాడకు తిరిగి వెడుతుంది. అయిదవ నాడు సుధ కామేశ్వరరావులు పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకొంటారు. ఆరవనాడు కథారంగం విశాఖపట్నానికి మారుతుంది. ఆ రోజు రుక్మిణికి ప్రభాకరరావు దగ్గర నుండి ఉత్తరం వస్తుంది. నాలుగు రోజులు కథ ఏమీ నడవదు. నాలుగు రోజుల తరువాత 11వ రోజు రుక్మిణి ఉత్తరానికి ప్రభాకరరావుల పెళ్ళి నిర్ణయం 13వ రోజు విందు. సుధకు ఉత్తరం వ్రాస్తుంది. ఈ విధంగా ఈ నవల కథంతా 13 రోజులలో ప్రవర్తించింది. అందులోనూ 9 రోజులలో మాత్రమే కథా సంబంధమైన సంఘటనలు సంభవిస్తాయి.

యువతీ యువకులు పరస్పరం ప్రేమించుకొని పెద్దలకు తెలిపిగానీ, తెలపకుండా గానీ పెళ్ళిళ్ళు చేసుకోవటం ప్రధానసమస్య అయినప్పుడు అది 1960కి ముందూ ఆతరువాత నేటికికూడా రకరకాల దృక్కోణాల నుండి సంభవయోగ్యత కలిగి ఉంటుంది. అటువంటప్పుడు ఆ సమస్యపై 1960 నాటి సామాజిక స్థితిగతుల ప్రభావం ప్రత్యేకంగా పేర్కొనదగిందిగా ఉండదు. అట్లాగే ఆ సమస్య విజయవాడలోనో, కాకినాడలోనో, విశాఖ పట్నంలోనో మాత్రమే సంభవించేదికాదు. ఆ ప్రాంతాల సాంఘిక ఆర్థిక రాజకీయ జీవన విధానం పాత్రలను గానీ, ఆ ప్రత్యేక సమస్యను గానీ ప్రభావితం చేసిన లక్షణం కనపడదు. ("రామచంద్రరావూ, నరసింహ మూర్తీ కమ్యూనిష్టు రాజకీయాల్ని వెరొకరూపంచుకున్నారు) పార్టీ పట్టు సడలడం ప్రభావం ముందు స్త్రీలలో ప్రతిబింబించింది. నరసింహమూర్తికి డబ్బు రంటి. పార్టీని వ్యతిరేకించి పట్టించి యిచ్చిన సుబ్బారాయుడుతో వియ్యమందడానికి అభ్యంతరం లేదు. అతని భార్యకు కులం ఆటంకం. కాని వారి బిడ్డలకి ఆ మస్తి అంటలేదంటే కారణాలు భిన్నం. రెండోది యువత చదువుతున్న పుస్తకాల ప్రసక్తి విశాఖలో రచయితల సభలో ప్రధాన పాత్ర పేర్కొంటాడు" (ఇది ఈ సందర్భంలో రచయిత స్వయంగా తెలిపిన అభిప్రాయం – సంపాదకుడు) ఒక జీవితానికీ, ఒక కథకూ ఏదో ఒక సామాజిక నేపథ్యం వుండాలి కనుక రచయిత తాను ఈ నవలా రచన చేసే నాటానికి సమీపగతాన్ని, నవలాకాలంగానూ, తనకుతెలిసిన విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాలను నవలాదేశంగానూ స్వీకరించారు.

BRAOU

## అభ్యాసం – 2

కింది ఖాళీలో మీ జవాబు రాయండి. భాగం చివర ఇచ్చిన జవాబులతో సరిపోల్చుకోండి.

కథకు ఉండే సామాజిక నేపథ్యాన్ని యెలా ప్రదర్శించవచ్చు? (20 పదాలకు మించకుండా రాయండి)

## 1.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- స్వయంవరణం నవలా రచయిత మహీధర రామమోహనరావు. ఆయన మంచి అనువాదకులు కూడా.
- మార్క్సిస్టు దృక్పథంతో వాస్తవికతా ధోరణిలోఆయన చేసే రచనలకు సాహిత్యంలోఒక ప్రత్యేక స్థానముంది.
- స్వయంవరణం నవల స్త్రీ పురుష సంబంధాల గురించిన ఆయన దృక్పథానికి అద్దం పడుతుంది.
- ప్రేమ విషయంలో, పెళ్ళి విషయంలోసమకాలీన సమాజంలో కొనసాగుతున్న ధోరణులను నిరసిస్తూ తల్లిదండ్రుల ప్రమేయం లేకపోతేప్రేమ వివాహాలు సఫలమవుతాయన్న సిద్ధాంతాన్ని స్థాపిస్తూ స్వయంవరణం నవలను రాశారు మహీధర.
- కథకు మూలంగా ఉండే సామాజిక నేపథ్యాన్ని ఆ కథ ప్రవర్తించే ప్రాంతాలను నిర్దేశించటం ద్వారా చూపవచ్చు. రచయిత ఇక్కడ తనకు తెలిసిన విజయవాడు, కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాలను స్వీకరించారు. సామాజిక నేపథ్యాన్ని ఆ కథ ప్రవర్తించే కాలం ద్వారానూ ప్రదర్శించవచ్చు. ఇక్కడ రచయిత ఎన్నుకున్న కథ ప్రవర్తించే కాలం స్థూలంగా 1960 ప్రాంతాలు.

BRAOU

## 1.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో రాయండి

1. మహీధర రామమోహనరావును పరిచయం చేయండి
2. స్వయంవరణం నవల సామాజిక నేపథ్యానికి వివరించండి.

15 పంక్తుల్లో రాయండి

1. స్వయం వరణం నవలను మహీధర ఏ ఉద్దేశంతో రాశారు?
2. సామాజిక నేపథ్యాన్ని నవలలో ఎన్ని విధాలుగా ఆవిష్కరించవచ్చు?
3. స్వయంకరణం నవలలోరచయిత తీసుకున్న సమస్య ఏమిటి?
4. మహీధర చేసిన అనువాద కృషిని వివరించండి.

## 1.7 ఆకళింపు ప్రశ్నలు

1. ఈ భాగం చదివిన తర్వాత రచయితకూ రచనకూ సామాజిక నేపథ్యం ఉంటుందనీ, ఈ నేపథ్యం నుంచే రచన రూపు దిద్దు కుంటుందనీ గ్రహించి ఉంటారు. మీరుచదివిన ఇతర నవలల్లో సమకాలీన సమాజిక నేపథ్యం మూలాల్ని పరిశీలించండి. మీకునచ్చిన ఒక నవల మీద ఆ దృష్టితో ఒక చిన్న వ్యాసం రాయండి.

## అభ్యాసాలకు జవాబులు

1. పెద్ద వాళ్ళ జోక్యం ఉండని ప్రేమ వివాహాలు సఫలమవుతాయన్న విషయాన్ని ఈ నవలలో మహీధర నిరూపించదలచారు.

2. రెండు విధాలుగా ప్రదర్శించవచ్చు. ఒకటి - ఆ కథ ప్రవర్తించే ప్రాంతాలను నిర్దేశించటం ద్వారా, రెండు - ఆ కథ ప్రవర్తించే చాలాన్ని నిర్దేశించటం ద్వారా.

**– డా. కాత్యాయని విద్మహే**

BRAOU

# భాగం 2 స్వయంవరణం – నవలాశిల్పం

## విషయక్రమం


2.0 ఉద్దేశం
2.1 ప్రవేశిక
2.2 పాఠ్యం
2.3 అర్థ వివరణ
2.4 ఇతివృత్తం
అభ్యాసం – 1
2.5 పాత్ర చిత్రణ
- 2.5.1 పాత్ర చిత్రణ అంటే
- 2.5.2 స్వయంవరణం నవలలో పాత్రల స్థూల పరిచయం
- 2.5.3 రామచంద్రరావు
- 2.5.4 సుధ
- 2.5.5 కామేశ్వరావు
- 2.5.6 రుక్మిణి
- 2.5.7 ప్రభాకరరావు
- 2.5.8 రఘురామయ్య
- 2.5.9 కుటుంబరావు
- 2.5.10 మరికొన్ని పాత్రలు – పరిచయం

అభ్యాసం – 2
2.6 నవల నిర్మాణం
- 2.6.1 దృష్టికోణం
- 2.6.2 కథనం
- 2.6.3 శైలి

అభ్యాసం – 3
2.7 రచయిత జీవిత దృక్పథం
అభ్యాసం – 4
2.8 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం
2.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు
2.10 ఆకళింపు ప్రశ్నలు


BRAOU

## 2.0 ఉద్దేశం

ఈ భాగం చదివింతర్వాత ఈ కింది అంశాలను మీరు వివరించగలుగుతారు.

- స్వయంవరణం – నవలా పరిచయం
- నవలా శిల్పం – ఇతివృత్తం, పాత్రచిత్రణ, నవలా నిర్మాణం, రచయిత జీవిత దృక్పథం

## 2.1 ప్రవేశిక

నవల బహుళ జనాదరణ పొందిన ప్రక్రియ. కథానిక ప్రక్రియ కన్నా నవలలో జీవితాన్ని గాఢంగా లోతుగా సమగ్రంగా ఆవిష్కరించే అవకాశం ఉంది. ప్రతి ప్రక్రియకూ ఒక పాఠక సమూహం ఉంటుంది. నవలకు మధ్యతరగతి పాఠకవర్గమే ఎక్కువ. రచయితల్లోనూ ఎక్కువమంది మధ్యతరగతివర్గం వాళ్ళే. తమకు తెలిసిన వర్గం గురించే నిజాయితీగా రాసే కొడవగంటి కుటుంబరావులాంటి రచయితలెప్పుడూ ఉంటారు. ఆ కోవకుచెందిన రచయితే మహీధర రామమోహనరావు. ఈభాగంలో నవలాశిల్పం గురించి పరామర్శ ఉంటుంది.

ఇతివృత్తం, పాత్రచిత్రణ, నవలానిర్మాణం, రచయిత జీవిత దృక్పథంలాంటి అంశాలను పరిశీలిస్తూ శిల్పదృష్ట్యా నవల గుణగణాల చర్చచేయటం కూడా ఈ భాగంలో చూడవచ్చు. ఈ చర్చ వెలుగులో నవలా ప్రక్రియను విమర్శనాత్మకంగా పఠించే, పరిశీలించే అవకాశం ఉంటుంది. మొదట నవలను చదవండి.

## 2.2 పాఠ్యం – స్వయంవరణం

మద్రాసు మెయిలు విజవాడ స్టేషనులోకి దూసుకువస్తూంది. కదిలించిన తేనె పట్టులో ఈగల్లా జనం హడావిడిగా లేచేరు.

గంట సేపటినుంచి రైలు పెట్టె గుమ్మంలో కాపలావేసిన సుధ స్టేషను కనబడగానే, 'అమ్మయ్య' అంది.

"ఈపాటికకలే. బండి వదలలేకున్నా వేమిటి?" అంటూ, తన సీటులోనే కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తున్న మిత్రురాలిని హెచ్చరించింది.

"ప్లాట్‌ఫారంమీదికి గెంతేసేలా వున్నావే" అంటూ రుక్మిణి మిత్రురాలి హడావిడి చూసి నవ్వింది.

ఎదుటి సీటులో కూర్చున్న ప్రయాణీకుడు చిరునవ్వుతో "మీరిద్దరూ ఇక్కడే దిగుతారా?" అన్నాడు.

ఈ ప్రశ్నకు సరాసరి సమాధానం ఇవ్వకుండా "అదే ఆ హడావిడి అంతా" అంది రుక్మిణి.

ఆయన ఎంతో ఆప్యాయంగా సుధ వంక చూస్తూ – "చిన్నతనం" అన్నాడు.

"చిన్నతనం ఏమిటండోయ్! ఎం.ఎస్.సి.లో డిస్టింక్షన్ తెచ్చుకుంది. మూడేళ్ళనుంచి కాలేజిలో లెక్చరరుగా పనిచేస్తూంది కూడాను" అంది రుక్మిణి.

"పెళ్ళి అయిందా?" అని ఆయన మళ్లీ ప్రశ్నించేడు.

ఆ ప్రశ్నలో రుక్మిణికి ప్రత్యేకోద్దేశం వినబడింది. ఏలూరులో బండ ఎక్కినప్పటి నుంచీ ఆయన సుధను ప్రత్యేకంగా గమనిస్తూండడం రుక్మిణి చూసింది. ఆయనకు అరవయ్యేళ్ళు పైబడ్డాయి. జుట్టూ, మీసాలు తెల్లరంగు తిరుగుతున్నాయి. ఆయన చూపులలో సుధ మాటల యెడ ప్రశంసా, ఆమెయెడ అభిమానమూ మాత్రమే కనిపించేయి. ఆ ప్రశ్నతో ఆ ప్రశంస వెనుక ఒక ఆలోచన కూడా వుందేమో ననిపిస్తూంది.

"ఇంకా కల్యాణతార రాలేదంటూంటారు వాళ్ళ నాన్నగారు" అంది రుక్మిణి చిరునవ్వుతో.

ఆమాట వినగానే ఆయన వులికిపడ్డట్లయ్యాడు. "బ్రాహ్మలా?" అన్నాడు.

ఆ ప్రశ్నలో ఎంతో నిరాశ వినిపించి రుక్మిణి నవ్వుకుంది. తన ఆలోచన సరియైనదే ననుకుంది. తలూపింది.

"వాళ్ళ నాన్నగారు స్కూలు టీచరు, రిటైరయ్యారు".

"టీచరు ... రిటైరయ్యారు ..." అన్నాడాయన నొక్కినొక్కి, "ఎంత దురదృష్టవంతురాలు" అన్న అర్థం ఆ నొక్కుడులో వినిపించి, రుక్మిణి చురుమనేలా చూసింది.

"వాళ్ళ చెల్లెలికి ఎం.ఏ. చెప్పించింది. ఈ వేళ మేష్టారికి ఈవిడ సంపాదనే ఆధారం. చాలా మంచిపిల్లండోయ్" – అంటూ రుక్మిణి మిత్రురాలికి ఆసరా నిలబడింది.

తానేదో చులకనచేసినట్లుమిత్రురాలిని వెనకవేసుకు వస్తున్న రుక్మిణిమాటకు ఆయన నవ్వుకున్నాడు.

"అదే, అదే! పెళ్లి చేసుకొని సుఖంగా కాలం గడపవలసిన వయస్సులో కుటుంబభారం ఆడకూతురు మీద పడిందన్నాను".

తానుచెప్పని మాటను అంతబాగా అర్థంచేసుకొని, అంత వికటంగా వ్యాఖ్యానించిన ఆ పెద్దమనిషి వంక చూడలేకపోయింది రుక్మిణి. తల తిప్పుకుంది.

BRAOU

"అంతకంటే చిన్న వయస్సులోనే కుటుంబభారం మగవాడి నెత్తికెత్తుతున్నారు కాదా?" అంది.

"కుటుంబభారాన్ని ఎత్తుకోవడంలోనే మగాడు సుఖపడడం" అన్నాడు ఆయన, తన మాటను సమర్థించుకుంటూ.

"పెళ్ళి చేసుకొని పిల్లల్ని ఎత్తుకోడం కుటుంబభారం కాదా ఏమిటండీ?" అని రుక్మిణి ముదలకించింది.

"అది ఆమె కుటుంబం. తన మగడు, తన పిల్ల, తన బాధ్యత అవుతుంది. భారం అనిపించదు"

"ఇక్కడ మాత్రం పరాయివాళ్ళెవరు? తన తండ్రి, తన తల్లి, తన తోడబుట్టిన వాళ్ళూను, ఇక్కడ మాత్రం బాధ్యత లేదా?" అంది రుక్మిణి.

ఆయన కళ్ళల్లో నవ్వురేకలు కనిపించేయి. "అదీ బాధ్యతే", అని ఆయన వొప్పుకొన్నాడు.

"కాని ఆ రెండింటి మధ్యా హెచ్చుతగ్గులున్నాయి. వయస్సు వస్తేగాని అర్థంకావడం కష్టం..." అన్నాడు.

తననంత చిన్న పిల్లలా తీసెయ్యడం రుక్మిణికి కష్టం అనిపించింది.

"నాకూ పాతికేళ్ళు దాటేయి, బాబూ! ఇంకా వయస్సంటే మరెప్పుడో ..." అని మనస్సులోనే ఆయనను ఈసడించుకుంది. కాని, పైకేమీ అనలేదు.

* * *

బండి ప్లాట్‌ఫారం వెంబడినే చకచక ముందుకు పోతుంది. బండితోపాటు వడివడిగా అడుగులు వేస్తూ, పెట్టెల్లోకి తొంగి చూస్తున్నారు రైల్వే కూలీలు.

రుక్మిణి పిలిచింది : "పోర్టర్!"

ఓ కూలీ బండి నెంబరు చూసుకొని, 'వస్తున్నా' నన్నట్లుచెయ్యి వూపేడు

చేతిసంచులతో, నెత్తిబరువులతో జనం పెట్టెలు వెతుక్కుంటూ అటూఇటూ పరుగులెత్తుతున్నారు.

"ఎవరినెత్తిపెట్టి అన్నా తగలొద్దు, జాగ్రత్త" అని హెచ్చరించింది రుక్మిణి, మిత్రురాలిని.

కళ్ళతో ప్లాట్‌ఫారమంతా గాలించివేస్తూనే – "నువ్వింకా కదలతలచుకోలేదన్న మాట". అంది సుధ.

"ఎవరి కోసం అల్లా వెతికేస్తున్నావు?"

"రాజకుమారుడు రావలసి వున్నాడేమో" అన్నాడు. తెల్లమీసాలతో నవ్వుకుంటూ ఎదుటిసీటులో వున్న పెద్దమనిషి..

ఆమాట విననట్లే, సుధ "టెలిగ్రాం ఇచ్చేను" అంది.

"చూశారా" అన్నాడాయన తన వూహ సరయినదే నన్నట్లు

తన మిత్రురాలి అంతరంగిక విషయాలు కదిలిస్తున్నా ఆయన రుక్మిణికి కొత్తవాడులా అనిపించలేదు.

"రాజూలేదు, కుమారుడూ లేదు ... చీకట్లో యింటికెళ్ళడానికి భయం. ఎవరినో ఒకరిని స్టేషనుకు రమ్మని ఇంటికి టెలిగ్రాం ఇచ్చివుంటుంది" – అంది రుక్మిణి.

బండి ఆగీ ఆగడంలోనే సుధ దిగేసింది. మరుక్షణంలో గుమ్మంలో జనం క్రిక్కిరిసి పోయేరు. బయటి నుంచి లోనికి నెట్టుకొచ్చేవారూ, లోనుంచి బయటికి వురికెయ్యాలనుకునే వారూను!

ఆజనం వొత్తిడి చూసి, దిగ్భ్రమ చెందినట్లు దిక్కులు చూస్తూ రుక్మిణి అక్కడనే కూర్చుండి పోయింది. మధ్య మధ్య ఒక్కొక్కరు వచ్చి కిటికీలోంచి తొంగి చూసిపోతున్నారు. లోపలి కెవరన్నా లంఘించే ప్రయత్నం చేస్తారేమోనన్న భయం కలిగింది. షట్టరు కొంచెం దింపబోయింది.

ఇంతలో ఒక హోల్డాల్ ఒడిలోనూ, 'ప్లీజ్' అన్న అనునయం చెవిలోనూ పడి రుక్మిణి ఒక్కక్షణం విస్తుపోయింది. ఒళ్ళు మండింది.

మరుక్షణంలోఆమె తన ఒడిలో పడిన హోల్డాల్‌ను బయట ప్లాట్‌ఫారం మీదికి విసిరేసింది. ఆ విసురుకు విస్తుపోయి, నిలబడిపోయిన యువకునికి క్షమార్పణ చెప్పుకోవడం మరచిపోలేదు.

"ఎక్స్క్యూజ్ మి."

ముందుకు వేస్తున్న కాలిక్రింద హఠాత్తుగా హాజరయిన ఆ హోల్డాల్ అడుగుపడి తూలిపోయిన ఒక పెద్దమనిషి ఆ క్షమాదానాన్ని స్వీకరించి గమ్మున వుండిపోయాడు.

అయితే దానిని అందుకోవలసిన అసలు మనిషికి అది ఎగతాళిగానే కనిపించింది. సిగ్గు పడి గుడ్లు మిటకరించేడు.

• • •

బండి దిగగానే, పక్కనే ఎవరో పిలుస్తున్నట్లయి, సుధ అటూ ఇటూ చూసింది. చిరునవ్వుతో కామేశ్వరరావు ఎదురువచ్చేడు. బండికి ఎగబడుతున్న జనం మధ్య నుంచి రెక్క పట్టుకొని బయటకు తీసుకెళ్ళేడు.

"మీరెక్కడా కనిపించకపోతే నా టెలిగ్రాం అందిందో లేదో అని కంగారు పడ్డాను" అంది సుధ.

"నువ్వు వస్తున్నట్లు తెలియడానికి టెలిగ్రాం అవసరమా?" అన్నాడు కామేశ్వరరావు కొంటెగా చూస్తూ.

దిక్కులు చూస్తున్న సుధ అతని చూపులను గమనించడం లేదు. కనకనే ఆతని మాటలో కొత్త అర్థమూ స్ఫురించలేదు.

"మరెల్లాగేం?" అంది

"ఓస్! ఆ ఏర్పాట్లేవో నాకున్నాయి. అక్కడ నుంచి విజయవాడ వెడదామనే ఆలోచన పుట్టేసరికి ఇక్కడ మనకి కబురందిపోయింది" - అంటూ అతడు గుండె తట్టుకొన్నాడు.

"ఊఁ ..." - అని సాగదీసింది.

"మరి ... " అంటూ కామేశ్వరరావు తన మాటను సమర్థించుకున్నాడు.

"అలల్లా అయితే ఆ మాటముందే చెప్పివుంటే ఎంతో శ్రమా, ఆదుర్దా తగ్గివుండేది కదా" అంటూ నవ్వింది.

కామేశ్వరరావూ ఆమెతో నవ్వు కలిపేడు

తమ సంభాషణ నెవరన్నా విన్నారేమో అన్నట్లు సుధ మధ్యలో వులికిపడింది. మాట మార్చింది.

"అబ్బ! ప్రాణం విసిగిపోయింది. అసలే బండి అరగంటలేట్ అన్నారు. దానికి తోడు ఔటర్ సిగ్నల్ వద్ద ఓ అరగంటకు పైగా పడేసి వుంచేరు. ఎప్పటికేనా దిగుతామా అనిపించింది" - తన ఉలికిపాటును దాచుకుంటూ సుధ మాట్లాడేస్తూంది.

ప్లాట్‌ఫారాలు ఖాళీలేక విజయవాడ స్టేషనులోకి వచ్చే బళ్ళు గంటా, అరగంటా సేపు స్టేషనుకు అంతదూరంలో నిలబడి విశ్రాంతి తీసుకోవడం నిత్యకృత్యమయిపోయింది.

"అబ్బ! ఎప్పటికి బాగుపడుతుందోగాని" ... అంటూ సుధ ముక్తాయింపు వినిపించింది.

"నీ పెట్టో, బెడ్డింగో ఎక్కడ" - అంటూ కామేశ్వరరావు అడిగినప్పుడుగాని సుధకు మిత్రురాలి మాట

BRAOU

"ఇంతసేపు కూర్చున్నా ఇంకా మనసు తీరలేదుటే తల్లీ!" అంటూ ఆమె వేపు అడుగువేసింది సుధ.

మోచేతులతోజనం మధ్య సందుచేసుకువచ్చిన పోర్టరుకు సామానులుచూపిస్తూ, రుక్మిణి, సుధ పలకరింపుకు సమాధానం ఇచ్చింది.

"ఆ బెడ్డింగుఒక్కటేనా నీది? మరేమీలేదుగదా!"

ఆమె దిగిపోతుందని గ్రహించి, ఆ సీటుకోసం ఒడుపేసి చూస్తున్న ఇద్దరుముగ్గురు నవాగతులు ఆమె యోగక్షేమాల గురించి శ్రద్ధ తీసుకోసాగేరు.

"మీవాడి నింకొకర్ని పిలిచి, కిటికీలోంచి అందియ్యవయ్యా. ఈ జనంలోంచి దింపడం కష్టం" అన్నారొకరు.

మరొకకరు అంతకన్న మరో అడుగు ముందుకువేసి, తానే సాయపడడానికి సంసిద్ధత తెలిపేడు.

"నువ్వు దిగు, నే నందిస్తాను"

"మీరు లేవండి. కిందికి దిగి అన్నీ సరిగ్గా వచ్చేయో, లేదోచూచుకోండి" అంటూ మూడో వాడు అక్కడి నుంచి ఆమె లేవగానే తాను కూర్చునేందుకు వీలుగా సర్దుకొన్నాడు.

దిగేవాళ్ళని దిగనీయకుండా, మోటుతనంగా తోసుకొచ్చి ఎంతో గల్లంతు చేస్తున్న ఈ హితుల మీద రుక్మిణికి ఎంతో కసిగా వుంది. వారి కాసీటు దొరకనివ్వరాదనే ఆమె ఇంకా కదలలేదు. వారి ప్రయత్నాలు చూసి ఆమె మరింత సర్దుకుని కూర్చుంది. కాని ఎంతసేపు? తానిక దిగిపోవాలి.

బయట ప్లాట్‌ఫారం మీద ఇందాకటి యువకుడు ఏంచెయ్యడానికి తోచక, దిక్కులు చూస్తూ నిల్చబడి కనబడ్డాడు. క్షణక్రితం తన హోల్డాల్‌ను విసిరేసిన ఆ చండకాళివైపు అతడు చూడనుకూడ లేకున్నాడు. రుక్మిణికి జాలి కలిగింది. తన దురుసుతనానికి నొచ్చుకొంది. "మిస్టర్!" అని పిలిచింది.

ఆమె బయట నున్న వారెవరినో పిలుస్తూండడం గమనించి, బండిలోనే వుండి ఆమె యోగక్షేమాలు కనుక్కుంటూ వున్నవారికి ఆదుర్దా కలిగింది.

"బండి కదలిపోగలదు. దిగండి. ఇంకేమన్నా సామానులంటే అందిస్తాము" అని ఏకకంఠంగా వాగ్దానం చేశారు.

కాని, రుక్మిణి దిగడానికి తొందరపడలేదు. తన సామానులు చూపలేదు. పైగా 'ఇక్కడ మరొకరున్నారు' అంటూ తల తిప్పకుండానే, సమాధానం ఇచ్చింది.

'మరో అయిదు నిముషాలలో మెయిలు బయలుదేరడానికి సిద్ధంగా వుం'దన్న హెచ్చరిక మైక్‌లో వినిపిస్తూంది.

"ఓ, బోలెడంత టైముంది" - అంది, తన హితులకి సమాధానంగా, రుక్మిణి.

సామాను బయటకుతీసుకెళ్ళిన పోర్టరు వానిని క్రిందబెట్టి, మళ్ళీ కిటికీ వద్దకు వచ్చేడు.

"ఓమారు చూసుకోండి. ఏమన్నా మరిచేరేమో" అని సలహా ఇచ్చేడు.

రుక్మిణి అతని చేతికి వాటర్‌బేగ్ అందించింది.

"ఆ క్రింద ఉన్న హోల్డాల్ ఇల్లా ఇచ్చి" అని పురమాయించింది.

కొద్దిసేపటిక్రింతం అంత దూకుడు చూపిన ఆ అమ్మాయి నుంచి ఆ సద్భావం ఆశించివుండని ఆ యువకుడు హోల్డాలును తీస్తున్న పోర్టరును ఆటంకపరచేడు.

"ఏయ్! ఏమిటయ్యా, ఏమిటది తీస్తున్నావు?" అని గదిమేడు.



BRAOU

పోర్టరు అందించిన హోల్డాలును అందుకుని, పక్కనే పెట్టుకుంటూ "లోపలికి రాండి" అని ఆ యువకుణ్ణి లోపలికి ఆహ్వానించింది రుక్మిణి.

"ఇంకేమన్నా ఉన్నాయా?" అని సహకారం చూపింది.

"థాంక్సు. మరేం లేవు." అంటూ ఆ యువకుడు ఎంతో ఉత్సాహం కనబరిచేడు. తరువాత ఏ జి.టి.కో గాని వెళ్ళలేననుకొంటున్నవాడు ఆ బండిలోనే వెళ్ళగలుగుతున్నందుకు సంతోషించేడు. గబగబ గుమ్మం వేపు వెళ్ళేడు. కాని, అక్కడ కమ్ములు పట్టుకొని వేలబడుతూ నిలుచున్న వాళ్ళు గదిమేశారు.

"లోపలికి దారేదయ్యా?" అనేసరికి ఆ జనం మధ్య దూరబోతే ఎంతో విలువయిన టెర్లిన్ దుస్తులు మరి దక్కుతాయా అనిపించింది. తిరిగి కిటికీ వద్దకు వచ్చేడు.

అతని సంకోచాన్ని చూసి, రుక్మిణి అనునయం కనబరిచింది.

"బెర్తు రిజర్వు చేయించులేకపోయేరా?" అంది.

అతడు సిగ్గుపడ్డాడు. కాని, అతడు చెప్పింది విన్నాక ప్రశ్న మార్చింది.

"సీట్లు అమ్మే కుర్రాళ్ళు కనబడలేదూ?" అంది

విజయవాడ నుంచి రైలు ప్రయాణాలు చెయ్యడంలో మెలుకువలు ఆమెకు తెలుసు.

రుక్మిణికి సమాధానం ఇచ్చేలోపున, పోర్టరు అతనికి సలహా ఇచ్చేడు : "కిటికీలోంచి దూరెయ్యండి".

సందేహిస్తున్న ఆ యువకుణ్ణి రుక్మిణి ప్రోత్సహించింది.

"ఏం సాధ్యం కాదూ?"

అతడు చిరునవ్వుతో ఆమెకళ్ళల్లోకి చూసేడు

"మీరు కొంచెం తప్పుకొంటే"

రుక్మిణి లేచింది. ఇంకొకరెవ్వరూ ఆక్రమించడానికి వీలివ్వకుండా చూసుకు మరీ నిలబడింది.

ఆ యువకుడు బహులాఘవంగా, జీవిత సాధన అదే నన్నంత నిరాయాసంగా బండిలో ప్రవేశించాడు. సీటులో సర్దుకొని, టెర్లిన్ చొక్కాకి అంటుకొని వుండని దుమ్ము దులుపుకొన్నాడు. అతని చురుకుదనాన్ని కళ్లతోనే మెచ్చుకొంది రుక్మిణి. ఆమెకు అతడు అభివందనం తెలుపుకొన్నాడు. "థాంక్స్".

"నో మెన్షన్" అంటూ గుమ్మంవేపు కదిలింది.

* * *

"మీ వాళ్ళెవరన్నా వచ్చేరా, అమ్మా!" అన్న ప్రశ్న వినబడి, రుక్మిణి వేపు అడుగు వేస్తున్న సుధ నిలబడి తిరిగి చూసింది. ఏలూరు నుంచీ తమతో కబుర్లు చెప్తూ ప్రయాణం చేసిన పెద్ద మనిషి. అప్రయత్నంగానే "వచ్చేరండి" అంటూ పక్కనే వున్న కామేశ్వరరావువంక చూసింది.

కామేశ్వరరావు అంతవరకూ ఆయనను చూడనే లేదు. సుధతోపాటే అతడూ తిరిగి చూసేడు. పెద తండ్రి రఘురామయ్య!

"పెద నాన్నగారూ! మీరూ ఈ బండిలోనే దిగారా?"

సుధచూపులతో పాటు తలతిప్పిన రఘురామయ్య కామేశ్వరరావును చూడగానే కళ్ళింతలు చేసేడు.

"హాయి, నువ్వటోయ్! ఏమిటిల్లా వచ్చేవు?" అన్నాడు.

కాని, సమాధానం కోసం చూడకుండానే సుధతో తన పరిచయాన్ని చెప్పుకుపోయేడు.

"ఏలూరులో వీరున్న పెట్టెలోనే నేనూ ఎక్కేను. ఈవిడా, వీరి స్నేహితురాలే మరొకరూ వున్నారు. సరదాగా కబుర్లతో గడిచింది. మంచి అమ్మాయిలు ..."



Dr. BRAOU LIBRARY Class No: CM - 0307

ఆమె తన కెల్లా పరిచయమో కామేశ్వరావు చెప్పుకున్నాడు.

"చెల్లాయి కుముదా, వీరు ఒకే కాలేజీలో పనిచేస్తున్నారు. ఒకేచోట వుంటున్నారు. ఇప్పుడామె పెళ్ళికే వస్తున్నారు.

"ఇప్పుడే వస్తున్నానండి" అంటూ వారిద్దరినీ కబుర్లకు వదలి సుధ బండివేపు నడిచింది. రఘురామయ్య ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ –"మంచి అమ్మాయి తెలివి, అందం, మంచితనం, నెమ్మది ..." అంటూ ఆమెలో తనకు కనిపించిన మంచి లక్షణాలను పేర్కోసాగాడు.

ఆ ప్రశంసలలో కలియడానికికామేశ్వరరావుకు ధైర్యం చాలలేదు. "కుముదా, వీరు చాలా మంచి స్నేహితులు" అంటూ కామేశ్వరావు మాట మార్చేడు.

"బ్రాహ్మల అమ్మాయిలు!" అన్నాడు రఘురామయ్య

అది అనర్హతో, విచారకారణమో ఆయనకంఠాన్ని పట్టి అర్థం కాలేదు.

"ఔను, వాళ్ళ నాన్నగారు ..."

సుధను గురించి కన్న, వాళ్ళ నాన్నగారిని గురించి చెప్పడం క్షేమమని కామేశ్వరరావు అందుకో బోయాడు. కాని, ఆయన సంగతి తనకు తెలుసుననీ, మరింకేం చెప్పనక్కరలేదనీ అన్నట్లు రఘురామయ్య చెయ్యి ఆడించేడు.

"ఇప్పుడిల్లా వచ్చేవేం?"

సుధకోసమే వచ్చేనని చెప్పగల ధైర్యం కామేశ్వరరావుకు లేదు. అబద్ధమాడేడు.

"ఓ స్నేహితుడు మెయిలుకు వెడుతూంటే దిగబెట్టడానికని వచ్చేను" అన్నాడు.

"ఆయన బండి ఎక్కేరా?"

"ఆ. అంతలో వీరు కనిపించేరు ... మీరు రిక్షా చేసుకొని హోటలుకు నడవండి. పొద్దుపోయిన ఎవరన్నా వస్తే వుంటారని రెండుగదులు తీసుకున్నాం"

"అక్కర్లేదు. టాక్సీ చేసుకుపోదాం. ఆవిడ కూడా వున్నారు కదా"

"వారీవేళ రారు. వారి నాన్నగారు సత్యనారాయణపురంలో వుంటున్నారు. వారిని అక్కడికే దిగబెట్టాలి. తరవాత ప్రొద్దుటో, మధ్యాహ్నమో ..."

'సరిసరి! అల్లాగే చెయ్యి కుముద పెళ్ళికే వస్తున్నారంటేను! నువ్వు వెనక వస్తావు. నే వెడుదునా" అంటూ రఘురామయ్య ఓవర్ బ్రిడ్జి వేపు నడిచేడు.

* * *

రుక్మిణి వెళ్ళేక గాని ఆమె సీటు తమకు దక్కకుండా పోయిందన్న విషయం అంత వరకూ దాని మీద ఆశ పెట్టుకున్న ఇద్దరు ముగ్గురికీ అర్థంకాలేదు. అర్థ అయ్యేక చెయ్యగలదీ లేదు. కోపంవచ్చింది. కసి పట్టలేక "ఆమెకు మీరేమవుతారు?" అని అడిగేరు.

అతను కూడా తడుముకోకుండా – "మాకు కావలసినవారే" నన్నాడు.

ఆ కావలసిన ఆమెయే పది నిముషాల క్రితం అతని హోల్డాల్‌ను ప్లాట్‌ఫారం మీద పారేసిన విషయం వారెవరూ చూసి వుండరు. కనక అంతకన్న స్పష్టంగా హేళన చెయ్యలేకపోయేరు. ఇంక నిలబడే ప్రయాణం సాగించడానికి వీలుగా కాళ్ళు సర్దుకొన్నారు. అయినా ఆశ చావలేదు.

"ఎందాకా వెడతారు?"

"మదరాసు ..." అంటూ ఈతడు సీట్‌లో సర్దుకొన్నాడు. చేతికో పుస్తకం తగిలింది. అణువిజ్ఞానానికి సంబంధించిన శాస్త్రీయ గ్రంథం. పేరు చూసేడు. రుక్మిణి! ఆశ్చర్యపడ్డాడు. మనిషి విద్యావంతురాలులాగే కనిపించింది కాని, ఎం.ఎస్‌సి. అంటే ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగింది. అంత విద్యావంతురాలనిపించలేదు. కాని డిగ్రీలు ముఖంమీద వ్రాసి ఉండవు కదా! పిలుద్దామనుకుంటూంటే ఆమెవచ్చింది.



BRAOU

"సీట్‌లో నా పుస్తకం వుంటుంది. చూస్తారా?" అని అడిగింది.

అతడు పుస్తకం అందిస్తూ - "తమరేం చేస్తున్నారు?"

"రీసెర్చిస్టూడెంటుని" అంటూ ఆమె అతనికి అభివాదన తెలిపి వెనుదిరిగింది.

* * *

సామానుల వద్ద నిలబడ్డ సుధ 'దిగేవా తల్లీ! అని పలుకరించింది.

"నీ వాలకం చూస్తే మద్రాసుకి టిక్కెట్టు మార్పించేవనిపించింది".

అంతలో స్వరం తగ్గించింది.

"ఎవరా హీరో? ..."

రుక్మిణి నవ్వింది. "పేరు కనుక్కోమన్నావా?" అంది.

"నాకోసం నువ్వేం కనుక్కోనక్కర్లేదులే".

"నీ ఏర్పాట్లేవో నువ్వే చేసుకోగలనంటావు" అంటూ నవ్వుతూనే చెయ్యి రుద్దుకుంది. సందేహిస్తూ తమవేపు వస్తూన్న కామేశ్వరరావుకు ఆమెను పరిచయం చేసింది.

"మా ఫ్రెండు రుక్మిణి. వాల్తేరులో డాక్టరేట్‌కు పనిచేస్తూందని చెప్తూంటానే ... ఆమె" అంది.

'చెప్తూంటాను' అన్న మాటకు రుక్మిణి మిత్రురాలి ముఖంగా చూసింది.

ఆమాటలో తనకే విశేషార్థం కనబడి, సుధ కంగారుపడింది. ఆ కంగారులో అతనిని పరిచయం చేయడం మరిచిపోయింది. కామేశ్వరరావే తన పరిచయం తెలుపుకొన్నాడు.

"నాలుగైదేళ్ళ పాటు మేమంతా గాంధీ నగరంలో ఇరుగుపొరుగున వుండేవాళ్ళం ..."

అప్పటికి సుధ సర్దుకుంది.

"ఇళ్ళు మారినా దగ్గర బంధువులకన్న ఎక్కువగా వుంటాం. ఇప్పుడు నేను వస్తున్నది వీరి చెల్లెలి పెళ్ళికే" అంది.

'చెప్తూంటానే' అన్నమాటకిది సంజాయిషీ కాబోలు అనుకుంటూ రుక్మిణి నవ్వుకొంది. తన మాట నమ్మడం లేదని సుధ కసిగా, చేతిలోని వేలుమీద గోరు గిచ్చింది. 'అబ్బ' అని రుక్మిణి చేయి లాక్కుంది.

పోర్టర్లు వచ్చి సామాను ఎత్తుకున్నారు.

"గవర్నరు పేట" అంటూ కామేశ్వరరావు ముందు నడిచేడు.

## 2

సుధ రిక్షాదిగేసరికి ఎక్కడికో బయలుదేరుతూ తండ్రి గుమ్మంలో కనిపించేరు. ఆమెనుచూసి ఆశ్చర్య పడ్డాడు.

ఇంట్లో పనిచేసుకుంటున్న భార్యను పిలిచేడు.

"ఏమే! సుధ వచ్చింది" అంటూ గుమ్మం దిగేడు.

"ఏమిటమ్మా! చెప్పకుండా పెట్టకుండా వచ్చేసేవు! ఆరోగ్యంగా ఉన్నావా?" అంటూ నుదురు ముట్టుకున్నాడు.

సుధ నవ్వింది - "మీదో పిచ్చి! జబ్బుచేస్తేగాని ఇంటికి వచ్చే పని లేదేమిటండి" అంది.

గుమ్మంలో నుంచి తల్లి తొంగిచూసింది.

"ఇంకెవరన్నా ఉన్నారా? ఒకర్తెవూ రాగలిగేవూ?" అంది.

లోపల దీపం దగ్గర చదువుకుంటున్న చెల్లెళ్ళు పరుగెత్తి వచ్చేరు. రమ అడిగింది – "ఇప్పుడు సెలవు లేమున్నాయే అక్కా?"

సుధరాక అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. ఇంటికి వచ్చి వెడితే ఓపాతికరూపాయలు అయిపోతాయి కనక సుధ సెలవులకీ సెలవులకీ మధ్య సాధారణంగా ఇంటికి రావడం ఉండదు. కాలేజీ రోజుల్లో, ఉన్నట్లుండి హఠాత్తుగా ఇంటికి వచ్చేసరికి అందరికీ ఒకే ఆలోచన కలిగింది. "ఉద్యోగం కాని ..." అయితే ఒక్కరూ ఆమాట పైకి అనలేకపోయేరు, అశుభశంక అవుతుందని. సుధ వాళ్ళ ప్రశ్నలను అట్టే పట్టించుకోలేదు.

"సత్యంఏడీ?" అంది తమ్ముడిని గురించి.

"భోజనం చేసి వెళ్ళేడు. ఏ అర్ధరాత్రో వస్తాడు మామూలే" అంది తల్లి.

సుధ చిన్నపుచ్చుకుంది. "వాడికే తెలిసొచ్చి దారిన పడాలి గాని, అనుకొని లాభం లేదు" అంది.

"అప్పటికి అన్నీ మిగిలేపోతాయి.సరిలే. ఎవరి ప్రారబ్ధానికి ఎవరు కర్తలు" అని తల్లి సరిపుచ్చుకొంది.

"ఓ ఉత్తరం ముక్క వ్రాసి పడెయ్యక పోయావూ! ఎవరో ఒకరు స్టేషనుకి ...." అన్నాడు తండ్రి.

"అపరా రాత్రి వేళ, భయం అని అనిపించలేదూ?" అంది తల్లి.

"భయం ఏం ఉంది? రుక్కూ, నేను వచ్చిన బండిలోనే ఉంది. అదల్లా వెళ్ళింది; నేనిల్లా వచ్చేను.

"అయినా రాత్రివేళ కదా" అంది రాఘవమ్మ.

"నిజమే ననుకో. అయినా ఉత్తరం రాసే వ్యవధిలేదు. అదిగాక, ఇదోరోజూదా ఏమన్నానా అనిపించింది" – అంది సుధ.

రిక్షావాడు పెట్టను అరుగుమీద పెట్టి, బండి తిప్పుకొంటున్నాడు. "ఇతనికేమివ్వాలమ్మా" అంటూ హనుమంతరావు జేబులు తడుముకున్నాడు.

"నే నిచ్చేస్తాను నాన్నా" అంటూ సుధ చేతినున్న పర్సు తీసింది.

"ఆ అయ్యగారిచ్చేశారమ్మా!" అంటూ రిక్షావాడు ముందు నడిచేడు.

"ఆయన ఇవ్వడం ఎందుకూ?" అని సుధ నొచ్చుకుంది,

"అయ్యగారెవరు?" – అంటూ హనుమంతరావు ఆశ్చర్యం కనబరిచేడు. అదో పెద్ద విషయం కాదన్నట్లు తేలికగా తోసిపుచ్చింది సుధ.

"స్టేషనులో కామేశ్వరరావు కనిపిస్తే రిక్షా మాట్లాడి పెట్టమన్నాను. బహుశా ఆయనేఇచ్చి వుంటారు" అంది.

"అత నివ్వడమేమిటి, అప్రతిష్ట" అంది తల్లి.

"అప్రతిష్ట కేముందిలే..." అని సర్దబోతున్న కూతురు మాటకు అడ్డం వచ్చి, హనుమంతరావు, "కామేశ్వరావు ఎవరేమిటి?" అని జ్ఞాపకం చేసుకొనేందుకు ప్రయత్నించేడు.

"నేనేనండీ మామయ్యగారూ!" అంటూ కామేశ్వరరావు గుమ్మంలో సైకిలు దిగేడు.

మగవాళ్ళని మామయ్యలనడం, ఆడవాళ్ళని అక్కలనడం కృష్ణాజిల్లా సంప్రదాయం. పైగా నాలుగైదేళ్ళ పూర్వం వరకూ రెండు కుటుంబాలూ కొంత కాలం ఇరుగుపొరుగునవున్న పరిచయం. కాని, హనుమంతరావు చటుక్కున గుర్తు పట్టలేకపోయాడు.

"హాయి, నువ్వటయ్యా!" అని రాఘవమ్మ అతనిని ఆహ్వానించి మగనికి జ్ఞాపకం చేసింది.

"సుబ్బారాయుడు గారి కామేశ్వరరావండీ" అంది.

హనుమంతరావుకు గుర్తువచ్చింది. నొచ్చుకొన్నాడు. ఔనుసుమా! చీకటి చాటున గుర్తుపట్టలేక పోయేను. ఏమిటింతటి రాత్రివేళ? స్టేషనులోకనిపించేవుట. అమ్మాయిచెప్పింది. రా కూర్చో" అని చాప చూపాడు.



BRAOU

"ఈ వేళకిక చదువు ఆపి పడుకోండి రమా!" అంటూ సెలవిచ్చేసేడు.

అసలే ఇరుకుగా ఉన్న యింట్లో తాను కూడా కూర్చోడం మరింత ఇబ్బంది కలిగిస్తుందని కామేశ్వర రావు సందేహించేడు.

"అక్కర్లేదండీ, వెళ్ళాలి. సాయంకాలం వచ్చేను. మీరు కనిపించలేదు. అత్తయ్యగారితో చెప్పేనను కోండి. ఓమారు మీతోకూడా చెప్పి వెడదామనుకుంటూనే ..."

మాటల మధ్య రాఘవమ్మ అందుకొంది :

"మీతో చెప్పడం మరిచేను ... దాని కోసం పనిమాలా నువ్వు రావాలటయ్యా? పని తీరింతర్వాత చెప్పేదాన్నే ... బాగుంది నా తెలివి! ఇందాకా వచ్చేడండీ. మీరింకా బజారునుంచి రాలేదు. కుముదకి పెళ్ళిట! మీతో చెప్పడానికి మళ్ళీ వస్తానంటూ వెళ్ళేడు" అంది.

కామేశ్వరరావు తాను సుధను ఎలా కలుసుకొన్నదీ సంజాయిషీ యిచ్చుకొంటున్నట్లు చెప్పేడు.

"మా స్నేహితులొకాయన 'మెయిలులో' వస్తున్నాను. స్టేషనులో కలుసుకోమని టెలిగ్రాం యిచ్చేరు. వెళ్ళేటప్పటికి సుధగారు కనిపించేరు..."

"సుధని ఎరగనివాడిలా 'గారు' అని ఆ మన్నింపులేమిటయ్యా" అని రాఘవమ్మ అతనిని దిద్దింది.

"ఇందాకటినుంచి అప్పుడే ఓ అరడజను మార్లన్నా చెప్పేనమ్మా" అంటూ సుధ తల్లితో ఫిర్యాదు చేసింది. కామేశ్వరరావు నవ్వేడు. "అయ్యబాబోయ్! చిన్నప్పటి సుధటండీ? ఆమెగారిప్పుడు కాలేజీలో లెక్చరరు..." అన్నాడు.

"అయితే మాత్రం? ఆవిడగారి వద్ద నువ్వు చదువుకోడం లేదుగదా" అని రాఘవమ్మ హాస్యమాడింది.

కామేశ్వరరావు కూర్చునేవరకూ హనుమంతరావు వదలలేదు.

"గుమ్మంలోకి వచ్చి కూర్చోమన్నా కూర్చోకుండా వెడతానంటే ఎల్లాగయ్యా! రా." అన్నాడు. తప్పిందికాదు. పాంటు మోకాలిమీద బిగుసట్టకుండా సర్దుకొని కూర్చుంటూంటే చూసి, హనుమంతరావు నొచ్చుకున్నాడు. "మీ యింట్లో మాదిరిగా కుర్చీలూ, సోఫాలూ వెయ్యలేము కదా" అన్నాడు.

కామేశ్వరరావు "బాగుందండోయ్! కూర్చోడానికి కుర్చీలే కావాలేమిటి?" అన్నాడు.

"పోనీ, మంచినీళ్ళేనా కావాలా?" అంది సుధ.

"తెప్పించి పెట్టండి."

ఆ 'అండి' కి సుధ చుర్రుమనేలా చూసింది. 'చిత్తం' అంది వెక్కిరింతగా.

కామేశ్వరరావు, అతనితో పాటు రాఘవమ్మా సుధ వెక్కిరింతకు నవ్వేరు.

"నువ్వెళ్ళు. నేనిస్తాను. నీళ్ళు తోడివున్నాయి. పోసుకొని బట్టలు మార్చుకో," అంటూ తల్లి కార్యక్రమం వివరిస్తూంటే తాను వచ్చేలోపున కామేశ్వరరావు వెళ్ళిపోతాడేమోనని సుధ అదుర్దా కనబరచింది.

"నేను వచ్చేవరకూ వెళ్ళబోకండి."

"చిత్తం." అని, ఆమెవెక్కిరింతను ఆమెకేవప్పచెప్పేడు కామేశ్వరరావు. సుధ నవ్వుకుని వెళ్ళిపోయింది.

హనుమంతరావూ, భార్యా అతనిని కబుర్లలో పెట్టేరు. ఆతని చెల్లెలి పెళ్లి విషయాలు, పెళ్ళికొడుకు యోగ్యతలు, ఇస్తున్న కట్నాలు, కానుకలు అనేకం మాటలలో దొర్లిపోయాయి. హఠాత్తుగా హనుమంతరావు తన ధోరణిలో "నువ్వేమాత్రంలో వున్నావయ్యా." అని అడిగి తన ప్రశ్నకు తానే నవ్వేడు. కామేశ్వరరావు సిగ్గుపడ్డాడు.

అప్పుడే స్నానంచేసి బట్టలు మార్చుకొని గదిలోకి వచ్చిన సుధను చూడగానే కొంటె తనం పొటమరించింది.

"ఏమోనండీ, మన కిచ్చేవాళ్ళు కనబడ్డం లేదండీ." అన్నాడు. సుధ నవ్వుకుంటూ లోపలికి వచ్చింది.

"నీ మాటలూ నువ్వూనూ..." అంటూ రాఘవమ్మ కోపపడి తనకు తెలిసిన రహస్యాన్ని బయట పెట్టింది.

"మాకు తెలియదనుకోకు. మొన్న బట్టల కొట్టులో మీ అమ్మ కనిపించేరు. అన్నీ చెప్పిందావిడ. ఎవరో మంత్రిగారి తాలూకు బంధువులు పిల్లనిస్తామంటున్నారుట. లక్షరూపాయల దాకా కట్నం ఇస్తామన్నారటకదా..."

కామేశ్వరరావు అంత నమ్మకమైన సాక్ష్యాన్ని కాదనలేక పోయేడు. "ఇటీవల అటువంటి మాటేదో వచ్చిందండి. కాని, నా కప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదండి, జీవితంలో స్థిరపడాలి. అప్పుడూ పెళ్ళి. అంతేగాని...."

"అప్పుడే అంటే వయస్సు రాలేదనా" అన్నాడు హనుమంతరావు.

"స్థిరపడడమంటే ? ఉద్యోగం చేసుకొంటున్నావు. మంత్రిగారి అల్లుడినయితే ఆయనే వేయిస్తారు పెద్ద ఉద్యోగం...." అంటూ రాఘవమ్మ అతనికి కలుగనున్న అభివృద్ధికి మెప్పు తెలిపింది.

"దాని అర్థం తెలియడం లేదుటమ్మా! ఏదో పెద్దెత్తులోనే వున్నారన్నమాట." అంది సుధ నవ్వుతూ.

కామేశ్వరరావుకూడా నవ్వేడేగాని ఆ ఆరోపణకు సమాధానం ఇవ్వలేదు. కూతురు మాటకు హనుమంతరావూ, రాఘవమ్మాకూడ నవ్వేరు. హనుమంతరావు ఆలోచనలు మరో అడుగు ముందుకు వేసేయి.

"ఎక్కడేనా ప్రేమలోగాని పడలేదుగదా. నీమాటల ధోరణి చూస్తే అల్లావుందిలే" అన్నాడు. తన ఆలోచనలకు తానే వ్యాఖ్యానం ప్రారంభించేడు.

"ఇప్పటికాలపు కుర్రాళ్ళకి ఇదో వెర్రి. కాలేజీల్లోనో, ఆఫీసుల్లోనో ఎర్రగా, బుర్రగా వున్న పిల్ల ఒకర్తి కనబడుతుంది. 'నజానే భోక్తారం కమిహసముపస్థాస్యతి విధిః' అనుకొంటూ దుష్యంతుడులా నిట్టూరుస్తారు. అది మనమే ఎందుక్కాకూడదనుకొంటారు. ఓ కులం అని లేదు. ఓ గోత్రం అని లేదు. పెద్దవాళ్లని అడగడం, పెట్టడం వుండదు. వాళ్ల మాట ఖాతరుచేయరు. ఏమన్నా అంటే మేము 'లవ్' చేశామంటారు. నువ్వుమాత్రం అల్లాంటి వెర్రి మొర్రిపనుల్లోకి దిగకుమ..."

ఆ ధోరణికి కామేశ్వరరావు తెల్లబోయేడు. "ప్రసంగం ఈ దారి తొక్కిందేమి" టన్నట్లు సుధవంక చూసేడు. ఆమె చిరునవ్వుతో తనవంకే చూస్తూంది. ఆమెకీమాదిరి ప్రసంగాలు పరిపాటేకాబోలు. ఏమనడానికీ తోచలేదు. కంగారుగా "అటువంటి దేమీ లేదండి" అనేసేడు.

హనుమంతరావు సంతృప్తిపడ్డాడు.

"ఉండదులే, నాకు తెలుసును. చిన్నప్పటినుంచీ నువ్వు బుద్ధిమంతుడివే..." అన్నాడు.

సుధ ఫక్కున నవ్వింది.

"బుద్ధిమంతులయినవాళ్ళకే ప్రేమలనీ, అదర్శాలనీ వుంటాయి నాన్నగారూ!" అంది.

కామేశ్వరరావు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని గమనించి రాఘవమ్మ భర్తను కసిరింది.

"మీరూ మీ మాటలూనూ! పుట్టని బిడ్డలకి పేర్లు పెట్టడంలో మీ అంతవాళ్లులేరు" అంది.

"పెద్దలుగనక వారికి తోచింది చెప్పేరు. తప్పేముందిలెండి" అన్నాడు కామేశ్వరరావు సర్దుబాటుగా.

దాని నాసరాగా తీసుకుని హనుమంతరావు తన మాటను సమర్థించుకొంటూ అటువంటి ప్రేమలవలన తల్లిదండ్రులకు కలుగుతున్న మనస్తాపాన్ని వివరించేడు.

"వీళ్ళకేం తెలుస్తుంది? ఇంతప్పటినుంచి ఎన్ని ఆశలు పెట్టుకొని పెంచుకొస్తున్నాం! వీళ్ల

BRAOU

వరికి తమ బాధ్యతలన్నీ వదిలేసి వెళ్ళిపోవలసిందేనా? సుబ్బారాయుడుబావ మీకోసం ఎంత కష్టపడ్డాడు! ఎక్కడికేదరి? ఆయనను కాదని నువ్వు ఏమీ చేయకేం."

కామేశ్వరరావు "చిత్తం, చిత్తం" అంటూ నెమ్మదిగా సెలవుతీసుకొన్నాడు.

• • •

అన్నం వడ్డిస్తూ రాఘవమ్మ కుశలప్రశ్నలు సాగించింది.

"పొద్దుపోయింది. దార్లో ఏమన్నాతిన్నావా ? నక్కలా మాడుతూనే వచ్చావా ?"

"రైలులో అంత్తమంది జనంమధ్య ఏమన్నా తినాలంటే నాకు గొంతుదిగదమ్మా" అంది సుధ.

"ఊరు కదలక్కర్లేనివాళ్లకంటే అల్లాంటివన్నీ సాగుతాయి. జన్మానికల్లా శివరాత్రి అని వాళ్ల ఇబ్బందులు ఓ పూటవో, రోజువో, కాని వారానికోమాటు రైలెక్కవలసినవాళ్ల ప్రయాణంలో తిండి సయించదంటే ఎల్లాగ? రోజల్లా మాడి, అలిసిపోయి, తలనొప్పి, వికారం అని పడకెయ్యడం బాగుంటుందేం?" అంటూ రాఘవమ్మ అవసరాన్ని బట్టి జీవిత పద్ధతులు మార్చుకోవలసిన ఆవశ్యకత చూపింది.

అప్పుడే లోపలికి వస్తూన్న హనుమంతరావు భార్య మాటలు ప్రత్యాఖ్యాసం చేశాడు.

"నానాజాతులవాళ్లూ తయారుచేసిన ఆ దిక్కుమాలిన తిండి తినేకంటే ఓ పూట డొక్క మాడితే మంచిదే లెద్దూ. అజీర్ణం, అనారోగ్యమన్నా తగ్గుతాయి" అన్నాడు.

"అదేమిటి లెండి, హాస్టళ్ళూ, హోటళ్లల్లో వండేదీ, వడ్డించేదీ అంతా బ్రాహ్మలేనా ఏమిటి ? ఆ విధినిషేధాలు పెట్టుకొంటే ఒక్క పూట గడవదు" అంది సుధ.

"బాగా చెప్పేవు" అంది రాఘవమ్మ. కూతురును సమర్థిస్తూ. "ఆమాట కొస్తే ఆచారం, మడీ, దడీ వుంటేగాని శుభ్రత సాధ్యం కాదనుకోడం తప్పనిపిస్తుంది సుమా. మావూళ్లో వెంకమ్మ గారంటూ వుండేది. మనిషికి వెర్రి ఆచారం. ఎప్పుడూ నీళ్ళచెంబులో, తడిగుడ్డలతోనే వుండేది. చేతులూ కాళ్లూ పాసిపోయి! రామరామ ! ఓమారు సత్యనారాయణ ప్రసాదం చేతిలో వేస్తే నోట్లో పెట్టాలనిపించలేదు. కళ్ళకద్దుకొని ఆమె అటు తిరగ్గా చూసి, అవతలపారేవాను" అంది.

ఆ ఆకారాన్నీ, అసహ్యతనూ తలుచుకొని ఒళ్లు జలదరించినట్టు సుధ భుజాలు కుదుపుకుంది.

ప్రసంగం ఆ దారిన పడడం ఇష్టంలేక హనుమంతరావు మాట మార్చేడు.

"దానికేంలే! వర్ణసంకరం అనూచానంగా వస్తున్న ఆచారం మీవూళ్ళో, .... 'యవనీ నవనీతకోమలాంగీ' అన్న మహాపండితుడు పుట్టిన వూరు. సంప్రదాయాలు ఎక్కడికి పోతాయి?" అంటూ రాఘవమ్మ పుట్టిన వూరునూ, కన్నవారి సంప్రదాయాలనూ నిందించేడు. రాఘవమ్మ కోపం తెచ్చుకోలేదు. ఆమె కామాట వినడం అలవాటే. నవ్వేసింది. హనుమంతరావు సర్దుకున్నాడు.

"వాటన్నింటికేంలే? ఎప్పుడూ వుండేవే, వదిలెయ్యి, ఇంతలో ఇప్పుడింత హఠాత్తుగా వచ్చేవు. ఏమిటి విశేషం?" అని, అంతవరకూ వెనకబెట్టిన ప్రశ్నను ముందుకు తెచ్చేడు.

"కుముద పెళ్లికి వచ్చేను. ఈ రెండేళ్ళనుంచీ ఒకేచోట కలిసి వున్నామేమో తప్పించుకోడానికి వీలులేకపోయింది." అంది సుధ.

ఆమె చేసిన పనిని తల్లిదండ్రులిద్దరూ అభినందించలేక పోయేరు. అయితే ఎవరి కారణాలు వారివి.

"ఎంత స్నేహితురాలయితేమాత్రం? పెళ్లికాని పిల్లవు; ఊళ్ళ వెంబడి, స్నేహితురాళ్ళ పెళ్ళికంటూ బయలుదేరడం ఏమంత మర్యాదగా వుంటుం"దని రాఘవమ్మ అభ్యంతరం.

సుధ నవ్వింది. "నాకు పెళ్ళి కాకపోవడం నా స్నేహితురాళ్ళ తప్పా ఏమిటమ్మా ! వాళ్ళ పెళ్ళికీ, నాకు కాకపోవడానికీ సంబంధం ఏమిటి? మరి బాగుందికదూ !" అంటూ తల్లి తెచ్చిన మార్యద ప్రసక్తిని పక్కదార్లకు పట్టించింది.

BRAOU

తండ్రి అభ్యంతరం వేరు. "కులం కాదు, బంధుత్వంకాదు, సాటివాళ్ళైనా కారు" అన్నాడాయన. సుధ ఆ అభ్యంతరాలను లెక్కచేయలేదు. కాని, చర్చకు దిగకుండా వూరుకుంది.

తల్లి మరో వైపునుంచి మరో అభ్యంతరం తెల్పింది. "స్నేహితురాలి పెళ్ళి అంటూ చేతులూపు కుంటున్నావు. ఆవల పెద్దయింటి వాళ్ళ పెళ్ళి; డెబ్బయి వేలు కట్నం ఇచ్చి చేస్తున్నది. నలుగురూ పెద్ద బహుమతులు చదివిస్తూంటే మనం వూరుకోవడం బాగుండదు. సిగ్గుచేటు! అంతకన్న వెళ్ళకపోవడం మేలు" అంది. హనుమంతరావు ఆమెను బలపరిచేడు.

"బహుమతులూ, రానుపోను ఖర్చులూ తడిసి మోపెడవుతాయి! మనం వున్న దశలో నూరు – నూట ఏబయి రూపాయల ఖర్చు మాటలంటావా?"

"వాళ్ళు ఇచ్చే కట్నాలనిబట్టి మన బహుమతులుండాలంటే ఇంక స్నేహాలూ, బంధుత్వాలూ కూడా పక్కకు తీసెయ్య వలసిందే–" అని సుధ ఇద్దరి అభ్యంతరాలనూ నిరాకరించింది.

రాఘవమ్మ ఆ అవకాశాన్ని వినియోగించుకుంది.

"బంధువుల యిళ్ళకి–ఆఖరుకి మేనమామ యింటిక్కూడా–పెళ్ళిళ్లకు వెళ్లనిదానివి" అని నెపం పెట్టింది.

"వీళ్లు స్నేహితులమ్మా!" అని సుధ కనుబొమ్మ లెత్తింది.

"స్నేహితులపాటి చెయ్యరా బంధువులు?" అంది తన అభ్యంతరాన్ని సాగిస్తూ.

"నేను పుట్టి బుద్ధి ఎరిగిన తరువాత మామయ్యగారింటికి ఎప్పుడన్నా వెళ్లేనుటమ్మా!"

రాఘవమ్మ కొకడే అన్న. కాని ఆ కుటుంబాల మధ్య రాకపోకలు ఇంచుమించు లేవు. మొదటినుంచీ రెండు కుటుంబాలవారూ సన్నిహితం కాలేదు. పైగా ఇద్దరూ చిన్న చిన్న వుద్యోగాలు చేసుకుంటూ, చెరో పట్టణంలో వుండడంచేత ఏళ్ళతరబడి ఒకరినొకరు కలుసుకోవడం జరగనేలేదు. ఇద్దరూ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించలేని బద్ధకస్తులు. ఫలితంగా ఈ వేళ ఆ అన్న చెల్లెళ్ళ పిల్లలు ఎదురుపడ్డా, పైవాళ్ళెవరన్నా పరిచయం చేయవలసిందే. ఒకరినొకరు గుర్తుపట్టే స్థితికూడా లేదు.

"ఔనుగాని, ఒక్కటడుగుతాను. నీకు ఆయన అన్నగారు కావచ్చు. నాన్నగారికీ బంధుత్వం వుండొచ్చు కాని, నాకు సంబంధించినంతవరకూ కుముదకన్న మామయ్య కూతురు దగ్గరవుతుందంటే ఎల్లాగమ్మా!" అన్న కూతురి ప్రశ్నకు ఆ దంపతుల వద్ద సమాధానం లేదు.

పుట్టినవూళ్ళోనే జీవిస్తూవుండివుంటే ఆ బంధుత్వాలు సాగేవి. వుద్యోగాలతో వూళ్లు వదిలేరు. అక్కడికి తిరిగివెళ్ళవలసిన అవసరం కూడా కలగలేదు. భూములు మాట అటుండగా, కడకు ఓ ఇల్లుకూడా లేదు. బంధుత్వం వుంది. ఒక్కరేనా ఖర్చులుపెట్టుకు వెళ్ళి చూసి రాలేదు. ఓ చీర పెడితే రెండునెలలపాటు కూరలు కొనుక్కోవటం మానుకోవాలి. చివరకు ఓ ఉత్తరంముక్క వ్రాయడం కూడా అనవసరపు శ్రమా, వ్యయమూగా పరిగణకు వచ్చింది, ఉభయత్రా.

రెండోవేపున కుముదతో చిన్ననాటినుంచీ స్నేహం వుంది. రాకపోకలున్నాయి. సహపాఠకులు, ఇప్పుడు సహోద్యోగులు, ఒకే ఇంట్లో వుంటున్నారు. హోటలు కారియరుతిండికి ఆ పదం చెల్లుననే టట్లయితే వారిది ఏకభాండాశనం అనవచ్చుకూడా.

ఈ పరిస్థితులలో ఎప్పుడూ చూసేనావుండని మామయ్యకూతురు, కుముదకన్న దగ్గిరదంటేనూ, ఆమె పెళ్ళికి వెళ్ళినదానివి కుముదపెళ్ళికి వెళ్ళడమేమిటంటేనూ సుధను సమాధానంపరచడం ఎల్లాగ? ఒప్పించడం ఎల్లాగ?

* * *

మర్నాడు సూర్యోదయం వేళకల్లా టాక్సీ తీసుకొని కామేశ్వరరావు గుమ్మంలో హాజరయ్యాడు.

"నిన్న రాత్రి బండిలో మీరు వచ్చినట్లు మా పెద్దనాన్నగారు చెల్లాయికి చెప్పేరు. రావడం సరాసరి అక్కడికే రాలేదని చిర్రు బుర్రుమందిట. నే వెళ్ళేసరికి నన్ను పట్టుకుంది. మీరు ఆలస్యం చేస్తే తానే వస్తానంది. వెంటనే తీసుకువస్తానని వాగ్దానంచేసి వచ్చేను" అంటూ తొందరచేసేడు.



BRAOU

స్నేహం, బంధుత్వం విషయంలో సుధ అభిప్రాయాల్ని రాఘవమ్మ మనస్సులోనే తిరగవేసుకోక తప్ప లేదు. అన్నకూతురు పెళ్ళికి తానొక్కర్తే వెళ్ళింది. అన్నగారూ, వదినగారూ మాత్రం "ఓమారు పిల్లల్ని కూడా తీసురాకపోయావూ" అన్నారు. అంతే, ఇంక పెళ్ళికూతురుగాని, అన్నగారి యితర సంతానంగాని, ఆమాటే ఆడగలేదు. తన బిడ్డలు వాళ్ళకెరికలేదు. కాని, కుముద అన్నగారిని టాక్సీ యిచ్చి తరిమింది ... ఏమీ అనలేక పోయింది ఈమారు రాఘవమ్మ.

సుధ అతని రాకకు సంతోషం కనబరుస్తూనే నొచ్చుకుంది.

"మా తమ్ముడు సత్యం లేడు. లేకపోతే వాడిని తీసుకొని పొద్దుపొడవకుండానే వచ్చేదానిని. కూర్చోండి, బయలుదేరుదాం" – అంటూ సుధ స్నానానికి బయలుదేరింది.

రాఘవమ్మ కూతుర్ని దొడ్డివాకిట్లోకి వెంటాడింది.

"ఎప్పుడో తెల్లవారగట్ల జరిగే పెళ్ళి కిప్పటినుంచి వెళ్ళవలసిందేనా?" అంది. సుధ నెమ్మదిగానే చెప్పింది.

"మామయ్యకూతురు పెళ్ళికి పదిహేను రోజులు నుంచే వెడతానంటే నువ్వుకాదని వుండేదానివా?" అంది గడుసుతనంగా.

"మామయ్యగారిల్లా ఇది! మామయ్యగారూ అని పిలుస్తే మాత్రం సుబ్బారాయుడుగారు రక్తబంధువు అవుతారా? రంగనాయకమ్మ అత్తయ్య అవుతుందా!"

"రక్తబంధువు కాకపోవచ్చు. ఆయన విషయంలో మామయ్య అనే పిలుపు కేవలం మర్యాదకి మాత్రమే కావచ్చు. కాని, వాళ్ళింట్లో మామయ్యగారింట్లో లేని చనువు నాకుంది. మామయ్యగారి కుటుంబంకన్న వీరి కుటుంబమే నాకు బాగా దగ్గిరదికాదుటమ్మా!" అంది సుధ.

అసలు మాటను దాచి అన్యాపదేశంగా తన మనస్సులోని మాటను చెప్పవలసిరావడం సుధకు ఇబ్బందిగానే వుంది. కాని, ఏమీ చేయలేని స్థితి. కామేశ్వరరావుతో తనకు ఏర్పడుతున్న సాన్నిహిత్యాన్ని ఇంకా బయటపెట్టగల స్థితికాదు. దూరంగా వుండగల పరిస్థితీ కాదు. కనుక ఈ దొంగతనం సాగించక తప్పడం లేదు.

రాఘవమ్మ తన మనస్సులోని సందేహాన్ని బయటపెట్టలేకుండా వుంది. సుబ్బారాయుడుగారింట్లో సుధకుగల చనువూ, కుముదతో ఆమెకు గల స్నేహమూ ఆమె ఎరుగును. కాని, ఆమెను కుముద పెళ్ళికి వెళ్ళమనలేకుండా వుంది, సమవయస్కురాలికి పెళ్ళి అయి వెళ్ళిపోతూంటే, సుధ పెళ్ళికాకుండా ఆ పందిట్లో తిరగడం! నలుగురూ వేలుపెట్టి చూపుతారనే భయం ఒకటి. కాని, అన్నింటికన్నా హెచ్చుగా ఆమెకు ఇబ్బంది కలిగిస్తున్నది కామేశ్వరరావు రాకపోకలు. అతడు యోగ్యుడని ఎరుగును. కాని, వయస్సు. వారిద్దరి ప్రవర్తనలో అనౌచిత్యం, వెకిలితనం, అతిపరిచయంవంటివేమీ కనబడలేదు. అనుమానానికి కారణం లేదు. కాని ... మనస్సు అనుమానిస్తూంది ... అయినా పైకి అనలేదు. లేనిపోని ఆలోచనలు తానుగా కలిగించినట్లవుతుందేమో!

అసలు విషయాన్ని గ్రహించింది సుధ. కాని, ఎరగనట్లే నటించింది.

"నీసందేహం నాకు తెలుసు. వారింట్లో నేను భోజనంచేస్తానని నలుగురికీ తెలుస్తుందని నీ బాధ" అంది.

కూతురు చూపించిన కారణాన్ని స్వాయత్తం చేసుకోడానికి రాఘవమ్మ తొందర చూపింది. "రేపటి నుంచే సుబ్బమ్మగారు ఇల్లు ఖాళీచేయమని కూర్చుంటే చచ్చిపోతాం. రాక్షసి! ..."

సుబ్బమ్మ ఆ యింటి యజమానురాలు. ఆమెకు ఉద్యోగం చేసుకుంటున్న సుధ అంటే అభిమానమే. కాని చాదస్తురాలు ఆ లక్షణాన్ని రాఘవమ్మ ఉపయోగించుకొనేటందుకు ప్రయత్నించింది.

కాని సుధ ఆ భయాన్ని నిరాకరించింది – "నేనూ, కుముదా కలిసి కేరియరు తెప్పించుకుంటున్నా మని అర్థంకాదు. ఇంక ఈ పేటలో వాళ్ళంటావూ! పోదూ ..." అంటూ స్నానానికి వెళ్ళిపోయింది.

తిరిగివచ్చే సరికికూడా తల్లి అదేచోట, అలాగే నిలబడి ఉండడంచూసి, కష్టమనిపించింది. సర్దిచెప్పాలి.

BRAOU

"అమ్మా! మిమ్మల్ని కాదనడమూ, నొప్పించడమూ నాకేం సరదాకాదు. కాని, మీరు ఆలోచించ వలసింది వుంది. మీ రోజుల్లో మాదిరిగానే బ్రతకాలంటే నాకు సాధ్యమయ్యే పనికాదు. మీ ఆలోచనలకే నా పనులు పరిమితం కావాలంటే నాకు ఒక్క అడుగుపడదు. మన జీవితాలలో, జీవితపద్ధతులలో బోలెడు మార్పు వచ్చింది. ఆ మార్పులకు దారితీసింది మీరు. మేము ఆ మార్పులో పుట్టేం, పెరిగేం. ఇప్పటిదంతా అబద్ధమంటే? మాకిదే సత్యం! మీరు చెప్పేదే అసత్యమూను".

ఆ సత్యాసత్యాల సమస్య రాఘవమ్మకు అర్థంకాలేదు. కాని చర్చల నింక పొడిగించతలచలేదు... "సరే, ఇప్పుడివన్నీ ఎందుకులే. గొడవ. వెళ్ళిరా" ... అంది.

సుధ అందించిన సూట్‌కేసు డిక్కీలో పెట్టించి కామేశ్వరరావు తిరిగి వచ్చేడు. రాఘవమ్మను కూడా తమతో రమ్మన్నాడు.

"మీరు కూడా ఇప్పుడే వస్తే బాగుంటుంది అక్కయ్యగారూ! ఇప్పుడు కాదనుకుంటే, ఎప్పుడు వీలవు తుందో చెప్పండి; టాక్సీ అతడు వస్తాడు".

"టాక్సీ గీక్సీ ఎందుకయ్యా! ఈ ఇల్లు వదిలిరావడం అయ్యేదేనా? మా అందరి బదులూ అమ్మాయి వస్తూనే వుంది. పెళ్ళివేళకి మామయ్య వస్తారులే" అంది.

"అదేమిటండీ, మా అమ్మ మరీ మరీ చెప్పింది కూడాను".

కామేశ్వరరావు నొచ్చుకుంటున్నట్టుగా చిన్న అబద్ధమాడేడేగాని, అంతకన్న ఏమీ అనలేదు.

"వస్తారా?" అని సుధకు ముందు దారి తీశాడు.

## 3

BRAOU

రుక్మిణి రిక్షా సందుమలుపు తిరిగింది. ఎదురుగా దీపాలతో కలకలలాడుతూంది ఇల్లు.

రిక్షా ఆగిన చప్పుడు వినగానే ఇంట్లోంచి తల్లీ, తమ్ముడూ, చెల్లెళ్ళూ బిలబిలమంటూ పరుగెత్తి వచ్చారు.

"వచ్చేవుటే అమ్మా! ఇంకా రావేం అనుకొంటున్నాం. భాస్కరాన్ని సైకిలేసుకొని వెళ్ళిరమ్మంటు న్నారు, ఇప్పుడే నాన్నగారు". అంటూ తల్లి సుందరమ్మ ఎంతో ఆప్యాయంగా తల నిమిరింది. రుక్మిణి తల్లిని ఒత్తుకొని నిలబడి, చిన్న తమ్ముణ్ణీ, చెల్లెలినీ దగ్గరకు తీసుకొంది.

"ఆ, ఎందుకేమిటి? అవసరం! ఇంతకీ భాస్కరం ఏడీ? వెళ్ళేడేమిటి కొంపతీసి" అంటూ అతని కోసం చూసింది.

"ఇంకా లేదు. ఆయన చెప్పేరు. ఇంతలో నీ రిక్షా చప్పుడు వినిపించింది" అంది తల్లి.

"అసలే బండి ఓ అరగంట ఆలస్యం. దానికితోడు సిమెంటు ఫ్యాక్టరీవద్ద మరో అరగంట పడేసి వుంచేడు" అని రుక్మిణి ఆలస్యానికి కారణం చెప్పింది.

"రాత్రిపూట. వయస్సులోవున్న పిల్లవి. ఒంటరి ప్రయాణం. ఆదుర్దా వుండదా?" అంది సుందరమ్మ. రుక్మిణి రిక్షావానికి డబ్బులిచ్చి పంపేసింది.

"భాస్కరం, బెడ్డింగు లోపల పెట్టించరా. ఆ పళ్ళబుట్ట జాగ్రత్తచెయ్యి. నలిగిపోతాయి" అని పురమాయిస్తూ రుక్మిణి లోపలికెళ్ళింది. పళ్ళబుట్ట పేరు వినగానే పిల్లలిద్దరూ అక్క చేతులు విడిపించుకొని పరుగెత్తేరు.

"నాన్నగారు కనబడరేం?" అంటూ అటూ ఇటూ చూసింది తండ్రికోసం, రుక్మిణి గుమ్మంలో ఆగి.

"కచేరీ గదిలో వున్నారు. రామచంద్రరావు మామయ్య వచ్చేరు. మాటాడుకుంటున్నారు".

ఆ మామయ్య ఎవరో రుక్మిణికి చటుక్కున జ్ఞాపకం రాలేదు. తల్లి అన్నదమ్ములలో ఆ పేరుగలవారు లేరు. మేనత్తల భర్తలలోనూ అంతే. తల్లి ముఖంలోకి చూసింది.

"జ్ఞాపకం లేదూ? నాన్నగారూ, ఆయనా అస్తమానం వాదులాడుకుంటుండేవారు. మరచిపోయి వుంటావు. ఈమధ్య పదిపన్నెండేళ్ళనుంచి ఇటు రావడం లేదులే ..." అంటూ తల్లి చెప్తూంటే రుక్మిణి జ్ఞాపకం చేసుకొనేందుకు ప్రయత్నించింది. కాని గుర్తురాలేదు.

"ఔనులే, ఆ రోజుల్లో నువ్వు మామయ్యగారింట ఉండేదానివి. ఓ మాటో, రెండుమాట్లో మనింటికి వచ్చినప్పుడు చూసి ఉంటావు".

"చూసే ఉంటానులే" అంది రుక్మిణి అనుమానిస్తూ.

"మనిషిని చూస్తే గుర్తు వస్తుంది" అంది తల్లి.

అంతలో వారి మాటలు విని "అదిగోనోయి, అమ్మాయి వచ్చినట్లుంది" అంటూ నరసింహమూర్తి హాలులోకి వచ్చేడు.

"ఏమమ్మా! వచ్చేవా? బండి ఆలస్యం అనుకుంటూ, పొడుబళ్ళు, వేళకు నడిచివావవు. ఇప్పుడే భాస్కరాన్ని వెళ్ళిరమ్మంటున్నా ... రామచంద్రరావు మామయ్య గుర్తున్నాడా? నువ్వు వస్తున్నావంటేను, చూసే వెడతానని ఆగేడు ఇంకా రాలేదని, రేపు మళ్ళీ వస్తానులే అంటున్నాడు. ఇంతలో నీమాట వినిపించింది ..." నరసింహమూర్తి వాగ్ధోరణి అవిచ్ఛిన్నంగా సాగిపోతూంది.

రామచంద్రరావు వెడతానంటున్నాడన్న మాట వినబడి సుందరమ్మ 'పనికి' రాదంది.

"ఇప్పుడెక్కడికి వెడతారు భోజనం చెయ్యకుండా?" అని ఆమె అభ్యంతరం.

"ఇంతవరకూ భోజనాలు కానేలేదా?" ... అంటూ రుక్మిణి చేతి గడియారం చూసుకుంది. "పది గంటలు దాటిపోయిందే!"

"పిల్లలంతా తిన్నారు. నువ్వు వచ్చేక ఏకంగానే తింటామని నాన్నగారు మిగిలేరు. ఇంతలో మామయ్యగారు వచ్చేరు" అంది తల్లి. "టిఫిన్ దండిగా పడేశాంలే ఇల్లారా మామయ్యని పలకరించేవా?"

"ఏమిటోయ్ మూర్తీ! కోడల్ని చూపించి పంపించేద్దామనుకుంటున్నావేమో! అదేం కుదరదు. అర్ధరాత్రి వెడితే హొటలులో అన్నం ఎవరెడతాడు? తగ్గ [illegible] నిక్కూడా కతికితే అతకదనే భయం ఉందేమిటి?" అంటో రామచంద్రరావు గొంతుక లోపలి నుంచి వినిపించింది.

ఆ గొంతుకా, ఆ మాటల ధోరణీ విన్నాక ఆ మామయ్య ఎవరో జ్ఞాపకం వచ్చేడు రుక్మిణికి. ఆ మాటలకు నవ్వుతూ "బట్టలు మార్చుకువస్తాన[illegible]రూ!" అంటూ లోపలికి నడిచింది.

"అన్నపూర్ణా! అమ్మాయిగారికి వేడినీళ్ళు తోడపెట్టు", అంటూ సుందరమ్మ అక్కడినుంచే పనిపిల్లకు పురమాయించింది.

"ఇప్పుడు వేణ్ణీళ్లేమిటమ్మా! ఉక్కపోస్తూంటేను!" అంటున్న కూతురు అభ్యంతరాన్ని సుందరమ్మ నిరాకరించింది. "వేడినీళ్ళు వంటిమీద పడితే ప్రయాణం బడలిక తీరుతుంది".

"నమస్కారం, మామయ్యగారూ!" అంటూ గదిలో అడుగుపెట్టిన రుక్మిణిని "దీర్ఘాయుష్మతీ భవ" అని రామచంద్రరావు శాస్త్రోక్తంగా దీవించేడు. అప్రయత్నంగా చేసిన ఆశీర్వాదానికి తానే నవ్వేడు. నరసింహ మూర్తి తల పంకించేడు.

"అచ్చం వైదిక బ్రాహ్మడి లక్షణాలన్నీ వచ్చేసేయి" అన్నాడు.

"వైదీకపాణ్ణే కాదటోయ్" అని మిత్రుని మాటకి జవాబిచ్చి, "రా అమ్మా! రా కూర్చో" అని రుక్మిణిని ఆహ్వానించేడు.

"జ్ఞాపకం ఉన్నానా?"

"చూసేక గుర్తు వచ్చింది".

"మీ నాన్నలా కాకుండా నిజం చెప్పేవు. అంటూ నరసింహమూర్తి మీద ఒక విసురువిసిరి, యోగ క్షేమాలు ప్రశ్నించేడు.

BRAOU

"ప్రయాణం సుఖంగా జరిగిందా? పెద్దదానివయ్యావు! అబ్బో! ఎప్పటి మాట ! నలభయ్యెనిమిది లోనా, అంతకు పూర్వమేనా మూర్తీ, రుక్మిణిని చూసింది? సెకండుఫారమో ఏదో చదువుతుందని గుర్తు. రీసెర్చి చేస్తున్నావటగా ! ఎక్కడ? ఆంధ్రయూనివర్శిటీలో అంతేనా ? మకాం హాస్టలే అనుకుంటా. హాస్టలు తిండి ఎల్లా ఉంటుంది ? అక్కడున్న రెండేళ్ళూ మా విజయ గోలెత్తేసింది. విజయని ఎరుగుదువా? ఇప్పుడు చదువు పూర్తిచేసి పెళ్ళి చేసుకుంది. హాస్టలు దగ్గర్లోనే వాళ్ళ ఇల్లు...."

తనతోను, తండ్రితోనూ కూడ ఎడా పెడా మాట్లాడేస్తున్న మామయ్యకు ఏకాక్షరాలతో సమాధానా లిస్తూ చటుక్కున అడిగింది.

"ఆమె పేరండీ ?"

"విజయలక్ష్మి ఎం.ఏ., చదివింది. పెళ్ళి చేసుకొంది. ఆయనకక్కడ ఎలక్ట్రికల్ షాపు వుంది."

"మనిషిని చూస్తేకాని చెప్పలేను, మాకంటే జజూనియరు, ఇంగ్లీషు ఎం. ఏ. చదివిన విజయ అనే అమ్మాయి ఉండేది. ముఖ పరిచయం మాత్రమే, చూస్తేగాని చెప్పలేను."

"ఏం తెలుస్తుంది ? ఒకటి రెండుమాట్లు నేనూ వచ్చాను. కాని, మా మూర్తికూతురు అక్కడే చదువుతూందని ఎరగనుగా" అన్నాడు రామచంద్రరావు.

"ఎరిగివుండడానికి తమరెప్పుడేనా ఇంటిముఖం చూపిస్తేనా? ఏ కళనున్నావో, ఇప్పుడు తిక్కతిరిగింది" అన్నాడు మూర్తి ఆప్యాయం కనబరుస్తూ.

"ఈ రాజకీయాల్ని మనం హరాయించుకోలేమనుకున్నాం. పనిచేసేవాళ్ళకి మనం అడ్డం ఎందుకు? ఒక్క దండం పెట్టేశాను. ఎక్కడో మారుమూల పదెకరాల కొండ్ర కొనుక్కుని వ్యవసాయం పెట్టేశాను. సంసారం తప్పించుకుని తిరుగుతూ దేశోద్ధరణ చేసినంత కాలమూ వాళ్ళ ముఖం కనబడలేదు. తరువాత ఆ జంజాటంలో పడ్డాక మళ్ళీ ఈ మొహాలు కనబడలేదు. అంతే. ఎక్కడికక్కడే సరిపోతుంది...."

ఇంతలో లోపలినుంచి సుందరమ్మ పిలుపు వినబడింది;

"రుక్కూ! మామయ్యగారినీ, నాన్నగారినీ భోజనానికి లెమ్మనవమ్మా! నువ్వూ వచ్చెయ్యి. ఇప్పటికే పొద్దుపోయింది. అందరికీ ఒకేసారి పెట్టేస్తా."

రుక్మిణి లేచింది. లోపలినుంచి పనిపిల్ల బాల్చీతో నీళ్ళుతెచ్చి వాకిట్లోపెట్టింది.

కాళ్ళు ముఖం కడుక్కుని, తుడుచుకొనేందుకు పనిపిల్ల చేతినుంచి తుండు అందుకొంటున్న నరసింహమూర్తిని చూసి రామచంద్రరావు తల పంకించేడు.

"చెయ్యి తుడుచుకునేందుకు తుండుగుడ్డ అందివ్వవలసిన దర్జా సాగించుకొంటున్నావన్నమాట! అయితే ఆవిడ ఇంకా మహానస మానిసిగానే వుందా, ఏమన్నా హోదా పెరిగిందా ?" అంటూ సుందరమ్మవైపు చూసేడు.

"ఒక్కొక్కరు పెట్టిపుట్టిన వేళావిశేషం అన్నగారూ! ఆయన కాలాగే జరుగుతూంది. అప్పట్లాగే ఇంటెడు చాకిరీచేస్తూ, గానుగెద్దులా నేనల్లాగే వున్నాను" అంటూ సుందరమ్మ నిట్టూర్చి చిరునవ్వు నవ్వింది.

"నీ మెత్తదనమమ్మా!" అంటూ రామచంద్రరావు సానుభూతి తెలిపేడు. నరసింహమూర్తి నవ్వేడు.

"పనిమనిషి వుంది. అన్నంతోసహా ఉడకేసి పడేస్తుంది. పై పనులకో కుర్రాడున్నాడు అయినా ఈవిడ గానుగెద్దులా చాకిరీ చేస్తూందిట! మంగల్నిచూసి ఎద్దు కుంటిందన్నట్లు! ఇంక ఇతగాడు 'నీ మెత్తదనమమ్మా!' అని సానుభూతి, వాహ్!"

ముగ్గురూ ఆ విధంగా వాదులాడుకుంటూ, ఎకసెక్కేలు చేసుకొంటూంటే రుక్మిణి నవ్వింది.

• • •

BRAOU

వడ్డన సాగిస్తూ సుందరమ్మ ప్రశ్నించింది. "మగపిల్లలందరికీ పెళ్ళిళ్ళయ్యాయా? అన్నగారూ !

"ఇంకా లేదమ్మా !"

నరసింహమూర్తి భార్యను హాస్యమాడేడు; "ఏం, పిల్లనిద్దామనా?"

సుందరమ్మ కవ్వించింది; "ఎందుక్కాకూడదు? అంతకంటే మంచిసంబంధం తెస్తారా యేం?"

'సగం నిశ్చయమయినట్టే అన్నాడుట వెనకటికి ఒకడు. అల్లా ఉంది, నీ మాట. ఇవ్వడానికి నువ్వు సిద్ధంగా వున్నావు. కాని..."

"ఏమిటోయ్ ! నన్నెదురుగా పెట్టుకుని మీరు బెడుగుడు ఆడేస్తున్నారు! ఏమిటి వ్యవహారం? అంతా మీమీదా, నామీదా ఉన్నట్లే మాట్లాడుతున్నారు" అంటూ రామచంద్రరావు రుక్మిణివేపు చూసేడు. ఆమె మాట్లాడకుండా భోజనం చేస్తూంది.

మిత్రుని అభిప్రాయం గ్రహించేక నరసింహమూర్తి వేళాకోళం దిశ మార్చేడు.

"ఈయనగారి రెండోకొడుకు అనుకుంటాను-" మాట మధ్యలో రామచంద్రరావు వేపు చూసి- "తురకల అమ్మాయిని పెళ్లిచేసుకొన్నది రెండోవాడా, మూడోవాడోయ్?..." అని ప్రశ్నించేడు.

మతాంతర వివాహంమాట విని రుక్మిణి తల ఎత్తిచూసింది. నిజమేనా అని అడగబోయి, సర్దుకొని "ఆమె పేరేమిటండీ?" అంది.

రామచంద్రరావు చిరునవ్వుతో "రజియా" అన్నాడు.

కూతురు సందేహించిన ప్రశ్నను సుందరమ్మ అడిగేసింది- "నిజమేనటండీ?"

"ముస్లిముల పిల్ల అయితే చేదుమేస్తారటమ్మా!"

రామచంద్రరావు హాస్యానికంటున్నాడో, నిజమేనో సుందరమ్మకు అర్థం కాలేదు. కులాంతర వివాహాలను ఆమె అక్కడక్కడ చూస్తూంది. కాని మతాంతర వివాహం, అందులో ముస్లిములతో ఆమెకెలాగో అనిపిస్తూంది. నమ్మలేకపోతూంది. మళ్లీ అడిగింది.

"నిజమేనా! మీరు ఒప్పుకొన్నారా? మీ భార్య పిల్లనిచ్చేరా?" బోలెడు ప్రశ్నలు.

రామచంద్రరావు ఒక్కనిమిషం ఆలోచించేడు.

"ఇదిగో, సుందరమ్మా! మనం కొన్ని అలవాట్లకు బానిసలం. కొన్ని ఆలోచనలకు బందీలం. కనక మొదట ఎబ్బెట్టుగానే అనిపించింది. కాదనను...."

"అలవాట్లూ కాదు. ఆలోచనలూ కాదు. ఆచారాలనండి, బాగుంటుంది. ఆ అమ్మాయి మన ఇంటికి వచ్చి మనతో కలిసి ఉండగలదా? మనంకూడా మన మతంపిల్లతో కలిసినట్లు, మన కులం పిల్లను చూసినట్లు..." అంటూ సుందరమ్మ అటువంటి వివాహాలలో ఉండే మానసిక పరిధుల్ని వివరించసాగింది. రామచంద్రరావు నవ్వేడు.

"సరిగ్గా మా ఆవిడా అదే ప్రశ్న వేసింది."

సంబంధాలు చేసుకొనేటప్పుడు ఆడవాళ్లంతా వేసే ప్రశ్నే అది. ఆలోచించేదీ అదే" అంది సుందరమ్మ.

"ఆడవాళ్ళందరూ అనకు. ఒక సంస్కారం, ఒక వయస్సు గలవాళ్ళు మాత్రమే అడుగుతారు. మా ఆవిడ అడిగింది. నువ్వడిగేవు. కాని, రజియాకి ఆ ఆలోచన తట్టలేదు. రుక్మిణి నడగండి. ఏం చెప్తుందో..." అంటూ రామచంద్రరావు ఆమెవేపు చూసేడు.

రుక్మిణి చిరునవ్వు నవ్వింది.

BRAOU

"మీరడిగేది మా అమ్మప్రశ్నకు సమాధానమా? నా ఆలోచన ఎలా ఉంటుందనా? దానిని పట్టిగదా సమాధానం?"

రామచంద్రరావు ఆ సమాధానం విని సాదరంగా చూసేడు. "భేషుగ్గా అడిగేవు" అన్నాడు.

"ఆడపిల్ల అయాక అత్తవారింటికి వెళ్లక తీరుతుందా? అత్తవారింటి సమస్య ఆడవాళ్లందరికి ఒకటే కదా" అని సుందరమ్మ ఎదురు ప్రశ్న.

రుక్మిణి సరాసరి తల్లినే అడిగింది.

"పెళ్లి అన్న మాటకే అత్తవారింటికెళ్లడం అంటున్నావా? లేక నిజంగా అత్తవారింటికెళ్ళడమనే ఉద్దేశమా" పెద్ద ధర్మ సందేహం.

కూతుర్ని సుందరమ్మ గదిమింది.

"ఏమిటే ఆ రెండింటికీ తేడా? శాణితనం పోతున్నావు" అంది.

రామచంద్రరావు కాదన్నట్లు తల వూపేడు. "తేడా వుంది. పూర్వం కథ వేరు; ఈనాటి పరిస్థితి వేరు. పూర్వపు ధోరణిలోనే ఆలోచించి మనం మార్పుని అర్థం చేసుకోవడం లేదు. మా మూడో అతని పెళ్లితో ఆ భేదం అర్థం అయింది." అన్నాడు.

సుందరమ్మ అతనివంక వెర్రివాడిని చూసినట్లు చేసింది. పెళ్లి అయ్యాక ఆ దంపతుల్ని ఇంటికి రానిచ్చివుండడనుకొంది. కాని, అది సరికాదని తేలింది.

"మా మూడోకోడలిపేరు రజియా అని చెప్పేను కదూ. ఆమె మావాడిని తానే పెళ్ళి చేసుకుంది. వాడి కోసమే చేసుకుంది. అలాగే వాడూను.నువ్వన్నట్లు పెళ్లయాక ఆమె అత్తవారింటికి రాలేదు. స్వంతయింటికి వెళ్లింది. ఇద్దరూ డాక్టర్లు. వుద్యోగం చేసుకొన్నా, ప్రాక్టీసు పెట్టుకొన్నా ఇద్దరూ స్వంత ఇల్లు ఏర్పరచుకొన్నారు. పెళ్లయాక మా యింటికీ వచ్చేరు. కాని, అది మా ఇల్లు. వాళ్ల యిల్లు కాదు. అర్థం అయిందా?"

రుక్మిణి తల వూపి మెచ్చుకుంది.

"మా మిత్రురాళ్ల మధ్య ఈ విషయం చాలా మాట్లు చర్చకు వచ్చింది. మొత్తం మీద అందరూ కొంచెం ఇంచుమించు ఇదేవూహ వెలిబుచ్చేరు. కాని, ఇంత బాగా చెప్పలేక పోయేం. థాంక్స్..." అంది.

"మీదంతా వితండవాదం..." అని సుందరమ్మ తోసి పుచ్చింది. "చిన్నప్పటి నుంచి మంచొస్తేనూ, చెడొస్తేనూ నానాచాకిరీ చేసిన తల్లీదండ్రీ పెళ్లాం రాంగానే పరాయి వాళ్లయిపోతారూ? ఏంమాటలండీ!" అనేది ఆమె మానసిక క్షోభ.

అదే విషయాన్ని నరసింహమూర్తి మరోవిధంగా ప్రశ్నించేడు. "నువ్వంటే ఓ పదెకరాలు సంపాదించేవు గనక ఎన్నికబుర్లేనా చెప్తావు. కాని, రెక్కలు వచ్చినవాళ్లల్లా కుటుంబాన్ని గురించి పట్టించుకోకుండా ఎగిరిపోతామంటే ముసలాళ్లూ, ముతకాళ్లూ, పిల్లలూ, చదువులూ ఇవన్నీ ఏం కావాలి?

రామచంద్రరావు ఆ దంపతులవంక చూసేడు. రుక్మిణికి ఫిర్యాదు చేశాడు.

"చూసేవుటమ్మా !"

రుక్మిణి తల తిప్పింది.

"సామాజికమయిన సమస్యలకు మీరు 'సెంటిమెంటల్‌ట్విస్టు' ఇస్తున్నారు నాన్న గారూ!" అంది.

కూతురుమాటతో నరసింహమూర్తి వెనక్కి తగ్గేడు. కాని సుందరమ్మ దానినే రాపాడించింది.

"అది మా ఆయన రెక్కలకష్టం" అని వచ్చిన కోడలల్లా సంచి బిగగట్టేస్తే చదువుకోవలసిన పిల్లలుంటారు" అంటూ సుందరమ్మ సంపాదనపరులైన కొడుకులమీద వుండే బాధ్యతల్ని పేర్కొంది.



BRAOU

"నువ్వు చెప్పే బాధ్యతలకీ, అత్తవారింటికి రావడం అన్న దానికి సంబంధం లేదమ్మా!" అని రుక్మిణి తల్లికి సంజాయిషీ చెప్పబోయింది. కాని ఆమె కూతురు మాటలను లెక్కచేయలేదు.

"పోవే, మీరూ, మీ చదువులూనూ! చదివేస్తే వున్నమతీ పోయిందన్నట్లు..." అని ప్రారంభించింది.

రామచంద్రరావు ఆమె వాగ్ధోరణికి అడ్డుపడుతూ ఒక ప్రశ్న వేసేడు.

"ఔనుగాని, ఒక్కటి చెప్పు మీ రుక్మిణిని ఒకయింటికి పెద్దకోడలినిగా ఇస్తావా?"

ఆ ప్రశ్నకు రుక్మిణీ ఏదో చెప్పబోయింది. కాని రామచంద్రరావు వారిస్తే. వూరుకుంది. ఆసంజ్ఞ చూసి, ఆ ప్రశ్నలో ఏదో మెలిక వుందని గ్రహించి సుందరమ్మ ఆగింది. కాని నరసింహమూర్తి ఆమె అడగని ప్రశ్నకు వ్యాగ్రూపం ఇచ్చేడు.

"పెద్దకోడలూ, చిన్నకోడలూ అనే ప్రశ్నేమిటి? ఆ వచ్చే పిల్లాడు వాళ్ల యింటి ఆఖరువాడే కాకూడదూ?"

ఔనంది సుందరమ్మ.

రామచంద్రరావు ధోరణి రుక్మిణికీ అర్థంకాలేదు. అతడు ఒక్క మారు ముగ్గురి ముఖాలూ చూసేడు.

'పెద్ద కోడలికీ, పందిరిరాటకీ రాటు ఎక్కు'వని సామెత. విన్నారా?... లేదు ... కోడలు అత్తారింటికి రావడానికి దానికీ సంబంధం వుంది. ఆ యింటివాళ్ళకి కావలసింది కొడుక్కు భార్య మాత్రమే కాదు. అతనికి భార్యగా వుంటూ, సమిష్టి కుటుంబ బాధ్యతలను మోయడంలో అత్తగారికి ... "సరియైన మాటకోసం ఒక్క నిముషం వెతుక్కొని ఇంగ్లీషు పదంతో పూర్తిచేసేడు ..." అసిస్టెంటుగా వుండే అమ్మాయి కావాలి".

సమిష్టి కుంటుంబ బాధ్యత అనగానే ఇంటెడు చాకిరీలు. పెద్దవాళ్ళ ఆరళ్లు అడుగులకు మడుగు లొత్తడాలు. కొత్త కాపురం, కోడంత్రికం, భర్త పరాధీనత, పిల్లలకు ఆ వస్తువు కావాలన్నా దిక్కులు చూడవలసి రావడం వరసన గుర్తువచ్చి ఈమారు బాధ్యతలను గురించి సుందరమ్మ ఏమీ చెప్పలేకపోయింది.

"ఇంట్లో కూర్చుని, ఏ వ్యవసాయం చేసుకునేవాడికో రుక్మిణిని ఇవ్వడం కుదరదు కదా, చదువుకున్న వాడిని చూస్తాం. ఇద్దరూ ఏవో ఉద్యోగాలు చేసుకు బ్రతుకుతారు ..." అంది.

రామచంద్రరావు నవ్వేడు. పొలమారింది. నెత్తిమీద అరచేత్తో రుద్దుకుంటూ దగ్గిదగ్గి ఉక్కిరిబిక్కిరి అయ్యేడు.

"కొంచెం మంచినీళ్ళు తాగండి. మీ ఆవిడ తలచుకుంటున్నారు కాబోలు" అని సుందరమ్మ సలహా ఇచ్చింది.

సర్దుకొన్నాక రామచంద్రరావు తన నవ్వుకు కారణం చెప్పేడు. "మీ అమ్మాయిమాట వచ్చేసరికి చూసేవూ, మూర్తీ! ఇలా వుంటుంది" అన్నాడు.

విషయం అర్థం అయి ఏమీ చెప్పలేక సుందరమ్మ నవ్వేసింది.

"కాస్సేపు వూరుకోండి బాబూ! భోజనం అయ్యాక వాదించుకోవచ్చు" అంది.

సుందరమ్మ పనులు పూర్తిచేసుకుని వచ్చేసరికి రామచంద్రరావు వెళ్ళిపోయాడు.

"అన్నయ్యగారేరీ? అన్న ప్రశ్నకు నరసింహమూర్తి నవ్వేడు.

"చెల్లాయిగారికి ఆలోచించుకొనేందుకు వ్యవధి యిచ్చి తన బసకు వెళ్ళిపోయేడు. సమాధానం కోసం రేపు పొద్దున్నే వస్తాడు".

"అసలు సంగతి చెప్పక ..." అంటూసుందరమ్మ భర్తను వేగించింది, కాని అతని మాటను విశ్వసించలేక పోయింది.

... 89

"ఆయన ఆ మాట అన్నారా? మీ వూహాలేనా?"

"అవ్వపేరే ముసలమ్మ! దాని అర్థం అంతే. అమ్మాయి వచ్చేవరకూ కూర్చున్నాడు".

"పోండి, మన ఇంట్లో బంధువులకన్నా చనువున్నాయన. మన పిల్ల వూరినుంచి వస్తూందంటే చూడడానికి ఆగుతేనూ, దానితో కబుర్లు చెబితేనూ కథలు అల్లుతారేమిటి?" అని మందలించింది.

నరసింహమూర్తి నవ్వేడు.

"కాదోయ్, అతడికి అమ్మాయి నచ్చింది".

"నచ్చడం నచ్చకపోవడం సమస్యేముంది? రత్నంలాంటి పిల్ల! నచ్చకేం?" అంది తల్లిప్రేమ.

"నీకేమి తెలియదు. నిన్ను సరాసరి అడిగినా అర్థంచేసుకోవు. ఇందాకా స్పష్టంగా 'మీ రుక్మిణిని ఒక ఇంటికి పెద్దకోడలుగా ఇస్తావా? అని అడగలేదూ?"

మగని ఆలోచన నిరాధారమని సుందరమ్మ నవ్వేసింది. "వాదంకోసం అన్నమాటను నిలదీస్తే ఎలాగ" అంది. మూర్తి మరేమీ చెప్పలేక "సరే. ఆ భ్రమలోనే వుండు" అన్నాడు.

"అతడు తన పెద్దకొడుక్కి పెళ్ళికూతురిని వెతుకుతున్నాడు. చదువుకున్న అమ్మాయి కావాలి. ఆరోగ్యవంతురాలు కావాలి. అంతే అతడు చూసేది. తర్వాత పిల్లవాడూ, పెళ్ళికూతురూ సమ్ముఖం అయి సరేననుకొంటే పెళ్ళయిపోతుంది".

"కట్నాలూ, కానుకలూ ..."

"అసలామాట ఆలోచించనక్కర్లేదు. మన ఎరికన ఎవరన్నా గుణవంతురాలయిన అమ్మాయి వుంటే చెప్పమన్నాడు. వుమెన్సు కాలేజీకి వెడుతూనో, వెళ్లి వస్తూనో కనిపిస్తాను, ఆలోచించమన్నాడు".

"వుమన్సు కాలేజీకెళ్లడమేమి"టంటూ రుక్మిణి గదిలో అడుగుపెట్టింది. తాము చర్చిస్తూన్న విషయం చెప్పేడు నరసింహమూర్తి. కాని ఆ మాటల్లో అతనికి తోచిన విశేషార్థం ఆమెకు తట్టలేదు. పైగా అంత విని చప్పరించేసింది.

"ఇంగ్లండు వెళ్ళి కాలేజి డిగ్రీ తెచ్చుకొన్నాడన్నారు".

"యు.ఎస్.ఏ.లో లే" అని మూర్తి కూతురి అభిప్రాయాన్ని సవరించేడు.

"అక్కడే ఉద్యోగంచేస్తూ వదులుకు వచ్చేసేడన్నారు కాబోలు!" అంది సుందరమ్మ.

"సరే, ఏదయితేనేం? ఆయనగారికి పెళ్ళాన్ని తండ్రి వెతికిపెట్టాలా? అసలు అటువంటాయనికి పెళ్ళాం ఎందుకు?" అంది రుక్మిణి.

"అవేం మాటలే!" అంది తల్లి.

"నాలుగైదేళ్లు విదేశాలలో వుండటంచేత ఇక్కడ పరిచయాలు లేవు కనుక మన సహాయం అంతేగాని, నిర్ణయాలు అతనివే" అన్నాడు .... అంటూ మూర్తి సర్దేడు.

"ఇప్పుడాకొడుకు ఏంచేస్తున్నట్టు?" – అని వివరం తెలుసుకోదలచింది సుందరమ్మ.

'వుద్యోగ ప్రయత్నంలో వున్నాడని కాబోలు చెప్పేడు. వివరాలడిగితే మనం ఆసక్తి చూపుతున్నట్లుం అడగలేదు. సాయంకాలం అన్నీ అడిగేను. ఎన్నో చెప్పేడు. ఆ ముగ్గురు కొడుకుల్లో ఎవరు ఈో గుర్తులేదు.

మనుష్యులండీ" అని సుందరమ్మ హాస్యం చేసింది. ఆ వెక్కిరింతకు మూర్తి కంగుతిన్నాడు. ందుకు ఎదురుపట్టించేడు. "ఇన్ని క..గు చెప్తావు, అసలుమాట తేల్చవేం" అన్నాడు.

BRAOU

"ఏం చెప్పమంటారు? ఆయన మాటల్లో మన అమ్మాయిని అడిగినట్లేముంది" అని ఆమె కాపుదల.

"సరే తెలివి! అంతకన్న స్పష్టంగా అడగడం అంటే ఏమిటో. నువ్వు గ్రహించినట్లు తోచకపోతే రేపు స్పష్టంగానే అడుగుతాడు. అప్పుడు ఉక్కిరిబిక్కిరి అవడం కన్న ఒక ఆలోచనకి రావడం మంచిది" అన్నాడు నరసింహమూర్తి.

సుందరమ్మ కూతురి ముఖం వంక చూసింది. కాని, ఆమె ఆ సూచనకంత ప్రాముఖ్యం ఇవ్వలేదు.

"అడగవలసిన మనిషి వచ్చి నన్నే అడిగితే ఏం చెప్తానో మరి ..." అంది చిరునవ్వుతో.

ఆమాటను నరసింహమూర్తి ఒక విధంగా అర్థంచేసుకొన్నాడు. "దానిమాట తరవాత చూద్దాం. ముందా మాట వస్తే ఏం చెప్పాలో తేల్చు" అన్నాడు.

"ఆ, ఏమీ లేదు. అంతా మీ కల్పనగాని! వాళ్ళు బ్రాహ్మలు. వాళ్ళవాళ్ళల్లోనే బోలెడందరు పిల్లలున్నారు".

నరసింహమూర్తి ఆమె మాటలను అంగీకరించలేకపోయేడు.

"అతనికా భేదాలూ, పట్టింపులూ వచ్చేవుంటాయనుకొన్నాను. రాజకీయాల్లోకి వచ్చి వెనక్కి పోయిన వాళ్ళు సాధారణంగా తమ ఐహికసత్తల్ని కప్పుకునేటందుకు పూర్వాచారాలమీద విశేష శ్రద్ధ చూపిస్తారు. కాని, రామచంద్రరావు ఆలోచనల్లో మార్పులేదు. ఉన్నదేమన్నా వుంటే మరింత బిగిసేడు. మూడోకొడుకు ముస్లిముల అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం మీద మాట్లాడేడు వినలేదూ, ఏమన్నాడో ...."

సుందరమ్మ ఈ మారు స్పష్టంగానే బయటపడింది.

"ఆయనకు లేదుగదా అని మనకూ లేకపోవాలా. నాకదేం నచ్చదు సుమండీ. మన వాళ్ళల్లో మనుష్యులే లేనట్లు ఇతర కులాలలోకి వెళ్ళాలేమిటి? ... ఏమే రుక్కూ ...."

రుక్మిణి ఆ ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగాలేదు. కాలేజీలో అడుగుపెట్టిన ఈ ఏడెనిమిదేళ్ళలోనూ బాగున్నాడనిపించిన వాళ్ళూ, స్నేహం చేసినవాళ్ళూ, పెళ్ళి ఆలోచన కలిగించిన వాళ్ళూ చాలామందే వున్నారు. వారితో పరిచయాలు కులం తెలిసి ప్రారంభం కాలేదు. కులం మాట ఎరిగి ముగియలేదు. ఆలోచిస్తే కొందరి కులాలేమిటో ఆమె ఎరగనే ఎరగదు. ఆమె తనకాపట్టింపు లేదనుకుంటూంది. కాని, పైకేమీ అనలేదు. తండ్రి అభిప్రాయం కూడా తెలుసుకోదలచింది.

"చెప్పేగా! సమస్య నాదాకా రాలేదు. మీ దాకా వచ్చింది ఆలోచించండి" అంది.

ఈమారు సుందరమ్మ మగడిని నిలేసింది. అతడు నాన్చడం ఆమెకు నచ్చలేదు. నరసింహమూర్తి నసిగేడు.

"ఆపాటి ఈనాటి చదువుకున్నవాళ్ళకి మనవాళ్ళలో లక్షల మీదుంది ఆశ".

"డబ్బుకోసం కులం చెడతామా? అడగనక్కర్లేకుండా మనమే ఏదో ఇవ్వాలనుకుంటున్నాంకదా",

"మనం ఇవ్వడానికి సిద్ధంగా ఉండడం వేరూ, వాళ్ళే అడగడం వేరూను! మనం ఇస్తే పిల్లకిస్తాం. వాళ్ళు అడిగేది పిల్లవానికి ...." అన్నాడు నరసింహమూర్తి.

రుక్మిణికి ఆ సమాచారం కొత్త. ఆ బేరగాళ్ళెవరో ననుకొంది.

"ఎవరేమిటి వారు?"

కూతురు స్వభావం తెలిసిన తల్లిదండ్రులిద్దరూ ప్రపంచ స్వభావం చెప్పేముగాని, వేరు కాదన్నారు. రుక్మిణి నమ్మినట్లే వూరుకుంది. అయితే, తండ్రి తన అభిప్రాయాన్ని దాచి, తల్లిని ఎందుకో ముందుకు గెంటుతున్నాడనిపించింది. తల్లే అడిగేసింది.

"మీ ఆలోచనేమిటి? స్నేహితుడు, డబ్బు అడగడని ...."

"ఇట్లాంటివి సాధ్యమైనంతవరకు ఆడవాళ్ళ యిష్టప్రకారం జరగడం క్షేమం. లేకపోతే రోజూ ఇదో రభస అవుతుంది. కానీ, నీ ఇష్టప్రకారమే ...."

కులం విషయమై తండ్రి ఆలోచన తెలుసుకోవాలని రుక్మిణి అడిగేసింది:

"మీకూ కులంపట్టింపు వుందా?"

"నువ్వేమంటావు?"

"నే నెప్పుడూ ఆలోచించలేదు", అంది రుక్మిణి. అటువంటి సందర్భంలో సూచనగానేనా చెప్పడం అవసరం అనిపించింది.

"మనకు వున్నా లేకపోయినా మన చుట్టూ వున్న సమాజంలో వుంది. పట్టి వుండటంగాదు, బలంగా వుంది. మనం కాదంటే పోతుందా?" అన్నాడు మూర్తి.

రుక్మిణి ఏమీ అనలేదు. తండ్రి ఈనాడు కాంట్రాక్టులూ, లారీ వ్యాపారాల్లోపడి రాజకీయాలకు దూరంగా వున్నా కుల మత కక్షల్ని దూరంగా వుంచేవారితో పనిచేసి దెబ్బలుతిన్నవాడే. జైళ్ళల్లో పడ్డాడు. ఆస్తి ఖర్చు చేసుకొన్నాడు. ఆయనకు సన్నిహిత మిత్రులు అన్ని కులాలలోనూ ఉన్నారు. ఒక్క గడియక్రితం రాజకీయాలకు దూరమైనవారు పూర్వాలోచనమీద భక్తి చూపుతారని హేళనచేసినవాడే! కాని, ఇంతలో ఈ అభ్యంతరం? ఆశ్చర్యం అనుకుంది.

కాని, రుక్మిణి పైకేమీ అనలేదు.

BRAOU

## 4

మరునాడుదయం ఎనిమిది గంటలు కొట్టే వేళకి రామచంద్రరావు దిగేడు.

"ఏమండోయ్! వియ్యపురాలుగారూ! మనవాడు లేచాడా?" అంటూ. గుమ్మాలెక్కుతున్న అతని పలుకు విని అప్పుడే సావిట్లోకి వస్తున్న సుందరమ్మ ఉలికిపడింది. రాత్రి భర్త చెప్పిన మాటలు గుర్తువచ్చేయి నవ్వుకుంది. అంతలో అతడు పూర్వపురోజుల్లో కూడా తనను ఆ బంధుత్వపు పిలుపుతోనే పలకరిస్తూండే వాడని జ్ఞాపకం వచ్చింది సర్దుకుంది.

"రాండి, పైకి వెళ్ళండి" అంది.

"ఏం? ఇంకా మేలుకొలుపులు పాడవలసిన ఘట్టంలోనే ఉన్నాడా" అంటూ తన మిత్రునికి పొద్దుపోయి లేచే అలవాటున్న సంగతి మరవలేదన్నట్లు సూచించేడు.

మిత్రుని కంఠంవిని నరసింహమూర్తి మెట్ల మొగదలకి వచ్చి ఆహ్వానించేడు.

"పైకి రావోయి .... అమ్మా! రుక్మిణీ! అన్నపూర్ణచేతి కిచ్చి రెండు కాఫీలు పైకి పంపించు తల్లీ!" అని పురమాయించేడు.

"ఒక పర్యాయం అయిపోయినా, రెండోమారు పుచ్చుకోవడానికి ఏ విధమైన అభ్యంతరం లేదు" అంటూ రామచంద్రరావు మిత్రుని బెత్తాయింపును బలపరిచేడు. బలపరుస్తూనే, ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, "దాని అర్థం మోహం తొలుచుకున్నావన్నమాట. బాగుంది .... అయితే, నీ అలవాట్లు కొద్దీ, గొప్ప మారినట్లే ఉన్నాయి. బాగుంది ...." అంటూ మెట్లమీదకు తిరిగేడు.

రుక్మిణి కాఫీకప్పులు ట్రేలో పెట్టుకొని అతని వెనకనే మేడమీదికి వచ్చింది. ఆమెరాక చూసి "అన్నపూర్ణ లేదా" అన్నాడు మూర్తి. "పనిలో ఉంది" అంటూ రుక్మిణి గదిమధ్యనున్న టీపాయి మీద ట్రే ఉంచి ఒక కప్పు అతిథికి ఇచ్చింది.

"ఎవరన్నా ఏదన్నా యిస్తే, అది మనకక్కరలేనట్లూ, కేవలం వాళ్ళ బలవంతంమీదనే పుచ్చు కొంటున్నట్లూ ముఖం పెట్టాలికదూ ...." అంటూనే ఆయన కప్పు తీసుకొన్నాడు.

వెనుకటి రోజుల్లో రాజకీయాలలో నలుగురితో కలిసి పనిచేస్తూన్నప్పుడు తమమధ్య నడుస్తూ ఉండిన హాస్యాలూ, అవహేళనలూ గుర్తువచ్చి మూర్తి నవ్వేడు.

"తిండి విషయంలో నువ్వెప్పుడూ మొగమాటపడవుగా!"

"మొగమాటపడితే కడుపు మాడుతుంది" అని సమాధానం ఇస్తూనే రుక్మిణిని ఆహ్వానించేడు.

"రావమ్మా! నువ్వూ కూర్చో, ఏమన్నా కబుర్లు చెప్పు" అన్నాడు.

రుక్మిణి చిరునవ్వుతో "చెప్పండి", అంటూ ఓ కుర్చీ లాక్కుని కూర్చుంది. కొంతసేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ నడిచేయి. కాలేజీలూ, చదువులూ చర్చలో వెనకబడ్డాయి.

"ఈ ఏడాదితో నీ 'థీసిస్' పని పూర్తవుతుందన్నావు కదూ! తర్వాత ఏమిటి? ఏం చెయ్యాలను కుంటున్నావు?" అన్నాడు రామచంద్రరావు.

దానిని వివాహప్రస్తావనకు నాందిగా భావించి మూర్తి అందుకున్నాడు. అంతవరకూ మరిచినట్లూ, అప్పుడే విషయం జ్ఞాపకం వచ్చినట్లూ నటిస్తూ "నిన్నరాత్రి నువ్వో ప్రస్తావన తెచ్చేవు ...." అని ప్రారంభించేడు.

ఆ సంగతి ఏమిటో తెలిసినా, రామచంద్రరావు ఆ ప్రస్తావన ఆ విధంగా రావడం ఇష్టంలేక, అసలదేదీ జ్ఞాపకం లేనట్లే ముఖం చిట్లించేడు. "ఏమిటది? నీకు ఈమధ్య జ్ఞాపకశక్తి బాగా ఎక్కువయిందనిపిస్తూంది" అన్నాడు.

నరసింహమూర్తి ఆ వెక్కిరింతను లక్ష్యం చెయ్యలేదు.

"జ్ఞాపకం ఉంచుకోకపోతే బ్రతుకనిస్తావా?"

"ఇంతకీ ...."

"అదే, నువ్వు చెప్పిందే. మేమందరం ఆలోచించాం. మీ బ్రాహ్మల అమ్మాయే...."

"ఓ, మా బ్రాహ్మల అమ్మాయేనా?" అంటూ రామచంద్రరావు 'మా' ను ఒత్తిపలికేడు.

"ఏం, పనికిరాదా? కూడదా?" అన్నాడు మూర్తి ఏమీ ఎరగనట్లు.

"సాధ్యమయినంతవరకూ మా శాఖ అమ్మాయే అయితే నయం" అన్నాడు రామచంద్రరావు, 'మా' ను మరికాస్త ఒత్తుతూ.

'మీ శాఖ ఏదో మరి తెలియదు".

"మరి, గోత్రం?"

"అదొకటా? ఆ మెలికలు అన్నీ ఉంటాయన్నమాట" అంటూ ఆశ్చర్యం ప్రకటించేడు.

"గోరాగారిలాగ కులాంతర వివాహాలు జరగాలనే వాడివి కాదు గనక ఆ మాత్రం పరువు నిలబెట్టేవు" అన్నాడు వెక్కిరింతగా రామచంద్రరావు. సంభాషణ సాగుతున్న తీరుచూసి రుక్మిణి దానిని దారిలో పెట్టాలని ఆదుర్దా కనపరచింది.

"ఇక్కడ హైస్కూలులో హెడ్మాస్టరుగా పనిచేసి రిటైరయ్యేరు, హనుమంతరావుగారని ...." అంటూ ప్రారంభించింది.

BRAOU

తాను తొందరపడి తెచ్చుకున్న అసందర్భ పరిస్థితి నుంచి బయటపడడానికై మూర్తి ఆ మేస్టారి గుణ గణవర్ణనకు పూనుకొన్నాడు.

"మంచి టీచరు. ఆయన పేరు చెప్తే పిల్లలు కుక్కిన పేలల్లే ఉండేవారు. మళ్ళీ అటువంటి హెడ్మాష్టరు రాలేదనుకో. ఆయన ఉన్నప్పుడు మా మునిసిపల్ హైస్కూలు ఫలితాలు, స్కూలు ఫైనలులో ఎప్పుడయినా డెబ్బయీ, డెబ్బయ్యయిదుకి తగ్గేయా? ఆయన రిటైరయ్యారు. తర్వాత ఇప్పుడు పాస్‌లు నూటికి పాతికా, ముప్పయ్యేను! ఒక్క మేష్టరు చదువు చెప్పడు".

"ఇప్పుడు పెళ్ళికూతురు ఆయనేనా?"

ఎంతో గంభీరంగా అడిగిన ఆ ప్రశ్నకు రుక్మిణి ఫక్కున నవ్వింది. ఒక్క క్షణం విస్తుపోయినట్లయి, సర్దుకుని మూర్తి కూడా నవ్వేడు.

"ఈ వర్ణన ధోరణి చూస్తే అలా అనిపించిందిలే" అన్నాడు నిర్వికారంగా, రావు.

రుక్మిణి ఒక నిముషానికి తేరుకుని అసలు కథకు వచ్చింది.

"వారి రెండో అమ్మాయి సుధ. ఫిజిక్సు ఎం.ఎస్.సి. చాలా తెలివిగలది".

కూతురి ప్రయత్నాన్ని మనస్సులోనే మెచ్చుకుంటూ నరసింహమూర్తి మధ్యలో మాటసాయం ఇచ్చేడు.

"యోగ్యత ఉంది. మంచి అభ్యుదయపు భావాలుగలది" అన్నాడు.

'మీ బ్రాహ్మలే' అని ప్రసంగం ప్రారంభించిన మిత్రుని నోట ఆ 'అభ్యుదయ భావాలు' కలదేనన్న పొగడ్త అసందర్భంగా వినిపించి రామచంద్రరావు హేళనగా చూస్తూ నవ్వేడు.

"అయితే కష్టమేనే! ఏదో ఇంతవరకూ గుట్టుగా నడిచిపోతూంది. ఈ అభ్యుదయ భావాలు కలావిడ మన గుట్టు రట్టుచేసి, మూడారుగాళ్ళనే దిక్కేమిటి?"

తీవ్ర రాజకీయవాదుల నిఘంటుపదజాలంతో పరిచయం ఉన్న నరసింహమూర్తి నవ్వేడు .

"మూడార్లేమిటి" అంది రుక్మిణి తెల్లబోయి.

"ఆర్ త్రయం వినలేదూ? 'టీ' చతుష్టయంలాంటిదే అదీను".

"అదీ నే వినలేదు".

"మరేం ప్రపంచం కొల్లబోలేదులే. రిఫార్మిస్టు, రివిజనిస్టు, రియాక్షనరీ ఈ మూడూ 'మూడార్'లు. ఆరు సంఖ్యా వాచకం కాదు".

రుక్మిణి పక్కున నవ్వింది. తానూ ఆ హాస్యధోరణిలోనే మాట కలిపింది.

"పాపం! అది వట్టి మేకండి, అంత రివల్యూషనరీ కాదు. అంతవరకూ అభివృద్ధిపొందనూ లేదు".

"పోనీలే, రక్షించేవు. ఏదోమూలపడి ఉన్న నేను ఇంకా అభివృద్ధికోసమే బాధపడుతున్నా ననుకుంటున్నాడా ఏమిరా భగవంతుడా అని ప్రాణం ఉడ్డుకరిచింది చెప్పొద్దూ! కానియ్యి. ఆమె పేరేమి -టన్నావు? సుధారాణి, ఫిజిక్స్ ఎమ్.ఎస్‌సి. ఈ పేరు ఏ సందర్భంలోనో మనచెవిన పడ్డట్లేవుంది. ఏం చేస్తూందన్నావు?" - అని రామచంద్రరావు ఆ సమస్యనే అందుకున్నాడు.

"కాకినాడ కాలేజీలో లెక్చరరుగా ఉంది. ప్రస్తుతం ఈ వూళ్ళోనే ఉంది. నిన్ననే నాతో నేవచ్చిన బండిలోనే వచ్చింది. ఆమె కో - లెక్చరరుకి పెళ్ళి".

"ఔను. మనలిస్టులోకి వచ్చింది. కాని, వాళ్ళకుటుంబం చాలా సనాతన ధోరణిలో ఉంటారట" అని రామచంద్రరావు అనుమానం వెలిబుచ్చాడు.



BRAOU

తనను వెక్కిరించిన కసితో మూర్తి ఆ మాటనందుకున్నాడు. "అభివృద్ధి అంటే అంత భయ పడుతూన్నవాడికి సనాతనత్వం పనికిరాదేమిటి?" అన్నాడు.

"నాకయితే పనికిరావచ్చు, నువ్వు నన్నింకా బ్రాహ్మడుగానే లెక్కవేస్తూండవచ్చు. కాని, ఆయన మాటేమిటి?".

మూర్తి నవ్వేడు.

"అది నిజమేననుకో. కాని, పిల్ల చదువుకొంది. ఉద్యోగం చూసుకొంటూంది. ఆమెకి తండ్రిగారి అభ్యంతరాలు ఉండకపోవచ్చు గదా ..." అన్నాడు.

"కేవలం వధూవరులకే వదిలేస్తే అంతేనయ్యా! కాని, మధ్యన తల్లిదండ్రులు తాము ప్రేమించకగాని పిల్లల్ని మాటాడనివ్వరుకదా" అన్నాడు రామచంద్రరావు అసలు ఇబ్బందిని పేర్కొంటూ రుక్మిణి నవ్వింది.

"అయితే, ఎరిగుండీ మీరెందుకు తీసుకున్నారీ బాధ్యతని?"

రామచంద్రరావు సాలోచనగా ఆమెవంక చూసేడు.

"కేవలం సహాయం చెయ్యడమే నా ఉద్దేశం".

రుక్మిణికి ఆ సమాధానం నచ్చలేదు.

"అది మాత్రం అవసరమా? విదేశాలల్లో చదువుకు వచ్చేరంటున్నారు. ఆయనకు పిల్లను మీరు చూసి పెట్టాలా" అంది.

"అక్కర్లేదనుకో, కాని తరువాత అర్థంలేని గొడవల్లో చిక్కుకొని మనస్సులు పాడుచేసుకో కుండేందుకు ..."

"అంటే ...." అన్నాడు మూర్తి.

"అంటేనా! అతడో పిల్లను చూస్తాడు. నచ్చుతుంది. ఆమెకు ఇష్టం కావచ్చు ...."

"మరి సమస్యే ఉండదు" అన్నాడు నరసింహమూర్తి. రామచంద్రరావు సన్నగా నవ్వేడు.

"మనదేశంలో పరిస్థితులు అంతా సులభంగా లేవయ్య. ప్రేమకు బోలెడుపగ్గాలు. అటూ, ఇటూ తల్లి దండ్రులలో ఎవరికిష్టం లేకపోయినా ...."

రుక్మిణికి అనుమానం తీరలేదు.

"వయస్సు వచ్చినవాళ్ళు బాగా చదువుకొని బ్రతకగలిగినవాళ్ళు ...."

రామచంద్రరావు నవ్వేడు.

"నువ్వేం చేస్తావో, అటువంటి ఘట్టంవస్తే నాచెవిన ఒక్కమాటవెయ్యి. మీనాన్న సంగతి నే చూస్తా" అని వేళాకోళం చేశాడు.

నరసింహమూర్తి పట్టించుకోలేదు. చర్చను అసలు సమస్యకు మళ్ళించడానికి ప్రయత్నించేడు.

"ఇప్పటికే ఆ అమ్మాయికి పాతికేళ్ళు వచ్చేయి. మన రుక్మిణి ఈడుదే. తండ్రి ఆయనై ఏ సంబంధాలూ చూడలేదు. చేతిలో డబ్బూ దస్కం ఏమీలేదు ...."

రామచంద్రరావు నవ్వేడు.

".... అయితే లొంగతీయవచ్చునంటావు, బెదురుపుట్టించి".

"లొంగతియ్యడమట, లొంగతియ్యడం ...." అని మూర్తి రెట్టించాడు. కాని, రామచంద్రరావు అతని మాటలను పట్టించుకోలేదు.

BRAOU

"ఆ అమ్మాయి ఈ వూళ్ళోనే ఉందన్నావు కాదూ" అని రుక్మిణిని వాకబుచేసేడు.

"నిన్న రాత్రి ఇద్దరం కలిసే మెయిల్‌లో వచ్చేం".

"ఆవిడకూ నీకూ స్నేహమేకదూ ..."

"బాగానూ" అంది అతి సాధారాణంగా.

"స్నేహమేమిటి? మా కుటుంబం అంటే మాష్టారు ఎంతో ఇదిగా ఉంటారు" అని నరసింహమూర్తి మాట దూర్చేడు.

"ఓమాటు మీ ఇంటికి తీసుకురాగలవా?" అని రుక్మిణినే అడిగేడు.

"కబుర్లలో ధోరణి ఎటువంటిదో చూద్దాం" అన్నాడు.

"మనవైపునుంచి వెలితిపడటం ఎందుకు? నువ్వు 'ఊ' అంటే మాస్టారే వస్తారు. తీసుకెళ్ళి పిల్లను చూపించేటట్లు చూస్తాను" అన్నాడు మూర్తి.

"పెళ్ళిచూపుల పద్ధతివద్దు. అది వాళ్ళిద్దరికే పరిమితం కావాలి. ప్రస్తుతం యదాలాపంగా మాట్లాడుతాం. వీలుగా వుంటుందంటే తర్వాత చూద్దాం".

రుక్మిణి ఆలోచనలో పడింది. నరసింహమూర్తి అదేం కష్టం కాదన్నాడు. కాని రుక్మిణి కాదంది.

"వాళ్ళ స్నేహితురాలి పెళ్ళి అన్నానుకదూ. ప్రొద్దుటే ఈపాటికి పోరంకి వెళ్ళే వుంటుంది".

"పోరంకిలో పెళ్ళా?" అని మూర్తి ఉలికిపడ్డాడు.

"ఎవరింట్లో? సుబ్బారాయుడుగారింట్లో కాదుగదా. పెళ్ళికూతురు పేరేమిటన్నావు? ఏదీ ఆ డ్రాయరు సొరుగులో శుభలేఖ వుంది చూడు. వాళ్ళింటికే అయితే మేమిద్దరం వెళ్ళవలసే వుంటుంది. మాతో నువ్వూ రావచ్చు"నని నరసింహమూర్తి ఆహ్వానించేడు.

రుక్మిణి పెళ్ళి శుభలేఖ తీసింది.

"పెళ్లికూతురు కుముద. ఔను, అక్కడికే వెళ్లింది".

"సుబ్బారాయుడుగారి కుముద పెళ్ళికి నాకూ పిలుపు వచ్చింది ముఖ్యంగా ఆ పెళ్ళి కోసమే ఆగేను. లేకుంటే రాత్రిబండికే వెళ్ళిపోయి వుండును" అన్నాడు రామచంద్రరావు.

నరసింహమూర్తి ఆశ్చర్యానికి మేరలేదు. "నువ్వు సుబ్మారాయుడుగారిని ఏ మెరుగుదువు?"

"వాళ్ళ పిల్లలకు నేను ట్యూషన్లు చెప్పేను. ఎనిమిదేళ్ళ వయస్సులో కుముద నా శిష్యురాలు. కామేశ్వరరావు నిన్న సాయంకాలం కన్పించేడు. పదిమాట్లు చెప్పాడు".

"ఎప్పుడది? నాకు తెలియకుండా అంత ట్యూషన్లు చెప్పుకు బ్రతికిందెప్పుడయ్యా?" అని నరసింహమూర్తి కళ్ళు చికిలించేడు.

"ఏభయిలో, బందరులో ఉండేవాడిని. నా పక్కవాటాలోనే సుబ్బారాయుడుగారి కుటుంబం వుండేది. ఊళ్ళో గొడవలకి భయపడి ఆయన కుటుంబాన్ని పట్టణం చేర్చేరు. తాను పోలీసు లారీలలోపడి తీవ్ర రాజకీయవాదుల్ని వేటాడేవాడు".

"నువ్వు ఆయన ఇంట్లోనే ...."

"వారి పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ ఉండిపోయాను".

## 5

పెళ్ళి పందిట్లో అడుగు పెడుతూండగానే రామచంద్రరావును కామేశ్వరరావు ఆహ్వానించేడు. "రండి మేష్టారూ!" అంటూ తీసుకెళ్ళి తండ్రికి పరిచయం చేసేడు. సబ్బారాయుడు ఆయనను గుర్తు పట్టలేక పోయాడు. అయితే 'తనను చంద్రం అంటా'రనగానే ఎంతో సంతోషం ప్రకటించేడు.



BRAOU

'చంద్రంగారా! ఎప్పటిమాట! ఏభయితర్వాత మళ్ళీ కనిపించనేలేదు. ఇప్పుడెక్కడుంటున్నారు? ఏం చేస్తున్నారు? శిష్యురాలి పెళ్ళివేళకు వచ్చేరు. తమ అభిమానం అల్లాంటిది. చాలా సంతోషం ...." అంటూ ముందుకు నడిచేడు.

"నిన్న నో పనిమీద విజయవాడ వచ్చేను. కామేశ్వరరావు కనిపించేడు. నేనయితే గుర్తుపట్టలేక పోయాను".

"కుర్రవాడుగా చేసేరుమరి. ఆ వయస్సులో ఎంతో మార్పు వస్తుంది. నన్ను చూడరాదూ. మీరు చెప్పే వరకూ గుర్తురానేలేదు. తమరూ బాగా మారినట్లుంది"–అంటూ సుబ్బారాయుడు తన మరుపునకు కారణాలూ, వెతుక్కున్నాడు.

తనను గుర్తుపట్టలేక పోయాడంటే దానికి బలమైన కారణాలే వున్నాయి. ఆ రోజుల్లో తాను రహస్య జీవితం గడుపుతున్నాడు. చటుక్కున తన గుర్తు తెలియకుండేందుకు జుట్టు దువ్వడంలో, మీసకట్టులో, పేరులో చిన్న చిన్న మార్పులు చేసుకున్నాడు. అవేవీ పెద్ద ప్రయోజనకారులు కాలేదని నిన్న కాఫీ హొటలులో చూడగానే కామేశ్వరరావు వచ్చి "మీరు ఫలానా కాదా" అని అడగడంతోనే తేలిపోయింది. కాని, అది సుబ్బారాయుడికి తెలియవలసిన పనిలేదు. కనక ఆయన మాటతో ఏకీభావం తెలిపేడు.

"ఏదీ, పది పదిహేనేళ్ళు దాటిపోయింది. కామేశ్వరరావు చెప్పేడు. కుముద పెళ్ళికూతురంటేను. ఓ మారు చూడాలనిపించింది. ఇప్పుడెక్కడో లెక్చరరుగా వున్నదట కదూ".

తమ ఆశీర్వచన బలం. ఆ చిన్నవయసులో చదువుకోవాలనే ఉత్సాహం, పునాదీ తమరే వేశారని ఇప్పటికీ చెప్పుకుంటూ వుంటాం".

ఆమెకు చదువులో వుత్సాహం కలిగించడంలో తనకంత పాత్ర వున్నదని రామచంద్రరావు ఎప్పుడూ అనుకోలేదు. కనక అభినందనను మొగమిచ్చకంగా మాత్రమే భావించేడు.

"నేను చేసిందేముంది లెండి" అన్నాడు.

దానిని వినయ ప్రకటనగా మాత్రమే సుబ్బారాయుడు స్వీకరించేడు. దానికి అనుగుణంగానే – "తమ రల్లాగే అంటారు. నిండుకుండ తొణకదంటారు. అదే, సరి .... రాత్రి రెండు గంటలకి వివాహం. భోజనాలు పెందలకడనే అయిపోతాయి. ఈ లోపున విశ్రాంతి తీసుకోండి .... బాబయ్యగారింట్లో కాదుటోయ్ నరసింహ మూర్తిగారికి బస యిచ్చేవు? మేస్టారిని కూడా అక్కడే వుంచు .... తమరు నరసింహమూర్తిగారిని ఎరుగుదురా? చాలా మంచివారు. మంచి తోడుగా వుంటారు".

అంటూ సుబ్బారాయుడు ఒక్కగుక్కలో ఆతిథ్యం, బంధుప్రీతి, బస నిర్దేశిస్తూ సెలవు తీసుకొన్నాడు–" సెలవా, మేష్టారూ!" అంటూ.

* * *

కామేశ్వరరావుతో బసకు వెళ్ళేసరికి అక్కడ కుముదా, రుక్మిణీ, మరో పడుచూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కనపడ్డారు. రామచంద్రరావును చూడగానే కుముద ఎదురువచ్చింది. "నమస్కారం మేష్టారూ!" – అంటూనే తన మిత్రురాళ్ళను పరిచయం చేసింది.

"ఈమె రుక్మిణి అని ...."

రుక్మిణి చిరునవ్వుతో 'తమకు పరిచయం' వుందంది.
"ఆమె తండ్రీ నేనూ చాలాకాలంగా స్నేహితులం" అన్నాడు రావు.

"మా సుధ చెప్పడమేగాని, నాకీవేళనే వీరి పరిచయం"అంటూ కుముద తమతో వున్న మూడో పడుచును పరిచయం చేసింది.

"వీరు మా చిన్ననాటి మేష్టారు" అంది.

సుధారాణీ, తనచెల్లెలూ ఒకేకాలేజీలో ఉద్యోగం చేస్తూ ఒకే బసలో రెండేళ్ళుగా ఉంటున్నారనీ, [illegible] వులకన్న మిన్నగా వుంటారనీ చెప్తూ సుధ ఆ వివాహానికి రావడానికిగల కారణం జతపరిచేడు కామేశ్వరరావు.

కొంతసేపు కబుర్లుసాగేక, కుముద సెలవు తీసుకుంది.

"మేష్టారికీ, బంధువులకీ టిపిన్లూ, కాఫీల సంగతి నువ్వే చూడాలి" అంటూ సుధకి పురమాయించి వెళ్లి పోయింది.

కామేశ్వరరావు 'మరచే'నని లేచేడు.

"మీరు కబుర్లు చెప్పుకుంటూండండి. నేను పట్టించుకువస్తా".

"ఆ హడావిడిలో మీమాట వినేవారెవరు? కూర్చోండి. నేనా పని చూస్తాను" అంటూ సుధ లేచింది. చివరకు 'మీరు కూర్చోండి' అంటూ ఉభయులూ వెళ్ళేరు.

"చాలా చురుకైనది. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ వుంటుంది. వట్టినే ఒక్క నిముషం కూర్చోదు" అంటూ రుక్మిణి మిత్రురాలి గుణగణాలను వర్ణించింది.

"కన్నూ ముక్కూ తీరయిన విగ్రహం" అనుకున్నాడు రామచంద్రరావు మనస్సులోనే.

* * *

ఫలహారం తీసుకుంటూ రామచంద్రరావు పడుచువాళ్ళ ముగ్గురినీ కబుర్లలోపెట్టేడు క్రమంగా సంభాషణ హాస్టల్ జీవితం మీదికి మళ్లింది.

"వేర్వేరు కులాలావాళ్లూ, బిన్నమతాలవాళ్లూ కలిసి కూర్చుని, ఎబ్బెట్టులేకుండా భోజనం చేస్తున్నారా? ఎవరన్నాలభ్యంతరాలు చెప్తున్నారా? అందరూ కలిసి భోజనం చేయడంగురించి ఇళ్ళవద్ద పెద్దలు ఏమంటారు? ...." రామచంద్రరావు చర్చను మెల్లిగా ఆచార వ్యవహారాలమీదికి త్రిప్పేడు. సూటిగా సుధనే ప్రశ్నించేడు.

"మీ అమ్మగారూ, నాన్నగారూ ఏమంటున్నారు?"

సుధ ఆ సరాసరి ప్రశ్నకు వెంటనే సమాధానం ఇవ్వలేకపోయింది.

"వాళ్ళ నాన్నగారికి ఆచారం ఎక్కువే" అంది రుక్మిణి.

రామచంద్రరావు ఆశ్చర్యం ప్రకటించేడు.

"ఆశ్చర్యం! అమ్మగారు ఒప్పుకుంటారా?" అన్నాడు.

"మొదట్లో అమ్మకీ ఇష్టంలేదు" అంది సుధ.

"మరి?"...." అన్నాడు వివరాలు కోరుతున్నట్లు.

"వారిద్దరికీ తమ పిల్లలు బాగా చదువుకోవాలనే ఉత్సాహం ఉంది. ఆ ఉత్సాహంలో హాస్టలులో భో[illegible] విషయం అట్టే పట్టించుకోలేదనుకుంటా ..." అంది రుక్మిణి.

"అయితే ఉద్యోగ ప్రారంభంతో ఆ సమస్య మళ్లీ రాకపోలేదు" అంటూ సుధ మిత్రురాలిని దిద్దింది.

"నాన్నగారు రిటైరయ్యారు. ఏకంగా కాపురం కాకినాడకే మారుస్తానన్నారు కాని కుదిరిందికాదు. ఇంక సరిపుచ్చుకున్నారు".

బెడద తప్పిందన్న సంతృప్తి ఆ కంఠంలో వినిపించగా రామచంద్రరావు సానుభూతి కనబరుస్తూ" ఇంకా నయంకాదూ! ఉద్యోగం మానిపించేరుకారు" అన్నాడు.

"ఇంటి అవసరాలు జరగాలికదా" అంది సుధ. ఆ ఒక్కమాటలోనే తమవాళ్ళు ఎటువంటి పరిస్థితులలో సరిపుచ్చుకోవలసివచ్చిందో సూచించింది.

"మా అమ్మ పరిస్థితులకు సర్దుకుపోగలదు. ఆమె ఆచారం పట్టింపులు లేకపోలేదనుకోండి కాని తక్కువ, అసలావిడ నాన్నగారినుంచే నేర్చుకొన్నదేమో ననిపిస్తూంటుంది" అంది.



BRAOU

"ఈవేళ ఈ భేదాల్ని అంతగా పట్టించుకొనేవారెవరు లెండి! ఎక్కడో మేష్టారులాంటి వారు తప్ప" అంది రుక్మిణి.

చర్చ కులాలూ, పట్టింపులూ మీదికి మళ్ళింది. కులంపట్టింపులు తగ్గుతున్నాయన్నమాటను కామేశ్వర రావు అంగీకరించలేక పోయాడు.

"స్వాంతంత్ర్యం వచ్చేక ఈ పట్టుదలలు మరింత బిగుస్తున్నాయేమో ననిపిస్తూంటుందండి. మొన్నటికి మొన్న ఒక ఉగ్ర రాజకీయవాది తన కొడుకుకు కాలేజీలో ఉచితంగా చదవు సౌకర్యం సంపాదించుకోవడం కోసం తన కులాన్ని వెనుకబడిన తరగతులలోనిదిగా నిరూపించుకోడానికి నానా యాతనలూ పడుతుంటే చూసి ఆశ్చర్యమయింది. నిజానికి ఆయనకు కులాల పట్టింపులేదు. నే నెరుగుదును" అన్నాడు.

రామచంద్రరావు నిట్టూర్చేడు.

"మనం చేసే ప్రతి పనీ రెండంచుల కత్తిలాంటిది. వెనకబడివున్న తరగతులను మిగిలిన వాళ్ళ స్థాయికి తేవాలంటే విద్యా ఉద్యోగ సౌకర్యాలు కలిగించాలి. కలిగిస్తున్నారు. విద్య జన సామాన్యానికి అందుబాటులోకి తెస్తున్నారు. అయితే వెనకబాటుతనం కేవలం సాంఘిక సమస్యకాదు. ఆర్థిక సమస్య కూడాను. ఆర్థికంగా వెనుకబాటులేని వారు తమ బిడ్డల వెనకబడి పోకుండేందుకు ఆ సమస్యను సాంఘిక సమస్యగానే చూపించి బయటపడాలని చూస్తున్నారు. ఒకాయన తన కూతురు చదువుకోసం తక్కువకులం పేరు చెప్పుకోడాని క్కూడా సందేహించలేదు. అది బయటపడి శిక్షకూడా అనుభవించేడు. ఇక్కడ రాజకీయాల తీవ్రతతో సంబంధం లేదు".

పడుచువాళ్ళంతా ఆ మాటల లోతులు ఆలోచిస్తూ కూర్చున్నారు. ఆఖరున అతడే – "అదీ ఒక విధంగా మంచి లక్షణమే ననుకుంటాను – " అనడం వారు ముగ్గురినీ ఆశ్చర్యపరచింది.

కులాల్ని పాటించరాదనే వ్యక్తే కులాల గుర్తింపు వాంఛ మంచి లక్షణం అంటున్నాడనిపించి ముగ్గురూ ఆయన ముఖంలోకి చూసేరు.

"మనం కులాలకి ప్రాముఖ్యం ఇవ్వడం ఛాందస మనస్తత్వ ప్రదర్శనమే కాదా" అంటూ రుక్మిణి అభ్యంతరం తెలిపింది.

"నిజమేననుకోవమ్మా! మొత్తం కులభేదాలంతరించడమే అవసరం. అది ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. అలా త్వరగా జరగడం లేదు గనక అసలు జరగడమే లేదనుకోవడం తప్పు. మార్పులు గమనించాలి. అవి ఏ కొద్ది గానీండి. మనం ఏ దృష్టితో పనిచేసినా కులవ్యవస్థ చెబ్బతిని తీరుతుంది. తింటూంది. దానిని బ్రతికించడం ఎవరితరమూ కాదు." అంటూన్న రామచంద్రరావు మాటలను నమ్మలేక పడుచు వాళ్ళు ముగ్గురూ వూరుకున్నారు. వాళ్ళ అనుమానాల్ని గమనించి రామచంద్రరావు తన అభిప్రాయాన్ని వివరించేడు.

"మన సమాజానికి కులవ్యవస్థ ప్రాతిపదిక. నాలుగే కాదు. మన కులాలు అనంతశాఖలుగా విడి పోయాయి. ప్రతి శాఖకూ ఏదో ప్రత్యేక లక్షణం ఏర్పడింది. దాని బలం మీద ఆచారాలు ఏర్పడ్డాయి. వాని బలంతో ఏ కులానికి ఆ కులమే ఎక్కువది. కులం తక్కువదంటే కత్తి దూసేపని. అలాగ అనడం మహా పమానం చేయడం. తల తియ్యడం కన్న ఘోరం. పెద్ద తిట్టు. అటువంటిది ఈ వేళ తమది వెనుకబడిన కులంగా, తక్కువ కులంగా నమోదు చేయించుకోడం మీద ఈ మోజు ఏమిటి?"

"ఏమిటంటారు?" – అన్నాడు కామేశ్వరరావు.

"నా అభిప్రాయం ఒక్కటే. కుల వ్యవస్థకు ఆర్థిక మయిన పట్టు ఎన్నడో పోయింది. సామాజికమయిన పట్టుకూడా అంతరించినట్లే. ఇంక రాజకీయపు పట్టుకాస్త ఉంది. అయితే అదీ ముచిక కొడికి వచ్చిందనాలి" అన్నాడు రామచంద్రరావు.

గతరాత్రే తమ తల్లితండ్రుల అభిప్రాయాలను విన్న రుక్మిణీ, సుధా రామచంద్రరావు అభిప్రాయాలను స్వీకరించలేకపోయారు. అనుమానంగా "ఏమో నబ్బా" అన్నారు.



BRAOU

# 6

భోజనాలయినాయి. పెళ్ళికింకా వ్యవధి చాలా వుంది. పందిట్లో వేసిన వివాహవేదికకు అలంకారాలు ఇంకా దిద్దుతూనే వున్నారు. పిల్లలు గంతులేస్తూ, కేకలతో వీధులంతా దద్దరిల్లి చేస్తున్నారు. పందిరి బయట వెన్నెట్లో చల్లగాలికి, కుర్చీలేసుకొని రామచంద్రరావు ఆ కోలాహలం అంతా గమనిస్తూ కూర్చుని ఉన్నాడు. "ఏమీటి మహా ఆలోచిస్తున్నావు?" అంటూ పలకరించే వరకూ అతడు నరసింహమూర్తి రాకను గుర్తించనేలేదు. ఆ పలకరింపుతో ప్రకృతిలోపడి తిరిగి చూసేడు. "ఆ, ఏంలేదు" అంటూ సాచివేసేడు.

నరసింహమూర్తి కూడా ఓ కుర్చీ తెచ్చుకొన్నాడు. అతడే కదిపేడు.

"పెళ్లికూతురూ, ఆమె అన్నగారూ నువ్వంటే మహాగురిగా వున్నారు. ఎన్నాళ్ళు చెప్పేవేం చదువు?" అన్నాడు.

రామచంద్రరావు చిన్నగా నవ్వేడు.

"అంతాచేసి ఎనిమిదినెలలు! అయితే ఆ ఎనిమిదినెలలూ నావెంట వదలలేదు. తెలివిగలవాళ్ళు ... "

కొద్దిసేపు అదీయిదీ మాట్లాడి నరసింహమూర్తి ఆ విషయానికే మళ్లీ వచ్చేడు. "కామేశ్వరరావును గురించి నీ అభిప్రాయం ఏమిటి? చిన్నప్పుడు ఎరుగుదువు. ఈ వేళ పగలంతా అతడు నీవద్దనే ఉన్నట్లుంది అన్నాడు.

ఆ ప్రశ్నలో ప్రత్యేకశ్రద్ధ వినబడి రామచంద్రరావు కనుబొమ్మలు నిగుడించేడు.

"ఏం విశేషం"

అది అప్రయత్నంగా వచ్చిన ప్రశ్న తప్ప వ్యవహారం ఏమిటో అర్థంకాక కాదు. "పెళ్ళికొడుకు చూపులా?" అన్నాడు.

నరసింహమూర్తి చిరునవ్వుతోనే సమాధానం యిచ్చేడు. రుక్మిణికి ఇదివరకే వరుళ్ళను చూసే ప్రయత్నం సాగుతూందని చెప్పడం వరకే మూర్తి ఉద్దేశం. గడచిన రాత్రి రామచంద్రరావు ఒక సూచన చేసేడు. దానికిది సమాధానం అని అతని అభిప్రాయం.

రామచంద్రరావు "బాగానే ఉంటుంది" అన్నాడు.

"సుబ్బారాయుడుగారిదే సూచన. ముఖపరిచయం అయినా ముందడుగువేసే ఉద్దేశం నాకులేదు".

"బాగానే సంపాదించేవులాగుంది" అన్నాడు రామచంద్రరావు ఎగతాళిగా. బాగా కట్నం ఇవ్వవలసి ఉంటుందన్నమాటగా.

"అంతే అంటావా?" అన్నాడు నరసింహమూర్తి. "తనకు కట్నం ఉద్దేశం ఏ మాత్రమూ లేదన్నారాయన కనకనే అసలు ఆలోచనకన్నా అవకాశం కలిగింది" అన్నాడు.

సాయకాలం సుబ్బారాయుడితో నడిపిన ఇష్టాగోష్టిలో గుర్తుచేసుకుంటూ రామచంద్రరావు తన వూహను స్పష్టంగానే చెప్పేడు.

"అడిగినా, అడక్కపోయినా ఒక అకారం ముట్ట చెప్పబోతున్నావని ఆయనకు ఖచ్చితమయిన అభిప్రాయం వుందన్నమాట" అన్నాడు మూర్తి తాహతును అంచనా కట్టే ధోరణిలో.

సంభాషణ ఆ రూపంలో సాగడం మూర్తికి ఇష్టంలేదు. మాట మార్చేడు.

"ఈవేళ సాయంకాలం అంతా ఏవేవో మాట్లాడుతూనే వున్నావు కాబోలు, పిల్లకారుతో. వాళ్ళ ధోరణి ఎల్లా వుంది? మనం చదువుకున్న రోజుల్లో మాదిరిగా ఈ రోజుల్లో చిన్న వాళ్ళల్లో ఓ ఆదర్శమని, ఓ ఆశయమనీ కనిపించడం లేదోయ్ ... "

ఆ విషయంలో రామచంద్రరావు అభిప్రాయం భిన్నం.



BRAOU

"మనకి దేశస్వాతంత్ర్య సాధనా, పరిపాలను నుంచి విముక్తి తక్షణ గమ్యాలుగా ఉండేవి. ఆ గమ్యాల్ని సాధించేందుకు ఎరిగి అయితేనేం, కేవలం అనుషంగికంగా అయితేనేం గాంధీజీ అడుగుజాడలలో మన ఆదర్శాలనూ, ఆశయాలనూ, జీవిత పద్ధతులనూ మలచుకున్నాం. ఆయన పద్ధతుల్నీ, సిద్ధాంతాల్నీ, విమర్శిస్తూనే ఉన్నా ఆయన ఆదర్శాల, ఆశయాల ప్రభావం మన మీద ఉండనే ఉంది. ఈ నాటి యువ తరానికి మన ఆశయాలగమ్యం జీవిత సత్యం అయింది. దానికి అనుగుణంగా వారి ఆదర్శాలు మారిఉంటాయి.

ప్రస్తుత తరపు యువతకు ఓ ఆదర్శం, ఓ ఆశయం అంటూ లేదనీ, సుఖం మరిగి, సమస్యల్ని సున్నితంగా పక్కకు పెట్టేసి రోజులు వెళ్ళదీసే ధోరణిలో పడ్డారని భావించే అనేక మంది మాదిరిగానే నరసింహమూర్తి అభిప్రాయ పడతాడు.

కాని, ఆ చర్చలో పడితే తామిద్దరూ కూడా తేలరు. మరొకప్పుడైతే అతడు ఆ సమస్యను తేల్చుకోవాలనే వాడే. ఇది సమయమూకాదు. సందర్భమూకాదు అనుకొని సర్దుకొన్నాడు.

"బహుశా సుధను చూసి, అందరూ ఆమెలాగే ఉంటారనుకుంటున్నావు కాబోలు" అంటూ అతడు చర్చను మరొక వేపు నెట్టేడు.

అనాలోచితంగానే మిత్రుడు చూపినదారిని అందుకున్నాడు, రామచంద్రరావు.

"ఆ అమ్మాయి మంచి వ్యక్తిత్వం గలది".

"హనుమంతరావు మేస్టారిని నీ దగ్గరకి పంపించమంటావేమిటి?" అన్నాడు నరసింహమూర్తి హుషారుగా.

"ఆయనకు అటువంటి ఆలోచన అభ్యంతరకరం కాకపోతే మాట్లాడ్డంలో తప్పేంలేదు. నాకు పరిచయం చెయ్యి" అన్నాడు.

ఆ అవకాశం కొద్ది నిముషాలలోనే దొరికింది. ఆఖరు బస్సు దిగి అప్పుడే వస్తున్న హనుమంతరావును నరసింహమూర్తి పలకరించేడు.

"మేస్టారూ! నమస్కారం. ఇప్పుడే బస్సు దిగినట్లుంది".

హనుమంతరావు నిలబడి ప్రతినమస్కారం చేసేడు - "ఇప్పుడే నండి," అంటూ దగ్గరకు వచ్చేడు. నరసింహమూర్తి రామచంద్రరావును పరిచయం చేసేడు.

"ఈయన రామచంద్రరావని చిన్ననాటి స్నేహితుడు. మీలాగే పిల్లల చదువుల మీద సర్వం ఒడ్డిన మనిషి ..."

రామచంద్రరావు నమస్కరించేడు. మూర్తి పరిచయకాండలో ద్వితీయ భాగం పూర్తిచేశాడు.

"వీరే హనుమంతరావు మేస్టారు. ఇందాకా చూసేవే - లెక్చరరుగా పనిచేస్తున్నదని చెప్పేను - సుధారాణి - వీరి కూతురే."

లెక్చరరు కూతురుకు తండ్రిగా పరిచయం చేస్తూంటే హనుమంతరావు బ్రహ్మానందపడ్డాడు.

"వీరి అమ్మాయి రుక్మిణితో పాటే చదివింది. డాక్టరేట్ చెయ్యాలంటే కుదరలేదు. ఉద్యోగంలో చేరిపోయింది" అన్నాడు.

"ఏం పర్వాలేదు వయస్సేంమించిందని? మీకు సాధ్యం కాకపోయిన దానిని పెళ్ళి అయ్యే ఇద్దరూ సాధించుకోగలుగుతారేమో? నా స్నేహితుడు భార్య ఒకామె ఇద్దరు పిల్ల తల్లిగా డాక్టరేట్ తెచ్చుకువచ్చింది. అసలా తృష్ణ ఉండాలే గాని ..."

అదీ సాధ్యం అయ్యేలా లేదని హనుమంతరావు నిరాశ ప్రకటించేడు.

"అది మాత్రం మన చేతుల్లో ఉందా? పైగా మీలో మాదిరిగా మా బ్రాహ్మల్లో ఆస్తిపాస్తులుండవు. పిల్లదాని తెలివి, అందం, చదువు, మంచితనంలాంటివి ఎవరికి కావాలి? ఏమిస్తాడు? ఎప్పుడిస్తావు? ... కాస్త మొలత్రాడు గట్టిన మగాడైతే చాలు ..."



BRAOU

రామచంద్రారావు తన కులం గురించిన భ్రమను తొలగించడానికి ప్రయత్నించలేదు. కాని, రెండో అంశాన్ని ప్రత్యాఖ్యానం చెయ్యకుండా వదలలేదు.

"మీ సుధారాణి వంటి అమ్మాయిని గాక కట్నం మూట వేపు చూసే వాడికి జ్ఞానం లేదనుకోండి. అటువంటి వాడికి పిల్లనిచ్చేందుకు మీరు నిరాకరించాలి" అన్నాడు.

"ఈవేళ జ్ఞానంలేదని వాళ్ళదే మెజార్టీ. ఫలితంగా మనం ఆ పుచ్చు వంకాయల్లోంచే తక్కువ పుచ్చుల్ని ఏరుకోవలసి వస్తూంది" అంటూ మేస్టారు కట్నం తక్కువయినా, లాంఛనాలు చాలకా ఎంతమంది అల్లుళ్ళు మామగార్ల బ్రతుకు దుర్భరం చేస్తున్నారో వర్ణించసాగేడు.

"మా పెద్ద అల్లుడే ఉన్నాడు పెళ్ళివాడు కట్నం వద్దన్నాడు. అదీ ఇదీ ఖర్చుచేసి పెళ్ళి ఘనంగా చేశాను. తర్వాత అది కావాలనీ, ఇది ఇచ్చేరు కాదనీ నన్ను దెప్పుతూనే ఉంటాడు. ఇంకా, మంచివాడు గనక పిల్లను పంపేస్తానని కూర్చోలేదు".

"దానికి మాంచి మందు ఒక్కటే మాస్టారు! మీరు పెద్దలు. మీకు మేం చెప్పనక్కర్లేదుగాని ..." అంటూ వినయం ప్రకటిస్తూనే రామచంద్రరావు తనమందు చెప్పేడు.

"వధూవరుల్ని ఎన్నుకొనే అధికారం పిల్లలకే వదిలెయ్యడం".

హనుమంతరావు ఆ మాట విని హడలిపోయేడు. దానికిగల అనేక అభ్యంతరాలుచెప్పేడు.

"ఏది మంచో, ఏదిచెడో వాళ్ళకేం తెలుస్తుంది?"

రామచంద్రరావు నవ్వేడు. "మీరు ఆనకట్టకట్టడానికి పూర్వం నాటి మాటలు చెప్తున్నారు మేస్టారూ!" అన్నాడు.

అక్కడికీ ఆగక చదువుకున్నవాళ్ళకి మంచి చెడ్డలు తెలియవనడానికి ఒప్పుకోలేదు.

"వందల మధ్య బ్రతుకుతున్నారు. అనేక దేశాల జ్ఞాన భాండారం చక్కబెడుతున్నారు. విజ్ఞానశాస్త్రాలు చదువుతున్నారు. వాళ్ళకి మంచి చెడ్డలు తెలియవనుకోవడం ..."

తెలివితక్కువదనం అనుకోవడం అనుకున్నాడు. ఒక్కనిమిషం ఆగి– "అతి ప్రేమఫలితం అనుకుంటాను" అన్నాడు.

"అదేమిటిలే. ఎంత చదువుకున్నా అనుభవం, దూరదృష్టి ఎక్కడుంటాయి?" అని నరసింహమూర్తి మేస్టారి వాదాన్ని బలపరిచేడు. వెంటనే హనుమంతరావు ఆ మాట ఒప్పుకొన్నాడు.

"పెళ్ళి అన్నది నూరేళ్ల పంట. ఎన్ని చూడాలి? ఎక్కడికేదరి? కులం, కుటుంబం, మంచి, మర్యాద ఎన్ని ఆలోచించాలి" అన్నాడు. ప్రేమా గీమా స్త్రీపురుష వాంఛకు ఆధునికులు తగిలించిన పంచదార పూత మాత్రమేనని కూడా ఆయన తన భావాన్ని స్పష్టం చేశాడు. నరసింహమూర్తి నవ్వేడు.

"మా రామచంద్రరావు దృష్టిలో ప్రేమ సర్వరోగ సంహారకం. ఏకమూలిక" అన్నాడు.

స్నేహితురాలి పెళ్ళికి వచ్చిందన్నమాటేగాని ఆ ఇంట్లో సుధ ప్రాణం ఉక్కిరిబిక్కిరిగానే ఉంది. సుబ్బారాయుడుగారి కుటుంబం అంతా ఆమె రాకకు ఆనందించేరు. అయితే పెళ్ళి ఇంట్లో బంధు జనం కూడా ఉంటారు. వారందరికీ ఆ ఇంటిలోసుధకు గల చనువు గురించి తెలియవలసిన పనిలేదు. ఆ అవకాశమూ లేదు. వారి దృష్టిలోఆమె ఎవరోపై మనిషి, కొత్త మనిషి. ఆమె ఆ ఇంట్లో మనిషిలాగ తిరగడం, ఆమోదించబడడం వారికి ఆశ్చర్యంగా ఉంది. ఆ అభిప్రాయాన్ని వారు దాచుకోలేదు. పైగా ఆమె బ్రాహ్మల అమ్మాయనేది మరింత ఆశ్చర్యం అనిపించింది. బాగా చదువుకున్న అమ్మాయి, ఒక కాలేజీలో లెక్చరరు అనేవి ఆమె యందు పెద్ద గౌరవభావాన్ని కలిగించేయి. ఇవన్నీ అనేక ప్రశ్నలకు తావిచ్చేయి. ఆశ్చర్యం, ప్రశంస, అభినందన, ఆదర్శ కల్పన, ప్రేమాదరాలు అనేక రూపాలలో ప్రకటితమవుతున్నాయి. సహృదయంతోనే అయినా అందరి దృష్టి ఆమె మీద ఉంది. అది సుధకు ఎంతోసంకోచ కారణం అయింది. కుముద గ్రహించింది. సుధను తన ప్రక్కనే నిలుపుకొనేందుకు ప్రయత్నించింది. కాని, సాంప్రదాయికంగా



BRAOU

పెళ్ళికూతురు నిర్వహించవలసిన చర్యలు బోలెడున్నాయి. కనక ఆమెను ప్రక్కనే ఉంచుకోవడం సాధ్యం కాలేదు. ఆమెకోసం వేయించిన కుర్చీ స్థలాలు మారినా కుముద ఆమెకు రక్షణగా ఉండలేకపోయింది.

ఆమె అవస్థ చూసి కుముద నవ్వింది. ఓ కుర్చీలో చదికిల బడి పెద్దరికం చూపడం ఆమె స్వభావానికే విరుద్ధం. రుక్మిణి వచ్చేక ఆమె ఊపిరితిప్పుకుంది.

వివాహతతంగమూ, అనుబంధపు ఆచారాలూ ముగిసేసరికి తెల్లవారింది. అప్పుడే విడిదిలో జరగవలసిన వేడుకలు ముగిసి, భర్తతో వచ్చిన కుముదను సుధ అభినందించింది. ఆమె వెళ్ళిపోతానంటే కుముద భర్త హాస్యమాడేడు.

"మీ నేస్తాన్ని అప్పుడే వదిలేసి వెళ్ళిపోతారా?" అన్నాడు.

"కొత్తనేస్తం దొరికిన హుషారులోమా పాతనేస్తుల అవసరం ఉండదు. మేము పెద్ద మనిషి తరహాగా నిష్క్రమించడం మంచిది" అంటున్న సుధను చేయిపట్టుకొని కుముద తన పక్కనున్నకుర్చీలో కూలవేసింది.

"ఇప్పుడు చెప్పు. నీ వంతెప్పుడు?"

"ఇంకా వంతులేమిటే పెళ్ళికూతురా! ఎవరిదారి వారిదే" అంది సుధ.

"అంటే నీకు పిలుపు ఉండదన్నమాట" అని రాజేశ్వరరావు భార్యను ఎగతాళి చేసేడు.

"నాకు పిలుపులేకుంటే దీనికి పెళ్ళిలేదు. ఆ పెళ్ళి చేసుకొనే వాడెవడో ఆడపడుచు కట్నం చెల్లించకుండా పీట ఎల్లా ఎక్కుతాడో చూస్తానుగా" అని కుముద సవాలుచేసింది.

సుధ నవ్వింది. "సరిలే తల్లీ! ఆ సమస్య ప్రస్తుతానికి వాయిదా వేద్దాం".

కుముదమాత్రం వాయిదా వేసే ధోరణిలో లేదు.

"నువ్వు ఇల్లా వాయిదాలు వేస్తూ పోతుంటే చివరకెవరన్నా మిగులుతారంటావా?"

సుధ నవ్వు చటుక్కున మాయమయింది. ఆమె ఇరవయి నాలుగ్గంటలు ఈ మధ్య కాలంలో చాలా సంగతులు గమనించింది. నిజానికి కుముద హెచ్చరికలో హాస్యం పాలుకన్న యదార్థం పాలు హెచ్చుగా ఉంది. తాను ఏదో ఒక నిర్ణయం చేసుకోవలసిన ఘట్టం వచ్చింది.

"సరేలే, వెళ్ళివస్తా" అని బయటకు నడిచింది.

* *

భర్తతో బయలుదేరబోతూ కుముద అన్నగారికి చాలా విషయాలు చెప్పింది. వానినే నెమరువేసు కుంటూ కామేశ్వరావు తనూ ప్రయాణానికి తొందరడుతున్నాడు.

చెల్లెలి పెళ్ళి నిర్ణయమయిననాటినుంచీ ఇంటిల్లిపాదీ దృష్టి తన మీదనే ఉందని అతడిదివరకే గ్రహించేడు. అది అక్కడే ఆగలేదు. ప్రయత్నాలే ప్రారంభమైనవని కుముద చెప్తూంది. ఆ వార్త ఆ యువకునికి సంతోషానికి బదులు ఆందోళన కలిగించింది.

అతడు సుధను పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనకు ఏనాడో వచ్చేడు. కుముద ఉద్యోగంలో చేరినాక సుధతోకలిసి ఒక ఇల్లు తీసుకుంది. ఇద్దరూ హొటలు నుంచి కేరియరు తెప్పించుకొనీ, మరీ విసుగుపుట్టి నప్పుడు ఓ నెల వండుకునీ, మళ్ళీ బద్దకించి హొటలు టిక్కెట్లు మళ్ళీ కొనుక్కునీ ఈ రెండేళ్ళ నుంచీ ఒకే చోట ఉంటున్నారు. ఎప్పుడో చిన్నప్పుడు కలిసిన స్నేహం ఈ రెండేళ్ళలోనూ తిరిగి నెలకొంది. పండుగ లలో వాళ్ళు కామేశ్వరరావునుకూడా భోజనానికి పిలిచేవారు. అప్పుడప్పుడు అతడూ చెల్లెల్ని కలుసుకొనే టందుకు వెళ్ళి ఓగంట కూర్చునివచ్చేవాడు. ఆ విధంగా సుధతో పరిచయం స్నేహంగా, స్నేహం అనురాగంగా పరిణతిపొందింది. వివాహ ప్రస్తావన వచ్చింది. సుధకు అంగీకారమే. అయితే వెంటనే వివాహానికి అభ్యంతరా లున్నాయి. తమ నిర్ణయాన్ని ఉభయత్ర తల్లిదండ్రులూ వ్యతిరేకిస్తారు. వారి కులాలు వేరు. అందుచేత ఆ ప్రేమికులిరువురూ కుముద మాటున ఒదిగి వుండవలసి వచ్చింది.

BRAOU

ఇప్పుడా తెరకాస్తా తొలగిపోతూంది. ఆమెపెళ్ళి చేసుకొని వెళ్ళిపోతూంది.

కుముద అన్నగారిని అడిగేసింది.

"ఎందుకీ దాగుడుమూతలు? చక్కగా, చల్లగా రిజిస్ట్రారు ఆఫీసు కెళ్ళండి. ఇల్లు సిద్ధంగా వుంది. కాపురం పెట్టెయ్యండి".

కామేశ్వరరావు సందేహిస్తూ ఆమె ముఖం వంక చేసేడు.

"ఇద్దరూ సంపాదించుకొంటున్నారు. ఇద్దరికీ నెలకో వెయ్యి రూపాయలదాకా వస్తాయి. బ్రతకలేమని భయపడనక్కర్లేదుకదా" అని పుల్ల విరిచేసింది.

కామేశ్వరరావు తనకాక్షేపణం లేదన్నాడు.

"నేను సిద్ధంగానే వున్నాను. ఇదివరకే అనేకమార్లు చెప్పేను. ఆవిడే వాయిదా వేస్తూంది"

ఈనాడు తండ్రి కుటుంబానికి సుధ సంపాదనే ఆధారం. మొన్నటివరకూ యూనివర్సిటీలో చదువు తున్న ఒక చెల్లెలికి డబ్బు పంపవలసి వచ్చింది. ఆమెఏదో ఉద్యోగంలో చేరినా, మంచి ఉద్యోగం కోసం చూస్తూంది. ఆమె పైకి వస్తే కుటుంబభారాన్ని కొంతవరకూ మోయగలుగుతుందనీ, తనకు విడుదల దొరుకు తుందనీ ఆమె ఆశ.

"తనలాగే అందరూ వుంటారని సుధ భ్రమ. లలిత మాట్లాడకుండా పెళ్ళిచేసుకొని వెళ్ళిపోతుంది. నీబాధలేవోనువ్వు పడమంటుంది. తను ఈలాగే నోట్లో వేలుపెట్టుకు కూర్చోవాలి. దానికేమీ తెలియడం లేదు" అంది కుముద.

కామేశ్వరావుమీద మంచి కట్నం సంపాదించాలని సుబ్బారాయుడి ఆశ. అయితే కొడుకు ఆలోచనల దృష్ట్యా ఆమాట పైకి చెప్పడు. కాని, ఆయన దృష్టి అంతా మంచి ఆస్తీ, డబ్బూ తీసుకురాగల కోడలి మీద ఉంది. అందుకు వీలుగానే సంబంధాలూ వస్తున్నాయి. తనమనస్సులోది బయట పెట్టకుండా కామేశ్వరావు ఇంతవరకూ చెల్లెలి పెళ్ళి ముందు జరగాలని తప్పించుకుంటున్నాడు. ఇప్పుడా ఆటంకం చెప్పలేడు. ఇప్పుడే ఓ సంబంధం గుమ్మంలోకి వచ్చిందని ఆ చల్లని వార్త అందించింది.

"నిన్న రోజంతా మీతో వుంది గదూ - రుక్మిణి-నరసింహమూర్తిగారి అమ్మాయి - అన్నయ్యకామె ఎల్లా వుంటుందంటావు!" అంటూ తండ్రి వేసిన ప్రశ్ననూ, ఆయనే ఇచ్చిన సమాచారాన్నీ కుముద అన్నగారికి తెలిపింది.

ఎకరం పదివేలు చేసే మాగాణి భూమి అయిదెకరాలు ఆ అమ్మాయి పేరున వుంది. అల్లుడి కివ్వడానికి పిల్ల తండ్రి ఏభయివేలు బ్యాంకులో వేసి వుంచేడు. ఆ అమ్మాయి డాక్టరేట్‌కి రిసెర్చి చేస్తూంది. ఇంకో ఏడాదిలో డిగ్రీ వచ్చేస్తుంది. ఏ యూనివర్సిటీకి వెళ్ళినా ఏడెనిమిది వందలు తెచ్చుకోగలదు.

కళ్లు తిరిగిపోయే ప్రలోభం.

అంత ఆకర్షణీయంగానూ వున్న సంబంధాలు ఇదివరకు కూడా వచ్చేయి. కానీ, వానిని మరింత ఆకర్షవంతంగా మారుస్తూ ఆ కన్యలు అతని ఎదుటబడలేదు. ఆ ఆస్తులకన్న కంటి ఎదర వున్న సుధ అతని మనస్సు నెక్కువ ఆకట్టుకుంది.

ఇప్పటి పరిస్థితివేరు. ఇక్కడ అతడు రుక్మిణిని చూసేడు. ఆమెనూ, ఆమె మాటలనూ జ్ఞాపకం చేసు కొనేందుకు ప్రయత్నించేడు. కాని గుర్తురాలేదు. అయితే ఒకటి మాత్రంనిజం. ఆమె అనాకారి కాదు. అంతే కాదు. మరోమాటు చూడాలనిపించే విగ్రహం. సందేహం లేదు. అయితే ఆమె సుధలాగ తన మాటలతో, చురుకుదనంతో మనుష్యుల్ని ఆకట్టుకోలేదు. సుధ ఎదురుగావుంటే మరో ఆలోచన తోచదు. ఆమెకళ్ళు, ఎప్పుడూ నవ్వుతూండే పెదవులు, మాటలు అవే నిలబెట్టేస్తాయి. రుక్మిణిది గంభీర ప్రకృతి. సుధతో పాటు గానే ఒక రోజంతా ఆమె తన కళ్ళముందే వుంది. అయితే సాధారణమయిన ఉత్సకత తప్ప అతని మనస్సులో సంచలనం కలుగనేలేదు.

BRAOU

అయితే ఆ లోపాన్ని భర్తీచేస్తూ లక్షరూపాయల ఆస్తి చూపించబడుతుంది. నిల్చున్నపాటున అడిగేస్తే ఎవరయినా రుక్మిణికే వోటు వేస్తారు. సందేహంలేదు.

సుధను చేసుకొంటే అతనికి ఆర్థికంగా కలిసివచ్చేదేమీ ఉండదు. అయితే సుధతో ఉంటేనే చాలు. జీవితం ఉత్ఫుల్లమవుతుంది. అనంత సంపదలు కలిసివచ్చినంత సంతోషం కలుగుతుంది.

కాని ఆ వివాహం వర్ణాంతర వివాహం. రెండువేపుల వారూ తమరిని వదిలేస్తారు. నిన్న మాటల సందర్భంలో తమ చిన్ననాటి మేస్టారు "అలా వదిలేస్తేనే క్షేమం" అన్నారు. కాని, ఆర్థిక సహాయం లేకపోడమే ఇక్కడ ఇబ్బంది కాదు. మనిషి-మాట సహాయంకూడా ఉండదు. ఎప్పుడూ అలాగే వుంటారా అంతే అది వేరు మాట. దగ్గరకువచ్చినా వారి వలన సాయంకన్న బాధ ఎక్కువ. అదీ నిజమే. ఆ మాదిరి వివాహాల వలన కలుగ గలవనీ, కలుగుతున్నాయనీ వారు భావించే నష్టాలను నిరంతరం మన చెవిని వేస్తూంటారు. మన బలహీనతల్ని, మనోదౌర్బల్యాలనీ అనుక్షణం పరీక్షకు పెడుతూంటారు. ఆ విషయం అతనికి తెలుసు.

అయిదే సుధలో పొంగిపొరలే ఉత్సాహమూ, ఎప్పుడూ నవ్వుతూండే ఆ కళ్ళూ, పెదవులూ చూస్తూంటే ప్రపంచం అంతా కట్టుకట్టి దూరంగా పెట్టినా బతికెయ్యగలం' అనిపిస్తుంది. ఇప్పుడే లక్ష రూపాయల ఆస్తి, అందం, ఆరోగ్యం ఉన్న కన్య ఎదుట నిలబడినప్పుడు కూడా సుధకళ్ళనూ, మాటలనూ మరవలేకుండా ఉన్నాడు.

కాని, ఒక్కటనిపించింది.

"త్వరలో తేల్చుకుని గట్టెక్కెయ్యాలి" అనుకున్నాడు. "సుధతో మాట్లాడు కుముదా" అన్నాడు.

కుముద ఒక్క క్షణ ఆలోచించింది.

"ఇంక ఇంతలోతను కనిపిస్తుందా ఏమన్నానా?" అంది విచారంగా.

"ప్రొద్దుటే మెయిలుకి వెడతానంది. బహుశా ఈ పాటికి వెళ్ళిపోయి ఉంటుంది".

కామేశ్వరరావు చేతిగడియారం చూసుకొన్నాడు. ఎనిమిది దాటింది.

"బంటుమిల్లి గూడెం కూడా దాటిపోతుంది"

అంతలోనే సావట్లోంచి పిలుపు వినబడింది.

"కుముదా అన్నయ్యగాని ఉన్నాడా?"

తండ్రిదా పిలుపు "వస్తున్నా నాన్నగారూ!" అంటూ కామేశ్వరరావు వెళ్ళేడు.

తండ్రితోమాట్లాడి వస్తుంటే తన వెనకే పెదతండ్రి రఘురామయ్య కూడా వస్తూండడం గమనించి కామేశ్వరావు నిలబడ్డాడు.

"ఏమిటి పెదనాన్నా?"

"ఎక్కడికెడుతున్నావు?"

"ప్రయాణానికి సర్దుకోవాలి. మధ్యాహ్నం కాకినాడ పాసెంజరుకు వెడతా."

"ఎప్పుడో మధ్యాహ్నం కదా. దానికే నేనూ వస్తున్నా తొందరేం? ఎంతసామానుందేం. రా అల్లా, ఆకుతోటలోకి పోయివద్దాం.

తండ్రి అందించిన సమాచారం మీద అప్పుడే ఒత్తిడి ప్రారంభయిందన్నమాట. పెదతండ్రి అందుకే పిలుస్తున్నాడు. తప్పించుకోవాలని ప్రయత్నించేడు. కాని ఆయన వదల లేదు ... "రావోయ్! పెద్ద కబుర్లు చెప్పక" అన్నాడు.

ఇంక సందేహంలేదు. కామేశ్వరరావు గుండెల్లో రాయిపడింది. పిల్లను సరిగ్గా చూడలేదు. మాట్లాడనూ లేదు. ఏదోపెళ్ళి హడావిడిలో ఆ దృష్టి లేకపోయింది. ప్రస్తుతం చెప్పలేనని తండ్రి నుంచి తప్పించుకొన్నాడు.



BRAOU

కాని, పెదతండ్రి రఘురామయ్య వద్ద ఆ మాటలేం కుదరవు. చెల్లవు. నిన్నటి రోజంతా ఆయన తమ తోనే ఉన్నాడు. తాను తండ్రితో చెప్పింది అబద్ధమని గ్రహించినట్లు ఆ సమయంలో ఆయనముఖాన కన బడిన చిరునవ్వేసాక్ష్యం. అప్పుడెందుకోవూరుకున్నాడు. ఇప్పుడు తన మనస్సుని బయట పెట్టించడమో, ఈ సంబంధానికి ఒప్పించమో జరిగేవరకూ వదలడనిపించింది ఆయన మహా పట్టుదల మనిషి ... కామేశ్వరరావు తప్పించుకొనేందుకే మరల వ్యర్థ ప్రయత్నం చేసేడు.

"చాకలి ఇస్త్రీ బట్టలు ఇంకా తేలేదండి".

రఘురామయ్య జేబులోంచి పొగాకు కాడ దీసి, జాగ్రత్తగా పొరదీస్తూ, ఆ దారిన వెడుతున్న పాలేరును పిలిచేడు. "ఒరే, సూరాయి."

పాలేరు వస్తూండేలోపున ప్రశ్నించేడు.

"ఎవరికి వేసేవు?"

కామేశ్వరరావు క్షీణస్వరంతో "రోడ్డు పల్లంలో ఉంటున్న నరసన్నకి" అన్నాడు. నిజానికి తాను బట్టల కోసం కబురుచేయవలసిన పనిలేదు. చాకలి ఆ రోజున బట్టలు తెచ్చేదిలేదని చెప్పే పట్టుకెళ్ళేడు. తప్పించు కొనేటందుకుచాకలిని అడ్డం పెట్టేడు. ఇప్పుడా అబద్ధాన్ని చివరంటా చూడాలి. తప్పదు.

త్వరగా బట్టలు తెమ్మని చాకలికి కబురందించడం పని రఘురామయ్య పాలేరుకి పురమాయించేడు.

"మధ్యాహ్నం ఒంటిగంటకు అబ్బాయి ఊరికెడుతున్నారు; ఆలోపున బట్టలు తెమ్మన్నారని చెప్పి వచ్చి మరోపని చేసుకో, వెళ్ళు" అన్నాడు.

"ఇంకనడు, కుర్రాడివి. ఎంతసేపు సర్దుకోవాలేం? పెళ్ళాం, పిల్లలు ఏర్పడ్డాక చెప్పు" అంటూ దారి తీశాడు. ఇంక తప్పదనుకొని కామేశ్వరావు పెదతండ్రి వెంట నడిచేడు. తోటలో బావిగట్టున కూర్చుండేవరకూ ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్తూ కాలక్షేపం చేసేడు. కూర్చున్నాక అసలు సమస్యకు వచ్చేడు

"ఇప్పుడు చెప్పు. నిన్న ఆ అమ్మాయిని సరిగ్గా చూడలేదు. పెళ్ళి పనుల హడావిడిలోమాట్లాడనూ లేదని కదూ అన్నాడు?"

కామేశ్వరరావు గుటకలు మింగేడు. ఏదో నసిగేడు. రఘురామయ్య నవ్వేడు.

"పోనీ, ఆ బ్రాహ్మల అమ్మాయినేనా చూసి మాట్లాడేవా?" అన్నాడు.

తన రహస్యాన్ని పెదతండ్రి కనిపెట్టేసాడనుకోవాలి. అయితే ఒప్పుకొనేందుకు ప్రయత్నించేడు.

"ఆ అమ్మాయిని చిన్నప్పటినుంచీ ఎరుగుదును".

"పైగా ఈ మూడు సంవత్సరాలనుంచీ కాకినాడలో తరుచు కలుస్తూండి ఉంటావు" అన్నాడు రఘురామయ్య అందులో పెద్ద విశేషం ఏమీలేనట్లు.

"ఆ అమ్మాయి, చెల్లాయీ కలిసి ఉంటున్నారు. చెల్లాయి కోసం ఎప్పుడేనా వెడితే కనిపిస్తూ ఉంటుంది.

ఈ మారు రఘురామయ్య అసలు సమస్యకు వచ్చేడు.

"ఆ అమ్మాయి ఎదుట ఉండగా ఈ రుక్మిణి కంటికి ఆననంత పరిచయం ఉందన్న మాట" అన్నాడు సూటిగా.

పెదతండ్రి కళ్ళల్లో నవ్వు కనిపిస్తూన్నా ఆ మాటలకు సమాధానం ఏమివ్వాలో అర్థంగాక కామేశ్వర రావు దిక్కులు చూసేడు. ఆయన తనకు కూడా అదే అనుభవం అన్నాడు.

"మొన్న బండిలోనూ అంతే. ఆ ఆడపిల్లలిద్దరూ కలిసి వచ్చేరు. మీ నేస్తం బండి దిగే వరకూ రెండో ఆమెను గురించిన ఆలోచనే కలగలేదు.

BRAOU

కామేశ్వరరావు చాలా జాగ్రత్తగా చేసుకొని మరీ సమాధానం ఇచ్చేడు : "చాలా చురుకైన అమ్మాయి"

"అందమూ ఉంది. ఆ కళ్ళు చేస్తాయి లక్షరూపాయలు!"

కళ్ళకు లక్షరూపాయల విలువ కట్టడంలో అభిప్రాయం ఏమిటా అని కామేశ్వరరావు పెదతండ్రి ముఖం వంక చేసేడు. రఘురామయ్య ఒక్క నిముషం వూరుకొని చటుక్కున ప్రశ్నించేడు.

"ఆమెను పెళ్లిచేసుకోవాలనుకుంటున్నావా?"

అంతసూటిగా అడిగినప్పుడు ఏంచెప్పాలో అర్థంగాకపోవడం కాదు. మనస్సులో మాట పైకే వచ్చేసింది.

"ఆమె సంపాదనమీద కుటుంబం అంతా ఆధారపడిఉంది. తండ్రి రిటైర్ అయ్యేరు. చదువు కొంటూన్న తమ్ముళ్ళు, చెల్లెళ్ళు. ఆమె వివాహం చేసుకొనే ధోరణిలో లేదు".

"అంటే ఆవిడదే అభ్యంతరం అన్నమాట" అన్నాడాయన సాలోచనగా.

తాను చెప్పకుండానే, అసలు పరిస్థితిని అంత చక్కగా, సరిగ్గా గ్రహించగలిగినందుకు కామేశ్వరరావు కంగారుపడ్డాడు. కొద్ది క్షణాలు వూరుకొని రఘురామయ్యే మరల అందించేడు.

"పెళ్ళి అయ్యేకకూడా ప్రతినెలా ఆమె తన జీతంలోంచి కొంత తనవాళ్ళకి సహాయం పంపడం నీకు అభ్యంతరమా? కొడుకే అయితే చెయ్యడా?

"నాకా మాట తోచలేదు" అని వొప్పుకొన్నాడు కామేశ్వరరావు. తీరా అనేశాక నాలిక కరుచుకున్నాడు.

"ఇంతకీ ఆ అమ్మాయి బ్రాహ్మల అమ్మాయని మరచిపోయేరేమిటి? ఏదో స్నేహం కొద్దీ మనింటికి వస్తూంది. హాస్టళ్ళు, కాలేజీలు అలవాటుందిగనుక మనతోకలిసి మనింట్లో భోజనం చేస్తూంది. అంతే గాని..."

మాట మధ్యలో రఘురామయ్య అతనిని అడ్డుకొట్టేడు.

"ఓరేయి. నన్ను బురిడీ కొట్టించబోకు. ఈ రెండు రోజులూ మీ మాటలు, ఆటలూ గమనించలేదనుకోకు".

కామేశ్వరరావు తప్పదు కనక సర్దుకొన్నాడు. కాని, యదార్థస్థితిని ఒప్పుకొనేందుకు ఇంకా సిద్ధంగాలేడు.

"అసలామాటకు వస్తే వాళ్ళవాళ్ళదాకా ఎందుకు? మనింట్లోవాళ్ళే పీకేస్తారు"

రఘురామయ్య అతనిని ఓరకంట నిశితంగా చూసేడు.

"ఆ! సింగినాదం! అసలు నీ ఆలోచనేమిటి? పెళ్ళిచేసుకొనేది నువ్వా, మీ వాళ్ళా?"

పెదతండ్రినోటా మాట విని కామేశ్వరరావుచాలా ఆశ్చర్యపడ్డాడు. పదిహేనేళ్ళ క్రితం, కొడుడు వద్దు మొర్రో అంటున్నా వినక, కట్నం, పెద్ద సంబంధం అని ఆశపడి అతని మెడలువంచి చేసేడు. అటువంటి వ్యక్తి నోట ఆ మాట వినడం ఆశ్చర్యం అనిపించి ఆయన ముఖంలోకి చేసేడు. "ఏం, ఆశ్చర్యంగా వుందా?"

నిజం వొప్పుకోలేక కామేశ్వరరావు తబ్బిబ్బుపడి "అబ్బే! అదేం కాదు" అన్నాడు.

"రాజారావు కాపురం చూసేక ..." ఒక్కనిముషం ఆయన కంఠం రుద్ధం అయింది ... "ఇంక మనింట్లో అటువంటి బుద్ధి తక్కువ పని జరగరాదనిపించింది" అన్నాడు.

రాజారావు ఆయన కొడుకుల్లో ఒకడు. మెడలు వంచి ఇష్టంలేని పెళ్ళి చేసినది అతనికే. ఆ దంపతు లిద్దరికీ ఒక్క రోజుపడలేదు. పెద్దవాళ్ల అనునయాలూ, సర్దుబాట్లూ, వయస్సు అవసరాలతో మధ్యమధ్య ఓ వారం పదిరోజులు ఏకత్రవాసం చేస్తూవచ్చేరు. ఆ విధంగా ఇద్దరు పిల్లల్ని కన్నారు. నాలుగేళ్ళ తరవాత మరి లాభంలేదని చెప్పేశారు. పిల్లల అనుబంధం కూడా మరి పనిచెయ్యలేదు. రాజారావు మొదట పెళ్ళి చేసుకోవా లన్న అమ్మాయికి పెళ్లయిపోయినా, ఆమెను వెతికి, ఇంటి నుంచి లేవదీసుకు పోయేడు. కొంత కాలం ఏదో ప్రాజెక్టులోఇంజనీరుగా పనిచేసేడన్నారు. తర్వాత ఆ భార్యతోసహా దేశత్యాగం చేసిపోయేడన్నారు. ఎవరో కెనడాలో పనిచేస్తున్నాడన్నారు. తరవాత అక్కడి నుంచి వెళ్లిపోయేడట. ఈ వార్తలన్నీ ఎవరో చెప్ప వలసిందే గాని, అతని నుంచి ఒక ఉత్తరం ముక్క కూడా లేదు.

BRAOU

ఆనాటి సంగతులును జ్ఞాపకం చేసుకుంటూ ఆయన చాలా సేపు అలాగే కూర్చుండి పోయేడు.

"మొదటనే వాడు కోరినట్లు చేసివుంటే ..."

చేసివుంటే సమస్యేం వుంది? చేయలేదుకనుకనే ఈ బాధ.

"మరి నీ మాటేమిటి? నిన్న గమనించినదాన్ని బట్టి మీరిద్దరూ చాలా దూరం వెళ్ళేరనిపించింది" అన్నాడు.

"చాలా దూరం వెళ్ళడం" మాట వినగానే కామేశ్వరరావు ఉలికిపడ్డాడు.

"అటువంటిదేమీ లేదండి" అన్నాడు.

రఘురామయ్య చిరునవ్వు నవ్వేడు.

"ఏదో తొందరపడ్డారని కాదు. పెళ్ళి నిర్ణయానికి వచ్చిఉంటారనిపించింది".

కామేశ్వరరావు ఆయన చూపులను తట్టుకోలేక తల దించుకొన్నాడు.

"ఔను"

"అంటే నువ్వు ఆ అమ్మాయికి - ముఖ్యంగా ఆ అమ్మాయికే హెచ్చు విలువ ఇచ్చేనన్నమాట. ఇప్పు డేదన్నా ప్రలోభంలో పడి అన్యథా చేసేవంటే జీవితంలో సుఖపడలేవు"

కామేశ్వరరావు తల వూపేడు.

"తనకోసమే, తానే కావాలని కోరే ఆడది దొరకడం మగవాడి అదృష్టం. ఆ అదృష్టాన్ని కాపాడుకో గలగడం ఓ సుకృతం" అంటూ రఘురామయ్య లేచేడు.

"వెళ్ళు, మనిషి తన విలువను ఎదుటి వాళ్ళలోనే చూసుకోగలడు" అన్నాడు.

కామేశ్వరరావు నిశ్శబ్దంగా ఆయన వెంట నడిచేడు. రోడ్డు మీదికి వచ్చేక ఆగి, ఓ ప్రశ్న వేసేడు.

"నేను పిలుస్తాను. సాక్షిగా వుంటారా?"

"రిజిస్ట్రారు ఆఫీసులోనా?"

కామేశ్వరరావు తల వూపేడు.

"తప్పకుండా..."

"థాంక్సు!"

"పెళ్ళిగ్రాం ఇయ్యి, ఒక్కమాట. నే వచ్చేస్తా"

"థాంక్సు!"

## 7

సుముహూర్తం అయిపోగానే నరసింహమూర్తి వెళ్ళిపోడానికి సెలవు తీసుకొన్నాడు. అంత హడావిడిలో కూడ సుబ్బారాయుడు ఒక్క క్షణం దృష్టి ఇటు తిప్పేడు.

"ఈవేళనే అడుగుతా. కబురు చేస్తా"

నరసింహమూర్తి తన వేపు నుంచి అన్నీ మాట్లాడి నిర్ణయించుకొన్నట్లు చెప్పలేదు. చెప్పలేదు కూడా. తన కూతురు తన నిర్ణయాన్ని కాదనదని అతని విశ్వాసం. గతదినం అంతా రుక్మిణీ, కామేశ్వరరావూ ఒక్క చోటనే ఉన్నారు. వారితో ఇతరులూ ఉన్నారు. అదీ తమ పథకంలో ఓ భాగంగానే ఏర్పాటు. పెళ్ళి చూపుల పేరు పెట్టకుండా వారిద్దరికీ పరిచయం చెయ్యాలి. తర్వాత వారిని అడిగి సుముఖులుగా ఉంటే ముందుకు సాగాలని వారి పథకం, సుముఖత సంపాదించడం అన్నది వ్యావహారికమైన మినహాయింపు మాత్రమే. వధూవరుల తల్లిదండ్రులిద్దరికీ కూడ అనుమానం లవలేశం లేదు. ఇద్దరి మనస్సులలోనూ ముందడుగుకే ఆలోచనలు మెదులుతున్నాయి. కబురుచేస్తానన్నది కేవలం వ్యవహార ధర్మంగా చెప్పింది మాత్రమే. నరసింహ మూర్తి "ఈ లోపున అడుగుతా" అన్నాడు.



BRAOU

సుబ్బారాయుడు తన భార్యను పిలిచి వారు వెడుతూన్న వార్త చెప్పేడు.

"అప్పుడేనా అన్నయ్యగారూ! ప్రొద్దుటే ఫలహారం తీసుకొనిగాని వెళ్ళడానికి వీలు లేదు" అంటూనే ఆమె ఒక కొబ్బరికాయా, ఇన్ని పువ్వులూ, తాంబూలమూ రుక్మిణి చేత పెట్టింది.

పెళ్ళికి ఎవరో వేసుకొచ్చిన టాక్సీ మాట్లాడుకొని నరసింహమూర్తి బయలుదేరేడు.

* * *

కారుదిగగానే రుక్మిణి వెళ్ళి మంచానికడ్డపడింది.

సుందరమ్మ పెళ్ళివిశేషాలు తెలుసుకోగోరింది. నరసింహమూర్తి చిరునవ్వుతో – "మువ్వీపాటికి ఏర్పాట్లలో ఉండొచ్చు" అన్నాడు.

"అమ్మాయిని కదిపేరా? ఆ కుర్రవాడు ఏమన్నాడు?"

"నీకు సందేహం ఎందుకోయ్! నిన్నమేం వెళ్ళింది లగాయతు ఆ అబ్బాయి రుక్మిణి అగల్‌బగళ్ళనే ఉన్నాడు. సుధ ఉంది. రామచంద్రరావు ఉన్నాడు. ఒకటే మాటలు. కాలేజీలు, చదువులు, హాస్టళ్ళు, భోజనాలు, కులాలు, పెళ్ళిళ్ళు – ఒకటేమిటి? సర్వం చర్చల్లో దొర్లిపోయాయి. రామచంద్రరావున్న చోట చర్చ కట్టుబడుతుందా? ఆ భయం అక్కర్లేదు. దానికి తోడు మన ఆలోచన కూడా చెవిని వేశాను.

"ఏమన్నారు?"

"బాగా సంపాదించినట్టున్నావు అన్నాడు. బహుశా సుబ్బారాయుడుగారు మాటల్లో తేలేరోఏమో!"

"మరేం అనలేదూ."

ఆమె ప్రశ్న వేరు. గడిచిన రోజున రామచంద్రరావు రుక్మిణి పెళ్ళి విషయమై ఒక సూచన చేసినట్లు భర్త చెప్పేడు. మరోచోట ఆమెకు వివాహాలోచన సాగుతున్నట్లు చెప్తే, ఆయన ఏమన్నాడన్నది ఆమె ప్రశ్న.

"ఇంక ఆ ఆలోచన పెట్టుకోవద్దని చెప్పడమేగా ధాని అర్థం" అన్నాడు నరసింహ మూర్తి.

ఈమారు సుందరమ్మ తన కూతురు ఆ కూటం మధ్య ఎలా వ్యవహరించిందో అడిగింది.

"ఇది మూగదయ్యంలా మాటా మంతీ లేకుండా కూర్చుందా, వింటూ? తాను కూడా మాట కలిపిందా?"

"సమాన వయసువాళ్ళు నలుగురు ఒకచోట చేరుతే మాటలు వాటంతటవే పుట్టుకొస్తాయి. పైగా రామచంద్రరావు రాతిబొమ్మచేత మాట్లాడిస్తాడు. అంతసేపూ నేను వాళ్ళ వద్ద లేను. కాని, విన్నంతవరకూ రుక్మిణి కూడా వాళ్ళతో సమంగా, సరదాగా సంతోషంగా మాట్లాడుతుంది. వచ్చేటప్పుడు ఆ అబ్బాయి స్వయంగా రుక్కును సాగనంపేడు".

* * *

మధ్యాహ్నం, నిద్రపోయి లేచిన తండ్రికి కాఫీ తీసుకుని రుక్మిణి మేడమీదికి వచ్చింది. అతడప్పటికే ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. ఆమెనుచూస్తూనే వానిని పక్కకు నెట్టేశాడు. "రా, కూర్చో" అంటూ టేబుల్‌ఫాన్ మీట నొక్కేడు. అది గదిలో సగభాగాన్ని పర్యవేక్షిస్తూ తిరగసాగింది.

"నిన్న నీ కేమన్నా తోచిందా? నా మట్టుకిమాత్రం పెళ్ళివేళకి వెడితే సరిపోయేది అనిపించింది" అని నరసింహమూర్తి ప్రారంభించేడు.

"తోచకపోవడానికేముంది? సుధఉండనేఉంది ఎరిగిందీ, స్నేహితురాలూ. మామయ్యగారున్నారు. పెళ్ళి కూతురు పెదతండ్రి గారుట–మేం వచ్చేటప్పుడే బండిలోకలిశారు. పరిచయం ఉంది. అబ్బో! ఆయన ఎన్ని కబుర్లుచెప్పారని! పెళ్ళికూతురులన్నగారు కామేశ్వరరావుగారని ఆయన ఉన్నారు. ఆయనా సరదా అయినవాడే ..."

"బాగానే గడిచిందన్నమాట. పోనీలే! సుబ్బారాయుడుగారు పదిమాట్లుచెప్పేరు. ఇంటికి వచ్చి పిలిచేరు. అమ్మరాలేనంది. పోనీ నువ్వు ఉన్నావుకదా అని లేవదీశాను".



BRAOU

తనను కూడా తీసుకెళ్ళడమూ, తన చదువూ సంధ్యా గురించి తెలుసుకొని స్నేహితులూ, పరిచితులూ అభినందిస్తూంటే ఆనందించడమూ తండ్రికిష్టం. ఆ సమయంలో తనకువచ్చినక్లాసులూ, తాను సంపాదించిన బహుమతులూ తాను మరచిపోయినవి కూడా ఆయన ఎంతో గుర్తుగా వర్ణిస్తుంటాడు. ఒక్కొక్కప్పుడు అవన్నీ గొప్పలు అనిపించి సిగ్గు కలుగుతూంటుంది ...." "అవన్నీ ఇప్పుడెందుకు నాన్నా" అని నిరుత్సాహ పరచ బోతుంది. కాని ఆయన వినిపించుకోడు. ఆయనతో వెళ్ళి ఆ అభినందనలు వింటూండడం తనకూ బాగానే ఉంటుంది. కనక, ఆయనతో వెడుతూడడం తనకూ ఇష్టమే. అలాగే నిన్న ఆయన రమ్మన్నాడు కూడా వెళ్ళింది. అదంతా తమ ఇష్టానికి భిన్నంగా జరిగిందనుకోడమూ బాగానే ఉంది.

"సుధను మామయ్యగారికి పరిచయం చెయ్యాలని కదా కొంచెం పెదరాళే వెళ్ళాం" అంది. అతడామెకు చెప్పిన కారణం అదే.

"ఏమనుకున్నాడు, ఇంతకీ?" అని నరసింహమూర్తి ప్రశ్న.

"సుధనుగురించి ఏమనుకోవడానికి ఏముందినాన్నా! దానికితెలివి, అందం మంచితనం అన్నీఉన్నాయి".

తన కూతురు మెచ్చుకోలులో తన ప్రయత్నాలకు విఘాతం వినిపించింది మూర్తికి.

"మంచితనం అనడంకన్న వెర్రిబాగులతనం అంటే బాగుంటుంది. పెద్ద అందగత్తెకూడా కాదు. అయితే కళ్ళు ఆ మొహానికి ఆకర్షణ నిస్తాయి. తెలివీ అసాధారణంకాదు. సామాన్యం గాని ..." అన్నాడు.

తండ్రి అసూయకి రుక్మిణి నవ్వింది. ఆమె అభిప్రాయం అర్థం అయి మూర్తీ నవ్వేడు. అయితే తనని సమర్థించుకొనే ప్రయత్నం మానలేదు.

"తెలివి, అందం, మంచితనం అన్న వాటికి ఎవరి అర్థాలు వారివి. అందుచేత వదిలెయ్యి. నువ్విన్ని చెప్తున్నావు. కామేశ్వరరావును గురించి నువ్వేమంటావు?"

"మంచి పర్సనాలిటీ" అందిమెచ్చుకోలుగా. ఆమెకు ప్రధానంగా కనిపించిందదే. నరసింహమూర్తి అభిప్రాయాలకామెచ్చుకోలు అనుగుణంగానేఉన్నా అంతతృప్తి కలగలేదు. ఇంకా చెప్పమన్నట్లు ప్రోత్సహించేడు.

"సందేహం ఏం ఉంది? అది ఆకారం. మరి మనిషి ఎలాంటివాడు?"

"ఒక్క గంట పరిచయంతో ఏం చెప్పగలం. సంస్కారం గలవాడేననిపించింది. మంచివాడనీ, నమ్మ తగినవాడనీ మాటల సందర్భంగో సుధ అంది."

మళ్ళీ సుధ. సుధ అభిప్రాయంగా అతని గుణాలను పేర్కోవటం మూర్తికి నచ్చలేదు. కాని పైకేమీ అనలేదు.

"సుధకేం తెలుసు?"

"ఒకప్పుడా రెండిళ్ళవాళ్ళూ ఇరుగుపొరుగున ఉండేవారు. గత రెండేళ్ళ నుంచీ ఆయన చెల్లెలూ, సుధా ఒకే కాలేజీలో ఉద్యోగం; ఒకే ఇంట మకాం. కామేశ్వరరావుగారితో దానికి బాగా పరిచయం ఉంది."

"ఓహో" - అన్నాడు మూర్తి. రుక్మిణిని ఇంకా కదిలించాలని మరో ప్రశ్న వేశాడు.

"వట్టి పర్సనాల్టీయేనా? చదువు కూడా ఉందా? సుబ్బారాయుడు ఏదో చెప్పేడు గాని ..." తానేమీ ఎరగనట్లు నటించే ప్రయత్నం అది.

రుక్మిణికి తండ్రి ఆలోచనల సడి ఇంకా తగలలేదు. మామూలుగా అడుగుతున్నట్లే భావించింది.

"ఇంజనీరింగు కాలేజీలోఉద్యోగంలో ఉన్నారట నాన్నా!"

"ఉద్యోగానికేముంది? బంట్రోతు, గుమాస్తాగాళ్ళదీ ఉద్యోగమే. లెక్చరర్లూ, ప్రొఫెసర్లదీ ఉద్యోగమే. ఈ రోజుల్లో సుబ్బారాయుడు లాంటి వాళ్ళు తలుచుకుంటే అక్షరాలు వరసగా చెప్పలేని సన్యాసీ, మనసు మంచీ మాట మన్ననా ఎరగని దగుల్బాజీ కూడా హోదా గల వ్యక్తి అయిపోవచ్చు. దానికేముంది? ఇంతకీ ఏం చదువుకున్నాడని గాని ..."

"ఎమ్. టెక్. కాబోలునన్నారు"

"అయితే లక్షరూపాయల పెళ్ళికొడుకే ..." అన్నాడు.



BRAOU

"ఇచ్చేవాళ్ళుంటే లక్షేం ఖర్మ ..." అంది రుక్మిణి నిరసనగా.

"ఉంటే" అన్నదోమాట! ఇస్తున్నారు, ఇవ్వక తప్పుతుందా? మేము ఇవ్వము అంటే దానికేం? పోనివ్వండి. ఇవ్వగలంతతోనే మీ ఉజ్జీ వెతుక్కోండంటారు. అవసరం ... అయితే సుబ్బారాయుడు కూతురూ, కొడుకూ కూడ బాగా చదువుకున్నవాళ్ళేనన్నమాట ..."

తండ్రి మాటలకు సమాధానం అవసరం అనిపించలేదు. రుక్మిణి వూరుకుంది. నరసింహమూర్తి ఏదో ఆలోచనలో ఉన్నట్లూరుకొని మళ్ళీ మొదలెట్టేడు.

"మంచి వాడేనని సుధ కితాబు ఇచ్చిందన్నమాట"

"అది ఆయన్ని తెగమెచ్చుకుంటుంది"

"అయితే వాళ్లనాన్నని కదపమంటావేమిటి?" అన్నాడు చిరునవ్వుతో వోరగా చూస్తూ, హాస్యం అన్నట్లూ గాకుండా, యదార్థం అన్నట్లూ గాకుండా.

"మేస్టార్నా? చంపేసేరు" అంది రుక్మిణి కంగారుగా, కళ్ళు విప్పార్చి

మూర్తి తన ప్రశ్నకు అటువంటి అర్థం వచ్చినందుకు నొచ్చుకున్నాడు.

"అబ్బే! మేస్టారినేమిట? సుబ్బారాయుడుగారినే ..."

రుక్మిణి ఈమారు ఉలికిపడింది.

"ఏమని"?

ఏమని కదపడమో ఆమెకు అర్థం కాకపోలేదు. ఇంతవరకూ తండ్రి నడిపిన సంభాషణధోరణి అర్థం అయింది. తనను పెళ్ళికి తీసుకెళ్ళిన కారణమూ అనుమానంగా తోచింది.

"ఏమనేమిటి? కొడుక్కి ఇంకా పెళ్ళి తలపెట్టవా అని. నీకు కుర్రాడు నచ్చేడుకదా" నరసింహమూర్తి సాధ్యమయినంతగా స్వరం హాస్యధోరణిలో నడిపేందుకే ప్రయత్నించేడు.

ఈడుజోడయిన, ఆరోగ్యవంతులయిన యువతీయువకులు ఒకచోట తటస్థపడినప్పుడు ఆకర్షణ కలగటంసహజం. కలగక పోవడం అసహజం. అందులోనూ పెళ్ళిళ్ళూ పేరంటాలూవంటి చోట కలిసినప్పుడు చటుక్కున మనస్సు ఎన్నికనే ప్రారంభిస్తుంది. అలాగే జరిగింది. పెళ్ళి పందిట్లో అడుగు పెట్టింది మొదలు తిరిగి కారులో కూర్చుంటేంతవరకు కామేశ్వరావు ఆమె వెంటనే ఉన్నాడు. మాటలలో, మర్యాదలలో, ఆకారంలో బాగా ఆకర్షించేడు. అయితే దాని నామె బయట పెట్టే స్థితిలో లేదు. ప్రస్తుతం వెలిబుచ్చిన ఆ శంక దాని బాహ్యరూపం మాత్రమే. మరల అంతలో సర్దుకుంది.

"అటువంటి పనేదీ చెయ్యకండి"

ఆమె కంఠంలో అయిష్టం కన్న నిరాశ ఎక్కువ వినిపించినట్లయింది.

"ఏం?" అన్నాడు.

"కారణాలు అనవసరం అనుకుంటాను. మీరు అటువంటి పనేదీ చెయ్యకండి" అనిమరో మారు హెచ్చరించింది. మూర్తి ఒక్క నిముషం వూరుకున్నాడు.

"నిన్నరాత్రి సుబ్బారాయుడుగారే అన్నారు. ఈ ప్రసక్తి తెచ్చింది ఆయనే"

రుక్మిణి ఏమీ అనలేదు.

"మనం బయలు దేరేటప్పుడే ఈ మాట అన్నారు. కొడుకుతోమాట్లాడే ఈ మాట అని వుంటాడను కొన్నా" అని తన వివరణ సాగించేడు.

అది అబద్ధమే అయినా, తానీ విషయంలో కూతురుతోసంప్రదించకుండా ముందడుగు వేసినట్లు కనబడరాదని ఆ మాట అన్నాడు. కాని, అంతలో మార్గం మార్చుకొన్నాడు.

"మిమ్మల్నిద్దర్నీ యథాలాపంగా సమ్ముఖాన పెట్టి, మీఇష్టం ప్రకారం ముందడుగు వేయాలనుకొన్నాం" అంటూ తమ ఏర్పాట్లను ఒప్పేసుకున్నాడు.

"అయితే నేను నీ మెడలు వంచదలుకోలేదు సుమా. నీ నిర్ణయాలు నీవి. అయినా ..." ఒక్క నిముషం ఆగి మళ్ళీ ప్రశ్నించేడు.

"అయితే అతడు డాక్టరేట్ సంపాదించలేదనే ..." అర్థోక్తిలో ఆగేడు.

'అబ్బే! అటువంటిదేమీ లేదు. ఆయన చదువు తక్కువదేం కాదు" అంది

"అతడు పెద్ద అందగాడు కాదేమో ..."

దానితో 'అందం అనేది ఒక్కొక్కరికి ఒక్కొక్కవిధంగా అనుభూతం అవుతుం'దని వివరణప్రారంభించేడు

"తాను వలచినది రంభ, నాకళ్ళు పెట్టుకు చూడు వంటి భావ సంపుటులకుమూలం అదే" నన్నాడు.

చిరునవ్వుతో రుక్మిణి "అదేం కాదు" అంది.

"మరి"

"ఏమీ లేదు" అంది.

"కట్నంవగైరా వ్యవహారాలు మనస్సులో పెట్టుకోకు. పెద్దవాళ్ళం ఏదో చూసుకుంటాం. మీరు సంతృప్తిగా జీవించడం మాకు కావలసింది. సుబ్బారాయుడుగారూ అదే అన్నారు. 'కట్నం పుచ్చుకోకూడదనే నియమం నాకులేదు. డబ్బు ఎవరికి చేదు? కాని మావాడు బాగా చదువుకున్న పిల్ల కావాలన్నాడు' అన్నారు. నీ సంగతి ఆయన విన్నారట. 'చదువు ఓ డిగ్రీ తక్కువైతే మాత్రం ఏం? ఇష్టమయితే' అనోమారు అన్నావు గుర్తువచ్చింది. సరే చూదామనుకున్నాను. ఈ పెళ్ళీ నీ పుట్టిందినమూ దగ్గరలో కలిశాయి. ఆ పేరున నిన్ను రమ్మన్నాను. వచ్చావు. చూసేవు. పిల్లవానిది మంచి పర్సనాలిటియే అన్నావు ..."

"బాగున్నాడంటే పెళ్ళి చేసుకోవలసిందేనా?" అంటూ రుక్మిణి తోసేసింది.

ఆమెను బెదరగొట్టతలుచుకోలేదు తండ్రి.

"మిగిలిన లక్షణాలు కూడా బాగున్నా యన్నావు ..."

"ఔను"

"మరి ..."

రుక్మిణి తన అభిప్రాయాన్ని బయటపెట్టడం ఇష్టంలేక డబాయింపు పద్ధతి ననుసరించదలచింది.

"నా ఆలోచనలను ఇన్‌ఫ్లుయెన్స్ చేసే ఉద్దేశం లేదంటూనే మరీ ప్రశ్న లేమిటి?" అంది గడుసుతనంగా.

కూతురు సమాధానం చెప్పకుండా తప్పించుకొంటున్నదని నరసింహమూర్తికి అర్థంఅయింది. నవ్వేడు.

"నీ ఆలోచనలు తెలుసుకోవడం వరకే నా ఉద్దేశం" అంటూ ఒక్క నిముషం ఆగేడు.

"మీరు నచ్చినవాణ్ణి మీరు ఏరుకుని, 'ఇదిగో నాన్నా, ఈయనగారు నాకు నచ్చేడే, అని చెప్పేస్తే పెళ్ళి చేసేస్తాం. అలాగాక ఏ రిజిస్ట్రార్ ఆఫీసుకో మీరే వెళ్ళిపోయి పెళ్ళి చేసేసుకున్నాం అంటారూ? మరీబాగు. ఒక విందు చేసేస్తాం. తల తడిమి చూసుకుంటాం. అలాకాదు. ఇదిగో ఫలానా ఫలానా లక్షణ సమన్వితుణ్ణి చూసి తీసుకురాండి, చూద్దాం అంటారూ, అదీ మంచిదే. అలాంటప్పుడుంది చూసేవా? ఆ వరుడిని మేము ప్రేమించగలుగుతే తప్పేమీ కంట బెట్టం ..."

తనకు భర్త కావలసిన వానిని తన తండ్రి ప్రేమించవలసిన ఉంటుందనే భావనకు రుక్మిణి నవ్వింది.

"ఆ కుర్రవాడి మనస్సులో మరెవరన్నా ఉన్నారేమో జాగ్రత్తగా చూసుకొని తర్వాత ప్రేమించ పూనుకుంటే నిరుత్సాహపడవలసిన అవసరం ఉండదు"

నరసింహమూర్తి హాస్యధోరణి టక్కున కట్టుబడింది. "అంటే" అన్నాడు పైకి. "వెనకాల పెద్దకథే ఉందన్నమాట" అనుకున్నాడు మనస్సులో.



BRAOU

తండ్రి ఆలోచనలను అతని కళ్ళలోనే చదివి రుక్మిణి లేచింది.

"ఇల్లాంటివి నోటితో చెప్తేగాని అర్థంగావా? చిన్న చిన్న సహాయాలూ, శ్రద్ధలూ, చూపులూ, హావ భావాలూ పట్టి అర్థంచేసుకోవచ్చు నాన్నగారూ" అంది.

పుస్తకాలు తప్ప మరో ప్రపంచం ఎరుగదనీ, ప్రపంచరీతులు తెలియవనీ అనుకుంటున్న కూతురు మాటలలోని ప్రాగల్భ్యం నరసింహమూర్తిని ఆశ్చర్యపరచింది. నమ్మలేక పోయాడు.

"నీది వట్టిభ్రమ అయిఉంటుంది. అటువంటిదేమన్నా ఉంటే తండ్రితోచెప్పడా? తెలుస్తే ఆయనీ ప్రయత్నాలెందుకు చేస్తాడు?"

'అదేం మాటలండి! చెప్పడానికి అదను కలగకపోవచ్చు. ఇతర కారణాలుండొచ్చు. ఏం చెప్పగలం?"

రుక్మిణి అంతకన్న ముందుకు పోదలచలేదు. నరసింహ మూర్తి ' అమ్మాయి ఎవరయి ఉంటుందా' అని ఆలోచిస్తూండగా ఫోన్మోగింది.

"ఎవరు? రామచంద్రం. వెళ్ళేలోపున ఓమారు మళ్ళీ కనిపిస్తావా? అదే పోతా? ... ఓ మారు వెళ్ళి రమ్మంటావా? ... ఆఁ పనేం లేదులే ... ఇప్పుడే బయలుదేరుతా. నే వచ్చేవరకూ ... అల్లాగే".

ఫోన్క్రింద పెట్టేశాడు.

"ఏమంటారాయన? సుధను గురించి మాట్లాడిరమ్మంటారా?"

మూర్తి తలతిప్పేడు. రుక్మిణి నవ్వింది.

"కళ్ళున్న కబోదులు"

కామేశ్వరరావు మనస్సులోఉన్న అమ్మాయెవరో అర్థమయిందనిపించింది, మూర్తికి. "సుధా" అన్నాడు.

ఇంక దాచవలసిన పని లేదన్నట్లురుక్మిణి తలతిప్పింది. మూర్తి ఒక్క నిముషం ఆలోచించేడు, నమ్మలేదు.

"నీది వట్టి భ్రమ"

దానిని కాదనవలసిన అవసరమూ కనిపించలేదు రుక్మిణికి.

"పోనీండి, మంచిదే కదా"

ఆ మంచికి అర్థం ప్రయత్నించి చూడమన్నట్లుగా వేసుకొని, మూర్తి తన అభిప్రాయానికి కారణాలు వివరించసాగేడు.

సుధ బ్రాహ్మల అమ్మాయి. వాళ్ళ నాన్నగారు పరమఛాందసులు. అసలటువంటి అనుమానం తోస్తే కృష్ణలోతు చూసేస్తానని కూర్చుండే మనిషి.

రెండోవేపున సుబ్బారాయుడు డబ్బు మనిషి. పైకి ఎన్ని చెప్పినా, కులాంతరానికి తలొగ్గినా మాస్టారి వద్దేముంది, మన్ను!

అది జరిగే పని కాదు. తండ్రిని ధిక్కరించి వ్యవహరించగల సాహసం కుర్రవాడికి ఉండదు. అది అతని ఖచ్చితమైన అభిప్రాయం.

* * *

"రాండి. మీరు కూడా కూర్చోండి. ఏదీ సుధ. ఆమెను కూడా పిలవండి. కొంచెం ముఖ్యమైన పనిమీదే వచ్చేను." అంటూ నరసింహమూర్తి మంచినీళ్ళ గ్లాసు క్రింద పెడుతూ రాఘవమ్మను పిలిచేడు.

"ముఖ్యమైన పని ఏదోఉందని మీరు ఈ బండిలోరావడమే చెప్తూంది. కూర్చోండి కాస్సేపు. పని ఎక్కడికి వెడుతుంది?" అంటూ హనుమంతరావు చేతిలోని విసినకర్రను అతని ముందు పెట్టి తా నింకొకటి తెచ్చుకొన్నాడు.

పొద్దువాటారినా ఇంకా ఎండ తగ్గలేదు. ఇంత ఎండలో వూరి మూలనుంచి ఈ మూలకి వచ్చేరంటే అదేదో చాల ముఖ్యమైన పనే అయి ఉండాలి, చెప్పండి" అంటూ కూర్చున్నాడు. రాఘవమ్మ గుమ్మంలో నిలబడింది. 'వెళ్ళవే, మామయ్య రమ్మంటున్నా'రని తన పక్కకు వచ్చి నిలబడ్డ సుధను లోపలికి వెళ్ళమంది. ఆమె గదిలో అడుగుపెడుతూ 'రుక్మిణి రాలేదా?' అంది.

"మీ స్నేహితురాలి పెళ్ళి చేయించడానికి నువ్వు వెళ్ళేవు. నీ పెళ్ళికి అది రావాలి. అంతేగాని వట్టినే రావడం రిక్షాబాడుగ దండుగ" అని మేలమాడేడు మూర్తి.

"మరి దాని పెళ్ళి కెవరు వెళ్ళాలి? అది కూడా పూర్తి చేయించాలికదా".

రాఘవమ్మ కూడా మాట కలిపింది.

"మీ చేతిలో ఉన్న పని. ఓ కుర్రాణ్ణి చూసిపెట్టండి. మేష్టారు ఎల్లాగూ చూడలేరు".

"ఒక మంచి సంబంధం వచ్చింది. చూస్తారా మరి" అన్నాడు మూర్తి కవ్విస్తూ. సుధ నిర్విణ్ణయ్యి కూర్చుండి వింటూంది.

"ఇప్పుడు పెళ్ళిళ్ళు చేసేలాగే వుంది మాపని ...." అన్నాడు హనుమంతరావు నిరాశగా.

"ఇంతకంటే మన కాపురం చెడేదీ లేదు. బాగుపడేదీ లేదు. మంచి సంబంధం అయితే చూడండి. తల తాకట్టు పెట్టయినా చేసేస్తాం. ఆడపిల్లని ఎంతకాలం అట్టే పెడతారు?" అని రాఘవమ్మ మగణ్ణి నిలదీసింది.

దంపతుల్ని సర్ది కార్యసాధన జరిగించే ధోరణిలో మూర్తి హనుమంతరావును వెనకేసుకు వచ్చినట్లు మాట్లాడేడు.

"మంచి సంబంధాలేవీ తటస్థపడకగాని మేష్టారుమాత్రం వూరుకున్నారా? ఆ మధ్య ఏదో సంబంధం గురించి చెప్పేరు. తరవాత కలియనేలేదు. బహుశా కుదరలేదు కాదూ, మేష్టారూ" అన్నాడు.

"కుదిరితే మీదాకా రాకుండానా?" అన్నాడు హనుమంతరావు. "దీని గొడవగాని, పెళ్ళి అంటే ఎన్ని చూడాలి?"

"ఎవరా కుర్రాడు అన్నయ్యగారూ" రాఘవమ్మ సంభాషణను దారికి తెచ్చింది.

"పిల్లవాడు అమెరికాలో చదువుకు వచ్చేడు" అంటూ మూర్తి వరుని గుణగణాలను వరసగా చెప్పడానికి పూనుకున్నాడు. కాని, ఆ [illegible] లక్షణం వినగానే ఆ దంపతులిద్దరూ పెదవి విరిచేశారు.

"మనం తూగలేం" అన్నారిద్దరూ ఏకకంఠంగా. నరసింహమూర్తి వారి అభ్యంతరాన్ని లెక్కచేయలేదు.

"ఉద్యోగం మద్రాసులో. ఎందులో ఏమిస్తారనేది వివరంగా చెప్పలేను, తెలుసుకోవచ్చు. జీతం రమారమి ఏడెనిమిది వందలుంటుంది. వయస్సు ఇరవయ్యేడూ, ఇరవయ్యెనిమిదికి మించవు. అతనిని చిన్నప్పుడెప్పుడో చూసేను. ఈమధ్య చూడలేదు. మీరే చూసుకోవచ్చు ...."

"హాస్యమాడుతున్నారేమిటి అన్నయ్యగారూ! అటువంటి సంబంధం ...." రాఘవమ్మ ఒక్క నిట్టూర్పు విడిచింది. "రాఘవమ్మగారూ! మీవద్ద హాస్యం ఆడుతానా? నిజానికి ఆ కుర్రవాడి తండ్రిని మేష్టారు నిన్న చూశారు. మాట్లాడేరుకూడాను. రామచంద్రరావు మాటండీ ...."

గతదినం మాటల సందర్భంలో రామచంద్రరావు తన కుటుంబం గురించీ, పిల్లలూ పిల్లల చదువులు గురించీ చెప్పిన మాటలు హనుమంతరావు జ్ఞాపకం చేసుకున్నాడు.

"వారి పిల్లవాడిని గురించా? మనం ఎక్కడ తూగగలం?" అన్నాడు.

"అవన్నీ పెట్టుకోకండి. అతడు నాకు కావలసిన స్నేహితుడు. నేనూ మీతో వస్తాను. ఇంతచక్కని సంబంధం ఎదుటవుండగా అతడు ఎల్లా కాదంటాడు? అననిస్తామా? కులాంతరం అంటాడేమోననిగాని రుక్మిణికి కుదర్చలేకపోయానా? మీ కితర విషయాలు అనవసరం. పిల్లను చూసుకుంటాడు, కొడుకును పంప మనండి. తరవాతి వ్యవహారం నాకు వదిలెయ్యండి" అంటూ నరసింహమూర్తి ఏకబిగిన బండి తోలేడు.

"ఆయన సరేనంటే నేను పెళ్ళయినాచేసే స్థితిలో లేనే" అని హనుమంతరావు తల వేలవేశాడు.



BRAOU

"అంతవరకూ వస్తే మేమంతాచూస్తూవూరుకుంటామా మేష్టారూ? మాకుసుధొకటీ, రుక్మిణొకటీనా?" అంటూ మూర్తి హుషారు ఇస్తున్నా మేష్టారి ముఖంలో ఉత్సాహం కనబడలేదు.

అంతదిలాసా ఇస్తున్నా నీరుకారిపోతున్న మగణ్ణిచూస్తూ రాఘవమ్మ అంగలార్చింది.

"నేనేమి చేతునమ్మా!"

"నేను ఇంతకంటె ఏం చెప్పను? తరువాత మీ యిష్టం" అని మూర్తి విసుగు కనబరిచేడు. రాఘవమ్మకు ఏదో కుట్టినట్లయింది. నెమ్మదిగానే అడిగింది.

"ఆయన ఏంచెయ్యాలని మీ ఉద్దేశం?"

"మీకు నేను చెప్పాలా అక్కయ్యగారూ! ఎంత స్నేహితులమైనా పెళ్ళి విషయం వచ్చేసరికి మేము పై వాళ్ళమేకదా. పిల్లతరపున కావలసినవాళ్ళొకరువచ్చి 'అయ్యా! మా అమ్మాయి ఉంది, పెళ్ళికి, మీ కుర్రాడిని పంపండి. ఇరుపక్షాలకీ నచ్చితే వివాహం కానిద్దాం అని ఒక్కమాట అనేస్తే తరవాత మేం అందుకుంటాం. అసలు సంబంధం ఉందని తెలిస్తే బోలెడు ఖర్చుపెట్టుకొని తిరగవలసివస్తున్న ఈ రోజుల్లో, వూళ్ళోకి వచ్చి, ఎంచయంకూడా ఏర్పడ్డ మనిషితో చెప్పడానికి ...."

"ఆయన ఊళ్ళో ఉన్నారా?" అంది రాఘవమ్మ, ఏదో నిశ్చయం చేసుకొన్నట్లు. "నడవండి. మగదిక్కు లేదు కాబోలు ననుకొంటాడు. నేనే చెప్పివస్తా" అంది. కసిగా మగనివంక చూస్తూ.

"జరుగుతుందనే ఆశవుందంటారా" అన్నాడు హనుమంతరావు నీరసంగా.

"జ్యోతిషం చెప్పగలమా మేష్టారూ! పిల్లకు నచ్చాలి, పిల్లవానికి నచ్చాలి. పూర్వకాలంలో మాదిరిగా ఇరుపక్షాలా పెద్దలు మాట్లాడేసుకొని తాంబూలాలు పుచ్చుకోడంతో పూర్తికాదుకదా".

"తీరా అడిగి వెలితిపడడం అవుతుందేమోనని" - అంటూ హనుమంతరావు నసిగేడు.

"తీరాచేసి చూడవచ్చిన పిల్లవాడు సుధకే నచ్చకపోతే ....

హనుమంతరావు నిరుత్తరుడయ్యేడు.

"మగవాడికి అందం ఏమిటిలెండి" - అంది రాఘవమ్మ - "చదువూ, ఉద్యోగం, ఆరోగ్యం ఉంటే మా సుధమ్మ కాదనదు" - అని తన తరపునకూడా తల్లి హామీయిస్తున్నా సుధ ఏమీ అనలేదు.

"ఏమిటమ్మా! నువ్వూరుకున్నావు?" అని మూర్తి రెచ్చగొడుతున్నా, ఆమె నీరసంగా మందస్మితం చేసింది.

'నాన్నా, అమ్మా కన్న నా కెక్కువ తెలుసునా?" అంది. ఏమనుకున్నాడో హనుమంతరావు, లేచేడు.

"పైపంచవేసుకు వస్తున్నా, వెడదాం".

"దగ్గరలో ఫోన్ ఎవరికన్నావుందా? నా స్నేహితుడు మళ్ళీ ఎక్కడికీ పోకుండా ఉండమనిచెప్తా. చల్లబడింది కాదూ, ఎటన్నా వెడితే మన ప్రయాస వృథా అవుతుంది" అంటూ మూర్తిలేచేడు. "సుధా! నాతో రామ్మా" అని శర్మగారింట్లో ఫోన్ ఉండాలి కదూ" సాయం పిలిచేడు.

"వెళ్ళు తల్లీ", అని రాఘవమ్మ కూతురిని పురమాయించింది. "ఆయన ఇప్పటికే ఎక్కడికన్నా వెడితే, వచ్చేక మీరు ఉండి ఈ పని పూర్తిచేయ్యాలి" - అంది.

"మధ్యాహ్నం మాట్లాడేను సుమండీ. సాయంకాలం ఐదుగంటలవరకూ గదిలో ఉంటాను రమ్మన్నాడు. అప్పుడు నాకీ ఆలోచనే తోచలేదు. కట్నం ఏమీ అక్కర్లేదు. మంచి సంప్రదాయంగల చదువుకున్న అమ్మాయిని చూడమన్నాడు కొడుక్కి. ఎవరున్నారు మన ఎరికని .- అని ఏదో యధాలాపంగా, కాఫీ త్రాగుతూ మా ఆవిడతో అన్నాను. ఆమె సుధకంటె మంచి అమ్మాయి ఎవరండీ అంది. ఆ మాటలు మరిచి నందుకు లెంపలేసుకుని, టపీమని రిక్షా ఎక్కేను. అసలు నేనే మాట్లాడేసి ఒక కొలిక్కి తెచ్చేటంత చనువూ, అధికారమూ ఉంది. కాని, చూడండి, ఇది పెళ్ళి వ్యవహారం. అందులో మగపెళ్ళివారు. 'హారేవచ్చి చెప్ప కూడదా' అని కాస్త అభిమానం మనస్సులో పొటమరించిందా, అంతా చెడిపోతుంది".

BRAOU

"కాదామరి", అంటూ రాఘవమ్మ భర్తను సన్నాహం చేసి పంపడానికి లోపలికి వెళ్ళింది.

సుధ నరసింహమూర్తితో వీధిలోకి వచ్చింది. ఈ ప్రతిపాదన ఆమె కుత్సాహకరంగా లేదని అతడు గ్రహించడం కష్టంకాదు.

"ఏం అల్లా వున్నావు" అన్నాడు.

సుధ చటుక్కున అంది. "ఇప్పుడీ ప్రయత్నం నాకిష్టంలేదు".

సుధ మనోగత భావాలను గురించి తన కుమార్తె వూహలు నిజమేననిపించింది. కాని అది జరిగే పని కాదు. రెండు కుటుంబాల జీవితం దుఃఖభాజనం అయిపోతుంది. మిత్రుడై అటువంటి ప్రమాదాన్ని ఎరిగెరిగి జరగనివ్వడం మహాపరాధం అని తన శ్రద్ధకు ప్రత్యేక కారణాన్ని కల్పించుకొని నరసింహమూర్తి తన మనస్సును సమాధాన పరుచుకున్నాడు. పైగా రామచంద్రరావు సుధను తన కోడలుగా ఎన్నుకొన్నాడు. అంతకన్న మంచి సంబంధం సుధకు సాధ్యంకాదు అనే విశ్వాసం మూర్తిది.

"కారణం ఏమన్నా ఉందా? అదీగాక, ఇప్పుడే ఏదీ నిర్ణయం వెయ్యడంలేదు. నువ్వు సరేనంటే తప్ప నిర్ణయం జరగదు. పిల్లవాడిని చూడు. దానికేం ...." అన్నాడు తన ఆలోచనలను దాస్తూ.

"నేను పెళ్ళి చేసుకు వెళ్ళిపోతే ఈ కుటుంబం గతి ఏంకాను?"

నరసింహమూర్తి నవ్వేడు.

"అందుకోసం పెళ్ళి మానేస్తావా?"

సుధ ఏమీ అనలేదు. నరసింహమూర్తి ఓ నిమిషం ఆగి సలహా ఇస్తున్నాట్లు నడిపేడు.

"ఆ ఆలోచన అంతమంచిది కాదేమో. అయినా, చిన్నబిడ్డవుకావు, చదువుకొన్నావు. ఆలోచించు. నీకూ వయస్సు వచ్చింది. అమ్మా, నాన్నా నీ పెళ్ళికి తొందరపడుతున్నారు న్యాయం అది". ఓ నిముషం ఆగి మళ్ళీ అన్నాడు.

"సరే, ప్రారంభించేను గనక ఇక్కడే జరిపిస్తే పెద్దవాళ్ళతో అపార్థాలు కలుగుతాయి కనక ...."

మళ్ళీ ఆగేడు. అంతలో సుధ ఏమనుకుందో "కానివ్వండి" అంది.

రామచంద్రరావు స్నానంచేసి, బట్టలు వేసుకుంటున్న సమయంలో, హొటలు హాలులో ఉన్న ఫోన్ వద్దకు పిలుపు వచ్చింది.

"మూర్తిగారట, పిలుస్తున్నారు సార్!" అంటూ హొటలు గుమాస్తా ఫోన్ అందించేడు.

"నేనేనోయ్" అంటూ రామచంద్రరావు తన ఉనికి తెలుపుకున్నాడు.

"స్నానం అయింది ... ఏ బేరేజీమీదికన్నా పోయి ఒక రౌండ్ కొట్టివద్దామని ... తప్పకుండా తీసుకుంటా ... ఎంతసేపట్లో రాగలరు? ... సరే, కనిపెట్టుకునివుంటా ..." తన గది నెంబరు చెప్పి ఫోన్ పెట్టేశాడు.

* * *

మూర్తి హనుమంతరావు మేష్టారితో హొటలుకి వచ్చేసరికి ఆరు కావస్తూంది. వారిని చూడగానే రామచంద్రరావు ప్రత్యుత్థానం చేశాడు.

"రాండి మేష్టారూ! పెళ్ళి అవడంతోనే మీరు వచ్చేసినట్లుంది. నిన్నటిరోజున మీ అందర్నీ కలుసుకోగలగడం ఓ సుకృతం. చాలా సంతోషంగా గడిచిపోయింది" అంటూనే బటన్ నొక్కేడు. దానిమీది వెయ్యి తియ్యకుండానే సర్వరు తలుపునెట్టి గుమ్మంలో నిలబడ్డాడు. "స్వీట్ ఏముంది?" అన్న ప్రశ్నకు సర్వరు ఓ చిన్నపాటి దండకం చదివేడు.

"ఏం తెప్పించుకుందాం" అన్నట్లు రావుగారి ముఖం వంక చూసేడు. హనుమంతరావు ఇరుకున పడ్డట్లు ముఖం పెట్టేడు.

"మేష్టారు ఏమీ తినరు. నాకు అవసరంలేదు" అని ఉభయుల తరఫునా నరసింహమూర్తే సమాధానం చెప్పేడు.



BRAOU

గత దినం సుబ్బారాయుడుగారింట పెళ్ళి సమయంలో కొబ్బరి బొండం కొట్టి యిచ్చినా హనుమంత రావు తాగివుండలేదని గుర్తు వచ్చింది.

"హొటలులో కూడా తీసుకురా" అన్నాడు రామచంద్రరావు.

"గుమ్మం దిగితే మంచినీళ్ళు కూడా నోటపెట్టరు. అంత నిష్ఠవారిది" అన్నాడు మూర్తి.

"పుణ్యపురుషులు! మనకటువంటి చెడు అలవాట్లూ, నిషేధాలూ లేవుగా .... రెండు కాఫీలు తీసుకురా" అని సర్వరును పంపేశాడు రావు.

"ఎండబడి వచ్చేరు, ముఖాలు కడుక్కోండి" అంటూ ప్రక్కనే ఉన్న స్నానాల గది చూపేడు.

*   *   *

అతిథులిద్దరూ కూర్చోడానికి వీలుగా ఫేన్ క్రిందికి కుర్చీలు లాగేడు. సర్వరు కాఫీ కప్పులు తీసుకుని వెళ్ళిపోయేడు. రామచంద్రరావు సిగరెట్ల ప్యాకెట్టూ, అగ్గిపెట్టె తీసి బల్లమీద పెట్టేడు. మూర్తి ఒక సిగరెట్టు తీసి వెలిగిస్తూ, హనుమంతరావు నియమాలనూ, నిష్ఠలనూ వర్ణిస్తూ, అసలు సమస్యనే తెచ్చేడు.

"మనం నిత్యజీవితంలో భాగాలుగా చేసుకొన్న దురలవాట్లేవీ మాష్టారెరుగరు. వారు యోగ్యులనీ, మంచి సమర్థులయిన టీచరని పేరు పడ్డారు సరే. అటువంటి సమాచారం, మంచి పేరుతో అవినాభావ సంబంధం కలిగివుండే బహుసంతానం, దానినే అంటిపెట్టుకొని ఉండేవేవీ ఇక్కడా తప్పలేదు. కాని మర్యాద చెడకుండా, గుట్టుగా కాలక్షేపం చేస్తూ, కుటుంబాన్ని ఈదుకు వస్తున్నారు. పిల్లల్ని చదివించుకుంటూ వస్తున్నారు ..." అంటూ మామూలు ఉపచార వాక్యాలే, వివాహసంధానకర్తలు చెప్పే ఉపోద్ఘాతమే వినిపించేడు.

"కావలసింది అదేకదా" అంటూ రావు తనవంతు ఉపచార వాక్యం అందించేడు. "నిన్న సుధారాణిని చూశా. చాలా సంతోషం కలిగింది" అన్నాడు.

"ఏదో మీదయకొద్దీ అంటున్నారుగాని ...." అంటూ హనుమంతరావు వినయం ప్రదర్శించేడు.

"చూసేవు కదా, ఆ సుధారాణికి పెళ్ళి చెయ్యాలని సంబంధాలు వెతుకుతున్నారు. నువ్వు మీ పెద్ద అతనికి పెళ్ళికూతుర్ని వెతుకుతున్నావని చెప్పేను. మన అమ్మాయిని చేసుకుంటారేమో అన్నారు. డబ్బు ఒక్కటి లేదుగాని, ఆమెకేం తక్కువ? రాండి చెప్దాం అని తీసుకొచ్చా" నంటూ కార్యసాధకుడుగా మూర్తి ఉపోద్ఘాతం ఇచ్చేడు.

"మంచిపని చేశావు. చాలా సంతోషం. కాని మావాడిని గురించి వీరికి తెలుసునా? నిన్న ..."

మూర్తి మాటమధ్యలో అందుకొని, అన్నీ చెప్పేనన్నాడు. "మీరిద్దరూ వియ్యమందితే బాగుంటుందని నా అభిప్రాయం".

హనుమంతరావు మాట కలిపేడు.

"అమ్మాయిని మీరే చూశారు. నా కూతుర్ని గురించి ఏం చెప్పినా అతిశయంగా ఉంటుంది".

"ఆ అమ్మాయిని మావాడికి చేసుకోమంటున్నారు. నావరకు చాల సంతోషం. వధూవరులిద్దరూ కూడా అలాగే అనుకుంటేగాని ఏం చెప్పగలను? నేనయితే మీ బిడ్డని చూశా. మీర్వెరరూ మావాడిని చూడలేదు. వాళ్ళకి పరస్పర పరిచయం లేదు. ఆ లోపం సవరించే మార్గమేదో చెప్పండి".

హనుమంతరావు కాపద్ధతి నచ్చినట్లు లేదు.

"మనం పెద్దవాళ్ళం ఒక అభిప్రాయానికి వచ్చేక పిల్లవాళ్ళదేం అభ్యంతరం ఉంటుంది? వాళ్ళకి ఇష్టం కాని జోడీ కుదురుస్తామా ఏమన్నానా?"

ఇదేదో పెద్ద పితలాటకంలా కనిపించింది, రామచంద్రరావు మిత్రుని ముఖం వంక చూసేడు. తన కొడుక్కి ఇష్టం లేకుంటే, తనకెంత నచ్చిన పిల్లనైనా, పెళ్ళి చేయనని చెప్పడానికి మనస్సు వొప్పక ఆ అభిప్రాయాన్నే తిరగేశాడు.

"ఏంచేస్తాం. పుర్రెకో బుద్ధీ, జిహ్వకో రుచీ! మావాడే మీ అమ్మాయికి నచ్చకపోవచ్చు. కాని, తీరా వచ్చి చూడడం అంటూ జరిగింది గనక కాదనడానికి వీలులేదనేదా! అదేం మంచిదికాదు" అన్నాడు.



BRAOU

"అది సరేనయ్యా ఇద్దరికీకూడా ఆ అవకాశం ఉంటుంది. కాదని ఎవరంటారు?" అన్నాడు సర్దుబాటుగా నరసింహమూర్తి. అయితే మేష్టారిమాట కర్థం ఏమిటనిపించింది.

మీరిద్దరూ కలిసివచ్చి ఈ విషయం కదిలిస్తున్నారు కనక మావానిని గురించీ, మా కుటుంబం గురించీ స్థూలంగానేనా మీకు తెలుసుననే అనుకుంటూ ..."

"మిగిలిన విషయాలు మాట్లాడుకోవాలిగదా" అని హనుమంతరావు అడ్డువచ్చేడు. "అవేమిటో చెప్పండి". కాలుస్తున్న సిగరెట్టును ఆష్‌ట్రేలో నొక్కేసి రామచంద్రరావు సావధానుడయ్యేడు.

"కట్నం కానుకల విషయం ఏమిటని మేష్టారి ప్రశ్న. మావాడికి వానిమీద ఆశలేదని చెప్పేననుకో. అయినా నీ ముఖతః వినాలని అయివుంటుంది".

"కాస్త స్పష్టంగా తెలుసుకోవడం మంచిది కాదాండి" అన్నాడు హనుమంతరావు క్షమాపణ చెప్పుకుంటున్నట్లు.

"వధూవరులు ఇష్టపడితే డబ్బుది ఓసమస్య కాకూడదు. ఇష్టంకాదనుకోండి. అప్పుడసలే సమస్య కాదు. ఇంక వాళ్లు ఇష్టపడితే అక్కడినుంచే రిజిష్ట్రారు ఆఫీసుకువెళ్ళి పెళ్ళి చేసుకువస్తే మరీ మంచిదంటాను. ఆ సందర్భంలో కానుకలూ, ఖర్చులుకూడ సమస్యకావు. తర్వాత మీకు ఓపిక వుంటే విందు చెయ్యండి, నలుగురినీ పిలిచి. లేకపోతే వూరుకోండి. అదికూడా పట్టింపుకాదు. అసలు విషయమల్లా వధూవరుల్ని సమ్ముఖపరచడం. అంతవరకే మనపూచీ. తరువాత మన ప్రసక్తి ఉండకూడదు...." అంటూ రామచంద్రరావు తన అభిప్రాయాలను వివరించేడు.

"రిజిష్టరుపెళ్ళి మాకిష్టంకాదు. సాంప్రదాయబద్ధంగా, అగ్నిహోత్రిసాక్షిగా..."అని హనుమంతరావు ఒత్తేడు.

"భేషుగ్గా ఉంటుంది. అలాగే కానిద్దురుగాని మీకా సరదా ఉంటే మా బాగు ...." అన్నాడు రామచంద్రరావు కొంచెం ఎకసక్కెంగా. హనుమంతరావు పట్టించుకోలేదు.

"పెళ్ళి అనేసరికి నలుగురూ రావాలి ఓ విందులనీ, వేడుకలనీ ..." అంటూ మూర్తి హనుమంతరావు ఆలోచనలకు కారణాలు సమకూర్చి పెట్టేడు. హనుమంతరావు అతనివైపు కృతజ్ఞతాపూర్వకంగా చూసేడు.

తల్లితండ్రులు కోరుకొనే ఆనందం అందులోనే ఉంటుంది. అవి లేకపోతే పెళ్ళి చేసినట్లే ఉండదు". ఓ. నిముషం ఆగి మళ్ళీ అన్నాడు.

"అందుచేతనే మీ అభిప్రాయం స్పష్టంగా చెప్పవలసిందిగా కోరుకున్నా".

రామచంద్రరావు ఒక్క నిముషం ఆయనను వుబ్బిపోయేలాగ చూసేడు.

"తప్పేముందిలెండి. ఇంతకీ మీరు ఎంతవరకూ ఇవ్వగలరు?"

'చూసేవా, రంగు బయటపడుతూందన్నట్లు హనుమంతరావు మూర్తి మొహం చూసేడు, బాధ్యతనంతనూ ఆయనమీదకే నెట్టేస్తూ - " మా స్థితిగతులువీరికి తెలుసునండి" అన్నాడు.

"అయితే అసలు బేరంతో పనేలేదు. ఏమయ్యా! నువ్వేమంటావు?" అన్నాడు రావు నరసింహమూర్తితో.

మిత్రుని స్వభావం ఎరిగిన మూర్తి ఆ స్వరంలోని ఎగతాళి విన్నాక మేష్టారు వ్యవహారం పాడు చేస్తున్నారని గ్రహించేడు.

"వారి స్థితిగతులు నాకు తెలుసు. చక్కని కుదురయిన పిల్ల నివ్వగలరేగాని, కట్నాలూ కానుకల ఆశ చూపలేరు".

రామచంద్రరావు మేష్టారివంక చూసేడు. ఆయన మూర్తిని ధ్రువపరిచేడు.

"వారికి నా పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసు" అన్నాడు.

BRAOU

రామచంద్రరావు గంభీరంగా –

"అయితే ఏమీ ఇవ్వలేమంటారు" అన్నాడు.

ఈ బెడద తప్పిపోతూందిలే అన్నట్లు మేష్టారి ముఖంలో వికాసం. రామచంద్రరావు ఆశ్చర్యపడ్డాడు. అదేమిటో అర్థంకాలేదు. తమసంబంధంచేయడం ఇష్టంలేకపోతే ఇంతవరకూ రావడం ఎందుకు? అదేదో చూద్దా మనిపించింది. అంత గంభీరంగానూ –" ఇంక పేచీ యేంఉంది? ఇక కట్నంమాట తలపెట్టకండి" అన్నాడు.

హనుమంతరావు నీరసంగా మూలిగేడు – "కాని ...."

రామచంద్రరావు చెప్పండి అన్నట్లు చూసేడు.

"ఇదివరకు మా పెద్దపిల్లను చేసుకొన్నవారూ ఇల్లాగే కట్నం ఏమీ వద్దన్నారు తర్వాత అది చాలలేదు, ఇది చాలలేదని ఇప్పటికీ గునుస్తూనే ఉంటారు ...."

నరసింహమూర్తి కనుబొమ్మలు ముడిచేశాడు. రామచంద్రరావు ముఖంలో నవ్వు వెలిసింది. ఈ మనిషి మూర్ఖుడా, అతి గడుసువాడా తేల్చుకొంటున్నట్లు ఒక్క నిముషం ఆగేడు.

"ఇచ్చి పుచ్చుకోవడాలు స్పష్టంగా మాట్లాడుకొందామన్నారు గనుక మావాళ్ళతో ఆలోచించి వ్రాస్తా. అదంతా ఆడవాళ్ళ రాజ్యభాగం గదా".

"అలా చేయించండి. మనిద్దరికీ కాలసినవారు మూర్తిగారు. వారికి వ్రాయిస్తే ...."

"ఆ ఉత్తరం కూడా మీకు వ్రాయొద్దంటారు" అని రావు నవ్వేడు.

హనుమంతరావు తెల్లబోయి "అబ్బెబ్బే, అదేంకాదండి" అన్నాడు.

రామచంద్రరావు అంతలో గంభీరంగా ముఖంపెట్టి 'తమరు నిష్ఠాపరులు, సంప్రదాయపద్ధతిలో పెళ్ళి అంటున్నారు. అంటే వివాహం జరిగేటట్లయితే మా కుటుంబం నలుగురి[illegible]వాలనే కదా మీ ఉద్దేశం ..." అన్నాడు.

"కుంటుంబాలు పరిచయం కావాలనేగాదాండి, సంప్రదాయంగా వాని ఉద్దేశం" అన్నాడు హనుమంత రావు ఉదారంగా.

"అటువంటి సదుద్దేశం తమకుంది, సంతోషం. ప్రపంచకంతో పరిమితం కమ్మనడంలేదు. మా మూడోవాడు ఒక ముస్లిముల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. బహుశా మా మూర్తి చెప్పేడో లేదో! తరువాత నాలుక కరచుకొనేకన్న ముందు తెలుసుకొనివుండడం మంచిదిగదా అని చెప్తున్నా. అందుచేత తమరు యింటికెళ్లి మీ అభిప్రాయాన్ని మా మూర్తికి చెప్పండి".

హనుమంతరావు సంతృప్తిపడినట్లు సర్దుకొన్నాడు.

"తమది పెద్ద సంస్కారంగల కుటుంబం. మేం అంతవకూ రాలేకపోవచ్చు. తమబోటి వారితో బంధుత్వం ఏర్పడుతుందనుకోవడమే గొప్ప. మేం పిల్లనివ్వబోయేది ఒక బ్రాహ్మణుల పిల్లవానికేగదా అని సంతృప్తి ..."

"ధన్యులం"మాట మధ్యలోనే రామచంద్రరావు సంభాషణకు 'ఇతి శ్రీ' పెట్టేడు.

"పోనీలెండి అంతమాటన్నారు. అదే పదివేలు ... మరి సెలవా!" అంటూ మిత్రుని వంక తిరిగేడు.

"నీమాట ఏమిటయ్యా? చల్లబడింది కదా, ఓ గంట అల్లా ఏ కృష్ణవడ్డుకో పోయివద్దామా?"

"మేష్టారిని రిక్షా ఎక్కించి వస్తా. వెడదాంలే ఆగు" అన్నాడు మూర్తి. హనుమంతరావు లేచి కండువా భుజాన సర్దుకొన్నాడు.

* * *

లాకులవద్ద బస్సుదిగి మిత్రుల్దిరూ పార్కులోకి నడిచేరు. బ్యారేజీకి ఎగువన కృష్ణ వొడ్డునే ఉన్న రావి మొదటనున్న దిమ్మమీద కూర్చున్నారు. ఎదురుగా కృష్ణనీళ్లు కనుచూపు మేర సిరా వొలికినట్లు ...

కనిపిస్తున్నాయి. చల్లని గాలి తోలుతూంది. దూరంలో పైన బేరేజీమీద పరుగులు తీస్తున్న లారీలూ, బస్సుల రొద సన్నగా వినిపిస్తూంది.

కొద్దిసేపు మిత్రులిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. చివరకు నరసింహమూర్తే ప్రారంభించేడు.

"నీ మూడోకొడుకు పెళ్ళిని గురించి ఇప్పుడు చెప్పవలసిన అవసరం ఏం వచ్చింది?"

"నీ మనస్సులో ఇంకా అదే మెదలుతూందన్నమాట. నే నా సంభాషణలను ఎప్పుడో మరిచిపోయేను. అసలు నువ్వు అన్ని సంగతులూ చెప్పి ఉండవలసింది. ఆయన్ని తీసుకురావడంలో నీపట్టుదల ఎక్కువ కనిపిస్తూంది ..."

"భార్య పట్టుదలమీద వచ్చేడు ఆయన, వస్తూ వస్తూ దారిలో తన ఆశలన్నీ చెప్పుకున్నారు. అమ్మాయి డ్యాక్టరు డిగ్రీ లేకుండా పోతూందే అని ఆయన తపన. పిచ్చి బ్రాహ్మడు, వుంటుందిలే. తప్పులేదు. కాని, జరిగే ఆవకాశాలుండవద్దూ. రాఘవమ్మగారు అదే ఆయనభార్య కనిపించినప్పుడల్లా 'ఏదన్నా సంబంధం చూడండి' అంటూంటారు. మీవాడి కన్న అనుకూలమయిన సంబంధం తలక్రిందులగా తపస్సుచేసినా దొరకదు. అందుకే నేనేమి చెప్పకుండా వచ్చి మాట్లాడుకోమన్నా ..."

"మావాడు తప్పేంచెయ్యలేదు. వాళ్ళ కిష్టమయింది, చేసుకున్నారు. ఏదో అకార్యకరణం చేసినట్లు దాచుకోవలసిన అవసరం ఏంవుంది?"

"అది గొప్పగా చెప్పుకొని పైవాళ్ళని హడలకొట్టడం ఎందుకు? వాళ్ళనే తెలుసుకోనీ, ఇప్పుడామాట విన్నాడు. మరి కలలోకూడా ఈ దరిదాపులకు రాడు" అంటూ నరసింహమూర్తి కొంచెం విసుగు చూపేడు. రామచంద్రరావు పకపకా నవ్వేడు.

"ఎందుకేం ఆ నవ్వు?"

రామచంద్రరావు ఒక నిమిషానికి తేరుకొన్నాడు.

"మీ మేష్టారు శుద్ధ యంత్రబ్రహ్మ. నీ బలవంతం మీద వచ్చేడు గాని, అసలాయన కా ప్రసంగం ఇష్టం కాదని వచ్చిన మరుక్షణంలో తేల్చేడు. కారణం చెప్పలేను. బహుశా కూతురు పెళ్ళి చేసుకు వెళ్ళిపోతే సంసారం ఎల్లాగని భయమేమో, నేను కట్నం అడిగేననో, స్పష్టంగా అడగలేదనో మొత్తంమీద కట్నం సమస్యతో వ్యవహారం పోయినట్లు తృప్తిపడదలిచేడు అంత చిన్న కారణంతో ఏం బాధపడతావు. కనీసం భారత ధర్మరక్షాదీక్షతో ఇల్లాంటి సం[illegible] కూడా తన్నేశాడనే వుంటుంది. ఇదిగో మంచి బ్రహ్మాండమయిన కొమ్మ. అందుకోమని ఇచ్చేను. బ్రహ్మడు చటుక్కున కౌగిలేసి పట్టుకొన్నాడు".

BRAOU

రిక్షావద్దకు వెళ్ళేక ఆయన తనతో అన్నమాటను మూర్తి మిత్రునికి చెప్పేడు.... "నీ కుటుంబ వ్యవహారాలు నాకూ అట్టే తెలిసినట్లు లేదనుకొన్నాడు".

రామచంద్రరావు నవ్వేడు. "నీకు తిట్లు తగులుతాయి. మధ్య మధ్య తగులుతూండడం అవసరం కూడా ..."

• • •

రామచంద్రరావు వూహించినట్లే అయింది. ఇంటికి వెళ్లాక హనుమంతరావు భార్యవద్ద నరసింహమూర్తి మీద విరుచుకుపడిపోయేడు. "మన బతుక్కు సరిపడును గదా అని తెచ్చాడీ సంకరజాతి సంబంధం" అనేది కేవలం ఉపోద్ఘాతం మాత్రమే.

"అదేమిటండీ మధ్యన వచ్చిన పెద్దమనిషిని తిడతారు?" అని రాఘవమ్మ నోరు తెరవగానే ఆయన అగ్గిబరాటా అయిపోయేడు.

"నీ సనుగుడు వినలేక వెళ్లేను. కాని, మొదటినుంచీ నాకనుమానమే. వీళ్ల పరమబ్రహ్మద్వేషులు. నాకు తెలుసు, మన కులం పాడుచేసే నవ్వాలనే దుర్బుద్ధితో చేసినపని. ఆ స్నేహితుడు నిజంగా బ్రాహ్మడేనా అని నాకు అనుమానం పీకుతూనేవుంది. ఏమో ఎవరు చెప్పగలరు? ఏలేశ్వరోపాధ్యాయుల వారిలాగ ఏడ్చి మొత్తుకుంటే ఏమవుతుంది? కాని నువ్వున్నావే! ఏంచేసినా పాపంలేదు. వెళ్ళేదాకా ఉంగిడెత్తించేశావు. ఇంకా

ఆదేవుడంటూ దయతలచేడు. లేకపోతే? కట్టకట్టుకొని కృష్ణలో దిగడం తప్ప దారిలేకపోవును. కులం కాదంటాడని పిల్లనివ్వలేకున్నాడుట. లేకపోతే రుక్మిణి ఇచ్చునట! తురకాళ్ళతోనూ, దూదేకులవాళ్ళతోనూ వియ్యమందిన వాడికి కులం పట్టింపుట, విన్నావా!"

అప్పుడే ఇంట్లోకి వచ్చిన సుధ ఆ కథవిని ఒక్క పూర్పు తీసుకుంది. ఆ సంబంధాన్ని నిరాకరించడం మంచిదేనని కూతురు అంటూంటే ఆమె వెక్కిరించడం లేదుగదా అని హనుమంతరావు ఒక్కనిముషం ఆగేడు.

"వచ్చే సంవత్సరం ఏలాగేనా తంటాలుపడి ఏదో స్కాలర్‌షిప్ తెచ్చుకొంటావు. రీసెర్చి చేడతావు. నీ కాళ్లకి బంధం వెయ్యడం మంచిదంటావా?" అన్నాడు.

"ఏమీకాదు. మంచిపనే చేశారు. పెళ్ళికాక పోతుందేమిటి?" అంది సుధ.

ఆ మాటలతో హుషారు చిక్కింది. అయితే కూతురు తన అభ్యంతరాలను సమర్థించడం లేదనే ఆలోచనలేదు.

"కట్నం అడగడం లేదన్నప్పుడే అనుమానం తగిలింది ... నెలలో ఆరేడు వందలు తెచ్చుకుంటున్నాడుట. వయస్సు ఎక్కువ కాదు. ఇరవయ్యేనిమిదో, ఇరయితొమ్మిదో మాత్రమేనా? విదేశాలలో చదువుకు వచ్చేడూ? కట్నం అక్కర్లేదూ? ఏదో తిరకాసు వున్నదని గ్రహించలేని వెర్రి పప్పననుకొన్నాడు ... అంటూ తన పారదర్శితను అభినందించుకొన్నాడు.

రాఘవమ్మ ఆ లక్షణాలను చూసే ఆశపడింది. కాని అసలు విషయంవదలి మగడు అర్థంలేని అభ్యంతరాలను పాడుచేసుకు వచ్చేడని మండిపడింది. కూతురు దానికివత్తాసా? గంయ్‌మంది.

"ఏమిటండి మహా శ్రోత్రియం పోతారు? మీ పెద్దలెవరేనా ఆడపిల్లకి పదేళ్లుదాటించి పెళ్లిచేశారా? చదువులూ, వుద్యోగాలూ అంటూ ఊళ్లేలనిచ్చేరా? అదక్కడ చేస్తున్న ఆచారం ఏమిటి? హాస్టళ్లనీ మెస్సులనీ నానాకుళ్లూ కుడుస్తూంది. మీ ఇద్దరికీ సరిపడింది. ఆ కుర్రాడి తమ్ముడెవరో తురకపిల్లని పెళ్ళిజేసుకున్నాడూ. అతడికి పిల్లి నివ్వడానికి మీకూ, చేసుకోడానికి ఆ అమ్మగారికీ బ్రాహ్మణ్యం అడ్డొస్తుందా? భేష్, మంచిపని చేశానని ఆవిడ ఉబ్బెయ్యడమూ".

భార్య తన చర్యని ఖండిస్తూంటే హనుమంతరావుకు ఒళ్లు రగిలిపోయింది. ఆవిడ పుట్టినూరు ముంగండ. ముంగండలో పుట్టిన ఉపద్రష్ట జగన్నాథ పండితుడు నాలుగువందలేళ్ల క్రితం ఓ ముస్లిం పిల్లను కట్టుకున్నాడు. ఆయనకు బ్రాహ్మణ్యం పట్టలేదు. ఆమెను పట్టుకొని కాశీలో గంగవొడ్డున మెట్లమీద పడుతుండగా చూసి అప్పయ్య దీక్షితులంతవాడు ఏమీ అనలేక "సుఖం శయథా నికటే జాగ్రతి జాహ్నవీ" అని తలవొంచుకు పోయేడంటాడు. పెళ్లాంమీద కోపం వచ్చినప్పుడల్లా హనుమంతరావు జగన్నాథపండితుణ్ణి జ్ఞాపకం చేసుకొంటాడు. ఇప్పుడూ అదే చేసేడు.

"గడ్డ రా గడ్డ. పుట్టినగడ్డ మహాత్మ్యం. దిక్కుమాలిన సంప్రదాయం" అన్నాడు.

ఈ పెద్దమనిషితో మరి ప్రయోజనం లేదన్నట్లు రాఘవమ్మ కూతుర్నువైపు తిరిగింది.

"ఏమిటే పిల్లా! నీ అతిశయం! ముసలితనం వచ్చి, మంచం పట్టేక ఆఖరి కోరికగా పె... పె... పె... అంటావా?" పెళ్ళి అనే మాటకూడా పలకలేదని వెక్కిరింత అది.

విసురు తన మీదికి తిరిగేసరికి సుధ హడలిపోయింది. ఆ కుర్రవాని తమ్ముడు ఎవరిని పెళ్లి చేసుకున్నా తనకేం లేదంది.

"నాకు చూపకుండా, చెప్పకుండా వీధిలోది వీధిలోనే సంబంధం కుదుర్చుకువచ్చి నా మెడకు ఎత్తకపోవడం మంచిదన్నానుకాని..."

రాఘవమ్మ ఆ సమాధానికి తృప్తి పడలేదు.

"నువ్వు ఆ కుర్రవాడెవరో, ఏమిటో మరి అడగనన్నా అడిగేవా?"

"మూర్తి మామయ్యగారు మీతో చెప్తూంటే విన్నాను".

BRAOU

"ఏం చదువుకున్నాడు? ఉద్యోగం ఏమిటని తెలుసుకున్నావా?"

"అమెరికా వెళ్లి వచ్చేడన్నారుగా" అని సమర్థించుకుంది సుధ.

"కుక్క సంతకెళ్ళొచ్చినట్లు అమెరికా వెళ్ళినా, అంతరిక్షంలో కెళ్ళినా లాభంలేదే పిల్లా! వెళ్లి ఏం చేశాడు ... ఏం చేస్తున్నాడు? ... తెలుసుకోలేదు".

సుధ మాట్లాడలేదు.

"ఎట్లా ఉంటాడు? సొట్టకాలు తొంటచెయ్యి, చెవుడులాంటి వేవో ఉండక పోతుందా, అని మీనాన్న నమ్మకం. ఆయనగారి వెనక 'తానతందాన' అనడం నీకో సరదా ... కానీ ..."

మీరు నాకు అపకారం చేస్తారనుకోడం లేదమ్మా!" అంది. సుధ తప్పించుకొనేందుకు.

"ఔను. తర్వాత దెప్పిచంపడానికి, ఏడ్చి కళ్ళు పోగొట్టుకోడానికి. మాకా పెద్దరికం వద్దు తల్లీ".

సుధకు తన అభిప్రాయాన్ని సూచనగానేనా బయట పెట్టేందుకు అవకాశం కలిగింది. వెంటనే ఉపయోగించుకొంది.

"పోనీ ఆ మాటమీద నిలబడండి. నా పెళ్ళి గురించి మీరు పేచీపడకండి. నాకొదిలెయ్యండి. నాకు వీలయిన మనిషిని నేనే నిర్ణయించుచుంటాను. మీతో చెప్పకుండా చేసుకోను".

రాఘవమ్మ నిశితంగా కుమార్తెవంక చూసింది.

"చూడు, సుధా! గడుసు పోకడలు కట్టిపెట్టు. ఇదివరకే ఎవరినన్నా నిర్ణయించుకొన్నావా? అందుకే తలాయిస్తున్నావా?"

సుధ కంగారుపడింది. ఆ సూచనను నిరాకరించేసింది.

"మరి కనీసం ఆ కుర్రాడెవరో, ఎట్లా ఉంటాడో చూస్తాననేనా అనకుండా ..."

రాఘవమ్మ చర్చను మళ్ళీ మొదటికి తెచ్చింది.

తల్లి యథార్థాన్ని అనుమానించింది. అయితే ఆ సంగతి ఆమెకే స్పష్టంగా తెలియదు. తానుకూడా అప్పుడే బయటపడేందుకు సిద్ధంగాలేను. తల్లిదండ్రుల గురించే ఆమె బయటపడకుండా ఉంది. అయితే ఆ మాటలను గట్టిగా ఒప్పుకొనే ధైర్యమూ లేదు. నసిగింది.

BRAOU

"ఏదీ? ఏదడగడానికి వ్యవధీ ఏదీ?"

రాఘవమ్మ చురుమనేలాగ చూసింది. "ఊహూఁ" అని సాగదీసింది. ఆమె చూపులకు తట్టుకోలేక సుధ తలతిప్పుకొంది. హనుమంతరావు కూతురుకు ఆసరా వచ్చి, భార్యను గదిమేడు.

"ఏం కోర గేదెలా అట్లా చూస్తావు ?"

రాఘవమ్మ మగని మాటను లెక్కచేయలేదు. కూతురునే చూస్తోంది.

"ఇప్పుడేనా అడుగుమరి" అంది.

సుధ గుటకలు మింగుతూ తండ్రివంక చూసింది. అతడు ఖచ్చితంగా చెప్పేసేడు. "కులం చెడ్డవాడి ఇంట నా కూతురును ఇవ్వను. నాలుక పెరుక్కుని చచ్చినా అది ఖాయం." అన్నాడు, అగ్నిహోత్రావధాన్ల బాణీలో.

సుధ అంగలార్చింది.

"వాళ్ళు కులం చెడడం సంగతి మనకెందుకు నాన్నా! అదెత్తడం మంచిదికాదు నాన్నా!" అంతవరకే అనగలిగింది. కాని, హనుమంతరావుకు తన కళ్ళముందు తల్లీకూతుళ్ళ మనస్సులలో సాగుతున్న సంఘర్షణను గమనించగల ఓర్పూ, నేర్పూకూడ లేదు.

"మనం పుట్టిన కులం ఏమిటి? మన కుటుంబం ఎటువంటిది? అటువంటి అబ్రాహ్మణ్యం నాముందు రానివ్వద్దు" అన్నాడు.

దానికి కూతురేం సమాధానమిస్తుందోనని రాఘవమ్మ ఒక్క క్షణం ఆగింది. సమాధానం ఏదీ రాకపోయేసరికి ఒక్క నిట్టూర్పు విడిచింది. "నీకు మీనాన్న పెళ్ళి చేస్తారు. నువ్వు చేసుకొంటావు! ఆయన మీద ఆశ పెట్టుక్కూర్చో! ధనధాన్య సమృద్ధి! గొడ్డు గేదెల పాడీ." అంటూ విసురుగా లేచిపోయింది.

## 8

కాలేజీ నుంచి వచ్చేసరికి ఎదురుగా బడ్డీకొట్టువద్ద నిలబడివున్న కామేశ్వరరావును చూచి, సుధ ఆశ్చర్య పడింది, తలుపుతీసింది. ఆమె వెనుకనే అతడు ఇంట్లోకి వచ్చేడు.

"కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తా." అని కుర్చీ చూపించింది. ఎదురుగా టేబిలుమీద రెండుమూడు పత్రికలూ, పుస్తకాలూ పడేసి లోపలికెళ్ళింది.

మరో పది నిమిషాలలో ఆమె తన గదిలోకి వచ్చిన చప్పుడు వినిపించింది. తల ఎత్తేడు. గదిలోంచి కంఠం వినిపించింది.

"క్షమించండి. ఒక్కనిముషం."

"ఫర్వాలేదు."

బట్టలు మార్చుకొని సుధ గది తలుపులు తెరిచింది. కాని, ఆమె బయటకు రానేలేదు. బల్లమీద దువ్వెన పెట్టిన, తీసిన ధ్వని వినిపిస్తూంది.

లేచేడు. గుమ్మంగదిలోకి వచ్చేడు చటుక్కున లోనికి అడుగు పెట్టలేకపోయాడు.... "రావచ్చా..." అని అడుగుతూ లోపల అడుగు పెట్టేడు.

రెండు సంవత్సరాలకిపైగా అతనితో పరిచయం బలపడిపోయింది. వివాహం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చికూడా ఏడాది దాటింది. కాని, ఇంతవరకు అతడెన్నడూ ఆమె గదిలో అడుగుపెట్టలేదు. వారి ప్రణయం చిరునవ్వులు. కొంటె చూపులు కుముద చూడకుండా అప్పాల్ప స్పర్శలూ గంటల తరబడి మాట్లాడుకోవడంవరకే పరిమితమయింది. ఇప్పుడీ అభ్యర్థన. ఉలికిపడి వెనుతిరిగి "వస్తున్నా," అన్నమాటను నాలుక చివరనే నిలిపేసింది. అతడు గదిగుమ్మంలో నిలబడివున్నాడు.

కామేశ్వరరావు గుమ్మంలో నిలబడి నలుముఖాలు చూసేడు. సామానేదీ విశేషంగా లేదు. కిటికీకి దగ్గరగా మంచం. దాని క్రిందపెట్టె. తలాపిన గోడ దగ్గరగా బట్టలస్టాండు. దాని ప్రక్కగా రెండో కిటికీవద్ద టేబిలు. దానిమీద అలంకరణ సామాగ్రి. అక్కడున్న దొక్కటే కుర్చీ.

కుర్చీలో కూర్చుని జడవేసుకుంటున్న సుధ లేచింది. "రాండి." అంటూ కుర్చీ అతనివేపు జరిపింది.

"వద్దు, జడవేసుకో. పూర్తిచెయ్యి."

అయినా సుధ పట్టించుకోలేదు. వేసుకొంటున్న జడ నొక చేత్తో పట్టుకొని కుర్చీని అతనివేపు లాగింది. కామేశ్వరరావు దానిని అందుకొని తీసుకుపోయి టేబిలువద్ద పెట్టేడు. "ముందు నీపని కానీ."

"పోనీ, ఇల్లా కూర్చోండి." అంటూ మంచంమీదవున్న పువ్వులదండను తలగడమీద పెట్టిచోటు చూపింది.

తాను కూర్చోవడానికి ఆమె అంత ఆదుర్దా కనబరచడం. అతనికి కష్టం అనిపించింది. సందేహిస్తూనే ఆమె జబ్బపట్టుకొని బల్లవరకు నడిపించేడు.

"నేను కూర్చోడానికేం? నువ్వుతెములు ముందు." అన్నాడు

BRAOU

ప్రతి దినం ఏకాంతస్థితి కోరుతున్న వారికి అనుకోకుండా లభ్యం అయిన ఈ ఏకాంత స్థితిలో మనస్సులు స్తంభించి పోయినట్లయాయి. తరతరాలుగా రక్తమాంసాలతో జీర్ణించి పోయిన ఔచిత్యానౌచిత్య భావనలు, నీత్యవినీతుల జంకుగొంకులు వారి చేతలను అదుపులో వుంచుతున్నాయి. కాని, వయస్సు ఉద్వేగాలు పరస్పర ఆకర్షణలూ, చేసుకొన్న నిర్ణయాలూ బలమూ ధైర్యం ఇస్తున్నాయి.

కామేశ్వరరావు జబ్బ పట్టుకొన్నప్పుడు సుధ వులికి పడింది. కన్యాత్వస్థితి ప్రతిఘటించింది. అతని ముఖం వంక చూసింది. అతని కళ్ళలో జంకు, ఆసక్తి, భయం, ఆనందం దృశ్యాదృశ్యంగా కనబడుతున్నాయి. ముఖం జేవురించివుంది. అతని చేతి వెచ్చదనం పైట కొంగుని అధిగమించి, రక్తాన్ని వుడికెత్తిస్తూంది. వణుకెత్తిస్తూంది. అకారణంగానే నవ్వు వచ్చింది.

ఒక మారు ఆమెను ముట్టుకొన్నాక కామేశ్వరరావులో భయం, జంకూ తొలిగేయి. ఆమె నవ్వు అతనిని ఆహ్వానిస్తూంది. రెండో చేయి వెనుకనుంచి దానిచ్చి రెండో భుజం పట్టుకొన్నాడు. ప్రక్కగా ఆనుకుని నిలబడడంతో ఆమె అతనిని జేరబడిపోయింది.

ఆమెను నడిపించి తీసుకెళ్ళి కామేశ్వరరావు అద్దంముందు కుర్చీలో కూర్చోబెట్టేడు. కూర్చోబెట్టేక కూడ అతడు ఆమెమీది చేతులు తీయలేదు. కుర్చీ వెనుక నిలబడి ఆమె భుజాల మీద చేతులు వేసి, ఎదురుగా అద్దంలో కనిపిస్తున్న సుధ వంక చూస్తున్నాడు.

తన వెనుకనే నిలబడివున్న అతని ప్రతిబింబాన్ని చూసి సుధ చిరునవ్వు నవ్వింది. అతని చేతిమీద చేయివేసింది.

"వెళ్ళి కూర్చోండి. వచ్చేస్తున్నా."

ఇక్కడ నిలబడ్డం కూడా పనికిరాదా?" అంటూ అతడామె భుజాన్ని గట్టిగా అదిమేడు. ఆమె తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది.

"ఎవరేనా వస్తారు. బాగుండదు."

అతడామె గడ్డంక్రింద చేయిపెట్టి తలను తనకు అదుముకొన్నాడు. అతని కళ్ళలో అనునయం ప్రతిబింబిస్తూంది. చటుక్కున వొంగి ఆమె ముఖం మూర్కొన్నాడు. సుధ చేయి ఎత్తి అప్రయత్నంగానే అతని కంఠం కౌగిలించింది. స్వప్నావస్థలో కళ్ళు అరమూతలు పడ్డాయి. పెదవులు మాత్రం భయాన్ని పునశ్చరణ చేస్తున్నాయి. "..బాగుండదు.... బాగుండదు... ఎవరేనా వస్తారు... చూస్తారు..." అంటూంది.

"ఇల్లా ఎంతకాలం ఈ భయపడడం సుధా!" అంటూ దీనంగా అతడామె కళ్ళలోకి చూసేడు. ఆ మాట వినడం అదే ప్రథమంకాదు. అయితే ఆశ్చర్యంలో ఇప్పుడు అంగలార్పూ, ఆవేదనా లేదు. ఏదో నిర్ణయానికి వచ్చినట్లు ఏదో ఆదేశిస్తున్నట్లు వినిపించింది. ఆ స్వరం విని సుధ కళ్ళు తెరిచింది. ఏదో కలలో తెరిచినట్లున్న ఆ కళ్ల అతనిని రెచ్చగొట్టేయి. వానిని ముద్దులతో మూసేస్తూ "ఇంకెంతకాలం ఇల్లాగ?" అన్నాడు.

కళ్ళతో ఒక విధమయిన తృప్తినీ, కొంటెతనాన్నీ చిలికిస్తూ సుధ అతని ముఖానికి చేయి అడ్డం పెట్టింది. జారిపోయిన పైటలోంచి కనిపిస్తూన్న వక్షస్థలంవేపు ఆశతో చూస్తూన్న అతని రెండు కళ్ళూ మూస్తూ లేచి నిలబడింది. కామేశ్వరరావు నవ్వేడు.

"నిన్ను కంటితో కూడా చూసుకోకూడదా?"

అతని నోరు మూయడానికి ప్రయత్నిస్తే అతని కళ్ళు శరీరాన్ని తడిమేయి.

"జడ వేసుకువస్తాను. ఎవరన్నా వచ్చేరా వీధిన బడతాం. కాస్త వెళ్ళండి." అంది అనునయిస్తున్నట్లు. కామేశ్వరరావు ఆమె ఎదురుగా టేబులు నానుకొని కూర్చుని "ఏమీలేదు, త్వరగారా" అన్నాడు.

సుధ ఏమీ అనకుండా జడ ముగించుకొని శిఖ చుట్టుకొంటూంది. అతడు తన వేపే ఆశతో, ఆప్యాయంతో చూస్తూంటే సిగ్గుపడింది.

"అలా చూడకండి, సిగ్గేస్తూంది."

తప్పు పనిచేస్తూ పట్టుబడ్డవాడిలాగ కామేశ్వరరావు కళ్ళు తిప్పుకున్నాడు. ఎదురుగా మంచంమీద పువ్వులదండ కనిపించింది. దానిని అందుకొని లేచేడు ఆమె లేచి నిలబడింది. ఎదుట టేబిలు మీదవున్న అద్దంలో ఇద్దరి కళ్లూ కలుసుకొన్నాయి. అతని కళ్ళలో కనిపిస్తున్న కొంటెతనాన్ని అదలిస్తూ కళ్ళు తిప్పింది.

అతడు చటుక్కున ఆమెను దగ్గరకు తీసుకొని భుజంమీద గడ్డం ఆన్చి అద్దంలోని ఆమె కళ్ళవంక చూస్తున్నాడు. సుధ అతని గడ్డంక్రింద చేయిపెట్టి ఎత్తుతూ

"కిచకిచగా వుంది" అంది నవ్వుతూ.

ఆమెను మరింత నవ్వించేటందుకు తలను అటుఇటు ఆడించేడు. సుధ అతని కౌగిలిలో కిలకిలలాడుతూ నవ్వింది. ఆమె అతి కష్టంమీద రెండు చేతులూ అదిమి అతని తలను ఎత్తి కదలకుండా పట్టుకొంది. "వదలండి."

అతడు కళ్లుతిప్పేడు. "నాకు సమాధానం చెప్పందే వదిలేది లేదు" అన్నాడు.

ఆ నవ్వులలో ఆమెకు అతని ప్రశ్న జ్ఞాపకందాలేదు. "ఏమడిగేరు?" అంది అనుమానంగా.

అతడు నమ్మలేదు. సమాధానం చెప్పడానికిష్టంలేక ఎరగనట్లు నటిస్తూందనుకున్నాడు.

"మరిచిపోయేవేం? అదేంకుదరదు అమ్మాయి !"

సుధ గంభీరంగా ఆలోచించింది.

"నిజంగానే. మీరేం అడిగేదో వినలేదు." అంది.

"వినలేదేం?" అంటూ అతడామెను దగ్గరగా వొత్తుకొని మెడమీద మరింత కిచకిచలు పెట్టేడు. ఆ ఉత్పాతం నుంచి బయట పడడానికి ఆమె కొక్కటే మార్గం అతని కౌగిలిలో ఒదగడం.

* * *

BRAOU

ఆ ఉన్మత్తదశ నుంచి బయటపడే సరికి ఇద్దరికీ ఒక్కమారే జ్ఞాపకం వచ్చిన విషయం వీధి తలుపులు తెరిచే వున్నాయనీ, తామున్నగది తలుపులు కూడా ఓరవాకిలిగానే మూసివున్నాయనీను. ఇద్దరూ కంగారు పడి మంచం దిగేరు.

ఓరవాకిలిగావున్న తలపుల సందులోంచి కామేశ్వరరావు సావిట్లోకి చూసేడు. ఎవరూవున్న జాడలేదు. అసలు వచ్చేవారులేరు. కాని మనస్సులోని బెరుకు అటువంటిది. అది సర్దుకొంది. వెనక్కి తిరిగి చూసేడు. సుధ చీరమడతలు సరిచేసుకొంటూంది. అప్పుడు గుర్తువచ్చింది. తాను ఏదో తప్పుచేసే నసిపించి మనస్సు గుబగుబలాడింది. సుధకు కష్టం కలిగిందేమో, కోపంవచ్చిందేమో. కాని, అతనివేపు తిరిగి చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వుతో అతని దిగులు తీరింది. సావట్లో ఎవరూ లేరన్నట్లు సంజ్ఞ చేశాడు.

సుధ కాభయం తోచినట్లే లేదు. ఆమె చిరునవ్వుతోనే తల ఆడించింది.

కామేశ్వరరావు నెమ్మదిగా తలుపులు తీసుకొని గది వెలుపలికి వచ్చి మరల జాగ్రత్తగా చేరవేసేడు. వెళ్ళి ఒక ప్రక్కగా వున్న సోఫాలో కూర్చున్నాడు. అతని మనస్సు లోనిది ఉత్సాహమో, సంతృప్తో, పశ్చాత్తాపమో, ఆత్మగ్లానో చెప్పలేనిస్థితి. తనకు దొరికిన మొదటి ఏకాంత స్థితిని దుర్వినియోగపరచి నట్లనుకుంటుందేమో సుధ అని సంకోచం.

కాని, సుధ ఏమీ అనుకున్నట్లు లేదు. పది నిమిషాల తర్వాత సావట్లోకి బిస్కట్లుంచిన ప్లేటూ, కాఫీ కప్పులతో ఆమె వచ్చింది. ఆమె ముఖాన చిరునవ్వు అల్లాగేవుంది. కోపంతాపం ఏమీ కనబడలేదు. కాని, అతనికి సంకోచం తీరలేదు. "క్షమించు" అన్నాడు.

సుధ చిరునవ్వుతో "ఎందుకు?" అనేసింది. మరుక్షణంలో ఆతని మనస్సులోని బెరుకు గమనించింది. సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కేయి. "చల్లారిపోతుంది. ముందు తాగండి." అంటూ కప్పు చేతికిచ్చింది. ఇద్దరూ ఒక్కనిమిషం నిశ్శబ్దంగా కూర్చున్నారు. కామేశ్వరరావు మనస్సులోంచి ఆ బెరుకు తీరడంలేదు.

"నీకు కోపం వచ్చిందేమో నని..."

ఆమె అతి సాధారణంగా "కోపం ఎందుకు?" అంది.

ఎందుకని చెప్పాలో కామేశ్వరరావుకు తోచలేదు. ఎందుకు కోపం వచ్చిందనుకొంటున్నాడో ఆమెకు తెలియదా? వూరుకున్నాడు.

సుధ బిస్కట్లపళ్లెం అతనివేపు జరిపి "తీసుకోండి" అంది. తానొకటి తీసుకొని మునిపంట కొరుకుతూ కాఫీ చప్పరించింది.

అతని దృష్టి కాఫీ మీద లేదు. జేబులోంచి టైపుచేసిన రెండు కాగితాలు తీసి టీపాయ్ మీద పరిచేడు. సుధ మరల అదే ప్రశ్న వేసింది "అదెందుకు?"

కామేశ్వరరావు ఆమెవంక చూసేడు. పెదవులమీద అదే చిరునవ్వు. కాని, ఆకళ్ళలోది తన్మయత్వమా? నిర్లిప్తతా? అవశత్వమా? అతనికి భయంవేసింది. లేచివెళ్ళి ఆమె సోఫాలో ప్రక్కనే కూర్చున్నాడు. ఒకచేత్తో ఆమె చేతిలోని కప్పు అందుకొని టీపాయ్ మీద పెట్టేశాడు. రెండోచేయి ఆమె నడుముకు చుట్టి దగ్గరకు లాక్కున్నాడు. మేల్కొలుపుతున్నట్లు 'సుధా' అన్నాడు.

ఆమె అతనికి చేరగిలబడిపోయింది. కళ్ళు మూసుకొని నిస్తబ్ధంగా వుండిపోయింది. ఆమెతలను భుజానికి చేర్చుకొని కామేశ్వరరావు ఇత్తుకొన్నాడు. కన్నీటిబొట్లు చొక్కామీద జారుతున్నట్లనిపించి ఉలిక్కిపడ్డాడు. ఆమె ముఖాన్ని ఎత్తడానికి ప్రయత్నిస్తూ "సుధా! ఏమిటోయ్, ఎందుకోయ్!" అంటూ ఆవేదన ప్రకటించేడు.

తన ముఖం అతని రొమ్ములో [illegible]ంటూ సుధ ఏడుపు నణుచుకొనేందుకు పెదవులు బిగపట్టుకొంది. ఆమె ఎందుకు ఏడుస్తూందో ఎల్లా వూరడించాలో అర్థంకాక కామేశ్వరరావు నిశ్శబ్దంగా ఆమెను మరింత దగ్గరకు తీసుకున్నాడు. తల నిమురుతూ, గడ్డం పుణికేడు. సుధ క్షీణస్వరంతో "మీరు ఇక్కడే వుండండి." అంది.

కామేశ్వరరావు ఆమె కళ్ళను ముద్దుకొన్నాడు. పెదవులకు ఉప్పగా తడితగిలింది. ఉద్వేగంతో ఆమెను మరింత దగ్గరగా చేర్చి పట్టుకొన్నాడు. "ఎందుకేడుస్తావు సుధా," అన్నాడు.

"నిన్ను వదలి ఎక్కడికీ వెళ్ళను. అది చెప్పడానికే వచ్చాను" అన్నాడు ఒక్క నిముషం ఆగి, తానూ వుండలేనట్లు ఆమె అతనిని మరింత హత్తుకుంది. కామేశ్వరరావు టేబిలుమీద వున్న కాగితాలను చేతితో తట్టుతూ, తన ఆలోచనను వివరించేడు.

"రిజిస్ట్రారుకు నోటీసులు. సంతకంపెట్టి రేపు ఇచ్చేద్దాం. నెలనాటికి పెళ్ళి రిజిస్టరు చేయించుకుందాం."

సుధ ఆ మాటలను విన్నదో, లేదో అర్థంకాలేదు. ఆమె చాలసేపటివరకూ, కళ్ళు మూసుకొని అతనిని జేరబడి అలాగే కూర్చుండిపోయింది. క్రమంగా తేరుకుని లేచింది. తన బలహీనతకు సిగ్గుపడుతున్నట్లు "ఎక్స్క్యూజ్‌మి" అంది. అతడామె చేయి పట్టుకొని దిగలాగుతూ "ఎక్కడికి, కూర్చో" అన్నాడు.

"ముఖం కడుక్కువస్తా."

* * *

ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులలో పోస్తూ సుధారాణి చిరునవ్వుతో అతని ముఖం వంక చూసింది.

"మధ్యాహ్నం ఫోనుచేశాను. ఎవరూ చెప్పలేదూ?" అంది.

"ఎన్ని గంటలకి?"

"రెండయిందనుకొంటా. మీరు అప్పుడే బయటకు వెళ్ళేరన్నారు".

"మధ్యాహ్నం క్లాసుల్లేవు."

"ఎక్కడికి వెళ్ళారా అనుకున్నా. మీ చెల్లెలు కూడా లేదు ..."

"ఆమె లేదు గనక రాననుకున్నావా?" అన్నాడు కామేశ్వరరావు. దన నిజాయితీనే శంకించినట్లనిపించి చిన్న పుచ్చుకున్నాడు.

అది తన ఉద్దేశం కాదన్నట్లు సుధ "ఛ, ఏంమాటండీ అది" అంది.

"మరి?"

"నిన్నరాత్రి ఒక్కర్తెనూ ఈ యింట్లో వుండలేకపోయాను" అంటూ ఆమె తల తిప్పుకొని ఎటోచూస్తూ "మీ చెల్లెలు వుంటే ఒకే కబుర్లు చెప్పేది. ఆమెలేని లోపం బాగా కనిపించింది" అంది.

ఆమె ఏమంటుందో విందామన్నట్లు కామేశ్వరరావు ఆచి, ఆచి అన్నాడు.

"నిన్నరాత్రి రేణిగుంట ప్యాసెంజరు వచ్చేసరికి బాగాపొద్దు పోయింది".

"అందులోనా వస్త. అదెప్పుడూ వేళకు వచ్చిచావదు".

"రాత్రి ఒంటి గంటయింది ..."

ఒక్క నిముషం ఇద్దరూ మాట్లాడలేదు. కామేశ్వరావే అన్నాడు.

"ఇక్కడికే వద్దామనుకున్నాను, కాని."

"వచ్చెయ్యకపోయేరా?"

"ఇప్పుడు అంటున్నానే గాని, అప్పుడా ధైర్యం లేకపోయింది ..." అన్నాడు కొంటెతనంగా.

"ఇది మీ యిల్లు ... మిమ్మల్ని లేవగొట్టి మీ చెల్లెలూ, నేనూ ఆక్రమించుకున్నాం కదా."

"తీరా వస్తే నువ్వు తలుపు తియ్యక పోతే" అన్నాడు హాస్య ధోరణిలో.

ఈ మారు సుధ చిన్నపుచ్చుకుంది.

"మిమ్మల్నంత భయపెట్టేనా?"

కామేశ్వరరావు సర్దుకొని, ఆమె బుగ్గ మీద చేతితో రాస్తూ

"మనం ఏమిటో తేలే వరకూ ..."

సుధ అతని చేతిని తన చెక్కిలి మీదనే అదిమి పట్టుకొని, తల వంచుకుంది.

"ఇంకేం తేలాలి". అంది సన్నగా. ఆమెకళ్ళలో నీరు తిరుగుతున్నట్లనిపించి కామేశ్వరరావు కంగారుపడ్డాడు. ఆమెను చేరదీసుకొని కోపం వచ్చిందా? పొరపాటే అయిపోయింది. క్షమించు" అన్నాడు.

"ఛ. అదేంకాదు" అంది సుధ తలతిప్పుకొని.

"ఇంక ఆ కళ్ళ నీళ్ళెందుకు?"

"ఏమో. నాకేం తెలియదు" అంటూంటే ఆమెకంఠం డగ్గుత్తిక అయింది.

కామేశ్వరరావు ఆమెను దగ్గరకు లాక్కుని కళ్ళు తుడచేడు.



BRAOU

ఆమె కన్నీళ్ళకు కారణం దుఃఖాతిరేకంకాదు. నిజానికి నిన్నటినుంచీ మనస్సంతా గంద్రగోళంగా ఉంది. ఏమీ తోచలేదు. కిటికీలవద్దా, గుమ్మాల వద్దా ఎన్నో మాట్లు, ఎంతెంతో సేపు నిలబడిపోతూ వచ్చింది. సోఫాలలో వందలమార్లు కూర్చుని లేచింది. తెప్పించుకున్న భోజనం తినకుండానే పనిమనిషికి ఇచ్చివేసింది. ఆ ఉద్విగ్నతకు కారణం చెప్పలేదు. కాని, కామేశ్వరరావు కనిపించేక ఇప్పుడే మనస్సు కుదుట పడింది. అయినా కళ్ళ నీళ్ళు వస్తున్నాయి. అది ఏడుపూ కాదు. ఎందుకో, ఏమిటో ఆమె చెప్పలేకుండా ఉంది. నిన్నటి నుండి పడిన ఆరాటమంటా అతనికోసమే అనిపిస్తూంది. నాలుగయిదేళ్ళుగా మధ్య ఏదో చెప్పలేని ఉద్వేగంతో మనస్సు అనేక మార్లు వికలం అవుతూనే వచ్చింది. కాని, ఎన్నడూ ఇప్పటిలా మనస్సు శాంతి పొందులేదు. సంతృప్తి కలగలేదు. ఆ సంతృప్తే ఈ కన్నీటికి కారణమేమో.

సుధ మాటను మార్చబోయింది. కాని విజయం పొందలేక పోయింది.

"మీరు ఇక్కడికే వచ్చెయ్యండి" అంది చివరకు కామేశ్వరరావు కొంటెతనం చెయ్యబోయేడు. "మరి నువ్వు?"

"హాస్టలుకి వెళ్ళిపోతా." అతి శాంతంగా సమాధానమిచ్చి ముఖం వంక చూసింది. కామేశ్వరరావు తెల్లబోయేడు.

"నే నొక్కడినీ ఈ యింట్లో ఉండగలనా?"

అతని స్వరంలో బేలతనం వినిపించి సుధ నవ్వింది " మగాళ్ళు మీరే ఉండలేక పోతే నే నుండగలనా?"

కామేశ్వరరావు ఆలోచిస్తున్నట్లు ఒక్క నిమిషం ఊరుకున్నాడు.

"చూడు సుధా! నాకు సాయంగా ఉండు. ఏమిటభ్యంతరం?"

"అమ్మ బాబోయ్!" అని సుధ భయం ప్రకటించింది. ఆమె కళ్ళలో కనిపిస్తున్న నవ్వురేకలు, ఆ ప్రతిపాదనను ఆలోచించవలసినదిగానే ఒప్పుకొంటున్నా, ఆమె అది పనికి రాదన్నట్లు తల తిప్పింది.

"నువ్వు కాలు క్రింద పెట్టనక్కర్లేకుండా చూసుకొంటా ..." నంటూ అనునయ పూర్వకంగా పెద్ద ప్రలోభం ఎదుట పెట్టేడు.

సుధ అతిగంభీరంగా ముఖం పెట్టింది.

"భరించలేను"

కామేశ్వరరావు ఒక్క నిమిషం ఆలోచించి సోఫాలోనే కొంచెం ఎడంగా జరిగేడు. సుధ అతని చేయి వదలకుండానే ముఖంలోకి చూసింది.

"నీ ఆజ్ఞలేనిదే నిన్ను ముట్టుకోను. మాట్లాడను. చివరకు నీవేపు కూడా చూడను. ఈ యింట్లో నువ్వుంటే చాలు. ప్లీజ్!"

"ఏ మాత్రం సాధ్యం కాదు" అంటూ అతని దగ్గరకు జరిగింది.

కామేశ్వరరావు మళ్ళీ ఆలోచించేడు.

"నీ ఇష్టం వచ్చిన షరతులు విధించు నువ్వు చూపిన చోట కళ్ళు మూసుకొని సంతకం పెట్టేస్తా."

సుధ ఈ మారు బల్ల మీది కాగితాలు తీసి ఒకమారు చదివింది. అతని జేబులోంచి పెన్ను తీసి సంతకం పెట్టేసింది.

కామేశ్వరరావు ఒక్క నిట్టూర్పు విడిచేడు. "ఇంత త్వరగా ఒప్పుకొంటావనుకోలేదు సుధా!" అన్నాడు.

"అలా అనుకుంటూ ఈ కాగితాలెందుకు తెచ్చేరు" అంది. కామేశ్వరరావు ఆ ప్రశ్నకు ఉలికిపడ్డాడు. రెచ్చగొట్టి లొంగతీసుకొంటే సంతకం పెట్టకేంచేస్తుందనే ధైర్యంతోవచ్చేవా అని అడుగుతున్నట్లనిపించింది చిన్న పుచ్చుకొన్నాడు.



BRAOU

అనుమానించకు సుధా! నా మనస్సులో ఎలాంటి దురుద్దేశం లేదు, నమ్ము".

అతని మాటలు అర్థం కాక సుధ తెల్లబోయింది ... "అనుమానం ఏమిటి? ... దురుద్దేశం ఏమిటి?" ఆమె తాను ఏమన్నానా అని జ్ఞాపకం చేసుకొనేందుకు ప్రయత్నించింది. కామేశ్వరరావు తన స్థితిని వివరించే ప్రయత్నం చేసేడు.

"వివాహం జరక్కుండా ... తప్పే అనుకో. కాని ... తప్పేమిటో చెప్పలేకపోయేడు. ఆ మాట విరుపే తప్పును చెప్తోంది. సుధకు అర్థం అయింది. చటుక్కున నోరుమూసింది.

"చాల్లెండి. అది తప్పే అయితే రెండో మనిషి సాయంలేనిదే జరిగితే తప్పుకాదు" – అంటూ మరింత సిగ్గుపడి అతని ఒడిలో తలదాచుకుంది. కామేశ్వరరావు ఆమె మీదుగా వంగి చెవిలో 'థాంక్స్' అన్నాడు, అతని మనస్సులోని బెరుకు తీసింది.

"ఈ విషయం మాట్లాడాలనే ఇందాక ఫోన్‌చేశాను" అంది సుధ.

"ఇంత కాలానికి దయ కలిగిందన్నమాట" అంటూ అతడామెను గాఢంగా కౌగిలించుకున్నాడు. "ఏడాది పై నుంచి అడుగుతూంటే జరుపుకువస్తున్నావు. ఈ వేళ నీకీ ఆలోచన ఎందుక్కలిగింది" అంటూ ఆనంద పడ్డాడు.

సుధ కారణం చెప్పింది. రెండురోజుల క్రితం వచ్చిన సంబంధాన్ని తన తండ్రి ఆచార శ్రద్ధ వలననే త్రోసి పుచ్చేడని ఆమెభ్రమ. ఆ భ్రమే ఆమె కళ్ళు తెరిచింది. పెళ్ళి కొడుకు తమ్ముడు మతాంతరురాలిని పెళ్ళి చేసుకోవడమే అభ్యంతరంగా భావించేవాడు ఆయన. వరుడే కులాంతరుడుకావడానికి ఒప్పుకుంటాడా? ఆ వ్యతిరేకత ఉంటుందని ఆమె ఎరుగును. అందుకే ఇంత వరకూ తన రహస్యాన్ని కాపాడుకొంది. ఆమె తన వాళ్ల అభ్యంతరాల్ని ధిక్కరించాలని నిశ్చయించుకొనే ఉంది. ఆ విషయంలో సందేహం లేదు. తాను స్వతంత్రురాలు. సంపాదించుకొంటూంది. తల్లిదండ్రుల దయాధర్మభిక్ష అక్కర్లేదు. కాని, తన వాళ్ళ మూర్ఖపు పట్టుదలల నామె ఎరుగును. తానీ పెళ్ళి చేసుకొంటే వారు తన సహాయం తీసుకోరు. నిరాధారస్థితిలో ఉన్నారు. తన చెల్లెలు చదువు పూర్తిచేసి బయటపడితే, ఆమె ఆదుకుంటుంది. వాళ్ళు మాడిపోనక్కర్లేదు. ఆ ఆలోచనలతోనే ఆమె తన రహస్యాన్ని దాచింది. కాని, ఇంకా దాచుకోడానికి వీలులేదనిపించింది. వూరుకోవడం తనకూ, కామేశ్వరరావుకూ ద్రోహం చేసుకోవడమే. తనమీద ఆశ పెట్టుకొని అతడూ తండ్రి ప్రయత్నాలనూ, లక్షరూపాయల వరకూ ప్రలోభాల్ని కూడా తోసివేస్తున్నాడు. అతనితో తాను సుఖపడగలదు. అతని చుట్టూ వూహలతోనే తాను ఎంతోజీవితాన్ని కల్పించుకుంది. దాని తండ్రి ఆచారపు పట్టుదలకు బలి పెట్టలేదు! పెట్టదు!!

ఆ నిశ్చయం తోనే ఆమె బెజవాడ నుంచి బయలుదేరింది. కాకినాడ చేరిన మొదటి రోజునే తన ఒంటరితనం మహాభయంకరంగా కనిపించింది. ఆ ఒంటరితనాన్ని ఒక్కరోజుకూడా భరించలేననుకుంది. కామేశ్వరరావును పిలిచి రిజిస్ట్రేషను మాట మాట్లాడాలనుకుంది పిలిచింది. కాని, అతడులేరన్నారు. కుముదే వుంటే ననిపించింది. ఆమెను చూడడానికి తప్పకుండా వచ్చేవాడు అనుకొంది.

సుధ వున్న పరిస్థితిలోనే కామేశ్వరరావూ వున్నాడు. వెంటనే రిజిస్ట్రారుకు పంపవలసిన దరఖాస్తులు టైపు చేయించి తన సంతకం పెట్టేశాడు, తెచ్చేడు.

గడియారం చూసేడు. అయిదయింది. "ఈ వేళకి వ్యవధిలేదు. రేపు పొద్దున్నే ఇచ్చివస్తా" అన్నాడు.

"ఇద్దరం కలిసేవెడదాం. ఇద్దరూ వెడితే రేపేరిజిస్టరు చేస్తారేమో" అంది.

"చెయ్యరు. మన దరఖాస్తుమీద అభ్యంతరాలుంటే నెలలోపున తెలియపరచాలని వాళ్ళు ఆఫీసు బోర్డులో నోటీసు కడతారు. అదంతా ఒకతంతు. ఆనోటీసు చూసేవాళ్ళేవుండరు. సాధారణంగా అభ్యంతరాలు పెట్టే స్థితీ ఉండదు. ఒక్కొక్కప్పుడు చట్టాలకు భిన్నమైన ఘటనలు జరగొచ్చు. అటువంటి సందర్భాలలో తమ బాధ్యత లేదని తప్పుకోడానికి అదో మార్గం, అధికారులకి అంతే"

BRAOU

తమ వివాహానికి చట్టం వేపునుంచి వ్యతిరేకత వుందేమో సుధకు తెలియదు. ఇంతకు పూర్వం తెలుసు కోవాలనే ఆలోచన ఆమెకుకలుగలేదు. రిజిస్టర్డు పెళ్ళి విందులకు వెళ్ళింది. అయితే, ఆ పెళ్ళి తంతులను ఆమె ఎరుగదు. వానికిగల విధినిషేధాలను ఆమెఎరుగదు. కనక కామేశ్వరరావు అభ్యంతరాల మాట ఎత్తేసరికి ఆందోళన ప్రకటించింది. అంతర్వర్ణ వివాహాలు చట్టవిరుద్ధం కాదు. తామిద్దరూ అవివాహితులు, అదీ సమస్య కాదు.

"అయితే మా నాన్నాగారో, మీ నాన్నగారోఅభ్యంతరం చెప్పవచ్చునా?" అంది.

కామేశ్వరరావు దిలాసా ఇచ్చేడు. తామిద్దరూ కూడా ఇరవయ్యొక్క ఏళ్ళ వ్యవధి దాటేసేరు. దాటికూడా నాలుగైదేళ్ళు గడిచిపోయింది.

అయినా, దరఖాస్తు ఇచ్చిన నెలరోజుల వ్యవధిదాటేకగాని రిజిష్టరు చెయ్యరు. సుధ నిరుత్సాహపడింది. మరోనెల ఒంటరిగా వుండాలంటే ఆమెకెంతో కష్టం అనిపించింది. వివాహం చేసేసుకుందామనుకొన్నాక రెండు రోజుల గడువుకూడా కష్టమే. ఎంతో నిరుత్సాహంగానే అంది. "ఈనెలా నేను హాస్టలుకి వెళ్ళిపోతాను."

కామేశ్వరరావు ఉలికిపడ్డాడు. "ఎందుకు?"

సుధ ఎంతో భయంకనబరుస్తూ గుడ్లింత చేసింది.

"అమ్మో! ఇంకేమన్నా వుందా?"

ఆమెది లోకభయం. కామేశ్వరరావు అన్యథా అర్థం చేసుకొన్నాడు. తలవంచుకుని "జాగ్రత్తగా వుంటానుధా!" అన్నాడు.

సుధ నెమ్మదిగా 'అదేం కాదండి'.

"మనిద్దరం పెళ్ళికాకుండా అలా ఒకే ఇంటవుంటే కాలేజీలలో మన మర్యాద వుంటుందా?"

"అంటే ఈ నెల్లాళ్లూ కనిపించవన్నమాట" అన్నాడు నిరుత్సాహంగా.

"మీరక్కడకు వస్తూండొచ్చు కదా."

"నువ్వు మాట్లాడవు."

"ఉలకం !"

"నిజమే సుధా! స్టూడెంట్సూ, కో లెక్చరర్లూ ఏమనుకుంటారోనని దగ్గరగాకూర్చోవు" అంటూ అతడామెను దగ్గరకు లాక్కున్నాడు. ఆ సమయంలో వారు కూర్చున్నంత చనువుగా హాస్టలులో వుండలేరు. కాని మార్గాంతరం ఏంవుంది?

"సుధా! ఎవరు ఔనన్నా, ఎవరుకాదన్నా మనకు పెళ్లయి పోయింది."

ఒక అరగంట క్రితం నడిచిన సంఘటనను వుద్దేశించి అతడామాట అంటున్నాడని ఆమె గ్రహించింది. అతడా విషయాన్నే ఆలోచిస్తూండడం ఆమె కిష్టంకాదు. ఆ సంఘటన పెళ్లికి పర్యవసానం కావాలిగాని, అదే పెళ్లి కాజాలదు. ఆ ఆలోచనతోనే అభ్యంతరం తెలుపుతూంది.

"ఎవరన్నా అడుగుతే?"

"ఈ కాపురాలు చేస్తున్న వాళ్ళందరి మొహాలూ పెళ్లి తేదీలు ముద్రవేసి వుంటాయేమిటి?"

కాని, వివాహాన్ని ఆమె అంత చులకనగా తీసుకోలేక పోయింది. అభ్యంతరం తెలిపేదే. అంతలో వీధిలోంచి పిలుపు వినిపించింది. ఇద్దరూ వులికిపడ్డారు.

"శామ్యూల్ గారూ!" అంటూ సుధ లేచింది.

"దయచెయ్యండి ఫాదర్" అంటూ కామేశ్వరరావు ఎదురు వెళ్లేడు. శామ్యూల్ సావట్లోకి వచ్చేడు.

"ఓ! మీరాబాబూ! ఎప్పుడొచ్చేరు? చెల్లెలిపెళ్లి బాగా అయిందా? అత్తవారింటికి..."



BRAOU

కామేశ్వరరావు చిరునవ్వుతో "వెళ్ళిందండి. దానిని అలా పంపించి, మేము ఇల్లా బయలుదేరేం." అన్నాడు.

"పనిలో పని – మీరు కూడా..." అని వృద్ధుడు శామ్యూల్ హాస్యమాడేడు.

"చిత్తం, మీ చలవ..." అన్నాడు, కామేశ్వరరావు నవ్వుతూ.

శామ్యూల్ ఆశ్చర్యంతో 'నిజంగా' అన్నాడు..." ఎప్పటి నుంచో చెప్తూనే వున్నా. మంచిపని చేశారు... ఏమమ్మా! నిన్ననగా వచ్చి మాచెవిని వేశావేకాదు సిగ్గుపడ్డావా? అంత సిగ్గు కూడదు."

ఆ శుభవార్తను సుధ చెప్పకపోవడానికి కారణం కామేశ్వరరావు చెప్పుకొన్నాడు.

"ఇద్దరం కలిసి వెడదాం. అంతవరకు చెప్పవద్దని నేనే అన్నాను."

"అందుకేనా అటువేపు కూడా రాకుండా మొగం చాటుచేశావు? అని శామ్యూల్ మరో కొత్త అభియోగం తెచ్చేడు.

ఆ ఇంట్లోకి వచ్చినప్పటి నుంచీ తమకెంతో ఆసరాగా వున్న ఆ ముదుసలి ఫాదరీ ఎదుట అబద్ధం ఎప్పడానికి సుధ సిగ్గుపడింది. ఏమిటిది అన్నట్లు కామేశ్వరరావు ముకంవేపు చూసింది. అతడు చిరునవ్వు తప్ప మరేమీ సమాధానం ఇవ్వలేదు. మాట్లాడకుండా ఆమె చేయిపట్టుకున్నాడు.

"పెద్దలు తమరు మమ్మల్ని ఆశీర్వదించాలి" అని చేతులు జోడించేడు.

"వట్టి నమస్కారం పెట్టకూడదు. వుండండి" అంటూ సుధ లోనికి పరుగెత్తింది. శామ్యూల్ పెద్దగా నవ్వేడు.

"ఉండండి. మార్తమ్మను పిలుస్తాను. తలుపు తీసిఉంది. అమ్మాయిలు వచ్చేరేమో చూసిరమ్మని పంపింది. ఆవిడే."

మాటలోనే మార్తమ్మ కూడా ఆయాసపడుతూ గుమ్మంలో హాజరయింది. రెండు చేతులలోనూ రెండు బత్తాయిలూ, ఇన్ని తమలపాకులతో తిరిగివస్తున్న సుధ ఆమెను ఆహ్వానించింది.

"రండి మార్తమ్మగారూ !"

"చూడు, ఈ పిల్లగాళ్లు మనతో చెప్పకుండా చెయ్యకుండా పెళ్లి చేసేసుకొన్నారుట." అని శామ్యూల్ భార్యతో ఫిర్యాదు చేశాడు. ఆమాట వినగానే ఆమె నవ్వింది.

"చేసుకున్నారూ ? నేను చెప్పలేదూ ? మంచిపని చేశారు..." అని అభినందిస్తూ మార్తమ్మ అక్కడున్న కుర్చీపీటమీద చదికిలపడింది.

"కుముదమ్మ పెళ్లికి వెళ్లేటప్పుడు నీవూ చేసుకువచ్చేయ్యమన్నా, నామాట నిలిపేవన్నమాట" అంది.

సుధ చిరునవ్వుతో – "పెద్దవాళ్లు చెప్పేక కాదనడం మంచిది కాదు." అంది.

నలుగురూ నవ్వేరు.

"ఇప్పుడింక రిజిస్టరీ చేయించుకోవాలి"

"మంచి ఆలోచన. రేపే వెళ్ళి ఇచ్చెయ్యండి. మళ్లీ ఆలస్యం చేయవద్దు." అన్నాడు శామ్యూల్.

"కానియ్యండి. మరి మాకు పెళ్లి విందెప్పుడేమిటి?" అన్నాడు శామ్యూల్.

"ఇక్కడ ఈ రెండు మూడేళ్ళుగా ఉంటూండడంచేత మాయిద్దరికీ ఎందరో స్నేహితులు ఏర్పడ్డారు. అందర్నీ ఏదో రూపంలో పిలవాలి. వారందరిముందే రిజిస్ట్రేషను తతంగం పూర్తిచేయాలనిపించింది. ఇవిగో అప్లికేషన్లు టైపుచేయించేను. ఇద్దరం సంతకాలు పెట్టేశాం. పంపడమే తరవాయి" అంటూ కామేశ్వరరావు తన ఆలోచనలను వివరించేడు.

BRAOU

శామ్యూల్ ఆ కాగితాలు తీసుకొని ఒక్కమారు చదివేడు. తిరిగి ఇస్తూ "బాగుంది. రేపు మొట్టమొదట ఆ పని చూసిరాండి" అంటూ లేచేడు.

నూతన దంపతుల్ని మరునాడు రాత్రికి తమ యింట విందుకు ఆహ్వానిస్తూ మార్తమ్మ లేచింది.

సుధ కామేశ్వరరావు వంకచూసింది. అతడు చిరునవ్వుతో తమ యిద్దరితరఫునా వారినే ఆహ్వానించేడు.

"మాకు బాగా సన్నిహితంగా ఉండే ఓ పాతిక మందికి రేపిక్కడ డిన్నరు ఏర్పాటు చేయాలనుకుంటున్నాము. మీరిద్దరూ తప్పక దయచెయ్యాలి."

•  •  •

ఆ వృద్ధదంపతులు వెళ్ళిపోయాక కూడా తాము ఆడిన అబద్ధం గురించి సుధ ఆలోచిస్తూనేవుంది. "అలాగ అబద్ధం ఆడకపోతే బాగుండేదేమో" అంటున్న ఆమెను కామేశ్వరరావు సోఫాలో కూర్చుండబెట్టి తాను పక్కనే కూర్చున్నాడు.

"ఏం? ఎందుకు? అందులో అబద్ధం ఏవుంది? అగ్నిహోత్రం ముందు పుస్తె ముడి వేస్తేనే పెళ్ళా?" అటువంటి ప్రశ్నలనేకం. సుధ వానికి స్పష్టమైన సమాధానం ఇవ్వలేక పోతూంది. కాని, సర్దుకోనూ లేకుండావుంది. చివరకు తమ క్షేమంకోసమేనా ఆ అబద్ధాన్ని కొస ముట్టచూడక తప్పదన్నాడు కామేశ్వరరావు.

"చూడు సుధా! మనమేమీ అబద్ధం ఆడడంలేదు. మానసికంగా, శారీరకంగా మనం ఆలుమగల మయ్యాం. సంఘం శాంక్షన్ రాలేదు. దానినే మరో రూపంలో చట్టంనుంచి తెచ్చు కొంటాం. కానీ, నీ మనస్సులో ఏదో సంకోచం మెదులుతూంది. అదేమిటో చెప్పలేవు. కాని మరేంకాదు, నేను నిన్ను మోసం చెయ్యకుండా ఆత్మరక్షణకో..."

"నాకటువంటి ఆలోచనలేదు. లేనిది కల్పించుకోకు" అంది.

"నీ మనస్సులో లేదు. నే నెరుగుదును. కాని, ఆ సంకోచానికి వెనుకనున్న భయం అదే. మనం ఆలుమగలం అన్నదానికి సాక్ష్యం ఏదీ లేదు.కుటుంబరావుగారు వ్రాసినట్లు నిజమైన పెళ్ళిళ్ళకు సాక్షులే ఉండరు. లే, ఇంకేమీ ఆలోచనలు పెట్టుకోకు. సినీమాకు టైం ఉంది. రేపటి విందుకు ఆహ్వానాలు ప్రెస్‌లో ఇచ్చేసి, అల్లా పోదాం."

## 9

రాత్రి పది గంటలకు ఆ జంట ఇంటికి తిరిగి వచ్చేరు.

తలుపు తెరిచింది మొదలు సుధ పెద్ద ఆలోచనలో పడింది. కామేశ్వరరావుతో ఎలా వ్యవహరించాలో ఆమెకు అర్థంకావడంలేదు.

అతడిని తాను వివాహం చేసుకోదలచింది. అప్రయత్నంగా, ఏదో ఉద్రేకంలో తమకు శారీరక సంబంధం కలిసింది. ఆ బలంమీదనే అతడు తమకు వివాహం జరిగిపోయిందంటున్నాడు. సరాసరి వచ్చి ఇంట్లో మకాం పెట్టేస్తున్నాడు. ఆ అబద్ధం తనకు నచ్చలేదు. కాని, అతడక్కడికి వచ్చెయ్యడం బాగానే ఉంది. తప్పులేదు. అతడే తన వరుడు. అతడు రావాలనే తాను కోరింది. మధ్యాహ్నం ఫోన్ చేసింది కూడా అందుకే. అయితే అప్పుడామెకు ఈ సమస్య ఏ రూపందాల్చుతుందో తెలియలేదు. తాను ఒకర్తే ఆ యింట ఉండలేదు. అతడు కావలసినవాడు, ఆ అధికారంతో సాయంపిలిచే హక్కు తనకు ఉన్నదని తలచింది. కాని, ఇప్పుడాతని ఉనికినీ సర్దుకోలేకుండా ఉంది.

అతనికి పక్క ఎక్కడవెయ్యాలి? చిన్నసమస్యే. ఇంతకాలం తానాతని సాన్నిహిత్యానికి పరితపించింది. కాని, ఈ క్షణంలో తపన కన్న భయం ఎక్కువగా ఉంది. తమకు పెళ్ళికాకపోవడం తనమనస్సుని బిగపట్టి ఉంచుతూంది. అంతక్రితమే తమమధ్య ఏర్పడిన అనుబంధంకూడా ఆ ఆటంకభావనని తోసివెయ్యలేకుండా ఉంది.



BRAOU

తాను కోరినమనిషి తనే కావాలని వచ్చేడు. కుటుంబంలో వచ్చేగొడవల్ని నిర్లక్ష్యం చేశాడు. వేల ధనం కాలతన్నేడు. తనతో జీవితం ముడిపెట్టుకొంటున్నాడు. అటువంటివానికి దూరంగా ఉండవలసినంత నిషేధకమా, వివాహపు తంతు?

ఆమె పరధ్యానాన్నీ, దానికి కారణాన్నీ కామేశ్వరరావు గ్రహించేడు జాలికలిగింది. సినీమాహాలులో ఒక్కక్షణం విడవకుండా చెయ్యి కలిపి కూర్చుంది. ఆమె ఇప్పుడు ముట్టుకుంటే వెర్రిచూపులు చూస్తూంది. మనిషిలో ఉత్సాహంలేదు. పలకరిస్తే నవ్వు తెచ్చిపెట్టుకుంటూంది. తమకు వివాహం జరిగిపోయినట్లు అబద్ధం ఆడడం తప్పని ఆమె మనస్సులో బాధ. అబద్ధాలతోనా మనకాపురం ప్రారంభం అని ఓమారు నొచ్చుకొంది కూడా. అప్పుడు తాను పట్టించుకోలేదు. కాని, ఇప్పుడు పొరపాటు చేశాననిపిస్తూంది. ఆమెను చూశాక సంఘంలో ప్రచలితంగా ఉండే భావనలు ఎంత బలీయాలనిపించింది. తామున్నస్థితిలో వివామపుతంతుకి గాని, దానివెనక ముందులకు గాని విలువేలేదు. కాని, అవే ఆమె మనస్సుని కల్లోలం పరుస్తున్నాయి. ఆమెనుచూస్తే బాధకలుగుతూంది. కాని, సర్దుకోవడం ఎల్లాగ? తన కుటుంబాన్నీ, తన భవిష్యత్తునూకూడ నిర్లక్ష్యంచేసి తానే కావాలని, తననే అర్పించుకొన్న పడుచుకు బాధకలిగిస్తున్నానే అనుకొన్నాడు. పెళ్ళి అయ్యే వరకూ తాను తనగదికే వెళ్ళిపోతే? అనిపించింది, ఒక్కనిమిషం. కాని, తాను ఆడిన అబద్ధం దానికి పెద్ద ప్రతి బంధకం అయి కూర్చుంది. నవవివాహితులు అనుకుంటూ, చెరోచోటా, ఒకటిన్నరమైలు దూరంలో కాపురం పెడితే లోకులు ఏమనుకుంటారు? ఆమె హాస్టలు కెళ్ళినా అదేమాట వస్తుంది. తామిద్దరూ ఆ యింటకలిసి జీవించవలసిందిగా, తానాడిన అబద్ధం శిక్షవిధించింది. శిక్షమాటతోచగానే నవ్వువచ్చింది. ఆ శిక్షకోరదగినదే. మధురమైనదే. కాని....

కామేశ్వరరావు ఒక నిర్ణయానికివచ్చి సుధకోసం చూసేడు. ఆమె గదిలో అద్దం ముందు నిలబడి తలలో పువ్వులో తురుముకుంటూంది. ఆ విగ్రహం మనస్సుని వివశంచేస్తూంది. కాని, ఆమె మానసికస్థితి తనకు దూరంగా, గదిలో, తలలో తానే పువ్వులు తురుముకొంటూండడంలో విశదమవుతూంది.

కామేశ్వరరావు పిలిచేడు. "సుధా...."

ఆమె వెనక్కి తిరిగిచూసి. చిరునవ్వు నవ్వింది. కాని, ఆ నవ్వులో ఉత్సాహంలేదు. మాదకతలేదు. ఎక్కడికీ వెళ్ళలేదు. ఇక్కడేఉన్నా నన్నట్లుంది. కామేశ్వరరావు మనస్సు చివుక్కుమంది.

"కుముద మంచం ఉండాలి, ఎక్కడుంది? నేనిల్లా సావిట్లో కిటికీదగ్గర వేసుకుంటాను." అన్నాడు.

ఒక్కనిమిషం అతనిమాట ఆమెకు అర్థంకాలేదు. కళ్ళప్పగించి చూస్తూనిలబడింది.

"మామూలుగానే నువ్వు గదిలో పడుకో. తలుపుతీసుకొంటే భయంఉండదు" అని తన అభిప్రాయాన్ని మరోదిశనుంచి వివరించేడు.

తాను పిలవాలా ఏమిటనుకొని మొదట సుధతెల్లబోయింది. ఏమీ చెప్పలేకపోయింది. తర్వాత సర్దుకొంది.

"మీరే ఇక్కడ పడుకోండి. నేనేసావిట్లో వేసుకుంటాను."

అది సమాధానమూకాదు. పరిష్కారమూకాదు.

"చూడుసుధా, మనస్సు కష్టపెట్టుకోకు. రిజిస్ట్రారాఫీసుకి వెళ్ళివచ్చే వరకూ మనం దూరంగానే ఉందాం."

అతని ఆలోచన అర్థమయి సుధ నవ్వింది. "అసత్యానికిది పరిహారమా?"

"ఏమీకాదు. ఇప్పుడబద్ధాన్ని నిజంచెయ్యలేము. ఏమంటే అది అబద్ధముకాదు. అయితేనేం, నీ మనస్సులో అది తప్పులా మెదులుతూంది. నీకుబాధ కలగడం నాకిష్టంకాదు." అన్నాడు.

సుధకు ఆ ఏర్పాటు మొదట కొంచం తృప్తికలిగించినా త్వరలోనే తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తించింది.



BRAOU

కుముద వున్నపుడు అతడెప్పుడైనా ఆ యింట్లో పక్కవేస్తూండేవాడు. ఆనాడు ఇంకా పడుకోలేదా అనో, మంచినీళ్ళు కావాలా అనో, కాలేజీ కబుర్లేమిటనో పలకరించి, చాలరాత్రివరకూ కబుర్లుచెప్తూ కూర్చునేది. కుముద వినుక్కొనేది, అయినాతాము లెక్కచేసేవారుకాదు. కాని, నేడు వెళ్ళి పలకరించనే లేకపోయింది. దీపంతీసేసి, పడకవేసింది.

కొంతసేపయాక కామేశ్వరరావు గదిలోకి వచ్చేడు. నెమ్మదిగా 'సుధా' అనిపిలిచేడు. ఈ పద్ధతి అతనికి కొత్తగానేవుంది. తోచడంలేదు. బాగానూలేదు.

సుధ పలకలేదు కొంతసేపు కిటికీవద్దనున్న కుర్చీలో కూర్చునట్లు చప్పుడు పట్టి గ్రహించింది. ఆమెఏమీ అనలేదు. అలాకూర్చుండడమూ విసుపుపుట్టింది. లేచి మంచంవద్దకు వచ్చేడు. పక్కనే నీడలా కనిపిస్తూంటే సుధ అరమోడ్పు కనులతో గమనిస్తూంది. కూర్చోపెడేం అనిపించింది. నిగ్రహం కష్టమనిపిస్తూంది. చేయిపట్టుకులాగి కూర్చోబెట్టాలన్నంత ఉద్వేగం! తమకం, కాని నిగ్రహించుకుంది. కదలలేదు.

అతడు నిద్రపోతున్నదనుకొన్నాడు. వంగి ముఖాన్ని ముద్దుకొని వెళ్ళిపోయేడు.

అతడు అక్కడే వున్నంతవరకు సుధ నిగ్రహించుకో గలిగింది. కాని, అతడు వెళ్ళిపోయినాక ఇంక పడుకోలేక పోయింది. సాయంకాలంనుంచీ బాధిస్తున్న సందేహం ఇప్పుడు నిలబడడంలేదు. తనయెడ అతడు చూపుతున్న తమకం. తాను బాధపడతానని కనబరుస్తున్న నిగ్రహం చూసేక తాను నిలబడలేకుంది. ఈ విధంగా దూరంగా వుండడంలో తనకూ తృప్తిలేదు, సుఖంలేదు. అతడూ అదేస్థితిలో వున్నాడు. నిన్నటివరకు దొంగతనంగా ఒకరినొకరు ముట్టుకొని పరమానందంపొందిన తామిద్దరూ ఇప్పుడు దూరంగా వుండడం!

సుధ లేచి సావిట్లోకి వచ్చింది. నెమ్మదిగా అతడు పడుకున్న మంచం పట్టిమీద కూర్చుంది. కాని, కామేశ్వరరావు కదలలేదు. అతడు నిద్రపోవడంలేదు. తెలుసును. ఇంతకుముందేకదా తనగదికి వచ్చింది.

నెమ్మదిగా మీద చెయ్యివేసింది. అతడు కదలలేదు. మీదుగా వొంగి ముఖం తడిమింది. "కోపమా" అంటూ ముఖం మీద ముఖం పెట్టింది.

ఈ మారు కామేశ్వరరావు నిగ్రహించుకోలేకపోయేడు. రెండు చేతులు మెడకువేసి హత్తుకొన్నాడు. ముఖం ముద్దులతో నింపేడు.

కాని, సుధ సందేహం తీరలేదు. దీనంగా, కోపం తెచ్చుకో వద్దని అనునయిస్తూనే ఉంది. తనకేమాత్రం కోపంలేదని, ఆమె విషయంలో తాను కోపగించలేదని నిరూపించడానికి అతడు తాను కూడా ఆమె మంచంమీదికే మారేడు.

## 10

రుక్మిణి హాస్టల్ గదికి వచ్చేసరికి గుమ్మంలో పడిఉన్న కవరు కనిపించింది. ఎవరు వ్రాసేరా అనుకొంటూ చేతికి తీసుకొంది. వ్రాత పరిచితమైనట్లు తోచలేదు. విప్పిచూసింది. సంతకమూ కొత్తదే.ఆ ప్రభాకర రావు ఎవరో ఆమెకు తెలియలేదు. ఒక్కక్షణం ఆ ఉత్తరం తనదేనా అనిపించింది. కవరు తిరగేసింది. "శ్రీమతి రుక్మిణి" చిరునామా. తానింకా శ్రీమతి కాలేదు. కాని, ఆ హాస్టలులో మరో రుక్మిణి ఉన్నట్లు ఆమె కెట్టి జ్ఞప్తి తగలలేదు. పైగా తన డిగ్రీ, రీసెర్చిస్టూడెంటు అన్న వివరంతో సహా ఉంది... సందేహంలేదు. అది తనదే.

ఈమారు జాబు చదివింది. లెటర్‌హెడ్‌మీది పేరుకూడా ప్రభాకరరావు... ఇంజనీరింగ్ డిగ్రీ క్రింద తాత్కాలిక ఎడ్రసు - మద్రాసులో ఒక హోటలు గది.

ఎవరబ్బా అనుకుంది. లేఖ చిన్నది. నమస్తేకీ, భవదీయుడికీ మధ్యనున్నవి నాలుగేనాలుగు పంక్తులు.

నాలుగైదు రోజులక్రితము రైలుబండిలో సీటు ఇచ్చినందుకు కృతజ్ఞత తెలిపేడు. ఆ రోజున బండిలో సీటు దొరక్కపోతే ఇంటర్వ్యూవేళకు చేరగలిగేవాడు కాదు. ఉద్యోగం దొరికినా దొరక్కపోయినా తాను సరియైన వేళకు చేరకపోవడంచేతనే అవకాశం తప్పిపోయినట్టు బాధపడవలసి వచ్చేది. ఇప్పుడా మనఃక్లేశం లేదు. మళ్లీ ఇంకోమారు కృతజ్ఞతా నివేదనం. సెలవు అంటున్న ఆ ప్రభాకరరావు ఎవరో అర్థం అయింది.



BRAOU

ఆ జాబు చూసినవెంటనే ఆమెకు కలిగిన మొదటి భావం ఆత్మగ్లాని. ఆ రోజున రైలు స్టేషనులో తానెంత దురుసుతనంగా వ్యవహరించినదీ వేలుపెట్టి చూపినట్లయింది. ఆ దురుసుతనాన్ని వెక్కిరించడం లేదుగదా అని ఒక్కక్షణం అనిపించకపోలేదు. కాని, ఆ సూచన మాటలలో ఛాయామాత్రంగా వున్నట్టు కూడా కనిపించడం లేదు. తాను ధూర్తంగా వ్యవహరించిన తర్వాత తాను చేసిన చిన్న పాటి సహాయానికే కృతజ్ఞత చూపగల సత్సంస్కారం మాత్రమే ఆ లేఖలో కనిపించింది. ఆ సంస్కారం ముందు తన అవజ్ఞత మరింత బాధాకరంగా కనిపించింది.

స్నానం చేస్తున్నంతసేపూ అదే మనస్సులో మెదులుతూంది. తన అవజ్ఞతకు క్షమార్పణకోరుతూ వెంటనే జాబు వ్రాయాలని నిశ్చయించింది.

కాగితం, కలం పుచ్చుకొని టేబిలువద్ద కూర్చున్నప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆ రోజున తామిద్దరూ పరస్పర పరిచయం చేసుకోనేలేదు. ఈ జాబు చూసేవరకూ ఆయనపేరు ప్రభాకరం అని తానెరుగనే ఎరుగదు. ఆయనా తనపేరు అడగలేదు. మరి ఈ జాబు ఎల్లా వ్రాసేడు? తనను ఎరిగివుండునేమో. తానే మరచిపోయిందేమో- అనుకొంది ఒక్క నిమిషం. అతనిముఖం జ్ఞాపకం చేసుకొనేందుకు ప్రయత్నించింది. కాని సాధ్యంకాలేదు. ఆ రోజున అతనిని తాను సరిగ్గా చూడనేలేదు.

హోల్డాల్ ప్లాట్‌ఫారంమీద పారేసినప్పుడు కనిపించిన నిర్విణ్ణతా. పిలిచి సీటు ఇచ్చినప్పుడు కనిపించిన ఆనందమూ జ్ఞాపకం వచ్చేయి. విసిరేసినప్పుడు ఏమనుకొన్నాడో అనిపించింది. చటుక్కున సుధ చేసిన వేళాకోళం గుర్తువచ్చింది. ఆ రోజున అతనిని ఉద్దేశించే "ఎవరా హీరో" అంది. చూడముచ్చటగా ఉన్న పడుచువానిని చూసినప్పుడు పెళ్ళికాని పడుచులకు కలిగే ఆలోచనల ప్రతిధ్వని అది.

ఆయనకూడా అవే ఆలోచనలు కలిగి 'ఉద్యమం' ప్రారంభించలేదు గదా అనిపించింది. అయితే తాను మొదటచూసిన దురుసుతనం గుర్తువస్తూ ఆ అనుమానాన్ని నిలబడనీయ లేదు. కాని ఆయనకు తన ఎడ్రసు దొరికింది. కవరు మరల తీసింది. శ్రీమతి రుక్మిణి ఎం.ఎస్.సి. రీసెర్చిస్కాలరు- ఎ.యు. ఉమెన్స్ హాస్టల్... తాను శ్రీమతిని కాలేదని తెలియదు. తన ఇంటిపేరు ఎరగడు. తెలిస్తే పొడి అక్షరమైనా చేర్చకుండా ఉండడు. తన గది నెంబరూ ఎరగడు. వీని అర్థం ఒక్కటే. ఉద్యమం ప్రారంభించేవరకు ఇంతకన్న సమాచారం ఎక్కువ సేకరిస్తాడు.

ఆ రోజున జరిగిన సంఘటనలన్నీ గుర్తుకొచ్చాయి... బండి దిగేటప్పుడు సీటులో పుస్తకం ఉండిపోయింది. తిరిగివచ్చి అడిగినప్పుడు ఏం చేస్తున్నారని అడిగేడు. పేరు అడగలేదు. బహుశా పుస్తకంమీద ఉందేమో. ధ్రువపరచుకొనేందుకు షెల్ఫ్‌లోంచి ఆనాటి పుస్తకం తీసిచూసింది. ఆ అనుమానం నిజమే! పుస్తకంలో ఉంది.

"తెలివిగలవాడే..." అనుకుంది. వెంటనే కలం పట్టింది.

ఆ రోజున తాను చూపించిన తొందరపాటుకు ముందు క్షమార్పణ కోరుకొంది. తాను శ్రీమతిని కానని, ఇంకా కన్యనేనని యెందుకు చెప్పాలనిపించిందో ఆమెకే తెలియదు. ఎడ్రసు వ్రాసేటప్పుడు తనపేరుకు 'మిస్' చేర్చుకోవడం మరవలేదు. గదినెంబరు ఇచ్చి, మిగతా వివరాలు తీసేసి, ఆ సర్దుబాటులో ప్రత్యేకత కనబడకుండా చేసింది.

ఉత్తరం వ్రాసినంతసేపూ, ఒక అపరిచితవ్యక్తి తన విషయంలో కనపరచిన మర్యాదకు మారుగా, అతనియెడ తాను అంతకుముందు చూపిన ఔద్ధత్యానికి పరిహారంగా ఆ జాబు వ్రాస్తున్నాననిపించినా, మరుక్షణంనుంచి ఆ జాబును గురించిన ఆలోచనలే ఆమె మనస్సును ఆవరించేయి.

తన ఉత్తరం అందేవరకూ అతడా హోటలులోనే ఉంటాడనేముంది? ఇంటర్వ్యూ విఫలమైతే మద్రాసే వదలిపోవచ్చు. ఫలించి ఉద్యోగం దొరికితే బసచూసుకొని పోవచ్చు. ఏదిజరిగినా అతనికా ఉత్తరం అందే అవకాశం వుండదు. తాను తొందర పడడం అయిందేమో ననిపించింది.

అయితే అది ఎంతోసేపు నిలబడేదికాదు. ఉత్తరం అందిందా మంచిదే. ఆ నాడు ఏదో దుడుకుతనం చేసినా ధూర్తు, సంస్కారం లేనిదీ అనుకోడు. అందక అది హోటలు లెటర్ బాక్స్‌లోనే మిగిలిపోయినా.

BRAOU

మరేమయిపోయినా తన మనస్సుకి తృప్తైనా ఉంటుంది. తనయెడ ఏదన్నా దురభిప్రాయం ఏర్పడి ఉంటే అది తొలగవలసిన పనేమిటంటే ఆమెకు తోచలేదు.

అయితే ఆ ఉత్తరం సరిగానే అందింది. ఆవలి వ్యక్తి సరిగ్గానే అర్థంచేసుకున్నాడు అని నాలుగు రోజుల అనంతరం ఆమెకే అర్థమయింది.

ఆ రోజున యూనివర్శిటీ నుంచి వచ్చేసరికి గదిలో ఒక్కమారే నాలుగు ఉత్తరాలు పడివున్నాయి. వ్రాతను పట్టి చూస్తే దానిలో ఒకటి తాను ఎదురుచూస్తూన్నదేనని అర్థమయింది. చూస్తూనే పెద్ద బరువు దిగిపోయినంత సంతృప్తి కనబరచింది. "అందిందన్న మాట" అనుకొంది. పైకి అనకపోయినా, ఈ మాటు ఏం వ్రాసేడో చూడాలనుకొంది.

విప్పేవరకూ మనస్సు పురకలు వేసింది. తండ్రి వ్రాసిందొకటీ, కాకినాడనుంచి స్నేహితురాలు సుధ వ్రాసిందొకటీ. అంత తొందరనిపించలేదు. మరింకొటి హైదరాబాదునుంచి పూర్వపరిచితుడొకడు వ్రాసేడు. దానికీ అంతతొందరలేదు. వానిని పుస్తకాలతోపాటు టేబిలుమీద పడేసింది.

తీరాచూస్తే తాను ఆశించిన వివరాలేవీ అందులోలేవు. అతడు తన్ను గురించి ఒక్కమాట తెలుపుకో లేదు.

అతడు వెళ్ళిన ఇంటర్వ్యూ ఫలించలేదు. ఎడ్వర్టయిజు చేసినా ఉద్యోగానికి ఇదివరకే ఎవరినో నిర్ణయించుకొన్నారులావుంది అన్నాడు.

అతడు తననుంచి సమాధానం ఏదీ కోరలేదు. మనస్సులోని వ్యథను ఎవరికో చెప్పుకోడానికి వ్రాసినట్టుంది. దేశాన్ని ఏదో ఉద్ధరించాలని అమెరికాలో ఇచ్చిన ఉద్యోగాన్ని వదులుకు వచ్చేడు. ఈ ఏడాదీ నిరుద్యోగిగా ఉన్నాడు. ఈమారు మద్రాసు అనుభవంతో .మొగం మొత్తింది. అమెరికా తిరిగి పోవడం క్షేమం అనిపిస్తూంది. అంటూంటే రుక్మిణికి చాలా విచారం కలిగింది.

దేశానికేదో ఉపకరించగలమని వచ్చిన విద్యాధికుణ్ణి ఉపయోగించుకోలేని దేశ దురవస్థకు బాధ. ఆశ్రిత పక్షపాతంతో సమర్థుడైన వ్యక్తిని వదులుకున్న ఇన్‌స్టిట్యూట్ అధికారులమీద కోపం. అసహ్యం కలిగింది. అతని సమర్థత ఏపాటిదో తనకేం తెలియని యథార్థంతో దానికి నిమిత్తం లేదు.

ఒక నిమిషం పోయేక ఎదురు దెబ్బతగిలి దేశాన్నే వదలిపోవాలనుకుంటున్న ప్రభాకరరావును వట్టిపలాయనవాదిగా నిర్ధారణ చేసింది. నిర్వచనం దొరికేక ఆమె మనస్సు ఆ శబ్దం చుట్టూ పర్యటనం ప్రారంభించింది. చదువుకొన్న వాళ్ళంతా, నిరాశతోనైనా, దేశాన్ని వదలిపోవాలనుకోవడం దేశాన్ని అసమర్థ లకు వప్పచెప్పడమే ననిపించింది. అలాచేస్తే దేశానికెంత నష్టం? ఆ విషయమై ప్రభాకరరావుకు వ్రాయాలను కొంది.

కాని, అతడు మద్రాసు వదిలేస్తున్నాననే గాని, ఎక్కడికెళ్లేదీ వ్రాయలేదు. ఆమెకు చాలా నిరుత్సాహమే కలిగింది.

ఆ జాబును చూడగానే తానెందుకుత్సాహపడాలి? తండ్రీ, స్నేహితురాలు సుధా తనకెంతో కావలసిన వాళ్లు. ప్రభాకరరావును తానెరగదు. హఠాత్తుగా రోడ్డుమీద ఎదురైతే చెప్పకపోతే గుర్తుపట్టలేదు కూడా. అయినా అతని లేఖకోసం ఎదురు చూసింది? అది వచ్చినప్పుడు మిగతా వానిని పక్కకు పెట్టేసింది. అతని జాబు చదివింది. అతనితో ఏక మనస్కత కనబరుస్తూంది. అతనీ దేశంలో వుండేటట్లు వొప్పించాలని కొట్టు మిట్టాడి పోతూంది. ఏమిటిది అనిపించింది.

ఆ ఆలోచన రాగానే రుక్మిణి తన మనస్థితికి సిగ్గుపడింది. కాలేజీ చదువుకు చేరిననాటి నుంచీ ప్రతీ ఏడాదీ ఒకరో, ఇద్దరో తనకు దగ్గర కావాలనే వాళ్లు కొందరు కనపడుతూనే వున్నారు. ఆ మాదిరిగా స్నేహాలు కలిసిన వాళ్ళు కొందరు ఇప్పటికీ అగతగిలి నప్పుడు సరదాగా కబుర్లు చెపుతున్నారు. ఒకరో, ఇద్దరో నూటికీ, కోటికీ ఓ ఉత్తరం వ్రాస్తున్నారు. ఆ మిత్రులలో ఒకరిద్దరికోసం, వారి ఉత్తరాల కోసం ప్రథమంలో ఇంత ఆదుర్దా, ఇంత ఆలోచన కనబరచిన ఘట్టాలున్నాయి. ఆ జ్ఞాపకంతో తన మనస్థితి తనకే చిగాకనిపించింది.



BRAOU

వాళ్ళ విషయంలో తాను అటువంటి ఉద్రేకాల ననుభవించడానికి కారణం వుంది. భావనారాయణ మంచి అందగాడు. తాను బి.ఎస్.సి.లో చేరిన కొత్తలో అతడు రీసెర్చి చేస్తున్నాడు. అతనిని తనవంటి కన్యలంతా దేవుడినిలా భక్తి తాత్పర్యాలతో చూసేవారు. అప్పుడప్పుడు ఏదో కల్పించుకొని మాట్లాడి సంతృప్తి పడేవారు. అతడు తమరిని పసిమొగ్గల్ని చూసినట్లు అలక్ష్యం చేస్తున్నాడని మనస్సులోనే చిరాకుపడి చివరకు మరిచిపోయేరు. రామశేషయ్య. మదనమోహన, పంకజరావు ఎవరెవరో తన మనస్సుకు కొంత కొంత కాలం ఉద్విగ్నత కలిగించేరు. జారి పోయేరు. వాళ్లెవరూ ఇప్పుడు జ్ఞాపకమేనా రారు. కాని, ఆ చిన్నతనపు ఉబలాటాలు గుర్తు వస్తుంటాయి. నవ్వు వస్తూంటుంది. ఇప్పుడు కూడా. అటువంటి మనస్థితిని కనబరచడమా? తాను పెద్దదయింది. విద్యాధికురాలు ఆవలి అతడు ముక్కూ మొగం తెలియనివాడు.

రుక్మిణి బలవంతంగా తన ఆలోచనకు సెలవిచ్చి సుధ ఉత్తరం విప్పింది. చదివేసరికి పెద్దనవ్వు వచ్చింది. తన వూహలు సరియైనవేననే భావంతో కలిగిన సంతోషం అది. వెంటనే కార్డు తీసి పెద్ద అక్షరాలలో 'కంగ్రాటులేషన్సు' అన్నమాటొక్కటి వ్రాసి సంతకం పెట్టేసింది ముందు క్రిందికి వెళ్ళిపోస్టుబాక్సు పడేసింది. వచ్చి కూర్చుని మరల వివరంగా చదవసాగింది.

ఒక విధమయిన మూర్ఛావస్థలో, విమూఢస్థితిలో తేలిపోతూ వ్రాసిన ఉత్తరంలా కనిపించింది. తమ వివాహం రిజిస్టరు కావలసిన తేదీ ఇంకా నెలవున్నదని వ్రాస్తూనే తమ భయాలు, పరిహాసాలు, చెలగాటాలు వర్ణిస్తూ సుధ తన నిర్ణయాన్ని ఒక్క వూపులో వివరించింది.

"హెచ్చరికల పేరుతో మగవాళ్ళకి ఆడవాళ్ళకీ నడుమ పెద్ద పెట్టున విష బీజాలు నాటుతున్నారు. పోషిస్తున్నారు. వాటి నుపయోగించుకొని మన పెద్దలు కర్తవ్యం, త్యాగంలాంటి నీతిబోధలు జోడించి తమ స్వార్థాల్ని, మూర్ఖత్వాల్ని, సంకుచిత స్వభావాల్ని కమ్ముకుంటున్నారు. నేను బాధపడ్డాను. బాధాపెట్టేను. ఇంకానా?"

కాలేజీలకు వచ్చే ఆడపిల్లల్ని ప్రలోభపరచి, ఓ చిన్న బిడ్డని ప్రసాదించి పారిపోడానికే మగవాళ్ళు ప్రయత్నిస్తుంటారన్నట్లూ, పారిపోయిన మగాడి కోసం కలలుకంటూ, ఏడుస్తూ జీవితం భగ్నం చేసుకోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో మాత్రమే కాలేజీ అమ్మాయిలకి గత్యంతరం అయినట్లూ వస్తున్న కథలూ, నవలలూ గురించి మొన్నటి ప్రయాణంలో తమ యిద్దరి మధ్య చర్చలు జరిగేయి. అదంతా మనస్సులో మెదలి, "ఇదంతా స్వానుభవమా?" అనుకొంది.

ఎక్కడో, ఎవరికో జరిగే అసాధారణ ఘటనలకు రచయితలు సామాన్యరూపం ఇవ్వడంలో వచ్చే అసందర్భ పరిస్థితిగా దానిని తాను చెప్పబోయింది. కాని సుధ అదే వస్తువును పదే పదే ఎత్తుకోవడంతో రచయితల దుర్బుద్ధీ, చేతకాని తనం, వస్తు దారిద్ర్యం కనబడుతూందని వాదించింది. తన అనుభవంకూడా సుధ అభిప్రాయాన్ని బలపరిచేటట్లుగానే తోచింది. కనీసం తనతల్లి దండ్రులు తమ పట్టుదలలూ ఇతర పట్టుదలలూ తీర్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నంలో దీని ఛాయలు కనబడకపోలేదు.

ఈ అయిదారేళ్ళలో నాల్గయిదు వేలమంది పడుచువాళ్ళని ఈ యూనివర్శిటీ ఆవరణలో చూసింది. ప్రేమకలాపాలు చాలానూ, వివాహాలు కొద్దిగానూ కూడాచూసింది. వానిలో మోసం చేయాలనే ప్రయత్నంతో ప్రారంభంకాకపోయినా, చివరకు మోసమే జరిగిన సంఘటనలు చూసింది. అటువంటి సందర్భం వచ్చినప్పుడల్లా ఏదో ఒక వేపునుంచి పెద్దవాళ్ల జోక్యమే ప్రధానకారణం అవడంకూడా గమనిస్తూ వచ్చింది.

"నిజమే. పెద్దవాళ్ళకి గడ్డిపెట్టడం మాని యువతీయువకులలో పరస్పరం అనుమానాలు కలిగించడమూ, వీళ్ళనే తిట్టిపోయడమూ ఎక్కువయిపోయింది" అనుకొంది.

ఆ ఆలోచనలతో సతమతమవుతుండగా పనిమనిషి ఒక విజిటింగ్‌కార్డు తెచ్చింది, తమరితో మాట్లాడాలంటూ వచ్చేరు. హాలులో క్రిందవున్నారు" అంది.

"ఈయన మద్రాసులో వున్నాడుకదా, అప్పుడే ఎప్పుడు వచ్చేడు" అనుకొంది. వెంటనే ఒకవిధమైన భయమూ, అనుమానమూ కలిగేయి. ఈ ఉత్తరాలూ. వెంటవెంటనే ప్రత్యక్షం కావడాలూ ఏమిటి? నాలుగు రోజులక్రితం మనస్సులో మెదిలిన ఉద్యమం మాట మళ్లీ మెదిలింది.

కాని పడుచువాళ్ళ మనస్సులో నాటుతున్నారని సుధ వాదించే అనుమాన విషబీజాల మాట గుర్తువచ్చింది– "కూర్చోబెట్టు, ఇప్పుడే వస్తున్నానని చెప్పు" అంటూ పనిమనిషిని పంపేసింది.

ఉత్తరం మొన్న వ్రాసింది. మద్రాసు వదిలేస్తున్నానని వ్రాసేడు. వదిలేసేడు. వచ్చేడు. మద్రాసునుంచి వాల్తేరుకు అంతా ప్రోగుచేసి పద్దెనిమిదిగంటల ప్రయాణం. రావడం, రాగలగడం అసంభవంకాదు. ఏ ఉద్యోగం వెతుక్కుంటూనో వాల్తేరు వచ్చివుండొచ్చు. వచ్చి తనను చూడరాకూడదా? అదే ఓ మగస్నేహితుడైతే వెళ్ళడా? ఆడపిల్లకోసం వచ్చేడనేసరికి ఉద్యమం అనుకోవడమేనా... అయితే నేం– ఆ అనుమానాలు తప్పడంలేదు.

రుక్మిణి అద్దంలో ఒక్క నిమిషం చూసుకొని, క్రిందికి దిగివచ్చింది. ఆ రోజున తాను విజయవాడ స్టేషనులో చూసిన విగ్రహమే. ఆ పేంటే, అదే షర్టు! మీసకట్టు, నిలబడిన తీరు అతడేనని చెప్పున్నాయి– అతనిని చూడగానే మనస్సులోని గంద్రగోళం మరచిపోయింది. చిరునవ్వుతో, అంతదూరం నుంచే చేతులు జోడించి నమస్కారం తెలిపింది.

అతడు ప్రతినమస్కారంచేస్తూ, "నే నెవరో గుర్తుపట్టేరా?" అన్నాడు. ఆమె గుర్తుపట్టినట్టు చెప్పకుండానే చెప్పింది.

"ఇప్పుడే మీ ఉత్తరం చదువుతూ, మిమ్మల్ని గురించే అనుకుంటున్నా."

"థాంక్స్" అన్నాడు ప్రభాకరరావు చిరునవ్వుతో తలవంచి అభివందనంచేసి.

అతని ధన్యవాదం విన్నాకనే రుక్మిణికి తనమాటలోని విశేషం తెలిసివచ్చింది. అతనిని గురించి ఆలోచిస్తున్నమాట నిజమే, కాని, ఆ మాట చెప్పడం అలుసు ఇవ్వడం అవుతుందో, మర్యాదాతిక్రమణం అవుతుందో, నాలికకరుచుకొని ప్రయోజనం లేదు. అందుచేత ఆ విషయాన్ని గమనించనట్లుగా తానేమను కుందో చెప్పుకుపోయింది.

"మీరు చదివిన చదువూ, మీ జ్ఞానమూ, అమెరికాకు వినియోగపరచాలను కొంటున్నారంటే అయ్యో అనిపించింది. చెప్పొద్దూ"

ప్రభాకరం ఆశ్చర్యం కనబరిచేడు – "సరిగ్గా మా నాన్న అన్నట్లే మీరు అన్నారు".

"మీ నాన్నగారి పేరేమిటి?"

"రామచంద్రరావుగారు. అమెరికా హంతకుల దేశం అయినట్లూ, అక్కడున్నది రాక్షసులే అయినట్లూ మాట్లాడుతారు ఆయన".

'అనేక దేశాలలో వాళ్ళు సాగిస్తున్న పెత్తనం ...

ప్రభాకరం నవ్వేడు. రుక్మిణికి ఆ నవ్వు వికటంగా వినిపించింది. తన వాదానికి సమాధానం ఇవ్వడం మాని, చులకన చేస్తున్నట్లనిపించింది చటుక్కున అనేసింది.

'నాలుగేళ్ళో అయిదేళ్ళో ఆ దేశంలో వుండి వాళ్ళ వుప్పు తిన్నారు. మళ్ళీ అక్కడికే వెళ్ళాను కొంటున్నారు. మరి మీకు వియత్నాం యుద్ధం నవ్వుతాలుగా వుండదూ? ..."

అంతలో మరల సర్దుకుంది. ఏదో మర్యాదకు చూడవచ్చిన మనిషితో రాజకీయాల పేరుతో తగవు పెట్టుకోవడం మర్యాద కాదనుకొంది. ఆమె ముఖంలో కదులుతున భావావేశాల్ని గమనించి ప్రభాకరరావు సర్దుకున్నాడు, కాని సమాధానం ఇవ్వడం మానలేదు.

"భిలాయ్‌లో ఉక్కు కర్మాగారం నిర్మించేందుకు సోవియట్ సహాయం యివ్వడం, మనదేశంలో బూర్జువా ప్రభుత్వం దృఢపడేందుకు సోవియట్ సాయం ఇవ్వడమేనని కొందరు చెప్పడం నేను విన్నాను"



BRAOU

తన తండ్రే ఆ విధంగా వాదించడాన్ని రుక్మిణి ఎరుగును. తన మాటకూ దీనికీ సంబంధం ఏమిటిలో అనుకుంటూ అతని ముఖం వంక చూస్తూంది

ప్రభాకరరావు ఆమె చూపులతో తెలివి తెచ్చుకొన్నట్లు సర్దుకొన్నాడు.

"ఏ దేశంలోనైనా ప్రభుత్వ చర్యలకీ ప్రజల స్వభావానికీ వైరుధ్యం వుండకతీరదు. ఆ రెండింటినీ ఒకే విధంగా ఆలోచించకూడదు. అమెరికాలో మాత్రం ఆ ప్రభుత్వ విధానాల్ని అక్కడి ప్రజలందరూ హర్షిస్తున్నారంటారా?"

"ఎప్పుడు వచ్చేరు?"

"ఇప్పుడే మెయిలులో..."

మెయిలు రెండుగంటల ప్రాంతాలకి వాల్తేరు చేరుతుంది. సరిగ్గావస్తే, ఇప్పుడు అయిదుకావస్తూంది. అంటే బండి దిగగానే తనను చూడవచ్చేడా అనిపించింది. ఆమె మనస్సును చదివినంత వివరంగా అతడు తన కార్యక్రమాన్ని వివరించేడు.

ఇక్కడికి దగ్గరలోనే మా చెల్లెలు ఇల్లు. అక్కడికి వచ్చేను. ఇంకా రెండు మూడు గంటల వరకూ వాళ్ళు ఇంటికి వచ్చేలా లేరు. ఏం తోచలేదు. వీధిలోకి బయలుదేరేను. మీ హాస్టలు కనిపించింది. మీరు జ్ఞాపకం వచ్చేరు. యూనివర్శిటీ నుంచి వచ్చివుండరేమోననిపించింది. పలకరించి పోదాం అనిపించింది. వచ్చి అడిగేను. ఇప్పుడే వచ్చేరన్నారు ..."

"అంతా పావుగంటా. ఇరవయి నిమిషాలయింది"

"అలసి వచ్చి వుంటారు. శ్రమ పెట్టడం అవుతుందేమో ననిపించింది. కాని, ఇంత దూరమూవచ్చి, స్వయంగా మీకు అభివాదనలు తెలుపకుండా వెళ్ళడమేమిటనిపించింది." అన్నప్పుడు.

అతడు చెప్పిదాంట్లో అనుమానించదగినదేమీ లేకపోయినా, మనస్సు స్థిరపడలేదు. ఒక్క విషయంలో అతడు దొరికి పోయే అవకాశం వుంది.

అభినందనలు తెలుపవలసిన మహత్కార్యం తనేదీ చెయ్యలేదంటూనే, అతడు రావాలనీ. పలకరించి పోవాలనీ అనుకున్నందుకు సంతోషం ప్రకటించింది. వెంటనే తన ప్రశ్న జోడించింది.

"ఇక్కడ మీ చెల్లెలుగారు ఏం చేస్తున్నారు?"

"ఆమెభర్తగారికి బజారులో షాపువుంది. అందులోనే ఆమె భర్తకి సాయంగా ఉత్తరాలు రాయడం అవీ చూస్తుంటుంది. ఆయన లేనప్పుడు షాపు చూసుకొంటుంది."

దగ్గరలో ఇల్లు, భర్తకోషాపు అనేసరికి అంతక్రితమే చెప్పిన తండ్రి పేరుతో జతపరిచింది. వారం క్రింత తాను చూసిన రామచంద్రరావు మామయ్య కన్యని వెతుకుతున్నది ఈయనకోసమేనా .. అనిపించింది.

అయితే ఈ మారు ఆలోచనలూ, అనుమానాలు కొత్త రూపం ధరించేయి. తన తండ్రి చెప్పిన దానిని పట్టి మామయ్య తనను వధువుగా కోరింది ఈయనకే అయిఉండాలి. తన తల్లి దండ్రులు సాగ నివ్వలేదు. వారి కారణాలు తనకు నచ్చలేదు. కాని, అతడు తనను వెతుక్కుంటూ రావడం, పరిచయం పెంచుకుంటూ రావడం చూస్తే ... తన ప్రయత్నం విఫలమయి రామచంద్రరావుగారు కొడుకును తన మీదికి ఉసిగొల్ప లేదు కదా ...

ఆ ఆలోచన కలిగేక రుక్మిణి తాను జాగ్రత్త పడగల ననుకొంది. ఏ విషయంలో జాగ్రత్త పడదలచిందో ఆమెకే స్పష్టంగా తెలియదు. జాగ్రత్త అన్న ఆలోచన వచ్చేక అతడెవరో తనకు తెలిసినట్లు బయటపడ నివ్వననుకొంది. అతని ఆట ఏమిటో చివరికంటా చూస్తాననుకొంది.

"ఇంతకూ చెల్లెలిగారినిచూడలేదన్నమాట. ఫోన్ చేస్తారా? ఇల్లారండి" అంటూ రుక్మిణి వార్డెన్ ఆఫీసు గదివైపు తిరిగింది. కాని ప్రభాకరరావు తొందరపడలేదు. వద్దు అన్నాడు.

"వద్దు సాధారణంగా రాత్రి ఎనిమిదిగంటలకుగాని షాపుకట్టరట. ఇప్పుడు నేను వచ్చేనంటే పని చెరుపుకొని వచ్చేస్తుంది. ఎందుకులెండి?"

అతడు సామానుతో హోటలులో దిగేడు. స్నానాదికం ముగించుకొన్నాడు షాపు దగ్గరే. హోటలులో ఫోనూ ఉంది. కాని, అతడటు వెళ్ళలేదు. ఏకారణంచేత నేనా ఆమె షాపులోకి వెళ్లకపోతే చూడవచ్చునని ఇటు బయలుదేరేనన్నాడు.

"ఏదన్నా పని తొందరలేదుగదా ...." అని అడుగుతూంటే పెద్దగా ఆలోచించకుండానే అనేసింది. "ఏంలేదు".

"అభ్యంతరం లేకపోతే మా చెల్లెల్ని మీకు పరిచయం చేయ్యాలని అనుకుంటున్నాను".

ఆమె ఎం.ఏ. చదివింది. అయితే తెలుగు. అన్నగార్లు ఆమెను రీసెర్చికి పేరు నమోదు చేయించు కోమన్నారు. ఆమెకూడా డాక్టరేట్ తెచ్చుకోవాలనివారి కోరిక. కాని ఆమె నిరాకరించింది. తానుచేస్తున్న పని చాలునంటుంది. రుక్మిణివంటి వారిని పరిచయంచేస్తే ఆమెకు కూడా సరదా పుడుతుందేమోనని ఆలోచన.

రైల్లో బెడ్డింగు తనకు వప్పచెప్పినంత సులువుగానూ, తనను తీసికెళ్ళి చెల్లెలి చేతిలో పెట్టగలడనిపించి రుక్మిణి నవ్వింది.

ప్రభాకరరావు తెల్లబోయేడు.

"ఎందుకు నవ్వుతారు?"

"మీ చెల్లెలు పి.హెచ్.డి. సంపాదించాలని మీ వాంఛ, 'భర్తకు తోడుగా ఉందాం. చదివింది చాలు. జీవితాన్ని అనుభవిద్దా'మని ఆమె అభిప్రాయం కనీసం వయస్సు వచ్చేకనైనా మనుష్యులు తమతమ అభిరుచుల్ని పట్టిపోకూడదా?"

ప్రభాకరం ఏమీ అనలేక ఒక్కనిమిషం వూరుకున్నాడు. అంతలో నవ్వువచ్చింది, షుమారు తెల్లబోవడం రుక్మిణివంతు.

"క్షమించండి, సరిగా ఇదెప్రశ్న మా విజయా వేసింది".

రుక్మిణి సర్దుకొంది. "న్యాయమే" ఉత్తరాలు వ్రాసేపనికి మిగతా పనులకీ రెండు వందలిస్తే మంచి సమర్థుడే దొరుకుతాడు. ఆమె చదువుకోవచ్చు కాదా?"

రుక్మిణికి ఆ సలహా నచ్చలేదు. ఆ మాట చెప్పడానికి నామోషీగానూలేదు.

పైగా తెలుగులో రీసెర్చిపేరుతో జరుగుతున్న దుబారాను, ఆమె చాలా తీవ్రంగా విమర్శించింది "మీరే మనుకుంటున్నారో తెలియదు. మచ్చుకు ఈ పదేళ్ళ ఈ మధ్య మన యూనివర్శిటీలు మూడు కనీసం ఏభయి మంది తెలుగు డాక్టర్లని తయారుచేశాయి. కాని మనభాషలో విమర్శసాహిత్యం ఇంచుమించు లేనేలేదు. కారణం ఏమిటి? థీసిసులు వెయ్యిపేజీల కొలత చూడడమేగాని దాని విలువ ఏమిటో ఆలోచిస్తున్నారా? సందేహం. మీకు పుణ్యముంటుంది, ఆ జనాభా పెరగకపోతే ప్రమాదంలేదు. లేమిచుట్టుకోలేదు. పోనిద్దురూ. జీవితంలో ప్రవేశించిన మనిషిని ఆమెకు నచ్చిన పద్ధతిలో అనుభవించనివ్వండి".

ప్రభాకరరావు శాంతంగా విన్నాడు. బాగా ఆలోచించేడు. చిన్న ప్రశ్నవేశాడు.

ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి రుక్మిణి తడబడింది.

"ఎవరి అభిరుచులు వాళ్ళవి. జీవితాంతం చదువేనా? చదివిందిచాలు. ఏ ఉద్యోగం లోనో చేరి ఆనందంగా కాలం గడిపేయ్యక ఎంతకాలం ఈబెడద అనిపించడంలో అసహజం లేదు, కాదుకూడా" – అంటి.



BRAOU

ప్రభాకరరావు ఏమీ అనలేదు. అనలేక వూరుకున్నాడనిపించింది. రుక్మిణి మాటను మార్చింది.

"అయితే మీ చెల్లెలుగారి పరిచయం చేసుకోడం నాకూ ఇష్టమే. దగ్గిరే అంటున్నారు. ఎప్పుడేనా ఏమీ తోచనప్పుడు మాటకేనా వుంటారు".

* * *

రుక్మిణి పర్సు తెచ్చుకోవడానికి తన గదికి వెళ్ళింది. తీసుకొని వెనుతిరుగుతూ, ఓమారు అద్దం ముందు నిలబడింది. చిన్న చిన్న అలంకరణ సర్దుబాట్లు చేసుకొంటూంటే, వినోద వచ్చింది. రుక్మిణిలాగానే ఆమె రీసెర్చి చేస్తూంది. ఇద్దరూ మీటింగుకి వెళ్ళాలనుకున్న సంగతి ఆమెను చూడగానే గుర్తుకు వచ్చింది. ఇప్పుడెలాగ?

"సారీ! వినోదా"

వీథిలోకి బయలుదేరే సన్నాహంలో తయారయివున్న రుక్మిణి, తన కార్యక్రమాన్ని మార్చుకొన్నదని వినోద వూహించలేకపోయింది.

"పది నిమిషాలలో బయలుదేరుదాం. కల్యాణికూడా వస్తానంది".

"మీరిద్దరూ వెళ్ళిరాండి, ఒక స్నేహితులు వచ్చేరు".

రుక్మిణి ఎవరో విజిటరుతో మాట్లాడుతున్నదని వినోద వింది. అయితే ఆయన తమ కార్యక్రమానికి ఆటంకం కావడం ఇష్టంలేదు.

"ఆయననుకూడా రమ్మంటేసరి. ఏం? సాహిత్యగోష్టి మీ మిత్రులకు భరించదా? ఆయన ఏం చేస్తుంటారు?"

మరొకప్పుడైతే ఆ సమాచార సేకరణాసక్తికి రుక్మిణి హేళన చేసివుండేది.

"ఆయన ఓ చోటుకి వెడుతున్నారు. నన్నూ రమ్మన్నారు. మా ప్రోగ్రాంమాట గుర్తులేకపోయింది. సరేనన్నా, ఇప్పుడు వెళ్ళి అల్లాకాదు, ఇల్లా వెడదామంటే మర్యాదగా వుండదు. మీరిద్దరూ వెళ్ళిరండి. మళ్ళీ సమావేశానికి వస్తాను".

ఇందులో ఏదో విశేషం వుందన్నట్లు వినోద కనుచూపు చూసింది. ఎవరబ్బా, ఈమె ఇంత శ్రద్ధ చూపించే వ్యక్తి – అనుకొంది. కాని, రుక్మిణి సాధారణంగా చనువిచ్చే మనిషికాదు. కనక ధైర్యంచేసి అడగలేకపోయింది. మనస్సులో కలిగిన ఆలోచనలు ముఖంలో ప్రత్యక్షం కాకమానలేదు.

అద్దంలో మిత్రురాలి ప్రతిబింబం చూసి రుక్మిణికి ఆసక్తి కలిగింది.

"ఏం నవ్వుతున్నావు?"

"ఈ విధంగా ప్రోగ్రాముల్ని మార్పించెయ్యగల ఆ మిత్రులెవ్వరా అని ...."

"ఆయన మానాన్నగారి స్నేహితుని కొడుకు".

"పాత స్నేహితులా, కొత్త స్నేహితులా మీ నాన్నగారికి?"

ఆ ప్రశ్నలోని అంతరార్థాన్ని గుర్తించనట్లు రుక్మిణి చెప్పుకుపోయింది.

"ఇటీవలనే ఆయన మినియాపోలీస్ నుంచి డిగ్రీ తీసుకువచ్చేరు. ఇంకా ఉద్యోగంలో చేరలేదు. ఇక్కడకు దగ్గరలోనే వారి చెల్లెలుగారున్నారట ..."

విసుక్కోకుండా రుక్మిణి సమాధానం ఇవ్వడం వినోదకు ధైర్యం ఇచ్చింది.

"ఆవిడకు నిన్ను చూపిస్తామన్నారు ..."

"అంటే? ..."

"ఏముంది? ఆవిడ నిన్ను పాస్ చెయ్యాలన్నమాట".

BRAOU

రుక్మిణి చిరాకు కనబరచింది.

"కనీసం చదువుకున్నవాళ్ళైనా ప్రతి చిన్న విషయాన్నీ సెక్సు దృష్టితో, పెళ్ళి దృష్టితో చూడడం మానితే బాగుంటుంది వినోదా!"

"ఓహో ..." అంది, వినోద వెక్కిరింతగా.

"నీకీమధ్య మరో దృష్టి లేకుండా పోతున్నట్లుంది".

"అల్లాగా చిట్టితల్లీ! సరేగాని, ఎవరా చెల్లెలు!"

"నేనూ చూడలేదు".

"ఒకటి ..." అని, వినోద వేలు మడిచింది.

ఆ ఒకటికి అర్థం గ్రహించి రుక్మిణి తెల్లబోయింది. వినోద రెండో ప్రశ్న వేసింది.

"ఆమె ఎక్కడున్నారు?"

"దగ్గరే ఎక్కడో ఉన్నారట, నాకు తెలియదు. అడగలేదు" అంది రుక్మిణి సందేహిస్తూను.

వినోద కళ్ళు మిలమిలలాడేయి.

"రెండు" అంది.

"మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తావు" – అన్నది మూడో ప్రశ్న.

"గంటవుతుందో, రెండు గంటలవుతుందో"

రుక్మిణిమాట పూర్తికాకుండానే వినోద మూడో వేలు ముడిచి, మూడు అంది. ఇంక తన వాదానికి వివరణ అనవసరం అన్నట్లు తిరిగికూడా మాటాడకుండా వెళ్లిపోయింది. ఆ లెక్క అర్థం గ్రహించి, రుక్మిణి మ్రాన్పడిపోయింది.

ఎవరికోసం వెడుతున్నదీ తెలియదు. ఎక్కడికి వెళుతున్నదీ, ఎప్పుడు రాగలిగేదీ తెలియదు. తెలుసుకోకుండానే రుక్మిణి వెడుతూంది. దానికి వినోద చేసిన వ్యాఖ్యయే ఆ లెక్క. స్త్రీ అంత నిర్లిప్తంగా అనుసరించగలది భర్తనే. "నీ మాట అర్థమయిందిలే ... వెళ్ళు" అన్న భావానికి ప్రత్యామ్నాయమే ఆ నిష్క్రమణ.

వినోద లెక్క రుక్మిణిని హెచ్చరికలో పెట్టింది. ఏమీ ఎరగకుండా, ముక్కూ మొగమూ తెలియని మనిషితో వెడుతున్నాననే పరిజ్ఞానం కలిగించింది.

ప్రభాకరరావు చూడడమే ఇది రెండోమాటు. మొదటిమాటు చూసింది పదిరోజుల క్రితం. అది చూడ్డం క్రిందే లెక్కకాదు.

ఆయన చదువు గురించీ, అర్హతలను గురించీ తెలిసిందల్లా లెటర్‌హెడ్ మీద ఉన్న అక్షరాలే. అయిదు రూపాయలు పడేసి లెటర్‌హెడ్ మీద ముద్రించుకొన్న అర్హతలు ఉద్యోగ సంపాదనకు పనికిరాకపోవచ్చు. కాని, మనుష్యుల్ని బోల్తా కొట్టించడానికి చాలు. అల్లాంటి వార్తలు క్వాచిత్కంగా పత్రికలలో చూస్తూనే ఉంటాం.

ఇంక ఉద్యోగ ప్రయత్నాలూ, వాని వైఫల్యాలను గురించి అతడు వ్రాసిందే తప్ప తనకు తెలియదు. తాను ఎరిగిన రామచంద్రరావు కొడుకే ఈయన అనుకోవడం కూడా కేవలం వూహ మాత్రమే.

అయితే ఇక్కడ ఒక చెల్లెలు ఉండడం, ఆమె ఎం.ఏ. చదివివుండడం, ఆమె భర్తతో షాపు చూసుకొంటూండమూ అబద్ధం అవుతుందా? అతని నిజాయితీని అర్థం చేసుకోవడానికి ఈ అంశం కీలకం. అదేదో చూసిగాని వదలకూడదనుకొంది.

అనేక ఆలోచనలతో కొట్టుమిట్టాడుతూ వస్తున్న రుక్మిణి ముఖంచూసి, ప్రభాకరరావు గతుక్కుమన్నాడు. ఒక్క పావుగంటక్రితం ఆమె ముఖంలో కనిపించిన ఉత్సాహం ఇప్పుడులేదు, "ఏమిటల్లా వున్నారు?" అన్నాడు.

"ఏంలేదు? ఈవేళ ఒకచోట సాహిత్యగోష్ఠి ఉంది. దానికి వెడదామని ఇద్దరు ముగ్గురం అనుకున్నాం. ఆ మాటే మరిచేను. ఇప్పుడు పైకి వెళ్లేసరికి అంతా గదిలో ఎదురుచూస్తూ కూర్చున్నారు.

ప్రభాకరరావు ఆలోచిస్తూ అన్నాడు.

"ఆ గోష్ఠికి ...." అంతలో సర్దుకొని క్షమాపణ కోరుకున్నాడు.

"మీ ఉత్సాహానికి భంగం కలిగించడం భావ్యంకాదు, పోనియ్యండి. మరెప్పుడైనా వీలు చిక్కితే వెళ్ళి మా చెల్లెల్ని కలుసుకొందురుగాని ..." అంటూ అతడు తన విజిటింగ్ కార్డుతీసి వెనుకభాగాన చెల్లెలు ఎడ్రెసు వగైరాలు వ్రాసి అందిచ్చేడు.

రుక్మిణి నసుగుతూనే తీసుకొంది.

"ఇది అనవసరం. మీకు వెడిపోయే పనులేమీలేకపోతే, మీ చెల్లెలిగారిని చూసి అలాగే గోష్ఠికి వెడతా. మీకు తోస్తే మీరూ రావచ్చు, లేదా చెల్లెలిగారితోనే ఆగిపోవచ్చు".

ప్రభాకరరావు ఉత్సాహం కనబరిచేడు.

"ఆ గోష్ఠికి ఎవరన్నా రావచ్చుననుకొంటే మహాసంతోషం. నాకు సాహిత్యంలో ఉన్న పరిచయమల్లా చదవడంవరకే ...."

"అయితే మహాభాగ్యం, నడవండి".

## 11

బజారులో ఉన్న ఎలెక్ట్రికల్ షాపువద్ద సిటీబస్సు ఆగేవేళకి విజయలక్ష్మి రిక్షాలో కాలు పెడుతూంది. బస్సు దిగుతున్న అన్నను చూడగానే ఎంతో సంతోషం, ఆశ్చర్యం కనబడింది.

"ఇప్పుడు ఎట్లా వచ్చేవు? మెయిలు ఆలస్యమయిందా?

తాను వచ్చి బస హోటలులో పెట్టేనని చెప్పి, తన వెనకనే బస్సు దిగివచ్చిన రుక్మిణిని చూపేడు.

"ముందు వీరిని పరిచయం చేస్తా, రుక్మిణిగారు. ఇక్కడే రీసెర్చి చేస్తున్నారు - మా చెల్లాయి. విజయలక్ష్మి".

పరస్పరాభివాదనలూ, వివరంగా పరిచయాలు పూర్తి అయ్యేక విజయలక్ష్మి అన్నగారి వైపు తిరిగింది.

"నేనింటివద్దే ఉండననుకొంటే హోటలులో దిగాలా? సరాసరి ఇక్కడికి రాకపోయేవా? ఇద్దరం కలిసి.."

"సరిగ్గా అందుకే నేను హోటల్లో దిగింది" అన్నాడు.

"మహా ఘనకార్యం చేశావు! సరే. రాత్రికి ఇంటికే వెడదాం. మళ్ళా ఎక్కడికీ వెళ్ళకు. ఇప్పుడేం పనుంది?"

"నాకేంలేదు. వీరే ఎక్కడో సాహిత్య గోష్ఠి ఉందన్నారు".

తన అన్నగారు తీసుకువచ్చి పరిచయంచేసిన రుక్మిణిని ఏవిధంగా అర్థం చేసుకోవాలో అర్థంకాక ఆశ్చర్యపడుతున్న విజయలక్ష్మి ఆమాటతో మరింత ఆశ్చర్యపడింది. రుక్మిణివైపు చూసింది.

చామనఛాయ మనిషి, పొడుగరి. వయస్సు పాతికదాటి ఉంటాయి. తగిన పుష్టికలిగి, ఆరోగ్యంగా, చూడ ముచ్చటగా ఉంది. కళ్ళు నవ్వుతున్నట్లున్నా, గంభీరమయిన విగ్రహం. తాను ఏదో అనేలోపున ఆమే ఆహ్వానించింది.

"మీరుకూడా రండి".

విజయలక్ష్మి తాను అక్కడికే వెడుతున్నానంది.

"ఆయన వ్యాపార సందర్భంగా ఎవరోవస్తే మాట్లాడుతున్నారు. ఓమారు పలకరించిరా, వెడదాం. రాత్రికి మాట్లాడుకోవచ్చు". అంటూ అన్నగారిని హెచ్చరించింది. "లోపలికి రాండి" అంటూ రుక్మిణి చేయి పట్టుకొంది.

"అయితే ఆయన్నిప్పుడు డిస్టర్బ్‌చేయడం అనవసరం. నడు పోదాం. సాయంకాలమే కలుసుకొంటా" అన్నాడు ప్రభాకరరావు.

కాని, విజయలక్ష్మి వెంటనే బయలుదేరలేదు ... "అయితే ఉండండి" అంటూ లోనికి వెళ్ళింది.

* * *

పనిమనిషిని రెండో కారియరు తెమ్మంటూ ఫోనులో పురమాయిస్తున్న భార్యను కుటుంబరావు చూపులతోనే ప్రశ్నించేడు.

"ప్రభాకరం అన్నయ్యొచ్చేడు".

"ఏరీ, లోపలికి తీసుకురాకపోయేవా?" అంటూ అతడు లేచాడు.

"మీరు పనిలోవున్నారని రాలేదు" అంది. కూడా ఒక పడుచుకూడా వున్నదని చెప్పాలనుకొంది. కాని, ఎవరో పరాయివాళ్ళు కూడా అక్కడుండడంచేత మానేసింది.

"రాత్రికి పెందరాళే ఇంటికి రాండి" అంది.

మాట్లాడుతున్నవారిని ఒక్కనిమిషం ఉండమని కుటుంబరావు భార్యతోపాటు వీధిలోకి వచ్చేడు. గుమ్మంలోకి వచ్చేసరికి బావగారితోపాటు ఒక అపరిచిత తరుణికూడా ఉండడం గమనించేడు.

"ఆవిడ ఎవరు?" అన్నాడు భార్యతో.

చెల్లెలి భర్తను చూడగానే ప్రభాకరరావు రుక్మిణినికూడా పిలుచుకొని ముందుకు వచ్చేడు. రుక్మిణిని పరిచయం చేశాడు.

అయితే ఆ పరిచయం జరిగేటప్పుడు కుటుంబరావు అలాగే ఉండిపోయాడు. ప్రశ్నార్థకాలుగానే ఉండిపోయిన తన అప్పుల ముఖాలు చూసేక రుక్మిణిని ఇరుకునపెడుతున్నానేమోని ప్రభాకరరావు సంకోచించేడు. చెప్పకుండా, పెట్టకుండా ఎవరో మొగమెరుగని అమ్మాయిని తీసుకొచ్చి పరిచయం చెయ్య బోతే వాళ్ళేమనుకొంటారనే ఆలోచనే అతనికి కలుగలేదు, అయితే అతడిటువంటిదేదో చెయ్యగలడన్న ఆలోచన అతడు పిలిచినప్పుడు రుక్మిణికి కలిగింది. ఆ ఆలోచన యథార్థమే అయి, బెజవాడ స్టేషనులో ప్లాట్ ఫారమ్‌మీద కనబడిన ముఖమే, ఆ కవళికలే ప్రత్యక్షమయ్యేసరికి రుక్మిణికి నవ్వు వచ్చింది. మనిషి చదువు కున్నాడు, ప్రపంచంచూసి వచ్చేడు. ముప్పయేళ్ళు వస్తున్నాయి. కాని, చిన్నపిల్లవాని మనస్థితి చటుక్కున ఏదో ఆలోచన తోస్తుంది. ఆ పనిచేస్తాడు. అదికాస్తా వికటించి ఎదురుతిరిగినా దిగ్భ్రమ చెందినట్లయిపోతాడు జాలివేసింది. ఎంతో కాలంనుంచి ఎంతో పరిచయం ఉన్నట్లు మాట్లాడింది.

"హఠాత్తుగా హాస్టల్‌కి వచ్చేరు. నేను గోష్ఠికి బయలుదేరుతున్నాను. వారినీరమ్మన్నాను. మా చెల్లాయిని చూసి, పలకరించి వెడదామన్నారు. వచ్చేము".

తమకు కావలసిన సమాచారం అందులోనూ లేదు. పైగా, హోటలులో సామానుపడేసి, హాస్టలుకి వెళ్ళడంలో ఏదో ప్రత్యేకత కనిపించింది. అయితే ఈ పరిచయం చెయ్యడం యాదృచ్ఛికం అనుకున్నారు. ఆ ఆలోచన తోచేక ఆమెతో ఎలా వ్యవహరించాలో విస్పష్టమయిందనిపించింది. కుటుంబరావు సెలవు తీసుకొంటూ, ఆవల తనకోసం మనుష్యులు కనిపెట్టుకొని వున్నారన్నాడు.

"మీ గోష్ఠినుంచి ఈలాగేరాండి. అందరంకలిసే వెడదాం ..." - అని ఉమ్మడిగా చెప్పేసి భార్యకు కన్ను గిలిపేడు. ఆమె తల ఎగరేసింది.

వారు ముగ్గురూ గోష్ఠి జరుగుతున్నచోటికి వచ్చేసరికి అప్పటికే హాలు నిండివుంది. ముప్ఫయి నలభయిమంది స్త్రీ పురుషులు కూర్చుని ఉన్నారు. తాను రచన ఎందుకు, ఏవిధంగా ప్రారంభించిందీ, తాను వ్రాసిన ఒక కథకు ప్రోత్సాహం కలిగించిన కొన్ని సన్నివేశాలను గురించీ ఒకరు మాట్లాడుతున్నారు.

ఆ చిన్నసభలో, ప్రసంగంమధ్యలో ఇతరులు చూడకుండా ప్రవేశించి, చల్లగా కూర్చుండి, సభ్యులతో కలిసిపోవడం అసంభవం. ప్రతివారి కళ్ళూ తమ మీదనే వుంటాయి. ముందు పేటికి వెళ్ళమని ప్రతి ఒక్కరూ మర్యాదలు ప్రారంభిస్తారు. సభ బిగువు, చెడుతుంది.

ముందు మెట్లెక్కుతున్న విజయలక్ష్మి మధ్యలోనే నిలబడిపోయింది. మాట్లాడుతున్న వ్యక్తిని నిర్దేశిస్తూ 'శాస్త్రిగారు' అంది. అడుగు మెట్టుమీద నిలబడివున్న ప్రభాకరరావు ఉత్సాహం కనబరుస్తూ "సారాకథాల ఫేమ్" అన్నాడు.

రుక్మిణి, విజయ తలలు వూపేరు.

శాస్త్రిగారి ప్రసంగంపూర్తి అయ్యేక ముగ్గురూ మెట్లమీదికి వచ్చేరు. విజయలక్ష్మి అన్నగారినీ, రుక్మిణినీ పరిచయం చేసింది. తరువాత ఆయన సభలో వున్న రచయితల నొకరొక్కరినే పరిచయం చేస్తూంటే ప్రభాకరరావు వారివారి రచనలతో తన పరిచయాన్ని జ్ఞాపకం చేసుకొన్నాడు.

"మీ "బూచి" చదివేను".

"స్త్రీ చదువుతున్నాను".

తమ తమ రచనలు శ్రద్ధగా చదవడం, గుర్తుంచుకొని పరిచయం కలపడంతో సభ్యులాతనిని తమలోనే వానినిగానే స్వీకరించేరు.

* * *

సభ ముగిశాక విజయలక్ష్మి అన్న వద్దకు రుక్మిణిని తీసుకు వచ్చింది.

"వీరినీవేళ మనయింటివద్ద వుండిపోవాలంటున్నా. రేపు పొద్దున వెళ్ళవచ్చునంటుంటే చూడు, ప్రభాకరం ..." - అంటూ చెల్లెలు పిర్యాదు చేస్తూంటే ప్రభాకరరావు ఆశ్చర్యంగా చూశాడు.

"మళ్ళీ మళ్ళీ కనిపిస్తుంటారుగా" అని రుక్మిణి పదేపదే చెప్తున్నా పట్టుపట్టడం చూసి, ప్రభాకరరావు వారించేడు.

"ఏదన్నా పని వుండొచ్చు. అలాగ ఇబ్బంది పెట్టడం మర్యాదా?"

ఆ మాటను రుక్మిణి ఒప్పుకోలేదు.

"పని వుండడం, వుండకపోవడం కాదు, అనవసరం కదా ...." అంది.

ప్రభాకరం చిరునవ్వు నవ్వేడు.

"కాకపోయినా, కొత్తవాళ్ళం ..."

ఆ మాటలో ప్రత్యేకత లేకపోయినా, కొత్తవాళ్ళని అనుమానిస్తున్నట్టుగా అభిప్రాయం కలుగునతున్నదని రుక్మిణి మొగమాటపడింది.

"అబ్బే, అదేంలేదు. కొత్తేమిటి? మీరు నాకు పాతవారే కదా" అంది.

"నిజం" - అన్నాడు ప్రభాకరరావు, వోరగా చూస్తూ.

ఆ ప్రశ్నకు రుక్మిణి పట్టించుకోలేదు. "మా వాళ్ళు వెళ్ళిపోతారు. ఒక్కర్తెనూ, పొద్దుపోయేక, ఒంటరిగా ...."

"ఏమిటి మీ వుద్దేశం? చీకట్లో ఒంటరిగా మిమ్మల్ని వదిలేస్తాననుకుంటున్నారా?" అన్నాడు ప్రభాకరరావు.



BRAOU

"ఈపూట మాయింట వుండడానికేమిటి మీ అభ్యంతరం?" - అంటూ విజయలక్ష్మి మళ్ళీ మొదటి కొచ్చింది.

ఆ మాటకు సమాధానం ఇవ్వకుండా రుక్మిణి తన అంగీకారానికి ఓ షరతు పెట్టింది.

"ఒక్క షరతు మీద ..."

ఏమిటది అన్నట్లు ప్రభాకరరావు కనుబొమ్మలెత్తేడు.

"నాకో వాగ్దానం చెయ్యాలి" అంది రుక్మిణి.

విజయ అన్నగారి ముఖంవంక చూస్తూంది. ప్రభాకరరావు ఆశ్చర్యంగా అడిగేడు.

"ఎవరు? నేను వాగ్దానం చెయ్యాలా? ఏమని?"

ఔనన్నట్లు రుక్మిణి తల ఆడించింది.

"మీరు .... వాళ్ళయింటికి వెళ్లడం ఏమిటి? .... నాకు షరతు లేమిటి? అక్కడికి నేను రాకూడ దంటారేమిటి! చెప్పండి హెూటలు నుంచి సామానుతెచ్చే ఇబ్బంది వుండదు" అని ప్రభాకరరావు హాస్యమాడేడు.

రుక్మిణి విజయ నవ్వేరు.

"మీరు పట్టినేవస్తే చాలదు".

"మరేం చెయ్యమంటారు?"

"మీరిందాకా సభలో ఓమాట అన్నారు గుర్తుందా?"

"ఒక్క మాటయేం? నాచేత తెగవాగించేరు మీరంతా" - అన్నాడు ప్రభాకరరావు చిరునవ్వుతో.

"అసలు విషయాన్ని దాటేశారు చెప్పకుండా" - అంది రుక్మిణి. అభియోగం చేస్తున్నట్లు.

"ఏమిటండోయి అది!"

"మనమో మహత్తర సాంఘిక విప్లవం మధ్య వున్నాం. తెలుగు రచయితలు దానిని ప్రతిధ్వనిస్తున్నారే గాని, దానికి తమ గొంతు కలపడంలేదు. దానిని నడిపించడానికి బదులు దిగదీస్తున్నారు అంటూ అన్నారు. మీ వుద్దేశమేమిటో చెప్పాలి. ఆ షరతుమీద ..."

"ఏదో మీరంతా పెద్ద పీటవేస్తున్నారు కదా అని, దానిని నిలుపుకొనేందుకు వెర్రో మొర్రో ఏదో ఒకటి అన్నాను. దానిని అలాగే పోనివ్వాలి గాని, ఇల్లా నిలేసి, ఏమిటామాట చెప్పమని కూర్చుంటే .." - అంటూ ప్రభాకరరావు కృత్రిమ భయం నటించేడు. తన్ను వదిలెయ్యమన్నట్లు దీనంగా చూసేడు.

విజయలక్ష్మి మంచి ప్రశ్న వేసేరన్నట్లు చూసి, తల ఎగరేసింది.

"ఔను మరి, నన్ను దారి తప్పించిరమ్మంటున్నప్పుడు ..." రుక్మిణి తాను షరతు పెట్టడంలోని ఔచిత్యాన్ని నిరూపించింది.

"వారి పరిచయ భాగ్యం కలుగుతుంది, చాలదా?" అని, అంతవరకూ నిశ్శబ్దంగా ప్రక్కనే నిలబడి వింటున్న వినోద హాస్యమాడింది.

"గిరీశం చెప్పినట్లు మనతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్ అన్నమాట" అన్నాడు, ప్రభాకరరావు.

హాస్యాలు, నవ్వుతాలు మధ్య కొత్తదనం, బెరుకు, సంకోచం అన్నీ ఎగిరిపోయాయి.

తమతో రుక్మిణి మరో రెండు గంటలు గడపడానికి నిర్ణయించడం ప్రభాకరానికి సంతోషం కలిగించింది. చెల్లెలు సమీపంలో లేనప్పుడు 'థేంక్సు' తెలిపేడు.

రుక్మిణి ఆశ్చర్యం కనబరచింది "ఎందుకు?"

BRAOU

మనస్సులోని అభిప్రాయం ఏదయినా పైకి మాత్రం – "నా మర్యాద దక్కించేరు", అన్నాడు ప్రభాకరరావు.

ఇంతలో విజయ వచ్చింది. ఇద్దరూ ఒక్కమారే అడిగారు.

"బయలుదేరుదామా?"

## 12

ప్రభాకరరావు స్నానంచేసి బట్టలు మార్చుకొని వచ్చేవరకూ విజయ రుక్మిణితో కబుర్లు చెప్తూ కూర్చుంది. అతడు రాంగానే ఆమెను లేవదీసింది.

"పనిమనిషి బాత్‌రూమ్‌లో నీళ్లు పెడుతూంది. పోయి స్నానం చేసి రండి".

రుక్మిణి మొగమాట పడింది. విశాఖపట్నంలో ఉక్క దుర్భరం. కాని ....

సాయంకాలం స్నానంచేసి బయలుదేరానన్నా విజయలక్ష్మి వొప్పుకోలేదు. విడిచిన బట్టలే కట్టుకోవాలన్నా విడువలేదు.

"బట్టలుతీసి పెట్టేను. ఈ వుక్కలో మాకేదో కష్టం కలుగుతుందని .... యాతనపడకండి".

రుక్మిణి స్నానాలగదికి వెళ్లేక విజయలక్ష్మి అన్నగారిని నిలేసింది. ఇంతసేపటికి ఆమెకు ఏకాంతం దొరికింది. ఆమె విషయంలో అన్న వూహలు ఏమిటో స్పష్టంగా తెలుసుకోదలచింది.

"ఈవిడ పరిచయం ఎక్కడ? "అంటూనే తన ప్రశ్నను అతిసాధారణంగా తోపింపచేయడానికై "చాల తెలివీ, కలుపుగోరుతనమూ వున్న మనిషి" అంది.

తమకు పరిచయం కలిగిన వివరాల్ని ప్రభాకరరావు చెప్పేడు. సూక్ష్మంలో 'రైలులో' అన్నాడు. అంత కన్న విశేషం వుంటుందని విజయ భావించలేదు.

"హాస్టలులో నేనెరిగినవాళ్లు ఒకరిద్దరు వున్నారు. ఎప్పుడైనా వెడుతుంటా కాని, ఈమెను ఎప్పుడూ చూసిన గుర్తులేదు".

"రీసెర్చి స్టూడెంటు కదూ. అందులోను సైన్సు నువ్వెప్పుడేనా తటస్థపడి వుండకపోవచ్చు" అంటూ ఒక్క నిమిషం ఆగేడు.

"చాలా ధైర్యం, నిబ్బరంగల మనిషిలా కనిపించింది. తెలివీ, చదువూ వుంది. మంచితనానికి మంచితనమూ వుంది. నీకు పరిచయం చేద్దామనిపించింది మొదట సరేవస్తానంది. మరల సందేహించిందేమో ననుకున్నా. కాని, లేదు .... పాపం, నిజమే చెప్పింది".

ఆమె సందేహించినట్లు ఎందుకనిపించింది? ఆమె చెప్పిన నిజం ఏమిటి? అని విజయలక్ష్మి ప్రశ్నించలేదు. ఆమె మనస్సంతా కంఠస్వరంలోని ఛాయలనుబట్టి ఆమె యెడ అతనికిగల భావాలను తెలుసుకొనే ప్రయత్నంలో ఉంది.

"అంతేనా?" అంది, అన్నగారు తన మనస్సు విప్పిచెప్పడం లేదన్న అనుమానంతో.

"అంతకంటే ఏముంటుందేం?"

ఆ ప్రశ్నించినతీరూ, ఆ ప్రశ్నా ఆమె అనుమానాన్ని బలపరిచేయి. కాని, ఆమె ఏమీ అనలేదు. ఒక్క నిమిషం వున్నాక ప్రభాకరరావే అన్నాడు. "అంతకన్నమరేంలేదు".

ఆగి మళ్లీ అన్నాడు. "నువ్వునాకన్న చిన్నదానివి. ఆడపిల్లవు నీ కెల్లాచెప్పాలో తెలియడంలేదు. చెప్పే అలవాటులేదు. అయినా చెప్తాను ..."

విజయలక్ష్మి అందించింది.

"పెళ్లిచేసుకోవాలనా?"

ప్రభాకరం నవ్వేడు. "పుట్టబోయే పిల్లకు పేరు పెట్టేస్తున్నావు. ఆవిడతోటి ప్రథమ పరిచయం ఎటువంటిదో తెలిస్తే నవ్వుతావు. కాని, ఆవిడంటే ఓ ఎడ్మిరేషన్ కలిగింది, గట్టి అమ్మాయి అనిపించింది. ఆమె చేసిన సహాయానికి కృతజ్ఞత తెలుపుతూ ఓ వుత్తరంవ్రాసి పడేశాను. అది అలవాటుకొద్ది చేసినపని తప్పదానికో ప్రత్యేకత లేదు. ఆమె సమాధానమిస్తుందనే ఆలోచనాలేదు, కాని, ఆమె సమాధానమిచ్చింది. అప్పుడు మనస్సులో ఓ ఆలోచన కలిగింది ..."

"ఏమనేం?"

"ఆమెతో పరిచయం పెంచుకోవాలని ..."

"అయితే ఆవిడ ఎవరో, ఏమిటో నువ్వు ఎరిగినట్లేనా లేదే! పరిచయం అంటే? ..." అంది, ఉత్సుకతతో.

ప్రభాకరరావు ఏమీ అనలేదు. విజయే చెప్పింది.

"ఆమెది మనకులంకాదు. బెజవాడలో"

"ఆ స్టేషనులోనే మొదట చూశాను ... అయితే అవన్నీ తెలుసుకోవడం అవసరమనిపించలేదు. వాళ్ళ కులం ఆలోచనలేదు. ఆమె స్వభావం చూసేక ఆమెతో పరిచయం చేసుకోవాలనిపించింది.

"సవ్యంగా జరుగుతే ..." అని విజయ ప్రారంభించింది.

"సవ్యం అంటే ..."

"ఈ పరిచయం పెళ్లికి దారితీస్తే ..."

ప్రభాకరరావు నవ్వేడు "పరిచయానికి పరమార్థం పెళ్ళేనన్నమాట".

ఎడ్మిరేషన్ అన్నమాటా, పరిచయం పెంచుకోవాలనుకొన్నామాటా విన్నాక విజయలక్ష్మికి అన్నగారి మాటమీద విశ్వాసం కలగలేదు. నిలవదీసింది.

"అటువంటి ఆలోచన లేదా?"

ప్రభాకరరావు ఒక్క నిమిషం తటపటాయించేడు. చెల్లెలు సమాధానంకోసం ఎదురు చూస్తూంది.

"ఇది ఏకపక్ష నిర్ణయంతో జరిగేదికాదు".

అది సమాధానమేకాదు, ఆమాటనే విజయా అంది.

"అది కాదురా. నువ్వు పనికట్టుకొని ఒక అమ్మాయితో పరిచయం పెంచుకోవాలని బయలుదేరేప్పుడు నీ ఉద్దేశం ఏమిటని ఎవరేనా అడుగుతారు".

ప్రభాకరరావు ఒక్క నిమిషం ఆలోచించేడు. "ప్రేమ, గీమ అనే పెద్ద భావాలు పెట్టుకొని ఆలోచించకు, నిజానికి ఆమెకు మొదటి ఉత్తరం వ్రాసినప్పుడు ఏ ఆలోచనాలేదు. మర్యాదకి వ్రాశాను. నా ఇంటర్వ్యూ నుండి తిరిగి వచ్చినప్పుడు ఒక విధమైన మనస్థితిలో వున్నాను. నా మనస్సులోని ఆవేదననీ, ఆవేగాన్నీ ఎవరో ఒకరికి వ్రాయాలి. బహుశా నాతోటే మన దేశానికి తిరిగివచ్చిన కుల్కర్ణీకి వ్రాసి వుండేవాడిని. గదికి వచ్చేసరికి యెదురుగా ఆమె ఉత్తరం ఉంది. ఆవిడకి వ్రాసి పడేశాను. అంతే, అయితే బయలుదేరి రైలు ఎక్కినప్పటి నుంచీ ఒక ఆలోచన మనస్సుని పట్టుకుంది. కొంతకాలంగా ఒంటరితనం బాధ అనిపిస్తూంది. ఉద్యోగం దొరికితేగాని పెళ్ళేమిటని టలాయించేను. కాని, మద్రాసు అనుభవం తర్వాత ఈ దేశంలో మనికి లాభం లేదనిపించింది. ఇటీవలనే ఒక కంపెనీ ఉద్యోగం ఇస్తే, వచ్చి చేరవలసిందని కెనడా నుంచి వ్రాసింది. ఇంక వెడితే మంచిదనిపించింది. పోయేటప్పుడు నాతో జీవితం కలపగల, చదువుకున్న అమ్మాయి కనిపిస్తే పెళ్ళిచేసుకొని, ఇద్దరం వెళ్ళిపోవాలనే ఆలోచన కలిగింది. ఈమెతో కలిగిన స్వల్ప పరిచయం ఆ ఆలోచనకు కారణమా, ఆ ఆలోచనకలగటం చేతనే ఈమెతో పరిచయం పెంచుకోవాలనుకొన్నావా అంటే నేనే చెప్పలేను. ఎవరో చదువుకొన్ని అమ్మాయిని చేసుకోవాలనే ఆలోచన నా కెప్పటినుంచో ఉంది. సామర్లకోట



BRAOU

వచ్చేసరికి ఆ ఆలోచన బలపడింది. ప్రయత్నిద్దామనిపించింది. అల్లా కాకినాడ వెళ్లాలనుకున్నవాడిని ఇటు తిరిగేను ..."

విజయ ముఖంలో విచారం కనపడింది.

"మళ్ళీ దేశం వదలిపోదామనా? ఎందుకంత తొందర?"

ఆమె ఆలోచనలు అసలు విషయాన్ని వదలి, అన్నగారు విదేశాలకు పోవాలనుకోవడం మీద కేంద్రీకృతం అయ్యేయి. అసలు విషయానికి వచ్చేలోపుగాను రుక్మిణి హాలులోకి వచ్చింది.

"మీరు వెళ్ళిరాండి" అని విజయను స్నానానికి పంపించింది.

"కూర్చుని కబుర్లు చెప్పుకొంటూండండి. ఇప్పుడే వచ్చేస్తా" అని విజయ వెళ్ళింది.

* * *

రుక్మిణి సోఫాలో సర్దుకుని కూర్చుని, పరధ్యానంగా ఆలోచనలో ఉన్న ప్రభాకరరావును పలకరించింది – "ఏమిటాలోచిస్తున్నారు!"

అతడు నెమ్మదిగా బాతాఖానీ విడిచేడు. మధ్యలో ఒక ప్రశ్న చల్లగా చొప్పించేడు.

"డాక్టరేట్ తీసుకొన్నాక ఏం చెయ్యాలనుకొంటున్నారు?"

రుక్మిణి తాను పెద్దగా ఆలోచించలేదంది. అయితే ఛాన్సు దొరికితే మాత్రం ఏ ఇంగ్లండులోనే, అమెరికాలోనే కొంతకాలం 'ఫర్దర్ రిసెర్చి' సాగించాలనే ..." అంది. "అయితే దానికో నిశ్చితమైన రూపం ఏర్పడలేదు సుమండీ".

నిజానికి రుక్మిణికి ఆ ఆలోచన ఎన్నడూ కలుగలేదు. పైగా, కొంత కాలంగా, పెళ్ళిచేసుకొని జీవితంలో స్థిరపడాలనే దృష్టి పెంచుకొంటూంది. కాపురం చేసుకొంటున్నా కూడా ఇంకా చదవాలని కోరే ప్రభాకరరావును సంతోషపెట్టడానికి ఈ భావాన్ని వెల్లడించిందో ఏమో ... రుక్మిణికి కూడా ఆ ఆలోచన కొత్తదిగా, అసత్యంగా అనిపించింది. వెంటనే మినహాయింపు జరిగింది.

ప్రభాకరరావు ఆశ్చర్యంగా ఆమె కళ్లలోకి చూసేడు.

"విదేశాలకు వెళ్ళడం మీకు అంగీకారం కాదనుకున్నానే ..."

"ఉద్యోగాలకు ఆశపడి దేశం వదలడం అన్యాయంగాని, జ్ఞానార్జనకే ఆ నిషేధాన్ని వర్తింపజేస్తే మనం ముందడుగు వెయ్యగలమా –" అంది, ఆ సమస్యమీద పలుమార్లు వాదనలు, చర్చలూ జరిపి ఒక నిర్ణయానికి వచ్చినంత ధీమాగా, అది నిజమేనా అన్నట్లు ప్రభాకరరావు ఆమె వంక చూస్తున్నాడు.

"మరి మీ తల్లిదండ్రులేమంటున్నారు?"

"చదువుకొంటే వద్దంటారా?"

"ఏమీ అనరూ?"

"మా నాన్నగారు ఆ వుద్దేశంతోనే వున్నట్లనిపించింది. అయితే ఎప్పుడూ ఈ ప్రసక్తి రాలేదనుకోండి". అంది. తన తండ్రి రామచంద్రరావుతో అన్నమాటలు గుర్తుచేసుకుంటూ.

"మరి మీ అమ్మగారు?"

"ఆవిడ మాత్రం ఎందుకు అభ్యంతరం చెప్పాలి?" అంది చిరునవ్వుతో.

ప్రభాకరరావు హాస్యంచేసేడు.

"ఇందాకా మీరేదో అడిగేరు. సాంస్కృతిక విప్లవంలో ఇదో భాగం. ఇంతకంటే వేరే ఏదో లేదు".

ఆ 'ఇది' ఏమిటా అని రుక్మిణి కళ్ళింత చేసుకు చూసింది.

BRAOU

"ఇంతకు పూర్వం ఆడపిల్లలు, వాళ్ళ చదువులు, వుద్యోగాలు, పెళ్ళిళ్ళు, జీవిత పద్ధతులు గురించి మన సంఘంలో వుంటూండిన ఆలోచనలకూ ,ఇప్పుడు చదువులకై మీరు విదేశాలకు వెళ్ళడాన్ని తల్లి దండ్రులు ఆటంకపరచరనే దానికి పోలుస్తే మన ఆలోచనలలో, పద్ధతులలో, సంస్కారంలో యెంతో పెద్ద మార్పు, మహద్విప్లవం వచ్చిందనిపించడం లేదూ?"

ప్రభాకరరావు తననే చూపించి తన ప్రశ్నకు సమాధానమిస్తుంటే రుక్మిణి తెల్లబోయింది. అతడది గమనించేడు.

"క్షమించండి, మిమ్మల్నే ఉదాహరణంగా చూపుతుంటే కోపం రాలేదుగదా!"

రుక్మిణి తేరుకొని "మీరేం తప్పుమాట అన్నారు?" అంది.

"ఈ మార్పు మన సాహిత్యంలో బాగానే ప్రతిబింబిస్తూంది. కాని, మన సమాజంలో ఈ విప్లవాన్ని త్వరితగతిని సాగకుండా నిరోధించేవీ, దానిని అడ్డుకొట్టేవీ అనేక శక్తులున్నాయి. ఆలోచనలూ, అలవాట్లూ వున్నాయి. వానిని మన సాహిత్యకారులు బయటపెట్టి ప్రజలనీ, వాళ్ళ మనసుల్నీ సన్నద్ధం చేయాలి. అలా చెయాలంటే మన రచయితలు సమాజగతిని అర్థం చేసుకోవాలి. మన తెలుగు రచయితలు దానిని పట్టించు కోడంలేదని నా ఆరోపణ. కనీసం హెచ్చుమంది ఆ విషయాన్ని పట్టించుకోడం లేదు".

రుక్మిణి ఆలోచిస్తూంది. ఒక్కక్షణం ఇద్దరూ మౌనంగా వున్నారు. మరల రుక్మిణే కదిలించింది.

"మీరు చెప్పింది అంతేకాదు. రచయితలమీద మీరు సరాసరి ఆరోపణే చేసేరు".

ప్రభాకరరావు తలవూపేడు.

"రచయితలు పాఠకులను ఆలోచింపజేయడానికి బదులు, వాళ్ళ ఆలోచనలకు గిలిగింతలు పెట్టడానికి, కన్నీళ్ళమాటునా, వెర్రి కేకలు వెనకా ఆలోచన తోచకుండా చేయడానికీ కొన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఉదాహరణకి చూడండి. ఆడపిల్ల స్వతంత్రంగా అడుగు వెయ్యబోతే ఎన్నో పెద్దపులులూ, తోడేళ్ళూ, కాచుక్కూర్చున్నట్లు చెప్తున్నారు. [illegible]డలకొడుతున్నారు ..."

రుక్మిణి ఆశ్చర్యంతో అతని ముఖంలోకి చూసింది. సాయంకాలం సుధ తన వుత్తరంలో ఇదే వ్రాసింది, తానూ ఆ ఆలోచనను బలపరిచింది. ఇప్పుడీయన, పరేంగితజ్ఞానం వున్నదా ఆ మనిషికి అనుకొంది.

"సరిగ్గా ఇదే అభిప్రాయం మధ్యాహ్నం తోచింది" అంది. ప్రభాకరరావు ఆమెవేపు ఆశ్చర్యంతో చూసి "నిజం" అన్నాడు.

రుక్మిణి తలవూపింది. అతడేమీ అనలేదు.

"తనకో, తన దగ్గిర స్నేహితురాలికో దెబ్బతగిలి అనుభవం అయిందన్నమాట" అనుకొన్నాడు.

## 13

రుక్మిణిని హాస్టలు ద్వారంవరకూ సాగనంపిరావడానికి ప్రభాకరరావు జోడు వేసుకొన్నాడు.

రాత్రి పది కావస్తూంది. ఎవరన్నా తోడురావాలని మనస్సులో ఉన్నా, పైకి గంభీరగా అనవసరం అని నిరాకరించబోయింది, రుక్మిణి.

"వెన్నెలరాత్రి. దూరంకూడా కాదు" అంది.

కాని, విజయలక్ష్మి ఒప్పుకోలేదు. ప్రభాకరరావు పని తగిలి ఆ నిముషంవరకూ రాలేకపోయేడు. తొమ్మిది గంటలవరకూ ఉండి, పనిమనిషి ఇంటికి వెళ్ళిపోయింది. ఇప్పుడు ఇద్దరూ బయలుదేరితే ఇంటికి తాళం పెట్టాలి.

విజయ అతని ముఖంలోకి చూసి తలపంకించింది.

"పోనీ, ఇక్కడేకదా, నే దిగబెట్టివస్తా, నువ్వు ఇల్లా కుర్చీ వేసుక్కూర్చుని విశ్రాంతి తీసుకో. పగలంతా కూర్చున్నట్లే లేదు".

ఆమె ఎగతాళిని గమనించినట్లు ప్రభాకరరావు "సరే వెళ్ళిరండి" అన్నాడు. రుక్మిణి అంతకు పూర్వం తనకు తోడురానవసరం లేదని నిరాకరించిన విషయం మరిచి విజయ తోడురావడంవలన కలిగే ఇబ్బందిని వివరించింది.

"ఆవిడకు దిగబెట్టడానికి మళ్ళీ నేను రావాలి. తిరిగి నా కోసం ఆవిడ. మళ్ళీ నేను ... తెల్లవారేవరకూ ఇద్దరం రోడ్డుమీదనే ఉండిపోవాలి" అంటూ రుక్మిణి నవ్వింది.

తన ప్రతిపాదనలోని అసందర్భాన్ని గ్రహించినట్లు విజయలక్ష్మి తన ప్రతిపాదనను ఉపసంహరించుకొంది.

ప్రభాకరరావు రిక్షాలు పిలువబోయేడు. మరల రుక్మిణి అభ్యంతరం తెలిపింది ...

"ఈ కాస్త దూరానికే మళ్ళీ రిక్షా ఎందుకు? వెన్నెల చల్లగా ఉంది. నడిచిపోదాం. రాండి".

వెన్నెలలో సముద్రం పరవళ్ళు తొక్కుతూంది. ఎదురుగా దూరాన ఏదో ఓడలో దీపాలు మిటమిటలాడు తున్నాయి. పక్కకు తిరిగేసరికి, ఆ ఓడేవచ్చి నిలబడ్డట్లు ఆడపిల్లల హాస్టలు కనబడింది. ఇంకా సద్దుమణగలేదు. గదులలో దీపాలు వెలుగుతున్నాయి.

గేటులోకి వచ్చేక రుక్మిణి నిలబడి, వెనుదిరిగింది.

"మీ చెల్లెలుగారిని పరిచయం చేశారు. చాల సంతోషం".

"ఆ మాట అనవలసింది నేను. మీ కార్యక్రమాన్ని మార్చుకొని వచ్చేరు" అంటూ ప్రభాకరరావు వినయం కనబరిచేడు. ఆమాటకు రుక్మిణి ఉక్కిరిబిక్కిరి అయింది. దాన్ని కమ్ముకొనేటందుకు నవ్వింది.

"తమాషా మనుష్యులండీ" అంది. ప్రభాకరరావు ఏదో చెప్పబోయి, మరల సందేహించినట్లు వూరుకున్నాడు. రుక్మిణి అడిగింది – "ఇంకా ఉంటారా?"

దానికి అర్థం తాను వుండమన్నట్లుగా అనిపించదుగదా అనుకొంది. "చెల్లెలిగారింటికి రాకరాక వచ్చినట్లుంది. కొన్నాళ్ళుండి వెళ్ళండి" అని సలహా ఇచ్చింది.

BRAOU

సలహా భాగాన్ని ప్రభాకరరావు వినకుండానే "వుండమంటారా?" అన్నాడు. అతని స్వరంలో హాస్యం పాలుకన్నా ఆకాంక్ష భాగమే ఎక్కువగా వినిపించి, రుక్మిణి మరింత కంగారుపడింది.

"నేను ఉండమంటే మా యింటికి పిలవాలిగాని మీ చెల్లెలుగారింటికి నేను పిలవడం ఏమిటి?" అంది. ఒక్క క్షణంక్రితం తాను చేసింది అదేనన్నమాట మరచి ప్రభాకరరావు మాటమార్చేడు.

"ఉంటే మిమ్మల్ని చూడ్డానికి రావచ్చునా?"

"చాల సంతోషం, ఉండండి. తప్పకుండారాండి".

రుక్మిణిలోనికి వెళ్ళేవరకూ ప్రభాకరరావు అక్కడే నిలబడి, వెనక్కి తిరిగేడు.

రుక్మిణి సంతృప్తో, అసంతృప్తో తెలియనిస్థితిలో గదిలో అడుగుపెట్టింది. వెలుగులోంచీ వెన్నెలలోంచీ వచ్చి మసక మసకగావున్న గదిలో అడుగుపెట్టడానికి ఎలాగో అనిపిస్తోంది. చెమ్మ నేలమీద వట్టి కాళ్ళతో అడుగుపెట్టడంవల్ల గలిగే చికాకు. ఇదివరకు ఎన్నడూ అనిపించివుండని ఒంటరితనం ఆ మసకచీకటిలో, నిశ్శబ్దంగావున్న ఆ గదిలో ప్రత్యక్షమయింది. ఒక మనిషికి ప్రత్యేకంగా ఒక గది దొరకటం హాస్టలులో ఒక హోదా అనాలి. ఆ సౌకర్యం కలిగిననాడు కనిపించిన ఉత్సాహం ఇపుడు కనిపించలేదు. ఉత్సాహం, సంతోషంతో ఉద్వేలం అవుతున్న ప్రపంచంలోంచి ఏదో అధఃకూపంలోకి తోసి తలుపువేస్తున్నట్లనిపించింది.

అప్పుడే పదయింది. నిద్రవస్తున్నట్లు లేదు. మరో గంటసేపు కబుర్లుచెప్తూ కూర్చుండిపోయినా బాగుండేదనిపించింది. చెప్పడానికి ప్రభాకరరావే తగును. అమెరికన్ యూనివర్సిటీలు, చదువులు, విద్యార్థులు, అనేకానేక విషయాలు తెలుసుకోవలసినవి కనిపిస్తున్నాయి. అతడున్నంతసేపూ ఏదో బాతాఖానీలోనే గడిచిపోయింది. ఇష్-అనుకుంది. మళ్ళీ కనిపిస్తే కనుక్కోవాలి. కనిపిస్తాడా అనే సందేహం ఓ మూల బాధిస్తూంది. అతని విషయంలో మొదట అనిపించిన అనుమానం సరికాదనే ఉత్సాహం రెండోవైపున మత్తెక్కిస్తూనే ఉంది.

స్విచ్ వేయబోతూ మరల ప్రభాకరరావు కనిపించే అవకాశం వుందేమో ఆలోచనలోపడింది. అతడు మళ్ళీ చూడరావచ్చునని అన్నప్పుడు తానేమందో గుర్తురాలేదు. సంతోషం, తప్పక – అనేవి వట్టిమాటలు మాత్రమే. వానిని పలికేటప్పుడు గొంతులో వినిపించే ఉత్సాహమూ, ఆతురతా వచ్చేటట్లు చేస్తాయి. అది లేకపోతే అవి వట్టి మర్యాద సూచకాలయి వూరుకొంటాయి. తానేమన్నానా అని ఆలోచిస్తూ స్విచ్ వేయకుండానే చెయ్యితీసేసి పోయి మంచంమీద కూర్చుంది. అసలు ప్రభాకరరావు మర్యాదకే ఆ ప్రశ్న వేసివుంటే?

ఆ రోజున జరిగిన సంఘటనలన్నిటినీ మొదటినుంచి తలచుకొని నెమరువేసుకోసాగింది ... అతడు సాయంకాలం అయిదుగంటల ప్రాంతంలో వచ్చేడు. పదిగంటలకు వెడుతున్నాడు. ఆ అయిదు గంటల కాలంలో అతడు తనతో పరిచయం కలిగించుకోడానికీ, పెంచుకోడానికీ ప్రయత్నించేడు. మొదట అతడెవరో తెలియదు. కాని, వచ్చేడంటే బాగానే వుంది. వచ్చేక అతడు చూపుతున్న ఉత్సాహం, ఆసక్తీ తనమూ ఉత్సాహపరిచింది. మధ్యలో అతడెవరో అర్థం అయింది. వారంక్రితం ఈ మనిషిని యెరగకుండానే, తన తల్లిదండ్రుల ప్రశ్నలనుంచి తప్పించుకొనేటందుకు ఓమాట అనేసింది. "అడగవలసిన మనిషివచ్చి నన్నే అడిగితే ఏం చెప్తానో మరి" అంది ఆనాడు. తండ్రిద్వారా తనకు వధువును వెతికిస్తున్న అప్రయోజకుడనే ఈసడింపు తన కానాడు.

అడగవలసిన మనిషి వచ్చేడు, తలుపుతడుతున్నాడు. తానేం సమాధానం ఇస్తుందో కూడ తన మనస్సుకు ఎరుక అయినట్లే తోస్తూంది.

తానెవరో అతనికి తెలుసునని మొదట భావించింది. చివరకు ఏమీ తెలియని అర్థమయింది. తెలియదు. తెలుసుకొనేందుకు ఒక్క ప్రశ్న వెయ్యలేదు. సరాసరి ముందుకు అడుగువేస్తున్నట్లు కనిపిస్తున్నాడు. అతని ఆలోచన ఏమిటి? ... కేవలం మనిషిని చూసి చదువుచూసి ముందడుగు వేసే యువకులుండరని తన అభిప్రాయం. వారం క్రితం ఈయనను గురించే రామచంద్రరావు చెప్పినప్పుడు తన తల్లిదండ్రులు 'కులాంతరం' అని చప్పరించేశారు. వాళ్ళు ఓ లక్షవరకూ కట్నం ఆశ చూపినా తోసేసి కామేశ్వరరావు సుధను చేసుకొంటున్నాడు. కుటుంబ మర్యాదలు, యోగ్యత, మంచితనం అంటూ తండ్రి తన ఆలోచనలకు అనుగుణంగా వధువును వెతుకుతూంటే ఈతడు ముక్కూమొగం ఎరగని తనవేపు వచ్చేడు. తనలో ఏం చూసేడు? అన్నదానికిప్పుడు పెద్ద ప్రశ్న అయి కూర్చున్నది.

నిజానికి ఆ రోజున హౌరాల్దాల్ ప్లాట్‌ఫారం మీద గిరాటు వేసిన తనమీద అతనికి సదభిప్రాయం కలిగే అవకాశం ఉందనిపించడంలేదు. కాని అదే ఈనాటి సాన్నిహిత్యానికి కారణం అవుతూంది. అతని మనస్తత్వం చిత్రంగా కనిపించింది. తన మీద ప్రేమ పుట్టుకొచ్చి వస్తున్నాడనుకోవడం లేదు. ప్రేమ ఏర్పడేందుకు తముకు ఏం పరిచయం వుంది? ప్రథమ దర్శనంలోనే ప్రేమ పెల్లుబికినందనుకొనేందుకు తన వ్యవహారం అలా వుంది. తాను పెద్ద అందకత్తెను కానని ఆమె అభిప్రాయం. సుధది అందం. వినోదది సౌందర్యం. అంటే, తాను అనాకారి కాదు; అంతవరకే, కాని ....

ఇన్నాళ్ళూ ప్రేమ అంటే తన మనస్సులో పేరుకున్న అభిప్రాయాలు ఏమయ్యాయో! నాలుగయిదు గంటల పరిచయంతోనే తానాతని నుంచి వివాహ ప్రతిపాదన నెదురు చూస్తూంది. అతడి నుండి మొదటి ఉత్తరం వచ్చిన రోజునుంచీ కూడా అటువంటి ప్రతిపాదననే ఆశించడం లేదుకదా అనిపించింది. ఆ మాటలు అనుకోడానికూడా అవమానం అనిపించింది. ఏ మగవాడేనాసరే, ముందుకువస్తే చాలుననుకోడం తప్ప దానికి అర్థం ఏమిటి?

మగవాడైతే చాలుననే భావం తన మనస్సులో కలిగిందనుకోవడం కూడా చిన్నతనం, అసహ్యం.

BRAOU

తన ఎదుటనున్న మగాడు ఎవడో ఒకడు కాదు. ప్రభాకరరావు ఆమెకు అలా అనిపించడంలేదు. దానికి కారణాలు ఏమిటో నెమరువేసుకోసాగింది.

మంచి విగ్రహం. మంచి చదువు. మంచి వయస్సు - అన్నీ మంచివే అనిపిస్తూంటే నవ్వొచ్చింది. ఈమారు అవలక్షణాలకోసం వెతికింది. మీసాలు! - కత్తిరింపు మీసాలయితేనేం, అవి మీసాలే.

హైస్కూలు వదలి కాలేజీ ప్రవేశించిన కొత్తలో లెక్కల లెక్చరరు కోరమీసాలు చూసి ఆడపిల్లలంతా కిసుక్కుమనేవారు. ఆయన భార్య ఆ మీసాల ముద్దుల్ని భరించగలదా అని పెద్ద సమస్యగా గుసగుసలాడేవారు. తానోరోజున నిజంగా చూసినట్లే "ఆయన్ని పెళ్లాం ముద్దు పెట్టుకో నివ్వదు" అని ఖచ్చితంగా చెప్పింది. ఆ రోజుల జ్ఞాపకం వచ్చి నవ్వు వచ్చింది. ఆలోచిస్తూంటే మీసం ఉండడమే ఓ అందమేమోననిపిస్తుంది. కనీసం ప్రభాకరరావు ముఖానికి ఆ మీసం ఓ హుందాతనాన్నిచ్చింది. అతడు ముఖంమీద ముఖంపెడితే ఎలా ఉంటుందో వూహించబోయింది. కాని లాభం లేకపోయింది. ఆ ఆలోచనలకి నవ్వు వచ్చింది.

అనాలోచితంగా, కుర్రవానికిమల్లే వ్యవహరిస్తాడన్నదో లోపం. అది మధ్యాహ్నమే కనిపించింది. ఆ పనులు ఇబ్బంది కలిగిస్తూన్నా సర్దుకోలేడు. వానిని సరిచేయడం పని పైవాళ్ళదే. లేకపోతే అవమానపడతాడు. చిన్నపుచ్చుకుంటాడు. స్టేషనులో తానే సర్దింది. ఇందాకా చెల్లెలిగారి షాపువద్ద కూడా తానే అతనిని బయట పడేసింది. అయితే అతనిలోని ఈలోపం అయిష్టానికి బదులు సానుభూతీ, అభిమానం కలిగిస్తున్నాయి. అతడు తనకై మొగ్గుచూపడం కూడా ఆ లోపానికి ఫలితమేమో? కానీ, అది ఎంతోసేపు వుండలేదు. ఈమాట వొప్పుకున్నా లేకపోయినా ఈమారు మాత్రం అతనికి ఆసరా నివాలనిపించింది. అలాగ తన సహాయం అవసరం కావడం కూడా ఒక మంచి లక్షణంగా కనిపించసాగింది.

మళ్లీ ఆ ఆలోచనా సవ్వేకలిగించింది. తన పెత్తల్లి కూతురు భర్తకి అన్ని వస్తువులూ అందించవలసిందే గాని, అతడొక్కపనీ చేసుకోలడని పెత్తల్లి తన కూతురుపడుతున్న కష్టాలకు విచారపడింది. ఆమధ్య పండుగ కంటూ వచ్చి ఆ కూతురు నాలుగు రోజులేనా వుండకుండా వెళ్లిపోయిందని ఆమె చాలా విచారపడింది. ఎంతో బ్రతిమాలినా ససేమిరా అందట. తనమగడికి చొక్కా మారిందో, పాంటు నలిగిందో, ముఖం తుడుచుకొనే తుండు మట్టి కొట్టుకుందో కూడా తెలియదట. భార్యే వెతికి ఇవ్వకపోతే మంచివో మాసినవో ఏదో ఒకటి - ఎదురుగా వున్నది తగిలించుకుపోతాడట. అదో గొప్పగా చెప్తూంటే తల్లి నోరునొక్కుకుంది. "మేమూ వున్నాం. పెళ్లిళ్ల చేసుకున్నాం. పిల్లల్ని కన్నాం కాని, ఈ నడుమంత్రపుసిరీ, నరాలమీద కురుపూ బాధ మీనాన్నకి కలగలేదు" అన్నదట తల్లి. కూతురు విదిలించేసిందట. ఇప్పుడు మగనికి అగ్గిపెట్టె ఇవ్వడానిక్కూడా సిగ్గేస్తూందని ఆమె చెల్లెలితో చెప్పుకొని ఒకటే ఇదయిపోయింది. అప్పుడా పెత్తల్లి కూతురు మీద కోపంకూడా వచ్చింది. ఆడవాళ్ల బానిసబుద్ధి మగాళ్లకి కొమ్ములు మొలిపిస్తుందని తాను వ్యాఖ్యానించింది. "లేకపోతే పెళ్లికాక పూర్వం ఏం చేశాడు? వేషం కాకపోతే" అంది.

కాని, ఈ సమస్య తనదాకా వచ్చేసరికి అదీ సరదాగానే వుండేటట్లుంది. పైగా అతనిని ఆదుకోవడంలో, ఆదుకోవలసి వుంటుందనుకోవడంలో తనకు ఉత్సాహమూ, గర్వమూ అనుభూతం అవుతున్నాయి.

ఆలోచించగా ఆలోచించగా మరోపెద్ద లోపం కనిపించింది. దానిమీద పెద్దసేపు తర్జనభర్జన చేసింది కూడా.

తాను ఎవరో తెలియకుండా, ఎటువంటిదో తెలుసుకోకుండా ముందడుగు వేయడం ప్రభాకరరావులో పెద్దలోపమే అని తీర్మానించింది. అది తనకు సంతోషం కలిగిస్తున్నా లోపమే మరి. తనను ఏమి చూసి పెళ్ళి చేసుకోదలచేడా అన్న వివేచన కిది పర్యవసానం. కాస్త ఆలోచించ వలసినదిగానే కనిపించిందికూడా. తన చదువో, తన రూపమో, తాను వ్యవహరించిన తీరో చూసి ఆకర్షణ కలిగిందనుకుంటే తనకన్న చదువు, రూపం వున్న మరొకరు కనిపిస్తే ఇంత తేలికగానూ తన్ను వదిలెయ్యడా? అటువంటి మనస్తత్వాన్ని నమ్మగలమా? నమ్మవచ్చునా? తన్నుతానుగానే చూసేడుగానీ, డబ్బు, కులము, కుటుంబము వగైరాలను ఆలోచించలేదనుకోవడం ఆ క్షణంలో సంతోషకరం అనిపించలేదు.



BRAOU

వినోద సలహా తీసుకోవడం మంచిదనిపించింది. వెంటనే లేచింది. గడియారం చూస్తే పన్నెండు! హాస్టలంతా నిద్రపోతుంది. ఆ రాత్రివేళ లేపడం ఎందుకనుకొంది మరల పడుకొంది.

... అసలు తానా విధంగా ఆలోచించవలసిన అవసరం వుందా అని అశంక కలిగింది, ఉప్పెనలాగ. ఏదో ఊసుబోక చూడవచ్చిన పెద్దమనిషి మర్యాదగా మాట్లాడడం చూసి, అతడే పెళ్ళికి ప్రతిపాదించబోతున్నాడని తాను కలలు కంటూందేమో.

మళ్ళీ సమస్య మొదటికి వచ్చింది. అతను ఏం మాట్లాడేడు, ఎల్లా మాట్లాడేడు, ముఖకవళికలు ఎలావున్నాయి?

## 14

తెల్లవార్లూ ఆలోచించినా తేలని సమస్య. మొదట కాదనుకొన్నా మిత్రురాలు వినోద సలహా తీసుకోడానికే నిశ్చయం చేసుకొంది. తరువాతనే మనస్సు తేలికపడింది. లేచి దినసరి కార్యక్రమాలు ప్రారంభించింది.

డైనింగ్ హాల్ నుంచి కాఫీ త్రాగి వస్తూంటే వినోద కనిపించింది. నలిగిపోయినట్లున్న రుక్మిణి ముఖం చూసి అడిగేసింది – "ఏం అల్లా వున్నావు?"

"ఎల్లా వున్నాను?" అంది, విశేషం ఏదీ వుండే అవకాశం లేదన్నట్లు, రుక్మిణి. "ఈ పూట క్లాసులున్నాయా?"

వినోదకు ఉదయం వున్నాయి. రుక్మిణికి మధ్యాహ్నం వున్నాయి. ఎవరో ఒకరు సెలవు పెడితేగాని మంతనం సాధ్యం కాదు.

"ఏం? అల్లా అడిగేవు?" అంది వినోద.

"ఏం లేదు" అంది, రుక్మిణి – అక్కడ ఏం చెప్పడానికి వీలులేక.

* * *

BRAOU

కాని మిత్రురాలు వచ్చి కూర్చుని 'ఏం కథ' అని అడుగుతూంటే ఏం చెప్పాలో అర్థం కాలేదు. తీరా చెప్పేక వినోద నవ్వింది. రుక్మిణి తెల్లబోయింది.

"... పిల్లికి చెలగాటంగాను వుంటుంది" అంటూ విసుగుదల కనబరచింది.

ఆ మాటకు వినోద వేరే అర్థం తీసుకుంది. ప్రభాకరరావు విషయం తేల్చకుండా చెలగాటం ఆడుతున్నట్లు ఫిర్యాదు చేస్తూందనుకొంది.

"నువ్వు ఎలకలా వ్యవహరించకు" అని సలహా ఇచ్చింది. పైగా "నువ్వు నా సలహా అడిగిన పద్ధతి చూస్తే, ఆయన ప్రతిపాదిస్తే నీకే అభ్యంతరం వుండదనిపిస్తూంది" అంది.

రుక్మిణికి ఏం చెప్పాలో తెలియలేదు. నిజం చెప్పాలంటే తాను ఉత్సాహపడుతూనే ఉంది. కాని మనిషి స్వభావం ఏమిటో, ఎల్లాంటి వాడో తెలియడం ఎల్లాగ? పెళ్ళి చేసుకోకుండా మోసగిస్తాడని కాదు. పెళ్ళి చేసుకొన్నాక ఎల్లా వ్యవహరిస్తాడని గాని ...

అతడూ భవిష్యత్తులో ఎలా వుంటాడనేది ఎవరు చెప్పగలరు? భార్యాభర్తల మధ్య జీవితం అనుక్షణం ఇచ్చి పుచ్చుకోవడాల మీద ఆధారపడి సాగుతుంది. ఎదుటి వ్యక్తిని గౌరవించడం, తన ఆత్మ గౌరవాన్ని కాపాడు కోవడం రెండింటికీ మధ్య అవినాభావ సంబంధం వుంది. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోడానికి నిగ్రహించడం ఎంత అవసరమో, నిగ్రహం చూపడం కూడా అంత అవసరమే.

ఈ సూత్రీకరణలు, ఇంతకన్న విజ్ఞానవంతాలూ అనేకమార్లు స్నేహితురాళ్ళ మధ్య చర్చించబడినవే. అయితేనేం? ఇదేదో కొత్త రూపంలో ప్రత్యక్షమయింది. ఇది వరకు వాళ్ళెవ్వరూ ఈ మాదిరి ఘట్టాన్ని గురించి

ఆలోచించలేదు. ప్రేమలూ, వాని మార్గంలో వచ్చే ఆటంకాలూ చర్చించేరు; తల్లిదండ్రులు తెచ్చే వరుల్నీ, కట్నాలనూ, హిరణ్యాక్ష వరాల్నీ చర్చించేరు. కాని ఇది వేరు. ఇది ప్రేమ సమస్య అని రుక్మిణి చెప్పలేదు. ఇష్టం అయింది. ఇష్టానికీ అయిష్టం కాకపోవడానికీ తేడా వుంది.

వినోద ఒక సలహా ఇచ్చింది. " మీ నాన్నగారితో వెళ్ళి చెప్పి రమ్మను" అంది.

"నేను మరి ఆలోచించ నక్కర్లేకుండా వదల్చుకో తలుచుకుంటే వాళ్ళ దాకా పంపనే అక్కర్లే"దంది, రుక్మిణి. ఆమె భయం విన్నాక వినోద మరల ఆ మాట మీద నొక్కలేకపోయింది.

తల్లికి వర్ణాంతరం అభ్యంతరం. తండ్రీ ఆమె వెనక దాగుతున్నాడు. కాని, అసలు అభ్యంతరం రాజకీయం. ఆ కక్ష పనిచేస్తూందని రుక్మిణి అభిప్రాయం.

"వాళ్ళిద్దరూ ఒకప్పుడు తీవ్రరాజకీయవాదులు. ఇప్పుడు వారిలోని ఇరువాగులవారినీ బలపరుస్తున్నారు" అంది.

వారు తమ దృష్టిలోంచే ఈ సమస్యని పరిష్కరిస్తారు, అది అయిపోయింది కూడా. వినోద ఆలోచించింది.

"నువ్వెవరివో తెలుస్తే ఈయనకేం అభ్యంతరాలుంటాయో"

రుక్మిణికి ఆ భయం కలగడం లేదు. తన్ను వట్టి రుక్మిణిగానే అతడు సమీపించేడు. తన కులం, ఆలోచనలు, విశ్వాసాలు గురించి పెద్ద బెడద పెట్టుకున్నట్లు లేదు. అసౌకర్యాలూ, తెలియకపోవడాలూ రెండు వేపులా సమంగానే వున్నాయని అతని వూహ.

"అది ప్రమాదం కాదా!"

ఇందుకే ఆ ఆలోచన తోచినప్పటినుంచీ, రుక్మిణి మాటల సందర్భం వచ్చినప్పుడల్లా తన విశ్వాసాలు, భావాలూ బయటపెడుతూంది. తన వివరాలను అతని చెల్లెలికి ఏదో మాటల సందర్భంలో చెప్పినట్లు చెప్పింది. అది విని వినోద నవ్వింది. తెలిసి వ్యవహరిస్తున్నా, అజ్ఞాతంగానే చేస్తున్నా రుక్మిణి సరిగ్గానే వ్యవహరిస్తూందని ఆమె దిలాసా ఇచ్చింది.

"నీ జీవితంలో నువ్వు సుఖపడేదీ, విచారపడేదీ నువ్వు చేసే పనుల మీదా, నీ ఆలోచనా ధోరణుల మీదా ఆధారపడి ఉంటుంది. అడుగడుగునా నీ [illegible] సలహా లివ్వలేరు. బహుశా నువ్వే అడగలేవు. అయాచితంగా ఎవరన్నా ఇచ్చినా నువ్వే తీసుకోలేక పోవచ్చు. సరిపడక పోవచ్చు. కనక బాధ పడకు. నీకు నచ్చినట్లయితే అంతకంటే మంచిది ఉండదు. నాకు తోచినంతవరకు నువ్వు సరిగ్గానే ఆలోచిస్తున్నావు"

* * *

మిత్రురాలి వద్ద నుంచి గదిలోకి వచ్చేసరి ఎదురుగా టేబిలు మీద చీటీ కనిపించింది. విజయలక్ష్మి ఫోన్ చేసింది. గదిలో లేదంటే రాగానే పిలవమని నెంబరు ఇచ్చింది.

విజయలక్ష్మి పిలుపు తన మనస్సును అంతవరకూ వేధిస్తున్న కొన్ని అనుమానాలను వొదిలించింది. వారు ఇద్దరూ తనను వెంటాడుతున్నారనే అనుకోవాలి. ఇంక ప్రభాకరరావు ఆలోచనలను గురించి తానూహిస్తున్నవి నిజమో, కల్పనలేనో తేల్చుకోవాలి.

గబగబ వార్డెను గదికి వెళ్ళి ఫోను చేసింది. ప్రభాకరరావు గొంతు గుర్తు తెలియలేదు. "విజయలక్ష్మి వున్నారా?"

రుక్మిణి గొంతును అతడు గుర్తుపట్టగలిగేడు. 'నమస్తే"

"పిలుస్తా వుండండి" అన్నాడు

కొద్ది సేపటిలోనే వియజలక్ష్మి వచ్చింది. మామూలు మర్యాదలయినాక ఆమెను తన యింటికి ఆహ్వానించింది.



BRAOU

"... రేపు ఆదివారమేకదా. తీరుబడిగానే వుంటారు. మా యింటికి వచ్చెయ్యరాదూ? మా అన్నయ్యను వుండిపొమ్మంటే గునుస్తున్నాడు. నలుగురం సరదాగా కాలక్షేపం చేద్దాం".

ఒక్క నిమిషం ఆగి మళ్ళీ అంది.

"అభ్యంతరం ఏమీ వుండదు కదా?"

రుక్మిణి ఆ ఆహ్వానానికి ఆశ్చర్యపడింది. అన్నగారి ఆలోచనలకి సాయం చేసే ప్రయత్నమా?

"అభ్యంతరానికేముంది? ఆదివారం ఖాళీగానే వుంటాం. రోజెల్లా గడవడంరా భగవంతుడా అనుకోనక్కర్లేకుండా మీబోటి వాళ్ళ సాహచర్యంతో సంతోషంగా గడిచి పోతుంది.

"మరయితే తప్పకుండా రండి".

రుక్మిణి మరునాడు పన్నెండుగంటల తర్వాత వస్తానంటూంటే విజయలక్ష్మి 'ఇదేం పనికిరా'దంది.

"ఏడు గంటలకే రాండి. రేపు మధ్యాహ్న భోజనం ఇక్కడే. పొద్దుట కాఫీతో సహా"

ఆ అనురోధం వింటే నవ్వు వచ్చింది.

"ఏం విశేషం?" అంది.

"విశేషానికేముంది? రాకరాక వచ్చిన మా అన్నయ్య రేపు పొద్దుటే బస్సుకి వెళ్ళిపోతానని కూర్చు న్నాడు. ఓ విందు అంచం పెట్టి ఆపేం మొత్తం మీద ..." అంది విజయలక్ష్మి. ప్రక్కనేవున్న ప్రభాకరరావు అసమ్మతి తెలపడం వినిపించింది. ఫోనులో.

"సంస్కృత నాటకాలలోని విదూషకుడి పాత్రనుచేస్తున్నావు నన్ను. అప్రతిష్ఠ! నీ విందుకోసం ఆగడం లేదు. ఇటువంటి అవమానాన్ని భరించలేను సువా"

అతని కృత్రిమకోపమూ, విజయ కృత్రిమ భయమూ ఫోన్‌మీద వినిపిస్తూంటే రుక్మిణి ఆనందిస్తూంది.

"తప్పేలేవోయ్ బాబూ! మాట పూర్తికానివ్వవేం? రుక్మిణి గారిని పిలుస్తున్నానన్నాక నేను నువ్వు ఒప్పుకొన్నావని చెప్పబోతున్నా" నంది.

"ఆవిడకి వినిపిస్తే ఏమన్నా అనుకుంటారు. నీకు బొత్తిగా ..."

ప్రభాకరరావు స్వరంలో వినిపించిన కాతరత ఆ మాట నిజమే ననిపించింది. అయితే అది సంతోషం కలిగించిందే కాని, ఏమన్నా అనుకోవలసిన అవసరం ఉన్నట్లు తలచలేదు, రుక్మిణి. ఆ మాటలేవీ తనకు వినిపించనట్లుగానే పలకరించింది.

"పొద్దుట కాఫీకి కూడా ఎందుకు లెద్దురూ. పదిగంటలకి ..."

విజయలక్ష్మి ఆ మాటలేవీ వినిపించుకోదలచలేదు.

"ఏమీ పనికిరాదు. ఏడూ పదిహేను వరకూ చూస్తాను. అప్పటికి మీరు రాకపోతే ...' ఒక్క నిమిషం ఆగి ఆమెనే అడిగింది.

"నేను రావాలా? మా అన్నయ్యని పంపించవచ్చునా?"

ఆప్రశ్న వేసిన తీరుకు రుక్మిణి పక్కున నవ్వింది.

"బలేవారేనే! అయితే నా కోసం వచ్చేవారు కాఫీతాగి మరీ వస్తారేమో సుమండి. ఓ పనిచెయ్యరాదూ? మీరిద్దరూ కలిసిరాండి. ఆ కాఫీ ఏదో ఇక్కడే తాగుదాం.

విజయలక్ష్మి మాటలకు తడుముకోదు – "మరి మా వారొకరున్నారు, వారికి కాఫీ లేకుండా చెయ్య మంటారా?"



BRAOU

రుక్మిణి కూడా ఆ హాస్య ధోరణిలోపడింది. "మీ ఇంట్లో జంటలుగా గాని కాఫీలు తాగడం, విందు లారగించడం లాంటివి జరపరా యేం?"

విజయలక్ష్మి నవ్వింది. "మరోలా చెప్పవద్దు. రేపుదయం ఏడుగంటలకు – మీపని తెముల్చుకో గలుగుతే, ఇంకా ముందుగానే – రాండి మా అన్నయ్య ఇక్కడే ఉన్నాడు, మాట్లాడుతారా?"

తాను ఏమాటా అనే లోపుగానే విజయలక్ష్మి తనను చేతకి వప్పచెప్పేస్తుననట్లు "రుక్మిణిగారు. ఇంద," అని ఫోన్ అన్న చేతిలో పెట్టింది.

వెంటనే ప్రభాకరరావు కంఠం వినపించింది.

"నమస్తే! మా చెల్లాయీ, భర్తా రేపు ఇంట్లోనే ఉంటారు, సరదాగా వాళ్ళతో ఓరోజు గడిపినట్లవుతుం దని ప్రయాణం వాయిదా వేసుకొన్నాను".

"రాకరాక వచ్చి, అంతట్లా చెప్పులు కూడా విడవకుండా బయలు దేరుతాననడం అన్యాయం కదా" అంది రుక్మిణి.

"అదే అనిపించింది. మీ బోటి వాళ్ళతో పరిచయం ఎక్కువ చేసుకొనే అవకాశం కలిగిస్తూంటే వదులుకు పోవడం తెలివైన పనిగా తోచలేదు" అన్నాడు.

"గట్టివారేనే! నామాట నాకే ఎదురు చెప్పేరు, సరే. ఆ పరిచయ భాగ్యం ఇంకా వృద్ధి చేసుకొందురుగాని, మరో వారం ఉండండి మరి" అని రుక్మిణి హాస్యమాడింది.

ప్రభాకరం నవ్వేడు.

"మీ ప్రతిపాదన భేషుగ్గా ఉంది. ప్రస్తుతం నాకేం పనిలేదు. కనక నాకేం ఇబ్బంది లేదు. అయితే మా చెల్లాయీ బావగారూ పగటిపూట మళ్ళీ తుపాకీకి దొరకరు. ఇంక మీరా, మీరా అంటూ నా కోసం పనులు పాడుచేసుకోగల వారెవరా అని వెతకడం ప్రారంభించాలి. రెండురోజుల్లో మొగం చాటుచేసుకోవలసి వస్తుంది మీరంతా".

BRAOU

"ఆ, ఉలకం!" అన్నా విజయమాట దూరంనుంచి సన్నగా వినబడింది.

"ఏం మాటలాడతారండీ" అంది రుక్మిణి.

"అబద్ధమా?" అని అతడు కవ్వించేడు.

"కాక ..." అంటూ రుక్మిణి తన అభిప్రాయాన్ని ధ్రువీకరించింది.

ప్రభాకరరావు మాట మార్చేడు.

"ఎలాగూ వుంటున్నా గనుక ఈ వేళ వైస్‌ఛాన్సలరునూ కొందరు ప్రొఫెసర్లనూ చూస్తే బాగుంటుందని పించింది. ఏవో అప్లికేషన్లు పంపేననుకోండి. అయినా ఓమారు కలుసుకొంటే బాగుండదూ? మీ సలహా ఏమిటి?" అన్నాడు.

తనను అతడు సలహా కోరడం రుక్మిణికి సంతోషమే కలిగించింది. "నేనేం చెప్పగలను?" అంటూనే చెప్పింది కూడా.

ఆ ఆలోచన మంచిదే, బాగానే వుంటుంది. ఉత్తర ప్రత్యుత్తరాల వలన జరగని అనేక పనులు ముఖా ముఖి అయితే జరిగిపోతాయి. పైగా వ్యక్తిని చూడంతోనే కలిగే అభిప్రాయం, ఆకర్షణ అనేక ఆటంకాలను తొలగిస్తాయి. ఆ మాటనే చెప్పింది. ప్రభాకరరావు చూసేవారిని ఆకర్షిస్తాడనీ, సదభిప్రాయం కలిగిస్తాడనే భావం ఆమె మాటల్లో తొంగిచూశాయి.

ఈ మారాతడు ఆమె సహాయం కోరేడు. 'మీకు అభ్యంతరం లేకపోతే ... "అని ప్రారంభించి విశ్వ విద్యాలయాధికారుల్ని చూడడంలో ఆమె సహాయాన్ని అర్థించేడు.

"ఫోన్‌లో ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసుకొంటాం. అయితే ఈ యూనివర్శిటీ ఆవరణ నాకు కొత్త. ఆఫీసులూ, ప్రొఫెసర్లూ, వారుండే స్థలాలూ అడుక్కుంటూ తిరగాలి. వారికి 'అహంభో అభివాదయే' తెలుపుకోవాలి. కాస్త పరిచయం చేసే స్థానికులుంటే ..."

రుక్మిణి మహోత్సాహంతో అంగీకరించింది.

## 15

హాస్టలు గేటుముందు టాక్సీ నిలబడుతూంది. ప్రభాకరరావు రుక్మిణి చేతిని తీసుకొని కళ్ళల్లోకి చూస్తుంటే ఆమె ఒళ్ళు ఝల్లుమన్నట్లయింది.

"థాంక్సు. మిమ్మల్ని చాలా శ్రమపెట్టేను" అంటున్న అతనికేం చెప్పాలో కూడ తోచలేదు. టాక్సీ ఆగిన వూపుకు ఒక్కక్షణం ఆమె తూలి అతనికి జేరగిలబడి పోయింది. రెండు భుజాలూ పట్టుకొని ఆమెను కుదురుగా కూర్చుండబెట్టే ప్రయత్నంలో ఒక్క క్షణం అతడామెను అదుముకొన్నట్లనిపించింది. కాని, ఆమె ఏమీ అనలేదు. 'థాంక్సు' చెప్తూ చిరునవ్వుతో దిగింది.

"విశ్రాంతి తీసుకోండి. మళ్ళీ ఎప్పుడు కనిపిస్తారు?"

కారు కిటికీలోంచి వంగి అడుగుతూంటే అతనికళ్ళు "ఇంక సాధ్యం కాదనవద్దనట్లు మూగ ప్రార్థన చేస్తున్నాయి. ఆమె అప్రయత్నంగానే - "రేపు ఏడుగంటలకు" అనేసింది. కాని, అదే క్షణంలో అంత వ్యవధి ఎందుకు పెట్టేనా అన్న బాధ మనస్సులో రేగింది. ప్రభాకరరావు సమాధానం ఏమిస్తాడో, తన మీద అతడు చూపే ఆసక్తి దానిని పట్టి అర్థం అవుతుందనుకొంది.

"ఇప్పుడు రెండున్నర కూడా కాలేదు".

రుక్మిణి చేతి గడియారం చూసుకుంటూ "ఓహో ..." అంది.

అతడు కారుదిగి వచ్చేడు. ఇద్దరూ గేటువేపు నాలుగడుగులు వేశారు. అతడేదో చెప్పదలచి సందేహిస్తున్నట్లు తోచి అతని ముఖం వంక చూసింది. అతడు నిలబడి - "మిమ్మల్ని నాలుగు - లేక అయిదు గంటలకి కలుసుకోవడం సాధ్యమవుతుందా? మీతో ఒకముఖ్యమైన విషయం మాట్లాడాలసి వుంది" అన్నాడు.

అంతముఖ్యంగా మాట్లాడవలసిందేమిటో తెలుసుననుకొంది. అయినా, అదేమిటో అతని ముఖతః వినడమే తనకూ అవసరం. కానీ ఆమె ఎరగనట్లే "రేపుదయం మాట్లాడుకో కూడదా?" అంది మరల అదే కాల నిర్ణయం.

ప్రభాకరరావు ఆలోచనలో పడ్డాడు. తన అభిప్రాయాన్ని ఆమె అర్థం చేసుకోలేదా? తనకిష్టం కాదని చెప్పడానికిది సూచనా? అనిపించింది. అంతమాత్రంతో నిరాశ పడదలచుకోలేదు స్పష్టమే చేసుకోవాలి. కాని సూచన లేమిటి? ఖచ్చితంగా నాలుగున్నర అయ్యేసరికి అతడు వస్తాడు. ఆమె అప్పటికి సిద్ధంగా వుంటుంది. ఇద్దరూ అతని చెల్లెలుగారింటికి వెడతారు. తాము మాట్లాడుకుంటూండగా చెల్లెలు వస్తుంది. రుక్మిణికి అభ్యంతరం లేకపోతే అందరూ ఏదో సినిమాకు వెడతారు. అదీ అతని కార్యక్రమం.

"సినిమా వ్యవహారం తరవాతచూసుకోవచ్చు. ముందు నాలుగున్నరకి తయారయి వుండండి" అంటూ అతడామెముఖం వంక చూశాడు. ఇప్పుడు కూడా "రేపుదయం కలుసుకోవచ్చు"ననే అంటే ఆమె తన ఆలోచనలకు సుముఖంగా లేదనుకోవచ్చునని అతడనుకొన్నాడు. రెండో వేపున ఆమెను వేగిరించి, ఇరుకున పెట్టడంలేదు గదా, వ్యతిరేక నిర్ణయానికి తరుముతున్నా నేమో అనిపిస్తూంది.

రుక్మిణి ఒక్క నిముషం తటపటాయించినట్లు ఆగింది.

కారులోనే తిరిగినా, మంచి ఎండ అంతా తమ పరమే అయింది, నిజంగా అలసి విశ్రాంతి కోరుతూం దేమో. తాను మూర్ఖంగా, ఆమె స్థితిని అర్థం చేసుకోకుండా తొందర పెట్టడం లేదుకదా - అనుకొన్నాడు. ప్రభాకరరావు. ఆ మాటతోచగానే సర్దుకొన్నాడు.



BRAOU

"పోనీ బాగా అలసి వున్నారేమో. క్షమించండి మీరన్నట్లు రేపుదయమే ..."

రుక్మిణి చటుక్కున ఒక నిర్ణయానికి వచ్చింది.

"కాలేనా క్రింద పెట్టకుండా కారులో తిరిగి వస్తే కూడా అలుపేనా? అదేంలేదు. సరే, ఈ వేళ కాలేజీకి ఎలాగూ సెలవు పెట్టేను. వేరే పనిమాత్రం ఏం వుంది. అల్లాగే, నాలుగున్నరకి ... అంది ఒక్కక్షణం ఆగి, నవ్వుతూ, సెలవు తీసుకుంటూ అంది "మీకు కాలక్షేపం అయ్యేలా చూడవలసిన బాధ్యత ఒకటి మీద పెట్టేరు కదా"

ప్రభాకరరావు నవ్వేడు. 'థాంక్సు'

* * *

సౌన్నాల గదిలో స్నానం చేస్తూండగా హఠాత్తుగా ఒక ఆలోచన తోచి రుక్మిణి నిలబడిపోయింది. ఆ రోజున మూడు గంటల పాటు సాయం అనీ, పరిచయం చేయడం అనీ అతడు తనతో తిప్పుకొన్నాడు. తన తోడు, మాటసాయం, పరిచయం చేయవలసిన అవసరం ఎక్కడా కలగనేలేదు. ముందే ఫోన్ మీద తన రాకను తెలుపుకున్నాడు. వాళ్ళు తమ కోసం ఎదురుచూస్తున్నారు. కార్లు వెళ్ళగానే ప్రత్యుత్థానం చేశారు. ఉద్యోగం కోసం వచ్చిన వాడిలా గాకుండా పరిచితుడు, స్నేహితుడు వచ్చినట్లే ఆదరించేరు. ఉద్యోగాలు ఏమున్నాయో, వాని మంచి చెడ్డలేమిటో చర్చించేరు. తమ డిపార్టుమెంట్లు చూపేరు. అభివాదనలతో సాగనంపేరు.

అతడు కోరకపోయినా, తానే పనికట్టుకొని, తాను పనిచేస్తున్న ప్రొఫెసరును పరిచయం చేసింది. ఎదురుపడిన ఒకరిద్దరు మిత్రులకు పరిచయం చేసింది. ఒక పెద్ద విద్యావంతుడు తనకు నేస్తం అని చూపడానికి గర్వపడింది.

అయితే ఇప్పుడాలోచిస్తూంటే అతడు తనను వెంట పెట్టుకొని వెళ్ళడం తాను సాయం చేయడాని కేనా అనిపిస్తూంది. తన నిజమైన విలువను, అర్హతలను చూపడానికి తీసుకెళ్ళి వుంటాడు. అతడెవరో తనకు తెలుసునని ఎరగడు. కనుక, నిజంగానే తానా డిగ్రీలు సంపాదించేనని తాను అర్హుడనేనని చూపించదలచేడు. ఇంటర్వ్యూలతో సరిఫికెట్లు దాఖలు చేసినట్టుండకుండా, అన్నీ తనకు చూపించేడు. తీసుకొచ్చి వదిలేడు. మళ్ళీ నాలుగున్నరకు వస్తానన్నాడు. అంటే రెండు గంటల వ్యవధి ఇచ్చేడన్నమాట.

తరువాత తనతో మాట్లాడవలసిన పని వుంది!

తాము మాట్లాడుకొంటూంటే తన చెల్లెలు వస్తుందన్న మాట జ్ఞాపకం వచ్చింది. అంటే - తాము మాటాడుకొనేది ఏకాంతంలో - ఎంత గడుసుతనం అనిపించి, నవ్వు వచ్చింది.

అతని ఆలోచనా క్రమం యావత్తూ అర్థం అయింది. పెళ్లి ప్రతిపాదన చేయబోతున్నాడు. దీనికంత టికీ అర్థం అదే. ఏం చెయ్యాలి.

అతడూళ్ళో అడుగు పెట్టి ఇంకా ఇరవయినాలుగు గంటలు కాలేదు. నిజానికి తనను చూసిన ఇరవయి నాలుగ్గంటల్లో వివాహ ప్రస్తావన తెస్తున్నాడు. ఇదేదో యాదృచ్ఛిక సంఘటనలా కూడా లేదు. ముఖమేనా ఎరగని తనను వివాహం చేసుకొనాలనే ఇక్కడికి వచ్చేడనిపిస్తూంది. ఇంకా ఆలోచిస్తే మొదటినుంచీ తామిద్దరూ ఈ ముగింపుకోసమే మొగ్గుతున్నట్లుంది. తాము పుస్తకాలలో, నవలల్లో, సినిమాల్లో చదువుతూనూ, చూస్తూనూ కలలుకనే ప్రేమ ఇక్కడ అడుగు పెట్టిందనుకొనేందుక్కూడా అవకాశం లేదు. కాని, ఇద్దరూ అటు మొగ్గుతున్నారు. ఏమిటిది? తాము పొరపాటు చెయ్యటంలేదు కదా అనిపించింది.

'దేవరపోతు' కథ చెప్పి తామంతా కల్యాణిని వేళాకోళం చేశారు, ఆమె పెళ్ళిచూపుల పద్ధతికి ఎంతో అసహ్యపడేది. ఆ విధంగా హింసించే వరుడు తనకు నచ్చినా తోసేస్తాననేది. అల్లాంటిది, ఆక్రమంలోనే వచ్చి వరుణ్ణి చల్లగా ఒప్పేసుకుంది. ఒప్పేసుకొన్నాక ఎలా ఒప్పేసుకున్నానర్రా అని తెగ ఆశ్చర్యపడింది. ఆమె మనస్థితి తామంతా పరిశీలించి 'దేవరపోతు' పోలిక తెచ్చేరు.

BRAOU

వేటు వేయడానికి ముందు అంతపోతునూ దొర్లింతలు పెడతారు, పడతోస్తారు. ఎత్తి కుదేస్తారు. ...కడి తోటకూరకాడలా అయిపోతుంది. సందిటికి లొంగని అంత లావు మెడా ఒక్కవేటులో తెగిపోతుంది.

అలాగే పెళ్ళిచూపుల వేళ దాకా చుట్టాలూ, పక్కాలూ చాటునామాటునా పరోక్షంగా ప్రత్యక్షంగా రానున్న వసంతకుమారుని గుణగణాల్నీ, రూపురేఖల్నీ వర్ణించి వధువు మనసును ఉత్కంఠిత స్థితికి తెస్తారు. ఆసమయంలో కుర్రాడు ఎదుట పడతాడు. ఆడపిల్ల తలవంచేస్తుంది అని వ్యాఖ్యానించేరు. ఆ పరిస్థితి చాలా అవమానకరంగా నిర్ణయించేరు.

"ప్రేమించాలి. అప్పుడే పెళ్ళికాని ..." అని చప్పరించేసేరు.

ఇప్పుడు తన ప్రయత్నం కల్యాణి వివాహంలో జరిగిన దానికన్న ఏ విధంగా వ్యతిరేకం?

ఆ ఆలోచనతో తన స్థితిని తిరగేసింది. చూడగా తమ ఇద్దరి నిర్ణయాల మధ్య పోలికే లేదనిపించింది.

ఈ వరుడిని తానే చూసుకొంది. ఇతరుల ప్రమేయం అణుమాత్రం లేదు. అతని అందం చందం, మానం మర్యాద, యోగ్యతా అర్హతా తానే చూసుకొంది. తన మనస్సుకి నచ్చేయి. నచ్చిన అతడు కూడా తన కోసం వచ్చేడు. డబ్బు చూసి, కులం, కుటుంబం చూసి వచ్చినవాడు కాదు. లోపం ఏదో ఉందని కాదు. అసలు అతని కవేవీ తెలియవు. వాటన్నింటి కన్నా తన్ను కోరివచ్చేడు. అతనిని నిరాకరించవలసిన పనుందా?

వచ్చి ఇరవయినాలుగు గంటలే అయితేనేం?

రుక్మిణి ఒక నిర్ణయానికి వచ్చింది.

• • •

రుక్మిణి త్వరగా అలంకారం పూర్తి చేసుకొంది. రోడ్డుమీదికి వచ్చి రిక్షానుకేకేసింది. టైము చూసు కొంటే నాలుగు కావస్తూంది. ఒక అరగంట ఆగితే అతడే వస్తాడు. కాని, అతడే రావాలా? తాను వెళ్ళకూడదా? తొందరపడ్డా ననుకొని లోకువ చేస్తాడా? అంత అల్పబుద్ధి అయితే ఇప్పుడే తేలిపోతుంది. ఈ పరిచయం ఇక్కడే ఆగుతుంది. మర్యాద ఇచ్చిపుచ్చుకోలేని వాడు తనకెందుకు? తనతోపాటు నేను సుముఖంగా ఉన్నాననే సూచనను గ్రహించి గౌరవించలేడా?

రుక్మిణి రిక్షాదిగి, విజయలక్ష్మి ఇంట్లోకి వెళ్ళేసరికి పనిమనిషి ఎదురయింది. "అమ్మగోరు నేరండి" అంది.

ఆ సంగతి తానూ ఎరుగును. ప్రభాకరరావు కనబడడే. ఆయన ఏమయినట్లు? అడగడమా, వద్దా? అడిగితే ఎలాగ? తేల్చుకోలేక పోయింది. దాసి ముందర లోకువకావాలని భయం, ఆలోచించుకొనే వ్యవధి కోసం "ముందు కొంచెం మంచి నీళ్ళియ్యి" అని సోఫాలోకూర్చుంది. అది వెళ్ళబోతూంటే "ఫేన్ వేసి వెళ్ళు" అంది.

పనిమనిషి మంచి నీళ్ళు తేవడానికి లోపలికెళ్ళింది. వీధిలో కారు ఆగిన చప్పుడు వినబడింది. ఎవరో దిగేరు. తలుపుభళ్ళుమంది. లోగుమ్మంలోంచే పనిమనిషి కంఠం – "అన్నయ్యగోరు"

ఆమె చేతిలోంచి మంచి నీళ్ల గ్లాసు అందుకొంటూ 'అన్నయ్యగారెవరు!" అంది.

"అమ్మగారి అన్నయ్యగారే నండి"

రుక్మిణి లేచి ఎదురు నడిచింది. ప్రభాకరరావు గుమ్మంలోకి వచ్చేడు. ఎండలోంచి రావడం చేత ఆమెను గుర్తించలేకపోయాడు. పైగా ఆమె అక్కడ వుండగలదన్న ఆలోచనలో కూడా లేడు.

"నమస్తే, ఇంతసేపు ఎక్కడి కెళ్ళేరు" అంటూన్న రుక్మిణి గొంతువిని అతడు ఆశ్చర్యపోయేడు.

ఆమె తన చేతిలోని మంచినీళ్ళగ్లాసు అతని చేతబెట్టి "ఎండనబడి వచ్చేరు. త్రాగండి" అంది. "నన్ను విశ్రాంతి తీసుకోమని ఎండలో తిరగడమా మీరు చేసిన పని" అని కోపం చూపింది. "కాస్సేపు ఇల్లా ఫేన్ క్రింద కూర్చోండి" అని అనునయించింది. "ఇంకోగ్లాసు మంచినీళ్ళు తీసుకురా" అని పనిమనిషికి పురమాయించింది.



BRAOU

ఆమె చూపుతున్న ఆప్యాయతకూ, అనురాగానికీ అతని వద్ద 'థాంక్స్' అన్నమాట తప్ప మరోమాటే లేకపోయింది. అది పదిమాట్లు ఉచ్చరించేడు. కళ్ళతోనే తన ఆనందాన్ని ప్రకటించేడు.

"ఎంతసేపయింది వచ్చి" అన్నాడు.

"ఇప్పుడే వచ్చేను. ఇంకా పనిమనిషి మంచినీళ్ళు తెచ్చిపెడుతూనే వుంది. మీరూ వచ్చేశారు."

ఆమె మాట పూర్తికాకుండానే, "నాకెంతో సంతోషంగా ఉంది. మంచి పని చేశారు" అన్నాడు.

"రుక్మిణి నవ్వింది. ఒక్కనిమిషం అటూ యిటూ చూసింది. స్వరం తగ్గించి, "మిమ్మల్ని మళ్ళీ శ్రమ పెట్టడం ఇష్టంలేకపోయింది" అంది.

అతని కళ్ళు కృతజ్ఞతతో మిలమిలలాడేయి. నెమ్మదిగా అన్నాడు. "నీకోసం ఎంతపనీ శ్రమ అనిపించదు రుక్కూ!" అన్నాడు.

గౌరవవాచకం ఎగిరిపోయింది. పెద్దలు పెట్టిన పేరు ఎగిరి పోయింది. ఒక్కక్షణంలో ఒక్క మాటలో ఆమె అతిసన్నిహితురాలయిపోయింది.

ఏకవచన ప్రయోగం రుక్మిణికి లోకువ చేసినట్లనిపించలేదు. 'రుక్కూ' అన్న పిలుపు అనుచితమైన చొరవగా తోచలేదు. ఆ మాట లాతడివ్వగల చనువుకూ, చూపగల ఆప్యాయతకూ ప్రతీకలు. అతనితో తాను జీవితానందాన్ని అనుభవించగలదు. ఆ తెలివిడితో ఆమె కళ్ళు మిల మిలలాడేయి.

'థాంక్స్' అని లేచింది.

* * *

రుక్మిణికి తనపాత్ర ఏమిటో అర్థమయిపోయింది. ఆ పాత్రను వెంటనే స్వీకరించడానికామె సందేహించలేదు. వెనకాడనూ లేదు. పరాయి ఇల్లే అని సంకోచించలేదు. అతని స్నానానికి ఏర్పాట్లు చేయడం ఆ క్షణంలో అవసరం. తరువాత కాఫీ ...

"ఆ పనిమనిషి పేరేమిటి?" అంది.

ప్రభాకరరావే పిలిచేడు!

"తలుపులమ్మా! చూడు అమ్మగారికేం కావాలో"

రుక్మిణి నవ్వింది. "అమ్మగారికేమీ అక్కర్లేదు. అయ్యగారికోసమే ... అలిసి ఉన్నారు. స్నానం చేసి బట్టలు మార్చుకోండి, ప్రాణం హాయిగా ఉంటుంది ..."

సమాధానం కోసం ఎదురు చూడకుండానే తలుపులమ్మకు పని పురమాయించింది. "స్నానాల గదిలో నీళ్ళు పెట్టు. స్నానం చేస్తారు. అయ్యగారు" అంది.

## 16

అతడు స్నానం చేసి బట్టలు వేసుకు వచ్చాడు. చొక్కాకు గుండీలు సర్దుకుంటూ వచ్చి రుక్మిణి ముందు నిలబడ్డాడు.

"పనిమనిషి ఏదీ?"

"హొటలుకి పంపించాను" అంది రుక్మిణి.

ఆమె కుటుంబ బాధ్యతలన్నిటినీ నిశ్శబ్దంగా తీసేసుకున్నదనిపించింది. సంతోషం కలిగింది. ఆమె రెండు భుజాల మీదా చేతులువేసి ఒక్కక్షణం ముఖంలోకి చూసేడు. మనస్సునుమూల మూలల కంటా చూపులతో గుచ్చిగుచ్చి దేనికోసమో వెతుకుతున్నట్లనిపించింది. ఆమె నిబ్బరంగా అతని కళ్ళలోకి చూసింది.



BRAOU

ప్రభాకరరావు చూసి, చూసి చటుక్కున కౌగిలించుకొన్నాడు. ఆమె ప్రతిస్పందనతో మరో అడుగు ముందుకు వేసి, పెదవులు చుంబించేడు.

హఠాత్తుగా ఎందుకో పది రోజుల క్రితం బెజవాడ స్టేషనులో జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది. "హోల్డాల్ పారేసినట్లు చెయ్యకేం" అన్నాడు. రుక్మిణి ఫక్కున నవ్వింది.

ఇద్దరూ ఒకరినొకరు ఒత్తుకొని వెళ్ళి సోఫాలో పక్కపక్కల కూర్చున్నారు. ఆమె అతని చేయి రెండు చేతులలోకి తీసుకొని నిమురుతూ 'చాలా కష్టం కలిగించేను కదూ!" అంది.

"కష్టమా! అటువంటి పరిస్థితిని ఎదురు చూడలేదు. స్తంభించి పోయేను. తెలివి తెచ్చుకొనేసరికి నాకే సిగ్గువేసింది. క్షమార్పణ చెప్పుకోవాలనుకొన్నా, ఎలా ప్రారంభించడమో అర్థం కాలేదు. ఇంతలో నువ్వే పిలిచేవు ..."

నెమ్మదిగా అతని కౌగిలి విడిపించుకొంటూ రుక్మిణి అతని పక్కనే సర్దుకు కూర్చుంది. తన నుదుటి తిలకం కరిగి అతని బుగ్గన ఎర్రగా కనిపిస్తూంది. జేబు రుమాలు తీసి ఒత్తేసింది. "సరిగ్గా కూర్చోండి" అని అనునయిస్తూ ముఖం తుడిచింది.

"ఇప్పుడు చెప్పండి. ఏదో బోలెడంత మాట్లాడవలసి ఉందన్నారు! ఏమిటది."

ప్రభాకరరావు ఆశ్చర్యం కనబరచేడు "మనం మాట్లాడవలసింది ఇంకా మిగిలిందా?" అన్నాడు.

రుక్మిణి ఆశ్చర్యమూ, కోపమూ కూడ ప్రకటించింది.

"ఇందుకా నన్ను రమ్మన్నది? మొత్తం మీద మగాణ్ణనిపించేరు. ఇంకా నయం!"

ఆమె లేచిపోతుంటే ప్రభాకరరావు చేయిపట్టుకొని లాగి కూర్చోబెట్టుకొన్నాడు

"నిజమే. చెప్పవలసింది చాలానే వుంది. కూర్చో ..."

రుక్మిణి గంభీరంగా కూర్చుంది. ప్రభాకరరావు తనను గురించి వివరాలు ఇవ్వడం ప్రారంభించేడు. ఒక్క నిమిషం విని రుక్మిణి అతనిని నిలుపరించింది.

" ఈ ఇరవయినాలుగు గంటల్లో ఏదో సందర్భంలో, ఏదో రూపంలో అవన్నీ నాకు తెలిశాయి. మళ్ళీ ఎందుకు చెప్తున్నారు?"

ప్రభాకరరావు ఒక్క నిమిషం ఆగేడు. కొద్దిసేపటి క్రితం తాను వేసిన చొరవ, అనుభవించిన విశ్వాసము మచ్చుకు కూడా లేవు. నత్తులు కొడుతూ అతికష్టం మీద తన కోరిక వెలిబుచ్చేడు.

"రుక్మిణీ ... నేను ... ఇష్టమేనా?"

ఆమె ఒక్కక్షణం ఆలోచించింది. తన యిష్టాన్ని ఇదివరకే చూపింది. ఆమెకు అర్థంకాని అంశం ఒక్కటే వుంది. అదే అడిగింది.

"మీకు నేనే ఎందుకు కనబడ్డాను?

నాలో ఏం చూసి మక్కువ పడ్డారు?

నన్ను గురించి మీకేం తెలుసునని?"

ప్రభాకరరావువద్ద ఆ ప్రశ్నలు వేనికీ సరియైన సమాధానం లేదు. ఆమెయే ఎందుక్కనబడిందంటే? తనకు తోడు కావాలి అనుకొన్నప్పుడు మొట్టమొదట జ్ఞాపకం వచ్చింది, ఆమె.

ఆమె విషయంలో తానేమీ భ్రమపడలేదు. తాను కావాలనుకొన్నవి ఆమెలో కనిపించేవి. అంతకంటె అతనికి కావలసిందీ లేదు. కావలసిందల్లా ఆమె అంగీకారం.

 రుక్మిణి ఈ మారు చిన్న పుచ్చుకొంది.

BRAOU

"మీరు అనుకున్నంత అమాయికంగా లేను" అని ఒప్పేసుకుంది. ఆమె తనను గురించి ఎరుగుదునంటే ప్రభాకరరావు ఆశ్చర్యపడ్డాడు.

"మీరు మీ నాన్నగారిపేరు చెప్పినప్పుడే అర్థమయింది. పదిరోజుల క్రితం బెజవాడలో మిమ్మల్ని చూసిన రోజునే ఇంటికి వెళ్ళే సరికి మీ నాన్నగారు అక్కడున్నారు."

ప్రభాకరరావు ఒక వూర్పు తీసుకొన్నాడు. "నా విషయం ఏమీ తెలియదే, ఏలాగ చెప్పడం, దాచి పెట్టి మోసగించినట్లు వుండకుండా ఏం చెయ్యాలి? - ఇదే నిన్నటి నుంచీ ఆలోచన" అన్నాడు.

తన తండ్రి తనను గురించి ఏంచెప్పేడో అతనికి పట్టలేదు. అక్కడ జరిగిన విషయాల్ని గురించి తెలుసుకొనే వుత్సాహమే చూపలేదు.

రుక్మిణి ఇబ్బంది పడింది. "నిజానికి ఆ విధంగా ఆలోచించవలసింది నేను. నన్ను గురించి మీకేం తెలుసేం? ..."

ప్రభాకరరావు లెక్క చెప్పేడు.

"నీ పేరురుక్మిణి. కొంచెం దుడుకుతనంపాలు ఎక్కువ. కాని, మనిషిలో సహృదయతపాలూ ఎక్కువే. ఎక్కడికెళ్ళినా స్వతంత్రంగా నిలబడగల చదువు వుంది. కొంచెం నలుపులో లెక్కవేయవలసిన మనిషి. కన్ను, ముక్కు తీరువుంది. ఈనాడు తెలుగు దేశంలో కనిపించే విద్యావంతులయిన కన్యలు చాలామందిలా గాకుండా ఆరోగ్యంగా వున్నావు. ఎండిపోయి అటుగ్గింజలాగో, ముసలమ్మలాగో కాకుండా దృఢంగా వున్నావు. ఇంకేం కావాలి? మీనాన్నకి డబ్బుందా, లేదా అనా? తలా తోకాలేని కులాలూ, శాఖల అంతరాలా? వానితో నాకు అవసరం లేదు. నాకు కావలసింది నువ్వు. నీకేమిటి అనుమానం?" అంటూ ప్రభాకరరావు చెయ్యి జాపేడు.

రుక్మిణి కళ్ళు కన్నీటితో మెరిశాయి. పెదవులు ఆవేగంతో అదిరేయి. మెమ్మదిగా అతని చేతని రెండు చేతులా పట్టుకొని "ఏం లేదు, ఏం లేదు" అంది.

ప్రభాకరరావు ఆమెను పొదువుకొని, కన్నీరు తుడిచేడు.

* *

కాఫీ తీసుకుంటూ ప్రభాకరరావు తాము ముందు చర్చించిన పనిని గురించి ప్రశ్నించేడు.

"మీ నాన్నగారిని అడగాలికదా. ఇప్పుడు చెప్పు. ఆయన పేరేమిటి? ఇల్లు ఎక్కడ? ఏం చేస్తుంటారు? మా నాన్నగారూ ఆయనా స్నేహితులేగనక వారిని పంపిద్దామంటావా?"

పది రోజుల క్రితం రామచంద్రరావు తమ కొడుకు పెళ్ళి గురించి ప్రస్తావించేరని చెప్తూ తన తండ్రి వెలిబుచ్చిన అభిప్రాయాలు, తల్లి తెలిపిన అభ్యంతరాలూ గుర్తువచ్చేయి. ఆ అవమానకరమయిన అభ్యంతరాలకు తన భర్త గురి కావడం రుక్మిణికి నచ్చలేదు. మనస్సు ఒప్పలేదు. తమ దాంపత్య జీవితం ఆశీస్సులతో గాక శాపనార్థాలతోనూ, పెద్దవాళ్ళ ఏడుపులూ, తిట్లూ, ప్రాణాచారాలతోనూ ప్రారంభం కావాలా?

అయితే ఆ మాట చెప్పడం ఎల్లాగ? చెప్తే ఎల్లా అర్థం చేసుకొంటాడో? తనవారి నెవ్వరినీ చూడనక్కర్లే దంటే విపరీతార్థాలు తీయడుకదా! సందేహం కలిగినా అసలు విషయం సూటిగా చెప్పడానికి మనస్సు ఒప్పలేదు.

"నా కోసమే నన్ను పెళ్ళి చేసుకొంటున్నా నన్నారు. నన్నడిగేరు చాలదా?" అంది, అతని ముఖంలోకి చూస్తూ.

ప్రభాకరరావు చాలా సంతృప్తి కనబరిచేడు. "నీ అభిప్రాయం కోసం అడిగేను. అమ్మకీ, నాన్నకి చెప్పకుండా చేసుకోవడమూ అనుకొంటావని గాని ..."

ఈ మారు రుక్మిణి తన అభ్యంతరానికి కారణం వివరించకుండా ఉండలేకపోయింది.

"మన జీవితం తిట్లూ, దిగపోతలా మధ్య ప్రారంభం కావడం నా కిష్టంలేదు".



BRAOU

"వద్దు" అని ప్రభాకరరావు తన ఆమోదం తెలిపేడు. అంతకంటే అతడు అధికం తెలుసుకోదలచలేదు. ఎవరికైతేనేం, ఎక్కడో, ఏవో అభ్యంతరాలుండవచ్చు. వాటిని తెలుసుకోడానికి ప్రయత్నించడం అనవసరం. రుక్మిణి ఎరుగును. తనకు చాలు. అయితే తదనంతర కర్తవ్యం? తమ పెళ్ళికి తామే పెద్దలు, తామే నిర్ణయించుకొంటారు.

"అయితే, మన కార్యక్రమం నువ్వే నిర్ణయం చెయ్యాలి".

## 17

రాత్రి సినీమానుంచి తిరిగి వచ్చేసరికే పదకొండు గంటలయింది. వస్తూనే పడక వేసినా రుక్మిణికి నిద్ర కనుచూపు మేరలోకి కూడా రా నిరాకరించింది. పగలు జరిగినవన్నీ సినీమారీళ్ళలాగ మనః ఫలకం మీద విప్పుకొంటున్నాయి. ఒక్కరోజులో ఎన్ని సంఘటనలు, ఎన్ని సంఘటనలు, ఎన్ని అనుభవాలు! రెండు రోజుల క్రితం పరిచయం కూడా లేని పడుచువానితో తన జీవితాన్ని ముడిపెట్టుకొనేందుకు దారితీసిన ఆ ఘటనలూ, ఆ అనుభవాలూ మరల మరల తిరగబడుతున్నాయి. కొత్త కొత్త కోణాలనుంచి ఆకర్షణీయంగా కనిపిస్తూన్నాయి. 'అయ్యో. ఏంపని చేశానా' అని దుగ్ధపడవలసిందేదీ వానిలో కనబడడంలేదు. తానుచేసింది తప్పు అనిపించడం లేదు. వానినే మరల జ్ఞాపకం చేసుకొంది. ఆ జ్ఞాపకాలు కితకిత పెట్టినట్లయి చిరునవ్వులు చిందించింది.

ఎక్కడో దూరాన గంటలు కొట్టిన చప్పుడు వినిపించింది....మూడు....నాలుగు....అయిదు! రుక్మిణి ఉలికిపడి లేచింది. అప్పుడే అయిదు. ఏడు గంటలకు విజయలక్ష్మిగారి ఇంటికి వచ్చేస్తానని ప్రభాకరరావుకు మాట ఇచ్చింది. కేవలం విజయ ఆహ్వానమే అయితే ఓ పావుగంట అటూఇటూ చేసి ఉండేది. కాని, ప్రభాకరరావూ తానూ ఓ పథకం వేసుకొన్నారు. ఆ పథకం ప్రకారం సాయంకాలం అయిదు గంటల వరకూ తమ రహస్యాన్ని విజయకు కూడా తెలియనీయకుండా కాపాడాలనుకొన్నారు. అయిదు గంటలకి తామిద్దరూ తమ సన్నిహిత మిత్రులకీ, ఆప్తులకీ చిన్న పార్టీ ఇచ్చి, అక్కడ తమ వివాహ నిర్ణయాన్ని ప్రకటించదలచేరు.

గబగబ ముఖం కడుక్కుంది. స్నానం చేసి వచ్చింది. ఒక్కక్షణం ఏం చీరకట్టుకోవడమా అని ఆలోచించింది. ఆ ఉల్లాసంలోనోట కు... ఆసనా స్నేహితురాళ్ళు పట్టేస్తారు.

"ఏంకథ?" అని కనుబొమ్మలెగరేస్తారు; ఏదో ఉందని వ్యాఖ్యానాలు ప్రారంభిస్తారు. కట్టుకథలే అల్లేస్తారు. ప్రశ్నలతో వేధిస్తారు.

ఆ ఆలోచన తోచి గమ్మున ఉండిపోయింది. చీర ఎన్నిక సమస్య కూడా తేలిపోయింది. ప్రత్యేకత చూపించే చీర ఏరదలుచుకోలేదు. అదంతా సాయంకాలమే. ప్రస్తుతం తమ ఏర్పాట్లేవీ పొక్కకూడదు.

ఏమీ చెప్పకుండా వినోదనూ, కల్యాణినీ సాయంకాలపు పార్టీకి లేవదీయడమెల్లాగో ఆమెకు తోచడం లేదు. తన తరఫున పార్టీకి తీసుకువెళ్ళవలసిన వాళ్ళు వారిద్దరూనూ. ఆ రోజు ఆదివారం. ముందు చెప్పకపోతే రారు. ఏ ప్రోగ్రాములో పెట్టుకొని కనిపించకుండా పోతారు. కనక విజయ ఆహ్వానాన్ని అడ్డం పెట్టుకొని నడపాలనుకొంది.

విజయ ఆలోచనలింకా మొదటి మెట్టుమీదనే ఉన్నాయి. తన్నూ, ప్రభాకరరావునూ సన్నిహితంగా ఉంచాలనే ఆలోచనతో ఆమె ఆ పూట చిన్న విందు ఏర్పాటు చేసింది. ఆ విందుకు తనొక్కతెనే పిలుస్తే తన ఆలోచన బయటపడి పోతుందని వినోదనూ, కల్యాణినీ కూడ పిలిచింది. వేళకు రాకపోతే తాను వస్తానంది. ఆ పట్టుదల వెనక తన పిలుపును కమ్మీచేయదలచింది. అంతగా వస్తే ...

... వస్తే ఏం చెయ్యాలన్నది ఆలోచించ తలచలేదు. గబగబవెళ్ళి వినోదను లేపింది.

"మొగుడూ మొద్దులూ లేకపోయినా సుఖంగా పడుకోకుండా ఆదివారం పూట నీపోరేమిటే తల్లీ" అంటూ వినోద ఒక్కమారు నీలిగి పక్కకు ఒత్తిగిలింది.

"మగడు లేకపోతే పీడా పోయిరికాని, మొద్దులాంటి మొగుణ్ణి భరించడం మాటలు కాదే పిల్లా!"



BRAOU

"ఏమిటామాట! పిల్లా! పిల్లీ!"

రుక్మిణి సమాధానం ఇవ్వకుండా మంచంమీద కూర్చుంది. కప్పుకొన్న దుప్పటి లాగేసింది. "ఇంతవరకూ నిద్రపోయేవు చాల్లే ..."

వినోద కదలలేదు. కళ్ళు గట్టిగా మూసుకొని కాపుదలగా చేయి అడ్డం పెట్టుకుంది.

"నిన్న విజయలక్ష్మిగారు మనల్ని ముగ్గురినీ తమ యింటికి పిలిచేరు, గుర్తుందా? ఏడింటికే వస్తామని మాట ఇచ్చాం. ఆ వేళకి రాకపోతే ..."

"ఏం? ముగ్గురు భామలతో వేగగలంత దిట్టలా, ఆమె అన్నగారు?"

ఆమాటలో వినిపించిన అవాచ్యతకు రుక్మిణి నవ్వింది.

"ఇందులో ఆమె అన్నగారి ప్రసక్తి ఎందుకే?"

వినోదకళ్ళ మీది చెయ్యికూడా తియ్యకుండానే చర్చ ఎత్తుకుంది.

"ముఖపరిచయం కన్న అధికంలేని మన ముగ్గురినీ, అందులోనూ మా ఇద్దరినీ, ఆవిడ ఎందుకు పిలుస్తున్నట్లు? ..."

"ఆవిడే చెప్పేరుకదా" అని రుక్మిణి అమాయకత్వం నటించింది. "రాకరాక వచ్చిన అన్నగారికోసం విందుచేస్తూ నలుగురయిదుగురు స్నేహితురాళ్ళను పిలుస్తున్నామని అన్నారు కాదటే!"

వినోద కళ్ళమీది చేతినే కాదు. బిద్దకాన్ని కూడా పక్కకి పెట్టేసి లేచి కూర్చుంది.

"ఎక్జట్లీ! నేననేది అదే. నాకు ఇప్పుడప్పుడే పెళ్ళికూతురు వేషం వెయ్యాలనే ఆలోచన లేదు. ప్రస్తుతానికి నువ్వు వెళ్ళిరా".

"నీ మొహం, ఇప్పుడు నిన్నూ, నన్నూ పెళ్ళి చేసుకొనేందుకు ఎవరో సిద్ధంగా ఉన్నది?"

వినోద ఆ మాట నేమాత్రం ఒప్పుకోలేదు.

"ఇదిగో, రుక్మిణి నీ మాట నే చెప్పలేను కాని, నా విషయం వేరు. నేను సరే అంటే చాలు. మరు క్షణంలో మెడలో పలుపు తగిలించెయ్యడానికి కాచుక్కూర్చున్నాడు - ఏమనుకొన్నావో..."

వినోద కథ ఎరిగిన రుక్మిణి ఇంక ఆ మాట ఎత్తలేదు.

... ఆమె అక్కగారిని పెళ్ళి చూపు చూడడంకోసం వెడుతున్న ఒక యువకుడు యాదృచ్ఛికంగా రైలులోనూ, బస్సులోనూ వినోదతో కలిసి ప్రయాణం చేశాడు. ఇంటికెళ్ళాక తనకు వినోదనిస్తే చేసుకొంటా నన్నాడు. అక్కగారికి సంబంధం తప్పిపోయింది. దానికి తనదే బాధ్యత అన్నట్లు నలుగురూ ఆమెను తిట్టేరు. ఇప్పటికి ఏడాది నుంచి ఆ వరుడు వినోదను వెంటాడుతున్నాడు. ఎక్కడో రాజస్థాన్‌లో ఏదో కాలేజీలో లెక్చరరుగావున్న ఆయనగారు ఈ ఏడాదిలోనూ ఏదో వీలుచూసుకొని ఆమె దర్శనం చేసుకొన్నాడు, రెండు మాట్లు. నెమ్మదిగా వినోదను ఒప్పించేడు. అయితే ఆమె అక్కగారి పెళ్ళిగడువు పెట్టింది. దాని కోసం ఎదురు చూస్తూ సెలవులకు కూడా ఇంటికిపోకుండా హాస్టలులోనో, బంధువులయింటనో కాలక్షేపం చేస్తూంది. అందుకే ఖచ్చితంగా చెప్పేసింది.

"ఇదివరకోమాటు బుద్ధి వచ్చింది. ప్రమాణం చేసుకొన్నాను. బ్రహ్మచారిగాళ్ళున్న చోటమరి అడుగు పెట్టను"

"ఒకటి వింటావా?"

"వి...న...ను... వినను".

"నేను పెళ్ళిచూపులకోసం వెళ్ళడం లేదంటే ఒప్పుకొంటావా?" అవేవో ఎప్పుడో పూర్తి అయి పోయాయి. అనుకొంది - మనస్సులోనే.

వినోద వినిపించుకో దలచలేదు.

"నాకివేం పట్టవు. నే నామూలకు రాదలచలేదు. "వుయ్ బోత్ ఆర్ ఔటాఫ్ సర్క్యులేషన్" ఆ బహు వచనంలోని రెండో వ్యక్తి కల్యాణి.

"అండ్ పెగ్‌డ్" అంది రుక్మిణి కసిగా.

అమెరికన్ స్లాంగ్‌లో "అయితే" "నో" అనేసి వినోద మంచం దిగింది.

తిట్టినా, రెచ్చగొట్టినా వినోదససేమిరా అంది. ముఖం కడుక్కునేందుకు వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి కూడా రుక్మిణి అక్కడ నుంచి లేవకపోవడం చూచి కోపపడింది. "వేళాకోళానికన్న మాట పట్టుకొని, నువ్వూ మానేస్తావేమిటి, కొంపతీసి! నీకు పుణ్యముంటుంది గాని, ఆవిణ్ణీ, ఆవిడ అన్నగారినీ మా పీకల కెత్తకు."

రుక్మిణి ఆ మాటలో మొదటి భాగాన్ని పట్టుకొని మొండికేసింది.

"వేళాకోళానికే అయితే నువ్వూ రా మీరెవ్వరూ రానిదే ..."

"ఏమోనమ్మా, వెళ్ళు ... మానుకో, ఆ బాధ ఏదో నువ్వుపడు. నిన్న రోజంతా వాళ్ళయింట్లో వున్నావు. ఈ వేళ మాతోడు కావలసి వచ్చిందా? వేషాలెయ్యకు"

ఇంక తప్పదనుకొని రుక్మిణి ఒక్కనిట్టూర్పు విడిచింది.

"పోనీ, సాయంకాలం ఓ పార్టీ - చిన్నది ఇవ్వాలనుకున్నాం. దానికి ... రావడానికేమన్నా ... అభ్యంతరం ..."

ఆ పిలిచిన పద్ధతిలోనే వినోదకు అంతా అర్థం అయింది. ఆశ్చర్యంతో కళ్ళు తెరిచింది.

"నీదంతా చండ-ప్రచండవేగంగా వుందే!"

"ఆ నిమిషం వరకూ బయట పెట్టకు అనుకున్నాం" అంది నెమ్మదిగా.

"ఏదీ, చెయ్యేదీ! కంగ్రాచ్యులేషన్స్" అంటూ వినోద ఆమె చేతిని నొప్పి పెట్టేలా ఝాడించేసింది. "వదలవే, తల్లీ" అనేలా గట్టిగా కౌగలించుకుంది.

మంచం మీద ఎదురుగా కూర్చుని "ఇప్పుడుచెప్పు ... ఆ సంగతేమిటో ..." అంది.

* * *

హాస్టలుగేటులోకి వచ్చేసరికి టిప్-టాప్‌గా అలంకరించుకొని, చేతిలో ఒక గులాబి పువ్వూ, ముఖాన చిరునవ్వుతో ప్రభాకరరావు ప్రత్యక్షమయ్యేడు. అతని రాకకు మనస్సు ఎగిరి గంతువేసినా, కళ్ళు మాత్రం బెరుగ్గా నేస్తాలకోసం దిక్కులు వెతికేయి. గబగబ నడిచి పువ్వుతోసహా స్వాగతం అందుకొంది.

"ఇంత ప్రొద్దున్నే తయారయి వచ్చేశారు. అసలు నిద్రపోయారా?" అని హాస్యమాడింది.

"మనం ఇద్దరం నిన్నటినుంచీ సహయాత్రికులం కదా"

రుక్మిణి అతని ప్రక్కనే నడిచింది.

కలిసి వస్తున్న ఆ ఇద్దరినీ చూసి విజయ ఆశ్చర్యపడింది.

"మీరు మరిచిపోతారేమో ననుకొన్నా, ఫోన్ చేసేదే, మరో పదిహేను నిమిషాలు చూసి మరీ చేద్దామనుకుని ఆగేను. మా అన్నయ్య బట్టలు వేసుకొని బయలుదేరుతూంటే ఓ మారు హాస్టలు వరకూ పోయిరమ్మందామనుకొన్నాను. కాని, ఏదన్నా మరో పని మీద వెడుతున్నాడేమో, పెద్దమనిషి ..."

"వచ్చేస్తా నన్నాంగదండీ, పాపం ఆయనను అనవసరంగా శ్రమపెట్టేరు" అంది రుక్మిణి.



BRAOU

"అబ్బే శ్రమేమిటి" అన్నాడు వినీతంగా ప్రభాకరరావు.

"ఫర్వాలేదు. ఇంతలోనే అరిగిపోదు" అంది విజయలక్ష్మి.

'మీ స్నేహితురాళ్ళు ఏరీ? ఒక్కరూ ..."

"చెప్పేను కాదండీ" అంది రుక్మిణి.

ఆమె ఏం చెప్పిందో విజయలక్ష్మి జ్ఞాపకం చేసుకున్నట్లే కనిపించలేదు. తనమాటనే మరోసారి రెట్టించింది ... "వస్తే బాగుండేది" అంది రుక్మిణి ఏమీ అనలేదు.

లోపల అడుగుపెడుతూ "మీవారు కనిపించరేం?" అని అడిగింది.

"మీ కోసమే ఎదురుచూస్తున్నాము" అంటూ కుటుంబరావు హాలులోకి వచ్చేడు.

"వచ్చేస్తానన్న వేళకి సరిగ్గావచ్చేను కాదండీ. చూడండి. సరిగ్గా ఏడు దాటింది. ఇప్పుడే" అంటూ రుక్మిణి చేతి గడియారం చూసుకొంది. "స్నేహితురాళ్ళని తీసుకురాకుండా ఒక్కరే వచ్చేరే" అంటాడేమో అనుకొంది. కాని, అటువంటి ప్రశ్నేమీ రాలేదు. దాని అర్థం ఒక్కటే, వాళ్ళు తనను అక్కడికి రప్పించడం కోసమే ఈ విందు ప్రయత్నం చేసేరు. నవ్వుకుంది.

"మనం వేళకి కట్టుబడి వుంటామనుకోండి. ఏం లాభం? ఈ అన్నాచెల్లెళ్ళకి కూడా ఆ నియమం వుండాలి కద" అంటూ కుటుంబరావు నిట్టూర్పు విడిచేడు.

"ప్రభువులు వందిమాగధకైవారాలు చేయగాచేయగా ఇప్పుడే లేచి ముఖం కడిగించేరు" అంది విజయ.

ప్రభాకరరావు అతని ముఖంవంక కొద్దిసేపు నిదానంగా చూసేడు.

"చెవుల వెనుక సబ్బు నురగ అలాగే వుండిపోయింది. సరిగ్గా కడుక్కోలేదు కూడా...."

కుటుంబరావు ఏమాత్రం కంగారు పడలేదు. అతితాపీగా 'నీకు చెవుల వెనక భాగం కనిపిస్తుందా? పాపం! మనం అంత పొద్దుటే సబ్బులుపయోగించే పనిలేదు. హాఁ అవసరం తీరిపోయింది. మెడలో దండ పడవలసిన తరువాయి మిగిలిన వాళ్ళకా బెడద అంతా." అన్నాడు.

"వంటింటి గుబాళింపులలో ఏం చేస్తున్నది మరిచిపోయి, పట్టుకెళ్ళిన సబ్బుకి ముఖం కడిగి వచ్చేసేరు" అంటూ విజయలక్ష్మి మగనిని హాస్యమాడింది.

"కావచ్చు. ఏమిరా భగవంతుడా అని ఆలోచనలో పడి వుంటాను. ఏమండోయ్! ఈ అన్నాచెల్లెలూ పెద్ద కుట్ర తలపెట్టేరు. ఆ మధుసూదనరావు ధర్మమా అని రెండుపూటలా ఇంత కడుపు నిండుతూంది. నాలిక కట్టుకోనక్కర్లేకుండా ఏవో టిఫిన్లూ దొరుకుతున్నాయి. వీళ్ళ కళ్ళుకుట్టేయి. అన్నగారి రాక పేరుతో తనచేతి వంట తినిపించబోతూంది. ఆ భయంలోనే-" అంటూ ఎదురు పట్టించేడు.

"అబ్బ! ఏమి శ్రమపడి పోతున్నారండీ." అంటూ విజయలక్ష్మి అతనివంక చురుమనేలాగ చూసింది. కాని కుటుంబరావు లెక్కచేయలేదు.

"చాలారోజులయిందే ఇంట్లో తిండితిని' అంటూ అన్నగారి ప్రోత్సాహం, హరిభగవంతుడా అనిపించింది. చెప్పొద్దూ! వీళ్ళిద్దరూ పొగడి మనచేత చాతుర్మాస్యం చేయించే లాగున్నారే అనిపించింది. అంతలో మీరు వస్తున్నారని జ్ఞాపకం వచ్చింది. ప్రాణం కుదుటపడింది."

తాను వస్తున్నానుకదా అని జాగ్రత్తగా వంటచేస్తారంటున్నాడా? తానుకూడా సాయం చేయడంవలన బాగుంటుందంటున్నాడా? అర్థం కాలేదు. చిరునవ్వు నవ్వి వూరుకొంది.

"ఆయనకు చదువుకొన్న ఆడవాళ్లు వంటచేయలేరని ఓ నమ్మకం." అని విజయలక్ష్మి సర్దుబాటు.

"పోనీ, ఆ పరిస్థితులలో మహానసాధిపత్యం ఆయనకే వదిలెయ్యవచ్చుకదా." అని ప్రభాకరరావు చెల్లెలికి సలహా ఇచ్చేడు.



BRAOU

"ఆ మాట జ్ఞాపకం వుంచుకుంటాలే." అన్నాడు కుటుంబరావు, ఇంక అదెన్నాళ్ళ భోగం అన్నంత ధీమాగా.

"చదువుకున్న ఆడవాళ్ళ వంటమీద మీకంత అపనమ్మకం ఎందుక్కలిగింది?" అంటూ ఆ కుటుంబపు హాస్య ప్రసంగంలోకి రుక్మిణి తానూ ప్రవేశించడానికి ప్రయత్నించింది.

"ఇది ఎవరిమీదా అపనమ్మకం కాదు. నా జీర్ణకోశంమీద కలిగిన జాలిగాని..." అన్నాడు కుటుంబరావు. "అయితే మధుసూదనరావు హోటలు అభయహస్తం ప్రసాదించిందనుకోండి."

"ఔనుగాని, మీరే చెప్పండి. ఇవి స్పెషలైజేషనుకి రోజులు. అన్నిపనులూ అందరూ చెయ్యాలనేదేమిటి? మీరు రీసెర్చి స్టూడెంటు...."

కుటుంబరావు తనమీదికికూడా బండితోలడం ప్రారంభించాడని రుక్మిణి చటుక్కున సమాధానం ఇచ్చింది.

"నేను బ్రహ్మాండంగా వంటచెయ్యగలనండోయి," అంది.

"హరిహరీ! మీకూవుందీ, ఈ పిచ్చి!"

అతడామాటలన్న తీరుకు ముగ్గురూ పక్కున నవ్వేరు.

"మీకు మా వచనసామర్థ్యం మీద అంత అపనమ్మకం ఏలకలిగిందో తెలుసునులెండి," అంటూ విజయలక్ష్మి తలుపులమ్మను పిలిచింది.

"ఒత్తుండా నమ్మా!" అంటూ సమాధానం ఇస్తూనే తలుపులమ్మ ఒక బేసినులో ఇడ్లీలూ, ప్లేట్లతో ప్రవేశించింది.

BRAOU

విజయ టేబులుమీదనున్న పుస్తకాలూ పత్రికలూ తీస్తుంటే సహాయానికి రుక్మిణి లేచింది. కాని, విజయ ఆమెను వారించింది. "మీరు కూర్చోండి" అంటూ మగనికి కన్నుమీటింది.

"జీ హుజూర్" అంటూ అతడు లేచి టేబులును సోఫాలమధ్యకు లాగేడు. విజయలక్ష్మి భర్తకు 'థాంక్సు' చెప్తూ తలుపులమ్మ చేతిలోని ప్లేట్లు అందుకొంది. కుటుంబరావు వాటిని సర్దబోతూంటే రుక్మిణి వారించింది.

"మీరు కూర్చోండి, మేం పెడతాం." అంది.

ప్రభాకరరావు తన ప్రక్కనే సోఫాలో చోటు చూపుతూ రుక్మిణిని ఆహ్వానించేడు. "కూర్చోండి, ఇల్లావచ్చి. మనం అతిథులం."

"ఔను, మీవంతొచ్చినప్పుడు..." అంటూ కుటుంబరావు బావమరిదిని కవ్వించేడు. ఆ అవకాశాన్ని ప్రభాకరరావు అందుకున్నాడు. "దానికో వాయిదా, గడువూ క్వావాలేమిటి? ఈ మాత్రానికే వంటేమిటి బావా!" అంటూ అతడు రుక్మిణివేపు తిరిగాడు.

"మీరు కాస్త సాయం చేసేరంటే ఈవేళ సాయంకాలమే వీళ్ళకో చిన్నపార్టీ ఇద్దాం. ఏమంటారు?"

"బాగానే వుండేదిలా వుంది." అంది రుక్మిణి నవ్వుతూ.

"సాయం అంటే మరేంలేదు. ఏమేం తెప్పించాలో, ఏం ఇయ్యాలో నాకేం తెలియదుగా..." అన్నాడు.

తనవేపు తెల్లబోయిచూస్తున్న ఆ దంపతులతో చూపు కలపకుండా రుక్మిణి తాను సిద్ధమేనన్నట్లు ప్రభాకరరావు వంకచూస్తూ 'తయార్' అంది.

విజయ తెల్లబోయి చూసింది. కుటుంబరావు తలపంకించేడు. అయితే వేళాకోళం ధోరణి వదలలేదు.

 "అంటే మా నోరు తీయపరుస్తారన్నమాట. మంచిది. మాకేం అభ్యంతరం లేదు." అన్నాడు.

# 18

"మీ బెజవాడ అమ్మాయే. లలిత అని. నా క్లాస్‌మేటు. మీ రెరుగుదురా? ఆమే, ఆమె భర్తా రావాలి. ఈపాటికి వచ్చేస్తుంటారు. పదిన్నరకే వస్తామన్నారు. వాళ్లా రాగానే మనం భోజనాలకి కూర్చోవచ్చు. పొద్దు పోతూందో ఏమిటో" అంటూ విజయలక్ష్మి అనుతాపం ప్రకటించింది.

"ఫర్వాలేదు" అంది రుక్మిణి.

బెజవాడ లలిత రుక్మిణికి తెలుసు. కాని, ఆమె భర్తను పేర్కోవడంతో ఎవరో అనుకుంది. భోజనానికి ఆలస్యం అయినా బాధ లేదంటూనే రుక్మిణి ఆ లలితను ఎరగనంది. కాని, విజయలక్ష్మి ఒప్పుకోలేదు.

"ఎరగకపోవడం ఏమిటి? ఎరిగే వుంటారు. అయితే పెద్ద పరియం లేదేమో. మూడేళ్ళు జూనియరు కదా. పైగా తెలుగు ఎం. ఏ. చదివింది."

"తెలుగు ఎం.ఏ. చదివిన లలితను ఎరక్కేం? సన్నగా, పొడుగ్గా, పెద్దపెద్ద కళ్ళు, కొనదేలిన గడ్డం...."

"ఆవిడే..."

"అయితే ఆమె భర్త అంటారేమిటి? ఆమెకు పెళ్ళెప్పుడయింది?"

"అయింది. అంతా అయిదారు నెలలయింది" అంది విజయలక్ష్మి.

"అయితే ఈమె మరొకరయివుంటారు. ఏమంటే నేనెరిగిన లలితకు పెళ్ళి కాలేదు. నాకు తెలుసు. వాళ్ళ కుటుంబం, మా కుటుంబం చాలా సన్నిహితంగా వుంటాం. వారంక్రితం వాళ్ళ అక్కా, నేనూ కలిసి సామర్లకోట నుంచి బెజవాడదాకా ప్రయాణం చేశాం. ఒకరోజంతా పెళ్ళిలో కలిసివున్నాం. ఆమె చెప్పలేదు..." అంది దృఢవిశ్వాసం కనబరుస్తూ.

విజయ సర్దుకొంది. "అయితే ఈమె వేరేనేమో! ఆరేడు నెలలయింది పెళ్ళయి. ఆమె భర్త మావారి పార్ట్నరు. చాలా మంచివాడు..."

బెజవాడ లలిత మరొకామె ఉన్నదంటే రుక్మిణికి నమ్మకం కలగలేదు. కాని, ఆ భావాన్ని బయటపడ నీయలేదు. లలిత స్వభావం గురించి రుక్మిణికి మంచి అభిప్రాయంలేదు. కనక చేసుకొని వుంటే ఉండొచ్చు ననుకుంది. విశాఖపట్టణంలోనే వున్న తనకుకూడా తెలియనంత రహస్యం ఎందుకో అర్థంకాలేదు. విజయ వారి వివాహం గురించి చెప్తూంటే కారణం అర్థం అయిందనుకొంది.

BRAOU

"ఆమె భర్తకు డిగ్రీలు లేవు. స్కూల్ ఫైనల్ ప్యాసయ్యారు. అంతే అయితే మంచి వ్యాపారజ్ఞానం వుంది. మావారికి చిన్ననాటి స్నేహితుడు. చాలా మంచివాడు. నెలకో నాలుగు వందలు వస్తున్నాయి. మావారే చెప్పేరు. ఇద్దరూ సరేననుకున్నారు. నేనూ, మావారూ సాక్షులం. రిజిష్టర్డు పెళ్ళి జరిగించేశాం. ఇక్కడే ద్వారకానగర్‌లో ఉంటున్నారు."

"పెళ్ళికి బంధువు లెవ్వరూ రాలేదా?" అంది, ఇంకా అనుమానం తీరక.

"లేదు. తమవాళ్ళు ఒప్పుకోరని అయిదారు నెలలు గుంజాటన పడింది. ఆమెకైతే ఇష్టమయింది."

"మరింకనేం? అసలు వాళ్ళకిష్టమైతే మిగతా వాళ్ళ సమస్యేముంటుంది? ఇంతకీ చదువు తేడాయేనా? కులభేదం కూడా వుందా?"

అనుమానం పీడిస్తూంది. తేల్చుకోలేకుండా వుంది రుక్మిణి.

"లేదు. ఇద్దరూ బ్రాహ్మలే. వాళ్ళ శాఖేనట కూడా. అయితే ఇరుపక్షాలా ఛాందసత్వం మోతాదుకి మించి వున్నట్లు తోస్తుంది..."

ఈ మారు రుక్మిణి ఆ లలిత తానెరిగినదే అని ధ్రువపరచుకొంది.

"మరింకనేం? మా మేష్టారిది మరీ చేదస్తం!"

"ఆమె అక్క ఒకరున్నారట. ఆమెకింకా పెళ్ళికాలేదు. 'ఆమె కయ్యేవరకూ తాను చేసుకోవడం భావ్యం కాదన్నారు. కాని చెప్పదగిన ఉద్యోగం కాదు. ఇంటినుంచి వచ్చే డబ్బు చాలదు. ఇంత చదువూ చదివి నిరుద్యోగంగా ఇంట్లో వాళ్ళకి బరువు కావడం ఇష్టంలేదు. నానా ఇబ్బందులూ పడుతూన్నారు. పెళ్ళికి వరుడు లభ్యం అయ్యేక ఇంటికెందుకు వెళ్ళడం? వాళ్లు ఏలాగూ కాదంటారని తెలిసి కూడా! మేమే ప్రోత్సహించేం. పెళ్ళి జరిపించి కాపురం పెట్టించేశాం" అన్నాడు కుటుంబరావు.

ఈమారు అసలు అనుమానమే లేదు. "చిన్నప్పటినుంచీ అదంతే. వట్టి నాలిముచ్చు." అనుకొంది. కాని పైకేమీ అనలేదు. తన ఆలోచనలను దాచుకొనేటందుకై ఆమె అక్కగారంటే ఎవరో ప్రభాకరరావుకు జ్ఞాపకం చేయబోయింది.

"ఆ రోజున నాతోనే ప్రయాణంచేస్తూ బెజవాడలోనే దిగింది. సుధారాణి. మీ వెనకనే నిలబడివుంది. గుర్తులేదూ?"

ప్రభాకరరావు చిరునవ్వు నవ్వేడు.

"సీట్ సంపాదించుకొనే ఆదుర్దాలో ఎవరెక్కడున్నారో చూశానా? పిలిచి మీరు సీట్ ఇచ్చేరు గనకగాని, లేకుంటే మిమ్మల్నీ చూసివుందునా?"

రుక్మిణికి ఆనాటి సంఘటనలూ, వానితోపాటు తన తొందరపాటూ జ్ఞాపకంవచ్చి సిగ్గుపడింది. ప్రసంగం తప్పించింది.

"ఆమేలెండి, నేనెరిగిన లలితే" అంది.

వీధిలో మాటలు వినిపిస్తూంటే విజయలక్ష్మి లేచింది.

"అదిగో వచ్చేరులా వుంది."

మాటలోనే ఓ జంట గుమ్మంలోకి వచ్చేరు. కుటుంబరావు కూర్చున్నచోటినుంచే స్వాగతం పలికేడు.

"రావయ్యా! పార్వతీశం! మీ కోసమే చూస్తున్నాం."

"రా, లలితా" అంటూ విజయలక్ష్మి ఎదురెళ్ళింది.

"మా అన్నయ్యను ఎన్నడూ చూడలేదుగా, ఇతడే... ఈమెను ఎరుగుదువా?" అంటూ రుక్మిణీవైపు తిరిగింది.

"లలితా! కంగ్రాచ్యులేషన్స్."

"థాంక్స్' తెలుపుతూ లలిత తల తిప్పింది. రుక్మిణినిచూసి తెల్లబోయింది.... "రుక్మిణీ!"

"పెళ్ళిచేసుకున్నావుటగదూ, చాలా బాగుంది, ఇప్పుడే విజయలక్ష్మిగారు చెప్తున్నారు."

తన్ను చూసిన ఆశ్చర్యం నుంచి తేరుకోలేక లలిత సంకోచంతోనే వ్యవహరిస్తూందని రుక్మిణి గ్రహించింది. హుషారు చేసింది.

"మంచిపని చేశావు. వారేనా మీవారు? పరిచయం చెయ్యి... వారి పేరేమిటి?..."

లలిత నెమ్మదిగా– "పార్వతీశం."

ప్రభాకరరావుతో మాట్లాడుతున్న పార్వతీశం తనపేరు వినబడి అటు తిరిగేడు. లలిత అతనిని రుక్మిణికి పరిచయం చేసింది. మర్యాదలయ్యేక ఆడవాళ్లు ముగ్గురూ లోపలిగదిలోకి నడిచేరు.



BRAOU

లలిత సంకోచిస్తూ, మౌనంగా వుండడాన్ని గమనించి రుక్మిణి హుషారు చెయ్యడానికి ప్రయత్నించింది.

"మీ ఆయన బాగున్నాడు. మంచి మొగుణ్ణి కొట్టేశావు!" అంది.

"ఒక్క డిగ్రీలేదుగాని..." లలిత తన అంతరాంతరాలలోని సందేహాన్ని నసిగింది. రుక్మిణి కోప్పడింది.

"లలితా, ఆ ఆలోచన మనస్సులో వుండడంకూడా న్యాయంకాదు. డిగ్రీ ఒక్కటేనా మనిషికి గీటురాయి..."

రుక్మిణి మాటలతో లలిత నెమ్మదిగా తేరుకుంది... "వాళ్లంతా ఒప్పుకోరు. ఆ భయంతోనే..."

"మీ అక్కకేనా చెప్పలేదా?"

లలిత తల అడ్డంగా తిప్పింది.

"అంత దాపరికం అనవసరం, మంచిది కాదేమోకూడా. సరిలే, తర్వాత మాట్లాడుకుందాం. అన్నట్లు, మరిచేను. మీ అక్కయ్య పెళ్ళిచేసుకుంటూంది. నిన్ననే వచ్చింది జాబు."

లలిత తెల్లబోయి చూసింది.

"నిన్ననే మానాన్న వ్రాశారు. దానిలో ఏమీలేదే." అంది.

"బహుశా ఈ నిర్ణయాన్ని నిన్ననే మీ వాళ్ళకి వ్రాసిందేమో." అంది రుక్మిణి.

కొంచెంసేపు లలిత నిశ్శబ్దంగా ఉంది.

"ఆ కామేశ్వరరావునేనా, మరొకర్నా..." ఆ ప్రశ్న అడగడంలో వినిపించిన ఏహ్యతకు రుక్మిణి ఉలికిపడింది.

"అదేమిటల్లా అన్నావు?"

ఈమారు లలిత తన మనస్సును దాచుకోలేకనే పోయింది.

"అదంతా ఆయనగారి చెల్లెలు కుముద ఏర్పాటు. ముగ్గురూ ఒకేయింట కాపురం. చెల్లెల్ని చూడ్డాని కంటూ ఆయనగారు రావడం, ముగ్గురూ పేకాటలు, సినిమాలు వీధివీధంతా కంపుకొట్టిపోయింది. ఛీ వెధవ బతుకు!"

రుక్మిణి చిన్ననాటినుంచీ సుధనుఎరుగును. కామేశ్వరరావు ప్రక్కన ఆమెను ఓ రోజంతా గమనించింది. రామచంద్రరావూ తమందరితో ఉన్నాడు. వారిద్దరి మధ్యనున్న సన్నిహితత్వం తనకు చూచాయగా కనబడింది కాని, రామచంద్రరావుకు ఆ అనుమానమేనా తగలలేదు. ఆమెను కోడలుగా ఏరుకోడానికి ఆయనకు సందేహం కలగలేదు. అంత జాగ్రత్తగా మెలిగేరు వాళ్ళు. అందుచేతనే లలితమాటల్ని నమ్మలేకపోయింది. ఆశ్చర్యంతో కళ్ళింత చేసుకొని చూసింది. "ఇంత కసి ఏమిటో? కులం పట్టింపేనా? ఈ చెల్లెలి కోసమేనా పెళ్ళికూడా వాయిదా వేసుకొని నెలనెలకూ నూరూ నూట పాతికా ముడుపు చెల్లించింది, సుధ." అనుకొంది.

"సుధ ఎప్పుడూ వెకిలిగా వ్యవహరించదు లలితా! చిన్నప్పటినుంచి చూస్తున్నా."

లలిత తన అనుభవం అంటూ చెప్పింది.

"నీకు తెలియదు. సంక్రాంతి ముందు కాకినాడ వెళ్ళేను. ఈ సంబంధం గురించి మాట్లాడాలనే. వెళ్ళే సరికి మంచంమీదఉంది. రెండోలంఖణమట! ఏం ఆర్భాటం చేస్తున్నాడు, ఆ కామేశ్వరరావు? తలపోటుఅంది. ఓమాటుడాక్టర్ని తీసుకొచ్చేడు. మరోమారు తానెవెళ్ళేడు. ఎన్ని అబ్జులు పోయేడు! పగలంతా మంచంపక్కనే కుర్చీవేసుక్కూర్చున్నాడు. అతగాడు కాస్సేపు అటూ, ఇటూ వెడితే ఈవిడగారు వెర్రిచూపులు చూడడం..."

సుధ ఈ చెల్లెలికోసం ఎంత నిగ్రహంతో తన పెళ్ళిని వాయిదా వేసుకొందో లలితమాటలు విన్నాక రుక్మిణికి బోధపడింది. ఆమెయెడ జాలీ, లలితయెడ అసహ్యమూ కలిగాయి కాని పైకేమీ తేలలేదు.



BRAOU

"ప్రేమించేవాడు ఉండవలసింది అలాగె కాదా?"

లలిత కాదనలేకపోయింది. తామీగదిలో అడుగుపెట్టిన అరగంటలోనూ తన మగనికేం కావాలోనని రెండుమార్లు కనుక్కొని వచ్చింది. ఆయనకూడా ఏదో ఒకందుకు లలితా సహస్రనామాలు జపిస్తూనే ఉన్నాడు.

"ప్రేమ బాగానేఉంది. అయితే చిన్నప్పటినుంచీ పెంచి పెద్దచేసిన తల్లీ, తండ్రీ ఏంకావాలి? వాళ్ళు తలెత్తుకు తిరగ్గలరా?"

"ఎందుకు ప్రేమించినందుకే?" అంది.

"ప్రేమ..." అంది మనస్సులోని అక్కసునంతా కేంద్రీకరించి, "అంతా ప్రేమే అయితే ఈ దాపరికం ఎందుకు?"

రుక్మిణికి ఆమె మాటలు జుగుప్సకలిగించేయి. కోపంవస్తే వచ్చింది, నాలుగూ దులిపెయ్యాలనుకొంది.

"మరి ఎవరికీ చెప్పకుండా నువ్వీ పెళ్ళి ఎందుకు చేసుకొన్నట్లు? కాపురం చేస్తున్నావు. నువ్వెందుకు దాచిపెట్టేవు?"

"నేనేం దాచలేదు" అంది లలిత.

"మా కెవళ్ళకీ తెలియదు. మీవాళ్ళెవళ్ళకీ తెలియదు."

లలిత చాల మొండితనంగా సమాధానం ఇచ్చింది.

"ఎవ్వరికీ పనికట్టుకు చెప్పక పోవడం వేరు. దాచడం వేరూను."

రుక్మిణి సర్దుకొంది. కృతకమయిన నవ్వు తెచ్చుకొని "మాటమీద మాటగా అన్నాను. ఏమీ అనుకోకు పెళ్ళి చేసుకోడం మంచి పనిచేశావు. ఆయన చాలమంచి వాడుట. విజయలక్ష్మిగారు చెప్పేరు. నేను చూస్తున్నాకదా. అదృష్టవంతురాలివి." అంది.

రుక్మిణి ఎత్తి పొడుపు దెబ్బనుంచి లలిత ఇంకా బయట పడలేదు. అదే ధోరణిలో సమాధాన ఇచ్చింది.

"నేనేం కులాంతరం పెళ్ళి చేసుకోలేదు."

రుక్మిణి ఈ మారు సహజంగానే నవ్వింది.

"కులంలోనే పెళ్ళిచేసుకొన్నావు, గనక మీ వాళ్ళు తల ఎత్తుకు తిరగవచ్చు. మరి నీ దాపరిక ఎందుకో?"

లలిత తెల్లబోయింది. పెళ్ళి చేసుకొన్నాక తలచుకొంటే తన జీతం అంతనూ తల్లిదండ్రులకు పం: గల స్థితివుంది. భర్త ఏమీ అనడు. ఆయన జీతంలో తాము ఏదో కాలక్షేపం చెయ్యగలరు. కాని తానేపంపదు ఏమంటే జీతం అంతా మాకే పంపుతున్నావే. నువ్వేంచేస్తున్నావనే ప్రశ్నవస్తుంది. ఇంక తిట్లు, ఏడుపుల శాపాలు, ప్రతిజ్ఞలు! ఊరు ఊరంతా గగ్గోలు పుట్టించేస్తారు. ఆ భయంతో కాలయాపన చేసింది. రెండ నెలలు గడిచేసరికి మరి పంపాలనే ఆలోచనే కలగడం మానేసింది. కాస్త శుభ్రమైన బట్ట కట్టుకొందామన్నా, ! పౌడరూ, స్నో కొనుక్కోవాలనుకున్నా ఇదివరలో తమ వాళ్ళు ఆ ఖర్చును చదువు ఖర్చుకు పోటీ పెట్టేవారు ఇప్పుడిప్పుడే ఆ సరదాలను తీర్చుకొంటూంది. అవన్నీ పక్కకు పెట్టాలి. మనస్సు ఒప్పలేదు. క్రమం వాళ్ళకేదీ చెప్పకుండా దొర్లించెయ్యడం అలవాటయిపోయింది. ఇవన్నీ పైకి చెప్పలేకపోయింది.

రుక్మిణి మళ్ళీ నచ్చజెబుతూన్నట్లు నెమ్మదిగా అంది.

"సుధ కోపం చేసుకోవలసిన మనిషికాదు లలితా. కులాల్ని గురించి మీఅందరిలాగా అది ఆలోచించదు కాని, కోపం తెచ్చుకోకపోతే ఓమాట చెప్తాను. ఈ మూడేళ్ళూ మీ అందరికోసం అది తన కడుపుకూ కట్టుకుంది. అప్పుడే పెళ్ళి చేసుకుపోతే నీ చదువు, మీ యిల్లు... ముఖ్యంగా నువ్వు పైకి రావాలనే ఎంత త్యాగం చేసింది..."

"ఈ కష్టాలన్నీ నీతో చెప్పుకొని వుంటుంది..." అంది లలిత వెక్కిరింతగా.

"దాని స్వభావం నాకంటే నీకే ఎక్కువ తెలిసివుండాలి."

ఇద్దరూ ఒక్క నిమిషం వూరుకొన్నారు.

"రేపు ఒకటో తేదీన కాకినాడ రిజిస్ట్రారు ఆఫీసులో వాళ్ళు పెళ్ళి చేసుకుంటారు. మీ వారిని తీసుకుని నువ్వూ రా. సంతోషిస్తుంది."

## 19

ఆ ఇంటి గుమ్మంలో అడుగు పెట్టిన మరుక్షణం నుంచీ లలిత ఏదోలా వున్నదనీ పార్వతీశం గ్రహించేడు. కారణం అర్థం కాలేదు. ఆమెతోపాటు తానూ మనస్సులోనే బాధపడ్డాడు. భోజనాలయ్యేక ముళ్ళమీద వున్నట్టు మర్యాదకు అవసరం అయ్యేంత సేపు కూర్చున్నాడు. ఇంక చాలుననుకొన్నాక లేచేడు.

"మరి, సెలవా!"

"అప్పుడేనా?" అన్నారు విజయలక్ష్మి, కుటుంబరావూ.

ఏవేవో పనులున్నాయని పార్వతీశం కదిలేడు.

ఇంటికి వచ్చేక లలిత ఏడుపే మొదలెట్టింది. ఆమె తన విచార కారణం తెలిపాక అతడు కాస్తంత సానుభూతి కూడా కనబరచకుండా నవ్వడం ఆమెకు బాధకలిగించింది.

"నీ ఏడుపు ఎందుకోసం? మీ అక్క పెళ్ళిచేసుకొంటూందనా? మంచిదే కదా, ఆమె తరవాయి పూర్తి కాగానే మేమూ పనిలో పని చేసేసుకొన్నామునుమీ అని చెప్పెయొచ్చు."

అతని అభిప్రాయం అదే. భార్య అక్కగారి పెళ్ళి కాకపోవడం ఒక్కటే తాము బయటపడడానికి ఆటంకంగా ఉందనుకొంటున్నాడు.

అతని కా వివాహంలో ఉన్న పేచీ అర్థంకాలేదని లలిత విచారం. అత్త బంధువులంతా ఛాదస్తులు. చదువు కొన్నదీ, ఉద్యోగం చేసుకొంటున్నదీ, ఇరవైరెండేళ్ళ పడుచు కోడలుగా రావడం వాళ్ళకు నచ్చలేదు. ప్రపంచం అంతా చుట్ట పెట్టుకురాగలడు గాని పార్వతీశం లలితను తీసుకెళ్ళి తిట్లు తినకుండా రాలేడు. కనక ఆ పక్కకే వెళ్ళడం లేదు. ఇప్పుడు తన అక్క కులాంతర పెళ్ళి చేసుకొందంటే ఇంక ఆ ఆశ అసలే ఉండదు. వారసత్వంగా వచ్చే మూడు నాలుగెకరాలు కూడ రావు. ఆ విధంగా తనతోడి వివాహం అతనికి కష్టకరం అవుతుందని ఆమె విచారం.

BRAOU

ఆమె భయం విన్నాక పార్వతీశం లలితను కోప్పడకుండా ఉండలేకపోయాడు.

"ఇదిగో లలితా! నీ పిచ్చి నాకేం బాగుండలేదు. ముందిది చెప్పు. నేను బ్రాహ్మడినే ననడానికి నీకు ఏమిటి ఆధారం? శాస్త్రీయమైన పరీక్షలతో తేలేదికాదు. ఇంక నా మాట, నా మీద ఉన్న నమ్మకమూను, విజయలక్ష్మిగారూ, భర్తా చెప్పేరు. ఆమె మీదవున్న గురి. అంతేనా? ఇంకేమన్నా ఉన్నాయా?"

లలిత తెల్లబోయింది. ఆమె అతని ఊరు వెళ్ళలేదు. కుటుంబాన్ని చూడలేదు. ఎరగదు. ఇంక రంగులో, అలవాట్లలో, మాటతీరులో కులాల తేడాలను చెప్పడం సాధ్యంకాదు. ఆమెకు తెలుసు. అందులో ఈ కాలేజీ చదువులు వచ్చేక మరీను. ఎం.ఏ.లో ఆమె తరగతిలోనే ఓ తురకల కుర్రవాడుండేవాడు. అతని అలవాట్లలో తనకేవీ ఎబ్బెట్టుగా కనిపించలేదు. తెలుగులో కవిత్వం వ్రాసేవాడు. అతనివంక తానే ఎన్నిమార్లు ఆసక్తితో చూడలేదు!

పార్వతీశం అక్కడితో ఆగినా బాగుండేది. అతడూరుకోలేదు. వర్ణాంతర వివాహాలు చేసుకొన్నవారి కథలు చెప్తూంటే లలితకు విసుపు పుట్టింది.

"అబ్బ! ఈ బూతు పురాణాలు మానేస్తురా!"

పార్వతీశం ఆశ్చర్యపడ్డాడు. "వర్ణాంతర వివాహం బూతా?" జాలిగా ఆమె వంక చూసేడు.

"ఈ ముసలమ్మ ఆలోచనలు మాను."

తన మాటతీవ్రతను గుర్తించి, లలిత జంకింది. మాట మార్చింది. "ఇంకా మనవాళ్ళు బ్రతకరు." అంది నిరాశగా.

"ఎందుకు?"

"అదేమిటండీ అల్లా అడుగుతారు?"

"మరేమనమంటావు? ఓ మాట చెప్తే కోపం తెచ్చుకోవు కదా." అంటూ అతడు తటపటాయించేడు.

అదేమిటో అని లలిత జంకింది. కాని, అతని మాట తనకు కోపం తెప్పిస్తుందనే భయాన్ని ఆమె ఒప్పుకోలేదు. సందేహిస్తూనే చెప్పమంది. అతడు చెప్పేసేడు.

"మీ నాన్నని నేనెరగను. కాని, నువ్వుచూపే భయమూ, నీ మాటలూ చూస్తే ఆయన యెడ కించిత్తూ గౌరవం కలిగించడం లేదు లలితా!"

లలిత తెల్లబోయింది.

"మీ అక్క చెల్లెళ్ళకి పెళ్ళిచేసి పంపవలసి వుంటుందనే ఆలోచన ఆయనకు అసలు ఉందా?"

ఆ ప్రశ్నకు లలిత సమాధానం ఇవ్వలేకపోయింది.

"అదేమిటండీ, అలా అన్నారు."

"నేను బ్రాహ్మడిని."

అతని ధోరణి అర్థంగాక లలిత ఆగింది.

"ఇప్పటికి నాలుగు నెలలనుంచి కాపురం చేస్తున్నాం. కాని, మనకు పెళ్ళయిన సంగతి వాళ్ళముందర పెట్టడానికి సిద్ధంగా లేవు."

"నా భయం వేరు. చెల్లెలికి పెళ్ళయి, అక్క మిగిలిపోయిందంటే ఇంక దానికి సంబంధాలు వస్తాయా?"

"నిజంగా నన్ను నమ్మమనేనా?"

లలిత ఏమీ చెప్పలేక పోయింది.

అదల్లావుంచు. మీ అక్కకు మా తల్లిదండ్రులకు చెప్పకుండానే చేసేను కొంటున్నట్లు కనిపిస్తూంది."

"దానికి కారణం వేరు." అంది లలిత మొండిగా.

"కారణాలు ఏవికానీ, అక్కా చెల్లెలూ ఇద్దరుకూడ తమ పెళ్ళికొడుకుల్ని తీసుకొని తల్లిదండ్రుల ఎదుట పడడానికి సిద్ధంగా లేరు."

లలితకు కోపం వచ్చింది.

"నేనేం తప్పుపని చెయ్యలేదు."

"మీ అక్కా చెయ్యడం లేదు."

"శుద్ధమయిన బ్రాహ్మణపుట్టుకపుట్టి..."

భర్తనవ్వు చూసి లలిత మాట మధ్యలో నిలబడిపోయింది.

"బ్రాహ్మణ కుటుంబంలో పుట్టడానికి ఈనాడు పెద్ద విలువలేదు లలితా! ఈనాడే కాదు. ఏనాడూ లేదు. చదువు, విజ్ఞానం, ఉద్యోగాలు, వృత్తులు నేడు అన్ని కులాలవారికీ అందేశాయి. ఇంక మిగిలిందేమిటో తెలుసా? 'మేం బ్రాహ్మలం' అని దురభిమానాలకి పోవడం, లేనిపోని ప్రమాదాలు కొనితెచ్చుకోవడమూను..."

• • •



BRAOU

ప్రభాకరరావు. రుక్మిణి పార్టీ ప్రారంభంలో తమ వివాహ సంకల్పాన్ని ప్రకటించే సరికి నలుగురూ మహోత్సాహం ప్రకటించేరు.

"మన నాన్నా, అమ్మా వున్నారు. ఆమె తల్లిదండ్రులున్నారు. వాళ్ళందర్నీ చూసి రావడానికి ఎప్పుడు బయలుదేరుదామనుకుంటున్నారు?" అంది విజయ.

ప్రభాకరరావు దాని అవసరం ఏమిటన్నాడు.

"వారిలో ఎవరు వద్దన్నా విరమించుకొనే ఆలోచన నాకు లేదు. రుక్మిణికి లేదు. ఇంక వాళ్ళకి చెప్పడం, వాళ్లేదో అనడం, మనం తోసెయ్యడం, రభస. ఇంత గంద్రగోళం ఎందుకు? సంతోషమా అని పెళ్లి చేసుకొంటూ కలహాలూ, కావేషాలూ ఎందుకు తెచ్చుకోవాలి."

"ఎవరో ఆటంకం చేస్తారని ఎందుకు అనుకోవాలి?" అంది విజయ.

ప్రభాకరరావు ఆశ్చర్యంగా ఆమె ముఖం చూశాడు. కుటుంబరావు బావమరిదిని బలపరిచేడు.

"నీ ఆలోచన బాగుందోయ్."

విజయలక్ష్మి కోపంగా అతనివంక చురచుర చూసింది. కుటుంబరావు లెక్క చేయలేదు.

"తరాల మధ్య ఆలోచనలతో, అవసరాలతో ఎప్పుడూ అంతరం వుంటూనే వుంది. కాని ఆ అంతరం ఈనాడున్నంత ఎక్కువగా ఎప్పుడూ వుండలేదేమో. పాతికేళ్లువచ్చి, బాగా చదువుకొని, ప్రపంచం చూస్తూన్న వాళ్ళకన్నా పుట్టినూరూ, మెట్టినిల్లూ దాటని నిశానీ పద్దులు పెళ్లిళ్ల విషయం వచ్చేసరికి పెద్ద అనుభవజ్ఞులలాగా శాసించబోవడం అసహ్యం. ఈ పెద్దవాళ్లు తమమాట చెల్లించుకొనేందుకు కొంతకాలం పితృభక్తి, మాతృభక్తి బోధించేరు. కొడుకుల కర్తవ్యాలు బోధించేరు. నిన్న నువ్వు చెప్పినది ఆలోచించా, బాగుందంటా. నిజమే. మగ-ఆడ పిల్లలు పుట్టింది ఒకరినొకరు బోల్తా కొట్టించేందుకే నన్నట్లూ, వాళ్లలా మోసపోకుండా తమ అనుభవకవచాన్ని కప్పుతున్నట్లూ నేడు నటిస్తున్నారు. ఈ ముసల్లోళ్ల ప్రమేయం లేకపోతే ఈ ప్రపంచంలో కుర్రవాళ్ల బ్రతుకులు- దరహంమీద-ఇంతకంటె సుఖవంతంగా వుండేవి."

విజయలక్ష్మి తమ తల్లిదండ్రులు అందరిలాంటి వాళ్ళు కాదంది.

"నిజమే చెల్లాయి! వాళ్ల మంచితనాన్ని మనం ఎందుకు పరీక్షకు పెట్టాలి? నిజమో, భ్రమో- ఈ విషయాన్ని వాళ్లూ అంగీకరిస్తూన్నారనుకొందాం. దానిని అబద్ధం అనిపించుకొని, మనస్సును ఎందుకు బాధ పెట్టుకోవాలి?"

అన్నగారిముందు మాట్లాడలేకపోయినా విజయలక్ష్మి భర్తను అంత సులభంగా వదలలేదు. కుటుంబరావు నవ్వేడు.

"ఆడపిల్లలని మోసం చేసెయ్యడం సులభం చేస్తున్నారు."

"ఈ స్థితి మారాలి. దానికి ప్రయత్నించడం మాని వెనకటి దారినే పోవడం సులభమనుకుంటున్నావు. తప్పు. నీ కుర్రవాడూ ఒక అమ్మాయిని కోరాడంటే, పెళ్ళి చేసుకోవాలనే సద్బుద్ధితోనే వ్యవహరిస్తాడు. ఆ స్థితిని చెడగొట్టేది ఇరువైపుల ముసలాళ్ళూనూ. పిల్లవాళ్ళ దృష్టిలోకి రాని డబ్బు, కులం గోత్రాలు, కుటుంబాల గురించి వాళ్ళబాధ, పడుచువాళ్ళు అనుసరించే పరస్పరాకర్షణ మాటలలో చెప్పలేని మానసిక సాన్నిహిత్యం వాళ్ళకర్థంకాదు. అక్కర్లేదు..."

ఒక్క నిమిషం ఆగి మళ్ళీ అన్నాడు.

"ఒక చిన్న రహస్యం చెప్పనా, నిన్ను నేను చేసుకోవడం మానాయనమ్మ కిష్టంలేదు. మా మేనత్త కూతురు నాకు దైవనిర్దిష్టమయిన భార్య అని ఆమె వుద్దేశం. అందుకే ఆవిడ ఇంతవరకూ మన గుమ్మం తొక్కలేదు... నేను చేయవలసిందేమిటి?"

"ఆదా ఆవిడబాధ" అని ఏదో గొప్ప రహస్యం బయటపడినట్లు విజయ ముఖం ఇంత చేసుకొంది.



BRAOU

# 20

మేఘాలలో తేలిపోతున్నట్లు రుక్మిణి హాస్టలు గదికి వచ్చింది.

ఎంతో పొద్దుపోయినట్లనిపించడంలేదు. ప్రభాకరరావు జంట విడవాలనిపించలేదు. మరి కొద్దిసేపు సముద్రపు వొడ్డున ఇసకలో కూర్చుని అతనితో కబుర్లు చెప్పాలనే ఉంది. కాని, హాస్టలు కట్టుబాట్లంటూ వున్నాయి. వచ్చేసింది.

జరిగిన సంఘటనలు తరుముకువచ్చి, పడుకున్నా నిద్రపట్టనీయడంలేదు. మేలుకొనేటప్పుడు జరిగినవన్నీ కలలోలా అనుభూతం అవుతున్నాయి.

సోఫాలో తనను ఆనుకొని కూర్చున్న ప్రభాకరరావు శరీరపు వెచ్చదనం తనను వెర్రెత్తించేసిన అవస్థ ఇప్పుడు లీలగా తోస్తోంది. పక్కన మనిషి నిలబడితే చాలు చిరాకు పుట్టించే విశాఖపట్టణపు ఉక్కబాధ తెలియలేదు.

అతనిని ఆనుకు కూర్చోవాలనిపించింది.

మధ్యలో కరెంటు ఫెయిలయింది. లైట్లు ఆరిపోయాయి. అందుకోసమే ఎదురుచూస్తున్నట్లు ప్రభాకరరావు తనను దగ్గరకు తీసుకొన్నాడు. అతని అరచేయి తన వక్షం అదుముకొన్నప్పటి అవశత్వంనుంచి తానిప్పటికీ తేరుకోనేలేదనిపిస్తోంది.

వివాహాలకోసం ఎదురు చూసేటట్లు చేసే ఆనందమూ, అనుభూతీ ఇవన్నమాట. ఆ అనుభూతిని గురించి ఎవరితోనన్నా చెప్పుకోవాలి. ఆ ఆనందాన్ని పంచుకోవాలి. మనసు వురకలు వేసినా దగ్గరున్న వినోదతో చెప్పుకోగల సాహసం లేకపోయింది. ఆమె వేళాకోళం చేస్తుంది. ఇందాకటికి ఇందాకా లైట్లు వెలగ్గానే "స్విచ్చి నువ్వు ముట్టుకున్నట్లుందేమే" అంది తన ముఖంవేపు చూస్తూ. అందరూ నవ్వేరు. తను తెల్లబోయింది. ప్రభాకరరావు తనవేపు వొంగి చెవిలో ఏదో చెప్పేడు. ఆ మాట వినిపించలేదు. కాని, మీసం కొసలు బుగ్గకు తగిలి, కిచ కిచపెట్టినట్లయి తనూ నవ్వింది.

ఇదివరకు తెలియలేదు. కాని మీసాలు తీసివేయించ వలసినవిగా తోచడంలేదు. ఈమాట సుధకు వ్రాయాలి. మీసాలు మగవానికి అందం ఆడుదానికి బాధ అన్నవారిలో తనూ ఒకర్తి. చిన్నప్పుడది. ఇప్పుడామె అనుభవం ఏమిటో అనిపించింది.

ఆ మాట తోచగానే స్టేషనులో ప్రభాకరరావు నుద్దేశించి సుధ "ఎవరా హీరో" అని అడిగిన మాట జ్ఞాపకం వచ్చింది. ఎవరో ఆ హీరో! చెప్పాలి.

వెంటనే లైటువేసి, టేబులువద్ద కూర్చుంది.

"...ఎవరా హీరో అన్నావు గుర్తుందా? ఇప్పుడామాటే నిజమయింది. నీకెందుకనిపించింది? నువ్వు ఎదుటలేవు. నా హీరోని చూపిద్దామంటే నువ్వడిగిన రోజున పరిచయం లేదు. పేరేనా అడగలేదు. నీకు అనిపించింది నాకెందుకు అనిపించలేదో. ఇప్పుడు? మా పరిచయం కానైతే రెండురోజులదే! రెండేళ్ల ప్రణయం పెంచుకున్న ఈ వార్త ఆశ్చర్యంగా వుందా? సుధా! ఎన్నాళ్ళ పరిచయం అన్నమాటకి విలువేమిటనిపిస్తూ పూర్వజన్మలమీద నమ్మకం వుండికాదు, మాటగా అనుకో. అదో అలవాటు. జన్మజన్మాంతరాలదేమో మా పరిచయం. ఈ రెండు రోజులలో ప్రతిక్షణం ఒక ఆనంద ప్రసూతి...!"

తామిచ్చిన పార్టీ, పార్టీలో లైట్లు ఆరిపోవడం, అతడు తన్ను చేరదీసుకోడమనే సమయంలో తన మనోభావాలూ వర్ణించింది.

"జీవితమంతా ఆ క్షణాలతోనే నిండిపోతే? లేక ఆ క్షణంవద్దనే నిలిచిపోతే?"

"సుధా! ఆ ఆనందం, ఆ అనుభూతి, ఆ ఆకాంక్ష నావి. నాస్వంతం వాటిలో ప్రమేయంలేదు. స్వల్ప కాలమేనా సుఖాన్ని అనుభవించనీ. తరువాత వినొచ్చులే, పెద్దల హితబోధలూ, ఏడుపులూ, ఎత్తి పొడుపులూ. వానితో ఈ సుఖ స్వప్నాన్ని పీడకల చేయదలచలేదు.

## 2.3 అర్థ వివరణ

ఈ నవలలో అక్కడక్కడా తారసపడే మాండలికాలకు, కొన్ని విశేషపదాలకు, ఆంగ్ల పదాలకు అర్థవివరణ మీ సౌలభ్యం కోసం ఇస్తున్నా.

కల్యాణతార = పెళ్ళిఘడియ
ముదలకించింది = చెప్పినదాన్నో చేసినదాన్నో నిలదీసి అడగటం
ఒడుపేసి చూడ్డం = ఎల్లాగైనా ఆక్రమించుకోవాలని కాచుకొని చూస్తూ ఉండటం

నజానే భోక్తారం కమిహ సముపస్థాస్యతి విధిః (పు : 22) =

"ఇదంచయే మనసివర్తతే... అని ప్రారంభమయ్యే శ్లోకంలో చివరి పాదమిది. ఇది కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలంలోది. ద్వితీయాంకంలో విదూషకుడితో మాట్లాడుతూ రాజు శకుంతలను గురించి ఈ మాట అంటాడు. 'విధి అంటే బ్రహ్మ ఈ సౌందర్యాన్ని అనుభవించమని ఎవర్ని కూచోబెడతాడో తెలియదు' అని ఈపాదం భావం.

'యవనీ నవనీత కోమలాంగి' (25) = జగన్నాథ పండితుడు తను ప్రేమించిన లవంగి గురించి అన్న మాటలివి. యవనస్త్రీ అయిన లవంగి నవనీతం (వెన్న)లాగా కోమలమైన అంగాలు కలిగినస్త్రీ అని దీనిభావం.

ఆర్త్రయం ... ఆర్. అనే ఇంగ్లీషు అక్షరంతో ప్రారంభమయ్యే మూడు పదాలు 1. రిఫార్మిస్టు 2. రివిజనిస్టు 3. రియాక్షనరీ.

టి చతుష్టయం = 1960 ప్రాంతాల్లో కమ్యూనిస్టుల్లో ప్రచారమైన మాట
ట్రాట్, స్కీయిస్టు, టిటోయిస్టు, టెర్రరిస్టు

యం. బ్రహ్మ = మూర్ఖుడు, అజ్ఞాని ప్రపంచ జ్ఞానము లేనివాడు. యం. బ్రహ్మ వేదాంత విదో వదంతి – అని ఉపనిషద్వాక్యం. వేదాంతం తెలిసినవాడు ఎవరిని బ్రహ్మ అనుకుంటాడో – అని దీని అర్థం. వేదాంతం తప్ప మరొకటి తెలియనివాడు అని కూడా చెప్పుకోవచ్చు. ఇది అర్థవిపరిణామంవల్ల సంభవమయింది. వైదిక సంప్రదాయంలో తిట్టదలచుకొన్నా, భూషించదలచుకొన్నా సరాసరి చెప్పకుండా వేదవేదాంగాల్లోనూ, కావ్యాల్లోనూ ఆ అభిప్రాయం వచ్చేవాక్యానికి ముందు సూటిగానీ వెనక మాటగానీ వాడతారు. వేదాంతవిదుడు అన్నపదానికి వున్న "చాదస్తుడు, ఏమీ తెలియనివాడు" అన్న అర్థాన్ని ఒక వ్యక్తిపట్ల వాడదలచుకొని దానికి ముందున్న 'యంబ్రహ్మ' అన్న పదంతో దానిని సూచించటం జరిగిందిక్కడ.

దీర్ఘాయుష్మతీభవ = దీర్ఘాయుష్మంతురాలవు అగుదువుగాక
అగల్ బగళ్ళనే = పక్కపక్కనే
అంగలార్పటం = విచారించటం

ఏమిటండీ మరీ శ్రోత్రియం పోతారు = ఏమిటండీ మరీ చాదస్తంగా మాట్లాడుతారు.
ఏలేశ్వరోపాధ్యాయుల వారిలాగా ఏడ్చి మొత్తుకోవటం (101) = ఏలేశ్వరోపాధ్యాయుడిని ఒక కులాంతరుడు మోసగించి ఆయన కూతుర్ని పెళ్లాడాడు. అందుకే ఏడ్చిమొత్తుకోవడం.

ఉంగిడెత్తించటం = పోరు పెట్టటం, ఊపిరి ఆడనీయక అదేపనిగా వెంటపడి తొందరపెట్టటం.
వెర్రిపప్ప = పిచ్చి వెధవ.

సుఖం శయిధా నికటే జాగ్రతి జాహ్నవీ = సమీపంలో జాహ్నవీ (గంగా) నది (మేల్కొని) వున్నది – సుఖంగా పడుకో అని అర్థం. కాశీలో లవంగితో గంగవొడ్డున జగన్నాథ పండిత రాయలు కనబడితే అప్పయ్య దీక్షితులన్న మాటలివి.

కుక్క సంతకెళ్ళొచ్చినట్లు = వృధాగా తిరిగివచ్చినట్లు
కోరగేదె = పొడవటానికి సిద్ధంగా వున్న గేదె



BRAOU

| | | |
|---|---|---|
| చాతుర్మాస్యం | = | ఆషాఢమాసం నుండి కార్తీకమాసం దాకా నాలుగు నెలలపాటు చేసే ఒక యజ్ఞం. చాతుర్మాస్యం చేయించటమంటే రుచీపచీలేని యజ్ఞ భోజనం చేయించటమన్న మాట. |
| సాచివేశాడు | = | దాటవేశాడు |
| ఏకత్రవాసం | = | ఒకేచోట వుండటం |
| ఏకభాండాశనం | = | ఒకే పాత్రలో వండింది తినటం |
| మహానసమానిసి | = | వంట యింటి మనిసి |
| మాదకత | = | మాంద్యం |
| ఆత్మగ్లాని | = | ఆత్మక్లేశం, న్యూనతాభావం |
| అవజ్ఞత | = | అవమానం, తిరస్కారం |
| భర్జించదా | = | రుచించదా, వంటబట్టదా |
| కదాచిత్కం | = | ఎప్పుడైనా |
| నిరుకు | = | నిర్ణయం |
| ఆశంక | = | అనుమానం |
| ఇరువాగులవారు | = | రెండుపక్కలవారు |
| అనురోధం | = | ఆటంకం |
| కాతరత | = | భయం |
| ఉలకం | = | తమిళంలో ప్రపంచం అని అర్థం (ఉలగం) |
| అహంభో అభివాదయే | = | ఫలానావారి పౌత్రుణ్ణి, పుత్రుణ్ణి అయిన ఫలానా నేను మీకు నమస్కరిస్తు న్నాను. దీన్ని ప్రవర అంటారు. |
| వినీతం | = | వినయం, నమ్రత |
| దరహంమీద | = | మొత్తంమీద |
| ఉభయత్రా | = | రెండువైపులా |
| పితలాటకం | = | [illegible] |
| నిరాయాసంగా | = | ఏమాత్రం శ్రమ లేకుండా |
| మంగల్నిచూసి ఎద్దుకుంటిందన్నట్లు | = | మంగలి ముళ్ళుతీస్తాడు. మంగలిని చూసి ముల్లు విరక్కపోయినా ఎద్దు కుంటింది. అతని సానుభూతి సంపాదిద్దామని, వినేవాళ్లంటే లేని కష్టాలను నటిస్తారని ఇక్కడి సందర్భాన్ని బట్టి చెప్పుకోవాలి. |
| చెడుగుడి | = | నేటి కబడీ ఆట |
| శాణీతనం | = | 'జాణతనం' అన్నమాటకు రూపాంతరం |
| చాకచక్యం | = | నేర్పరితనం |
| గోరా | = | గోపరాజు రామచంద్రరావు, ఆంధ్రదేశంలో నాస్తికోద్యమ ప్రచారకులు. |

BRAOU

ఉపద్రష్ట జగన్నాథ పండితరాయలు = ఆంధ్ర వేగినాటి బ్రాహ్మడు. పుట్టింది కోనసీమలోని ముంగండలో... తల్లి లక్ష్మీదేవి, తండ్రి పేరుభట్టు. ముంగండలోనే విద్యాభ్యాసం. కాశీకి వెళ్ళి వ్యాకరణంలో పాండిత్యం సంపాదించాడు. జయపుర రాజపుత్ర రాజుల సన్మాన గౌరవాలను పొందాడు. షాజహాన్ (1628) పండితరాజ బిరుదంతో ఈయనను సత్కరించాడు. 1650 వరకూ ఢిల్లీలోనే ఉండి ఔరంగజేబు రాజ్యానికి వచ్చే క్రమంలో చెలరేగిన గందరగోళంలో ఢిల్లీని వదిలి కాశీకి వెళ్ళాడు. అక్కడి నుండి కామరూప (అస్సాం) చేరుకొని 1666 వరకూ ఉన్నాడు.

ఈయన లవంగి అనే యవన కన్యను పెళ్లాడాడని కథ ఉంది.

ఈయన వ్రాసిన 'రసగంగాధరము' అనే అలంకార శాస్త్ర గ్రంథం చాలా ప్రసిద్ధమైంది. ఇదికాక అమృత లహరి, కరుణా లహరి, గంగాలహరి మొదలైన స్తుతి కావ్యాలను భామినీవిలాసము అనే ముక్తక కావ్యాన్ని ఇంకా అనేక గ్రంథాలను వ్రాశాడు.

అప్పయ దీక్షితులు = ఇతను జగన్నాథ పండితరాయలకు సమకాలికుడు. 16వ శతాబ్దంవాడు. వందకు పైగా పుస్తకాలు వ్రాసిన విద్వాంసుడు. ఈయన వ్రాసిన 'చిత్రమీమాంస అనే అలంకార గ్రంథాన్ని జగన్నాథ పండితరాయలు ఖండించాడు.

## 2.4 ఇతివృత్తం

సుధ, రుక్మిణి స్నేహితులు, ఇద్దరూ ఎమ్మెస్సీలే. సుధ కాకినాడ కాలేజీలో లెక్చరరుగా పనిచేస్తుంటుంది. రుక్మిణి విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో పిహెచ్.డి. కోసం రీసర్చి చేస్తుంటుంది. సుధ బ్రాహ్మ అమ్మాయి. తల్లి రాఘవమ్మ. తండ్రి హనుమంతరావు - హైస్కూలు టీచరుగా పనిచేసి రిటైరయ్యాడు. సుధ సంపాదన మీదనే ఆమె తల్లిదండ్రులూ, ఇద్దరు ముగ్గురు చెల్లెళ్ళూ, తమ్ముడూ ఆధారపడి ఉన్నారు. రుక్మిణి బ్రాహ్మణేతర కులం యువతి, రుక్మిణి తల్లి సుందరమ్మ, తండ్రి నరసింహమూర్తి. నరసింహమూర్తి కొంతకాలమెప్పుడో రాజకీయాలలో పనిచేశాడు. ప్రస్తుతం కాంట్రాక్టులు, లారీ వ్యాపారాలు చేసుకొంటూ దర్జాగానే బ్రతుకుతున్నాడు. కూతురికి లక్షవరకూ కట్నమిచ్చి పెళ్ళి చేయటానికి సిద్ధంగా ఉన్నాడు. రుక్మిణి కాక ఆయనకింకా ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. స్నేహితురాలు కుముద పెళ్ళికి వెళదామని సుధా, పుట్టినరోజు పండక్కి తమ దగ్గర ఉండేట్లు రమ్మని రాసిన తల్లిదండ్రుల దగ్గరకని రుక్మిణీ ఒకే మెయిల్లో ఒకేరోజు విజయవాడ వస్తారు.

సుధకోసం స్టేషనుకి కామేశ్వరరావు వస్తాడు. కామేశ్వరరావు సుధతోపాటు పనిచేస్తూ ఆమెతో పాటు ఒకే ఇంట్లో ఉంటున్న కుముద అన్న. ఎమ్. టెక్ పూర్తిచేసి కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో లెక్చరరుగా పని చేస్తున్నాడు. సుధను ప్రేమించి పెళ్ళి చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నాడు. రుక్మిణీ సుధలతోపాటు అదే రైల్లో ప్రయాణంచేసి వచ్చిన కామేశ్వరరావు పెత్తండ్రిరఘురామయ్య సుధ చలాకీతనం చూసి ఆమెను అభిమానిస్తాడు.

కామేశ్వరరావు సుధను వాళ్ళింటివరకూ దిగబెడతాడు. వాళ్ళ కుటుంబంతో ఉన్న పూర్వపరిచయాన్ని పురస్కరించుకొని కాసేపు మాట్లాడి వాళ్ళను కూడా చెల్లెలి పెళ్ళికి ఆహ్వానించి వెళతాడు. స్నేహితురాలి పెళ్ళికని సెలవుపెట్టి మరీ కాకినాడ నుండి రావటం సుధ తల్లిదండ్రులకు నచ్చలేదు. పెళ్ళికానిపిల్లకు ఈ తిరుగుళ్ళేమిటని తల్లి, కులంకాని వాళ్ళింటికి వెళ్ళటమేమిటని తండ్రి అభ్యంతరం చెబుతారు. వాళ్ళిద్దరికీ తగిన విధంగా సమాధానాలు చెప్పి మర్నాడు ఉదయం తనకోసం టాక్సీ తీసుకువచ్చిన కామేశ్వరరావుతో కలిసి పెళ్ళికి వెళుతుంది సుధ.

BRAOU

రుక్మిణి ఇంటికి వెళ్ళేసరికి ఆమె తండ్రి రామచంద్రరావు అనే స్నేహితుడితో కబుర్లలో ఉన్నాడు. రామచంద్రరావు బ్రాహ్మడు, రుక్మిణి తండ్రీ, రామచంద్రరావూ కలిసి ఒకప్పుడు రాజకీయాలలో పనిచేశారు. పన్నెండేళ్ళకు ఇప్పుడు మళ్ళీ కలుసుకొన్నారు. ఆరోజు రాత్రి రామచంద్రరావు అక్కడే భోజనం చేస్తాడు. భోజనాల దగ్గర చర్చ జరుగుతుంది. స్త్రీ పురుష సంబంధాలమీద, ప్రేమ విషయాలమీద స్త్రీ పురుషులకు ఉండవలసిన స్వతంత్ర వ్యక్తిత్వం గురించీ, వాళ్ళకు పెద్దవాళ్ళతో ఏమేరకు సంబంధాలుండాలనే విషయం గురించీ అస్పష్టంగా ఉన్న తనలో రామచంద్రరావుతో జరిగిన ఈ చర్చ సందర్భంలో రుక్మిణి ఆలోచనలకు ఒక ఆకారాన్ని ఏర్పరచుకుంటుంది.

అమెరికానుండి తిరిగి వచ్చిన తన పెద్దకొడుకు కోసం తగిన అమ్మాయిని రామచంద్రరావు వెతుకుతున్నాడని రుక్మిణికీ, ఆమె తండ్రి నరసింహమూర్తికీ తెలుస్తుంది. వాళ్లు సుధ విషయం రామచంద్రరావు దృష్టికి తెస్తారు. కుముద పెళ్లికి ముగ్గురూ వెళతారు. రుక్మిణికీ కామేశ్వరరావుకూ పెళ్ళి చూపులు కాని పెళ్ళిచూపులు ఏర్పాటు చేయడం నరసింహమూర్తి పెళ్లికి వెళ్లడంలోని ఉద్దేశం. రామచంద్రరావుకు సుధను చూపించాలని రుక్మిణి ఉద్దేశం. శిష్యురాలి పెళ్ళి చూద్దామని రామచంద్రరావు.

కుముద పెళ్ళి అవుతుంది. పెళ్లయి వెడుతూ, సుధను తొందరగా పెళ్ళి చేసుకోవటం గురించి అన్న కామేశ్వరరావును హెచ్చరిస్తుంది. వారి పెత్తండ్రి రఘురామయ్య సుధ కామేశ్వరరావుల మధ్య ఉన్న ప్రేమను పసిగడతాడు. పెళ్ళి చేసుకొమ్మని ప్రోత్సహిస్తాడు. రుక్మిణిని కామేశ్వరరావుకిచ్చి పెళ్ళి చెయ్యాలన్న ఆలోచన ఉన్న నరసింహమూర్తి, రామచంద్రరావు కొడుక్కు సుధనిప్పించే ప్రయత్నం చేస్తాడు. అది కలిసిరాదు.

సుధ కామేశ్వరరావులు కాకినాడ తిరిగివస్తారు. చట్టబద్ధంగా ఒకటవటానికి రిజిస్ట్రారాఫీసులో కాయితాలు పెట్టుకొంటారు. తమ పెళ్ళి నెల రోజులకుగానీ రిజిస్టర్ కాదు. అయినా ఆ రోజునుండే వాళ్ళిద్దరూ కలిసి ఉండటానికి నిర్ణయించుకొంటారు. ఇరువైపుల పెద్దవాళ్ళ ప్రమేయమేదీ లేకుండానే వాళ్ళిద్దరూ ఈ నిర్ణయం తీసుకొన్నారు. తండ్రుల పట్టుదలకు తమ జీవితాన్ని బలిపెట్టటానికి సిద్ధపడని యువతీ యువకులు తీసుకొన్న స్వతంత్ర నిర్ణయమిది. తమ నిర్ణయాన్ని తెలియచేస్తూ సుధ రుక్మిణికి ఒక ఉత్తరం కూడా రాస్తుంది.

సుధతో కలిసి బెజవాడ వచ్చినప్పుడు తాను ఖాళీ చేయబోయే సీటుకోసం కిటికీలో నుండి ఒక యువకుడు హొల్డాలు ఒళ్ళో పడేస్తే రుక్మిణి కోపంతో దానిని బయటకు విసిరేస్తుంది. ఆ తరువాత మళ్ళీ జాలిపడి, ఆ యువకుణ్ణి పిలిచి సీటిస్తుంది. ఆ యువకుడు, రుక్మిణికి సీటిచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హాస్టల్ అడ్రసుకు ఉత్తరం రాస్తాడు. ఆ ఉత్తరానికి రుక్మిణి జవాబు రాస్తుంది. మళ్ళీ అతని దగ్గర నుండి సమాధానం వస్తుంది. సమాధానం వచ్చిన రోజు అతను కూడా వస్తాడు. అతని పేరు ప్రభాకరరావు. విదేశాలలో చదివివచ్చాడు. ఇంజనీరు ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. భారతదేశంలో ఉద్యోగం దొరికే సూచనలు కనబడక మళ్ళీ అమెరికా వెళ్ళిపోదామనుకుంటున్నాడు. ప్రభాకరరావు తనను కలిసి మాట్లాడి నప్పుడు మాటల మధ్యలో అతను తమ రామచంద్రరావు మామయ్యగారి కొడుకేనని రుక్మిణి గ్రహిస్తుంది. కానీ తనకేమీ తెలియనట్లే ఉంటుంది. అతని ఆహ్వానం మీద వాళ్ళ చెల్లెలిగారింటికి వెడుతుంది. ఆ రాత్రి వాళ్ళింట్లో భోంచేసి, అతనితో మాట్లాడి హాస్టల్ గదికి తిరిగి వచ్చిన రుక్మిణిని అతని గురించిన ఆలోచనలే వెంటాడుతాయి. అతని గురించి స్నేహితురాలితో చర్చిస్తుంది. అతని నుండి పెళ్ళి ప్రస్తావన కెదురు చూస్తుంది. ఇరవై నాలుగు గంటల పరిచయమే అయినా అతను తనను కోరివచ్చాడు కాబట్టి అతనిని నిరాకరించవలసిన అవసరం లేదని అనుకొంటుంది. ఇద్దరూ ఒక అంగీకారానికి వస్తారు. పెద్దల ప్రమేయం లేకుండా పెళ్ళి చేసుకోడానికి నిర్ణయించుకొంటారు. స్నేహితులను నలుగుర్ని పిలిచి విందు చేస్తారు. తమ నిర్ణయాన్ని తెలియచేస్తూ, రుక్మిణి సుధకొక ఉత్తరం రాయటంతో నవల ముగుస్తుంది.

'స్వయంవరణం' నవలలో ప్రధాన సమస్య యువతీయువకుల ప్రేమా, పెళ్ళీ. స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణా, సంయోగమూ సహజమైనవి. కాని స్త్రీ పురుష సంబంధాలు మానవజాతి ప్రారంభం నుండి ఒకేరకంగా లేవు. సామాజిక పరిణామక్రమాన్ని బట్టి మారుతూ వచ్చాయి. ప్రాచీన సమాజాలలో ఇప్పటి పద్ధతులులేవు. అప్పుడు ప్రతిపురుషుడూ ప్రతి స్త్రీకి చెందేవాడు. కాలాంతరంలో కన్నవాళ్ళకూ సంతానానికీ మధ్య, సోదరీసోదరులకు మధ్య స్త్రీ పురుష సంబంధాలు నిషేధింపబడుతూ వచ్చాయి. ఈ దశ గుంపు పెళ్ళిళ్ళదశ. ఈ దశలో ఒక గణంలోని స్త్రీ పురుషులకూ, మరొక గణంలోని స్త్రీపురుషులకూ మధ్య యధేచ్ఛా సంబంధాలు సాగాయి. ఆ తరువాత 'జంట పెళ్ళిళ్ళ' దశ వచ్చింది. ఈ దశలో ఒక స్త్రీ, ఒక పురుషుడు తమకిష్టమైనంతకాలం జంటలుగా కలిసి బతికారు. ఆ స్త్రీపురుషులు విడిపోయినప్పుడు సంతానం తల్లికే వదిలివేయబడేది. ఆరకంగా సంతానం మీద హక్కు స్త్రీకి ఉన్నకాలం అది. వ్యావసాయిక స్థిరజీవితం ఏర్పడటంతో ఉత్పత్తి సాధనాలమీద పురుషుడికి హక్కు ఏర్పడింది. ఈ హక్కుతో పురుష స్వామ్యం అమలులోకి వచ్చి స్థిరపడింది. పురుషుడు తన సంతానానికి వారసత్వంగా సంక్రమింపచేసే విధానం ఏర్పడింది. దాంతో సంతానాన్ని కనిపెంచే స్త్రీ పురుషుడికి కావలసివచ్చింది. ఇది దాంపత్య సంబంధాలు రూపం తీసుకోవడానికి దోవతీసింది. సంతానం మీద స్త్రీ హక్కు పోయింది. ఆ స్థానంలో పురుషుడిహక్కు చోటుచేసుకుంది. కుటుంబానికి పురుషుడు యజమాని అయ్యాడు. సంతానం తండ్రిసొత్తు అయింది. ఇది 'పితృస్వామ్య వ్యవస్థ'. నేటికి కొనసాగివస్తున్నదీ వ్యవస్థే.

ఈ వ్యవస్థలో 'స్త్రీ పిల్లలను కనే యంత్రం'. స్త్రీ పురుష సంబంధాలలో స్త్రీ ఇష్టానిష్టాలకూ, వ్యక్తిత్వానికీ విలువపోయింది. వంశాభివృద్ధికి వారసులను కనటానికి పెళ్ళి చేసుకొంటున్నాడు కాబట్టి అందుకు ఎటువంటి స్త్రీకావాలో ఎంచుకొనే హక్కు పురుషుడికి సంక్రమించింది. పెళ్లిచూపుల దగ్గరనుండి,పెళ్ళయి అత్తింట్లో కాపురం చేస్తూ మరణించేవరకూ స్త్రీ పరాధీనే. స్త్రీ శరీరం భర్తది. మనసుకు గుర్తింపులేదు. పితృస్వామిక సామాజిక వ్యవస్థలో స్నేహం, ప్రేమ మొదలైన మానవీయ విలువలకు ఆస్కారం లేదు. భరింపబడేవస్తువు భార్య, భరించేవాడు భర్త' అనే భావనను అభివృద్ధి చేసి భార్యాభర్తృసంబంధాన్ని బానిస యజమాని సంబంధంగాఈ వ్యవస్థ దిగజార్చింది. 'కయ్యానికైనా' సమ ఉజ్జీఉండాల'ని సామెత. డబ్బు, కులమతాలూ, హోదాలూ ముఖ్యమైనవని ఈ సామెత ఋజువుచేస్తుంది.

భారతదేశం విషయం తీసుకుందాము. 19వ శతాబ్దిలో రాజారామమోహనరాయ్, వీరేశలింగం పంతులు సంఘ సంస్కరణోద్యమాలు నడిపారు. కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించాక సాంస్కృతిక చైతన్యం ఒకటి తల ఎత్తింది. కొత్త ప్రాపంచిక దృక్పథం ఒకటి అభివృద్ధి అయింది. పరస్పర ప్రేమ, గౌరవం, అనురాగం తప్ప స్త్రీ పురుష సంబంధాల నింకేవీ నిర్దేశించ రాదన్నది ఆదర్శమైంది. ఆ ఆదర్శం జీవితంలో వాస్తవ రూపం ధరించాలన్న తపన బయలుదేరింది. మొదటిచూపు ప్రేమనుండి, శారీరక ఆకర్షణవల్ల పుట్టే ప్రేమనుండి, భావైక్యతవల్ల కలిగే ప్రేమవైపుగా స్త్రీ పురుస సంబంధాల వివిధ దశలు పరిణమిస్తాయనే అవగాహన కలిగింది. 1910 నుండి ఈనాటివరకూ మన సాహిత్య ప్రక్రియలన్నింటిలో ఈ అవగాహన నమోదు అవుతూ వచ్చింది.

మానవజీవితాన్ని సమగ్రంగా చూపగలది నవలాప్రక్రియ. స్త్రీపురుషులు ప్రేమ పూరిత సంబంధాల నేర్పరచుకొనే చైతన్యాన్నివ్వటంలో నవలాప్రక్రియ దోహదం చేస్తున్నది. మహీధర 'స్వయంవరణం'కు ప్రాతిపదిక ఈ ప్రేమపూరిత సంబంధాలే.

పితృస్వామిక సమాజంలో ఎంత చదువులు, చదివినా, ఏ ఉద్యోగాలు చేస్తున్నా పెళ్ళి విషయానికొచ్చే సరికి పిల్లలు తల్లిదండ్రులచాటు వాళ్ళవుతారు. అబ్బాయి, అబ్బాయి చదువు, ఉద్యోగం, కులం, గౌరవం అన్నీ అమ్మాయి తల్లిదండ్రులకు నచ్చాలి. అమ్మాయి చదువుసంధ్యలు, కులగౌరవాలు, పనిపాటలు, వినయ విధేయతలు అబ్బాయి తల్లిదండ్రులకు నచ్చాలి. అప్పుడు ఇరుపక్షాల పెద్దలు ఒక అంగీకారానికి వచ్చి పెళ్ళిళ్ళు తలపెడతారు. పిల్లవాడిని పిల్ల తల్లి దండ్రులు, పిల్లను పిల్లవాడి తల్లిదండ్రులు నచ్చితే పెళ్ళిళ్ళవుతాయి మనసమాజంలో. 'పెద్దలు ప్రేమించి చేసుకొనే పెళ్ళిళ్ళు' ఇవి అని మహీధర ఈ నవలలో అంటారు.

తమ పిల్లల పెళ్ళిళ్ళు తామే పెత్తనం వహించి చేయాలని ఆలోచించిన పెద్దలు ఈ నవలలో కనబడతారు. రామచంద్రరావు తమ కొడుకుకు పెళ్ళి కూతుర్ని వెతికే పని పెట్టుకొంటారు. సుధా కామేశ్వర రావు ప్రేమించుకొంటున్నారని రుక్మిణి సూచనప్రాయంగా చెప్పినా, వాళ్ళ పెళ్ళి రెండుకుటుంబాలవారికీ దుఃఖ కారణమే అవుతుందని రామచంద్రరావు కొడుకుకూ, సుధకూ పెళ్ళికుదిర్చే ప్రయత్నం నరసింహమూర్తి చేస్తాడు. తన కూతుర్ని కామేశ్వరరావుకిచ్చి చేయటం కోసం ఆ నరసింహమూర్తే సుబ్బారాయుడి చుట్టూ తిరుగుతాడు. రామచంద్రరావు మూడో కొడుకు ముస్లిమ్‌స్త్రీని కేసుకొన్నాడన్న నెపంతో, అతని కొడుకుకు సుధ నివ్వడమనే ప్రతిపాదనను హనుమంతరావు వ్యతిరేకిస్తాడు. పెద్దల ఈ ఆర్భాటమూ, దురహంకారమూ గందరగోళాలకు దారితీయడం సహజమని యువతీయువకులు గ్రహిస్తారు. ముందుకు వచ్చి పెద్దవాళ్ళను తెర మరుగుకు పంపిస్తారు. తమ పెళ్ళిళ్ళను తమఇష్ట ప్రకారం చేసుకొంటారు. యువతరం ఈ రకమైన స్వతంత్ర వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలన్న దానిని రచయిత ఈ నవలలో ఆదర్శంగా చూపుతారు. రచయితకు పెద్దలు నిర్వహించే పెళ్ళిచూపులుఅనే సాంప్రదాయికపదంమీదగానీ, తంతుమీదగానీ నమ్మకంలేదు. రామచంద్రరావుతో పెళ్ళి చూపుల పద్ధతి వద్దు అని అనిపిస్తాడు. (పు:52) 'పెళ్ళి చూపులు' అనేమాటకు బదులు పిల్లనూ పిల్లాణ్ణీ 'సమ్ముఖం' చేయడం అని వ్యవహరించారు. కలిసి చదువుకొనే, కలిసి పనిచేసే స్త్రీ పురుషులు అవకాశాలు కలిసివచ్చి 'సమ్ముఖులై' ఒకళ్ళనొకళ్ళుఇష్టపడి పెండ్లిచేసుకోవటం ఉత్తమమైనపద్ధతి అని మహీధర అభిప్రాయ పడ్డారు. పెద్దలుముందు తామేనిర్ణయాలు తీసుకోకుండా, పిల్లనూ పిల్లవాణ్ణీ సమ్ముఖపరిచి వాళ్ళిద్దరికీ ఇష్టమైతే పెళ్ళి చేసుకొనే వీలుకలిగించాలన్న అభిప్రాయం కూడా ఒకటి రచయితకుఉంది. పిల్లా, పిల్లవాడీ ఇష్టమంటూ రామచంద్రరావు కట్న కానుకలు తదితర విషయాల ప్రస్తావన ఏదీ లేకుండా తన కొడుకుకు తాను చూస్తున్న ఏ అమ్మాయికైనా సమ్ముఖం చేద్దామనుకొనే ప్రయత్నంలో ఈ అభిప్రాయం కనిపిస్తుంది. అయితే నవల లోని జంటలు సుధ కామేశ్వరావు, రుక్మిణి ప్రభాకరరావు, లలిత పార్వతీశం అవకాశాలు కలిసి వచ్చి తమంతట తాము 'సమ్ముఖులై' పెళ్ళిళ్ళు చేసుకొన్నవాళ్ళే. రచయితకు యువతీయుకుల స్వయం నిర్ణయం వైపు మొగ్గు ఉన్నది.

స్త్రీ పురుషులు తమకు నచ్చిన వాళ్ళను ఎన్నుకొని వివాహాలు చేసుకోవాలి. దీనికి 'ప్రేమ' ప్రాతిపదిక కావాలి. అవుతుంది. అయితే ఈ ప్రేమ ప్రాథమిక స్థాయిలో శరీరాకర్షణకు సంబంధించింది. పుట్టుకతోటి, వయసుతోటి, కుటుంబ ఆర్థిక స్థితిగతులతోటి, ఆరోగ్యం తోటి వచ్చే సహజమైన అందం స్త్రీ పురుషుల మధ్య పరస్పర ఆకర్షణకు దారితీస్తుంది. ప్రేమ ఆ తరువాతి స్థాయిలో ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోవటానికి సంబంధించింది. ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోవటం, ఒకరిభావాలు ఇంకొకరు తెలుసుకోవటంతో ప్రారంభమై భావైక్యత పొందటాన్ని ఆశిస్తుంది. ప్రేమలో అంతకంటే అత్యున్నతస్థాయి స్త్రీ పురుషులిద్దరి జీవితాశయమూ,



BRAOU

లక్ష్యమూ ఒకటే అయివుండటం. ఆ ఆశయ సిద్ధికి యువతీయుకులిద్దరూ పాటు పడడం ఆదర్శం. పరస్పర ప్రేమ ఆదర్శప్రేమ.

ఉప్పల లక్ష్మణరావుగారు ఈ రకమైన ప్రేమను 'అతడు-ఆమె' నవలలో చర్చించారు.

ఉప్పల లక్ష్మణరావుగారు ఊహిస్తున్న ఆదర్శప్రేమ ఈ సమాజంలో ఆచరణ సాధ్యంకాదని మహీధర అభిప్రాయం. ఈ సమాజంలో తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా స్త్రీ పురుషులు పరస్పరం ఇష్టపడడమే పెద్ద విప్లవం. ఒకసారి ఇష్టపడి సంబంధం ఏర్పరచుకున్న తర్వాత, వాళ్ళ జీవితం అనుక్షణం ఇచ్చిపుచ్చుకోవడాల మీద ఆధారపడి సాగుతుంది. ప్రేమకంటే ఎదుటి వ్యక్తిని గౌరవించటం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోటం ప్రాధ్యానం వహిస్తాయి. ఈ నవలలో రచయిత, స్త్రీ పురుషులు ఒకళ్ళనొకళ్ళు ఇష్టపడటానికి ఆకర్షణ, అర్థం చేసుకోవటం అనే రెండంశాలను మాత్రమే ప్రాతిపదిక చేశారు.

"ఈడుజోడయిన, ఆరోగ్యవంతులయిన యువతీయువకులు ఒకచోట తటస్థపడి నప్పుడు ఆకర్షణ కలగటం సహజం. కలగకపోవటం అసహజం. అందులోనూ పెళ్ళిళ్ళు పేరంటాలు వంటి చోట కలిసినప్పుడు చటుక్కున మనస్సు ఎన్నికనే ప్రారంభిస్తుంది" అని రచయిత స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ సహజత్వాన్ని స్పష్టం చేస్తారు.

సుధా కామేశ్వరరావుల విషయమే తీసుకొందాం. సుధ ఎదురుగా ఉంటే కామేశ్వరరావుకు మరో ఆలోచన తోచదు. ఆమెకళ్ళూ, నవ్వుతుండే పెదవులూ, మాటలూ అతనిని నిలబెట్టేస్తాయి. అతనికి సుధతో ఉంటేనేచాలు. జీవితంఉత్సుల్లమవుతుంది. అనంతసంపదలు కలిసివచ్చినంతసంతోషం కలుగుతుంది. సుధది తనది ఒక కులంకాదు. తాము పెళ్ళి చేసుకొంటే రెండువైపులవారు తమనివదిలేస్తారు. అయితే సుధలో పొంగి పొరలే ఉత్సాహమూ, ఎప్పుడూ నవ్వుతూండే ఆ కళ్ళూ, పెదవులూ చూస్తుంటే ప్రపంచం అంతా కట్టుకట్టి దూరంగాపెట్టినా బతికెయ్యగలంఅని కామేశ్వరరావుకుఅనిపిస్తుంది. వీటిని పరిశీలించి చూస్తే రెండు విషయాలు స్పష్టమవుతాయి. కామేశ్వరరావు సుధను ఆమె అందాన్ని చూసే ప్రేమించాడన్నది ఒకటి. ఆమె మీద అతనికి మోహం లేదనేది రెండవది. 'ఒకస్త్రీని ఒకపురుషుడుగానీ, ఒకపురుషుణ్ణి ఒక స్త్రీగానీ వాళ్ళు కావాలని కోరటము వారిని యెప్పుడూ తమతోటే వుంచుకొని తమ వారిగా చేసుకోవాలను కోవడమూ మోహం' అంటాడు చలం. (స్త్రీ. పు. 28) సుధఎదురుగా ఉంటే మరో ఆలోచన తోచక పోవటంలో కామేశ్వరావు మోహతీవ్రత కనబడు తుంది. ఆ మోహతీవ్రత వల్లనే అతను ఆమె కళ్ళు, పెదవులూ చూస్తూ ప్రపంచం అంతా కట్టుకట్టి దూరం పెట్టినా బతికెయ్యగలననుకొంటాడు.

సుధకు కామేశ్వరరావుకు ఏర్పడిన పరిచయం స్నేహంగా, స్నేహం అనురాగంగా పరిణతి పొందింది. అయితే అందుకు దోహదం చేసిన అంశాలను గురించిన ప్రస్తావన నవలేతి వృత్తంలో భాగం కాలేదు. ఇద్దరూ పెద్ద చదువులు చదువుకున్నారు. కులాల్ని, తల్లిదండ్రులను ఎదిరించి అయినా సరే పెళ్ళి చేసుకొందామను కొన్నారు. అటువంటి స్త్రీ పురుషుల భావాలు ఒక మేరకు అభ్యుదయ దృక్పథ ప్రధానాలే అయివుంటాయి. తల్లితో సుధ ప్రసంగంలో ఈ దృక్పథాన్ని గమనించవచ్చు. ఇది సమాజ సంస్కారంలో భాగమైన దృక్పథం. ఇదే సుధ కామేశ్వరరావులను దగ్గర చేసింది.

సుధా కామేశ్వరరావుల విషయంలో బుద్ధికంటే సహజాతాలు బలంగా పనిచేయటం కనబడుతుంది. రచయిత వాళ్ళ గురించి '... ప్రతిదినం ఏకాంతస్థితి కోరుతున్నవాళ్ళు' (పు. 107) అంటారు. అనుకోకుండా లభ్యమైన ఏకాంతస్థితిలో పెళ్ళికి ముందే శారీరకంగా ఏకమవుతారు.

రుక్మిణీ ప్రభాకరరావుల విషయానికి వద్దాం. రుక్మిణిని రైలుస్టేషన్లో అయిదు నిమిషాల పాటు చూశాడు ప్రభాకరరావు. ఆ అయిదు నిమిషాల వ్యవధిలోపామె రూపం, స్వభావం రెండూ అర్థ మయ్యాయి. ఆమెను పెళ్ళి చేసుకొంటే బాగుంటుందని పరిచయం పెంచుకొన్నాడు. ఇద్దరూ చదువుకొన్నవాళ్ళు, ఆలోచించగల వాళ్ళు. వాళ్ళ భావాలు కొన్ని సందర్భాల్లో కలుస్తాయి కూడా. రుక్మిణి కూడా ప్రభాకరరావును ఇతరుల ప్రమేయం లేకుండా తనంత తానుగా చూసింది. అతను తన చదువునూ సంస్కారాన్నీ చూసి వచ్చాడు. తనకూ అతని చదువూ సంస్కారమూ నచ్చాయి కనుక అతనిని పెళ్ళాడటానికి అంగీకరిస్తుంది.

సుధాకామేశ్వరరావుల జంటతోపోలిస్తే, రుక్మిణి ప్రభాకరరావుల జంట పెళ్ళి చేసుకొందామని నిర్ణ యించుకోవడంలో కాస్త ఆలోచన, తర్కం కనబడతాయి. అందుకు కారణం వాళ్ళ ప్రేమ పాతకుల ముందే

BRAOU

పుట్టి పెరుగుతుంది కనుక. కానీ లోతుకుపోయి పరిశీలిస్తే వాళ్ళిద్దరి మధ్య సంబంధానికి కూడా బలమైన పునాది కనబడదు. ప్రభాకరరావుకు, తనకు తోడుకావాలి అనుకొన్నప్పుడు మొట్ట మొదట గుర్తొచ్చింది రుక్మిణి. అయితే ఆమె ఎందుకు మొట్టమొదట గుర్తొచ్చిందో రచయితచెప్పలేదు. ఒకళ్ళకొకళ్ళు నచ్చారు. ఒకళ్ళమీద ఒకళ్ళకు నమ్మకం ఏర్పడింది అంతే. రుక్మిణి మీకు నేనే ఎందుకు కనబడ్డాను? నాలో ఏం చూసి మక్కువ పడ్డారు, అని అడిగినప్పుడు ప్రభాకరరావు ఆమె విషయంలో తానేమీ భ్రమపడలేదు. తాను కావాలను కొన్నవి ఆమెలో కనిపించేయి' అనుకొంటాడు. ప్రభాకరరావు తనకుకాబోయే భార్యలో స్వతంత్రంగా నిలబడ గల చదువు, ఆరోగ్యం, దృఢత్వం ఉండాలనుకొన్నాడు. అవి రుక్మిణిలో కనబడ్డాయి కనుక ఆమెను పెళ్ళి చేసుకొందామనుకొన్నాడు. ఇక్కడ రుక్మిణి భవిష్యత్తు గురించి కాస్త భయపడుతుంది. తన చదువు, తన రూపం, తను వ్యవహరించిన తీరు చూసి తన వైపు ఆకర్షితుడైన ప్రభాకరరావు అవే లక్షణాలు ఇంకొకచోట ఉంటే అప్పుడు తేలిగ్గా తనను వదిలించుకోడా' అని అనుమానిస్తుంది. అయితే భవిష్యత్తు గురించి అంత అనుమానించకూడదని ఎదుటి వ్యక్తిని గౌరవిస్తూ ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలని అనుకొంటుంది.

రెండు రోజుల పరిచయంతో ప్రభాకరరావును పెళ్ళి చేసుకోవటానికి సిద్ధ పడిన రుక్మిణి సుధకు ఒక ఉత్తరం రాస్తుంది. 'ఎన్నాళ్ళ పరిచయం అన్న మాటకి విలువేమిటనిపిస్తూంది' అనీ, తమ పరిచయం 'జన్మ జన్మాంతరాలదేమో'నని ఆ ఉత్తరంలో రాస్తుంది. తల్లిదండ్రులు తెచ్చి చేసిన వాడు ఎట్లాంటివాడైనా వాడితోనే తన బ్రతుకు జన్మజన్మాంతరాల నుండి ముడి పడి వుందని విశ్వసించి ప్రవర్తించే సామాన్య స్త్రీ) ఆలోచనా ధోరణికి, రుక్మిణి ఆలోచనా విధానానికి పెద్దగా తేడా కనపడదిక్కడ.

ప్రేమ సంస్కారాన్ని కోరుతుంది. సంస్కారం ఉన్నవాళ్ళ మధ్య మాత్రమే ప్రేమ సాధ్యమవుతుంది. లేనప్పుడది భ్రమ తప్ప మరొకటి కాదు. సుధా కామేశ్వరరావులకు, రుక్మిణీ ప్రభాకరరావులకు ఒకళ్ళ మీద ఒకళ్ళకు ఉన్న ప్రేమాగౌరవాలు వాళ్ళకు సంస్కారపూర్ణమైన ప్రవర్తననిచ్చాయి. ఈ రెండు జంటలలోనూ ప్రతి ఇద్దరూ ఎదుటి వాళ్ళు తమకోసంచేసిన పనియొక్క నిజాయితీని నమ్మటం, ఎదుటివాళ్ళకు కష్టం కలిగి స్తున్నామేమోనని ఆత్మ విమర్శ చేసుకోవటం, ఇద్దరూ ఒకళ్ళనొకళ్లు ఇబ్బంది పెట్టుకోకుండా ఎదుటివాళ్ళను ఆనందింపచేయాలని తపనపడటం ఆ సంస్కార ప్రవర్తనలో భాగాలే.

ప్రేమకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు చాలా దగ్గరసంబంధం ఉంది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేనివాళ్ళు ప్రేమను అనుభవించలేరు. పితృస్వామిక వ్యవస్థ పిల్లల జీవితాన్ని నిర్ణయించే హక్కు తల్లిదండ్రులకు ఇచ్చింది. ఫలితంగా పిల్లలు స్వంతవ్యక్తిత్వాలతో ప్రవర్తించలేరు. ప్రేమించుకొన్న యువతీయువకులకు ఆరకమైన స్వంత వ్యక్తిత్వాలతో ప్రవర్తించే వీలులేనందున ఎప్పుడూ ప్రేమ విఫలమైనట్లుగానే కనబడుతుంది. తమ ప్రేమలను సఫలం చేసుకోవటానికి యువతీయువకులు పితృ స్వామిక వ్యవస్థ మీద, తల్లిదండ్రుల పెత్తనం మీద తిరుగుబాటు చేయకతప్పదు. ఆ తిరుగుబాటు చేయటం వల్లనే సుధా కామేశ్వరరావులు తమ ప్రేమను అనుభవంలో పంచుకోగలిగారు.

తరానికి తరానికీ మధ్య జీవిత విలువలకు సంబంధించిన అంతరాలుంటాయి. ఆ విలువల మధ్య ఘర్షణ రావటం కూడా సహజమే. 'ప్రేమ' అనే ఉన్నత మానవ విలువ పట్ల కూడా తరాల ఆలోచనల మధ్య అంతరాల ఫలితంగా సంఘర్షణ వస్తుంది. ఈ జీవిత సంఘర్షణను మహీధర 'స్వయంవరణం' నవలకు వస్తువుగా స్వీకరించారు. కానీ విచిత్రంగా ఆ సంఘర్షణ నవలేతివృత్తంలో భాగం కాలేకపోయింది. జీవిత సంఘర్షణ ప్రధానాంశంగా ఇతివృత్తంలో ముందుకు రావాలంటే ఆ ప్రత్యేకమైన (రచయిత నిర్దేశించిన) విలువ పట్ల విరుద్ధ భావాలను ప్రతిఫలించే పాత్రలను ముఖాముఖి నిలబెట్టి కథను నడిపించవలసి ఉంటుంది. నవలేతి వృత్త నిర్మాణంలో ఇందుకు ప్రయత్నంజరగలేదు. తల్లిదండ్రులంటే వాళ్ళెప్పుడూ పిల్లలసౌఖ్యం గురించి ఆలోచించ రనీ, పిల్లల జీవిత విలువలను గౌరవించరనీ రచయిత ముందుగా తానే ప్రతిపాదిస్తారు. అటువంటి తల్లిదండ్రు లకు తమ నూతన జీవిత విధానాల గురించి నచ్చచెప్పవలసిన అవసరం పిల్లలకు లేదంటారు. తమ బ్రతుకు మార్గాలను తామేనిర్ణయించుకోమని సందేశంఇస్తారు. రెండుతరాలవాళ్ళను ముఖాముఖి నిలిపి సంఘర్షణ ద్వారా జీవితాన్నిచూపి, ఏది ఆచరణీయమైన జీవితవిదానమో పాఠకులు తెలుసుకొనేట్లు చేసేప్రయత్నం జరగలేదు.

"ప్రేమ అనేది ఈనాటి యువతీయువకుల నిత్య జీవిత వాస్తవం. ప్రేమలో పడిన వాళ్ళ సమస్య ఒకటే తమ ప్రేమను వివాహం ద్వారా సఫలం చేసుకోవడం ఎలా అనేది. ఈ సమస్యను శాంతంగా, శాస్త్రీయంగా, వ్యక్తుల మనస్తత్వాల కనుగుణంగా పరిష్కరించడమే నేటి సా ్యం కర్తవ్యం" (సంవేదన, జూలై 1968, పు.

98, 99) అని చెప్పి రాచమల్లు రామచంద్రారెడ్డిగారు ఆ కర్తవ్యాన్ని 'స్వయం వరణం' నవల నిర్వహించిందంటారు. అందులో సందేహించవలసిందేమీ లేదు. ప్రేమను వివాహంద్వారా సఫలం చేసుకోవాలన్నదీ నిజమే. ప్రేమ సమస్యను శాంతంగా, శాస్త్రీయంగా పరిష్కరించుకోవాలన్నది కూడా నిజమే. అయితే, అది పూర్వాపరాలలో నిమిత్తంలేని నిరపేక్ష విషయంకాదు. 'ప్రేమించుకొన్నవాళ్ళు పెళ్ళిచేసుకోవాలి' అన్న దానిని సిద్ధాంతంగా చెప్పటం వేరు. నవలలో కూడా దానినట్లాగే చెప్పే ప్రయత్నం చేస్తే అది మంచి సాహిత్యం కాలేదు. సాహిత్యం ఆ సిద్ధాంతాన్ని నిత్యచలన శీలమైన జీవితంతో ముడి పెట్టి సజీవ మానవ సంబంధాంశంగా నిరూపించాలి. తద్వారాప్రేమ ఎంత ఉన్నతమైన మానవీయవిలువో, అది ఎంత సంఘర్షణలో, దీక్షతో సాధించుకోవాల్సిన అంశమో పాఠకులకు స్పష్టం కావాలి. అట్లా స్పష్టమైనప్పుడు పాఠకులు పాత్రలతో తాదాత్మ్యం చెందుతారు. ఇతివృత్తం ద్వారా అనుభూతిని పొందుతారు. ఆ తాదాత్మ్యం, ఆ అనుభూతి వాళ్ళకు మంచి సాహిత్యాన్ని చదివేమన్న తృప్తినిఇస్తాయి. అంతే కాదు. జీవితాన్ని అభ్యుదయకరమైన మార్పుకు అభిముఖంగా మార్చుకోవటానికి ప్రేరణనిస్తాయి. కానీ ఈ నవలలో తీవ్రమైన ఘర్షణలేకుండా జీవితం జీవితంగా కాక, సిద్ధాంతంగా ప్రతిపాదించబడి చూపబడటం చేత దీని నుండి కలగవలసినంత ప్రేరణ కలగకుండా పోతున్నది.

మహీధర రామమోహనరావుగారు-వివాహంద్వారా సహజీవనం చేయవలసింది స్త్రీపురుషులే కనుక ఒకళ్ళనొకళ్ళు ఎన్నుకొనే అధికారం వాళ్ళకు మాత్రమే ఉండాలని ఈ నవలలో ప్రతిపాదిస్తారు. దానిని సూచించటానికి నవలకు 'స్వయంవరణం' అని పేరు పెట్టారు. 'స్వయంవరం' అనేమాట ఒకటి ఉంది. అది భూస్వామ్య నాగరికతను తెలిపే పద్ధతికి వాడబడుతున్నమాట. రాజులు తమకూతుళ్ళకు దేశదేశాల నుండి రాకుమారులను పిలిపించి వాళ్ళల్లో ఎవరినైనా నచ్చినవాణ్ణి వివాహమాడటానికి అవకాశమిచ్చే పద్ధతి 'స్వయంవరం'. ఈ పద్ధతిలో స్త్రీకి వరుణ్ణిఎన్నుకొనే విషయంలో చాలాస్వేచ్ఛ ఇచ్చినట్లుకనిపిస్తుంది. నిజానికి ఆ స్వయంవరానికి ఆహ్వానించబడ్డ యువకులు వధువు తండ్రికి ఇష్టమైనవాళ్ళు మాత్రమేనన్న విషయం మనం మరిచిపోకూడదు. తండ్రి ముందుగా ఎన్నిక చేసిన వరుల గుంపు నుండి ఎవరో ఒకర్ని ఎన్నుకొనే హక్కుమాత్రమే రాజకుమారిది. స్త్రీ పురుషులిద్దరి భాగస్వామ్యంతో ఇష్టంతో పరస్పర సహజీవనం కోసం జరిగే ఎన్నిక ఆదర్శప్రాయమైంది. అది 'స్వయంవర' సంప్రదాయం కంటె ఉన్నతమైంది. ఆధునిక సమాజాలలో వివాహ విషయంలో ఈ రకమైన ఉత్తమ సంప్రదాయం అభివృద్ధి చెందవలసి ఉంది. దానిని సూచించటం కోసం, సమాజంలో వివాహ విషయంలో వస్తున్న మార్పును వేగవంతం చెయ్యటం కోసం, ఈ నవలను మహీధర రాశారు. పెళ్ళి ద్వారా తనకు తోడుగా ఉండవలసిన వ్యక్తిని ఇతరుల ప్రమేయం లేకుండా తాను తన కోసం ఎన్నిక చేసుకోవాలన్న ప్రబోధాన్ని 'స్వయం వరణం' అన్న నవల పేరులోనే భాగం చేశారు.

ఈ నవలలో కులవ్యవస్థ పరామర్శ కనిపిస్తుంది. సమాజం మారుతుందన్న విషయంలో గొప్ప ఆశాభావంకల నవలా రచయిత, కులవ్యవస్థ మారుతుందనే నమ్ముతారు. అది నిన్న ఉన్నంత కఠినంగా ఈ రోజు లేదు. ఈ రోజున్నంతపట్టు కులానికి రేపు ఉండదు అని ఆయన విశ్వసిస్తారు. ఆ విశ్వాసాన్నే రామచంద్రరావు మాటల్లో '... కులవ్యవస్థ దెబ్బతిని తీరుతుంది. దానిని బ్రతికించటం ఎవరితరమూ కాదు ...' ఈ దృష్ట్యా ఆయన ఈనాటి సమాజంలో కులానికెంత పట్టుందో, ఏ మేరకు అది సడలిందో నవలేతివృత్తంలో భాగం చేసి చెప్పారు.

నవలేతివృత్తంలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కులాలు మాత్రమే కనబడతాయి. హనుమంతరావు రామచంద్రరావు బ్రాహ్మణ కుటుంబాల వాళ్ళు, నరసింహమూర్తి, సుబ్బారాయుడు బ్రాహ్మణేతర కుటుంబాల వాళ్ళు, కులానికి సంబంధించి, ఆచార వ్యవహారాలకు సంబంధించిన పట్టు స్పష్టంగా కనబడటానికి బ్రాహ్మణ కుటుంబాల్లోనే వీలుంది. హనుమంతరావు విషయమే తీసుకొందాం. ఆయన విజయవాడలోవుంటూ ఉద్యోగం చేసుకొంటూకూడా బ్రాహ్మణ్ణి అన్న కులాహంకారాన్ని కాపాడుకొంటూవస్తున్నాడు. కాలానికనుగుణంగా, మారిన అవసరాల కనుగుణంగా పిల్లలకు చదువులుచెప్పించాడు. ఉన్న ఊళ్ళు వదిలి ఉద్యోగాలకు పోవటానికి ఒప్పుకొన్నాడు. హాస్టళ్ళల్లో ఉంటే భరించాడు. బ్రాహ్మణేతరులతో కలిసి ఒక చూరుకింద ఉంటే ఊరుకొన్నాడు. కాని ఇంటికొస్తే మాత్రం ఆచార వ్యవహారాల గురించి తన పట్టింపును ప్రదర్శిస్తాడు. కులాచారాలకు భంగం వస్తే కృష్ణలో దిగుతానంటాడు. భర్తగారి చాదస్తంతో ఎంత వేసట పడిందోగాని రాఘవమ్మ ఆచార విషయాల్లో అంతపట్టుదల మనిషి కాదు. మారుతున్న అవసరాల కనుగుణంగా ఆచారవ్యవహారాలను మార్చుకొంటే తప్పులేదనుకొంటుంది ఆవిడ. అందుకనే సుధకోసం చూసి వచ్చిన పెళ్ళికొడుకు తమ్ముడు ముస్లిం అమ్మాయిని పెళ్ళాడితే అది భర్తకు అభ్యంతరకరమైనట్లు రాఘవమ్మకు కాలేదు.



BRAOU

చదువు సంధ్యలరీత్యా, వృత్తి ఉద్యోగాల రీత్యా బయట భిన్నభిన్న కులాలవాళ్ళతో గడపటం ఎక్కువ కనుక సుధకు తన కులం గురించిన స్పృహ దాదాపు లేదు. ఆమెకు దగ్గర స్నేహితులు రుక్మిణి, కుముద- ఇద్దరూ బ్రాహ్మణేతరులే. అభిరుచులు, అభిప్రాయాలు మనుషుల్ని ఏకవేదిక మీదకు తీసుకొచ్చే ఆధునిక సమాజావసరాలలో రుక్మిణి, కుముద ఆమెకు స్నేహితులయ్యారు. అక్కడ కులమతాలతో నిమిత్తం లేదు. వాళ్ళతోకలిసితింటుంది. తిరుగుతుంది. ఉంటుంది. ఈజీవితవాసం నామమాత్రమైన కులాలను విస్మరించేట్లు చేసితీరుతుంది. సుధ కామేశ్వరరావును జీవితభాగస్వామిగా ఎన్నుకోవటంలో ఈక్రమం కనబడుతుంది.

సుధకు చెల్లెలు లలిత. ఆ అమ్మాయి ఎమ్మే చదివింది. చిన్నపాటి ఉద్యోగం చేసుకొంటుంది. కాని ఆమె అక్కలాగా తన కులతత్వాన్ని వదులుకోలేదు. తండ్రిలోని కులాహంకారం ఛాయలు ఆమెకు సంక్రమించి నట్లున్నాయి. చదువూ ఆధునిక సామాజిక జీవితమూ, అవసరాలూ ఇవేవీ ఆ అహంకారంమీద ప్రభావం చూపలేకపోయాయి. తాను బ్రాహ్మణ్నే పెళ్ళి చేసుకొని దాని గురించి గర్వపడుతుంది. అక్క అబ్రాహ్మణుడ్ని పెళ్లాడుతుందని తెలిసి కంటగించుకొంటుంది.

ఈ సమాజంలో నిత్యజీవితంలో ఉపయోగానికిరాని కులాన్ని గురించి పట్టించుకోని యువతరం ఒక పక్క తయారవుతూనే ఉంది. మరొకపక్క నిత్యజీవిత ఉపయోగితతో నిమిత్తం లేకుండా భావంలో కులాన్ని పోషిస్తూ 'నాన్నగారి తాతగారి భావాలకుదాసులై' ప్రవర్తించే వాళ్ళూ కొందరున్నారు. అయితే భవిష్యత్తు వాళ్ళది కానీ వీళ్ళదికాదు. ఈ విషయాన్ని రచయిత పార్వతీశం ద్వారా చెప్పిస్తారు. "బ్రాహ్మణ కుటుంబంలో పుట్ట డానికి ఈనాడు పెద్ద విలువ లేదు, లలితా! ఈనాడే కాదు. ఏనాడూ లేదు. చదువు, విజ్ఞానం, ఉద్యోగాలు, వృత్తులూ నేడు అన్ని కులాల వారికీ అందేశాయి. ఇంక మిగిలిందేమిటో తెలుసా! 'మేం బ్రాహ్మలం' అని దురభిమానాలకి పోవడం, లేనిపోని ద్వేషాలు కొనితెచ్చుకోవడమూను ..."

రామచంద్రరావుకూడా బ్రాహ్మడే. కాని ఆయనకు కులాచారాల మీద పెద్ద పట్టింపు లేదు. రాజకీయ ఉద్యమాల్లో పాల్గొని పనిచేసిన చైతన్యం ఆయనకా విశాలదృష్టిని ఇచ్చింది. సమాజం, అవసరాలు మారు తున్నాయి కనుక కులవ్యవస్థకున్న పట్టుకూడా క్రమంగా పోతుందని ఆయన నమ్మకం. "కులవ్యవస్థకు ఆర్థిక మైన పట్టు ఎన్నడోపోయింది. సామాజికమయిన పట్టుకూడా అంతరించినట్లే. ఇంక రాజకీయపు పట్టు కాస్త వుంది. అయితే అదీ ముచికకొడికి వచ్చిందనాలి" అని రామచంద్రరావు అభిప్రాయం. శ్రమ విభజన మీద నిర్దిష్టమైన వృత్తులతో ఉన్న సామాజిక వ్యవస్థ అంతరించటంతో కులవ్యవస్థకున్న ఆర్థికమైన పట్టు ఎన్నడో పోయింది. ఆధునిక సామాజిక వ్యవస్థ కులం గొప్పమీదకాక చదువు గొప్పమీద, పదవీ ఉద్యోగాల గొప్పమీద, డబ్బు గొప్ప మీద మనిషిని గౌరవించేస్థితికి వచ్చింది. అందువల్ల కులానికున్న సామాజిక పట్టుకూడా పోయింది. ఇక వెనుకబడిన కులాలవాళ్ళను ముందుకు తీసుకురావాలన్న ప్రభుత్వ రాజకీయ ఆచరణ కార్య క్రమాలవల్ల మాత్రమే కులవ్యవస్థ ఆస్తిత్వంలోఉంది. దాన్నే రామచంద్రరావు రాజకీయపు పట్టు అన్నాడు. అది కూడా పోతే కులవ్యవస్థ నామరూపాలు లేకుండా పోతుందంటాడు.

రామచంద్రరావుకు కులమతాలమీద పట్టులేదు. కనుకనే మూడోకొడుకు ముస్లిమ్ స్త్రీని చేసుకొంటే కాదనలేదు. కులాంతర మతాంతరవివాహాలు జరిగిపోతే ఇక కుటుంబాల గతేమిటని గుండెలు బాదుకొనే వాళ్ళకు సమాధానం ఆయన దగ్గర సిద్ధంగా ఉంది. పాతబడ్డ సామాజిక చట్రం నుండి కొత్త సామాజిక సమస్యలను చూడ్డంలో చిక్కువస్తుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, అమ్మాయిని అత్తవారింటికి పంపటం అనే భావనలనూ, ఆచారాలనూ దృష్టిలో పెట్టుకొని చూస్తేకులాంతర మతాంతర వివాహాల్లో ఎన్నో సమస్య లున్నట్లు కనబడతాయి. కానీ ఈనాటి సమాజార్థిక వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాలు దాదాపు పూర్తిగా విచ్ఛిన్నమై పోయాయి. అమ్మాయి అత్తవారింటికి వెళ్ళడమూ లేదు. స్త్రీ పురుషులిద్దరూ తమ వృత్తి ఉద్యోగాలు చేసుకొంటూ వేరు కాపురాలుంటారు. అప్పుడిక సమస్యేలేదు.

గతానుగతికంగా పచ్చేధర్మాలను ప్రశ్నించకుండా, మార్చటానికి ప్రయత్నించకుండా యథాతథస్థితిలో బ్రతకడానికి సిద్ధపడే వ్యక్తుల కోవలోని వాడు నరసింహమూర్తి. ఆయనకు ప్రత్యేకంగా కులం పట్టింపు లేదు. లేదనిచెప్తుంటాడు. కానీ "మనకుఉన్నా లేకపోయినా మనచుట్టూ ఉన్న సమాజంలోఉంది. పట్టివుండడంకాదు. బలంగావుంది మనంకాదంటేపోతుందా?" అని,అదెట్లాగా పోదుకనుక తామూ దానినే అనుసరిద్దామనుకొంటాడు.

కామేశ్వరరావుకు, ప్రభాకరరావుకు, రుక్మిణికి కులం ఒకసమస్య కాలేదు. తమ నిత్య జీవిత అలావాట్లలో దాని ప్రమేయమేదీ లేదన్న విషయాన్ని గ్రహించారు. జీవులలో భౌతిక ఉపయోగంలో లేని ఏ అవయవమైనా నశిస్తుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఈ ప్రకృతి సూత్రం సమాజాలకు కూడా వర్తిస్తుంది. సమాజాలలో

BRAOU

కూడా నిత్య జీవితంలో ఉపయోగంలో లేని సంస్థలు. వ్యవస్థలు నశించకతప్పదు. ఈ రకంగా కులం కూడా నశిస్తుంది. కామేశ్వరరావు, సుధ, ప్రభాకరరావు, రుక్మిణి తమ జీవితాలలో ముఖ్యఘట్టమైన పెళ్ళి దగ్గరకు వచ్చే సరికి కులం గురించి ఆలోచించకపోటం అందుచేతనే.

కులమతాచార సంప్రదాయాల పట్టింపు సనాతన వ్యవస్థా ధర్మం. ఆధునిక జీవిత దృక్పథం ఈ పట్టింపులను తిరస్కరిస్తుంది. సమాజాలు ఆధునీకరించబడే క్రమంలో నశించబోయే ధర్మం, దింపుడు కళ్ళం ఆశతో బతుకుతుంది. కొత్తధర్మంతో సంఘర్షిస్తుంది. ఈ సంఘర్షను చిత్రంచటం నవలేతి వృత్తంలో ఒక పార్శ్వం. అయినప్పుడు ఆ కులమతాచారాలు ఏ మాత్రం పట్టు సడలకుండా ఉండటానికి, ఉన్నట్లు స్పష్టంగా కనబడటానికి ఏ కులంలో వీలుందో ఆ కులాన్ని ఇతివృత్తనిర్మాణంలో పాత్రలకులంగా చెయ్యాల్సిఉంటుంది. కులాచారాలను గట్టిగాపట్టుకోడానికి, వదిలేస్తే వదిలేసినట్లు కొట్టొచ్చినట్లు కనబడటానికి వీలైనది బ్రాహ్మణ కులం. అందుకే మహీధర ఈ నవలలో పాత్రలను బ్రాహ్మలు, బ్రాహ్మలు కాని వాళ్లు అని రెండు రకాలుగా చూపించారు. హనుమంతరావు ద్వారా కులాచారాలకు బ్రాహ్మణ జాతి ఎంత ప్రాముఖ్యమిస్తుందో చూపించి అదే జాతివాడైన రామచంద్రరావును కులాచార సంప్రదాయాలకు వ్యతిరేకి అయిన సంస్కర్తగా నిరూపించారు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఉన్న సమాజంలో కదలికలను ప్రేరేపించటానికి వీలుగా సంస్కరణ బ్రాహ్మణ కుటుంబాలనుండే ప్రారంభమైన చారిత్రకవాస్తవికతను రామచంద్రరావు పాత్రద్వారా రచయిత ప్రదర్శించారు.

కులవ్యవస్థ మానవపురోగతికి ఆటంకంగాఉందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. కులవ్యవస్థను కూలద్రోయాలంటే కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని అనే వాళ్ళున్నారు. 'స్వయంవరణం' నవలేతి వృత్తంలో మూడు పెళ్ళిళ్ళు ఉన్నాయి. కుముదా రాజేశ్వరరావుల పెళ్ళి. అది పెద్దలు కుదిర్చి చేసిన పెళ్ళి. కులం. హోదా అన్ని చూసే చేశారు. సుధా కామేశ్వరరావుల పెళ్ళి. అది వాళ్ళంత వాళ్ళు ఒకరినొకరు కోరి చేసుకున్నారు. సుధ (బ్రాహ్మణ స్త్రీ) కామేశ్వరరావు బ్రాహ్మడు కాదు. రుక్మిణీ ప్రభాకరరావుల పెళ్ళి. ఇది కూడా పరస్పరం ఇష్టపడి చేసుకొన్నదే. ఇందులో రుక్మిణి (బ్రాహ్మణ స్త్రీ) కాదు. ప్రభాకరరావు బ్రాహ్మడు. రచయిత ఆదర్శంగా చూపిన రెండు జంటలదీ కులాంతర సంబంధమే. కుల వ్యవస్థను వ్యతిరేకించటంలో భాగంగా రచయిత కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నాడా? కాదు. అసలు పెళ్ళిళ్ళకు కులం ప్రాతిపదిక కాకూడదన్నది ఆయన దృష్టి. కులంలోనే పెళ్ళి జరగాలనే సంప్రదాయ వాదులకీ కులం బయటనే జరిగి తీరాలనే 'గోరా'వంటి వారికీ భేదం తక్కువని ఆయన అభిప్రాయం. (అరసికేషు కవిత్వ నివేదనం, సంవేదన, జులై 1968, అదనపు సమాచారంలో ఇచ్చాము. చూడండి) ఈ అభిప్రాయాన్నే నవలేతివృత్తంలో రామచంద్రరావు పాత్ర ద్వారా చెప్పించారు. (పు. 48) అయితే నవలలో ప్రధాన జంటలు వేరు వేరు కులాలవాళ్ళు కావటం యాదృచ్ఛికం మాత్రమే. మంచయినా, చెడ్డయినా, ఉచితమయినా, అనుచితమైనా ఆశయసిద్ధి కోసం, కులవ్యవస్థ కూలిపోవటం కోసం, కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు జరగాలని చెప్పటం ఈ నవల ఉద్దేశం కాదు. కులం మానవ సంబంధాలకు ప్రాతిపదిక కాకూడదన్న విషయాన్ని చెప్పటం, నిత్య జీవితంలో ఉపయోగం లేని కులాన్ని వ్యతిరేకించమని చెప్పటం ప్రధానోద్దేశాలు.

'స్వయం వరణం' నవలేతి వృత్తంలో మహీధర రామమోహనరావు 'పెద్దవాళ్ళ ప్రమేయం లేకుండా పిల్లలు పెళ్ళిళ్ళుచేసుకోవాలి' అనేవిషయాన్ని ప్రధానంగా ప్రతిపాదించారు. పెద్దవాళ్ళే పెళ్ళిళ్ళు చేసేటప్పుడు కులం, గోత్రం, డబ్బు, హోదా, గౌరవం మొదలైన అనేక విలువలను చూస్తారు. తమ యిష్ట ప్రకారం వధూ వరులను ఎన్నికచేస్తారు. యువతీయువకులను తమ అదుపాజ్ఞలలో వుంచుకొంటారు. తమ అదుపాజ్ఞలలో వున్నందుకు ప్రతిఫలంగా తమ ఆస్తులను వాళ్ళకు పారంపర్యంగా సంక్రమింప చేస్తారు. కష్టానికీ సుఖానికీ మేమున్నామని వస్తారు. పెద్దవాళ్ళనుకాదని పిల్లలు తమ స్వంత వ్యక్తిత్వాలతో మంచి విలువలతో ప్రమేయం లేకుండా తమకు నచ్చిన వాళ్ళను పెళ్ళిళ్ళు చేసుకోవాలి అంటారు మహీధర. యువతీయువకులు ఆ రకంగానే పెళ్ళిళ్ళు చేసుకొనేట్లయితే, పెద్దరికపు అహం దెబ్బతిన్న తల్లిదండ్రులు తమకూ పిల్లలకూ ఋణం తీరి పోయిందనుకొంటారు. అన్ని విషయాలలో వాళ్ళకు దూరంగా ఉంటారు. అటువంటప్పుడు తమ జీవితాలకు తామే బాధ్యత వహించాల్సి వస్తుంది-ఈ యువతీయుకులందరికీ, స్వంతంగా ఆలోచించి ప్రవర్తించటానికీ, ధైర్యంగా నిలబడటానికీ, పారంపర్యంగా వచ్చే ఆస్తులు లేకపోయినా కనీసావసరాలు తీర్చుకోగల ఆర్థిక స్వాస్థ్యం పొందటానికీ ఆ యువతీయువకులకు తమ బ్రతుకు తెరువులను తాము చూసుకోగల అవకాశముండాలి.

మధ్య తరగతి యువతీయువకులకు బ్రతుకు తెరువంటే ఏదో ఒక ఉద్యోగం చేయటమే. ఈ ఉద్యోగాలు చేయటానికి అర్హతనిచ్చేది చదువు. అందువల్ల తమఇష్టాలమీద స్వంత పూచీమీద బ్రతకదలచిన వాళ్ళకు చదువు వుండాలి. ఉద్యోగముండాలి. చదువుకోటం, ఉద్యోగం చేయటం పురుషలక్షణాలుగా ఈ

BRAOU

సమాజం అంగీకరించివుంది. అందువల్ల వాళ్ళు చదువుకోవటానికి, ఉద్యోగాలు చేయటానికి ఏ అభ్యంతరాలు లేవు. స్త్రీ పురుషులు తమ యిష్ట ప్రకారం ఒకళ్ళ కొకళ్ళు నచ్చి వివాహాలు చేసుకోవాలన్నప్పుడు అక్కడ స్త్రీ పురుషులు సమానస్థాయికలవాళ్ళై ఉండాలి. అప్పుడు స్త్రీలుకూడా చదువుకొని ఉద్యోగాలు చేయగలుగుతారు. మానసికధైర్యాన్ని కలిగి ఉంటారు. స్వంతంగా ఆలోచించగలుగుతారు. నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

'స్వయంవరణం' నవలలో రుక్మిణీ సుధలిద్దరూ ఎమ్మెస్సీ పూర్తిచేసుకొన్నవాళ్ళు. రుక్మిణి రీసెర్చిలో వుంది, సుధ ఉద్యోగంలో వుంది. ఆ చదువు, ఆ ఉద్యోగం స్త్రీలకు ఆత్మ విశ్వాసాన్నీ ఆత్మ గౌరవాన్నీ, స్వయం నిర్ణయాధికారాన్నీ ఇస్తాయని ఇతివృత్త పరిణామంలోభాగంగా రచయిత నిరూపిస్తారు. పాతికేళ్ళు వచ్చి చదువులతో ఉద్యోగాలతో అనుభవం గడించి లోకం తెలుసుకున్నారు కనుక జీవితాన్నెదుర్కోగల చేవ వుంది వాళ్ళకు. రుక్మిణి తనను పెళ్ళి చేసుకోదలచినవాడు స్వయంగా వచ్చి తననావిషయం అడగాలనుకొంటుంది. చదువుకొని ఉద్యోగం చేసుకొనే ముప్పయేళ్ళ యువకుడు పెళ్ళి కోసం తండ్రి మీద ఆధారపడితే ఆశ్చర్య పడుతుంది. తన జీవితంలో ప్రభాకరరావు ఎదురు పడ్డప్పుడు అతనిపట్ల తన ఆకర్షణను తానే విశ్లేషించుకొని అతన్ని పెళ్ళాడటం గురించిన నిర్ణయం తీసుకోగలిగింది. ఆ పెళ్ళి గురించిన ప్రస్తావన అతని వైపు నుండే రావాలని అనవసరపు సిగ్గునటించదు. తన అంగీకారాన్ని ప్రవర్తనలో చూపుతుంది. అట్లా చూపటానికి ముందు దాని నతడు అలుసుగా తీసుకొని అసభ్యంగా ప్రవర్తిస్తాడేమోనని అనుమాన పడుతుంది ఒక క్షణం. మరుక్షణం అతడంత అల్పబుద్ధినే ప్రదర్శిస్తే అక్కడికక్కడ బుద్ధి చెప్పి వచ్చేద్దామని అనుకొంటుంది. అట్లాగే సుధ పెద్ద వాళ్ళు, హెచ్చరికల పేరు మీద యువతను ముందడుగు వేయకుండా నిరోధిస్తున్నారని గ్రహిస్తుంది. తన విజ్ఞానంతో, తన వ్యక్తిత్వంతో కామేశ్వరరావును పెళ్ళాడే నిర్ణయం తీసుకొంటుంది. ఆ రకంగా చదువు అందువల్ల వచ్చిన సదసద్వివేకజ్ఞానమూ ఆర్థిక భద్రత స్త్రీని తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తానే తీసుకొని తనకు తానే బాధ్యత వహించి ప్రవర్తించేట్లు చేస్తాయని ప్రత్యేకంగా సిద్ధాంతంగా చెప్పకపోయినా రుక్మిణీ సుధల ప్రవర్తనలో దాని ఆచరణ రూపాన్ని రచయిత ప్రదర్శిస్తారు. చదువులు వ్యక్తిత్వవికాసానికి తోడ్పడతాయి. కానీ లలితలాంటి వ్యక్తుల దగ్గర చదువులవల్ల కలిగిన మనోవికాసం ఏదీ కనబడదు.

స్త్రీవిద్య పట్ల రచయితకు గౌరవం ఉంది. రుక్మిణీ సుధలు కాక నవలలో దాదాపు వాళ్ళ ఈడువాళ్ళే మరో ముగ్గురు స్త్రీలు - కుముద, విజయ, లలిత ఉన్నారు. ఈ ముగ్గురు కూడా పోస్టుగ్రాడ్యుయేట్లే. ఆ లెక్కన నవలలోని యువతులందరినీ చదువుకొన్న వాళ్ళుగా చిత్రించటం ద్వారా రచయిత, స్త్రీలందరూ మంచి చదువులు చదువుకుని ఉండటాన్ని ఆశించారు. అయితే చదువుకున్న స్త్రీలందరూ ఉద్యోగాలు చేయాలా అన్న విషయంలో ఇతివృత్తంలో ఖచ్చితమైన అభిప్రాయాలు కనబడవు. అంతవరకు ఉద్యోగం చేస్తున్న కుముద పెళ్ళి తరువాత ఆ విషయం పట్టించుకొన్నట్లు లేదు. విజయ వ్యాపారం చేసుకొనే భర్తకు చేదోడు వాదోడుగా పనిచేసుకుపోతుంటుంది. లలిత భర్తది చిన్న ఉద్యోగం కనుక కాస్త మంచి బట్ట కట్టటానికి, స్నోలు, పౌడర్లు కొనుక్కోవటానికి వీలుండదు గదా అని ఉద్యోగం చేసుకొంటుంది. అంతకు మించి సామాజిక ఉత్పత్తి రంగాలలో పాల్గొనటం ద్వారా స్త్రీ సాధించే ఆర్థిక స్వాతంత్రం ఆమెనెంత ఉన్నతంగా నిలబెట్టగలుగు తుందో, పురుషస్వామ్య సమాజంలో స్త్రీకి ఎదురయ్యే అనేకానేక సమస్యలను పరిష్కరించుకోవటంలో అది ఎట్లా తోడ్పడుతుందో చెప్పటం ఇతి వృత్త నిర్మాణ వ్యూహంలో లేదు.

## అభ్యాసం – 1

కింది ఖాళీలో మీ సమాధానం రాయండి. భాగం చివర ఇచ్చిన జవాబుతో సరిపోల్చుకొండి.

1. ఈ నవలేతివృత్తంలో మహీధర ప్రధానంగా ప్రతిపాదించింది ఏమిటి?
(10 పదాలకు మించకుండా రాయండి)

2. కులవ్యవస్థపట్ల రచయిత దృష్టి ఏమిటి ( 25 పదాలకు మించకుండా రాయండి)

## 2.5 పాత్రచిత్రణ

పాత్రచిత్రణ అన్నది నవలా శిల్పంలో ఒక ప్రధానమైన అంశం. స్వయంవరణం నవలలో 81 పాత్రలున్నాయి. మొదట పాత్రచిత్రణ అనే భావనను పరామర్శించి స్వయంవరణం నవలలో ప్రధానమైన పాత్రల్ని పరిశీలిద్దాం.

### 2.5.1 పాత్రచిత్రణ అంటే ...

నవల మానవజీవితాన్ని భిన్న భిన్న కోణాలనుండి చిత్రిస్తుంది. నవలలోమానవ జీవితాన్ని చిత్రించటమంటే మానవుల జీవితవిధానాన్ని వర్ణించటమే. మానవ జీవిత విధానం వారు నివసించే దేశకాల ప్రభావాలకు లోనవుతూ పరిణమిస్తూ ఉంటుంది. అట్లా పరిణమించే మానవ జీవితాలను గురించి చెప్పదలచుకొన్నప్పుడు ఆ జీవితాలకు ప్రాతినిధ్యం వహించే వ్యక్తులను పాత్రలుగా స్వీకరించి రచయిత వాళ్ల చుట్టూ కథ నడిపిస్తాడు. చెప్పదలచుకొన్న ఏదో ఒక అంశం లేకుండా పాత్రలకు అస్తిత్వం ఉండదు. అట్లాగే పాత్రలు లేకుండా ఇతివృత్తానికి గమనం లేదు. జీవితానికి వ్యక్తులకూ ఎంత దగ్గర సంబంధమో, ఇతివృత్తానికి పాత్రలకూ అంత దగ్గరి సంబంధం. అందువేతనే నవలా విమర్శకులంతా పాత్రలను ఇతివృత్తం నుండి వేరుచేసి చూపటం సాధ్యం కాదన్నారు. కాబట్టి నవలేతివృత్తంలో విడదీయరానిభాగమై, దానిని నడిపిస్తూ ఇతివృత్త గమనానికి అనుగుణంగా పరిణమిస్తుండే వ్యక్తులే పాత్రలన్నమాట.

'పాత్ర' అంటే ఏమిటో తెలిశాక మనకెదురయ్యే ప్రశ్న పాత్రల స్వరూప స్వభావాలెట్లా నిర్దేశింపబడతాయి అనేది. పాత్రలకురూపురేఖలు దిద్దితీర్చటంలో స్వభావాలను చిత్రించటంలో రచయితకు తనజీవితానుభవం లోని వ్యక్తులు నమూనాగా పనిచేస్తారు. రచయితకు పరిచయమున్న వ్యక్తులు అదే రకంగా నవలలోకి వస్తారనుకొంటే అది భ్రమే. ఇతివృత్తాన్ని బట్టి, ప్రవర్తించవలసిన సంఘటననుబట్టి, చెప్పదలచుకొన్న భావాన్ని బట్టి ఆ పాత్ర రచయితకు పరిచయమున్న వ్యక్తికంటే భిన్నంగా, విశిష్టంగా రూపుదిద్దుకొంటుంది.

పాత్రల విశిష్ట స్వభావలక్షణాన్ని పాఠకుడు భావించుకోవటానికీ, చూడటానికీ వీలుగా రచనలో పాత్రను ప్రవర్తింపచేయటాన్ని పాత్ర చిత్రణమంటారు. పాత్రచిత్రణ ప్రధానంగా రెండువిధాలుగా ఉంటుంది. పాత్రలను స్వయంవ్యక్తాలయ్యేటట్లు, అంటే వాటంతటవిగా పాఠకులకు పరిచయమయ్యేటట్లు చేయడం ఒకరకం. పాత్రను గురించి రచయిత తానుగా పూనుకొని చెప్పటం రెండవరకం. పాత్ర చిత్రణలో ఒక్కొక్కసారి ఈ రెండు రకాలు కలిసి పోవచ్చుకూడా. పాత్రల భౌతికాకారాన్నీ, ఆలోచనలనూ, మాటలనూ, చర్యలనూ నిరూపించటం ద్వారా ఒక పాత్ర గురించి మిగిలిన పాత్రలు ఏమాలోచిస్తున్నాయో, ఏమంటున్నాయోచెప్పటం ద్వారా రచయిత నవలలో పాత్ర చిత్రణ చేస్తాడు.

పాత్ర అంటే ఏమిటో, పాత్ర చిత్రణ అంటే ఏమిటో ఇప్పుడు స్థూలంగా అర్థమైంది కదా! 'స్వయంవరణం' నవలలో పాత్రల గురించి పాత్రచిత్రణ గురించి తెలుసుకొందాం.

### 2.5.2 నవలలోని పాత్రల పరిచయం

'స్వయంవరణం' నవలలో మొత్తం 81 పాత్రలున్నాయి. ఇందులో స్త్రీ పాత్రలు 34, పురుష పాత్రలు 45, పిల్లలు ఇద్దరు (2). ఇందులో ప్రవర్తించిన పాత్రలు 37. ప్రస్తావించబడిన పాత్రలు 44. ప్రవర్తించిన

BRAOU

పాత్రలంటే కథాగమనంలో ప్రత్యక్షంగా మనకు కనబడేవి. ప్రస్తావింపబడిన పాత్రలంటే ప్రత్యక్షంగా కనబడే పాత్రల సంభాషణవల్లనో, ఆలోచనలవల్లనో రచయిత కథనం వల్లనో పరిచయమ్యేవి.

ప్రవర్తించిన పాత్రలు 37 అన్నాము. వాళ్ళతోపాటు నవలలో ప్రత్యక్షంగా రావిశాస్త్రి, బలివాడ కాంతారావు తదితరులయిన సుప్రసిద్ధరచయితలు పరిచయమవుతారు. ప్రస్తావించబడిన 44 పాత్రలకులోడు, నాస్తికోద్యమనాయకుడు గోరా, గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కం నాటకంలోని గిరీశం, అగ్నిహోత్రావధాన్లు కూడా ప్రస్తావించబడతారు.

నరసింహమూర్తి, రామచంద్రరావు తమ పిల్లల పెళ్ళిళ్ళ గురించి మాట్లాడుకొనే సందర్భంలో కులాంతర వివాహాలుచేయించటాన్ని ఉద్యమంగా సాగించిన గోరాగారి ప్రస్తావన వస్తుంది. అట్లాగే విశాఖ పట్నంలో రుక్మిణి, ప్రభాకరరావు, విజయలక్ష్మి సాహిత్యగోష్టికి హాజరయిన సన్నివేశాన్ని చిత్రించటంలో రచయిత ఆ సభలో రావి శాస్త్రిగారు ప్రసంగించారంటారు. విజయలక్ష్మి రావిశాస్త్రిని అన్నగారికి పరిచయం చేస్తుంది. అప్పుడు రావిశాస్త్రి గారు సభలో ఉన్న మిగిలిన రచయితలను వాళ్ళకు పరిచయం చేస్తారు. ఆ పరిచయాల సందర్భంగా ప్రభాకర రావు ఆయా రచయితల రచనలను గుర్తుచేసుకొన్నట్లుగా ఉంది. ఈరచనలు, బూచి, స్త్రీ. వాటి రచయితలు బలివాడ కాంతారావు, రంగనాయకమ్మ. ఆ సాహిత్యగోష్టి తరువాత తెలుగు సాహిత్యాన్ని గురించి ప్రభాకరరావు ఉద్దేశాలు తెలుసుకోవాలని రుక్మిణి పట్టుబడుతుంది. ఆ సందర్భంలో ప్రభాకరరావు "గిరీశం చెప్పినట్లు మనతో మాట్లాడడమే ఓ ఎడ్యుకేషన్అన్నమాట" అంటారు. సుధకోసం రామచంద్రరావుగారి కొడుకు గురించి విచారించటానికి వెళ్ళివచ్చిన హనుమంతరావు ఆ రామచంద్రరావు మూడో కొడుకు ముస్లిమ్ స్త్రీని పెళ్ళిచేసు కున్నాడు కనుక కులం చెడ్డవాడింటికి తన కూతుర్ని ఇవ్వనంటాడు. అతనట్ల అనటం అగ్నిహోత్రావధాన్ల బాణీలో ఉందంటారు రచయిత. ఇట్లా గోరా గురించి, గిరీశం గురించి, అగ్నిహోత్రావధాన్ల గురించి ప్రస్తావిం చటం కానీ, రావిశాస్త్రి తదితరులను నవలాకథలోకి ప్రత్యక్షంగా తీసుకురావటంకానీ ప్రత్యేకంగా ఇతివృత్తగమనా నికి దోహదం చేసేవికావు. రచయితకూ, పాత్రలకూ నాస్తికోద్యమంలో ఉన్న పరిచయాన్నీ, సాహిత్యరంగంలో ఉన్న అభినివేశాన్నీ వ్యక్తం చేయటానికి ఆ పాత్రల ప్రస్తావన, ప్రవర్తన కథలో భాగమైనాయి. నవలేతి వృత్తానికి తగిన వాస్తవిక సమాజ వాతావరణాన్ని కల్పించటానికి ఆ వ్యక్తుల ప్రస్తావన దోహదం చేసిన విషయం మరచిపోరాదు.

నవలలోని పాత్రచిత్రణ అనేది ప్రవర్తించే పాత్రల విషయంలోనే సాధ్యమవుతుంది. ప్రవర్తించే పాత్రలు విస్తృతమైన మానవ సంబంధాలలో ఉంటున్నాయని చూపటానికి ప్రస్తావించబడే పాత్రలు పనికి వస్తాయి. ఈ ప్రస్తావించబడే పాత్రలు నవలేతివృత్తానికి విశాలమైన జీవిత భూమిక ఉండటాన్ని ధ్వనింపచేస్తాయి. ప్రవర్తించని 37 పాత్రలలో అసలు సంభాషణలలో లేని పాత్రలు 7 ఉన్నాయి. ఈ పాత్రలు కథాగమనంలో మిగిలిన పాత్రలతో కలిసి ప్రవర్తిస్తాయి కానీ సంభాషణలో పాల్గొనవు. అట్లాగే నవల మొత్తం మీద ఒకటి రెండు సంభాషణలు మాత్రమే ఉన్న పాత్రలు 13.

మహీధర రామమోహనరావు ఈనవలలో మారుతున్న, మారవలసిన వివాహవ్యవస్థ గురించి చెప్పదలచుకొన్నారు. ఆ చెప్పదలచుకొన్న దానిని ఒక సిద్ధాంతంగా చెప్పటానికి రామచంద్రరావు పాత్ర సృజించబడింది. ఆ చెప్పదలుచుకొన్న దాని ఆచరణ రూపానికి ప్రాతినిధ్యం వహించేటట్లు సుధ కామేశ్వరరావులు, రుక్మిణీ ప్రభాకరరావులు పాత్రలుగా మలచబడ్డారు. పెద్దల ప్రమేయం లేకుండా ప్రేమించి పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకొన్న సుధా కామేశ్వరరావులకు నైతిక బలాన్ని సమకూర్చే క్రమంలో కుముద, శ్యామూల్, మార్తమ్మ, రఘురామయ్య పాత్రలుగా ముందుకు తీసుకురాబడ్డారు. రుక్మిణీ ప్రభాకరరావులకు నైతిక ధైర్యాన్ని ఇవ్వటానికి తోడ్పడే పాత్రలు వినోద, విజయలక్ష్మి, కుటుంబరావు ఈ పన్నెండు మంది (12) ఒక సామాజిక స్వభావం కలిగి, ఒక ప్రయోజనం కోసం ఒక పక్షం వహించిన పాత్రలు. కులం పేరు మీదనో, డబ్బూ హోదాల పేరు మీదనో పిల్లలు ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకోవటాన్ని వ్యతిరేకించే పక్షం మరొకటి ఉంది. ఆ పక్షంలో సుధ తల్లిదండ్రులు రాఘవమ్మ, హనుమంతరావు కామేశ్వరరావు తల్లిదండ్రులు రంగనాయకమ్మ, సుబ్బారాయుడు, రుక్మిణి తల్లిదండ్రులు సుందరమ్మ నరసింహమూర్తి ఉన్నారు. వీళ్ళ మొత్తం ఆరుగురు. దీనిని బట్టి చూస్తే ఈ నవల మొత్తం మీద ముఖ్య పాత్రలు 18 అని స్పష్టమవుతుంది. మొదటిపక్షంలోనే పన్నెండుమంది భావాలకూ, ప్రయోజనాలకూ రెండవ పక్షంలోని ఆరుగురి భావాలకూ, ప్రయోజనాలకూ మధ్య తలయెత్తే వైరుధ్యమే నవలేతివృత్తాన్ని నడిపిస్తుంది. ఈ రెండు పక్షాలలో ఏదో ఒక దాన్లో ప్రత్యక్షంగా చేరి కనబడకపోయినా, భావాలలో చెరొక పక్షాన్ని సమర్థించే మరో రెండు పాత్రలున్నాయి. అవి లలిత, పార్వతీశం పాత్రలు. పార్వతీశం స్వభావరీత్యా మొదటిపక్షానికి దగ్గర. లలిత రెండవ పక్షానికి దగ్గర.

మహీధర రామమోహనరావు పాత్రలను గురించి తానుగా జోక్యం తీసుకొని ఏదీ చెప్పటానికి ప్రయత్నించరు. పాత్రల భౌతిక రూపాన్ని కానీ, స్వభావాన్నీ కానీ, ఆ పాత్రల గురించి మిగిలిన పాత్రలు ఏమనుకుంటున్నాయో చెప్పడం ద్వారా స్ఫురింపచేస్తారు. తమ ఆలోచనద్వారానో, మాటలద్వారానో పాత్రలు స్వయం వ్యక్తాలయ్యేట్లు చేస్తారు. ఈ నవలో దాదాపుగా అన్ని పాత్రలు ముందు పరిచయమేదీ లేకుండా సరాసరి నవలారంగం మీదికి నాటకీయంగా ప్రవేశపెట్టబడ్డాయి. కుముద గురించి, విజయలక్ష్మి గురించి, లలిత గురించి, మాత్రమే ఇతర పాత్రల ద్వారా ముందు కొంత సమాచారమివ్వబడింది.

ఇప్పుడు మరికొన్ని పాత్రల గురించి, అవి చిత్రించిన తీరు గురించి చూద్దాం.

### 2.5.3 రామచంద్రరావు

రచయిత, వివిధ విషయాల మీద తన అభిప్రాయాలను ప్రకటించటానికి ఈ పాత్రను వాడుకొన్నారు రచయిత. మహీధరకూ, రామచంద్రరావుకూ సమాన ధర్మాలు కూడా ఉన్నాయి. మహీధర వైదిక బ్రాహ్మడు. నవలలో రామచంద్రరావు కూడా అంతే. మహీధర రాజకీయాలలో పనిచేశారు. రామచంద్రరావు కూడా అంతే. నవలలో రామచంద్రరావు ఎదిటి వాళ్ళతో చర్చల్లోకి దిగేపద్ధతిలోనూ, యువతీ యువకులతో అభ్యుదయ కరమైన అంశాల గురించి మాట్లాడటంలో చూపే ఉత్సాహంలోనూ మహీధర ముద్ర స్పష్టంగా కనబడుతుంది.

రామచంద్రరావు రుక్మిణి తండ్రి నరసింహమూర్తి స్నేహితుడిగా నవలలో పరిచయమవుతాడు. నరసింహ మూర్తి ఇంట్లో భోజనాల దగ్గర జరిగిన సంభాషణలో రామచంద్రరావు ప్రత్యేక వ్యక్తిత్వం పాఠకులకు పరిచయ మవుతుంది. ఆ వ్యక్తిత్వం మారుతున్న సమాజానికనుగుణంగా పరిణమించింది. ఈ అభ్యుదయ వ్యక్తిత్వంలోని విశిష్టతలను కొన్నింటిని సంభాషణలలో వ్యక్తమయ్యేట్లు రామచంద్రరావు పాత్రను మహీధర చిత్రించారు. ఆ విశిష్టతలు : 1. తన కుటుంబంలో జరిగిన మతాంతర వివాహాన్ని అంగీకరించటం. 2. చదువులు, ఉద్యోగాలు, పరిశ్రమలు అభివృద్ధి కావటం మొదలైన ఆధునిక సామాజిక అవసరాల దృష్ట్యా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అస్తిత్వాన్ని కోల్పోతున్నదని గ్రహించటం. 3. మారుతున్న సమాజంలో తానూ మారుతూ వ్యష్టి కుటుంబాన్ని సమర్థించటం. 4. దానితోపాటు గ్రామీణ నాగరికత, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రసాదించిన భావజాలాన్ని అంటే అమ్మాయి అత్తవారింటికి వెళ్ళటంవంటి వాటిని వదల్చుకోవాల్సిన అవసరాన్ని గుర్తించడం.

మరునాడు రుక్మిణితోనూ, నరసింహమూర్తితోనూ రామచంద్రరావు పెళ్ళి విషయమై చర్చిస్తాడు. పెళ్ళిళ్ళ నిర్ణయాధికారం వధూవరులకు వదిలేస్తే బాగుండుననే ఆలోచన వెల్లడిస్తాడు. కాలం కానీ, డబ్బు కానీ, ఈ విషయంలో ఒక నిర్ణయానికి రావటానికి వాళ్ళను బలవంతపెట్టరాదన్న ధోరణిని వ్యక్తపరుస్తాడు. కుముద పెళ్ళిలో సుధ తదితరులతో చర్చిస్తాడు. ఈ చర్చ గమనిస్తే, రామచంద్రరావు కులవ్యవస్థకు వ్యతిరేకి అని స్పష్టమవుతుంది. సమాజంలో సంభవమవుతున్న మార్పును అదెంత చిన్నదైనా దానిని అందిపుచ్చుకొని ముందుకు తీసుకుపోవాలన్న దృష్టి రామచంద్రరావుది. మార్పుకి అనుకూలంగా మనుషులు, మనస్తత్వాలు సర్దుకుపోవాలన్న ఆలోచన అతనిది.

నవలలో మొత్తం ఆరు సన్నివేశాలలో రామచంద్రరావు కనబడతాడు. కనబడిన ప్రతిసారీ రామచంద్రరావు పాత్ర మిగిలిన పాత్రలను కమ్మేసి ప్రవర్తిస్తుంది.

### 2.5.4 సుధ

నవలలో సుధ పాత్ర ప్రవర్తనకంటే, ఆ పాత్ర గురించి ఇతరులు అనుకొనేది ఎక్కువ. తద్వారానే ఆ పాత్ర చిత్రితమవుతుంది. నవల ప్రారంభంలో రైలు స్టేషన్‌లో సుధ పాత్ర పరిచయమవుతుంది. రుక్మిణికీ మరో ప్రయాణీకుడికి జరిగిన సంభాషణ ద్వారా సుధ చదువు, ఉద్యోగం, కులం మొదలైన వివరాలన్నీ తెలుస్తాయి. ఏలూరి నుండి వాళ్ళతో కలిసి విజయవాడవరకూ ప్రయాణం చేసిన రఘురామయ్యకు ఆ కాసేపట్లో ఆమె తెలివి, అందం, మంచితనం, నెమ్మది ఆకట్టుకుంటాయి.

సమాజంలో వస్తున్న మార్పును అర్థం చేసుకునే ఆలోచనా దృష్టికల వ్యక్తిగా సుధ పాత్ర చిత్రితమైంది. ఆర్థిక పరిస్థితులూ, దూరాభారాలూ బంధుత్వాలను మరిచిపోయేట్లు చేశాయి. వ్యష్టి కుటుంబాలు ఏర్పడిన పట్టణ, నగర సమాజాలలో మానవ సంబంధాలలో బంధుత్వాల కంటే స్నేహ సంబంధాలు ప్రాముఖ్యం వహిస్తున్నాయి. ఆ కారణంగానే మేనమామ కూతురికంటే, కుముద తనకు దగ్గరది



BRAOU

ప్రభాకరరావు రామచంద్రరావు కొడుకు. తండ్రిలాగానే సమకాలీన సమాజంలో వస్తున్న మార్పులను గుర్తించినవాడు. రుక్మిణికోసమే రుక్మిణిని పెళ్ళాడటానికి సిద్ధపడ్డాడు. తలాతోకాలేని కులాలూ, శాఖలు అంతరాలతో తనకు పనిలేదనటంలో ప్రభాకరరావు అభ్యుదయ దృష్టి కనబడుతుంది.

ప్రభాకరరావు తండ్రి అభ్యుదయభావాలు కలవాడే. ఆయన ఒకకొడుకు మతాంతర వివాహాన్ని చేసుకొంటే అభ్యంతరం పెట్టలేదు. అటువంటి తండ్రికి కూడా రుక్మిణితో తన పెళ్ళి విషయం నేరుగా చెప్పడు. "వాళ్ళ మంచితనాన్ని మనం ఎందుకు పరీక్షకు పెట్టాలి?" నిజమో భ్రమో ఈ విషయాన్ని వాళ్ళూ అంగీకరిస్తూన్నారనుకొందాం. దానిని అబద్ధం అనిపించుకొని మనస్సును ఎందుకు బాధపెట్టుకోవాలి ..." అని అంటాడు.

### 2.5.8 రఘురామయ్య

ఈయన కామేశ్వరరావు పెత్తండ్రి. సుధ కామేశ్వరరావుల మధ్య ఉన్న ప్రేమబంధాన్ని పసిగడతాడు. కామేశ్వరరావును మాటలలోదించి సుధ మీద అతని కున్న ప్రేమను బయటపెట్టిస్తాడు. తమ కులం కాకపోయినా సరే, కట్నకానుకలు రాకపోయినా సరే ఆమెనే పెళ్లాడమని కామేశ్వరరావుని ప్రోత్సహిస్తాడు.

ఈ నవలలో రామచంద్రరావు తరువాత, పిల్లల ఇష్టప్రకారం పెళ్ళిళ్ళుకావాలని వాంఛించిన ముందు తరం వ్యక్తి రఘురామయ్యే. అందుకు స్వానుభవం కారణం. తన కొడుకు విషయంలో తాను ఎదురుదెబ్బ తిన్నాడు. మెడలువంచి పెళ్ళిళ్ళయితే చేయవచ్చుగానీ ఆ స్త్రీ పురుషులను కలిసిఉంచేట్లు చేయటం ఎవరి సాధ్యమూ కాదని రఘురామయ్య జీవితానుభవం. ఇద్దరుపిల్లల తండ్రి అయ్యాక తనకొడుకు తనకిష్టమైన స్త్రీతో వెళ్ళిపోయిన అనుభవం ఆయనకు గుణపాఠం నేర్పింది. కుముద పెళ్ళి సందర్భంలో మాత్రమే కనిపించే పాత్ర ఇది.

### 2.5.9 కుటుంబరావు

రచయిత, జీవితంపట్ల తన భావాలను తెల్పటానికి రామచంద్రరావు తరువాత కుటుంబరావు పాత్రను బాగా ఉపయోగించుకొన్నారు. కుటుంబరావు ప్రభాకరరావు చెల్లెలు విజయలక్ష్మి భర్త. విశాఖలో ఏదోషాపు పెట్టుకొన్నాడు. స్నేహస్వభావంకలవాడు. రెండే రెండు సన్నివేశాలలో కనబడతాడు. రుక్మిణి ప్రభాకరరావులు పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకొన్న విషయం తల్లిదండ్రులకు చెప్పాలావద్దా అన్న చర్చ వచ్చినప్పుడు ప్రభాకరరావును సమర్థిస్తూ కుటుంబరావు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఒక విధంగా రచయిత అభిప్రాయాలే. చదువుకొని ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళూ, పెళ్ళి విషయంలో పెద్దలమీద ఆధార పడటం. పెద్దలు వాళ్ళ పెళ్ళిళ్ళు నిర్ణయించే పనిచేయటం అసహ్యకరమంటాడు. పెద్దవాళ్లు తమ శాసనం చెల్లించు కొనేందుకు పితృభక్తి మాతృభక్తి బోధించారంటాడు. మగపిల్లలు, ఆడపిల్లలు పుటిందే ఒకళ్ళనొకళ్ళు మోసంచేసుకోవటానికే అన్న భావాన్ని ప్రచారంచెయ్యటాన్ని నిరసిస్తాడు. పెద్దల ప్రమేయం లేకపోతే యువతరం బ్రతుకులు బాగుంటాయంటాడు. ఏయువకుడైనా ఒక యువతిని పెళ్లిచేసుకోవాలనే సద్బుద్ధితోనే వ్యవహరిస్తాడనీ, ఇరుపక్షాల పెద్దవాళ్ళు కలిసి డబ్బుపేర, కులంపేర, హోదాపేర ఆ మంచి వాతావరణాన్ని నాశనం చేస్తారనీ విమర్శిస్తాడు.

నవలేతివృత్తంలో రామచంద్రరావు పాత్ర వివాహవిషయంలో చెప్పిన అభిప్రాయాలకు ఆయన పని చేసిన రాజకీయ ఉద్యమాల పునాది ఉంది. కుటుంబరావు పాత్రకు అటువంటి పునాది స్పష్టంగా కనబడదు. కుటుంబరావు పాత్ర క్రమంగా వికసించిన పాత్రకాదు. హఠాత్తుగా నవలేతివృత్తంలోకి ప్రవేశించి రచయిత అభిప్రాయాలను ప్రతిధ్వనించి ఊరుకొంటుంది.

### 2.5.10 మరి కొన్ని పాత్రలు – పరిచయం

నవలలో సుధ తల్లిదండ్రులు రాఘవమ్మ, హనుమంతరావు ఉన్నారు. హనుమంతరావు స్కూలు మేష్టారుగా చేసి రిటైరయ్యాడు. సుధ కాక పైకి రావలసిన పిల్లలున్నారు వాళ్ళపోషణ అంతా సుధమీదనే. తన సంపాదనతో సంసారాన్ని నడిపిస్తున్న కూతురికి పెళ్ళయితే ఆ ఆధారం కాస్తా పోతుందేమోనని ఆమెకు పెళ్ళి సంబంధాలు చూడడు. హోటళ్ళలో కాఫీకూడా తాగని ఛాందసత్వం ఒకవైపున ఉంది, ఆడపిల్లలను చదువుల



BRAOU

కోసం, ఉద్యోగాలకోసం పై ఊళ్ళలో ఉండనిచ్చే వ్యాపార కుసంస్కారం మరొకవైపున ఉంది. మంచి సంబంధం వచ్చినా కుంటిసాకులు చూపి కూతురి పెళ్ళి కలిసిరాకుండా ప్రవర్తించిన హనుమంతరావు పాత్రమీద సహజంగా ద్వేషం కలుగుతుంది. అసహ్యం పెరుగుతుంది. తమ సంసారాలకోసం పిల్లల పెళ్ళి బాధ్యతను విస్మరించి ప్రవర్తించే హనుమంతరావులాంటి వ్యక్తులు ఉండవచ్చు. అయినావాళ్ళు తమ కన్నపిల్లల సౌఖ్యాన్ని కూడా బలిపెట్టే అమానుష లక్షణాల నెందుకు పెంచుకున్నారో ఆ మూలాలను గుర్తించాలి. ఆర్థిక భద్రతలేనప్పుడు, దానికే సమాజం బాధ్యత వహించనప్పుడు జీవికకోసమైన పోరాటంలో తల్లిదండ్రులు లేరు, అన్నదమ్ములు లేరు ... అందరూ ఒకళ్ళనొకళ్ళు పీడించుకు తినేవాళ్ళే. మగపిల్లవాడిమీదనయితే తల్లిదండ్రులకు హక్కేమీ ఉండదు. అటువంటప్పుడు ఆర్థిక భద్రతలేని హనుమంతరావు కూతురిమీద హక్కును వదులుకోవటానికి ఇష్టపడకపోవటం సహజం.

రుక్మిణి తల్లిదండ్రులు సుందరమ్మ, నరసింహమూర్తి సమాజంలోని మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వాళ్ళకు ప్రతినిధులు. ఆర్థికభద్రత ఉంది. తమహోదాను చాటేంత కట్నమిచ్చి కూతురికి పెళ్ళిచేయటానికి సిద్ధమవుతారు. శ్రమపడవలసిన అవసరంలేదు. బాధ్యత వహించవలసిన అవసరం లేదు కాబట్టి కులాచార సంప్రదాయాలను అనుసరించుకుపోవటమే క్షేమమన్నది వీళ్ళదృష్టి.

కామేశ్వరరావు తండ్రి సుబ్బారాయుడు 'డబ్బుమనిషి' అని నరసింహమూర్తి మాటల ద్వారా తెలుస్తుంది. అంతకు మించి ఆ పాత్ర ప్రవర్తనకు నవలేతివృత్తంలో అవకాశం కల్పించబడలేదు. నవల చివర్లో ప్రవేశపెట్ట బడిన లలిత, పార్వతీశం పాత్రల ప్రయోజనమేమిటో అర్థంకాదు. మిగిలిన పాత్రనలన్నీ రేఖా చిత్రాలు. యథా వకాశంగా కథా ప్రయోజనానికి ఉపకరించాయి.

ఈ నవలలోని పాత్రలన్నింటిలో ఒక పెద్ద లోపం ఉంది. రాచమల్లు రామచంద్రారెడ్డిగారన్నట్లు ఈ పాత్రలు జీవితాన్ని జీవించవు; జీవితాన్ని చర్చిస్తాయి.

### అభ్యాసం – 2

కింది ఖాళీలో మీ జవాబు రాయండి. భాగం చివర ఇచ్చిన జవాబుతో సరిపోల్చుకోండి.

1. పాత్ర చిత్రణ అంటే ఏమిటి? (25 పదాల్లో రాయండి)

____________________________________________

____________________________________________

____________________________________________

____________________________________________

____________________________________________

## 2.6 నవల నిర్మాణం

వస్తువును నిర్దేశించుకొని, పాత్రలను ఊహించుకొని, సంఘటనలను సృష్టించుకొని, సన్నివేశాలను కల్పించుకొని ఇతివృత్తాన్ని పాఠకులకు ప్రదర్శించేక్రమంలో నవలలో నిర్మాణ శిల్పం చోటుచేసుకొంటుంది. వస్తువు శిల్పాన్ని నిర్ణయిస్తుందనటం ఇందు చేతనే.

వస్తు శిల్పాలలో ముఖ్యమైంది ఏదన్న చర్చ ఈ మధ్య తరచుగా తలెత్తుతున్నది. సాహిత్యానికి ఒక సామాజిక ప్రయోజనముందనే వాళ్ళు వస్తువు ముఖ్యం అంటారు. 'కళ కళకోసమే' అనే వాళ్ళు శిల్పం ముఖ్య మంటారు. ఏది చెప్తున్నారు అన్నది ఒకళ్ళకు ముఖ్యమైతే ఎట్లా చెబుతున్నారు అన్నది మరొకళ్ళకు ముఖ్యమవుతున్నది. సరి అయిన నిర్మాణ శిల్పం లేని వస్తువు నిర్జీవంగా కనబడే ప్రమాదముంది. నిర్మాణ శిల్పం వస్తువును మింగేస్తే అది లక్ష్యశుద్ధిలేని 'కళ' అవుతుంది. అట్లాకాక వస్తువుకి శిల్పానికి మధ్య సమతౌల్య స్థితి సమకూరినప్పుడు అది కళాఖండమవుతుంది.



BRAOU

నిర్మాణ శిల్పంలో భాగంగా పరిచయం చేస్తున్న విషయాలు, 1. దృష్టి కోణం 2. కథనం 3. శైలి.

### 2.6.1 దృష్టి కోణం

కథచెప్పేతీరు దృష్టికోణం. నవలలో కథ చెప్పేది రచయిత. ప్రథమ పురుషలో కథ చెబుతున్నపుడు, మధ్య మధ్య తాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంటాడు. రచయిత అంటే ఇక్కడ కథంతా రచయిత దృష్టికోణం నుండి చెప్పబడుతుందన్నమాట. రచయిత సర్వజ్ఞుడుగా అన్ని సంఘటనలకూ, సన్నివేశాలకూ సాక్షి భూతుడుగా ఉంటాడు. తన వస్తుశిల్పాల అవగాహన మేరకు వాటిని ప్రదర్శిస్తాడు. స్వయంవరణం నవలలో కథ అంతా రచయిత దృష్టికోణం నుండే ప్రదర్శితమవుతుంది. సమాజాన్ని గురించి, అందులో సంభవిస్తున్న మార్పుల గురించి, వివాహవ్యవస్థ గురించి, దానిలో రావలసిన మార్పుల గురించి రచయితకున్న అవగాహన పాత్రల ప్రవర్తనను నిర్దేశిస్తుంది.

నవలలో ఏదో ఒక పాత్ర దృష్టికోణం నుండి కూడా కథను నడిపించవచ్చు. ఈ రకమైన కథనంలో ఆయా సంఘటనకూ, సన్నివేశాలకూ వెనక రచయిత ఉన్నాడన్న అనుమానమేమీ కలగదు. స్వయంవరణం నవల చాలావరకు రచయిత దృష్టికోణం నుండే నడపబడినప్పటికీ రుక్మిణీ ప్రభాకరరావుల ప్రేమ పెళ్ళి సన్నివేశాలు ఎక్కువగా రుక్మిణి దృష్టికోణం నుండి నడుస్తాయి. రుక్మిణీ అంతరంగపుటాలోచనలను తన జోక్యమేదీ లేకుండా రచయిత సరాసరి పాఠకులకు ప్రదర్శించటంవల్ల సాధ్యమైంది.

### 2.6.2 కథనం

ఈ నవలలో కథ మూడు రకాలుగా చెప్పబడింది. 1. పాత్రల సంభాషణల ద్వారా 2. రచయిత చెప్పటం ద్వారా 3. పాత్రల అంతరంగాలు ప్రదర్శించబడటం ద్వారా. సంభాషణలద్వారా కథ నడపటంలో ఆ సంభాషణలో పాల్గొనే పాత్రలు పాఠకులకు ప్రత్యక్షంగా ప్రదర్శితమవుతాయి. ఇది నాటకీయ ప్రభావాన్ని కలిగిస్తుంది. నిజానికి సంభాషణాప్రధానమైన కథన శిల్పంలో రచయిత జోక్యం అవసరం ఉండదు. కానీ 'స్వయంవరణం' నవలలో పాత్రల సంభాషణలలో రచయిత వ్యాఖ్యాతగా ప్రవేశిస్తుంటాడు. ఒక పాత్ర ఒకమాట మాట్లాడితే దానికి ఎదుటివ్యక్తి ఎట్లా స్పందించిందీ రచయిత వ్యాఖ్యానిస్తాడు. ఆ తరువాతే ఆ రెండో పాత్ర సంభాషణలో పాల్గొంటుంది. ఉదాహరణకు నవల ప్రారంభంలో రైల్లో తోటి ప్రయాణీకుడు రుక్మిణిని ఉద్దేశించి సుధకు 'పెళ్ళి అయిందా' అని ప్రశ్నిస్తాడు. "ఆ ప్రశ్నలో రుక్మిణి ప్రత్యేకోద్దేశం వినబడింది ... ఆ ప్రశ్నలో ఆ ప్రశంస వెనుక ఒక ఆలోచన కూడా వుందేమోననిపిస్తూంది" అనే సుదీర్ఘ కథనం తరువాత రుక్మిణి ఆ ప్రశ్నకు సమాధానమిచ్చినట్లు ఉన్న విషయాన్ని గమనించవచ్చు.

BRAOU

పాత్రలు మాట్లాడుకొంటుంటే మధ్యమధ్య విషయం పాఠకులకు మరింత స్పష్టంగా, సమగ్రంగా అర్థం కావటం కోసం రచయిత కొంత సమాచారాన్ని కథనం ద్వారా తెల్పుతాడు. 'స్వయంవరణం' నవలలో ఈ రకమైన కథనం చాలా సందర్భాలలో కన్పిస్తుంది ఉదాహరణకు : సుధకు ఆమె తల్లి రాఘవమ్మగారికి స్నేహితులకు బంధువులకు మధ్య ఉన్న తేడా గురించి సంభాషణ సాగుతున్నప్పుడు రాఘవమ్మగారి అన్నగారి గురించి, ఆ అన్నాచెల్లెళ్ళ మధ్య ఉన్న రాకపోకల సంబంధాల గురించి రచయిత కథనం ద్వారా తెలుస్తుంది. ఇట్లా అనేక సందర్భాలలో కథను ముందుకు నడిపించటంలో భాగంగా, రచయిత తగు మాత్రంగా తాను జోక్యం చేసుకొంటాడు.

ఒక విషయాన్ని గురించి పాత్రలు ఎట్లా ఆలోచిస్తున్నాయో చెప్పటం కోసం, రచయిత ఈ నవలలో కథను పాత్రల అంతరంగాల ప్రదర్శన ద్వారా నడిపిన సందర్భాలున్నాయి. రుక్మిణి పెళ్ళి సంబంధం వచ్చినప్పుడు ఆమెను, సుధను పోల్చుకొని సుధనే పెళ్ళిచేసుకోవాలన్న నిర్ణయాన్ని దృఢతరం చేసుకొనే సందర్భంలో కామేశ్వరరావు అంతరంగపుటాలోచనలు పాఠకుల ముందుంచబడ్డాయి. రుక్మిణి విషయంలో ఇది మరీ ఎక్కువ.

శైలి : కథ చెప్పడానికి వాడే భాష శైలి. ఒక రచనలో భాషను వాడుకొనే నేర్పునూ, ప్రత్యేకతనూ శైలి అంటారు. రచనా విధానం అనేమాట ద్వారాకూడా శైలిని సూచిస్తారు. 'స్వయంవరణం' నవలలో శైలి ఎటువంటిదో పరిశీలిద్దాం. (శైలిని గురించి మీరు తెలుగు మౌలికఅంశాలులో కొంత వివరంగా తెలుసుకున్నారు).

ఈ నవలలో శైలి 'సరళశైలి' అంటే విషయాన్ని విశదంగా చెప్పటానికి ఉద్దేశించిన శైలి అన్నమాట. ఈ శైలిలో నిరాడంబరత ఉంటుంది. సాధారణంగా వైజ్ఞానిక విషయాలను చెప్పటానికి వాడే సరళశైలి కొడవటిగంటి కుటుంబరావులాంటి వాళ్ళు సృజనాత్మకంగా సాహిత్యంలో కూడా వాడారు. ఆధునిక వచన రచనకు ఒక 'ప్రమాణాన్ని' చేకూర్చారు. మహీధర రామమోహనరావుగారు కూడా ఈ నవలలో ఈ శైలినే వాడారు. వివాహ వ్యవస్థను గురించి కొత్తదృష్టిని ప్రచారం చెయ్యాలనే ఆయన ఆకాంక్ష అనివార్యంగా ఈ నవలకు 'సరళశైలి' ని ఒక అవసరంగా ముందుకు తెచ్చింది.

సంభాషణలలో నిత్యవ్యవహారంలో మధ్యతరగతి కుటుంబాలవారి వాడుకలో ఉండే వాక్య విన్యాసం ప్రధానంగా కనబడుతుంది. దానిలో సంభాషణలు సహజంగా సాగుతాయి. 'చెప్పకుండా వచ్చేసేవు' 'ఏ అర్థరాత్రో అపరాత్రో వస్తాడు'లాంటి వాక్యాలను ఈ నవలలో మీరు ఎన్నింటినో చూడవచ్చు.

ఒక విషయం మీద ఖచ్చితమైన అభిప్రాయం ఉండి ఆ అభిప్రాయాన్నే ప్రశ్నార్థక వాక్యరూపంలో సూచించటం కూడా నిత్యవ్యవహారినికి దగ్గరే. కూర్చోడానికి కుర్చీలే అవసరంలేదన్న అభిప్రాయాన్ని కామేశ్వరరావు "కూర్చోడానికి కుర్చీలే కావాలేమిటి? అన్న ప్రశ్న ద్వారా సూచించటం ఇలాంటిదే.

పాత్రలన్నీ ఒకే కులానికి చెందినవికావు. అయినా అందరి మాటతీరూ దాదాపు ఒకే రకంగా ఉంది. అందరూ చదువుకొని పట్నవాసం చేస్తున్నవాళ్ళు కావటంవల్ల ఈ 'ప్రామాణికత' సంభవించి ఉండవచ్చు. విద్యాధిక బ్రాహ్మణులయిన హనుమంతరావు, రామచంద్రరావు మాటల్లో మాత్రం సంస్కృతనాటకాలలో వాక్యాలు, నిత్యజీవిత పరిభాషలోని సాంప్రదాయిక పదాలు 'యంబ్రహ్మ'లాంటివి, సంస్కృతపదాలు 'మహానస మానిసి' లాంటివి కనబడుతాయి.

వాక్యంలో ప్రధానమైంది క్రియాపదం. క్రియాపదాన్నిబట్టి మాండలిక భేదాలను గుర్తించవచ్చు. ఈ నవలా కథనంలో వాడబడిన క్రియాపదాలన్నీ ఉభయగోదావరి జిల్లాలవారి వ్యవహారంలో కన్పించేవి. ఉదాహరణకు : లేచేరు, ప్రశ్నించేడు, చేసుడు మొదలైనవి. క్రియాపదాలీకరంగా ఉండటానికి రచయిత ఉభయ గోదావరి జిల్లాలవాడై ఉండడం కారణం కావచ్చు.

BRAOU

రచయిత తానుగా కథ చెప్పే శైలికీ, పాత్రల సంభాషణాశైలికీ, పాత్రల అంతరంగపుటాలోచనలు పని చేస్తున్న తీరు చెప్పబడినప్పటి శైలికి ఉండవలసిన భేదం ఉన్నట్లు ఈ నవలలో కనబడదు. రచయిత కథన శైలిలో తర్కబద్ధమైన చర్చాధోరణి కనబడుతుంది. జ్ఞానప్రధానదృష్టి ఇందుకు కారణం. పాత్రల సంభాషణాశైలి అంతరంగపుటాలోచనలు అక్షరరూపం తీసుకొన్నప్పటి శైలి ఇందుకు భిన్నంగా, విశిష్టంగా ఉండాలి. మానవ సంబంధాలలో, రాగద్వేషాలలో తరతమ భేదాలతో ప్రవర్తించే పాత్రల, మాటలలో జీవితాన్ని జీవించవలసిన పాత్రల సంభాషణలలో, అంతరంగపుటాలోచనలలో ఉద్వేగపూరిత జీవిత ప్రతిధ్వనులు వినబడాలి కానీ అవి అట్లా వినబడవు. సంభాషణలు చర్చలకే ఉపయోగపడ్డాయి. అంతరంగపుటాలోచనలూ తర్కబద్ధమైన వైజ్ఞానిక దృష్టిని ఇవ్వటానికి అన్నట్లు సాగాయి. ఈ కారణంచేతనే నవలలో మూడు రకాలైన కథన విధానాలున్నా, మూడురకాల శైలీ భేదాలు లేవు.

ఈ నవలా శైలిలో అక్కడక్కడా ముదలకించింది, పాటమరించింది, ఏకభాండాశనం, ఔద్ధత్యంలాంటి నిత్యవ్యవహారంలో లేని పదాలు, ఔచిత్యా నౌచిత్యాలు, నిత్యవినీతులులాంటి సంధిరూపాలు, పడుచువాళ్ళు అనుసరించే పరస్పరాకర్షణలాంటి అన్వయం సరిగాలేని వాక్యాంశాలు కనబడతాయి.

ఈ నవలలో శైలి ప్రధానంగా బోధనా శైలి. పాఠం చెబుతున్నట్లుగా ఉంటుంది. సంభాషణలు కానీ, రచయిత కథనంకానీ - ఏదైనా విజ్ఞాన ప్రధాన దృష్టి ప్రధానంగా సాగాయి. అందువల్లనే పాత్రల సంభాషణలు వివిధ విషయాలమీద - పెళ్ళిళ్ళ నిర్ణయంలో స్త్రీ పురుషుల పాత్ర, పెళ్ళిళ్ళయ్యాక వాళ్లకూ పెద్దలకూ ఉండే సంబంధం, కులభేధాలు మొదలైనవాటిమీద నడిచిన బృంద (Group discussions) చర్చల లాగా ఉంటాయి. రచయిత కథనం విశ్లేషణాత్మకమైన విమర్శలాగా ఉంటుంది. వీటివెనుక వివాహవ్యవస్థ గురించి తాను చెప్పవలసినదేదో ఉందన్న రచయితతపన, ప్రధానంగాఉంది. ఆతపనవల్లనే పాఠకులకు అందించవలసిన ప్రబోధం మీద దృష్టి నిలబడింది. ఆ దృష్టే రచయితశైలిని నిర్ణయించింది. రచయిత వ్యక్తిత్వమే నవలలోని ఈ శైలి

## అభ్యాసం – 3

కింది ఖాళీలో మీ జవాబు రాయండి. భాగంచివర ఇచ్చిన మాదిరి జవాబుతో సరిపోల్చుకోండి.

1. వస్తువు – శిల్పం అనే అంశాలలో దేని ప్రాముఖ్యం ఉంది? (10 పదాల్లో రాయండి)

## 2.7 రచయిత దృక్పథం

సమాజ జీవితాన్ని బాధ్యతాయుతంగా ఆలోచించే నిజాయితీకల ఏ రచయిత అయినా తన రచన ద్వారా జీవితంపై ఒక దృక్పథాన్ని కలగచెయ్యాలని ఆశిస్తాడు. తాను అనుభవం మీద ఎట్లాంటి జీవిత దృక్పథాన్ని ఏర్పరచుకొన్నాడో దానిని సాహిత్యం ద్వారా పాఠకులకు (శ్రోతలకుకూడా) అందించాలను కొంటాడు. నవలా సాహిత్యంలో రచయిత పాఠకులకు తన దృక్పథాన్ని పంచి ఇచ్చే అవకాశం ఎక్కువ.

మహీధర రామమోహనరావు, నవలలు సరదాకు రాసే రచయితకాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను హేతుబద్ధంగాతర్కిస్తూ ప్రదర్శిస్తూ జీవితంమీద ఒక దృక్పథాన్ని కలిగించటం కోసం ఆయన నవలలు రాశారు.

సమాజం నిరంతరం మారుతుంది. అభివృద్ధి మార్గంలో ముందుకు వెడుతుంది. సమాజం మారినంత త్వరగా మనుషులు మారలేరు. సంప్రదాయం పేర గతకాలపు సామాజిక భావజాలాలు వాళ్ళమీద ప్రభావం చూపుతుంటాయి. అవి ఈ అభివృద్ధి మార్గాన్ని అనుసరించటంలో జనం కొంత ఘర్షణకు లోనవటానికి కారణమవుతాయి. ఇక్కడ రచయిత ఏంచెయ్యాలన్న ప్రశ్నవస్తుంది. ఆ ప్రశ్నకు మహీధర దగ్గర ఖచ్చితమైన జవాబు ఉంది. రచయిత అయినవాడు ఆ ఘర్షణను అధిగమిస్తూ భూతకాలపు అలవాట్లూ ఆచారాలనుంచి, భావి కాలపు ఆదర్శాలనందుకొనేటందుకు మానవుడు నిరంతరం సాగించే ప్రయత్నాన్ని వేగవంతం చెయ్యా లన్నది ఆయన జవాబు. ఆయన రచనా లక్ష్యం, స్వయంవరణం నవల రాయటానికి ఏడేళ్ళముందే, 1961లో రాసిన "కత్తుల వంతెన" నవలలో మహీధర స్పష్టం చేశారు. 'కత్తుల వంతెన' నవలకూ 'స్వయంవరణం' నవలకూ పెద్ద తేడాకనబడదు. కత్తులవంతెనలో కనబడ్డంత జీవితమూ, సంఘర్షణా స్వయం వరణం నవలలో కనబడవు. కత్తుల వంతెనలో ఒకటే జంట కల్యాణి, రాజగోపాలం. మిగిలిన అనేక పాత్రలు వీళ్ళిద్దర్నీచుట్టుకొని ప్రవర్తిస్తాయి. రాజగోపాలానికి తను ప్రేమించిన స్త్రీని పెళ్ళి చేసుకోవాలనీ ఉంటుంది. కనీ, పెంచి, చదువులు చెప్పించిన తల్లిదండ్రుల మనసు కష్టపెడతానేమోనన్న సంఘర్షణా ఉంది. కాలంమీద అనుభవంమీద ఆ ఘర్షణ నుండి బయటపడి తన ఆదర్శాన్ని ఆచరణలోకి తీసుకొస్తాడతను. కల్యాణికి చదువు ఉద్యోగమూ దానిద్వారా లభించిన స్వతంత్ర జీవనమూ ఉన్నాయి. తండ్రి జాతీయోద్యమంలో పనిచేశాడు. అభ్యుదయ దృక్పథంకలవాడు. అన్న కమ్యూనిస్టు. ఇటువంటి వాతావరణంలో పెరిగి వ్యక్తిత్వాన్ని పెంచు కొంది. అందువల్లనే చిన్నప్పుడెప్పుడో ఊహ తెలియని వయసులో తనను పెళ్ళాడి అందంగాలేదని వదిలేసి, మళ్ళీ ఇన్నాళ్ళకు ఆ హక్కుతో తనతో కాపురంచేయటానికి వచ్చిన ఆనందరావుని కాదంటుంది. తనకిష్టమైన వాణ్ణి తప్పితే పెళ్ళాడనని పట్టుబడుతుంది. వేదనపడుతుంది. విమర్శలకు లోనవుతుంది. చివరకు అన్నగారి సాయంతో తనకు నచ్చిన రాజగోపాలాన్ని పెళ్ళిచేసుకొంటుంది. రాజగోపాలానికి ఉన్న సంఘర్షణ స్వయంవరణం నవలలో కామేశ్వరరావుకూ లేదు, ప్రభాకరరావుకూ లేదు. కల్యాణికి ఉన్న జీవితానుభవమూ, ఆలోచనాదృష్టి, వ్యక్తిత్వమూ సుధకూలేదు. రుక్మిణికీలేదు. ఆ కారణంగా కత్తుల వంతెనలో ఉన్న నాటకీయత, ఉద్విగ్నత స్వయంవరణంలో చోటుచేసుకోలేకపోయాయి.



BRAOU

'కత్తుల వంతెన'లో రాజగోపాలం చేత "పాతకొత్తల్ని వేరుగా వుంచడమే కొత్తది కాలు నిలదొక్కు కోడానికి అవసరం" (1965 ప్రచురణ, పుట. 76) అని రచయిత అనిపిస్తాడు. ఈ వాక్యభావం, అర్థం స్వయంవరణం నవలకు పునాది అనుకోవచ్చు. అందువలన ఈ నవలలో రచయిత పాఠకులకు జీవితంపై కలిగించాలనుకొన్న దృక్పథం సిద్ధాంత బోధనలాగా అందుతుంది.

స్వయంవరణం నవలలో రాఘవమ్మ, హనుమంతరావు, సుందరమ్మ, నరసింహమూర్తి, సుబ్బారాయుడు భూతకాలపు అలవాట్లలో ఆచారాలలో బ్రతుకుతున్నవాళ్ళు. వివాహానికి సంబంధించి వాళ్ళ దృష్టి అంతా కుల గోత్రాలమీదా, మత సంప్రదాయాలమీదా డబ్బూ హోదాలమీదా ఉంటుంది. సుధ, కామేశ్వరరావు, రుక్మిణి, ప్రభాకరరావువంటి యువతీయువకులు భావికాలపు ఆదర్శాలనందుకొనేందుకు తాపత్రయ పడుతున్నవాళ్ళు. వాళ్ళ ఆదర్శాలు కులప్రాతిపదికలేని వివాహ వ్యవస్థ; పితృస్వామిక కుటుంబ వ్యవస్థ నుండి విముక్తి; స్వతంత్ర జీవనం, వీళ్ళ ఆదర్శాలు బ్రతికి బట్టకట్టాలంటే కాలదోషం పట్టిన సంప్రదాయాల నుంచి విముక్తి కావాలి. అందుకని బ్రతికి బట్టకట్టాలంటే కాలదోషం పట్టిన సంప్రదాయాల నుంచి విముక్తి కావాలి. అందుకని సుధ కామేశ్వరరావులు, రుక్మిణీ ప్రభాకరరావులు తమ ఆదర్శాల గురించి తల్లిదండ్రులకు చెప్పరు వాళ్ళతో చర్చించరు. చల్లగా తాము చేయవలసింది చేసి కూర్చున్నారు.

సమాజంలో సాంఘిక ఆర్థికరంగాలలో వచ్చే మార్పులు జీవితాన్ని మార్చుకోమని వత్తిడి చేస్తాయి మార్చుకోవటం అనివార్యమవుతుందికూడా. ఆ మార్పుకు జనాల్ని సుముఖులను చేయటం ఒక సామాజిక బాధ్యత అని రచయిత విశ్వాసం. అందుకే ఈ నవలలో 'మన సమాజంలో ఈ విప్లవాన్ని త్వరితగతిని సాగకుండా నిరోధించేవీ, దానిని అడ్డుకొట్టేవీ అనేక శక్తులున్నాయి. ఆలోచనలూ, అలవాట్లూ వున్నాయి. వానిని మన సాహిత్యకారులు బయటపెట్టి ప్రజల్నీ, వాళ్ళ మనసుల్నీ సన్నద్ధంచేయాలి' అని ప్రభాకరరావు చేత అనిపిస్తాడు రచయిత. తాను స్వయంగా తన రచన ద్వారా చెప్పదలచుకొన్న జీవిత సత్యాన్ని ప్రతిఫలించే ఈమాటలు ఈ రచన ద్వారా మహీధర పెద్దల ప్రమేయం లేకుండా యువతీయువకులు పెళ్ళిళ్ళు చేసుకోవాలనీ, తమ జీవితాలకు తామే బాధ్యత వహించాలనీ ఆశించారు. వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ, స్త్రీ పురుష సమానత్వాన్నీ, ప్రజాస్వామిక భావాలనూ ప్రోత్సహించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పట్టణ ఆర్థిక వ్యవస్థగా, భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థగా పరిణమించే క్రమాన్ని, మనుషుల్ని మానసికంగా సన్నద్ధం చేయటంకోసం భావాలలో రావలసిన మార్పును నిర్దేశించారు. నూతన సామాజిక స్థితిగతులకు అవసరాలకు అనుకూలంగా యువతీయువకులకు వివాహ వ్యవస్థగురించి కొత్తదృష్టిని కలిగించి ఆచరణకు సరియైన చైతన్యాన్ని పెంపొందించి ప్రబోధించారు.

BRAOU

### అభ్యాసం - 4

కింది ఖాళీలలో మీ జవాబు రాయండి. భాగం చివర ఇచ్చిన మాదిరి జవాబుతో సరిపోల్చుకోండి.

1. మహీధర రచనా లక్ష్యం ఏమిటో తెలపండి? (20 పదాలకు మించకుండా రాయండి)

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

______________________________________________

## 2.8 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- బహుళ జనాదరణ పొందిన ప్రక్రియ నవల.
- మహీధర తనకు తెలిసిన జీవితం గురించి నిజాయితీగా రచన చేసే రచయిత.

- నవలా శిల్పంలో భాగంగా ఇతివృత్తం, పాత్రచిత్రణ, నవలానిర్మాణం, రచయిత జీవితదృక్పథం అన్న అంశాలను మనం పరిశీలించవలసి వస్తుంది.
- నూతన సామాజిక స్థితిగతులకు అవసరాలకు అనుగుణంగా యువతీయువకులకు స్త్రీపురుష సంబంధాలగురించి ఒక కొత్త దృష్టిని కలిగించటానికి, ఒక మానసిక సంస్కారాన్ని ఇవ్వటానికి, ఆచరణాత్మక చైతన్యాన్ని పురికొల్పటానికి రచయిత చేసిన ప్రయత్నం ఈ నవలగా రూపు దిద్దుకుంది.

## 2.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. స్వయంవరణం నవల ఇతివృత్తాన్ని పరిచయం చేయండి.
2. మహీధర రచనా దృక్పథాన్ని విశ్లేషించండి.

15 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. నవలాశిల్పం అంటే ఏమిటి?
2. స్వయంవరణంలో కులవ్యవస్థపై రచయిత దృక్పథం ఏమిటి?
3. స్వయంవరణంలో శైలిని సమర్థించండి.
4. మహీధర రామమోహనరావు స్వయంవరణం ఏ లక్ష్యంతో రాశాడు?

## 2.10 ఆకళింపు ప్రశ్నలు

1. తెలుగు నవల చరిత్రను తెలుసుకోటానికి వీలునుబట్టి మొదలి నాగభూషణ శర్మగారి తెలుగు నవలా వికాసం (1971) సంపాదించి చదవండి. అట్లాగే చదవదగిన పుస్తకాలు చివర ఇచ్చాము. వాటిలోని తెలుగు పుస్తకాలనైనా సంపాదించి చదవండి.
2. నవలా నిర్మాణం గురించి తెలుసుకోటానికి మాదిరాజు రంగారావు 'నవలా స్వరూప సమాలోచనం' చదవండి. ఒకటి రెండు ఇంగ్లీషు పుస్తకాల ద్వారా ఈ విషయం తెలుసుకుంటే ఇంకా మంచిది.
3. రామమోహనరావుగారే రాసిన "కత్తుల వంతెన" నవలకు "స్వయంవరణం" నవలకు పోలికలున్నాయని చెప్పుకొన్నాంకదా! "కత్తుల వంతెన" నవలసంపాదించి చదివి ఆ పోలికలు సరిచూసుకోండి.
4. నవలను మీరు ముందుముందేమవుతుందో తెలుసుకొందామన్న ఉత్సాహంతో ఏకబిగిని చదివారా? లేక నింపాదిగా ఏ ఉద్వేగానికి లోనుకాకుండా చదివారా? ఎట్లా చదివినా అందుకు కారణాలేమిటో 5 వాక్యాల్లో రాయండి.
5. నవల మంచి విషయాన్ని చెప్పాలంటారా లేక విషయం ఏదైనా మంచిగా అందంగా చెప్పాలంటారా? జవాబు 5 వాక్యాల్లో రాయండి.
6. కాలేజీలకు వచ్చే ఆడపిల్లల్ని ప్రలోభపరచి, ఓ చిన్న బిడ్డని ప్రసాదించి పారిపోడానికే మగవాళ్ళు ప్రయత్నిస్తుంటారన్నట్లూ, పారిపోయిన మగాడికోసం కలలుకంటూ, ఏడుస్తూ జీవితం భగ్నం చేసుకోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో మాత్రమే కాలేజీ అమ్మాయిలకి గత్యంతరం అయినట్లూ వస్తున్న కథలు, నవలలు గురించి సుధ రుక్మిణి చర్చించుకొన్నట్లు ఉంది, అటువంటి కథలు, నవలలు మీ దృష్టిలోకి వచ్చినవి ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటిని పేర్కొనండి.

### అభ్యాసాలకు జవాబులు

### అభ్యాసం – 1

'పెద్దవాళ్ల ప్రమేయంలేకుండా పిల్లలు పెళ్ళి చేసుకోవాలి' అనే విషయనాన్ని ఈ నవలేతివృత్తంలో మహీధర ప్రతిపాదించారు.

BRAOU

2. పెళ్ళిళ్లకు కులం ప్రాతిపదిక కాకూడదనీ, కులంలోనే పెళ్లి జరగాలనే సంప్రదాయవాదులకి కులం బయట జరిగితీరాలనే గోరావంటి వారికి భేదం తక్కువని మహీధర భావిస్తారు.

**అభ్యాసం – 2**

పాత్రల విశిష్ట స్వభావాన్ని పాఠకుడు భావించుకోటానికి, చూడటానికి వీలుగా రచనలో పాత్రను ప్రవర్తింపచేయటాన్నే పాత్రచిత్రణ అంటారు.

**అభ్యాసం – 3**

వస్తువుకూ శిల్పానికి సమాన ప్రాముఖ్యత ఉండాలి. అంటే రచనలో వాటి మధ్య సమతౌల్యం సాధించాలి.

**అభ్యాసం – 4**

గతకాలపు సామాజికభావజాలాలను తప్పించుకొంటూ భావికాలపు ఆదర్శాల నందుకునేందుకు మానవుడు నిరంతరం సాగించే ప్రయత్నాన్ని వేగవంతం చేయటమే మహీధర రచనా లక్ష్యం.

– డా. కాత్యాయనీ విద్మహే

---

**అదనపు సమాచారం**

---

నవల ఈనాడు ఎంతో జనాదరణ పొందిన సాహిత్య ప్రక్రియ. అంతో ఇంతో చదువువచ్చిన పాఠకులు మొదలుకొని విద్యాధికుల వరకూ నవలను విశేషంగా చదువుతున్నారు. ఆదరిస్తున్నారు. సినిమాలలాగే నవలల ప్రభావం కూడా కొంతవరకు మన ఆలోచనల మీద పడుతోంది. నవలలపట్ల ఒక అభిరుచిని ఏర్పరచుకోవడం ద్వారా సరైన నవలల సరైన ప్రభావం మనమీదపడేటట్లు చూసుకోవచ్చు. ఈ అభిరుచి ఏర్పడడానికి మంచి విమర్శను కూడా చదవాలి. నవలకు సంబంధించిన అభిరుచి ఏర్పరచుకునే క్రమంలో ఈ కింది వ్యాసాలు చదవండి.

మొదటిది ప్రసిద్ధ విమర్శకుడు రా.రా. సమీక్షా వ్యాసం. రెండవది రచయితే స్వయంగా తన నవలను గురించి రాసిన వ్యాసం. ఈ రెండూ సంవేదన అనే సాహిత్య మాసపత్రికలో వెలువడ్డాయి. నవల, నవలా పఠనం అనే మరొక వ్యాసాన్ని కూడా ఇస్తున్నాం శ్రద్ధగా చదవండి. (సంపాదకుడు).

BRAOU

## "తిరుగుబాటు మా వేదాంతం"

### స్వయంవరణం

### (నవల)

**రచన : మహీధర రామమోహనరావు**

ప్రచురణ : యం. శేషాచలం అండ్ కంపెనీ, మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్.

పేజీలు : 208 వెల : రూ. 2/-

రామమోహన్‌రావుగారికి యెంత వయస్సు వచ్చినా (దీన్ని వ్యక్తిగత విమర్శ అంటారేమో!) ఆయనలో ఇంకా తిరుగుబాటుతత్వం చావలేదు. రక్తం చల్లబడినా భావాల్లో తీవ్రత తగ్గలేదు. గతంలో ఆయన రాసిన అనేక నవలల్లో తిరుగుబాటే యితివృత్తం. ప్రతి నవలలోనూ యెవరినో ఒకరిని తిరుగుబాటు చేయమని ప్రబోధిస్తుంటాడు; దేనిమీదనో ఒకదానిమీద తిరుగుబాటుకు పిలుపు యిస్తుంటాడు. తిరుగుబాటు చేయవలసింది యెవరు? యెవరికి తిరుగుబాటు లాభకరంగా వుంటుందో వాళ్లు – వంచితులు, వనితలు, అనాథలు, యువకులు, యువతులు, తాడితులు, పీడితులు – యెవరు వర్తమానంలో సుఖలేశానికి నోచుకోలేదో వాళ్ళు. దేనిమీద తిరుగుబాటు? బాధితుల బాధలకు యేది మూలకారణమో దాని మీద – సమాజ వ్యవస్థమీద, రాజకీయ వ్యవస్థమీద, ఆర్థికవ్యవస్థమీద – అన్నీ పెనవేసుకొని వుంటాయి గనుక మొత్తం అన్నిటి మీదా, యీ కొత్తనవల 'స్వయంవరణం'లోనూ తిరుగుబాటే యితివృత్తం. కానీ రంగం పరిమితం. ఇందులో తిరుగుబాటును ప్రబోధిస్తున్నది యువతీయువకులకు – అనగా వివాహం చేసుకోదలచిన వాళ్ళకు – వివాహం ద్వారా సుఖపడదలచిన వాళ్ళకు. వివాహం తమ సుఖం కొరకు కాదనుకునే వాళ్ళుంటే, అది పరలోకం

కొరకో, పితృదేవతల కొరకో అనుకునేవాళ్ళుంటే, వాళ్ళకి తిరుగుబాటు అక్కరలేదు. భార్యాభర్తృ సంబంధమంటే భరించడమూ, భారం కావడమూ కాదని, స్వామి భృత్య సంబంధం కాదని కేవలం పడకగదికీ, ప్రసూతి ఆస్పత్రికీ పరిమితం కాదనీ, అదొక మైత్రి అనీ, హృదయబంధమనీ, మధురమైన సాహచర్యమనీ, పూర్ణ మానవ జీవితమనే స్వర్గానికి నిచ్చెన అనీ యెంచే వాళ్ళకు, యెంచగల సంస్కారం వున్నవాళ్ళకు, మాత్రమే యీ తిరుగుబాటు ప్రబోధించబడింది. తిరుగుబాటు యెవరిమీద? [యువతీ యువకుల వివాహ నిర్ణయాలలో తమ పెత్తనం సాగాలని కోరే తలిదండ్రులమీద – కులమనీ, మతమనీ, ధనమనీ, హోదా అనీ, సంప్రదాయమనీ, ఆచారమనీ తమ పిల్లల ప్రేమ వివాహాలకు ఆటంకాలు కల్పించి అడ్డుపడే తలిదండ్రుల మీద. కన్న తల్లిదండ్రులమీదనే యెందుకింత నిర్దాక్షిణ్యమైన తిరుగుబాటు అంటే, పాతతరం ఆలోచనలూ, ఆచారాలూ కొత్త తరం ఆనందానికి క్రూరమైన ప్రతిబంధకమైనాయి గనుక. పాతతరానికీ, కొత్తతరానికీ, మధ్య పూడ్చరాని అగాధం ఏర్పడింది గనుక.]

యూరప్‌లోనూ, అమెరికాలోనూ, మొత్తం నాగరిక ప్రపంచమంతటా పాతతరం మీద కొత్తతరం తిరుగుబాటు చేస్తున్నారని యీ మధ్యన రాజకీయ వ్యాఖ్యాతలూ, సామాజిక శాస్త్రజ్ఞులూ కొందరు అంటున్నారు. బ్రిటన్‌లోని Angry Young Men తో ఈ తిరుగుబాటు ప్రారంభమైనట్టు కూడా చెప్తున్నారు. బీట్నిక్కులూ, బీటిల్సూ, పాప్‌సంగీతమూ, టాప్‌లెస్‌లూ, హిప్పీలూ, బహుశా బెంగాలీ ఆకలి కవులూ, తెలుగు దిగంబర కవులూ కూడా ఈ తిరుగుబాటులో భాగమైనట్లు లెక్కవేస్తున్నారు. రష్యాలో యెప్టుషెంకో, సోల్జెనిత్సన్‌లతో ప్రారంభమైన నూతన సాహిత్యోద్యమమూ అందులోని భాగమేనంటున్నారు. ఇటీవల జర్మనీలో, ఇంగ్లండులో, ఫ్రాన్సులో, ఇటలీలో, యుగోస్లేవియాలో, కొన్ని మాసాల క్రితం పోలెండులోనూ తీవ్రస్థాయిలో జరిగిన విద్యార్థుల ఆందోళన అంతా ఇదేనంటున్నారు. భారతదేశ విద్యార్థులలోని అశాంతి కూడా అదేనంటున్నారు. అన్నిటినీ కలిపి ఏకసూత్రబద్ధం చేయడానికి generation gap (తరాలమధ్య అగాధం) అనేమాట వ్యాప్తిలోకి వచ్చింది. యువతరానికి తమ పితృదేవలమీద విశ్వాసం పోయింది. కనుక తిరగబడుతున్నారు – యిదీ నేటి కొత్త సిద్ధాంతం. యువరక్తంలోని ఉన్నతాశయాలనూ, నీచ చాపల్యాలనూ ఒకే గాటకట్టే కుటిల యత్నమే యీ సిద్ధాంతం. దీనికి 'స్వయంవరణం' లోని యువజనుల సమస్యకూ సంబంధంలేదు.

ఇందులోని సమస్య కేవలం రెండు తరాలమధ్య అంతరమేకాదు; రెండు తరాలూ రెండు సమాజ వ్యవస్థలకు ప్రతినిధులు గనుక యీ సమస్య రెండు వ్యవస్థలమధ్య అంతరం. (పాతతరం వాళ్ళకు యింకా ఫ్యూడల్ ఆచారాలూ, సంప్రదాయాలూ, ఫ్యూడల్ మనస్తత్వమూ ఆలోచనా ధోరణీ వదల్లేదు) ముఖ్యంగా తమ సంతానం తమ అభీష్టాలకు బానిసలుగా, తమ ఆలోచనలకు పరిచారికలుగా వుండాలనే ఫ్యూడల్ నిరంకుశ పితృస్వామిక మనస్తత్వం వాళ్ళను యింకా పట్టిపీడిస్తున్నాది. కాని యీనాటి యువతరం నూతన నాగరికతలో పుట్టి ఉన్నతవిద్యవల్లా, ఆధునిక సమాజ వాతావరణంవల్లా నూతన సంస్కారం అలవరచుకున్న వాళ్ళు. ఫ్యూడల్ శృంఖలాలను బ్రద్దలుకొట్టే వ్యక్తి స్వాతంత్ర్యమూ, స్త్రీ పురుష సమానత్వమూ, ప్రజాస్వామిక హక్కులూ మొదలైన విప్లవ బూర్జువా ధర్మాలు విశ్వసించడమేకాదు, వాటిచే ఉత్తేజితులయ్యేవాళ్ళు. తమకు వివాహ వయస్సు వచ్చేదాకా యీ యువతరం వాళ్ళకు తమ తలిదండ్రుల నిజస్వరూపం తెలియదు. తమ వివాహాలు తలిదండ్రుల చేతిమీదుగానే జరిపించుకునే యువతీయువకులకు కానీ, యెవరినో ఒకరిని తామే యేరికోరి వివాహమాడతలచుకున్నప్పుడు, అప్పుడు తెలుస్తుంది తమ పితృదేవతల రక్తంలోని కరాళ ఫ్యూడల్ మానసిక అవశేషాల పిశాచగణ సమవాకారం. ఇటువంటి వాళ్ళకే రామమోహనరావుగారి యీ తిరుగుబాటు సందేశం. ఒక యువతి ప్రేమించడమంటే చెడిపోవడమనీ, ఒక యువకుడు ప్రేమించడమంటే దగా చేయడమనీ పెద్దవాళ్ళ దృష్టిలో రూఢి అర్థాలు యేర్పడినాయి. బహుశా యువకుని తలిదండ్రులైతే తమ అర్భకుడు ఎవరో మాయలాడి వలలో పడినాడని అనుకుంటారు కాబోలు. తలిదండ్రులకు తమ సంతానం మీద ప్రేమ ఉండదనికాదు, వుంటుంది. కానీ అంతకంటే నూరురెట్లు బలంగా వుంటుంది ఫ్యూడల్ కుసంస్కారం. మమకారంకంటె వేయిరెట్లు బలంగా వుంటుంది అధికార దాహ రూపంలో వున్న ఫ్యూడల్ అహంకారం. ఈ పెద్దవాళ్ళు తమ మాట చెల్లించుకోడానికి కొంతకాలం పితృభక్తి, మాతృభక్తీ బోధించేరు. కొడుకులకు కర్తవ్యాలు బోధించారు ... మగ, ఆడపిల్లలు పుట్టింది ఒకరినొకరు బోల్తాకొట్టించేందుకేనన్నట్లు, వాళ్ళలా మోసపోకుండా తమ అనుభవకవచాన్ని కప్పుతున్నట్లూ నేడు నటిస్తున్నారు. ఈ ముసలాళ్ళ ప్రమేయం లేకపోతే ఈ ప్రపంచంలో కుర్రవాళ్ళ బ్రతుకులు – దరహంమీద – ఇంతకంటే సుఖవంతంగా వుండేవే –" అంటుంది ఈ నవలలోని ఒక పాత్ర.



BRAOU

ఇంతకూ ఈ నవలలోని పెద్దవాళ్ళు యెవరూవచ్చి ఫ్యూడల్‌వాదులు కాదు. అందరూ ఆధునిక సమాజంలోని మనుషులే. కాని ఫ్యూడల్ సంస్కారపు అవశేషాలు యింకా బలంగా వున్నాయి వాళ్ళ మనస్తత్వంలో - అంతే. అందుకనే కాబోలు నవలలో ఎక్కడా తల్లిదండ్రులకూ యువతరానికి తీవ్రమైన ప్రత్యక్ష ఘర్షణలేదు. యువతీయువకులు తమ హక్కులకోసం - ప్రేమించి పెండ్లిచేసుకునే వివాహ స్వాతంత్ర్యం కోసం - పెద్దవాళ్ళను యెదిరించి పోరాడరు. పెద్దవాళ్ళ అభీష్టాలను తృణీకరిస్తారు. పెద్దవాళ్ళ పెద్దరికాన్ని గుర్తించరు - అంతే. పెద్దవాళ్ళకు చెప్పకుండా తమ వివాహాలు తాము చేసుకుంటారు. అంతటితో నవల ముగిసిపోతుంది. తరువాత పెద్దవాళ్ళ యేడుపులూ, శాపనార్థాలూ వుండవా? వుంటాయి. కానీ, నవలలోని ఆ యువతీయువకులే వాటికి చిల్లిగవ్వంత విలువ యివ్వరు; యిక పాఠకులకెందుకు?

సమస్య యింత సులభంగా యెలా పరిష్కారమైంది? వధూవరులు స్వయంగా ఆర్జనపరులైనందువల్ల తమ తల్లిదండ్రులను ధిక్కరించికూడా నేటి యువతీ యువకులు స్వతంత్రంగా సుఖమయ జీవితాలు జీవించడానికి యే ఆటంకమూ లేదుగనుక. (విద్యావంతులైన నేటి యువతరం బతుకుదెరువుకోసం తలిదండ్రులమీద ఆధారపడనక్కరలేదు. ఇది నవల యితివృత్తంలో ఒక కీలకమైనఅంశం) పెద్దవాళ్ళమీద తిరుగుబాటు సులభం కావడానికి నేటి పెట్టుబడిదారీ ఆర్థిక విధానమే కారణం. అదే విధంగా ఆ తిరుగుబాటు అవసరం కావడానికి కూడా నేటి పెట్టుబడిదారీ వ్యవస్థే కారణం. మన సమాజమీనాడు పెట్టుబడిదారీ ఆర్థిక పునాదులమీద నిర్మింపబడింది కనుకనే, యీనాటి యువతీయువకులు బూర్జువా నాగరికతతో, బూర్జువా ధర్మాలతో బతుకుతున్నారు కనుకనే, వాళ్లు తమ తల్లిదండ్రుల పాత ఫ్యూడల్ మనస్తత్వాల మీద తిరుగుబాటుచేయవలసి వస్తున్నది. పాత ఫ్యూడల్ మనస్తత్వానికి యేమాత్రంలోబడినా నేటి యువతీయువకుల జీవితాలు నరకంకాక తప్పదు. ఈవిషయం వాళ్ళకుతెలుసు. అందువల్లనే వాళ్ళు తిరుగుబాటుకు సులభంగా సమాయత్తమౌతారు.

తిరుగుబాటు తత్వం అనేది ఒకరు చెప్తే వచ్చేది కాదు. అది మనసు లోపలినుండే పుట్టాలి. మనిషిలోని ఆంతరిక అవసరాలూ, ఆకాంక్షలూ తీవ్రమైనప్పుడు తిరుగుబాటును పురికొల్పుతాయి. తిరుగుబాటు చేసిందాకా మనశ్శాంతి లేకుండా మనిషిని కొరుక్కుతింటాయి. అప్పుడిక తిరుగుబాటే సవ్యమైన రాజమార్గంగా కనపడుతుంది. ఐతే మరి తిరుగుబాటుకు ఒకరి ప్రబోధమెందుకు? తిరుగుబాటు చేసినవాళ్ళకు నైతికబలం యివ్వడానికి, తిరుగుబాటు చేయబొయ్యేవాళ్ళకు ప్రోత్సాహమివ్వడానికి; సందేహాలతో, సంకోచాలతో సతమతమయ్యే వాళ్ళకు వీపు తట్టి ధైర్యం ఇవ్వడానికి; ముఖ్యంగా, తిరుగుబాటుచేసి నేరస్తులలాగే మనఃక్షోభ పడకుండా ఆత్మవిశ్వాసం కలిగించడానికి; సిగ్గుపడకుండా పదిమందిలోనూ వీరుల్లాగా తలలెత్తుక తిరుగగల నైతిక గర్వం కలిగించడానికి - అందుకు అవసరం యీ ప్రబోధం.

నిజానికి పెట్టుబడిదారీ ఆర్థిక విధానం మనకీనాడు హఠాత్తుగా వచ్చిందికాదు; కొన్ని దశాబ్దాలుగా పెరుగుతున్నదే. ప్రేమలూ, ప్రేమ వివాహాలూ, వాటికొరకు తలిదండ్రులతో పోరాటాలూ మన సాహిత్యంలో కొత్త కాదు. తెలుగులో కథలూ, నవలలూ పుట్టినప్పటినుండి అవి వున్నాయని చెప్పవచ్చు. మరి యినాడు రామమోహనరావుగారు యింతగా యీ తిరుగుబాటు ప్రబోధించడమెందుకు అనవచ్చు.

మన సాహిత్యంలో చాలాకాలంగా బూర్జువా భావాలు యితివృత్తంగా వున్నమాట నిజమే. కానీ ఆ భావాలు నూటికి నూరుపాళ్లూ మన సమాజ జీవితంనుండే ఉద్భవించినవి కావు. ఆ భావాలు ప్రధానంగా పాశ్చాత్యవిద్యద్వారా, పాశ్చాత్య నాగరికతా సంపర్కంద్వారా మనలోయేర్పడినవి. మన రాష్ట్రంలో యీనాటికీ పరిశ్రమలు పెద్దగా అభివృద్ధి కాలేదు. ఇప్పటికీ ప్రధానంగా వ్యావసాయిక రాష్ట్రమేమనది. మన సాహిత్య రంగంలో కూడా మనం కొత్తగా నేర్చుకున్న బూర్జువా భావాలకంటె మన రక్తంలోని ఫ్యూడల్ వారసత్వం బలీయంగావున్నట్లు కనబడుతుంది. మొదటినుండి మన భావకవులందరూ రాసింది బూర్జువా రొమాంటిక్ కవిత్వమేఐనా, రాసినవెంటనే అంకితంయివ్వడానికి జమీందార్లనూ, జమీందార్లకంటె కుసంస్కారులైన మినిష్టర్లనూ వెదుక్కోవడమూ, కానుకలుస్వీకరించడమూ, సన్మానాలు, గజారోహణలూ గండెపెండేరాలూ అన్నీవచ్చి ఫ్యూడల్ కుసంస్కార లక్షణాలు. ఆ భావకవులే దేశభక్తి కవిత్వంరాసేటప్పటికి, దేశభక్తి అనేది నిజానికి బూర్జువా భావమేఐనా, ఆ కవిత్వంనిండా ఫ్యూడల్‌వాసన వ్యాపించివుండేది. మన కథల్లోనూ, నవలల్లోనూ మొన్నమొన్నటిదాకా రచయితల ఫ్యూడల్ మనస్తత్వంయేదో ఒకరూపంలో ప్రతిబింబిస్తూనే వుండేది. ఇప్పుడిప్పుడే మన సమాజమూ, మన సాహిత్యమూ యీ స్థితినుండి బయటపడుతున్నది. మనకు పరిశ్రమలు పెద్దగాలేకపోయినా, వర్తకం విరివిగావిస్తరించింది. మనవ్యవసాయంలోనే పెట్టుబడిదారీపద్ధతులూ, పెట్టుబడిదారీ మనస్తత్వమూబలపడినాయి. వేల సంఖ్యలో ఆడపిల్లలూ, మగపిల్లలూకలిసి చదువు

హుంటున్నారు. కలిసి ఉద్యోగాలుచేస్తున్నారు. డజన్లసంఖ్యలో ఆడరచయితలు బయలుదేరినారు. ఈ సామాజిక పరివర్తన అంతా మన సాహిత్యంలోకూడా ప్రతిఫలిస్తున్నది. గతంలో ప్రేమికుల చుట్టూ వుండేది ఫ్యూడల్ సనాతన వాతావరణం గనుక ప్రేమించడమే సనాతన ధర్మాలమీద తిరుగుబాటు. ఈనాడు సమాజ వాతావరణం మారిందిగనుక, ప్రేమించడంఅనేది ఆప్రేమికుల వ్యక్తిగతసమస్యమాత్రమే. కాకపోతే తల్లిదండ్రుల అంతరాయం మాత్రం యింకా వుంది. అదికూడా పూర్వమున్న రూపంలో కాదు.

కనుక ఈనాటి సాహిత్యం చేయవలసినపని ప్రేమ అనే ఆదర్శాన్ని ప్రబోధించడం కాదు - ప్రేమించిన తర్వాత కలిగే సమస్యలను యెదుర్కోవడం. ప్రేమ అనేది ఈనాటి యువతీయువకుల నిత్యజీవిత వాస్తవం. ప్రేమలోపడినవాళ్ళ సమస్య ఒకటే - తమ ప్రేమను వివాహంద్వారా సఫలం చేసుకోవడం యెలా అనేది. ఈ సమస్యను శాంతంగా, శాస్త్రీయంగా వ్యక్తుల మనస్తత్వాల కనుగుణంగా పరిష్కరించడమే నేటి సాహిత్య కర్తవ్యం. గతంలోలాగా నేటి ప్రేమకథల్లో తీవ్ర ఆవేశాలూ, తలకు మించిన త్యాగాలూ, కఠోరమైన దీక్షలూ, శపథాలూ అనవసరం. నేటి ప్రేమికులు ఫ్యూడల్ తీవ్రావేశ మనస్కులుకారు. బూర్జువా విజ్ఞాన ప్రబుద్ధులు : సమస్యను ఆవేశ కలుషితం చేయకుండా వివేకంతో పరిష్కరించుకోగలవాళ్ళు. ప్రేమ సమస్యను వివేకంతో వివాహ పర్యవసాయిగా పరిష్కరించడమే నేటి సాహిత్య కర్తవ్యం. ఈ దృష్టితో చూసినప్పుడు రామమోహనరావుగారి తిరుగుబాటు ప్రబోధంలోని కొత్తదనం అర్థమౌతుంది.

ఈనాటి తల్లితండ్రుల మనస్తత్వంలో కూడా ఒక కొత్తదనం ఉంది. అది ఈ నవలలో స్పష్టంగా చిత్రించబడింది. కులమూ, సంప్రదాయమూ మొదలైన వాటికి పెద్దగా విలువయిస్తున్నట్టు పెద్దవాళ్ళ మాటల్లో కనబడుతున్నా, వాటికంటె బలీయంగా వుండేది డబ్బు దృష్టి - డబ్బుతో తమ పిల్లల భవిష్యత్తును (అనేక సందర్భాల్లో తమ భవిష్యత్తును కూడా) సుస్థిరం చేసుకోవాలనే తాపత్రయం. నిజానికిది ఫ్యూడల్ దృష్టి కాదు. పచ్చి బూర్జువా వ్యాపార దృష్టి. కానీ పిల్లను సంపూర్ణ స్వతంత్ర వ్యక్తులుగాకాక, యే వ్యక్తిత్వమూలేని తమ ప్రైవేటు ఆస్తిగా చూడడం పచ్చి ఫ్యూడల్ పితృస్వామిక దృష్టి. ఇక పిల్లలు తమ అభీష్టాలకు భిన్నంగా ప్రవర్తించినప్పుడు చిందులు తొక్కేవాళ్ళ ఆగ్రహం యెదురు దెబ్బతిన్న ఫ్యూడల్ నిరంకుశ పితృస్వామిక దురహంకారం అని చెప్పనక్కరలేదు. బూర్జువా వ్యాపార దృష్టి ఫ్యూడల్ పితృస్వామిక అధికార దృష్టి కలిసిన యీ యుగళ మనస్తత్వం యీనాటి తలిదండ్రులలో సాధారణ ధర్మంగా కనబడుతుంది.

ఈ నవలలోని హనుమంతరావు పాత్రలో యిది మరీ భయంకరమైన వికటరూపంలో కనబడుతుంది. హనుమంతరావు రిటైరైన హైస్కూలు హెడ్మాష్టరు. ఇంకా చదువులు, పెళ్ళిళ్ళూ కావలసిన పిల్లలున్నారు. లెక్చరర్ ఉద్యోగం చేస్తున్న పెద్దకూతురు సుధ పంపే డబ్బుమీద అతని సంసారం ప్రధానంగా ఆధారపడింది. సుధకు పెళ్ళి చేయడమే ఒక కష్టంకాగా, ఆమె పెండ్లి చేసుకొని వెళ్ళిపోతేతన సంసారం వీధిన పడుతుందని అతనికి తెలుసు. కనుక సుధకు చేసే పెండ్లి ప్రయత్నాలు మనస్ఫూర్తిగా చేయడు. మరొక వైపున అతను సదాచార సంపన్నుడు. హోటళ్ళలో కాఫీతాగి యెరగడు. అనగా ఒక వైపున ఫ్యూడల్ ఛాందసమూవుంది. మరొకవైపున ఆడపిల్లలను కాలేజీలమీదా హాస్టళ్ళమీదా వదలిపెట్టి, ఒంటరిగా ఉద్యోగాలుచేసుకోనిచ్చే బూర్జువా సంస్కారమూ ఉంది. అంతేకాదు - యింకా బలంగా తన సంసారంకొరకు కూతురు పెండ్లికి ఆటంకాలు కల్పించే కిరాతక బూర్జువా వర్తక దృష్టి వుంది. ఈ తండ్రి Crime and Punishmentలోని సోనియా తండ్రి లాంటి నిరీహనిర్విణ్ణ నిశ్చేతన యదృచ్ఛిష్యుడు కాదు - మన సానుభూతి చూరగొనడానికి. ఫ్యూడల్ దురభి మానమూ, బూర్జువా వర్తకబుద్ధీ, ఫ్యూడల్ అసహనమూ, బూర్జువా కార్యశీలతా కలిసి బలిసిన ఒక వింత అడవి జంతువు - వర్తమాన సమాజంలో మాత్రమే కనబడగల దుష్టమృగం.

నవలలో తీవ్రమైన ఘర్షణలేనందువల్ల నవలఅంతా చల్లగాసాగిపోయినట్లుంటుంది. తీవ్రమైన హృదయ క్షోభ పాత్రలకే యెక్కడా లేదుగనుక, తీవ్రమైన అనుభూతులు పాఠకులకు కూడా కలగవు. సంభాషణా చాతుర్యంవల్లా, విజ్ఞానపూరితమైన చర్చలవల్లా నవల ఆద్యంతం అహ్లాదకరంగాఉంది. నవల చదువుతున్నంత సేపూ సహృదయుడైన ఆత్మీయుని సాహచర్యంగా, హాయిగా, ఉల్లాసంగా, పాఠకునికి ఒక సుకుమార మైన తృప్తినిస్తూ ఉంటుంది. కానీ, ఒక్కొకచోట చర్చలు నవల ఘర్షణలో భాగం కాలేదేమో అనిపిస్తుంది. చర్చలలోనాటకీయ ఆవేశంకంటే విజ్ఞానం బలీయంగా వున్నప్పుడు ఆనవలలోని పాత్రలు జీవితాన్ని చర్చిస్తు న్నాయా అన్న సందేహం కలుగుతుంది. గొప్ప సాహిత్యంలో యిలాంటి సందేహం కలుగకూడదు.

- రా. రా



BRAOU

# "అరసికేషు కవిత్వ నివేదనం"

## మహీధర రామమోహన్‌రావు

తమ మొదటి నవల 'రథాచక్రాలు'తోనే తెలుగు నవలా సాహిత్యంలో సుస్థిరమైనస్థానం సంపాయించుకున్నవారు రామమోహనరావుగారు. మన సాహిత్యంలో ఈయనది చిత్రమైన వ్యక్తిత్వం. ఇంత స్థిరమైన, అసందిగ్ధమైన చారిత్రక అవగాహనతో నవలలు రాసేవారు మరొకరు లేరు. ప్రపంచసాహిత్యంలోకూడా Howard Fast లాంటి వాళ్ళు కొద్దిమందే వున్నారు. శిల్పదృష్ట్యా తెలుగునవలా ప్రపంచపరిమితులే రామమోహనరావుగారి నవలలకూ వున్నా, సమాజ సమస్యలను చారిత్రక దృష్టితో చూడగల అసాధారణ ప్రజ్ఞవల్ల తెలుగు సాహిత్యపు కుల గురువుల్లో చేర్చదగినవాడు ఈయన.

చారిత్రక దృష్టి మరీ యెక్కువైనందువల్లనేమో గత పదేండ్లుగా మనవచన సాహిత్యంలో వచ్చిన వికాసాన్ని చూసి మురిసిపోయినాడు ఈయన. వారపత్రికలు లక్షలసంఖ్యలో అచ్చుకావడం ఒక గొప్ప చారిత్రక పురోగతి అని ఆహ్వానించినాడు. కథకులూ, నవలాకారులూ వేలసంఖ్యలో ఉత్పత్తికావడం, ముఖ్యంగా ఆడవాళ్లు రచనారంగంలో దొమ్మిగా ప్రవేసించడం, ఒక గొప్ప చారిత్రక విప్లవమని అభినందించినాడు. రాసినవాళ్ళనందరినీ అభినందించినాడు. రాయదలచుకున్నవాళ్ళనందరిని ప్రోత్సహించినాడు. ఈనాటి సాహిత్యమంతా సాహిత్య వర్తకమని యెవ్వరైనా అంటే యెగిరిపడేవాడు.

కానీ, చారిత్రక దృష్టి బలంగా వున్నందువల్లనే చివరకు తెలుసుకోగలిగినాడు, యీనాటి వచన సాహిత్యం చారిత్రక ప్రగతికి తోడ్పడడంలేదని, తానాశించిన చారిత్రక పరిణామానికిది అవరోధంగా కూడా తయారైందని. ఈ కొత్త అవగాహన ఈయన కొత్త నవల 'స్వయంవరణం'లో వ్యక్తమౌతుంది. "కాలేజీలకు వచ్చే ఆడపిల్లల్ని ప్రలోభపరచి, ఒ చిన్న బిడ్డని ప్రసాదించి పారిపోవడానికే మగవాళ్ళు ప్రయత్నిస్తున్నారన్నట్లూ, పారిపోయిన మగాడి కోసం కలలుకంటూ, ఏడుస్తూ జీవితం భగ్నం చేసుకోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో మాత్రమే కాలేజీ అమ్మాయిలకి గత్యంతరం అయినట్లు వస్తున్న కథలూ, నవలలు" 'స్వయంపరణం'లో విమర్శకు గురైనాయి. "మన రచయితలు సమాజగతిని అర్థం చేసుకోవాలి. మన తెలుగు రచయితలు దానిని పట్టించుకోవడం లేదని నా ఆరోపణ", అంటూ స్పష్టంగా ఆరోపణే చేసినాడు. ఈనాడు వచ్చేదంతా విస్మరణవాద (escapist) సాహిత్యమని యెవరైనా అంటే, వాళ్ళను సాహిత్య శత్రువులుగా చూసిన రామమోహనరావుగారే యీ నవలలో అదే అభిప్రాయం యింకా వివరంగా వ్యక్తం చేసినాడు. "రచయితలు పాఠకులను ఆలోచింపజేయడానికి బదులు, వాళ్ళ ఆలోచనలకు గిలిగింతకు పెట్టడానికీ, కన్నీళ్ళమాటునా, వెర్రికేకల వెనుకా ఆలోచన తోచకుండా చేయడానికీ కొన్ని అడ్డదారులు తొక్కుతున్నారు. ఉదాహరణకి చూడండి. ఆడపిల్ల స్వతంత్రంగా అడుగువేయబోతే ఎన్నో పెద్దపులులూ, తోడేళ్ళూ కాచుకూర్చున్నట్లు చెప్తున్నారు, హడలకొడుతున్నారు..."

సమకాలిక వచన సాహిత్యం పట్ల ఈయనకు కలిగిన ఆశాభంగం "స్వయంవరణం" నిండా ఉంది. కానీ, ఆ నవల రాస్తున్నప్పుడు కూడా యింకా పూర్తిగా భ్రమలు చావలేదు. తెలుగువాడు యిప్పుడిప్పుడే నోరు విప్పుతున్నాడు. పాపం పసివాడు – అని తమకుతాము సర్దిచెప్పుకొని ఊరట కల్పించుకున్నాడు కానీ, అంతటితో ఈ సమస్య తేలిపోలేదు. నవల విడుదలై, నవల మీద వచ్చిన సమీక్షలు చూసేసరికి ఆయన తల తిరిగిపోయింది, షాక్ తిన్నట్లయింది. ఆ షాకే యీ వ్యాసానికి మూలం. తాను రాసిన 'స్వయంవరణం' గూఢ కావ్యం కాదు – యెవరికి తోచిన అర్థాలు వాళ్ళు లాగడానికి. అతి శుభ్రమైన, స్పష్టమైన, చక్కని సామాజిక నవల. కానీ తాను ఉద్దేశించింది వేరు, సమీక్షకులు తనకు అంటగట్టిన ఉద్దేశాలు వేరు. ఆ సమీక్షకులెవరో వాళ్ళకు మాధన్యవాదాలు – సమకాలిక తెలుగు సాహిత్య నిజస్వరూపానికి రామమోహనరావుగారి కన్నులు తెరిపించినందుకు.

**(సంవేదన పత్రిక సంపాదకుడు)**

'స్వయంవరణం' ఎందుకు వ్రాశాను? రాయడంలో నా ఉద్దేశం ఏమిటి? – అనేది తెలుగు పాఠకుల ముందు సమాధానం చెప్పుకోవలసి వున్నట్లే వుంది. చాలామంది ఈ నవల వ్రాయడంలో నా వుద్దేశం ఇది – అనేసరికి తెల్లబోవలసి వచ్చిన ఘట్టాలు కూడ లేకపోలేదు.



BRAOU

కులవ్యవస్థ ఈనాడు మన పురోగమనానికి ఆటంకంగా వున్నదనే విషయంలో చాలామంది నాతో ఏకీభవిస్తారు. సాంఘికంగానూ, ఆర్థికంగానూ దానికి పట్టు సడలిందనీ, రాజకీయపు పట్టు మాత్రమే మిగిలిందనీ అన్న అభిప్రాయం విషయంలో కూడా అంతే. మిగిలిన కొద్దిపట్టునూ వూడగొట్టడానికి అంతర్వర్ణ వివాహాలు జరగాలనేది మార్గం అనేటట్లయితే కేవలంగా దానిని చెప్పరాదనే వుద్దేశం నాది. అసలు కులం సమస్య వివాహాలకు ప్రాతిపదిక కాకూడదంటాను. కులంలోనే పెళ్ళి జరగాలనే సంప్రదాయ వాదులకీ, కులం బయటనే జరిగితీరాలనే "గోరా" వంటివారికీ భేదం తక్కువ అనే నా అభిప్రాయం. అయితే 'స్వయంవరణం'లో మనకెదురైన ప్రధాన జంటలు రెండూ వివిధ వర్ణాల కలయికకావడం యాదృచ్ఛికమేనని గ్రహించడం కష్టమేం కాదు. ప్రభాకరరావు రుక్మిణికి తెలిసి వుండడం Incidental. సుధ చెల్లెలు లలిత చేసుకున్నది స్వకులమేకాదు, స్వశాఖ వాడినే. కథా గతిలో కులాల ప్రసక్తి వస్తుందేగాని, ఇందులో జంటలెవ్వరూ, ముఖ్యంగా ప్రధానపాత్రలది ఆ సమస్య కానేకాదు.

"మన సమాజాన్ని కుంగదీస్తున్నాదీ, ముందుకు అడుగువెయ్యకుండా దిగతీస్తున్నాదీ మిగిలిన వాటన్నింటికన్నా మన మనస్తత్వం. నిత్యజీవితంలో, వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. జనం గ్రామాలు వదలి పట్టణాలు చేరుతున్నారు. అవి వెనుకటి బాంధవ్యాలనీ, ఆత్మీయతలనూ భగ్నం చేశాయి. నూతనంగా వస్తున్న ఆత్మీయతలను యువతరం ఆత్మీయం చేసుకొన్నారు." 'స్వయంవరణం' 28వ పుటలో సుధ తల్లితో అన్యకులంవాడయిన సుబ్బారాయుడు – "రక్తబంధువు కాకపోవచ్చు. ఆయన విషయంలో మామయ్య అనే పిలుపు కేవలం మర్యాదకి మాత్రమే కావచ్చు కాని వాళ్ళ యింట్లో మామయ్యగారి యింట్లో లేని చనువు నాకుంది. మామయ్యగారి కుటుంబంకన్నా వారి కుటుంబమే నాకు దగ్గరిది కాదటమ్మా!" అంటుంది.

తరువాతి పుటలోనే తల్లితో ఆమె ... "మన జీవితాలలో, జీవిత పద్ధతులలో బోలెడు మార్పు వచ్చింది. ఆ మార్పులకు దారితీసింది మీరు. మేము ఆ మార్పులో పుట్టాం, పెరిగాం. ఇప్పుడిదంతా అబద్ధం అంటే? మాకిదే సత్యం. మీరు చెప్పేదే అసత్యమూను".

సమాజంలో వచ్చిన మార్పుల విషయంలో రెండురకాల పరిస్థితి ఇది.

ఇదే విషయం మన జీవితరంగాలన్నింటా కన్పిస్తూంది. చదువులు, ఉద్యోగాలు, కట్టు, బొట్టు, భోజన, భాజనాలు అన్నింటా చూస్తున్నాం.

కాని, వివాహాల విషయం వచ్చేసరికి సంఘర్షణ తీవ్రరూపంలో వుంటూంది. వుంటుందికూడాను.

దానికి పెద్ద కారణమే వుంది.

మన సమాజానికి యూనిటు కుటుంబం, సమాజంలో వచ్చే మార్పులు కుటుంబాన్ని అంటకుండా వుండడం జరగదు. కుటుంబంలో వచ్చే మార్పులు కూడా సమాజం మార్పుకి కారణం అవుతాయిగాని, కొన్ని ప్రత్యేక ప్రయోజనాల దృష్ట్యా సామాజికమైన మార్పు (విచ్ఛిన్నత) సులభంగా వస్తుంది. అక్కడ సంబంధాలూ, పట్టూ కొంచెం దూరం కావడమే కారణం.

కాని కుటుంబంలో మార్పు ప్రత్యక్షం, సన్నిహితమూను. కనుక ఇక్కడ ప్రతిఘటన తీవ్రంగా వుంటుంది.

అదే మనం చూస్తున్నాం.

ఇతఃపూర్వపు ఫ్యూడల్ సమాజంలో సమష్టి కుటుంబం యూనిట్‌గా ఉంది. దానిలో పెద్దరికం సహజంగానే తల్లితండ్రులది. పెళ్ళిళ్ళు, పేరంటాలు, వారి పెత్తనంలోనివి. ఏ కారణంచేతనైనా కొడుకులూ, కూతుళ్ళూ దాంపత్య సంబంధాలను విచ్ఛిన్నం చేసినా అధికారం వారిదే. ప్రధాన కారణం కుటుంబంలో ఆర్థికబలం అతని చేతిలో ఉంటుంది.

కాని ప్రస్తుత వ్యవస్థలోని సంఘంలో యూనిటుగా వున్న కుటుంబ పరిస్థితి వేరు.

పెళ్ళికాగానే యువతీయువకులు తమ కుటుంబాన్ని వేరు పెట్టుకొంటున్నారు, చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాలు, పరిశ్రమలు, ప్రాజెక్టులు వారిని ఆ స్థితికి ప్రోత్సహిస్తున్నాయి, బలపరుస్తున్నాయి, అన్నింటికన్నా చిత్రం తల్లిదండ్రుల చేత ఈమాదిరిగానే కుటుంబ విశీర్ణంకావడానికి అంగీకరింపచేస్తున్నాయి.



BRAOU

ఆర్థిక దృష్టితో విక్షిణ్ణం కావడానికి అంగీకరించినా పెద్దవాళ్ళు ఆ యూనిట్లను తమ పెత్తనంలోంచి పూర్తిగా పోవడాన్ని అంగీకరించలేరు. ఆ భయంతోనే పిల్లల పెళ్ళిళ్ళమీద తాము పెత్తందారీతనం వహించడానికి ఆలోచన. ఏ చెల్లెలికూతుర్నో కొడుకునో, తమ వూళ్ళోవాళ్ళ నుంచే బంధువులనుంచే, కులంనుంచే, శాఖనుంచే జోడీ కుదిరిస్తే తమ ప్రాబల్యం ఏదోరూపంలో నిలుపుకోవచ్చేననే ఆశ – అది వ్యర్థమే అయినా – వారిని పీడిస్తూంది.

అంతరాలలో ఉన్న ఈ ఆశ అనేక రూపాలలో బహిర్గతం అవుతూంది – తెలిసీ, తెలియకుండాను.

కుటుంబ సంబంధమైన సెంటిమెంట్సూ, ఆర్థిక సంబంధమైన బెదిరింపులు, ఆశలు, రాజకీయ సంబంధమైన అరమరికలు – అనేక రూపాలు.

వానిలో ప్రధానమైన యువతీయువకులలో ఒకరియెడ ఒకరికి అనుమానాలు, దురభిప్రాయాలూ కలిగించడం ఒక పెద్ద ఆయుధం, వారిచేతిలో వుందీవేళ. సమాజంలో ఉన్న ప్రచారసాధనాలన్నీ ఈవేళ వారి పబ్బం గడుపుతున్నాయి. చౌకబారు ఆదరణకోసం రచయితలు కథలూ, నవలలూ, ఆ కథావస్తువులతో (యువతీయువకులొకరినొకరు మోసగించుకొని జీవితాలు పాడుచేసుకొన్నట్లు) జనంమీద పడుతున్నారు. 'బ్రహ్మచారి' వంటి సినీమాలు అమ్మయ్యో ఇంకేమన్నా ఉందా అనిపిస్తున్నాయి. అనంత వైవిధ్యంవున్న, ఈ జీవితంలోని అసాధారణ ఘటనలకి సాధారణత్వం కలిగించి సాహిత్య క్రక్రియ లక్షణాన్ని సంపన్నం చేస్తున్నారే గాని, దానివలన కలుగుతుందన్న ప్రమాదాన్ని అర్థం చేసుకోవడం లేదు, ఈవేళ తమ బిడ్డలకు పెళ్ళిచేయలేక తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు, లాడ్జీలు, కాల్‌గరల్స్, తదితర రూపాలలో ప్రత్యక్షం అవుతూన్న అవినీతి పరిస్థితులూ చూసి ఏమి చెయ్యాలోతోచక దిగ్భ్రమ చెందిన స్థితికి వచ్చింది మనసమాజం. రాబర్ట్ కెన్నడీ హత్యానంతరం తమదేశం ఆస్థితికెలావచ్చిందా అనిపిస్తుపోతున్న అమెరికన్లస్థితికే మనమూ ఏదో రూపంలో వచ్చాం.

మన అవ్యవస్థను ఇలాగే కొనసాగిస్తే –

యువజనం మధ్య అనుమానాలే బలపడి వారి జీవితాలు అస్తవ్యస్తం అవుతాయి. యౌవనావేశాలు తాత్కాలికంగా వారిని గాడిలోకి తెచ్చినా, అవి యావజ్జీవం వారిని ఆ స్థితిలో వుంచగలవా?

రెండోది భిన్నతరాల మధ్య ద్వేషాలు పెచ్చడానికే దారితీస్తాయి.

పెద్దతరంమీద విశ్వాసం, భక్తి మిగలడం జరగదు. ఒకమారు తన అభిమానాన్ని చంపుకోవలసిన వ్యక్తి గాయపడి, జీవితం గడుపుకోలేకపోయిన పులి మనిషి మాంసం రుచి మరిగినట్లే తయారవుతాడు. ఎవరి విషయంలోనూ అతడు సద్భావం కనపరచలేడు.

మూడోది ఈ ప్రయత్నం దేశానికి, అరిష్టదాయకంగా తయారైన కులవర్ణ వ్యవస్థకు అనవసరంగా ప్రాణదానం చేస్తూంది. పురూరవుడు యౌవనదానం చేస్తే మాత్రం యయాతి ముసలిబుద్ధి పునర్వికాసం పొందుతుందా? అసంభవం.

వయోజనులలో ఇప్పుడు కనిపిస్తున్న అనేక అవాంఛనీయ ధోరణుల్ని చూపించి తమ ధోరణిని బలపరచుకొనేందుకు ప్రయత్నిస్తున్న పెద్దవాళ్ళు ఈ స్థితిని సృష్టించినది తామేనని మరిచిపోకూడదు.

"ఏ కుర్రవాడూ ఒక అమ్మాయిని కోరేడంటే పెళ్ళి చేసుకోవాలనే సద్బుద్ధితోనే వ్యవహరిస్తాడు. ఆ స్థితిని చెడగొట్టేది ఇరువేపుల ముసలివాళ్ళూను. పిల్లవాళ్ల దృష్టిలోకిరాని డబ్బు, కులం, హోదాలూ, కుటుంబాలూ గురించి వాళ్ళ బాధ. పడుచువాళ్ళు, అనుసరించే పరస్పరాకర్షణ, మాటలతో చెప్పలేని మానసిక సాన్నిహిత్యం వాళ్ళ కక్కర్లేదు ..." (పుట – 102).

పెద్దవాళ్లు తమ పెద్దరికానికి స్వస్తి చెప్పక భావితరాన్ని బంధించి వుంచడానికే ప్రయత్నిస్తే విఫలులు కాక తప్పదు.

అప్పుడు సమాజాన్ని శైథిల్యం నుంచి కాపాడగల ఆశ యువతరం యొక్క యౌవనావేశాలూ, తిరుగుబాటు స్వభావమూనే. వాటికి 'తాత్కాలిక' విశేషణం తగిలించినా అదే భవిష్య దాశారేఖ.

రుక్మిణిలాగ "ఆ ఆనందం, ఆ అనుభూతి, ఆకాంక్ష నావి, నా స్వంతం. వాటిలో ఒకరి ప్రమేయంలేదు. స్వల్పకాలమేనా సుఖాన్ని అనుభవించనీ, తరువాత వినొచ్చులే పెద్దవాళ్ళ హితబోధలూ, ఏడుపులూ, ఎత్తిపొడుపులూ, వానితో ఈ సుఖ స్వప్నాన్ని పీడకల చేసుకోదలచలేదు..." అని చెప్తారు, చెప్పాలి.

ఇదీ నా నవల 'సమాప్త సమాకాంక్షితం'.

మంచయినా, చెడ్డయినా, ఉచితమయినా, అనుచితమయినా ఆశయసిద్ధికోసం, కులవ్యవస్థ కూలిపోవడం కోసం, కులాంతర వివాహాలు, మతాంతర వివాహాలు జరిగిపోవటం నవల సమాప్త సమాకాంక్షితం - కాదు.

యువతరం తిరుగుబాటు - వారిని పట్టివుంచేందుకు పన్నిన వలచేరుల్ని తెంపుకొని బయటపడేందుకు తిరుగుబాటు - అదీ నా కాంక్షితం.

అసలు పేరును "స్వయంవరం" అనకుండా "స్వయంవరణం" అనడంలోనే ఆభావం కనబరచాను.

# నవల, నవలా పఠనం

**కేతు విశ్వనాథరెడ్డి**

(సంపాదకుడు రాసిన 'నవల, నవలా పఠనం' అనే వ్యాసాన్ని దిగువ ఇస్తున్నాము. ఈ వ్యాసం నవలను కల్పనా సాహిత్య ప్రక్రియగా, ఆధునిక మహేతిహాసంగా పరిచయం చేసే వ్యాసం. కథానిక విభాగానికి సమకూర్చిన కథాంగాలు వ్యాసంలోలాగే, ఈ వ్యాసంలో కూడా నవలాంగాల పరామర్శ అంటే నవల లక్షణాల పరామర్శ ఉంది. నవలలను చదవడంలో విద్యార్థి పాఠకులకు ఉండవలసిన సాహిత్య విమర్శక స్పృహను కలిగించటానికి ఈ వ్యాసం తోడ్పడవచ్చు.

తెలుగు నవలా చరిత్రనూ, ఆ చరిత్రలో స్వయంవరణం స్థానాన్ని ఈ పుస్తకంలో పొందుపరచడం లేదు. ఇంగ్లీషు నవల 18వ శతాబ్దిలో పుట్టినా, తెలుగు నవల 19వ శతాబ్దిలో పుట్టినా, పుట్టుకకు దారితీసిన పరిస్థితులు స్థూలంగా ఒకటే. చదవదగిన పుస్తకాలలో ఇచ్చిన తెలుగు పుస్తకాలను చదవడం ద్వారా తెలుగు నవలావిర్భావాన్నీ చరిత్రనూ గ్రహించవచ్చు. తెలుగు నవలా వికాసంలోని వివిధ దశలను గుర్తించడం ద్వారా స్వయంవరణం వంటి నవలల ప్రాధాన్యాన్ని గ్రహించవచ్చు.

నాటకం, నాటికకు సంబంధించిన లక్షణాలను తెలుగు మౌలిక అంశాలులో కొంత తెలుసుకున్నారు. వాటిని విపులంగా తెలుసుకునే ప్రయత్నం కూడా నాటక, నాటిక సాహిత్యంపై వచ్చిన విమర్శ గ్రంథాల ద్వారా చేయండి).

నవల ఒక కల్పనా సాహిత్య ప్రక్రియ అనీ, ఆధునిక మహేతిహాసమనీ సాహిత్య విమర్శకులు అంటారు. ఎందుకోసం అట్లా అంటారు?

నవలలు రచయితలు కల్పించిన కథలు. అవి రచయితల భావనా ప్రపంచంనుండి, సంఘసంస్కారం నుండి పుట్టిన కథలు. ఈ కథల మౌలిక లక్షణం సంభావ్యత. అంతేకానీ చరిత్రలాగా యాథార్థ్యంకాదు. ఇవి మన మహాభారతంలాగా, భాగవతంలాగా కవిత్వరూపంలో ఉండవు. అట్లాగే నాటకరూపంలో కూడా ఉండవు. ఏదో ఒక కథన పద్ధతిలో నవలలు వచనంలో ఉంటాయి. అంటే నవలలు కల్పనా కథావచన సాహిత్యంలోకి చేరుతాయన్నమాట. కల్పనాకథా వచన సాహిత్యాన్ని ఇంగ్లీషులో Prose Fiction అంటారు.

నవలను గురించి పరిశీలించేటప్పుడు మనం ముందుగా గుర్తుంచుకోవలసిన అంశాలు మూడు - నవల లిఖిత రూపమనీ, అది వచన రూపమనీ, కల్పనా కథారూపమనీ.

నవల లిఖితరూపని ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాలి? అదేమైనా నవలా సాహిత్య స్వభావాన్ని తెలియచేస్తుందా?



BRAOU

కవిత్వాన్ని సాధారణంగా వినడానికి ఇష్టపడతారు. నాటకాన్ని చూడడానికి ముచ్చటపడతారు. నవలను ఏకాంతంగా తీరికను బట్టి చదవడానికి ఆసక్తి చూపుతారు.

అచ్చు అవకాశాలూ, ప్రచురణ సౌకర్యాలూ, పత్రికలవ్యాప్తి, కృత్రిమంగా కాంతిని కల్పించుకోగలిగిన యాంత్రిక పరిస్థితులూ, పఠనాసక్తి, ఆసక్తి ఉన్న సాహిత్యాన్ని చదువుకోగలిగిన తీరికా, అక్షరాస్యత విస్తరణా, గ్రంథాలయ సౌకర్యాలూ, వివిధ విజ్ఞానశాస్త్రాల వికాసమూలేని కాలంలో లిఖిత వచనవ్యాప్తిని ఊహించలేము. కవిత్వంతోపాటు కథ ఉండి, విస్తృత జీవిత చిత్రణకు అవకాశం ఉండిన ఇతిహాసాలతో పోల్చదగిన వచన కథా ప్రక్రియ అయిన నవలను ఊహించలేము. అంటే, విజ్ఞాన వ్యాప్తికీ, వచన వికాసానికీ అవసరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడే ప్రపంచంలోని ఏ భాషలో అయినా నవల పుట్టింది, వ్యాప్తి చెందింది అనే విషయాన్నిమనం గమనించాలన్నమాట.

ఇతిహాసాల్లో, ప్రాచీన కావ్యాల్లో 'కథలతో పాటు కవిత్వం ఉంది. కవిత్వం లేకుండా కథ మాత్రమే ఉన్న పాఠకులపరంగా నవల సాధించిందేమిటి? నవల ఏ సామాజిక వికాసానికి గుర్తు?

"కవిత్వం ఆదిమకాలంలోనే పుట్టింది. ఆదికావ్యం యిక్కడ వాల్మీకితోనూ, యూరప్‌లో హోమర్‌తోనూ సుమారు మూడువేల యేండ్ల క్రితం పుట్టింది. తరువాత రెండున్నర సహస్రాబ్దాలకు గానీ వచనం పుట్టలేదు. అంతవరకు ఎందుకు పుట్టలేదంటే, మానవ నాగరికతా, మానవ సంస్కారమూ పెరిగి పెరిగి ఒక దశకు చేరుకుంటేతప్ప వచనం పుట్టజాలదు. మానవుడు ప్రకృతినీ, జీవితాన్నీ వివేకంతో పరిశీలించి, హేతు బద్ధంగా ఆలోచించగలిగినప్పుడు మాత్రమే వచనం పుట్టగలదు. అగ్నినీ, సూర్యున్నీ, గాలినీ, వానమా, కొండ లనూ, నదులనూ, దేవతలనీ అనుకున్నన్నాళ్ళూ కవిత్వమే పుట్టుతుందిగాని వచనం పుట్టదు. వాటిని ప్రకృతి నియమాలకు లోబడిన శక్తులుగా గ్రహించినపుడే వచనంపుట్టే అవకాశమూ, పుట్టవలసిన అవసరమూ యేర్పడ తాయి. విజ్ఞాన శాస్త్రాలన్నీ వచనం పుట్టినప్పటినుండే వికసించడం చరిత్రలో యాదృచ్ఛికంగా జరిగిన ఘటన కాదు. వచన వికాసానికీ, శాస్త్రవిజ్ఞాన వికాసానికీ ఆధారం ఒకటే - ఒక దశకు చేరుకున్న మానవ సంస్కారం.

యూరప్‌లో ఫ్యూడల్ (వ్యవసాయ) నాగరికత అవసానదశకు చేరుకొని, బూర్జువా (వ్యాపార) నాగరికత ఆవిర్భవిస్తున్న కాలంలో వచనం పుట్టింది" (అలసిన గుండెలు అనే తమ కథల సంపుటి చివరలో ఆ కథల సంపుటి రచయిత రాచమల్లు రామచంద్రారెడ్డి రాసిన "కథానికా, దాని శిల్పమూ" అనే వ్యాసంలోవి ఈ మాటలు. ఈ పుస్తకాన్ని యుగసాహితి ప్రొద్దుటూరువారు 1982లో ప్రచురించారు.)

ఈ మాటలనుబట్టి ఒక విషయం స్పష్టమవుతుంది : సాహిత్య చరిత్రలో కవిత్వం తరువాతనే వచన వికాసం జరిగింది. మనుషులు ప్రపంచాన్ని మరింత హేతుబద్ధంగా ఆలోచించటానికి ప్రయత్నించినపుడే వచన వ్యాప్తి సాధ్యమైంది. అంటే ప్రపంచాన్ని లోబర్చుకోవటానికీ, తమకనుగుణంగా మార్చుకోటానికీ, తమ సామాజిక అవసరాలకు అనుగుణమైన ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరచుకోవటానికీ మనుషులు చేసే నిరంతర కృషిలో భాగంగానే వచనం పుట్టిందనీ, వచనవ్యాప్తి జరిగిందనీ అర్థం. వచనభాష కవిత్వభాషకు పరిణతరూపం. అది జటిలమూ, సంక్లిష్టమూ అయిన భావాలను కూడా సంక్షిప్తంగా, నేర్పుగా, సూటిగా, సూక్ష్మంగా చెప్పగలిగిన భాష.

నవలలు రచయితలు కల్పించిన కథలన్నాము. అవి కల్పనాకథావచన సాహిత్యంలోకి చేరతాయన్నాము. అంటే దీని అర్థం నవలలో రచయితలు చిత్రించే ప్రపంచం మాటల ద్వారా జరుగుతుంది కాబట్టి అది పాఠకుల మనస్సులో కలిగించే మాట ప్రపంచం - కల్పిత ప్రపంచం - అని, భ్రమింపచేసే ప్రపంచం అని.

ఇట్లా అంటే మనకు రెండు ప్రశ్నలు ఎదురవుతాయి. నవలల్లో కథలు కల్పనలైతే ఇతిహాసాలు, పురాణాలూ, మహాకావ్యాలూ, నీతికథలోని కథలు ఏరకం అన్నది మొదటి ప్రశ్న? రెండవ ప్రశ్న నవలల్లో సంఘ వాస్తవం అనేది ఉంటుంది అంటారు కదా అదేమిటి?

మన ప్రాచీన కవిత్వంలో ఉండే కథల్లోగానీ, వచనంలో ఉండే కొద్ది కథల్లో కానీ ఉండేది నిజానికి కల్పనే. అవి కల్పనా కథలే అయితే ఆ కల్పనకు ప్రధాన ప్రేరణ అలౌకిక భావాలూ; కాకపోతే అద్భుత వీరుల అతిమానుష చర్యలూ, భావాలూ, మానవ భావారోపిత మనుష్యేతర ప్రాణుల చర్యలూ, భావాలూ, ఆ కల్పనకు ప్రయోగించిన భాష కూడా అసాధారణమైన భాష. నవలకు ప్రధాన ప్రేరణ మన కళ్ళ ఎదుటి ప్రపంచం, మన

లౌకిక భావాలు, మన సంఘజీవితం. ఇది ఇతివృత్తంలో, వాతావరణ చిత్రణలో, పాత్ర నిర్మాణంలో, సంభాషణల్లో, కథనంలో, ప్రాపంచిక దృక్పథంలో వ్యక్తమవుతుంది. భాషకూడా సాధారణంగా ఉంటుంది. దీనే సంఘవాస్తవం అంటారు.

నవలకు నిఘంటువుల్లో ఉన్న అర్థాలనూ, రచయితలూ, విమర్శకులూ ఇచ్చిన నిర్వచనాలనూ కొన్నిటిని చూడండి :

1. "A fictitious prose narrative of considerable length, in which characters and actions representative of real life and portrayed in a plot of more or less complexity" [The Shorter Oxford English Dictionary].

2. "An invented prose narravice that is usually long and complex and deals with human experience, through a connected sequence of events" [Webster's New Collegiate Dictionary].

3. "A fictitious narrative in prose, usually of sufficient length to fill a volume, portraying characters and situations from real life" [Collins English Dictionary].

4. "A fictitious prose narrative or tale representing a picture of real life, especially of the emotional crises in the life history of the man and women portrayed" [Chambers Twentieth Century Dictionary].

5. "Novel, in mattrs of literature, a fictitious history of series of surprising and entertaining events in common life, where in the rules of probability are or ought to be strictly preserved; in which it differs from a romance, where the hero or heroine is some prince or princess and the events which lead to the catastrophe in general highly absurd and unnatural" [Complete Dictionary of Arts and Sciences known as Crokers Dictionary, 1765].

6. "A fictitious narrative [usually is prose] of some considerable length, representing human beings and their actions, adventures and passions, and displaying varieties of human characters in relation to life; distinguished in the last feature from the old rommance [Wyld's Universal Dictionary of the English Language, 1936].

7. (a) "The novel as an art from in its own right, with its own rules, with its universal acceptance and appreciation, is a creature of the printing press".

(b) "It is the great folk art of our civilization, the successor to the epic and the chanson de geste (శబ్దాలంకార ఛందోరూపంలో ఉండే ఇతిహాసం. చారిత్రక వ్యక్తులమీదా పౌరాణిక వ్యక్తులమీదా, ఆరకం సంఘటల మీద అల్లిన ఇతిహాసం Chanson de geste సం) of our ancestors".

8. "The novel is a genere of fiction and fiction may be defined as the art or craft of contriving, through the written word, representation of human life that instruct or divert or both".

9. (a) "ఈనాటి నవలకూ, చిన్నకథకూ పూర్వస్వరూపాలు ఇతిహాసము, ఉపాఖ్యానమూను".

(b) "ఒకే సంఘటనను చిత్రించేది కథ. ఒక జీవిత భాగాన్ని చిత్రించేది నవల".

(c) "నవలలో కదిలే జీవితం ప్రతిబింబమవుతుంది. దీన్ని సినిమా చిత్రంతో పోల్చుతారు. నవలలో అనేక సన్నివేశాలూ, అనేక సంఘటనలూ ఉంటాయి. పాత్రల చిత్త ప్రవృత్తులేగాక వాటిలో కలిగేమార్పులూ, పాత్రలపై సంఘటనల ప్రభావంతోపాటు సంఘటనలకు పాత్రలు వహించే బాధ్యతకూడా స్పష్టంగా చిత్రితమవుతాయి. జీవితం తాలూకు "వాతావరణం" కూడా నవలలో ఉంటుంది. మానవుల ఆశయాలూ, ఆశయసిద్ధికి వారు చేసే కృషి, ఆ కృషికి ఏర్పడే అవాంతరాలూ, జీవిత సంఘర్షణా నవలలో విపులంగా చిత్రించటానికి వీలున్నది ... ఒక కాలానికి చెందిన నవలలన్నీ చదివేస్తే ఆ కాలపు సాంఘిక చరిత్ర చాలావరకు తెలిసిపోతుంది. ఈ చరిత్ర ఏ ఒక్క నవలలోనూ సమగ్రంగా ఉండటానికి



BRAOU

వీల్లేదు. ఎందుచేతనంటే నవలాకారుడు తనకు పరిచయం అయిన వాతావరణాన్నీ, జీవితాన్నీ, పాత్రలనూ మాత్రమే సృష్టించగలడు (కొడవటిగంటి కుటుంబరావు,(a) (b) సాహిత్య ప్రయోజనం (వ్యాసావళి), విశాలాంధ్ర, విజయవాడ 1969 పుటలు, 49, 56, చిన్న నవల, కళాకేళి పత్రిక).

ఈ అర్థాలనూ, నిర్వచనాలనూ గమనిస్తే నవలను గురించి మనం ఇట్లా అభిప్రాయానికి రావచ్చు. నవల అంటే సంభావ్యమయ్యే సంఘజీవుల వచన కల్పనాకథ. మన నాగరికతా, అచ్చుయంత్రమూ సృజించిన కళారూపం. ప్రాచీనుల ఇతిహాసానికి (మహాకావ్యానికి) పరిణామరూపం. జీవితాన్ని వ్యాఖ్యానించి మంచి మార్పుకు దోహదం చేసేది కావచ్చు. కేవలం వినోదం కల్గించేది కావచ్చే. రెంటినీ సాధించేది కావచ్చు. చెడు ప్రభావాన్ని కల్గించేది కావచ్చు.

## నవలా పఠనం

మనం ఒక రచనను చదివి పక్కన పెట్టటం అలవాటు. దాన్నిగురించి ఆలోచించకపోవటం సాధారణంగా జరగవచ్చు. రచనను చదవటమనేది ఒకపని, ఒక అభ్యాసం, ఒకకళ. పనికి సంబంధించిన మెలుకువలలాగే, అభ్యాసంలాగే, కళకు సంబంధించిన ఒక అనుభవంలాగే, రచనను శ్రద్ధగా పరిశీలనగా చదివే మెలుకువలు అబ్బినపుడు అది నిజమైన సాహిత్యాధ్యయనం అవుతుంది. సాహిత్యాస్వాదనం అవుతుంది. మన సంస్కారాన్ని ఎటువైపు అభివృద్ధిపరచుకుంటున్నామో అర్థమవుతుంది.

నవలను చదివేటప్పుడు నవలా ప్రక్రియ అనేది రూపొందటానికి కారణమైన అంశాలపట్ల అంటే లక్షణాలపట్ల స్పృహ ఉండాలి. నవలాపఠనంలో అట్లా పాఠకులు స్పృహలో ఉంచుకోవలసిన అంశాలు నాలుగు స్థాయిలలో ఉంటాయి : 1. విషయ వాస్తవస్థాయి 2. వస్తు లక్ష్యస్థాయి 3. సాహిత్యస్థాయి 4. తాత్వికస్థాయి.

విషయస్థాయికి సంబంధించిన అంశాలు : 1. ఇతివృత్తం 2. పాత్రచిత్రణ 3. వాతావరణం. వస్తు లక్ష్యస్థాయికి సంబంధించిన అంశాలు 1. రచనోద్దేశం (theme). సాహిత్యస్థాయికి సంబంధించిన అంశాలు 1. రచనా నిర్మాణం (Structural Pattern) 2. దృష్టికోణం (Point of View) 3. కంఠస్వరం (Tone) 4. రచనా విధానం/శైలి (Style). తాత్వికస్థాయికి సంబంధించిన అంశాలు : 1. రచయిత ప్రాపంచిక దృక్పథం 2. రచన ధోరణి (trend or tradition).

వీటిని ఇల్లా విభజించడంవల్ల లాభమేమి? స్పష్టతే లాభం. విషయ స్పష్టత ఆలోచనల స్పష్టతకు దారితీస్తుంది. అందువల్ల ఈ విభజనల్లోని మొత్తం పది లక్షణాలనూ విపులంగా తెలుసుకోవడం అవసరం (నవల లక్షణాలను నవలాంగాలు అని కూడా అనవచ్చు - కథాంగాలులాగే).

## విషయవాస్తవస్థాయి

కథ దేన్ని గురించి ? ఎవరి గురించి? కథలోని ముఖ్యాంశాలు ఏమిటి? అవి సంఘటనలుగా ఎట్ల ఏర్పడ్డాయి? ఆ సంఘటనల మధ్య సంబంధాలేమిటి? వాటిలో పాత్రలైన వారి చిత్తప్రవృత్తులేమిటి? వారి కార్యకలాపాలు ఎక్కడ జరుగుతున్నాయి? ఆ చిత్తవృత్తుల సంబంధాల పర్యవసానాలేమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు దొరకాలంటే నవల ఇతివృత్తాన్నీ, పాత్రచిత్రణనూ, వాతావరణాన్నీ మనం పట్టించుకోక తప్పదు రచయిత వాటిపట్ల ఎటువంటి శ్రద్ధాసక్తులను కనపరచాడో పరిశీలించక తప్పదు.

1. **ఇతివృత్తం :** కథ (Story) వేరు. ఇతివృత్తం (Plot) వేరు. కథ అంటే జరిగిన విషయాల వరుస. జరిగిన విషయాలన్నీ ఆసక్తికరంకావు. జరిగిన విషయాలన్నిటిలో రచనకు కావలసిన కార్యకారణ సంబంధాలూ, చర్యా ఉండకపోవచ్చు. అందువల్ల కేవలం కథ నవల కాదు. ఒక ఇతివృత్తం నవలకు దారితీస్తుంది. ఇతివృత్తం అంటే కార్యకారణ సంబంధముండే ఉత్సుకతను కలిగించే సంఘటనల పరంపర లేదా సంఘటనల క్రమం. దీన్ని సంఘటనలలో పాల్గొనే వ్యక్తుల చర్యల క్రమం అని కూడా అనవచ్చు. అంతేకాదు ఆయా సంఘటనల్లో పాల్గొనే వ్యక్తులమధ్య ఘర్షణ అయినా, భావాల మధ్య ఘర్షణ అయినా, కోరికలూ, ఆశయాల మధ్య ఘర్షణ అయినా, వీటిక్రమం ఇతివృత్తం అవుతుంది. ఇతివృత్తంలో ఒక ప్రధానపాత్ర అంటే నాయకుడూ లేదా నాయిక ఉంటే ఉండవచ్చు, లేదా ఒక వర్గం ప్రధానపాత్రగా ఉండవచ్చు.

ప్రధాపపాత్ర (అంటే కేంద్రపాత్ర) లేదా ప్రధానవర్గం (అంటే కేంద్రవర్గం) మరొక వ్యక్తితోగానీ సమూహంతోగానీ, వర్గంతోగానీ ప్రత్యర్థిస్థానంలో ఉండవచ్చు. ఒక్కొక్కప్పుడు ప్రకృతిగానీ, సమాజ



BRAOU

శక్తులుగానీ, 'విధి'గానీ ప్రత్యర్థి స్థానంలో ఉండవచ్చు. మరొక్కప్పుడు ప్రధానపాత్ర అంతఃస్వభావంలోని కొన్ని అంశాలే ప్రత్యర్థి స్థానంలో ఉండవచ్చు. చదరంగంలోని ప్రత్యర్థులనూ, ఒంటిగా గదిలో మనలో మనం కుళ్లు కుంటున్నప్పుడో గర్షణపడుతూ ఉన్నపుడో ఉండే మానసిక ప్రపంచాన్నీ ఊహించుకోండి. ఇతివృత్తంలోని ఘర్షణ స్వభావం అర్థమవుతుంది.

ఇతివృత్త నిర్మాణంలో మరొక ప్రధానమైన అంశం సంభావ్యత. ఈ సంభావ్యత అనే మాటను ఇంగ్లీషులో Plausibility, Verisimilitude అనే మాటలతో సూచిస్తూ ఉంటారు. సంభావ్యత అంటే వాస్తవంలో సంభవించవచ్చు అనే సంఘటనల క్రమం. పాఠకులను నమ్మించేటట్లు చేసే చిత్రణ. మరీ యాదృచ్ఛికంగా జరిగే ఘటనలు, కాకతాళీయంగా సంబవించే అంశాలు, మానవజీవితంలో అసలు సంబవించని అద్భుతాలూ సంభావ్యతను దెబ్బతీస్తాయి. విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలులోని పసరిక పాత్ర కన్పించే ఘట్టాల సంభావ్యతను గురించి ఆలోచించండి. సంభావ్యత లక్షణం బోధపడుతుంది.

నవలలో ఇతివృత్త ప్రయోజనాన్ని పరిశీలించేటప్పుడు గుర్తుంచుకోవలసిన ప్రధాన ప్రశ్నలు : 1. కథ మూల స్వభావాన్ని వివరించడంలో సంఘటనల మధ్య ఉండే సంబంధం ఏమిటి, 2. ఇతివృత్తం ఆదిమధ్యాంతాల మధ్య ఒక ఐక్యత ఉంటే పరస్పర సంబంధాలతో సమన్వయం ఉందా, లేదా? సంఘటనలు ఎప్పుడు జరిగాయి? ఏం జరగడానికి దోహదం చేస్తున్నాయి?

**2. పాత్రచిత్రణ :** పాత్రలు అంటే కథలో ఎదురయ్యే మనుషులు. ఆ మనుసుల జీవితాశయాలూ, ఆశానిరాశలూ, భావోద్వేగాలూ, భావాలూ. ఇతివృత్తానికీ పాత్రలకూ ఒక విడదీయరాని బంధం ఉంటుంది. ఇతివృత్తంలో ప్రధానపాత్ర లేదా ప్రధానవర్గం ఏదో తెలుసుకోవాలంటే ఎట్లా? కథలోని ప్రధాన సంఘటనల్లో కన్పించే వ్యక్తి లేదా వర్గం కేంద్రపాత్ర అన్నమాట, కేంద్రవర్గం అన్నమాట. ఈ కాలిక వ్యక్తివల్ల లేదా ఈ కీలక వర్గంవల్ల కథ ముందుకు జరుగుతుంది. సంఘటనల్లో మార్పు వస్తుంది.

ఈ కేంద్ర వ్యక్తిపట్లగానీ, కేంద్రవర్గంపట్లగానీ దృష్టి మార్పుకు గురి అవుతూ ఉంటుంది. నవలలో మనం కేంద్రవ్యక్తి లేదా కేంద్రవర్గాన్ని గుర్తుంచుకునేటప్పుడు వేసుకోవలసిన ప్రశ్నలు : 1. ప్రధానపాత్ర చిత్రణ మనం నమ్మేట్లు ఉందా? ఈ పాత్రలో ఏవి మార్పులు ఇతివృత్తక్రమంలో జరుగుతున్నాయి? ఈ మార్పుల్లో ఒక పద్ధతి, ఒక నియమం ఉన్నాయా? ఏ హేతువూ లేకుండా మారిపోతున్నాయా? అసలే మారిపోలేదా? పాత్రలు జీవితానికి దగ్గరగా ఉన్నాయా లేదా? ఇవి కేవలం వ్యక్తిలక్షణాలను గుర్తుకు తెస్తున్నాయా? సామాన్య లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయా? ఒకే గుణాన్ని గుర్తుకుతెచ్చే మూసపాత్రలా ఇవి? సంక్లిష్టమైన మానవీయ భావాలకూ, భావోద్వేగాలకూ ఇవి గుర్తులా? చదివిన పుస్తకాల్లోంచి పుట్టాయా? రచయిత అనుభవంలోంచి పుట్టాయా? ఈ పాత్రల సామాజిక మనస్తత్వం ఏమిటి? ఆంతరంగిక స్వభావం ఏమిటి? ఈ రెంటికీ ఉన్న సంబంధం ఏమిటి?

పాత్రచిత్రణ నమ్మేట్లు ఉండాలంటే, పాత్రలలో కలిగే మార్పులు నమ్మేట్లు ఉండాలంటే, పాత్రలు సంఘమానవ స్వభావానికి దగ్గరగా ఉండాలంటే ఎట్లా ఉండాలి అనే ప్రశ్న కలగవచ్చు. పాత్రల పరిధినీ, పాత్రల గుణాత్మకమైన మార్పులకు కారణమైన సంఘ పరిస్థితులనూ, ఆ మార్పులు జరుగుతున్న కాలక్రమాన్నీ ఒక క్రమంలో నవలారచయిత చిత్రించగలిగితే ఇది సాధ్యమవుతుంది. సినిమాల్లో తప్ప, అర్భక నవలల్లో తప్ప కేవలం ఆదర్శ దుష్టపాత్ర, ఆదర్శ మంచిపాత్రగా మారిపోవడం సాధ్యంకాదు.

ప్రధానపాత్ర ప్రాధాన్యం వహించే నవలలను పాత్రచిత్రణ ప్రాధాన్య నవలలు అంటారు. సామాజిక జీవిత చిత్రణ, విశ్లేషణ ప్రాధాన్యం వహించే నవలలను సహజచిత్రణ నవలలు అంటారు. బుచ్చిబాబు చివరకు మిగిలేది ఒకరకంగా పాత్ర చిత్రణ ప్రధాన నవల. మహీధర రామమోహనరావు రథచక్రాలు సమాజచిత్రణ నవల. (ఈ రకాలు రెండూ సాంఘిక నవలలవర్గంలోకే చేరతాయి. ప్రాధాన్యంలో తేడానుబట్టి ఉపవర్గీకరించుకుంటున్నాం, అంతే).

**3. వాతావరణం :** వాతావరణం అంటే కథ జరిగే కాలం, పరిసరాలు. పరిసరాలు అన్నప్పుడు అవి ప్రకృతి పరిసరాలు కావచ్చు, సంఘ పరిసరాలు కావచ్చు. రెండూ కావచ్చు. వీటిని నవలా రచయిత స్వయంగా చర్చించవచ్చు. కథలో భాగంగా మలచవచ్చు. వీటి ప్రయోజనం ఏమిటి ?



BRAOU

ఇతివృత్త సంభావ్యత, పాత్రల సంభావ్యత కాల పరిస్థితులను బట్టి, భౌగోళిక (ప్రకృతి) పరిస్థితులనుబట్టి. సంఘ పరిస్థితులనుబట్టి రూపుదిద్దుకుంటాయి. మహీధర 'స్వయంవరణం'లోని సుధా కామేశ్వరరావులను విజయవాడ, విశాఖ వంటి పట్టణాల్లో ఊహించగలం. కానీ మరీ వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో ఊహించలేం. ఉన్నవ లక్ష్మీనారాయణపంతులు రాసిన మాలపల్లి నవలలో చౌదరయ్యవంటి కరకు భూస్వామిని ఒక పెద్ద నగరంలో అట్లాగే ఉంటాడని భావించలేం. తెన్నేటి సూరి రాసిన చెంఘిజ్‌ఖాన్ నవలలో చెంఘిజ్‌ఖాన్‌ను 12, 13 శతాబ్దాల్లో మంగోలియా గోబీ ఎడారుల్లాంటి ఎడారుల్లో ఊహించగలం కానీ, 15, 16 శతాబ్దాల్లో హంపి విజయనగరాల్లో ఊహించలేము.

అంటే పాత్రలు జీవించిన కాలమూ, భౌగోళిక పరిసరాలూ, సంఘ పరిస్థితులూ పాత్రల స్వభావాన్నీ, ఇతర పాత్రలతో సంబంధాన్నీ నిర్ణయిస్తాయన్నమాట. మనకు ఆయా పరిసరాలకూ, పరిస్థితులకూ అనుగుణమైన భావోద్వేగాలనూ కల్గిస్తాయన్నమాట. అంటేకాదు ఇవి రచనోద్దేశాన్ని వెల్లడిస్తాయి కూడా. వీటి ప్రధాన లక్ష్యం ఇతివృత్త నేపథ్యాన్ని సమకూర్చడం అని మరచిపోకూడదు.

**వస్తులక్ష్యస్థాయి :** నవలలోని కథ నుండి రచయిత చెప్పదలచుకున్న అంశమేదో ఉంటుంది. అట్లాంటి అంశాన్ని వస్తులక్ష్యం అంటాం. కథను నడిపే ముఖ్యమైన భావాన్నికానీ, కథకు మూలమైన రచయిత ఉద్దేశాన్నికానీ పరిశీలించటం వస్తులక్ష్యస్థాయి పరిశీలన అవుతుంది. దీన్నే మనం రచనోద్దేశం అని అనవచ్చు. కథానికల్లో అయితే దీన్ని కొందరు విమర్శకులు పాయింట్ (Point) అని పిలుస్తారు.

రచనోద్దేశం రచయిత నవలలోని కథ ద్వారా సామాన్యీకరించిన జీవిత సత్యం. అన్ని రకాల నవలల్లోనూ రచనోద్దేశాలు ప్రస్ఫుటంగా కనపడకపోవచ్చు. మొక్కపాటి బారిష్టరు పార్వతీశంవంటి హాస్యనవలల్లో రచనోద్దేశం హాస్యోత్పాదకతే. అపరాధ పరిశోధక నవలల్లో రచనోద్దేశం అపరాధ పరిశోధనే.

ఈ రచనోద్దేశం ఒక పాత్రను వెల్లడించడం కావచ్చు. అది ప్రకృతిలో, సంఘంలో ఉండే మానవ సంబంధాల ద్వారా వెల్లడి కావచ్చు.

రచనోద్దేశాన్ని ఎట్లా కనుక్కోటం? ఇందుకు కొన్ని సూత్రాలున్నాయి. అవి 1. ఇతివృత్తం ద్వారా రచయిత జీవితంమీద వెల్లడించదలచుకున్న సాధారణీకరణ అంశం ఏమిటి అనేది ఆలోచించడం 2. ప్రధాన పాత్ర లేదా ప్రధానమార్పులు పొందడం ద్వారా తెలిసేదేమిటి అనేది ఆలోచించడం 3. కీలకమైన ఘర్షణ ద్వారా తెలిసేదేమిటి అనేది ఆలోచించడం.

రచనోద్దేశం అనేది ఒక నీతివాక్యంలాగా, ఒక సామెతలాగా, ఒక జాతీయంలాగా, ఒక గంభీరోక్తిలాగా, ఒక పాఠంలాగా ఉండదు. కన్పించదు. అది కథా జీవితసారంలాగా కనపడుతుంది. రావిశాస్త్రి అల్పజీవి రచనోద్దేశం ఏమిటి అని ఎవరైనా ప్రశ్నించారనుకోండి. పిరికితనమూ, భయమూ మనిషిని దారుణమైన ఆత్మ న్యూనతకు గురిచేస్తుంది. ఆత్మ విమర్శనాజ్ఞానం మంచిమార్గాన వెళ్ళే అవకాశం కల్పించవచ్చు అనేదే అల్పజీవిలోని ప్రధానపాత్ర సుబ్బయ్య ద్వారా రచయిత చెప్పదలచుకున్న రచనోద్దేశం అని జవాబు చెప్పవచ్చు.

**సాహిత్యస్థాయి అంశాలు**

రచయిత పాఠకుల్ని ఆకట్టుకోడానికి ప్రయత్నించే పద్ధతులు ఇందులో చేరతాయి. ఇవి రచనా నిర్మాణం, దృష్టికోణం, రచనా విధానం, కంఠస్వరం అని అన్నాము. వీటిని కొంత వివరంగా పరిశీలించాలి.

1. **రచనా నిర్మాణం :** ఒక కథను జరిగిన కాలక్రమంలో చెప్పడానికీ, వెనకుముందు తిరగేసి చెప్పడానికీ, ఫ్లాష్ బాక్ పద్ధతిలో చెప్పడానికీ తేడాలున్నాయి. కాలక్రమ పద్ధతిలో కాకుండా నవలలోని సంఘటనలను వెనకా ముందూ తిరగేసి రాయడం ఎందుకు? ఫ్లాష్ బాక్ పద్ధతి ఎందుకు?

నవలా రచయిత పాఠకుల్లో ఉత్సుకతనో, ఉత్కంఠనో కలుగచేయడానికి ఈ పద్ధతి వినియోగిస్తారు. కాకపోతే ఒక జరిగిపోయిన సన్నివేశాన్ని కథాగమనంలో పాత్ర ఆలోచనల ద్వారా తెల్పదలచుకున్నపుడు ఉత్తమ పురుష కథన పద్ధతి ద్వారాగానీ, చైతన్య స్రవంతి విధానం ద్వారా గానీ ఫ్లాష్‌బాక ఉపయోగించుకుంటాడు. కథా సన్నివేశాలను వరసగా గుదిగూర్చడం మామూలు పద్ధతి. తారుమారు చేయడం దృశ్యపద్ధతి. కొడవటిగంటి కుటుంబరావు నవలల్లో సన్నివేశాలు వరుసగా పేర్చుకుంటూ వెళ్ళే కథా కథనమే ప్రధానంగా కన్పిస్తుంది. కుటుంబరావు చదువు నవలను, గోపీచంద్ అసమర్థుని జీవయాత్రతో ఈ విషయంలో పోల్చి చూడండి.



BRAOU

2. **దృష్టికోణం :** కథను చెప్పడానికి రకరకాల పద్ధతులను చేపట్టడం మనం స్థూలంగానైనా గమనించి ఉంటాం. కథ చెపుతున్నది ఎవరు? కథ చెప్పేవాడు మనల్ని ఎంతమాత్రం తెలుసుకోనిస్తున్నాడు? అతను పాత్రల భావోద్వేగాలనూ, ఆలోచనలనూ ఎంతవరకు, ఎట్లా పరిశీలించి మనకు అందచేస్తున్నాడు? ఈ ప్రశ్నలు దృష్టికోణాన్ని, అంటే రచయిత కథనూ, ఇతివృత్తాన్నీ పాఠకులకు అందించే కథన పద్ధతి (Narrations) ని తెలియచేస్తాయి. (దృష్టికోణాన్నే కథన పద్ధతిలో చేర్చి చెప్పడం సబబు అనవచ్చు). ఇది నాలుగు రకాలుగా జరుగుతుంది.

(a) సర్వసాక్షి కథనం (Omniscient Point of view/Narration) : ఇది ప్రథమ పురుషలో కథ నడిపించే పద్ధతే. కథను తాను గాకుండా ఇతరులద్వారా రచయిత కథను నడిపిస్తాడు. సర్వసాక్షి కథనంలో రచయిత సర్వజ్ఞుడుగా కనపడతాడు, వ్యవహరిస్తాడు. అతనికి ఇతివృత్తంలోని పాత్రల బహిరంగ ప్రపంచం సర్వం తెలుసు. ఒక రకంగా ఆ పాత్రలకు తెలియనివి కూడా తెలుసుకోవచ్చు. రచయితకు విస్తృతమైన రచనా పరిధికి అవకాశం కల్పించే కథన పద్ధతి ఇది. పాఠకున్ని రచయిత ఉద్దేశించిన వైపుకు తిప్పుకోగలిగిన పద్ధతి ఇది. రచయిత అందరికళ్ళతో అందరినీ, ప్రపంచాన్నీ చూస్తున్నట్లు చెప్పే పద్ధతి ఇది. కందుకూరి వీరేశలింగం రాజశేఖర చరిత్రము ఈ పద్ధతికి ఒక ఉదాహరణ.

(b) పరిమిత సర్వసాక్షి కథనం (Limited Omniscient) : ఈ పద్ధతిలో ఒకే ఒక వ్యక్తి పాత్ర దృష్టి నుంచి కథ నడుస్తుంది. ఇదీ ప్రథమ పురుష కథనమే. అన్ని వేళల్లో ఆ పాత్రవైపు మనం ఉంటాం. ఆ పాత్ర అంతరంగంలో మనం జీవిస్తాం. ఇతర పాత్రలు మనకు అంతగా తెలియవు. ఈ పద్ధతి జీవితానికి దగ్గరగా ఉంటుంది. వాస్తవ జీవితంలో మనం మన కళ్ళతో ఇతరులను చూస్తాం. అందరి కళ్ళతో మనం అందరినీ ప్రపంచాన్నీ చూడలేము. ఈ పద్ధతిలో ప్రధానపాత్ర అంతరంగ చిత్రణ చేసే చైతన్య స్రవంతి విధానం కూడా ఉంటుంది. నవీన్ అంపశయ్య ఈ రకంలో చేరుతుంది.

(c) ఉత్తమ పురుష కథనం (First Person point of view) : కథకుడు తాను స్వయంగా ఎరిగిన కథను చెప్పే పద్ధతి ఇది. రచనలో కథకుడు అంటే 'నేను' ప్రధానపాత్ర కావచ్చు, అప్రధాన పాత్ర కావచ్చు. ఈ 'నేను' కు తెలిసిందే, 'నేను' ఆలోచించిందే పాఠకుడికి తెలిసేది. కథన విధి తక్కువైనా పాఠకుణ్ణి రచనకు చాలా సన్నిహితంగా ఈ పద్ధతి ఇస్తుంది. రచయితా, పాఠకుడూ ఈ పద్ధతిలో తాదాత్మ్యం పొందుతారని చెప్పవచ్చు. విశ్వనాథ సత్యనారాయణ మాబాబు ఈ పద్ధతిలో ఉంటుంది.

(d) నాటకీయ కథనం : ఈ పద్ధతి కథనంలో రచయితా పాఠకుడూ ఇద్దరూ ప్రేక్షకులే. చూసినదీ, విన్నదీ మాత్రమే ఈ కథన పద్ధతిలో నమోదు అవుతుంది. పాత్రల మనోభావాల వర్ణన జోలికి ఈ పద్ధతిలో రచయిత వెళ్ళడు. రచయిత వ్యాఖ్యానాలు ఉండవు. ఒక నాటకం లాగా రచయిత కథను మనకు ప్రదర్శిస్తాడు. కథల్లో, చిన్న నవలల్లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రదర్శించినట్లు చూడగలం.

4. **కంఠస్వరం (Tone) :** ఉపయోగించే మాటల ద్వారా, పదబంధాల ద్వారా, సూచనల ద్వారా, కాకువు ద్వారా కథకుని గొంతును మనం కనిపెట్టవచ్చు. కథను ఒక ప్రేక్షకుడిలాగా గంభీరంగా చెపుతున్నానా, కథనంలోని వ్యాఖ్యానాలు తాత్వికంగా ఉన్నాయా, వ్యంగ్యంగా ఉన్నాయా, హాస్యస్ఫోరకంగా ఉన్నాయా, అతి తీవ్రంగా ఉన్నాయా మనం గమనించవచ్చును. ఇతివృత్తం పట్ల పాత్రల చర్యల పట్ల రచయిత వైఖరి ఏమిటో తెలుసుకోవచ్చు. మొక్కపాటి బారిస్టరు పార్వతీశం నవలలో రచయిత కంఠస్వరం హాస్యస్ఫోరకం. కుటుంబరావు వారసత్వం నవలలోని రచయిత కంటస్వరం తాత్వికం, వ్యంగ్యాత్మకం.

5. **రచనా విధానం/శైలి (Style) :** నవలలో రచయితలు భిన్న శైలులను భిన్న సందర్భాల్లో వాడతారు. తను కథ చెప్పే శైలివేరు. పాత్రలు మాట్లాడే శైలులు వేరు. కథ చెప్పే సందర్భంలోనూ, పాత్రలు మాట్లాడే శైలుల్లోనూ రకరకాల అంతరువులు కూడా కన్పిస్తాయి. కథలోని వాతావరణం కూడా శైలులను నిర్ణయిస్తుంది. అంటే గ్రామీణ జీవితాన్ని చిత్రించే నవలలో మాండలికాల ప్రభావం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. ఒక ప్రత్యేక వృత్తికి సంబంధించిన కథలో ఆ వృత్తి తాలూకు పదజాల ప్రభావం శైలి మీద కన్పిస్తుంది. అల్లం రాజయ్య కొలిమంటుకున్నాది నవలలో శైలులు తెలంగాణా మాండలిక భేదాలు. కొమ్మూరి వేణుగోపాలరావు హౌస్ సర్జన్ నవలలో వైద్యవృత్తిలోని వ్యక్తుల వృత్తి శైలులు కన్పిస్తాయి.

నవలను ఒక పాఠం (Text) గా అంటే ఒక క్రమంలో ఏర్పాటైనా పదసంపుటిగా అధ్యయనం చేసే పద్ధతికూడా ఇటీవల వ్యాప్తిలోకి వచ్చింది. అది ప్రత్యేక తరహా పరిశీలన.

**తాత్త్వికస్థాయి అంశాలు**

జీవితం మీద మనకు కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. కొన్ని భావాలు ఏర్పడతాయి. రచయితలకు జీవితంపట్ల ఉన్న దృక్పథాన్నే ప్రాపంచిక దృక్పథం అని స్థూలంగా అంటాం. ఈ ప్రాపంచిక దృక్పథం ఏదో ఒక ధోరణికి చెందవచ్చు. నవల జీవిత వ్యాఖ్యానం, మనోరంజక సాధనం అన్నపుడు మనం జీవిత వ్యాఖ్యానంలో, మనో రంజకత్వంలో ధోరణి ఏ రకంగా ఉందో పరిశీలించవచ్చు.

**ప్రాపంచిక దృక్పథం :** నవలలోని ఇతివృత్తం ద్వారా, పాత్రలకున్న జీవితదృష్టుల చిత్రణ ద్వారా, దృష్టికోణం ద్వారా, టోన్ ద్వారా రచయిత ప్రాపంచిక దృక్పథం ఏమిటో తెలిసిపోతుంది. కేవలం మనోరంజక నవలా సాహిత్యంలోనూ, ఫార్ములా నవలల్లోనూ రచయిత ప్రాపంచిక దృక్పథం కొట్టవచ్చినట్టు కనపడకపోవచ్చు. హింసనూ, మూఢ విశ్వాసాలనూ చిత్రించిన నవలల్లో రచయిత ప్రాపంచిక దృష్టి పాశవికం అని వెంటనే చెప్ప గలుగుతాం. అభ్యుదయ భావాలను చిత్రించిన నవలల్లో రచయిత ప్రాపంచిక దృష్టి సంఘసంస్కారం అని చెప్పగలుగుతాం. నవలలో రచయిత సృష్టించే ప్రపంచం కల్పనే అయినా ఆ కల్పనకు పునాది వాస్తవం కాబట్టి వాస్తవ భావాలు ప్రాపంచిక దృష్టిని ఏర్పరుస్తాయి. ఒక నవల అంతా చదివాక కలిగిన భావాలను మనం విశ్లేషించుకుంటే ఆ నవల మనకు ఏ రకమైన సంస్కారాన్ని ఇస్తుందో తెలిసిపోతుంది. ప్రాపంచిక దృక్పథం అనే మాటను జీవిత దృక్పథం, సామాజిక దృక్పథం అనే మాటలలో కూడా సూచించవచ్చు.

**ధోరణి (Trend) :** కాల్పనిక వాదం (Romanticism), వాస్తవిక వాదం (Realism) అనే మాటలను వింటున్నాం. స్వయం వ్యక్తి వికాసాన్నీ, వ్యక్తి స్వేచ్ఛనూ ప్రధానంగా కోరేది కాల్పనికవాదం అని విమర్శకులు అంటారు. దీనికి భిన్నమైందీ, మొత్తం సామాజిక దృష్టి కలిగిందీ వాస్తవికతా వాదం అంటారు. బాపిరాజు నారాయణరావు నవలనూ, కొడవటిగంటి కుటుంబరావు చదువు నవలనూ పోల్చి చూడండి. విశ్వనాథ చెలియలి కట్టనూ చలం మైదానం నవలనూ పోల్చి చూడండి. ఉన్నవ మాలపల్లినీ, జీ.వి. కృష్ణరావు కీలుబొమ్మలు నవలను పోల్చి చూడండి. రచయితల స్థూల ధోరణులూ, సూక్ష్మ ధోరణులూ అవగతమవుతాయి. నవలా రచయితలకుండే రాజకీయ, ఆర్థిక, సాంఘిక భావాలే సాహిత్యంలోని ధోరణులను నిర్ణయిస్తాయి. నవలల్లో భావాల తీరు, నవల ఏ ధోరణికి చెందింది అనే దాన్ని నిర్ణయిస్తుంది.

ఇంతవరకు పరిశీలించిన నవల లక్షణాలు కథానిక లక్షణాలలాగే ఉన్నాయి కదా, కథానికకూ, నవలకూ, నవలిక (చిన్న నవల) కూ తేడా ఏమిటి అనే ప్రశ్న ఎదురవుతుంది. కథానిక, నవల, నవలిక వచన కల్పనా కథాసాహిత్యంలోవే. వాటిలోని సామాన్య లక్షణాలు ఇవే కావచ్చు. అయితే మరి తేడా ఎక్కడుంది ?

కొడవటిగంటి కుటుంబరావు చిన్నకథను అంటే కథానికను అంటారుకదా : "చిన్నకథలో ఒకే ఒక జీవిత ఘటన చిత్రించబడుతుంది. పాత్ర చిత్రణ ఉంటుంది కాని అంది కూడా ఒక్క ఘటనకే పరిమితమై ఉంటుంది. చిన్నకథను Snap shot ఫొటోతో పోల్చారు. అందులో జీవితం తాలూకు కదలికలు కనబడవు. పాత్ర లమనస్తత్వాలలో పరిణామాలుండవు. ఒకటి రెండు సన్నివేశాలు, పాత్రల మనస్సులలో కల్గే చైతన్యమూ ఉన్నప్పటికీ అవి, పైన చెప్పినట్టు, ప్రధాన ఘటనను ఆశ్రయించే ఉంటాయి. ఆ ఘటన యొక్క ప్రభావం పాత్రల చిత్తవృత్తిపై ఏ విధంగా ఉండేది చిత్రితమవుతుంది". (చిన్న నవల, కళాకేళి).

నవల విస్తృత పరిధి ఉన్న రచన అని తేలిపోయింది. ఆ విస్తృతి రెండు లక్షలపదాలు మొదలుకొని 60, 70 వేల పదాల వరకు ఉండవచ్చునంటారు. మరి నవలిక అంటే చిన్ననవల ఎట్లా ఉంటుంది?

"చిన్నకథను పెంచినా, నవలను కుంచించినా చిన్ననవల అవుతుందన్న భావం ఎవరికైనా ఉంటే అది సరి అయిన భావంకాదు. ఇలాంటి అపోహ కలగడానికి కొన్ని కారణాలు లేకపోలేదు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి) గారు "వడ్లగింజలు" కథను మొదట చిన్నకథగా రాసి తరువాత అదేకథను చిన్ననవల రూపంలో రచించారు. కానీ రెండింటి స్వభావమూ ఒకటికాదు. న్ననవలలోకి జమీందారీ సంస్కృతీ, ఆనాటి వాతావరణమూ, ఆచార వ్యవహారాలు చక్కగా దిగివచ్చాయి. వారి చిన్నకథ మనని తీసుకుపోలేని వాతావరణంలోకి చిన్ననవల తీసుకపోగలిగింది. ఇదే కథ పెద్దనవల అయి ఉండినా సాధ్యం కాదు. ఎందుచేతనంటే ఈ చిన్ననవలలో కూడా ప్రధాన ఘటన ఒకటే.

ఇదే నవలకూ, చిన్న నవలకూ ఉండే ముఖ్యమైన తేడా అని నా అభిప్రాయం. చిన్న నవలలో ప్రధాన సంఘటన ఒకటే ఉన్నప్పటికీ, ఆ సంఘటనకు కారణభూతులైన పాత్రల చిత్తవృత్తులకూ, వాటిచుట్టూ ఉండిన వాతావరణానికి తగినంత ప్రాముఖ్యం ఉంటుందనిపించినపుడు చిన్నకథ రాయటం కంటె చిన్న నవల రాయటం మంచిది" (కుటుంబరావు, చిన్ననవల, కళాకేళిపత్రిక).



BRAOU

అంటే కేవలం విస్తృతిపరిధి తేడాను నిర్ణయించదన్నమాట. మాసపత్రికలకు జోడించిన నవలలు అనబడే వాటిని, పుస్తకరూపంలో వచ్చిన ప్రసిద్ధుల రచనలనూ పోల్చి పరిశీలించినపుడు తేడాలు మరింత ప్రస్ఫుటంగా తెలుస్తాయి. అసలు నవల ప్రయోజనం ఏమిటి అనేది కూడా మనకు చదవగా చదవగా తెలియక పోదు. పరిశీలనగా చదవగా చదవగా పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు మన సంస్కారాన్నీ, సాహిత్య సంస్కారాన్నీ పెంచే మంచి నవలలు ఏవో పాఠకులకు తెలియకపోవు.

## చదవదగిన పుస్తకాలు


తెలుగు నవల, నూరు సంవత్సరాలు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్, 1973.

అభ్యుదయ, 1980, ఈ శతాబ్ది తెలుగు నవల, అరసం, హైదరాబాద్.

పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు, తెలుగు నవలా సాహిత్య వికాసం, రచయిత, ఖమ్మం, 1974.

మొదలి నాగభూసన శర్మ, తెలుగు నవలా వికాసం, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికిందరాబాద్, 1971.

ఆర్. ఎస్. సుదర్శనం, సమాజము - సాహిత్యము, చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, అక్టోబరు, 1972.

ఆర్. ఎస్. సుదర్శనం, సాహిత్యంలో దృక్పథాలు, నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 1968.

కోడూరి శ్రీరామమూర్తి, తెలుగు సాహిత్యంలో మనోవిశ్లేషణ, కిరణకిశోర్ పబ్లికేషన్స్, శ్రీమతి కోడూరి భారత శ్రీరామ, పోస్టాఫీస్ రోడ్, బొబ్బిలి, విజయనగరం జిల్లా, ప్రథమ ముద్రణ, సెప్టెంబరు, 1979.

కొడవటిగంటి కుటుంబరావు, సాహిత్య ప్రయోజనం (వ్యాసావళి), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ - 2, అక్టోబర్, 1969.

సి. ఆనందలక్ష్మి, తెలుగు నవలల్లో కుటుంబజీవన చిత్రణము రచయిత్రి, ఎస్. ఎం. సి. 4/5, మారేడ్ పల్లి, సికింద్రాబాద్ 6, 26 నవంబరు, 1979.

పి. సంజీవమ్మ, తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1985.

వరవరరావు, తెలంగాణా విమోచనోద్యమం, పీస్ బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్‌బజార్, హైదరాబాదు, మార్చి 1983.

| | |
|---|---|
| Marjorie Boulton | The Anatomy of the Novel. Routledge & Kegan Paul, London 1975. |
| Rolf Fox | The Novel and the People. Foreign Language Publishing House, Moscow 1956. |
| E.M. Forster | 'Aspects of the Novel' [edited by] Oliver Stallybrass. Penguin Books, Reprint 1977. |
| Zeraff | Fictions : The Novel and Social Reality. |
| | London 1976 [trans Jom and Catherine Burns] |
| Colin Wilson | The Craft of the Novel. London : Victor Gollanch Ltd. 1975. |
| Irving Houls | Politics and the Novel. New York 1957. |
| Henry James | The Future of the Novel. New York : Vintage Books 1957 [editor Leon Edel.] |


BRAOU

| | |
|---|---|
| Allan Swingewood | The Novel and Revolution. London : The Macmillan Press Ltd., |
| Fredrick Jameson | Marxism and Form. Prnceton, 1971. |
| Goldman | Towards a Sociology of the Novel. London 1975 [trans. Alan Sheridan] |
| Irving Howe | politics and the Novel. New York, 1957. |
| Braine, John | Writing a Novel. London : Eyre Methuen, 1974. |
| Pritchett, V.S. | The Living Novel. London, 1946. |
| Walk, Ian | The Rise of the Novel. London : Renguin Books, 1957. |
| Telugu Novel Vol. I | [editors] Adapa Ramakrishna Rao, Akkiraju Ramapati Rao, M. Sivarama Krishna, Iriventi Krishna Murty, Yuva Bharati, 5 Kingsway, Secundeabad–500 003, First ed. Feb. 1975. |
| Wellek, Rene and Warren, Austin | Theory of Literature. London Penguin Books 1949. |
| Robert Liddel | Some Principles of fiction – A treatise on Fiction |
| Percy Lubbak | The Craft of Fiction. |


BRAOU

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఎ./బి.ఎస్‌సి/బి.కాం. రెండవ సంవత్సరం

**తెలుగు కోర్సు 2 : వచనరచనా పరిచయం**

నమూనా అభ్యాసాలు

## అభ్యాసం – 1

సూచనలు :

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాల నుంచి యథాతథంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

---

## ప్రథమ విభాగం

(1) ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. "వేమన కవిత్వము – నీతులు" లోని కావ్యవచన శైలిని నిరూపించండి ?
2. 'బాలవాఙ్మయం' లేని లోటును తీర్చడానికి చింతా దీక్షితులు చెప్పిన పద్ధతులు వివరించండి ?

## ద్వితీయ విభాగం

(2) ఈ కింది ప్రశ్నకు 15 పంక్తుల్లో జవాబు రాయండి.

1. "కవలపిల్లల కథ" లోని కథన పద్ధతిని తెలపండి.

BRAOU

# ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ./బి.ఎస్సి/బి.కాం. రెండవ సంవత్సరం

**తెలుగు కోర్సు 2 : వచనరచనా పరిచయం**

నమూనా అభ్యాసాలు

## అభ్యాసం – 2

సూచనలు :

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాల నుంచి యథాతంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖినాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

---

## ప్రథమ విభాగం

(1) ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. జంగం శరభయ్య "నాటికీ నేటికీ మరిపికరు" లేకపోవడానికి కారణం తెలపండి ?
2. 'స్వయంకృతం' కథలో రచయిత స్త్రీ పురుష సంబంధాలను ఆవిష్కరించిన పద్ధతి తెలపండి ?

## ద్వితీయ విభాగం

(2) ఈ కింది ప్రశ్నకు 15 పంక్తుల్లో జవాబు రాయండి.

1. "ప్రెసిడెంటు గరటయ్య దూరాలోచన పరుడు" అనడానికి కారణాలు వివరించండి ?

# డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

బి.ఏ./బి.ఎస్‌సి/బి.కాం. రెండవ సంవత్సరం

**తెలుగు కోర్సు 2 : వచనరచనా పరిచయం**

నమూనా అభ్యాసాలు

## అభ్యాసం – 3

సూచనలు :

1. విద్యార్థులు పాఠ్యపుస్తకాల నుంచి యథాతథంగా జవాబులు రాయకూడదు.
2. స్వంత వాక్యాలలోనే జవాబులు రాయాలి.
3. ఉల్లేఖనాలు సవివరంగా సూచించాలి.
4. అభ్యాసం రాయడానికి అరఠావు కాగితాలు ఉపయోగించాలి.
5. తగినంత మార్జిన్ పరీక్షకుల సూచనల నిమిత్తం కేటాయించాలి.
6. ఈ అభ్యాసం పూర్తి చేయడానికి ఒక గంట ఉపయోగించుకోవాలి.
7. అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలి.

BRAOU

---

## ప్రథమ విభాగం

(1) ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

1. 'స్వయంవరణం' నవల వివాహ వ్యవస్థను గురించి ఏ దృక్పథాన్ని కలిగిస్తుందో రాయండి ?
2. 'కన్యాశుల్కం' నాటకంలో పాత్రల సంభాషణలద్వారా తెలియవచ్చే దురాచారాల్ని వివరించండి?

## ద్వితీయ విభాగం

(2) ఈ కింది ప్రశ్నకు 15 పంక్తుల్లో జవాబు రాయండి.

1. 'ఎవరు దొంగ' లో దొంగ పాత్రను గురించి రాయండి ?

# Andhra Pradesh Open University

FACULTY OF ARTS

B.A. SECOND YEAR (3 YEAR DEGREE COURSE) EXAMINATION

**Model Question Paper**

TELUGU LITERATURE

**COURSE – 2**

(Vachana Rachana Parichayam)

Time : 3 Hours

Max . Marks : 100
Mini. Marks : 35

## ప్రథమ విభాగం

కింది ఎనిమిదింటిలో ఏవేని నాలుగు ప్రశ్నలకు సుమారు 30 పంక్తుల్లో జవాబులు రాయండి.

ప్రతి ప్రశ్నకు 15 మార్కులు. 15 x 4 = 60

1. 'విఘ్నంటువు పూజ' లో కనిపించే మౌఖిక సంప్రదాయ వచన లక్షణాలు వివరించండి ?
2. నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల కవిత్వాల తారతమ్యాన్ని 'అధ్యక్షోపన్యాసము' ఆధారంగా నిరూపించండి ?
3. 'రిపోర్టి' ని సోదాహరణంగా చర్చించండి ?
4. "వదలవలసిన తెలుగుతనం" ఏదో తెలపండి ?
5. "ఇలాంటి తవ్వాయివస్తే" లో కనిపించే మతపరిస్థితులు తెలపండి ?
6. "పెళ్లానికి ప్రేమలేఖ" కథలో రచయిత్రి పాఠకుల దృష్టికి తీసుకురాదల్చుకున్న అంశాలు వివరించండి?
7. "ఎవరు దొంగ" ద్వారా ఆత్రేయ నిరూపించదల్చుకున్న సామాజికాంశాలు ఏమిటి ?
8. 'స్వయంవరణం' లో పాత్ర చిత్రణ గురించి తెలపండి ?

BRAOU

## ద్వితీయ విభాగం

కింది పదింటిలో ఏవేని 5 ప్రశ్నలకు సుమారు 10 పంక్తుల్లో జవాబులు రాయండి.

ప్రతి ప్రశ్నకు 8 మార్కులు. 8 x 5 = 40

1. "అతి సంపాదనము హానికరము" - ఎలాగో నిరూపించండి ?
2. 'స్త్రీ విద్య' ద్వారా రచయిత సమాజానికి బోధించదల్చుకున్న అంశాలేవి ?
3. 'భూతవైద్యము' లోని అధిక్షేపలక్షణాలు చర్చించండి ?
4. పిల్లల పాటల్లో ఎన్నిరకాలున్నాయో వివరించండి ?
5. 'భయం' కథలోని ప్రతీకాత్మకతను చర్చించండి ?
6. "ఎందుకు పారేస్తాను నాన్నా" కథకు పెట్టిన పేరు ఎంతవరకు నప్పిందో వివరించండి ?
7. "ఓ పువ్వు పూసింది" రచనా శిల్పాన్ని తెలపండి ?
8. "కోర్టు యెక్కటం కంటె కొండెక్కుత యెక్కటం మేలు" అన్న సామెతలోని సత్యాన్ని మీ పాఠ్యాంశం ద్వారా చర్చించండి.?
9. 'కన్యాశుల్కం' రచనాకాలంలో ఉన్న అంధ విశ్వాసాలు చర్చించండి ?
10. 'స్వయంవరం' నవల ప్రతిపాదించే జీవిత ప్రకృతం ఏమిటి ?

BRAOU

BRAOU

BRAOU